ప్రవక్తా!
నీవు ప్రజలకు ఇలా చెప్పు :
‘‘మీకు నిజంగానే అల్లాహ్
పట్ల ప్రేమ ఉంటే నన్ను అనుసరించండి.
అప్పుడు అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు
(దివ్యఖుర్ఆన్ 3 : 31)

సర్వశక్తిమంతుడైన ఓ అల్లాహ్,
సృష్టికర్త, యజమాని, పోషకుడు,
నా ఆచరణలన్నీ గమనిస్తున్నవాడు,
నేను నా ఈ చిరుప్రయత్నాన్ని స్వీకరించాలని
నిన్ను ప్రార్థిస్తున్నాను, వేడుకుంటున్నాను, అర్థిస్తున్నాను.
ఈ పుస్తకం చదివే పాఠకుల మార్గదర్శనానికి సహకరించు
తీర్పుదినాన నాకు క్షమాభిక్ష ప్రసాదించు
అక్కడ నీ కారుణ్యం, నీ అనుగ్రహాలు తప్ప మరేవీ
ఉపయోగపడవు.

ఆమీన్!

# ప్రవక్త ముహమ్మద్ అందరికోసం

సల్లల్లాహు అలైహి వ సల్లమ్

## ఆదర్శ జీవితం ఆచరణాత్మక బోధనలు

సయ్యద్ హామిద్ ముహ్సిన్

SALAAM Centre

Our Objective is to promote Peace and Brotherhood

www.muhammadforall.in www.salaamcentre.in

Pravakta Muhammad (Telugu)
FOLLOW ME, God Will Love You (English)
Copyright © 2014 SYED HAMID MOHSIN.

ISBN: 978-81-928089-1-1

All rights reserved. No part of this book may be reproduced or transmitted in any form or by any means, electronic, mechanical, including photocopy, recording, or any information storage and retrieval system, without permission in writing from the author, except for the situation below which is permitted.

For Reprinting

Reprinting or reproducing this book on the condition that absolutely no change, addition, or omission is introduced is permitted free of charge. To make high quality reprints, you may contact the author / Salaam Centre to obtain free copies of the soft copy or printing files of this book.

The Web Site of This Book :

This e-book is available on the Web, World Wide at:

www.MuhammadForAll.in - www.salaamcentre.in

Price: 300/-

Printed and Published by :
SALAAM CENTRE
# 65, Ist main, S.R.K. Garden, Jayanagar, Bangalore – 560041
Branch: #5, Rich homes, Rochmond road, Bangalore - 560025
Contact: +91 99011 29956 / +91 99451 77477 / 080 - 2663 9007

E mail: salaamcentrebangalore@gmail.com

# విషయసూచిక


| | | |
|---|---|---|
| ✯ | రచయిత పలుకులు | |
| ✯ | కృతజ్ఞతలు | |
| ✯ | ముందుమాట | |
| ✯ | ప్రవక్త కాలంలో అరేబియా ద్వీపకల్పం | |
| ✯ | ప్రవక్త పేరు, అనుచరులు పేర్లు పలుకుతున్నప్పుడు పాటించవలసిన మర్యాదలు | |
| ✯ | ప్రవక్త అనుచరుల పేర్లు ఉచ్చరించినప్పుడు రజీ అల్లాహు అన్హ్ అంటూ పలకడం | |
| 1. | కాబా, దైవగృహం | 1 |
| ✯ | జననం | 2 |
| ✯ | ప్రకృతి ఒడిలో పాఠశాల | 4 |
| 2. | ప్రవక్త పదవి సూచనలు | 9 |
| ✯ | నిశితమైన బుద్ధి వివేకాలు | 15 |
| ✯ | దివ్యఖుర్ఆన్ మొదటి అవతరణ | 19 |
| 3. | సందేశం | 21 |
| 4. | అణిచివేతలూ దౌర్జన్యాలు | 27 |
| ✯ | ఖురైషుల చర్యలు | 31 |
| ✯ | మీడియా వక్రప్రచారాలు | 33 |
| ✯ | దేవుడు తాను తలచుకున్నవారికి మార్గం చూపిస్తాడు. | 35 |
| 5. | సామాజిక, మానసిక విప్లవం | 37 |
| ✯ | ఇన్షాఅల్లాహ్ ... దేవుడు తలిస్తే | 39 |
| 6. | వలస | 43 |

| | | |
|---|---|---|
| ✯ | మేరీ మాత పుత్రుడు ఏసుక్రీస్తు | 46 |
| ✯ | సత్యరాప్రమాదాలు | 47 |
| ✯ | ధైర్యసాహసాలు ... హజ్రత్ హంజా | 48 |
| ✯ | ఉమర్ | 49 |
| ✯ | మానసిక విప్లవం | 52 |
| 7. | నిషేధం | 55 |
| ✯ | ఖదీజా ... ఆదర్శ ధర్మపత్ని | 58 |
| 8. | వలస | 67 |
| ✯ | అబూబక్ర్ | 68 |
| ✯ | హిజ్రా .. విశ్వాసానికి పరీక్ష | 70 |
| 9. | మదీనా | 73 |
| ✯ | అస్సలాము అలైకుమ్ ... దేవుని శాంతి మీపై వర్షించుగాక | 74 |
| ✯ | అజాన్ ... ప్రార్ధనకు పిలుపు | 79 |
| ✯ | జిహాద్ ... ప్రతిఘటన | 83 |
| 10. | మొదటి యుద్ధం .. బద్ర్ | 89 |
| ✯ | ప్రజాస్వామిక విలువలు | 91 |
| ✯ | మదీనాలో ఆనంద విషాదాలు | 98 |
| ✯ | హృదయంలో... | 99 |
| 11. | మృదువైఖరి, ప్రేమాభిమానాలు | 101 |
| 12. | ఉహుద్ | 111 |
| ✯ | నమ్రత | 117 |
| 14. | కందకం, మోసం, దగా | 125 |
| ✯ | వినూత్న యుద్ధవ్యూహం | 126 |
| ✯ | సాటిలేని సైన్యాధ్యక్షుడు | 129 |
| ✯ | యుద్ధచాతుర్యం | 133 |
| ✯ | ముస్లిముల దయాగుణం | 135 |
| ✯ | భావప్రకటనా స్వేచ్ఛ | 136 |
| ✯ | మానవసేవ | 139 |
| ✯ | కృతజ్ఞత | 142 |
| 14. | హుదైబియా ... శాంతితో యుద్ధాలు గెలవవచ్చు | 145 |

| | | |
|---|---|---|
| ✯ | రమజాన్ ఒక కల | 145 |
| ✯ | ఇద్దరు శత్రువుల మధ్య మదీనా | 151 |
| ✯ | ఇస్లామ్‌కు తలుపులు తెరుచుకున్నాయి | 158 |
| ✯ | గొప్ప పాఠం | 159 |
| ✯ | సరిహద్దులు దాటి వివిధ పాలకులకు | 160 |
| 15. | ప్రవక్త ముహమ్మద్ ... ముస్లిమేతరులతో | 163 |
| ✯ | మక్కాలో ముస్లిమేతరులతో సంబంధాలు | 163 |
| ✯ | మదీనా ముస్లిమేతరులతో సంబంధాలు | 171 |
| ✯ | అపరాధం | 175 |
| ✯ | సహనం | 176 |
| ✯ | మతసహనం | 177 |
| ✯ | ధర్మంలో నిర్బంధం లేదు. | 178 |
| ✯ | ధార్మిక వైవిధ్యం | 180 |
| 16. | ఖైబర్ | 183 |
| ✯ | ఒప్పందరా విషప్రయోగం | 184 |
| ✯ | దయార్ద్ర హృదయం | 186 |
| 17. | ఉమ్రా ... కాబాయాత్ర | 191 |
| ✯ | అంతరాత్మ | 192 |
| ✯ | విషాదం | 194 |
| 18. | మహోన్నత విజయం | 199 |
| ✯ | హృదయాల పరివర్తన | 207 |
| ✯ | దేవుడా నేను అమాయకుడిని | 209 |
| ✯ | ఆదర్శ సంస్కర్త | 211 |
| ✯ | దేవుడు సౌందర్యవంతుడు ఆయన సౌందర్యాన్ని ఇష్టపడతాడు. | 214 |
| 19. | హునైన్ | 215 |
| ✯ | భవిష్యవాణులు | 220 |
| ✯ | ప్రవక్త ప్రచనాలు | 223 |
| 20. | మదీనా పట్ల ప్రవక్త ప్రేమ | 227 |
| ✯ | మానవహక్కులు | 233 |
| ✯ | దివ్యఖుర్‌ఆన్‌లో మానవఔన్నత్యం | 234 |

| | | |
|---|---|---|
| ✯ | మానవసమానత్వం | 235 |
| ✯ | హజ్ యాత్ర ఒక సజీవ ఉదాహరణ | 235 |
| ✯ | జాతితత్వం | 235 |
| ✯ | యువకులకు ప్రోత్సాహం | 236 |
| ✯ | ప్రవక్త ముహమ్మద్ బహువివాహాలు | 241 |
| ✯ | వివాహాలకు కారణాలు | 254 |
| 22. | మదీనా ఒక ఆదర్శ నగరం | 261 |
| ✯ | అందరికీ న్యాయం | 277 |
| ✯ | రాజైనా పేదైనా ఒక్కటే | 279 |
| ✯ | పుత్రవియోగం | 281 |
| 23. | వీడ్కోలు యాత్ర | 283 |
| 24. | స్వర్గంలో గొప్ప కలయిక | 287 |
| ✯ | వీడ్కోలు | 290 |
| ✯ | విషాదం | 292 |
| 25. | దైవప్రవక్త ఒక గొప్ప ఆదర్శం | 295 |
| ✯ | అనేక దీపాలను వెలిగించిన దీపం | 298 |
| ✯ | దైవ ప్రవక్త గురించి ఎవరేమన్నారు? | 301 |
| ✯ | Bibliographic References | 305 |

# రచయిత పలుకులు

అల్హందులిల్లాహ్ (సర్వస్తోత్రాలు అల్లాహ్‌కే). దేవుడు తన ప్రియప్రవక్త ముహమ్మద్ (ఆయనకు శాంతి కలుగుగాక) జీవితచరిత్రను సంకలనం చేసే గొప్ప అవకాశాన్ని నాకు కలుగజేశాడు. ఇది నాకు లభించిన మహా సౌభాగ్యం.

ఇంగ్లీషులో అచ్చయిన ఫాలోమీ గాడ్ విల్ లవ్ యు  పుస్తకం ఇంగ్లీషు హిందీ భాషల్లో 2012 లో అచ్చయ్యింది. ఇప్పటి వరకు రెండు ఎడిషన్లు ప్రతి ఎడిషన్ 50,000 కాపీలు ప్రింట్ అయ్యి ముస్లిమ్ ముస్లిమేతర సోదర సోదరీమణుల వద్దకు చేరుకోవడం నాకు ఎంతో ఆనందంగా ఉంది. ఇది కేవలం ఆ దేవుడి కృపవల్లనే సాధ్యమైందని భావిస్తున్నాను. ఆ దేవుడినే నేనెల్లప్పుడు క్షమాభిక్ష కొరకు అర్థిస్తున్నాను. పరలోక సాఫల్యం కొరకు వేడుకుంటున్నాను. ఈ పుస్తక రచన వెనుక ఉన్న ఒకే ఒక్క ఉద్దేశ్యం కూడా అదే.

ఈ పుస్తకంలో నేను కొన్ని కొత్త అధ్యాయాలు కూడా అదనంగా చేర్చడం జరిగింది. ఈ పుస్తకాన్ని ముస్లిమ్ ముస్లిమేతర సోదరసోదరీమణులు ప్రోత్సహిస్తారని ఆశిస్తున్నాను.

నా ఈ చిరు ప్రయత్నాన్ని స్వీకరించాలని నేను సృష్టికర్త, పోషకుడు, యజమాని, ప్రభువు అయిన అల్లాహ్‌ను వేడుకుంటున్నాను. నా దగ్గరున్నదంతా దైవమార్గాన ఖర్చు చేసేలా నాకు మార్గదర్శనం, సహాయం అందించాలని ఆయన్ను వేడుకుంటున్నాను. నా అసంఖ్యాక పొరబాట్లను మన్నించాలని, తన కారుణ్యంతో నన్ను అనుగ్రహించాలని, నాకు క్షమాభిక్ష ప్రసాదించాలని అర్థిస్తున్నాను....ఆమీన్

బెంగుళూరు　　　　　　సయ్యద్ హామిద్ ముహ్సిన్

12-12-2012

# కృతజ్ఞతలు

ఈ పుస్తకం చాలా మంది పాఠకులను దృష్టిలో పెట్టుకుని రాసిన పుస్తకం. ముస్లిములు ముస్లిమేతరులను దృష్టిలో పెట్టుకుని రాసిన పుస్తకం. ప్రజల అవగాహన కోసం ప్రవక్త ముహమ్మద్ జీవితంలోని వివిధ అంశాలను, సమకాలీన ప్రపంచంలో సమాజ ప్రగతి సాఫల్యాలకు ఉపయోగపడే విషయాలను ఇందులో ప్రస్తావించడం జరిగింది. దీన్ని ఒక జీవితచరిత్రలా కాకుండా, చరిత్రను ఒక ముఖ్యమైన మలుపు తిప్పిన మనిషి జీవితం నుంచి మార్గదర్శనాన్ని పొందే దృష్టితో ఈ పుస్తకాన్ని చదవాలని కోరుతున్నాను.

ప్రవక్త జీవితంపై ఒక కొత్త పుస్తకం రాసే ప్రయత్నం కాదిది. ప్రవక్త ముహమ్మద్ జీవితంపై, ఉద్యమంపై నా అవగాహనను తెలియజేసే ప్రయత్నము కూడా కాదు. "ఖుర్‌ఆన్ అందరికోసం" కార్యక్రమం సందర్భంగా ఈ ఆలోచన నాకు వచ్చింది. ప్రవక్త జీవితం గురించి వివిధ కోణాల్లో సాధారణ ప్రజలకు అర్థమయ్యేలా సరళమైన భాషలో వివరాలను అందించాలని అనుకున్నాను.

ఇంతకన్నా ముందు 2008లో నేను "ఖుర్‌ఆన్ అందరికోసం" ప్రాజెక్టును రూపొందించాను. ఆ ప్రాజెక్టు అమలు చేయాలన్న ఆలోచన నన్ను చాలా కాలం కూర్చోనివ్వలేదు. నా భార్య షబానా, కుమార్తె సోఫియాలు నన్ను పూర్తిగా ప్రోత్సహించి ఈ ప్రాజెక్టును ముందుకు నడిపేలా చేశారు. ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు. వారిద్దరు నాకు కొండంత అండగా పక్కన నిలబడ్డారు. ప్రాజెక్టు జయప్రదంగా ముగిసేలా చేశారు. వారికి దైవం తగిన ప్రతిఫలం ప్రసాదించాలని మనసారా కోరుతున్నాను. "ఖుర్‌ఆన్ అందరికోసం" అన్న ప్రాజెక్టు దివ్యఖుర్‌ఆన్‌ను అందరికీ పరిచయం చేయడానికి ఉద్దేశించిన ప్రాజెక్టు.

దైవిక సందేశాన్ని తోటి దేశవాసులకు తెలియజేయడం కన్నా ఆనందకరమైన పని మరొకటి ఉండదు. భారతదేశంలో ప్రాచీన కాలం నుంచి ఆదర్శనీయమైన మతసామరస్యానికి పెట్టింది పేరు. భారత సమాజంలో ఈ మతసామరస్యం ఎంతో విలువైన సంపద. దివ్యఖుర్‌ఆన్ సందేశాన్ని పరిచయం చేయడానికి మేము ఏర్పాటు చేసిన వివిధ సమావేశాల్లో, గౌరవనీయులైన న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసు అధికారులు, విద్యావేత్తలు,

మేధావులు, విద్యార్థులతో మేము నిర్వహించిన సమావేశాల్లో ఈ అద్భుతమైన మతసహనం మరోసారి తొణికిసలాడింది. హాజరైనవారు వ్యక్తిగతంగా నా పట్ల చూపించిన అభిమానం, నా ప్రయత్నాలకు ఇచ్చిన ప్రోత్సాహాలు మన దేశంలో ప్రజలు ధార్మిక భావాలకు, పవిత్రభావాలకు ఎంత విలువ ఇస్తారో మరోసారి తెలియజేశాయి. అల్లాహ్ కూడా ఇదేవిధంగా తీర్పుదినాన నన్ను ఆదరించి నాకు సాఫల్యం ప్రసాదించాలని నేను ఆశిస్తున్నాను.

నన్ను ఎంతో ప్రోత్సహించిన ఉలమాలు (ధర్మవేత్తలకు) నా కృతజ్ఞతలు. ముఖ్యంగా బెంగుళూరు జామా మస్జిదు మాజీ ఇమామ్ కీ.శే మౌలానా రియాజుర్రహ్మాన్ రషాదీకి ప్రత్యేక ధన్యవాదాలు.

ప్రాథమిక రాతప్రతులను మంగుళూరు, గోవా విశ్వవిద్యాలయాల మాజీ వైస్ చాన్సలర్, డా. బి.షేక్ అలీ, ఆల్ ఇండియా ముస్లిమ్ పర్సనల్ లా బోర్డు అధ్యక్షుడు, నద్వతుల్ ఉలమా గౌరవ రెక్టర్, ఆలమి రాబిత అదబె ఇస్లామీ (రియాద్) ఉపాధ్యక్షుడు మౌలానా సయ్యద్ ముహమ్మద్ రాబీ హసనీ నద్వీ, జామియా మిల్లియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ ముహమ్మద్ రఫత్ వంటి ప్రముఖులు పరిశీలించి తగు సలహాలు ఇచ్చారు. వారి సలహాలు నాకెంతో ఉపయోగపడ్డాయి. ఈ పుస్తకం పూర్తి చేయడానికి వారి నుంచి లభించిన సహకారానికి నా కృతజ్ఞతలు, వారికి దైవం తగు ప్రతిఫలం ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను... ఆమీన్

ఈ పుస్తకం కంపోజింగ్‌లో శ్రమకోర్చి పనిచేసిన నూమాన్‌ఖాన్‌కు కృతజ్ఞతలు. నూమాన్‌ఖాన్‌కు సహకరించిన సాదియా, ప్రభలకు నా ధన్యవాదాలు. కర్నాటక ముస్లిమ్స్ డాట్ కామ్ ఎడిటర్ సయ్యద్ తన్వీర్ అహ్మద్‌కు నేను రుణపడి ఉన్నాను. ఆయన ఎల్లప్పుడు నాకు తోడు ఉండి సహకరించారు.

ఉలమాలు, మేధావులు, నేను ఈ ప్రవక్త జీవిత చరిత్ర రచనలో రిఫరెన్సుకు ఉపయోగించిన పుస్తక రచయితలు అందరికీ నా ధన్యవాదాలు. ఈ పుస్తకంలో పూర్తి జీవితచరిత్రను పొందుపరచడం జరిగింది. ఈ పుస్తక రచన ద్వారా ఎలాంటి ఆర్థికప్రయోజనాలు ఆశించడం జరగలేదు. ప్రవక్త ముహమ్మద్ (ఆయనకు శాంతి కలుగుగాక) జీవితంలోని వివిధ కోణాలను పరిచయం చేయడానికి, సాఫల్యమార్గం గ్రహించేలా తోడ్పడడానికి మాత్రమే ఉద్దేశించింది ఈ రచన.

నేను నా కుటుంబ సభ్యులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. నా సోదరసోదరీమణులు, అందరికీ నా కృతజ్ఞతలు. ఈ సందర్భంగా మా అమ్మకు

ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. ఉత్సాహంగా ఈ పని పూర్తి చేసే ప్రోత్సాహం ఆమె నుంచి ఎల్లప్పుడు నాకు లభించింది. ఆమె పెంపకం వల్లనే మేము ఈ రోజు ఈ స్థాయికి చేరుకున్నాము. ఈ ముఖ్యమైన పని కొనసాగించగలుగుతున్నాము. 1970లో మా నాన్నగారు అమరులైన తర్వాత మేము ఇస్లామ్‌ను ప్రజలకు పరిచయం చేయాలన్న ఆమె తపన వల్లనే నేడు ఈ పని చేయలిగే స్థాయికి చేరుకోగలిగాము. ఈ ప్రపంచంలో ఆమె సంతోషమే నాకు అత్యంత ముఖ్యమైనది. ప్రవక్త ముహమ్మద్ జీవితచరిత్ర రచన పని ఎంతవరకు సాగుతున్నది ఆమె ఎంతో ఆసక్తితో వినేవారు. చివరిగా నేను అల్లాహ్‌కు ధన్యవాదాలు తెలుసుకుంటున్నాను. ఈ పని చేసే శక్తిసామర్థ్యాలు ఆయనే నాకు ప్రసాదించాడు.

బెంగుళూరు — సయ్యద్ హామిద్ ముహ్సిన్

జనవరి 2012

# ముందుమాట

దివ్యఖుర్ఆన్‌లో ప్రవక్తల పరంపర అనేది ఒక ముఖ్యమైన విషయం. ప్రవక్తల పరంపర ద్వారా దేవుడు మానవాళి పొరబాట్లు, తప్పులు చేయకుండా మార్గదర్శనం అందిస్తూ వచ్చాడు. మంచి న్యాయం చేసేలా అవసరమైన దారి చూపిస్తూ వచ్చాడు. ప్రవక్తలు మానవుల్లో ఉన్న ప్రగతివికాసాల శక్తిసామర్థ్యాల శుభవార్తను తీసుకురావడమే కాదు, మనుష్యులు అజ్ఞానాంధకారంలో మునిగిపోగలరన్న హెచ్చరిక కూడా చేశారు. ప్రవక్తల ముఖ్యమైన పని మానవాళిని భౌతికంగాను, నైతికంగాను అభివృద్ధిపథాన నడపడం. మనిషిలో మంచి విలువలు, ఉన్నత ప్రమాణాలు పెంపొందించడం. మనుష్యుల్లో అత్యున్నత ప్రమాణాలు ప్రోత్సహించడం. ఆ విధంగా ప్రవక్తల పరంపర అనేది కేవలం దేవుడు మానవాళితో మాట్లాడే పద్ధతి మాత్రమే కాదు, ఇది మానవాళి పట్ల ఆయన కారుణ్యానికి, దయాస్వభావానికి చిహ్నం కూడాను.

దివ్యఖుర్ఆన్ ప్రవక్తల పరంపర విశ్వజనీనమైనదని ప్రకటించింది. మేము ప్రతి జాతి వద్దకు దైవప్రవక్తను పంపించామని (16:36) దేవుడు తెలియజేశాడు. ప్రవక్తలందరూ సమానులే. "మేము వారి మధ్య ఎలాంటి విచక్షణ పాటించము." (దివ్యఖుర్ఆన్ 3:34). "కొందరు ప్రవక్తలను మిగిలిన వారికన్నా మేరుగ్గా పంపించాము." (దివ్యఖుర్ఆన్ 2:253). ముస్లిములు ప్రతి ఒక్క దైవికావతరణను విశ్వసించవలసి ఉంది. ప్రవక్తలు కేవలం దైవసందేశం తీసుకువచ్చేవారు మాత్రమే కాదు. వారు తమ జీవిత ఉదాహరణ ద్వారా ఆచరణాత్మక జీవితంలోదైవాదేశాలను ఎలా అమలు చేయాలో చూపించారు. అందువల్లనే వారు కూడా మానవమాత్రులే (దివ్యఖుర్ఆన్ 14:11) "వారు అదే జాతి నుంచి వచ్చారు. వారు జాతి కష్టాలను అర్థం చేసుకుంటారు. జాతి సమస్యల పట్ల ఆలోచిస్తారు. అందరి విశ్వాసాన్ని పొందుతారు." (దివ్యఖుర్ఆన్ 9:128-129). వారి స్వచ్ఛమైన నడవడి, ప్రత్యేక వ్యక్తిత్వం వల్ల వారిని ఎన్నుకోవడం జరిగింది. వారికి జ్ఞానసంపన్నులు, వివేకవంతులు. "దేవుడి చిహ్నాలను చదువుతారు" (దివ్యఖుర్ఆన్ 3:164). తమ జాతికి తెలియజేస్తారు.

వారు మార్గదర్శులుగా, నాయకులుగా మారుతారు. దైవాదేశాలను స్వీకరించి యథాతథంగా, నిర్భయంగా, దృఢసంకల్పంతో, సహనంతో తమ ప్రజలకు అందిస్తారు.

ప్రవక్తల పరంపరతో పాటు ఇస్లామీయ ఏకదైవారాధన అనేది ఈ పవిత్ర చరిత్రలో కొనసాగుతూ వస్తోంది. ప్రారంభం నుంచి ఒకే ఒక్క దేవుడు అల్లాహ్ మానవాళి కొరకు దైవప్రవక్తలను పంపిస్తూ వచ్చాడు. వారికి తన సందేశం ఇచ్చి పంపాడు. ఆ సందేశం దేవుని గుర్తుచేసేది, ఆయన ఆదేశాలను, ఆయన ప్రేమను, ఆయన గురించి ఆశావాదాన్ని తెలియజేసేది.

ప్రవక్తల పరంపరలో ఆదమ్ మొదటి ప్రవక్త, ముహమ్మద్ ప్రవక్త చివరి ప్రవక్త. ఈ మధ్యలో దివ్యఖుర్ఆన్ 23 మంది ప్రవక్తల పేర్లు ప్రస్తావించింది. ఇందులో చాలా పేర్లు బైబిల్ లోను కనబడతాయి.

| | | |
|---|---|---|
| • ఇద్రీస్ | ఇనాక్ | (దివ్యఖుర్ఆన్ 19:56-57, 21:85-86, |
| • నూహ్ | నోవా | (6:84) |
| • హూద్ | | (11:50-60) |
| • సాలెహ్ | | (11:61-66) |
| • ఇబ్రాహీమ్ | అబ్రహం | (6:83, 11:69-76) |
| • ఇస్మాయీల్ | ఇష్మయిల్ | (6:84, 19:54-55) |
| • ఇషాక్ | ఇసాక్ | (11:70-74) |
| • లూత్ | లోత్ | (7:80-84) |
| • యాకూబ్ | జాకబ్ | ((11:71) |
| • యూసుఫ్ | జోసెఫ్ | (6:84, అధ్యాయం12) |
| • షుఐబ్ | | (7:85, 11:84) |
| • అయ్యూబ్ జాబ్ | | (6:84) |
| • మూసా | మోసెస్ | (6:84, 20:9-99) |

| | | |
|---|---|---|
| • హారూన్ | ఆరాన్ | (6:84, 20:90) |
| • జుల్ కిఫ్ల్ | ఐజ్‌కిల్ | (21:85-86, 38:48) |
| • దావూద్ | డేవిడ్ | (6:84) |
| • సులైమాన్ | సోలమన్ | (6:84) |
| • ఇలియాస్ | ఏలియస్ | (6:85) |
| • అల్ యాసా | ఎలిషా | (6:86) |
| • యూనుస్ | జోనా | (6:86) |
| • జకరియా | జకరియా | (6:85) |
| • యాహ్యా | జాన్ | (6:85) |
| • ఈసా | జీసస్ | (3:45-48, 43:57-59, 19:88-98, 5:116-17, 19:16-36, 5:46-7, 5:72-5, 43:63-5) |

ఈ ప్రవక్తలందరూ ఒకే సమూహం. వారందరూ ఏకదైవారాధన సందేశమే తెలిపారు. న్యాయం, సమానత్వాలను పాటించాలని చెప్పారు (దివ్యఖుర్ఆన్ 42:13)

ఆ సర్వశక్తిమంతుడైన దేవుడు ఎల్లప్పుడు మనల్ని కనిపెట్టుకుని ఉన్నాడు. మన ప్రారంభం నుంచి అంతం వరకు మనతోనే ఉంటాడు. ఇదే తౌహీద్ (ఏకదైవారాధక విశ్వాసం) అర్థం. దివ్యఖుర్ఆన్ మానవాళి గమ్యం గురించి ప్రతి వ్యక్తి గురించి తెలియజేసేది ఇదే.

"మనం దేవుడికి చెందినవారం. ఆయన వద్దకే మరలిపోవలసి ఉంది" (దివ్యఖుర్ఆన్ 2:156)

ప్రవక్త ముహమ్మద్ (ఆయనకు శాంతికలుగుగాక)ను ప్రవక్తలక పరంపరలో చిట్టచివరి ప్రవక్తగా దేవుడు ఎన్నుకున్నాడు. దివ్యఖుర్ఆన్ చిట్టచివరి దైవసందేశంగా అవతరించింది. దేవుడు తనకు, మానవాళికి మధ్య ఒక శాశ్వతమైన సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసాడు. ఎల్లప్పుడు వెలుగు ప్రసాదించే జ్యోతిని ప్రసాదించాడు.

దైవిక సందేశమంటే ఏమిటి? దివ్యఖుర్ఆన్ ఈ ప్రశ్నకు సమాధానమిస్తుంది. అధ్యాయం 42, వాక్యాలు 51-52లో ఇలా పేర్కొంది : "అల్లాహ్‌తో ముఖాముఖీ మాట్లాడే స్థానం మానవుడిది కాదు. ఆయన మాట్లాడడం అనేది వహీ (సంకేతం) ద్వారానైనా జరుగుతుంది. లేదా తెర వెనుక నుండి అయినా జరుగుతుంది. లేదా ఆయన సందేశహరుణ్ణి (దైవదూత) ఎవరినైనా పంపుతాడు. అతను ఆయన అజ్ఞానుసారం ఆయన కోరిన దానిని వహీ చేస్తాడు. ఆయన ఉన్నతుడూ, వివేకవంతుడూనూ. ఇదేవిధంగా ప్రవక్తా! మేము మా ఆజ్ఞ ద్వారా ఒక ఆత్మను నీ వైపునకు వహీ చేశాము. గ్రంథం అంటే ఏమిటో, విశ్వాసం అంటే ఏమిటో నీవు అసలు ఎరుగవు. కాని మేము ఆ ఆత్మను ఒక జ్యోతిగా చేసి దాని ద్వారా మా దాసులలో మేము కోరిన వారికి మార్గం చూపుతాము." అని దివ్యఖుర్ఆన్ ప్రకటించింది. ఈ మాటలకు అర్థమేమిటంటే దేవుడు ప్రత్యక్షంగా ప్రవక్తతో మాట్లాడడం జరగదు. ఈ సమాచారం, లేదా దైవిక అవతరణ దైవదూత ద్వారా వస్తుంది. ఇంకా నిర్దిష్టంగా చెప్పాలంటే దైవదూత జిబ్రయీల్ ద్వారా వస్తుంది. ఆయన దేవుని సందేశాన్ని తీసుకుని వస్తారు.

ప్రవక్త ముహమ్మద్ ఈవిధంగా చిట్టచివరి దైవగ్రంథాన్ని అందుకున్నారు. అదే దివ్యఖుర్ఆన్. ఈ గ్రంథం ప్రవక్త ముహమ్మద్ ప్రత్యేక స్థానాన్ని పలుసార్లు ప్రకటించింది. ఆయన ఒక దైవప్రవక్త, సందేశహరుడు, ఒక ఆదర్శం, ఒక మార్గదర్శి. ఆయన దైవాదేశాల కాంతిలో ప్రపంచాన్ని మార్చారు. ఆయన దేవుని ద్వారా అందుకున్న ప్రేరణతో ఇది సాధించారు. ఆయన్ను ఎన్నుకుని ఆయనకు ప్రేరణ ఇచ్చింది ఆ దేవుడే. ఆయన్ను చివరకు ఆయన జాతి ప్రజలు ఒప్పుకున్నారు. ఆ విధంగా ఆయన ఒక ఉదాహరణగా, ఒక మార్గదర్శిగా యావత్తు మానవాళికి ఉపయోగపడుతున్నారు. నేడు ముస్లిముల జీవితంలో, గతకాలాల్లో మాదిరిగానే నేడు కూడా ఆయనకు ఒక ప్రత్యేకమైన, విశిష్టమైన స్థానం ఉంది.

ప్రవక్త ముహమ్మద్ దేవునికి మనుష్యులకు మధ్యవర్తిగా ముస్లిములు భావించరు. ప్రతి వ్యక్తి ప్రత్యక్షంగా దేవునికి మొరపెట్టుకోవలసిందే. ప్రవక్త తన సముదాయం కోసం దేవుని ప్రార్థించారు కొన్ని సందర్భాల్లో , కాని ఆయన ప్రతి వ్యక్తి తానే స్వయంగా దేవునితో సంబంధం పెంచుకోవాలని అది మనిషి బాధ్యత అని బోధించారు. ప్రవక్త ముహమ్మద్ దేవుని ఉనికి గురించి మనకు గుర్తు చేశారు. ఆ ఒకే ఒక్క దేవుడిని, ఎవరికి జన్మించని వాడు, ఎలాంటి సంతానమూ లేనివాడయిన ఒకే ఒక్క దేవుడిని మాత్రమే ఆరాధించడం ద్వారా ఆధ్యాత్మిక, నైతిక ప్రగతివికాసాలు సాధించేలా ఆయన మార్గం చూపించారు.

ఆయన జీవితకాలంలో మహత్యాలు చూపించాలని, ప్రత్యక్షంగా కనబడే ఆధారాలు

చూపించాలని అడిగినవారికి దివ్యఖుర్‌ఆన్ ఇలా జవాబు చెప్పాలని పేర్కొంది.

"నేను మీలాగే మానవమాత్రుడిని. మీ దేవుడు ఒకే ఒక్కడన్న దైవిక అవతరణ నా దగ్గరకు వచ్చింది." (దివ్యఖుర్‌ఆన్ 18:110)

"మీకు దైవప్రవక్తలో గొప్ప ఉదాహరణ ఉంది. ఆయన దేవుడినే నమ్ముకున్నారు. తీర్పుదినాన్ని విశ్వసిస్తారు. ఆయన దేవుడిని ఎక్కువగా స్మరిస్తుంటారు." (దివ్యఖుర్‌ఆన్ 33:21)

ఈ దివ్యఖుర్‌ఆన్ వాక్యాలు ప్రవక్త ముహమ్మద్ హోదా ఎలాంటిదో చాటి చెబుతున్నాయి. ఆయన దేవుడు ఎన్నుకున్న ప్రవక్త.

ఈ పుస్తకం "నాతో రండి…మీతో దేవుడుంటాడు", ప్రవక్త ముహమ్మద్ జీవితంలోని వివిధ కోణాలను పరిచయం చేయడానికి ఒక చిరుప్రయత్నం. ఆయన అరబ్బు జీవితాలను ఎలా మార్చారు? అరేబియా ద్వీపకల్పంలో ఎలా శాంతి సౌభాగ్యాలను సాధించారన్నది ఈ పుస్తకం తెలియజేస్తుంది.

ప్రవక్త జీవితచరిత్రను సమర్పించడంలో ప్రవక్త వ్యక్తిత్వంలోని వివిధాంశాలను, వాటి నుంచి మనకు లభంచే బోధనలను కూడా తెలియజేసే ప్రయత్నం జరిగింది. ఆయన వ్యక్తిత్వం ఈనాడు మనల్ని ఎలా తీర్చిదిద్దగలదన్నది తెలుసుకోడానికి ఈ వివరాలు ఉపయోగపడతాయి. ప్రవక్త వ్యక్తిత్వం గురించి ఒకసారి ఆయన భార్య ఆయిషాను ప్రశ్నించినప్పుడు ఆమె జవాబిస్తూ దివ్యఖుర్‌ఆన్ ఆయన వ్యక్తిత్వమన్నారు. ఈ పుస్తకం ద్వారా ప్రవక్త ముహమ్మద్ జీవితం నుంచి ఆధ్యాత్మిక బోధనలను గ్రహించే ప్రయత్నం చేశాము.

ప్రవక్త జీవితంతో సంబంధం ఉన్న చారిత్రక అంశాల నుంచి కూడా మనం పాఠాలు గ్రహించగలం. ఏడవ శతాబ్దంలో, ఒక ప్రత్యేక సామాజిక, రాజకీయ, సాంస్కృతిక వాతావరణంలో దైవప్రవక్త పనిచేశారు. అప్పటి ప్రజల్లో తన సందేశప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఇస్లామీయ విశ్వాసం, ఇస్లామీయ నైతికప్రమాణాల వెలుగులో మాత్రమే పనిచేశారు. ఆయన ప్రవచనాలు, ఆయన ఆచరణలు అధ్యయనం చేయడం ద్వారా, అది అప్పటి చారిత్రక నేపథ్యంలో, భౌగోళిక నేపథ్యంలో అధ్యయనం చేయడం వల్ల మానవుల ధార్మిక విశ్వాసాలు, సోదరభావం, ప్రేమ, కష్టాలు, సాముదాయిక జీవితం, న్యాయం, చట్టాలు, యుద్ధాలు వగైరా అనేక విషయాల గురించి అవగాహన పొందగలం. అప్పటి ప్రవక్త బోధనలు ఆచరణలు నేడు మనకాలంలో కూడా ఎలా అన్వయిస్తున్నాయో అర్థం అవుతుంది.

పాఠకులు ముస్లిములైనా, ముస్లిమేతరులైనా, ప్రవక్త జీవితాన్ని అధ్యయనం చేస్తే వివిధ వాస్తవాలు ఆయన్ను అనుసరించాలని ఆహ్వానిస్తున్నాయి. కొన్ని సంఘటనలపై దృష్టి పెట్టడమన్నది వాటి నుంచి పాఠాలు గ్రహించడానికి, మనకాలంలో అన్వయించుకునే అవకాశాలు పొందాలన్న కోరికతోనే. ఈ పుస్తకంలోని ప్రతి విభాగం చాలా చిన్నది. కావాలనే చిన్న చిన్న విభాగాలుగా రాయడం జరిగింది. ఈ పుస్తకం చదువుతున్నప్పుడు ప్రవక్త జీవితచరిత్ర, దివ్యఖుర్ఆన్ బోధనలు, సంబంధిత ఆధ్యాత్మిక, తాత్విక, సామాజిక, న్యాయిక, రాజకీయ, సాంస్కృతిక అంశాలు, నేటి కాలంతో అన్వయింపులు కనబడతాయి.

మా ఉద్దేశ్యం ప్రవక్త గురించి సమగ్ర సమాచారాన్ని అందించడం. నమ్మినా నమ్మకపోయినా, ఆయన తన ఇస్లామీయ ఉద్యమాన్ని ముందుకు నడిపిన తీరు, ఆయన వ్యక్తిత్వం మనోమస్తిష్కాలపై అలుముకుంటుంది. ప్రవక్త జీవితాన్ని ఒక అద్దంగా, నేటి మన సవాళ్ళను ఆ అద్దంలో చూసి, విశ్లేషించి, విస్తృతమైన ఆధ్యాత్మిక, సామాజిక, నైతిక అవగాహన పొందాలన్నదే ఈ ప్రయత్నం.

ప్రవక్త ముహమ్మద్ నాయకుడు. ఆయన బోధనల అధ్యయనం, ఆయన మార్గాన్ని అనుసరించడం, ఆయన ఆదర్శాన్ని స్వీకరించడం, ఆయన ప్రవచనాలు, ఆచరణలు, ఆయన మౌనం అన్నింటిలోను అర్థముంది. ఆలోచించి గ్రహించవలసిన పాఠాలున్నాయి.

ఈ పుస్తకం విస్తృత పాఠకలోకం కోసం ఉద్దేశించింది. ముస్లిములు, ముస్లిమేతరులు అందరికోసం ఉద్దేశించింది. ఇందులోని సంఘటనలు మధ్య మధ్య విశ్లేషణలు, ఆలోచనలతో ఇస్లామీయ ఆధ్యాత్మిక విశ్వజనీన బోధనలను అర్థం చేసుకోడానికి అనువుగా ఇవ్వడం జరిగింది. ప్రవక్త చారిత్రక అనుభవాలు నేడు ప్రపంచంలో 1.7 బిలియన్ల ప్రజలు అనుసరిస్తున్న ధార్మిక విశ్వాసాన్ని అవగాహన చేసుకోడానికి ఉపయోగపడతాయి. ఆ విధంగా ఈ పుస్తకం ఇస్లామ్‌కు ఒక సజీవ పరిచయం.

ప్రవక్త అనుచరులు ఆయన్ను అమితంగా ప్రేమించారు. ఆయన సమక్షంలో ఆధ్యాత్మిక శక్తిని పొందేవారు.

ప్రవక్త ముహమ్మద్ తన అనుచరులకు, యావత్తు ముస్లిమ్‌ప్రపంచానికి దేవుడిని ప్రేమించమన్నారు. దివ్యఖుర్ఆన్ ఈ విధంగా ప్రకటించింది.

"ఓ ప్రవక్తా! ఇలా చెప్పు "మీరు దేవుడిని ప్రేమిస్తే, నన్ను అనుసరించండి. దేవుడు మిమ్మల్ని ప్రేమిస్తాడు." (దివ్యఖుర్ఆన్ 3:31)

ముస్లిములు ప్రవక్తను అనుసరించడానికి సాధ్యమైనన్ని ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు. ఆయన పట్ల అపరిమితమైన ప్రేమాభిమానాలు కలిగిఉంటారు. వారికి దేవునిపై ఉన్న ప్రేమకు ఇది ఒక నిదర్శనం.

ఈ ప్రేమ వారి హృదయాల్లో శాశ్వతంగా ప్రవక్తను గుర్తుచేస్తూ ఉంటుంది. ఎల్లప్పుడు ఆయన్ను అనుసరించే ప్రయత్నాలు, ఆయన కోసం ప్రార్ధనలు అందువల్లనే కొనసాగుతూ ఉంటాయి.

"దేవుడు ఆయన దైవదూతలు ప్రవక్త కోసం దురూద్ పంపుతుంటారు. విశ్వాసులారా! మీరు కూడా ఆయనకు దురుద్ పంపండి. ఆయనకు పూర్తి గౌరవాదరాలతో సలామ్ చేయండి." (దివ్యఖుర్ఆన్ 33:56)


ఆయన పట్ల ప్రేమతో, జ్ఞానంతో ఆయన పట్ల అవగాహన పెంచడానికి చేసిన ప్రయత్నమే ఈ పుస్తం. ప్రవక్త ముహమ్మద్ జీవితం ఆధ్యాత్మికతకు ఆహ్వానం. వివిధ సంఘటనలు, పరీక్షలు, కష్టాలు, మన అన్వేషణ, వీటి మధ్య మన ప్రశ్నలకు నిజమైన సమాధానాలు మన తెలివితేటలు కాదు మన మనస్సే ఇస్తుంది. ప్రేమించలేని వారు అర్ధం చేసుకోలేరు.

తీవ్రమైన పరిశోధన, అధ్యయనంతో నేను యధార్ధాలను ఇందులో పొందుపరిచాను. నిజాయితీతో కూడిన ఈ ప్రయత్నాన్ని అల్లాహ్ స్వీకరించాలని నేను ప్రార్ధిస్తున్నాను. నాకున్నది సమస్తం దేవునికి కోసం అంకితం చేసే సౌభాగ్యం ప్రసాదించాలని వేడుకుంటున్నాను. నా అసంఖ్యాక పొరబాట్లను క్షమించి, తన కరుణతో అనుగ్రహించాలని కోరుతున్నాను....ఆమీన్

"ఇదంతా పూర్తిగా అల్లాహ్ సహాయం పైనే ఆధారపడి ఉంటుంది. ఆయననే నేను నమ్ముకున్నాను. ప్రతి వ్యవహారంలోను ఆయనవైపునకే మరలుతాను" (దివ్యఖుర్ఆన్ 11:88)

# ప్రవక్త కాలంలో అరేబియా ద్వీపకల్పం

## ప్రవక్త ముహమ్మద్ 570-632



# ప్రవక్త పేరు, అనుచరులు పేర్లు పలుకుతున్నప్పుడు పాటించవలసిన మర్యాదలు

సల్లల్లాహు అలైహి వసల్లమ్ అని పలకడం. ఈ వాక్యానికి అర్థం ఆయనపై అల్లాహ్ శాంతి అనుగ్రహాలు కురిపించుగాక.

ప్రవక్త ముహమ్మద్ కోసం దురూద్(ప్రార్థన) పంపడం ముస్లిములకు తప్పనిసరి. ఆయన పేరు ఉచ్చరించిన ప్రతిసారి ఈ ప్రార్థన చేస్తారు. అందువల్ల ఈ ప్రార్థన సల్లల్లాహు అలైహి వసల్లమ్ అనేది ప్రవక్త ముహమ్మద్ పేరుతో పాటు వస్తుంటుంది.

ప్రవక్త కోసం చేసే ఈ ప్రార్థన ఆయన దేవుడు కాదన్న విశ్వాసాన్ని రోజు బలపరుస్తు ఉంటుంది. ఆయన మానవమాత్రుడేనని, ఆయన మానవాళి నాయకుడు, చిట్టచివరి ప్రవక్త అయినప్పటికీ దేవుడు మాత్రం కాదు. ఆయనకు కూడా అల్లాహ్ కారుణ్యం, అనుగ్రహాలు అవసరం. ఈ ప్రార్థన చాలా ముఖ్యమైనది. ఇది ప్రవక్త హెూదాను తెలియజేసే ప్రార్థన. ప్రవక్తను దేవుని స్థాయికి చేర్చకుండా, దేవునికి సమానంగా చేయకుండా, దేవునితో ఏవిధంగాను పోల్చకుండా వారిని నివారించే ప్రార్థన ఇది. ఈ ప్రార్థన నిజానికి ఇస్లామీయ ఏకదైవారాధక విశ్వాసాన్ని కాపాడే రక్షణ కవచం.

# రజీ అల్లాహు అన్హ్ అంటూ ప్రవక్త అనుచరుల పేర్లు ఉచ్చరించినప్పుడు పలకడం

ప్రవక్త అనుచరుల పేర్లు ఎప్పుడు ఉచ్చరించినా రజిఅల్లాహు అన్హ్ అంటే దేవుడు వారితో ప్రసన్నుడవుగాక అని ప్రార్థించడం మర్యాద.

# I

# కాబా

## దైవగృహం

ఇస్లామీయ విశ్వాసాల ప్రకారం దైవగృహం కాబాను ప్రవక్త ఇబ్రాహీమ్ (ఆయనకు శాంతి కలుగుగాక), ఆయన కుమారుడు ప్రవక్త ఇస్మాయీల్ (ఆయనకు శాంతి కలుగుగాక) కలిసి నిర్మించారు. స్వచ్ఛమైన ఏకదైవారాధన కోసమూ, భూమ్యాకాశాలను సృష్టించిన ఒకేఒక్క దేవుడిని, సమస్త ప్రవక్తలకు, యావత్తు మానవాళికి ప్రభువైన ఒకేఒక్క దేవుడి ఆరాధనకు కాబాగృహాన్ని నిర్మించారు. అనేక శతాబ్దాలు గడిచిపోయాయి. మక్కా నగరం ఒక హజ్‌యాత్రకు కేంద్రమయ్యింది. మక్కా ఒక ముఖ్యమైన మార్కెట్ నగరంగాను, వ్యాపార వాణిజ్యాలకు కేంద్రంగాను అభివృద్ధి చెందింది. సాంస్కృతికంగాను, ధార్మికంగాను అనేక అంశాలు ఇక్కడ సమ్మిళితమైపోయాయి. చాలా కాలం ఏకదైవారాధక విశ్వాసం కొనసాగినప్పటికీ కాలక్రమేణా గిరిజన తెగల స్వంత దేవీ దేవతలు, స్థానిక దేవుళ్ళ ఆరాధనలు మొదలయ్యాయి. బహుదైవారాధక విశ్వాసాలు వేళ్ళూనుకున్నాయి. ఇస్లామీయ చరిత్ర ప్రకారం దివ్యఖుర్ఆన్ అవతరణ ప్రారంభమైనప్పుడు కాబాగృహంలో 360 ప్రతిమలు, చిత్రాలు పూజలందుకునేవి.

ఏకదైవారాధక విశ్వాసం కేవలం గుప్పెడు మందిలో మాత్రమే మిగిలింది. ఈ చిన్న సమూహం విగ్రహారాధనను తీవ్రంగా వ్యతిరేకిస్తూ వచ్చింది. వారిని హునఫా అనేవారు. అంటే స్వచ్ఛమైన ఇబ్రాహీమ్ ప్రవక్త విశ్వాసాన్ని అనుసరించేవారని భావం. హునఫా అంటే స్వచ్ఛమైనదని అర్థముంది. దివ్యఖుర్ఆన్ కూడా ఇబ్రాహీమ్ ప్రవక్త (ఆయనకు శాంతి కలుగుగాక) ధార్మిక సరళిని అత్యంత స్వచ్ఛమైనదిగా – హనీఫ్– అని అభివర్ణించింది.

"అల్లాహ్‌కు తనను తాను సమర్పించుకున్నవాడూ, సత్ప్రవర్త కలవాడూ, అల్లాహ్ తన మిత్రునిగా ఎన్నుకున్న ఇబ్రాహీము విధానాన్ని ఏకాగ్రమనస్సుతో అనుసరించేవాడూ అయిన వ్యక్తి జీవన విధానం కంటే మేలైనది మరెవరిది కాగలుగుతుంది?" (దివ్యఖుర్ఆన్ 4 : 125)

# జననం

దైవప్రవక్త ముహమ్మద్ (ఆయనకు శాంతి కలుగుగాక) కామన్ ఎరా ప్రకారం 570వ సంవత్సరం, ఏప్రిల్ 20వ తేదీ సోమవారం జన్మించారు. మక్కాలోని గౌరవప్రదమైన బనూ హాషిం కుటుంబంలో ఆయన జన్మించారు. మక్కా చుట్టుపక్కల ఉన్న అనేక వంశాలు, తెగలలో బనూ హాషింకు చాలా గౌరవప్రదమైన స్థానం ఉండేది. కాని ఆయన జననం తర్వాత విషాదాలు వెంటాడాయి. ఆయన తల్లి కడుపులో ఉన్నప్పుడే అంటే, ఆయన తల్లి హజ్రత్ ఆమీనా మూడు నెలల గర్భవతిగా ఉన్నప్పుడు తండ్రి అబ్దుల్లా మక్కాకు ఉత్తరాన ఉన్న యస్రిబ్ నగరానికి వెళుతూ దారిలోనే మరణించారు. పుట్టుకకు ముందే తండ్రిని కోల్పోయిన ప్రవక్త ముహమ్మద్ ఒక విచిత్రమైన పరిస్థితిని బాల్యంలో ఎదుర్కున్నారు. గొప్ప గౌరవప్రదమైన కుటుంబ వారసత్వం ఒకవైపు, తండ్రిలేని అనాథలా కష్టాలు కడగండ్లు మరోవైపు.

ముహమ్మద్ అన్న పేరు (ఈ పేరుకు అర్థం ప్రశంసనీయుడు అని) అప్పట్లో అరేబియా ద్వీపకల్పంలో అంతగా తెలియని పేరు. తల్లి హజ్రత్ ఆమీనా గర్భంలో ఉన్నప్పుడు ఒక కలలో ఈ పేరు చూశారు. ప్రజల నాయకుడు పుట్టబోతున్నాడని ఆమె కలలో చూశారు. బిడ్డ పుట్టినప్పుడు "నేనీ బిడ్డను అసూయపరుడి మోసాల నుంచి రక్షణగా ఒకే ఒక్క దేవుడి (అల్‌వాహిద్) శరణులో ఉంచుతున్నాను." అని పలకాలని కూడా ఆమెకు చెప్పబడింది. ఒకవైపు భర్త మరణం వంటి భరించలేని విషాదం, మరోవైపు బిడ్డ జన్మించిన సంతోషం హజ్రత్ ఆమీనా (దైవం ఆమె పట్ల ప్రసన్నుడవుగాక)ను ముప్పిరిగొన్నాయి. గర్భంతో ఉన్నప్పుడు వింతైన సూచలేవో కనబడేవని ఆమె తెలిపారు. బిడ్డ జననం కూడా చాలా సునాయాసంగా జరిగింది.

# ఎడారి

నాలుగేళ్ళ వరకు బాల ముహమ్మద్ దాయీ హలీమా పెంపకంలో ఉన్నారు. అరబ్బు ఎడారిలో బనూ సాద్ తెగతో పాటు దాదీ హలీమా పెంపకంలో పెరిగారు. మక్కాలో ఇది ఒక సంప్రదాయంగా ఉండేది. సంచార తెగల వారికి పెంపకానికి పిల్లలను చిన్నప్పుడు

ఇచ్చేవారు. అత్యంత కఠినమైన ఎడారి వాతావరణంలో సంచార తెగ బనూ సాద్ తెగతో పాటు ఆయన గడిపారు. కనుచూపు మేర ఇసుక తప్ప మరేమీ కనబడని ఎడారిలో మనిషి ఎంత అల్పజీవి అన్నది అర్థమయ్యే వాతావరణం అది. మనిషి దేవుడ్ని తలచుకునేలా, ధ్యానించేలా చేసే పరిస్థితులవి. అప్పటికి ఆయనకు తెలియకపోయినా, ఆయన బాల్యావస్థలోనే ఉన్నప్పటికీ ఆయన దేవుడు ఆయనకు నిర్దేశించిన పరీక్షలను అప్పటి నుంచే ఎదుర్కోవడం ప్రారంభమయ్యింది. ఒకే ఒక్క దేవుడు అల్లాహ్ ఆయన్ను దైవప్రవక్తగా ఎన్నుకున్నాడు. ఆయనకు కావలసిన శిక్షణను దేవుడే ప్రసాదించడం ప్రారంభించాడు. ఆ దేవుడే ఆయనకు రబ్ అంటే ప్రభువుగా ముందుకు నడిపాడు.

దివ్యఖుర్ఆన్ తర్వాత అనాథగా ఆయన గడిపిన పరిస్థితిని గుర్తు చేసింది. ఎడారి జీవితం వల్ల లభించే ఆధ్యాత్మిక పాఠాలను కూడా గుర్తు చేసింది.

> "నీవు అనాథుడుగా ఉండటం చూసి ఆయన నీకు ఆశ్రయం కల్పించలేదా? నీవు మార్గమేదో తెలియని వాడవుగా ఉన్నప్పుడు ఆయన నీకు సన్మార్గం చూపించాడు. నీవు నిరుపేదగా ఉన్నప్పుడు, ఆయన నిన్ను ధనవంతుడుగా చేశాడు. కావున నీవు అనాథులపట్ల కఠినంగా ప్రవర్తించకు. యాచకుణ్ణి కసురుకోకు. నీ ప్రభువు వరాలను బహిర్గతం చెయ్యి." (దివ్యఖుర్ఆన్ 93 : 6-11)

ఈ దివ్యఖుర్ఆన్ వాక్యాల్లో అనేక బోధనలున్నాయి. ఆయన పేదవాడు, అనాథ. ఒక భవిష్య ప్రవక్త జీవితం ఇలా ప్రారంభమయ్యింది. దీనికి రెండు కారణాలున్నాయి. మొదటి బోధన, బాల్యంలో ఆయన ఎదుర్కున్న నిస్సహాయస్థితికి సంబంధించింది. ఆయన ఆరేళ్ళ వయసులో ఉన్నప్పుడు తల్లి హజ్రత్ ఆమీనా కూడా స్వర్గస్తులయ్యారు. ఇది మరో విషాదం. బాల్యంలోనే ఈ విషాదాలను ఆయన చవిచూశారు. ఇక ఆయన కేవలం దేవునిపై మాత్రమే ఆధారపడే పరిస్థితి ఏర్పడింది. అంతేకాదు, సమాజంలో అత్యంత పేదలకు ఆయన సన్నిహితమయ్యారు. దివ్యఖుర్ఆన్ ఈ విషయాన్ని గుర్తు చేస్తూ ఎన్నటికీ ఈ వాస్తవాలను మరిచిపోరాదని తెలియజేసింది. ముఖ్యంగా ఆయన ప్రవక్తగా నియమించబడిన తర్వాత ఈ వాస్తవాలు మరిచిపోవలసినవి కాదని బోధించింది. ఆయన ఒక అనాథగా, నిరుపేదగా పెరిగారు. అందువల్ల సమాజంలో బలహీనవర్గాల వారిని, అవసరార్థులను ఎన్నటికి మరిచిపోరాదన్న బోధన ఇందులో ఉంది. పైన పేర్కొన్న దివ్యఖుర్ఆన్ వాక్యంలోని రెండవ బోధన అందరికీ వర్తిస్తుంది. మనిషి తన గతాన్ని మరిచిపోరాదు. తాను ఎదుర్కున్న కష్టాలను, తన పరిస్థితులను, తన మూలాలను మరిచిపోరాదు. తన అనుభవాల నుంచి నిర్మాణాత్మక పాఠాలు గ్రహిస్తూ తనకే కాదు ఇతరులకు కూడా ఉపయోగపడేలా

వ్యవహరించాలి. ముహమ్మద్ ప్రవక్త గతాన్ని దేవుడు స్వయంగా ఆయనకు గుర్తు చేశాడు. ఈ గతం ఆయనకు ఒక పాఠశాల వంటిది. అందులోంచి ఆయన పాఠాలు గ్రహించాలి. ఉపయోగకరమైన, ఆచరణాత్మకమైన జ్ఞానాన్ని పొందాలి. ఆ జ్ఞానంతో సమాజంలో కష్టాల్లో ఉన్నవారికి ఉపయోగపడాలి. ఎందుకంటే ఆయన తన స్వంత అనుభవాల ద్వారా ఆయా కష్టాలు ఎలాంటివో తెలుసుకున్నారు కాబట్టి అలాంటి కష్టాల్లో ఉన్నవారి పరిస్థితిని ఆయన చక్కగా గ్రహించగలుగుతారు.

## ప్రకృతి ఒడిలో పాఠశాల

ఎడారి జీవితమంటే అత్యంత కఠినమైన పరిస్థితులను ఎదుర్కొనే జీవితం. మనిషి శక్తిసామర్థ్యాలు, విశ్వంలో మనిషి స్థానం, విశ్వంలోని వివిధ అంశాల గురించి అవగాహన చేసుకునే జీవితం. చిన్నప్పుడు బాల ముహమ్మద్ ఎడారిలోకి వచ్చినప్పుడు ఆయన బదూయిన్ అంటే సంచార అరబ్బు తెగల సుసంపన్నమైన మౌఖిక భాషా సంప్రదాయాన్ని నేర్చుకున్నారు. ధారాళంగా మాట్లాడే వారి వాక్పటిమను అలవరచుకున్నారు. ఆ తర్వాతి కాలంలో ప్రవక్తగా ఆయన తన వాగ్ధాటిపై నిలబడవలసి వచ్చింది. ఆయన భాషా ప్రావీణ్యం, విశ్వజనీనమైన ఇస్లామీయ సందేశాన్ని సరళంగా, సుబోధకంగా అందరికీ బోధపరచడంలో ఇది ఎంతో తోడ్పడింది.

బాల్యంలోనే ఆయన ప్రకృతికి దగ్గరగా జీవించారు. ప్రవక్తగా ఆయన ఉద్యమ జీవితంలో కూడా ఇది మనకు కనబడుతుంది. విశ్వంలో అనేక సూచనలున్నాయి. దేవుని ఉనికిని, దేవుడు ఒక్కడే నన్న వాస్తవాన్ని చాటి చెప్పే సూచనలు చాలా ఉన్నాయి. అన్నింటికి మించి ఎడారిలో మనిషిలో ఆలోచనలను రగిలించి ప్రకృతిని పరిశీలించి వాస్తవాలను గ్రహించేలా చేసే పరిస్థితులు ఇంకా చాలా ఉంటాయి. దైవధ్యానం వైపు మనిషిని మరలించే అంశాలు చాలా ఉంటాయి. అందువల్లనే దివ్యఖుర్ఆన్‌లో అనేక వాక్యాలు సృష్టి గురించి, అందులో కనబడే సూచనలు చెప్పే పాఠాల గురించి ఉన్నాయి. ఎడారి జీవం కనబడని ప్రాంతం. మనిషి అనుక్షణం అప్రమత్తంగా ఉండే ప్రదేశం, అక్కడ జీవితం ఎంత దైవికమైనదో స్పష్టంగా తెలిసివస్తుంది.

దివ్యఖుర్ఆన్ ఈ విధంగా తెలియజేసింది:

> "భూమ్యాకాశాల సృష్టిలో, రేయింబవళ్ల (నిరంతర) మార్పిడిలో, ప్రజలకు లాభం చేకూర్చే వస్తువులను మోసుకుంటూ సముద్రాలలో నడిచే ఓడలలో, ఆకాశం నుంచి

> అల్లాహ్ వర్షపు నీటిని కురిపించి మృతభూమిని బ్రతికించటంలో, ఇంకా అందులో అన్ని రకాల ప్రాణులను వ్యాపింపజేయటంలో, వీచే పవనాల దిశలు మార్చటంలో, భూమ్యాకాశాల మధ్య (దేవుని) నియమ నిబంధనలకు కట్టుబడి మసలుకుంటున్న మేఘాలలో బుద్ధిమంతులకు (దేవుని శక్తి సామర్థ్యాలకు సంబంధించిన) ఎన్నో సూచనలున్నాయి." (దివ్య ఖుర్ఆన్ 2:164)

బాల్యం ఎడారిలో గడిపిన బాల ముహమ్మద్ కు ఆ ఎడారి జీవితం విశ్వంలో పరచుకుని ఉన్న దేవుని సూచనలు గ్రహించే దృక్పథాన్ని ఇచ్చింది.

చాలా సంవత్సరాల తర్వాత ప్రవక్త ముహమ్మద్ మదీనాలో ఉన్నప్పుడు, తీవ్రమైన యుద్ధాలు, సంక్షోభాలు ఎదుర్కుంటున్నప్పుడు ఒక రాత్రి అవతరించిన దివ్యఖుర్ఆన్ వాక్యం ఆయనలో కొత్త లోకాన్ని తెరిచింది.

> "నిశ్చయంగా భూమ్యాకాశాల సృష్టిలో, రేయింబవళ్ల రాకపోకలలో విజ్ఞులకు ఎన్నో సూచనలున్నాయి." (దివ్యఖుర్ఆన్ : 3 : 190)

ఈ దివ్యఖుర్ఆన్ వాక్యం అవతరించినప్పుడు ప్రవక్త ముహమ్మద్ రాత్రంతా రోదిస్తూ గడిపారని తెలుస్తోంది. తెల్లవారుజాము హజ్రత్ బిలాల్, ప్రార్థనలకు అజాన్ చెప్పే ముఅజ్జిన్ (ప్రార్థనలకు పిలుపు ఇచ్చేవారు)గా అక్కడికి వచ్చి ఆయన కన్నీటిని చూసి కారణమడిగారు. ప్రవక్త ఆయనకు తన కన్నీటికి కారణం తెలుపుతూ "ఈ వాక్యం విని దానిపై ఆలోచించని వ్యక్తి ఎంత దురదృష్టవంతుడని" అన్నారు.

## ఒక అనాథ - ఒక శిక్షకుడు

మక్కాలో ఆయన తన బాల్యంలో తల్లితో పాటు రెండేళ్ళు ఉన్నారు. ఆయనకు ఆరేళ్ళ వయసు ఉన్నప్పుడు తల్లిగారు తన బంధువులందరితోను ఆయనకు పరిచయం చేయాలని భావించారు. ఆమె బంధువులందరు మదీనా నగరంలో ఉంటారు. కుమారుడిని తీసుకుని బయలుదేరారు. వెనుదిరిగి వస్తున్నప్పుడు దారిలో హజ్రత్ అమీనా అబ్వా అనే చోట జబ్బుపడ్డారు. అక్కడే ఆమె స్వర్గస్తులయ్యారు.

బాల ముహమ్మద్ ఇప్పుడు తల్లిని కూడా కోల్పోయారు. ఒక ప్రవక్తగా ఆయన ఎంపికకు సంబంధించిన చిహ్నాలే ఇవన్నీ. విషాదాలు, కష్టాలు, మృత్యు విఘాతాలు ఆయన్ను చుట్టుముట్టాయి. హజ్రత్ అమీనా సేవకునిగా వారితో పాటు ప్రయాణించిన బరకా ఆయన్ను

తీసుకుని మక్కా చేరుకున్నారు. ఆయన తాతగారు అబ్దుల్ ముత్తలిబ్ ఆయన్ను తన సంరక్షణలో తీసుకున్నారు. తాతగారు అబ్దుల్ ముత్తలిబ్ బాల ముహమ్మద్‌ను చాలా ప్రేమాభిమానాలతో చూసుకునేవారు. కాని రెండు సంవత్సరాల తర్వాత ఆయన కూడా మరణించారు.

ప్రవక్త ముహమ్మద్ కథ ఒక కఠినజీవితానికి సంబంధించిన కథ. ఇదే వాస్తవాన్ని దివ్యఖుర్ఆన్ వాక్యం ప్రకటించింది.

> "నిశ్చయంగా రాబోయే కాలం నీ కొరకు గత కాలంకన్నా మేలైనదిగా ఉంటుంది. త్వరలోనే నీకు నీ ప్రభువు నీవు సంతోషపడే అంత అధికంగా ప్రసాదిస్తాడు."
> (దివ్యఖుర్ఆన్ 94:5-6)

ఎనిమిదేళ్ళ వయసు లోనే ఆయన పేదరికాన్ని, ఒంటరితనాన్ని, తల్లిదండ్రుల మరణాన్ని, తాతగారి మరణాన్ని చూశారు. తన జీవితంలో అప్పటి నుంచే భవిష్యత్తులో కాబోయే ప్రవక్తకు సంబంధించిన సూచనలు ప్రస్ఫుటమయ్యాయి. తన చుట్టు ఉన్న ప్రజలు, పరిస్థితులు ఆయనకు చాలా నేర్పాయి. వాటి నుంచే ఆయన శిక్షణ పొందారు.

తాతగారు అబ్దుల్ ముత్తలిబ్ మరణశయ్యపై తన కుమారుడు అబూతాలిబ్‌ను అంటే, బాల ముహమ్మద్ తండ్రికి సోదరులైన అబూతాలిబ్‌ని పిలిచి మాట తీసుకున్నారు. బాల ముహమ్మద్‌ను సాకుతానని, బాగా చూసుకుంటానని అబూతాలిబ్ తండ్రికి మాట ఇచ్చారు. అబూతాలిబ్ తన జీవితాంతం ఇచ్చిన మాటకు కట్టుబడ్డారు. తన స్వంత కుమారుడిలా చూసుకున్నారు. అబూతాలిబ్, ఆయన భార్య ఫాతిమా తనను ఎంత బాగా చూసుకునేవారో తర్వాత అనేక సందర్భాల్లో ప్రవక్త ముహమ్మద్ చెప్పుకున్నారు. "నిస్సందేహంగా ప్రతి కష్టంలోను ఒక సాంత్వన ఉంది."

జీవితంలోని కష్టాలన్నింటిలోను బాల ముహమ్మద్ ఆ ఏకైక దేవుని సంరక్షణలో ఉన్నారన్నది కూడా యథార్థమే. ఆ దేవుడే ఆయనకు సంరక్షకుడు, శిక్షకుడు, ప్రభువు. అనేక చారిత్రక ఆధారాల వల్ల తెలుస్తున్నదేమంటే మక్కా నగరంలో విగ్రహారాధన నుంచి ఆయన్ను దేవుడే ఎల్లప్పుడు కాపాడుతూ వచ్చాడు. పండుగలు, పబ్బాలు, ఉత్సవాలు, పెళ్ళ వేడుకల వంటి వాటిలో మద్యపానం వంటివి సాధారణంగా ఉండేవి. వాటన్నింటి నుంచి ఆయన్ను దేవుడే కాపాడుతూ వచ్చాడు.

ఒకరోజు సాయంత్రం మక్కా నగరంలో జరుగుతున్న ఒక పెళ్ళి వేడుకకు హాజరవ్వాలని ఆయన బయలుదేరారు. దారిలో ఆయన్ను ఒక్కసారి అలసట ఆవహించింది. కాసేపు కూర్చుందామని ఒకచోట కూర్చుని అక్కడే గాఢంగా నిద్రపోయారు. మర్నాడు

ఎండవేడికి కాని ఆయన లేవలేదు. ఇది చిన్న సంఘటనగా కనబడవచ్చు కాని భవిష్యత్తులో ప్రవక్తగా నియమించబోయే బాలుడిని దేవుడు ఎలా కాపాడుకున్నాడో కూడా దీన్ని బట్టి అర్థమవుతుంది. ప్రతి సందర్భంలోను దేవుడు ఆయన పక్కన ఉన్నాడు.

# యువ పశుకాపరి

ఆ తర్వాతి సంవత్సరాల్లో యువ ముహమ్మద్ తన జీవిక కోసం పశువులను కాసారు. మక్కా శివార్లలో మేకలు, గొర్రెలు కాసేవారు. విస్తరించుకున్న అరేబియా ఎడారిలో తన పశువుల మందతో పాటు తిరిగేవారు. ప్రకృతిని దగ్గరగా పరిశీలించే అవకాశం ఈ విధంగా ఆయనకు లభించింది. సృష్టికర్త రూపొందించిన సృష్టిలోని ఆశ్చర్యజనకమైన వింతల్ని కళ్ళారా చూడగలిగారు.

పశుకాపరిగా తన గతం పట్ల ఆయనెంతో గర్వించేవారు. ఆయన ఎప్పుడు ఒక మాట చెప్పేవారు. అదేమంటే :

"పశుకాపరిగా పనిచేయని దైవప్రవక్త ఎవరూ లేరు. ప్రవక్త మూసా ఒక పశు కాపరి. దావూద్ ప్రవక్త కూడా పశుకాపరే." అనేవారు.

ఒక గొర్రెల మందను లేదా మేకల మందను, ఒంటెల మందను అదుపు చేయడం చాలా కష్టమైన పని. వాటికి మంచి చెడు తెలుసుకునే జ్ఞానం ఉండదు. పశువులను అదుపు చేయాలంటే చాలా సహనం అవసరం.

పశుకాపరిగా యువ ముహమ్మద్ ఒంటరితనాన్ని, సహనాన్ని, ధ్యానాన్ని, అప్రమత్తతను నేర్చుకున్నారు. ఒక ప్రవక్త తన ప్రజల్లో సందేశ ప్రచారం చేయాలంటే ఈ లక్షణాలు ఎంతైనా అవసరం.

బాల్యావస్థ నుంచి ప్రవక్త ముహమ్మద్ భవిష్య ఉద్యమానికి సంబంధించిన సూచనలను, పరీక్షలను ఎదుర్కున్నారు. వీటి ద్వారానే పాఠాలు గ్రహించారు.

# 2

# ప్రవక్త పదవి సూచనలు

ప్రవక్త ముహమ్మద్ తాతగారు అబ్దుల్ ముత్తలిబ్ తన చివరి రోజుల్లో ఆర్థికంగా చితికిపోయారు. ఆ తర్వాత యువ ముహమ్మద్ సంరక్షణ బాధ్యత తీసుకున్న అబూ తాలిబ్ కూడా ఆర్థికంగా కష్టనష్టాల్లోనే ఉన్నారు. అందువల్ల యువ ముహమ్మద్ చాలా చిన్న వయసులోనే సంపాదించడానికి పనిచేయవలసి వచ్చింది. ఆయన ఎల్లప్పుడు కుటుంబానికి సహాయపడాలని ప్రయత్నించేవారు.

అబూతాలిబ్ ఒక వ్యాపారి. ఆయన ఒకసారి వ్యాపార పర్యటనకు సిరియా వెళ్ళాలని సిద్ధమవుతున్నారు. బాల ముహమ్మద్ తాను కూడా వెంట వస్తానని పేచీ పెట్టారు. అంత చిన్న వయసులో కఠినమైన అలాంటి దూరపర్యటన చాలా కష్టం. కాని అబూతాలిబ్ ఆయన్ను చాలా ప్రేమగా చూసేవారు. అందువల్ల కాదనలేక తీసుకువెళ్ళారు.

వారి వ్యాపారబృందం సిరియాలోని బుస్రా నగరంలో మజిలీ చేసింది. అక్కడ బహీరా అనే క్రయిస్తవ సన్యాసి ఉండేవారు. చివరి ప్రవక్త రానున్నాడన్న విషయాన్ని ఈ క్రయిస్తవ సన్యాసి ధార్మిక గ్రంథాల్లో చదివి ఉన్నాడు. చారిత్రక ఆధారాల ప్రకారం చాల మంది క్రయిస్తవులు, యూదులు, హునఫాల మాదిరిగా బహీరా కూడా చివరి ప్రవక్త వచ్చే సంకేతాల కోసం చాలా జాగ్రత్తగా ఎదురుచూస్తూ ఉండేవాడు.

ఈ వ్యాపార బృందం రావడాన్ని దూరంగా చూసిన బహీరా, ఈ వ్యాపార బృందానికి ఎండ తగలకుండా పైన ఒక మేఘం కూడా వెంటనే వస్తుండడం గమనించాడు.

ఈ విషయమై మరింత తెలుసుకోవాలన్న జిజ్ఞాసతో బహీరా ఆ వ్యాపారబృందంలోని వారందరినీ భోజనానికి పిలిచాడు. బృందంలోని వారందరినీ జాగ్రత్తగా పరిశీలించిన తర్వాత బాల ముహమ్మద్‌పై అతని దృష్టి నిలిచిపోయింది. అతను ముహమ్మద్‌ను పక్కకు తీసుకెళ్ళి

కుటుంబం గురించి అనేక ప్రశ్నలు వేశాడు. సామాజిక స్థాయి గురించి, బాల ముహమ్మద్‌కు వచ్చే కలల గురించి ఇలా అనేక ప్రశ్నలు అడిగాడు. చివరకు బాల ముహమ్మద్‌తో మీ వీపు ఒకసారి చూడవచ్చా అని అడిగాడు. బాల ముహమ్మద్ ఒప్పుకున్నారు. ఆయన రెండు భుజాల మధ్య వీపుపై ధార్మిక గ్రంథాల్లో పేర్కొన్నటువంటి ప్రవక్త చిహ్నాన్ని ఆయన చూశాడు. బాల ముహమ్మద్‌లో ప్రవక్త సంకేతాలన్నింటినీ ఆయన గమనించాడు. ఈ బాలుడే చివరి ప్రవక్త అన్నది గుర్తించాడు.

ఆ పిదప క్రయిస్తవ సన్యాసి బహీరా, అబూతాలిబ్‌తో "ఈ బాలుడికి మీకు బంధుత్వమేమిటి" అని ప్రశ్నించాడు. అబూతాలిబ్ "నా కుమారుడు" అని జవాబిచ్చాడు. బహీరా ఈ మాటలు విని "అదేలా సాధ్యం, ఈ బాలుడి తండ్రి బతికి ఉండడం జరగదే" అన్నాడు. అబూతాలిబ్ అప్పుడు జవాబిస్తూ బాలముహమ్మద్ తండ్రి బతికి లేరని, ఆయన తన సోదరుడని వివరించారు.

క్రయిస్తవ సన్యాసి బహిరా "ఈ బాలుడు మానవాళికి నాయకుడు. దేవుడు ఇతడిని సందేశం పంపిస్తాడు. ఆ సందేశం అందరికీ కారుణ్యమవుతుంది." అన్నాడు. అబూతాలిబ్ ఆశ్చర్యంగా "మీకెలా తెలుసు" అని ప్రశ్నించాడు. బహిరా సమాధానమిస్తూ "మీరు అకబా నుంచి వస్తున్నప్పుడు దారిలో రాళ్ళు, చెట్లు తమకు తామే సాష్టాంగపడడాన్ని గమనించాను. ప్రవక్తలకు తప్ప మరెవ్వరికీ అవి అలా చేయవు. ఆయన భుజాల క్రింద ఉన్న ప్రవక్త చిహ్నాన్ని కూడా నేను గుర్తుపట్టాను. ఒక ఆపిల్ మాదిరిగా ఉంది." అన్నాడు. వెంటనే బాలముహమ్మద్‌ను తీసుకుని వెనక్కి వెళ్ళిపొమ్మని, శత్రువుల నుంచి ఆయన్ను కాపాడాలని బహిరా సలహా ఇచ్చాడు. అంతేకాదు "దేవుని తోడు, ఈయన్ను గుర్తుపడితే, ఈయనకు నష్టం కలిగిస్తారు" అని జాగ్రత్తలు కూడా చెప్పాడు. అబూతాలిబ్ ఆ మాటలు విని వెంటనే ఆయన్ను మక్కాకు తిప్పి పంపించాడు.

## సన్మార్గపు ఒప్పందం

బాల ముహమ్మద్ పదిహేను సంవత్సరాల వయసులో ఉన్నప్పుడు హజ్ యాత్ర సందర్భంగా స్థానిక తెగల మధ్య ఒక ఘర్షణ చోటు చేసుకుంది. ఆ ఘర్షణ చిలికి చిలికి గాలివానగా మారి యుద్ధమయ్యింది. ఖురైషులకు, హవాజిన్ తెగకు మధ్య పోరాటమది. మక్కా సంప్రదాయాల ప్రకారం హజ్‌యాత్ర కాలంలో పోరాటాలు నిషిద్ధం. వీటిని పవిత్ర మాసాలు అనేవారు. అయినప్పటికీ యుద్ధం నాలుగేళ్ళపాటు కొనసాగింది. ఇరుపక్షాలకు తీవ్రమైన నష్టం వాటిల్లింది. మతిలేని ఈ యుద్ధం వల్ల బతుకులు దుర్భరమయ్యాయి.

ఆ చిరుప్రాయంలోనే యువ ముహమ్మద్ ఈ యుద్ధబీభత్సం పట్ల తీవ్రమైన చింతకు గురయ్యారు. అనవసరపు రక్తపాతానికి ఆందోళన చెందారు. చాలా మంది ప్రజలు కూడా ఆయనలాగే ఆలోచించడం ప్రారంభించారు. ఫలితంగా యుద్ధాన్ని ఆపి శాంతికి తలుపులు తెరువాలన్న ఆలోచనలు ప్రారంభమయ్యాయి.

సువాసనద్రవ్యాల వ్యాపారం చేసే పలుకుబడి ఉన్న వ్యాపారి, జుదాన్ కుమారుడు అబ్దుల్లా చొరవ తీసుకున్నాడు. యుద్ధాన్ని ఆపాలని భావించేవారినందరినీ తన ఇంటికి పిలిచాడు. శాంతికాముకులందరినీ ఆహ్వానించాడు. వివిధ తెగల నాయకులు, అధినేతలు హాజరయ్యారు. ఈ ఘర్షణల్లో కలుగజేసుకుని వాటిని ఆపాలని, దౌర్జన్యపరులకు వ్యతిరేకంగా బాధితుల పక్షాన నిలవాలని, దౌర్జన్యపరులు ఎవరైనా, వారితో ఏ తెగలు ఉన్నా గాని వారిని నిరోధించాలని అందరూ కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ ఒప్పందాన్ని హిల్ఫుల్ ఫుజూల్ (సన్మార్గపు ఒప్పందం) అంటారు. ఇది ఒక ప్రత్యేకమైన ఒప్పందం. న్యాయం, బాధితులకు సహాయం వంటి సూత్రాలకు పెద్దపీట వేసి, వంశాలు, తెగల పక్షపాతాలను కాదన్న ఒప్పందం ఇది. ఈ ఒప్పందంలో యువ ముహమ్మద్, అబూబక్ర్ తదితరులు కూడా పాల్గొన్నారు. అబూబక్ర్ తర్వాత ప్రవక్త ముహమ్మద్‌కు అత్యంత సన్నిహిత సహచరులయ్యారు.

దివ్యఖుర్ఆన్ అవతరణ ప్రారంభమైన చాలా కాలం తర్వాత ఒక సందర్భంలో ప్రవక్త ముహమ్మద్ ఈ ఒప్పందంలోని అంశాలను మననం చేసుకున్నారు.

"జుదాన్ కుమారుడు అబ్దుల్లా ఇంట అప్పుడు నేను కూడా ఉన్నాను. ఈ ఒప్పందం జరిగినప్పుడు నేను పాల్గొన్నాను. ఆ ఒప్పందానికి బదులుగా ఎర్ర ఒంటెల మందను నాకిస్తానన్నా గాని నేను ఒప్పుకోను. ఇప్పుడు ఇస్లామ్ వచ్చిన తర్వాత కూడా ఇలాంటి ఒప్పందాల్లో నేను చాలా సంతోషంగా పాల్గొంటాను." అన్నారాయన.

అప్పట్లో తెగలమధ్య సంబంధాల కారణంగా కుదిరే మైత్రి ఒప్పందాలకు విరుద్ధంగా న్యాయం కోసం కుదిరిన ఈ ఒప్పందంలోని అంశాలను ప్రవక్త ముహమ్మద్ ప్రశంసించడమే కాదు, ఇస్లామ్ సందేశ ప్రచారకుడిగా, ఒక ముస్లిమ్‌గా కూడా తాను ఆ ఒప్పందాన్ని చాలా గౌరవిస్తానని నొక్కి చెప్పారు. అలాంటి మరో ఒప్పందంలో పాల్గొంటానికి కూడా వెనుకాడనని అన్నారు.

ఇక్కడ ముఖ్యంగా గమనించవలసిన విషయమేమంటే, న్యాయానికి కట్టుబడడం, బాధితుల పక్షాన నిలవడం అన్నవి ముఖ్యమైన సూత్రాలు వాటినే ప్రవక్త నొక్కి చెప్పారు. అంటే ఈ సూత్రాలను సమర్థించేవారు ముస్లిములైనా కాకపోయినా సరే ప్రవక్త వాటిని సమర్థిస్తారన్నది స్పష్టంగా తెలుస్తోంది.

# సత్యవాది

పశుకాపరిగా కొంతకాలం పనిచేసిన తర్వాత ఆయన ఒక వ్యాపారిగా మారారు. నిజాయితీ, సత్యసంథతలకు మారుపేరుగా నిలిచారు. ప్రవక్త ముహమ్మద్ తన యవ్వనప్రాయంలోకి అడుగిడినప్పుడు ఆ కాలంలో సర్వసాధారణంగా సమాజమంతటా అలుముకుని ఉన్న చెడుల నుంచి దేవుడే ఆయన్ను అనుక్షణం కాపాడుతూ వచ్చాడు. ఆయన చాలా సరళమైన జీవితాన్ని గడిపేవారు. అహంకారాన్ని, ఆడంబరాలను దూరంగా ఉంచేవారు. పేదలు, అనాథలు, వితంతువుల పట్ల ఆదరంగా ఉండేవారు. వారికి సహాయపడేవారు. నైతికంగా ఉన్నతమైన నడవడికి, మృదువైఖరికి, నిబద్ధతతకు ఆయన ఒక ఉదాహరణయ్యారు.

ఆ కాలంలోని చెడులన్నింటికి ఆయన దూరంగా ఉన్నారు. జూదం, మద్యపానం, అసభ్యచేష్టలకు ఆయన చాలా దూరం. వివాదాలకు, వాదులాటలకు దూరంగా ఉండేవారు. ఎవరినీ దూషించలేదు. దుర్భాషలు ఆయన నోట ఎన్నడూ వెలువడలేదు. అందరూ ఆయన్ను సాదిక్, అంటే సత్యవాది అనేవారు.

# నిజాయితీపరుడు

ఆయన వ్యాపారబృందానికి నాయకుడిగా ఉండేవారు. వ్యాపారబృందం నాయకుడిగా ఆయన్ను అందరూ అల్ అమీన్ అంటే నిజాయితీపరుడని పిలిచేవారు. ఈ పదంలోని మూలపదమే ఆమెన్ అన్న ఇంగ్లీషు పదంలోను ఉంది. ప్రార్థనల చివర ఈ పదాన్ని వాడుతారు. అంటే హృదయపూర్వకంగా స్వీకరించడమని అర్థం. మక్కాలో ప్రజలందరూ, పేద ధనిక తేడా లేకుండా అందరూ తమ వస్తువులు, ధనసంపదలు ఆయన వద్ద దాచుకునేవారు. ఆయన నిజాయితీ, విశ్వసనీయత అంతగా పేరుపొందాయి.

వివాదాల్లో ఇరుపక్షాలు ఆయన మాటను సమ్మతించేవి. అబూతాలిబ్ కుమారుడు అలీ ప్రకారం ఆయన వద్దకు వచ్చిన వారెవ్వరయినా గాని ఆయన్ను అభిమానించేవారు.

# వివాహం

మక్కాలో అత్యంత సంపన్న వ్యాపారి ఒక మహిళ. ఆమె పేరు హజ్రత్ ఖదీజా. ఆమె ఒక వితంతువు. వరకా అనే క్రయిస్తవ సన్యాసికి ఆమె బంధువు. ఆమె ఎప్పటినుంచో యువ ముహమ్మద్ గురించి వింటూ వచ్చారు. నిజాయితీపరుడు, సమర్థుడు, సత్యవాది అన్న

విషయాలు ఆమె చెవినపడ్డాయి. ఆమె ఆయన్ను పరీక్షించాలని అనుకున్నారు. తన వ్యాపారసామాగ్రిని సిరియా తీసుకెళ్ళి అక్కడ అమ్మిపెట్టాలని ఆమె కబురంపారు. జయప్రదంగా వ్యాపరపర్యటన ముగిస్తే రెట్టింపు పారితోషికం ఇస్తానని కూడా చెప్పారు. యువ ముహమ్మద్ ఒప్పుకున్నారు. ఆమె పంపిన సేవకుడు మైసరాతో కలిసి వ్యాపారసామగ్రితో సిరియా బయలుదేరారు. సిరియాలో ఆయన వ్యాపారం ఖదీజా అంచానాలకు మించి చేశారు.

వ్యాపార బృందం వెనుదిరిగి వచ్చిన తర్వాత సేవకుడు మైసరా చెప్పిన మాటలను ఖదీజా చాలా జాగ్రత్తగాఇ విన్నారు. పాతికేళ్ళ వయసున్న యువ ముహమ్మద్ గురించి జాగ్రత్తగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చారు. తమ యాత్రలో దారిపొడవునా కొన్ని వింతైన సంకేతాలు తాను చూసానని మైసరా చెప్పాడు. యువ ముహమ్మద్ నడవడి గురించి, ఆయన వ్యక్తిత్వం గురించి తెలియజేశాడు. ఆయనలాంటి మనిషి ఇంకెవ్వరు ఉండరని కూడా చెప్పాడు. ఆ తర్వాత ఖదీజా తన స్నేహితురాండ్రలో ఒకరైన నుఫైసాతో యువ ముహమ్మద్‌కు వివాహ ప్రతిపాదన పంపారు.

తనకిప్పుడు పెళ్ళి చేసుకునే స్తోమత లేదని యువ ముహమ్మద్ నుఫైసాకు తెలియజేశారు. ఆమె ఖదీజా గురించి చెబుతూ, ఆమె మంచి వంశానికి చెందిన అందమైన, సంపన్నురాలైన మహిళ అని వివరించారు. యువ ముహమ్మద్ జవాబిస్తూ తాను ఈ ప్రతిపాదనను గౌరవిస్తానని, కాని తన పరిస్థితి దృష్ట్యా ఈ వివాహం గురించి ఆలోచించలేనని అన్నారు. నుఫైసా నచ్చచెబుతూ ఈ వ్యవహారాన్ని ఖదీజాకే వదిలేస్తే ఆమె ఏర్పాట్లు చేసుకుంటారని చెప్పి వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళి ఖదీజాతో యువ ముహమ్మద్‌కు ఇష్టమేనని తెలియజేసింది. ఖదీజా ఆ వెంటనే యువ ముహమ్మద్‌ను ఇంటికి పిలిచి వివాహ ప్రతిపాదన చేశారు. ఆయన అంగీకరించారు. బంధువులు, వంశంలోని పెద్దలు అందరూ ఒప్పుకున్నారు.

ఈ పెళ్ళి జరిగినప్పుడు ఖదీజా నలభై సంవత్సరాల మహిళ. వారికి పుట్టిన మొదటి బిడ్డపేరు ఖాసిమ్. ఆ బిడ్డ కేవలం రెండు సంవత్సరాలు మాత్రమే జీవించాడు. ఆ పిదప జైనబ్, రుకయ్యా, ఉమ్మె కుల్సుమ్, ఫాతిమా చివరిగా అబ్దుల్లా జన్మించారు. మగపిల్లవాడు అబ్దుల్లా కూడా రెండేళ్ళ వయసుకు చేరుకోక ముందే మరణించాడు. ఆ రోజుల్లోనే యువ ముహమ్మద్ బానిసగా ఉన్న జైద్‌కు స్వేచ్ఛ ఇచ్చి తన కుమారుడిగా దత్తత చేసుకోవాలని నిర్ణయించారు. హారిస్ కుమారుడు జైద్‌ను ఆయన భార్య స్వయంగా ఆయనకు కానుకగా ఇచ్చారు. తర్వాత తన కుమారుడు అబ్దుల్లా మరణించిన తర్వాత ఆయన తన పినతండ్రి అబూతాలిబ్‌కు సహాయపడాలని నిర్ణయించారు. అబూతాలిబ్ తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారు. ఆయనది చాలా పెద్ద కుటుంబం. అబూతాలిబ్ కుమారుడు అలీని తన ఇంటికి తెచ్చుకున్నారు. తర్వాత అలీ ప్రవక్త ముహమ్మద్ కుమార్తె ఫాతిమాను వివాహమాడారు.

# దత్తపుత్రుడు

జైద్, దత్తపుత్రుడి కథ కూడా ఆసక్తికరమైనది.అతను ఒక యుద్ధంలో పట్టుబడ్డాడు. అనేకసార్లు అతడిని అమ్మడం కొనడం జరిగింది. చివరకు ఖదీజా కొన్నారు. తర్వాత ప్రవక్త ముహమ్మద్ అధీనంలోకి వచ్చాడు. ప్రవక్త ముహమ్మద్ సేవలో అనేక సంవత్సరాలు ఉన్నాడు.

జైద్ ఎక్కడ ఉన్నాడో విచారించి తెలుసుకున్న అతడి తండ్రి ఇతర బంధువులు తిరిగి అతడిని తీసుకెళ్ళాలని భావించారు. ప్రవక్త ముహమ్మద్ ఇంట జైద్ ఉన్నట్లు తెలుసుకున్న తండ్రి ఇతర సన్నిహిత బంధువులు అక్కడికొచ్చి జైద్‌ను తిరిగి కొనుక్కొని విడిపించుకోవాలనుకున్నారు. ప్రవక్త ముహమ్మద్ వారితో మాట్లాడుతూ అసలు జైద్ ఇష్టమేమిటో తెలుసుకోమని చెప్పారు. జైద్ తన వారితో ఇంటికి వెళ్ళాలనుకుంటే స్వేచ్ఛగా వెళ్ళవచ్చని ఎలాంటి పరిహారం చెల్లించవలసిన అవసరం లేదని చెప్పారు. కాని జైద్ తన యజమానితో ఉండాలనుకుంటే మాత్రం బంధువులందరూ అతడి ఇష్టాన్ని గౌరవించాలని చెప్పారు.

వారందరూ కలిసి జైద్‌ను అడిగారు. జైద్ స్వేచ్ఛగా తండ్రితో పాటు వెళ్ళడానికి బదులు తాను ప్రవక్త ముహమ్మద్ వద్ద బానిసగా ఉంటానని చెప్పాడు.

ఆ విధంగా జైద్ అక్కడే ఉండిపోయాడు. ప్రవక్త ముహమ్మద్ ఆ వెంటనే జైద్‌కు స్వేచ్ఛ ప్రసాదించడమే కాదు, బహిరంగంగా నేటి నుంచి జైద్ తన కుమారుడని ప్రకటించారు. జైద్ ఇబ్నే ముహమ్మద్‌గా (అంటే ముహమ్మద్ కుమారుడు జైద్) అతడిని పిలవాలని చెప్పారు. అతను తన వారసుడని కూడా ప్రకటించారు. ప్రవక్త ముహమ్మద్ పేరునే జైద్ తర్వాత కొనసాగించారు. కాని దివ్యఖుర్ఆన్ వాక్యాలు అవతరించి దత్తత తీసుకున్న పిల్లలు తమ అసలు తల్లిదండ్రుల పేర్లను మాత్రమే కొనసాగించాలని ఆదేశించేవరకు ఆయన జైద్ ఇబ్నే ముహమ్మద్‌గానే ఉన్నారు. (దివ్యఖుర్ఆన్ 33 : 45 చూడండి)

జైద్ కథ మనకు ప్రవక్త ముహమ్మద్ వ్యక్తిత్వంలోని మరో కోణాన్ని చూపిస్తుంది. జైద్ స్వేచ్ఛగా తన తండ్రితో పాటు వెళ్లడం కన్నా బానిసగా ప్రవక్త ముహమ్మద్ వద్ద ఉండడానికే ఇష్టపడడం చాలా ఆలోచించవలసిన విషయం. ఈ కథ వల్ల మనకు ప్రవక్త ముహమ్మద్ దేవుని సందేశహరునిగా తర్వాతి రోజుల్లో నిర్వహించే ఉద్యమబాధ్యతలకు తగిన వ్యక్తిత్వం తెలుస్తోంది. ఆయన చాలా సాదాసీదాగా ఉండేవారు, మౌనంగా ఉండేవారు, మర్యాదస్తుడు, నిజాయితీపరుడు, సమర్థుడు, స్త్రీపురుషులు, పిల్లలు అందరినీ గౌరవించేవారు. అందరూ ఆయన్ను అభిమానించేవారు. ఆయన్ను అస్సాదిక్, అంటే సత్యవాది అని పిలిచేవారు.

ఆయన అల్ అమీన్ అంటే విశ్వసనీయుడు. హుందాతనం గలవారు. ఒక ప్రవక్తగా ఆయన నియమించబడక ముందే ఆయన భవిష్యత్తులో ప్రవక్త కాబోతున్నారన్న సంకేతాలు ఆయన జీవితంలో అనేకం బహిర్గతమయ్యాయి. ఆయన గుణగణాలు సాటిలేనివి. ఆయన ఒక విశిష్టమైన వ్యక్తి అన్నది అప్పటికే మక్కా నగరంలో ప్రతి ఒక్కరికీ తెలుసు.

# నిశితమైన బుద్ధి వివేకాలు

మరో సంఘటనలో ఆయన బుద్ధివివేకాలు ఎంత నిశితమైనవో తెలుస్తోంది. వివిధ తెగల మధ్య, వ్యక్తుల మధ్య శాంతియుత వాతావరణం ఏర్పరచడానికి ఆయన బుద్ధివివేకాలు ఎంతో ఉపయోగపడేవి. అలాంటి ఒక సంఘటన గురించి చూద్దాం

మక్కా ఖురైషులు కాబాగృహాన్ని పునర్నిర్మించాలని భావించారు. ఒక వరదలో కాబా పునాదులు దెబ్బతిన్నాయి. గోడలు బీటలు వారాయి. పాత నిర్మాణాన్ని పడగొట్టి దాన్ని మళ్ళీ కట్టడం ప్రారంభించారు. అయితే కాబా గోడలో నల్లరాతిని అమర్చవలసిన సమస్య వచ్చింది. ఈ నల్లరాయి ఆదమ్ హవ్వాల కాలం నాటిదని తెలుస్తోంది. ఇది కాబాగృహం తూర్పు మూలన ఉంటుంది. దీన్ని హజ్రె అస్వద్ అంటారు. దీన్ని కాబాగోడలో అమర్చవలసి ఉంది. ఆ నల్లరాయిని అమర్చే హక్కు తమకుందంటే, తమకుందంటూ వివిధ తెగలు ఘర్షణకు దిగాయి. ఘర్షణ చిలికి చిలికి గాలివానగా మారి ఆయుధాలు చేతుల్లోకి వచ్చే పరిస్థితి కనబడింది.

ఇంతలో వారిలో ఒక వృద్ధుడు ఈ ఘర్షణను నివారించడానికి ఒక ఉపాయం సూచించాడు. మర్నాడు పొద్దుట ఎవరు ముందుగా ఆ పవిత్రస్థలంలోకి అడుగుపెడుతూ కనబడతారో వారి సలహా అడుగుదామన్నాడు. దీనికి అందరూ ఒప్పుకున్నారు.

మర్నాడు అందరికన్నా ముందు ముహమ్మద్ ఆ పవిత్రస్థలంలో అడుగుపెట్టారు. ఇది చూసి అందరూ చాలా సంతోషించారు. ఎందుకంటే ఆయన నిర్ణయాన్ని వాళ్ళందరూ చాలా గౌరవిస్తారు. ఆయన అందరూ చెప్పింది జాగ్రత్తగా విన్నారు. తర్వాత ఒక దుప్పటి తీసుకురమ్మన్నారు. ఆ నల్లరాతిని ఎత్తి ఆ దుప్పటిలో ఉంచారు. తర్వాత అన్ని తెగల నాయకులను ఆ దుప్పటిని తీసుకుని కాబాగృహం తూర్పు మూల వరకు, ఎక్కడైతే ఆ రాతిని అమర్చాలో అక్కడి వరకు తీసుకురమ్మని చెప్పారు. వారు అక్కడికి తీసుకొచ్చి పైకి ఎత్తిన తర్వాత తానే స్వయంగా ఆ నల్లరాతిని అక్కడ అమర్చారు. ఈ విధంగా నల్లరాతిని అమర్చడంలో అందరూ పాలుపంచుకున్నట్లయ్యింది. ఒక ఘర్షణను ఆయన తన చాతుర్యంతో నివారించారు.

సమయస్ఫూర్తిగా ప్రవక్త ముహమ్మద్ తీసుకున్న నిర్ణయం వల్ల అన్ని తెగలు సంతృప్తి చెందాయి. ఈ సమయస్ఫూర్తి బుద్ధి చాతుర్యం తర్వాత ఆయన ఇస్లామీయ ఉద్యమ ప్రచారంలో కూడా అనేకసార్లు ప్రదర్శించారు. వివిధ తెగలకు చెందిన, భిన్న నేపథ్యాలకు చెందిన వారు ముస్లిము సమాజంలో చేరినప్పుడు వారి మధ్య ఐకమత్యాన్ని కాపాడ్డంలో ఆయన చూపిన సమయస్ఫూర్తి, బుద్ధిచాతుర్యాలు గొప్ప నిర్వహణా సామర్థ్యానికి నిదర్శనాలు.

శాంతి స్థాపన కోసం ఆయన ఎల్లప్పుడు ప్రయత్నించారు. కాబా నిర్మాణమప్పుడు ఏవిధంగా వివిధ తెగల మధ్య ఎలాంటి గర్వాతిశయం తలెత్తకుండా చాకచక్యంగా, మృదువైఖరితో సమస్యను పరిష్కరించారో, అదే వైఖరి అనేక సందర్భాల్లో మనకు కనబడుతుంది. దైవప్రవక్తగా నియమించబడడానికి కొన్ని ముందు దేవుడు స్వయంగా ఆయనకు ప్రసాదించిన లక్షణమిది. ఎలాంటి పరిస్థితుల్లోనైనా హేతుబద్ధంగా, సామరస్యంగా వ్యవహరించే లక్షణం.

ముహమ్మద్ ముప్పయి ఐదు సంవత్సరాల వయసుకు చేరుకునేసరికి ఆయన మక్కాలో మంచి పేరు సంపాదించుకున్నారు. బనూ హాషిం వంశం పేరు నిలబెట్టేవానిగా, తన తాతముత్తాతల వారసత్వాన్ని కొనసాగిస్తూ తెగకు నాయకుడిగా మారుతారని చాలా మంది భావించారు.

ఆయన వివాహం, ఆయన కార్యకలాపాలు, ఆయన వ్యక్తిగత గుణగణాల వల్ల ఆయన రాజకీయంగా, ఆర్థికంగా కూడా ప్రముఖునిగా ఎదిగారు. ఆయన కుమార్తెలకు వివాహ ప్రతిపాదనలు రాసాగాయి. ఉదాహరణకు ఆయన పినతండ్రి అబూలహబ్ సంబంధం కలుపుకోవాలనుకున్నాడు. తన కుమారులు ఉత్బా, ఉతైబాలకు ప్రవక్త ముహమ్మద్ కుమార్తెలు రుఖయ్యా, ఉమ్మె కుల్సుమ్‌లతో వివాహం జరిపించాలని భావించాడు. ప్రవక్త ముహమ్మద్ తెగ నాయకునిగా మారితే వచ్చే ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని ఈ వివాహ ప్రతిపాదనలు వచ్చాయన్నది కూడా గుర్తించాలి.

## చెడులు

ముహమ్మద్ (దైవం ఆయనకు శాంతి ప్రసాదించుగాక) ప్రవక్తగా నియమించబడక ముందు అక్కడి సమాజంలో పరిస్థితులు చాలా దారుణంగా ఉండేవి. తెగల మధ్య ఆధిక్యత కోసం యుద్ధాలు జరిగేవి. చిన్న చిన్న విషయాలకే రక్తపాతాలు జరిగేవి. అత్యంత ఆటవికమైన పరిస్థితి రాజ్యం చేసేది.

అణిచివేతలు, హింసాకాండ అడ్డుఅదుపు లేకుండా కొనసాగేవి. మానవాళి పూర్తిగా చీకట్లలో కొట్టుమిట్టాడుతున్న కాలమది. చెడులు, రుగ్మతలు, విషాదాలు, పేదరికం, హింసాకాండ ఎటుచూసినా మానవత్వం కనిపించేది కాదు. ఈ పరిస్థితిని దివ్యఖుర్‌ఆన్ చక్కగా వివరించింది:

"మానవులు చేజేతులా సంపాదించుకున్న దాని ఫలితంగానే నేలపైనా, నీటిలోనూ కల్లోలం చెలరేగింది; వారి కొన్ని చేష్టల (ఫలితం)ను వారికి చవి చూపటానికి; బహుశా వారు తమను సంస్కరించుకుంటారేమో అని."(దివ్యఖుర్‌ఆన్ 30 : 41)

ఆ కాలంలో క్రయిస్తవ, యూద మతాలు చాలా మార్పులు చేర్పులకు గురయ్యాయి. రబ్బీలు, పూజారులు తమ ఇష్టం వచ్చిన మార్పులు చేర్పులు చేశారు. ఎలాంటి హేతుబద్ధత అందులో కనబడేది కాదు. మక్కాలో ఖురైషులు తాము తయారు చేసుకున్న విగ్రహాలను పూజించేవారు. ఇందులో మూడు విగ్రహాలు చాలా పెద్దవి. హుబాల్, అల్ లాత్; అల్ ఉజ్జా. ఖురైషులు, అరేబియా తెగలు ఈ విగ్రహాలను పూజించేవారు. తమకు సహాయం చేయాలని ఈ విగ్రహాలకు మొరపెట్టుకునేవారు, వాటి పేరున ఒట్లు వేసుకునేవారు, ఈ విగ్రహాల కోసం యుద్ధాలు చేసేవారు.

అక్కడ మనిషికి విలువలేదు. ముఖ్యంగా బలహీనవర్గాల వారికి, స్త్రీలకు ఎలాంటి విలువ లేదు. పురుషుల సుఖం కోసం ఉపయోగపడే వస్తువులుగా స్త్రీలను పరిగణించేవారు. వారిపై తీవ్రమైన అణిచివేత కొనసాగేది. అమ్మాయి పుట్టడాన్ని అప్రతిష్ఠగా భావించేవారు. ఆర్థికంగా నష్టమనుకునేవారు. కన్నతండ్రి స్వయంగా పుట్టిన ఆడపిల్లను సజీవసమాధి చేసేవాడు.

ఈ విషయాన్ని దివ్యఖుర్‌ఆన్ దైవం స్వయంగా ఇలా తెలియజేశాడు.

"వారిలో ఎవడికైనా కూతురు పుట్టినదనే శుభవార్తను అందజేస్తే అతడి ముఖాన్ని నల్లని ఛాయలు ఆవరిస్తాయి. అతడు లోలోన కుమిలిపోతాడు"
(దివ్యఖుర్‌ఆన్ 16:58)

## సత్యాన్వేషణ

ఈ కాలంలో ముహమ్మద్ మక్కా దగ్గరిలో ఉన్న గుహలో ఏకాంతంగా ధ్యానంలో గడిపేవారు. రమజాన్ మాసంలో ఆయన అక్కడ ఉన్న హీరా గుహకు వెళ్ళిపోయేవారు. తనతో పాటు ఆహారాన్ని తీసుకువెళ్లి అక్కడే చాలా రోజులు ఏకాంతంగా ధ్యానంలో గడిపేవారు. దాదాపు

నెలరోజులపాటు అక్కడనే ఉండేవారు.

ఆ గుహకు వెళ్ళాలంటే ఆయన ఒక చిన్న కొండ ఎక్కవలసి ఉండేది. ఆ తర్వాత కొండకు ఆవలి పక్కకు వెళ్ళాలి. పైగా ఇరుకైన రాళ్ళదారిలో నడవాలి. ఆ గుహ ముఖద్వారం నుంచి కిందికి చూస్తే దూరంగా కాబాగృహం కనబడుతుంది. మరికాస్త దూరం చూస్తే విశాలమైన ఎడారి కనుచూపు మేరను ఆవరించుకుంటుంది.

అందరికీ దూరంగా, ప్రకృతి ఒడిలో ఆ గుహలో ఏకాంతంగా ఆయన్ ధ్యానం ద్వారా శాంతిని అన్వేషించేవారు. ఆయన ఎన్నడూ విగ్రహారాధన చేయలేదు. ఆ ప్రాంతంలోని తెగల మతాచారాలను ఎన్నడూ ఆయన పాటించలేదు. ఎన్నడూ ఆయా మతవిశ్వాసాలను నమ్మలేదు. మూఢనమ్మకాలకు, అన్యాయాలకు ఆయన ఎల్లప్పుడు దూరంగానే ఉన్నారు. స్వయంగా దేవుడే ఆయన్ను కుహానా దేవీదేవతల నుంచి కాపాడాడు. పూజలందుకునే విగ్రాహాలు, అదికారం, సంపద ఉన్న తోటి మనుష్యులు ఎవరినీ ఆరాధించకుండా దైవమే ఆయన్ను కాపాడుతూ వచ్చాడు.

ఆయనకు విచిత్రమైన కలలు వస్తూ ఉండేవి. కలలు నిజమవుతూ వచ్చేవి. పైగా ఆ కలల ప్రభావం ఆయన్ను ఆ తర్వాత కూడా వెంటాడేది. ఈ విషయాన్ని ఆయన తన భార్య ఖదీజాకు కూడా చెబుతూ వచ్చారు. నిజానికి అది సత్యాన్వేషణ. తన చుట్టు లభించే సమాధానాలతోవ ఆయన సంతృప్తి చెందలేదు. సత్యం కోసం తానే మరింత శోధించాలన్న ఆయనలోని తపన వల్ల ఆయన ఏకాంతాన్ని ఎన్నుకున్నారు. అప్పటికి ఆయన వయసు నలభై సంవత్సరాలకు చేరుకుంది. లోతయిన ఆత్మావలోకనకు అవసరమైన మానసిక పరిపూర్ణత లభించే వయసది.

హీరా గుహలో ఆయన ఒంటరిగా తన జీవితానికి అర్థం ఏమిటన్న ప్రశ్నపై లోతుగా ఆలోచించేవారు. ధ్యానించేవారు. తానెందుకు భూమిపై వచ్చాడు? తన జీవితంలో కనబడిన వివిధ సంకేతాలకు అర్థాలేమిటి? అక్కడ హీరా గుహ నుంచి చూస్తే కనబడే పరిసరాలు ఆయనకు బాల్యాన్ని గడిపిన జీవితాన్ని గుర్తు చేస్తూ ఉండేవి. అప్పట్లో ఆయన బాలుడు. కాని ఇప్పుడు అర్థం చేసుకునే అవగాహన ఉన్న ప్రౌఢ వయస్కుడు.

ఆయన సత్యాన్వేషణ కొనసాగించారు. ఆయన జీవితంలో చూసిన అనేక సంకేతాలు ఆయనకు సహజంగానే గుర్తొచ్చి ఉంటాయి. ఆ సంకేతాలు, ఆయన్ను రక్షించినవి, ఆయనకు సాంత్వన నిచ్చినవి, ఆయన కలలో కనబడిన దృశ్యాలు, ఆయన మనోమస్తిష్కాలు అడిగే ప్రశ్నలు, ఆ ప్రశ్నలకు కొనసాగుతున్న అన్వేషణ ఇవన్నీ కలిసి చివరకు ఆయన్ను విశ్వప్రభువును పరిచయం చేశాయి. నలభై ఏళ్ళ వయసులో ప్రవక్త ముహమ్మద్ జీవితంలో ఒక దశ

ముగిసింది.

ఒకరోజు రమజాన్ మాసంలో ఆయన హీరా గుహకు వెళుతున్నప్పుడు, కామన్ ఎరా 610 సంవత్సరంలో, ఆయన ఒక స్వరం తనను పిలవడాన్ని విన్నారు.

అస్సలాము అలైక యా రసూలల్లా

దైవ ప్రవక్త మీకు శాంతి కలుగుగాక.... అని పిలిచిన పిలుపు విన్నారు..

## దివ్యఖుర్ఆన్ మొదటి అవతరణ

హీరాగుహలో ఒంటరిగా ప్రవక్త ముహమ్మద్ సత్యాన్వేషణలో నిమగ్నమయ్యేవారు. ఒక రమజాన్ మాసం, 21వ రాత్రి, కామన్ ఎరా 610వ సంవత్సరం, ఆగష్టు 10వ తేదీ, సోమవారం, ప్రవక్త ముహమ్మద్ హీరాగుహలో ధ్యానంలో ఉన్నారు. హఠాత్తుగా దైవదూత జిబ్రయీల్ ఆయన ముందుకు వచ్చారు. "చదువు" అని ఆదేశించారు. ప్రవక్త ముహమ్మద్ జవాబిస్తూ తనకు చదవడం రాదని అన్నారు. దైవదూత జిబ్రయీల్ ఆయన్ను గట్టిగా అదుముకున్నారు. తర్వాత మళ్ళీ చదువు అని ఆదేశించారు. మళ్ళీ ప్రవక్త ముహమ్మద్ తనకు చదవడం రాదని జవాబిచ్చారు. దైవదూత ఆయన్ను మరోసారి గట్టిగా అదుముకున్నారు, ఎంత గట్టిగా అంటే ఆయనకు ఊపిరి ఆడనంత గట్టిగా, ఆ తర్వాత మళ్ళీ చదువు అని మూడోసారి ఆదేశించారు. మళ్ళీ ప్రవక్త అదే జవాబిచ్చారు. దైవదూత ఆయన్ను పట్టుకుని ఈ క్రింది దైవవాక్యాలు పలికారు.

> "(ఓ ప్రవక్తా!) పఠించు సర్వాన్నీ సృష్టించిన నీ ప్రభువు పేరుతో. ఆయన పేరుకుపోయిన నెత్తుటి ముద్దతో మానవుణ్ణి సృజించాడు. పఠించు: నీ ప్రభువు పరమ దయాళువు. ఆయన కలంద్వారా జ్ఞానం నేర్పాడు, మనిషి ఎరుగని జ్ఞానాన్ని అతనికి ప్రసాదించాడు." (దివ్యఖుర్ఆన్ 96:1-5)

ఇవి దివ్యఖుర్ఆన్‌లో మొట్టమొదట అవతరించిన వాక్యాలు. దైవదూత జిబ్రయీల్ ద్వారా ప్రవక్త ముహమ్మద్ వద్దకు వచ్చిన మొట్టమొదటి దివ్యఖుర్ఆన్ వాక్యాలివి. ఈ వాక్యాలు పఠించిన తర్వాత దైవదూత జిబ్రయీల్ వెళ్ళిపోయారు. ప్రవక్త ముహమ్మద్ చాలా ఆందోళనకు గురయ్యారు. ఆయన వెంటనే తన ఇంటికి వెళ్ళాలనుకున్నారు. ఆందోళనతో ఆయన ఇంటికి వచ్చారు. రాగానే భార్యతో "నాకు దుప్పటి కప్పు" అన్నారు. ఖదీజా వెంటనే ఆయనకు దుప్పటి కప్పారు. ఏమైందని అడిగారు. ప్రవక్త ముహమ్మద్ జరిగింది వివరిస్తూ తనకేమీ అర్థం కావడం లేదని, ఏదో భయం ఆవరిస్తోందని చెప్పారు.

"నాకేమవుతోంది?" అన్నారు. ఖదీజా అనునయంగా ఆయన్ను ఓదారుస్తూ, "మీరు భయపడవలసినదేమీ లేదు, విశ్రాంతి తీసుకోండి. మీరు అందరితో కరుణతో వ్యవహరిస్తారు, సత్యాన్నే మాట్లాడుతారు, అవసరంలో ఉన్నవారిని ఆదుకుంటారు, అతిథుల పట్ల ఆదరంగా ఉంటారు, ప్రతి మంచిపనికి మద్దతిస్తారు. మిమ్మల్ని దేవుడు విడిచిపెట్టడు. మీకు నష్టం కలుగదు" అని ఓదార్పు మాటలు చెప్పారు.

# సన్యాసి వరకా

ఖదీజా (దేవుడు ఆమెతో ప్రసన్నుడవు గాక) తన బంధువైన క్రయిస్తవ సన్యాసి వరకా అభిప్రాయం తెలుసుకోవాలని భావించారు. ఆయన వద్దకు వెళ్ళి ప్రవక్త ముహమ్మద్‌కు ఎదురైన సంఘటన గురించి చెప్పారు. వరకా వెంటనే ఆ సంకేతాలను గుర్తించాడు. ఆ సంకేతాల కోసం వరకా లాంటి వారు ఎదురుచూస్తున్నారు. వెంటనే వరకా ఏమాత్రం సందేహించకుండా, ముహమ్మద్ వద్దకు వచ్చింది దైవసందేశాన్ని తీసుకొచ్చే దైవదూత, ఈ దైవదూతే ప్రవక్త మూసా వద్దకు దైవసందేశం తీసుకువచ్చారు, ముహమ్మద్ తన ప్రజలకు దైవం తరఫున ప్రవక్తగా వచ్చారని చెప్పాడు.

ఆ తర్వాత ప్రవక్త ముహమ్మద్ ను కాబా వద్ద కలిసినప్పుడు వరకా ఆయనతో "మిమ్మల్ని అసత్యవాది అనంటారు, మీపట్ల అనుచితంగా వ్యవహరిస్తారు, మిమ్మల్ని బహిష్కరిస్తారు, మీపై దాడులు చేస్తారు, నేను అప్పటి వరకు బతికి ఉంటే మీకు మద్దతుగా ఉంటాను. దేవుడి ధర్మం విజయం సాధించడానికి మద్దతిస్తాను" అన్నాడు. ఆయిషా ప్రకారం వరకా ఇంకా ఇలా కూడా చెప్పాడు "మీ ప్రజలు మిమ్మల్ని బహిష్కరిస్తారు", ఈ మాటలు విని ప్రవక్త ముహమ్మద్ దిగ్భ్రాంతి చెందారు. "నా వాళ్ళు నన్ను బహిష్కరిస్తారా?" అని మళ్ళీ అడిగారు. వరకా ఆయన్ను హెచ్చరిస్తూ "అవును, వాళ్ళు తప్పక అలాగే చేస్తారు. మీరు తీసుకొచ్చిన సందేశం వంటిది తీసుకొచ్చిన ప్రవక్తలను శత్రువుగా చూడకపోవడం అనేది జరగనే లేదు." అన్నాడు.

ప్రవక్త ఉద్యమం అప్పుడప్పుడే మొదలుకాబోతున్న కాలమది. ఆయనకు దైవసందేశం గురించిన మౌలికమైన విషయాలు అప్పుడే అవగతమయ్యేలా చేశాడు దేవుడు. వివిధ ప్రజల్లో భవిష్యవాణుల ద్వారా చరిత్రలో నమోదైన సత్యాలను కూడా ఆయన గ్రహించారు.

ఖదీజాకు ఈ విషయాలను అవగాహన చేసుకున్నారు. ఆమె ప్రవక్తకు అత్యంత నమ్మకమైన, అత్యంత ఆధారపడదగిన ఆలంబనగా నిలిచారు.

# 3

# సందేశం

ప్రారంభదినాల్లో ఇస్లామీయ సందేశం ముఖ్యంగా నాలుగు అంశాల చుట్టు కేంద్రీకృతమైంది. ఏకదైవారాధన, దివ్యఖుర్‌ఆన్ హెూదా, ప్రార్ధన, మరణానంతర జీవితం. ప్రారంభంలో ముస్లిములుగా మారినవారు లోతయిన ఆధ్యాత్మిక పరివర్తన చెందవలసి వచ్చింది. ఈ విషయాన్ని ప్రత్యర్థులు కూడా బాగానే అర్థం చేసుకున్నారు. సమాజంలో ఈ కొత్త మతం ఇస్లామ్ వల్ల వచ్చే తీవ్రమైన మార్పులను వారు కూడా అవగతం చేసుకున్నారు.

## సందేశస్వీకరణ

మొట్టమొదట ఇస్లామ్‌ను స్వీకరించిన వారు ఖదీజా. ప్రవక్త ముహమ్మద్ ఉద్యమంలోని మొదటి పదిసంవత్సరాల కాలంలో ఆమె ఆయనకు కొండంతబలంలా వెన్నంటి ఉన్నారు.

ఖదీజా తర్వాత ప్రారంభంలో అయన కుటుంబసభ్యుల్లోని సన్నిహితులు, ఆయన సన్నిహిత మిత్రులు ఇస్లామ్ స్వీకరించారు. అబూతాలిబ్ కుమారుదు అలీ ప్రవక్తతో పాటే ఉండేవారు. ఆయన ఇస్లామ్ స్వీకరించారు. ఆయన దత్తపుత్రుడు జైద్, ప్రవక్త ముహమ్మద్ బాల్యంలో నాలుగేళ్ళ వయసు తర్వాత ఎడారి నుంచి తిరిగి వచ్చాక ఆయన పెంపకం చూసిన దాయీ ఉమ్మె ఐమన్, ఆయనకు ప్రియమిత్రుడు అబూబక్ర్ మొదటగా ఇస్లామ్ స్వీకరించారు. వారు విశ్వాస ప్రకటన చేసి ముస్లిములుగా మారారు. విశ్వాసప్రకటన అంటే : అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హుడైన దేవుడెవ్వరూ లేడు. ముహమ్మద్ అల్లాహ్ పంపిన దైవప్రవక్త అని ప్రకటించడం.

ఇస్లామ్ స్వీకరిస్తున్న వారి సంఖ్య నెమ్మదిగా పెరగసాగింది. ప్రవక్త స్వయంగా

కొనసాగించిన సందేశప్రచారంవల్ల, అబూబక్ర్ ఈ సందేశప్రచారంలో పూర్తిగా పాలుపంచుకోవడం వల్ల ఇస్లామ్ నెమ్మదిగా వ్యాపించసాగింది. అబూబక్ర్ ఎల్లప్పుడు సత్యం కోసం నిలబడేవారు. ఆయన బానిసలను కొని వారికి ఇస్లామ్ కోసం స్వేచ్ఛ ప్రసాదించేవారు. మనుష్యులందరూ సమానులనే ఇస్లామీయ సూత్రాన్ని నొక్కి చెప్పేవారు. ఆ రోజుల్లో మక్కాలో ప్రవక్త ముహమ్మద్ కార్యకలాపాలు, ఆయన వ్యక్తిత్వం చాలా మందిని కొత్తధర్మంలోకి ఆకర్షించాయి. క్రమేణా ఇస్లామ్ స్వీకరించేవారి సంఖ్య పెరగసాగింది.

మొదటి మూడు సంవత్సరాల కేవలం 30 నుంచి 40 మంది ఖురైస్ తెగ నుంచి ఇస్లామ్ స్వీకరించారు. వారంతా ముస్లిముగా మారిన ఎవరో ఒకరి ఇంట్లో ప్రవక్త ముహమ్మద్‌ను కలిసేవారు. ఇస్లామ్ మౌలిక బోధనల గురించి అక్కడ పాఠాలు గ్రహించేవారు. దివ్యఖుర్ఆన్ అవతరణలు కొనసాగుతూ ఉండేవి. వాటిని ప్రవక్త ముహమ్మద్ తన అనుచరులకు బోధిస్తూ ఉండేవారు. అయితే ముస్లిములకు సమాజంలో వాతావరణం చాలా ప్రతికూలంగా మారసాగింది. మక్కావాసులకు ఈ కొత్త ధర్మం, దాని సూత్రాల గురించి తెలిసింది. ఈ కొత్తధర్మం వల్ల పేదవారిపై, యువకులపై పడే ప్రభావం ఏమిటో కూడా అర్థమయ్యింది.

మొదటి నుంచి ప్రవక్త ముహమ్మద్ తన ప్రచారంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. ముస్లిముల సంఖ్య పెంచడం కాదు, మనస్ఫూర్తిగా, త్రికరణశుద్ధిగా ఇస్లామ్ స్వీకరించేవారి పట్లనే ఆసక్తి చూపించారు. ముస్ముందు ఎదురయ్యే ఘర్షణలు, వ్యతిరేకతల గురించి ఆయనకు బాగా తెలుసు. అందువల్ల పూర్తి నిబద్ధతతో ఇస్లామ్‌లోకి వచ్చే వారి వైపు మాత్రమే దృష్టిపెట్టారు. ఆ గుప్పెడు మంది అనుచరులకు ఇస్లామీయ విశ్వాసాలు, ఆచరణల శిక్షణ అందించారు. ఈ కొంతమంది ముస్లిములు తీవ్రమైన విమర్శలను, వ్యతిరేకతలను, చివరకు బహిష్కరణలను కూడా ఎదుర్కోవలసి వస్తుందని ఆయనకు బాగా తెలుసు. ఈ కొద్ది మంది ముస్లిములే చివరి వరకు ఆయన్ను వెన్నంటి ఉన్నారు. కష్టాలు, కడగండ్లు, బాధలు, సవాళ్ళు ఏవి ఎదురైనా తొణకకుండా ఆయన్ను అనుసరించారు.

మూడేళ్ళ కాలం వరకు ప్రవక్త ముహమ్మద్ చాలా నిశ్శబ్దంగా ముస్లిముల ఈ చిన్న బృందాన్ని తీర్చిదిద్దారు. ఇందులో స్త్రీలు పురుషులు, అన్ని తెగలకు, అన్ని వంశాలకు చెందినవారు ఉండేవారు. సమాజంలోని అన్ని హోదాలకు చెందిన వారు ఉండేవారు.

# దివ్యఖుర్‌ఆన్ అవతరణ దైవికసందేశం

మొదటి దివ్యఖుర్‌ఆన్ సందేశం ప్రవక్త ముహమ్మద్‌లో విశ్వప్రభువు అల్లాహ్ ఆలోచనలను పటిష్టపరిచే వాక్యాలను తీసుకువచ్చింది. దేవుని అత్యున్నతమైన ఉనికిని తెలియజేసేదిగా అవతరించింది. దేవుడు ఆయనతో ఎల్లప్పుడు "రబ్బిక" నీ ప్రభువును అని సంబోధిస్తూ మాట్లాడాడు. దైవసందేశానికి సంబంధించిన మొదటి మౌలికాంశాలను దైవదూత జిబ్రయీల్ ఆయనకు చేరవేశారు. దేవుని గుర్తింపును తెలియజేశారు. మంచి నడవడికి, రాయను చదవడం నేర్చుకోవడం ఆయనకు మంచి పరిణామాల శుభవార్తలను తెలియజేయడం జరిగింది. ఎదురయ్యే విపత్తులు, వ్యతిరేకతల గురించి హెచ్చరికలు ఇవ్వడం జరిగింది. చరిత్రలో మంచివ్యక్తి, సత్యం కోసం నిలబడిన వ్యక్తులపై వ్యతిరేకతలు, వైరాలు రాకుండా ఉండడం అనేది జరగలేదు. ఆయన స్వంత మనుష్యులు, ఆయన్ను ఎంతగానో ప్రేమించినవారు కూడా ఆయన్ను ద్వేషించి, ఆయనపై దాడులు చేయించి,ఆయన్ను హతమార్చడానికి కూడా ప్రయత్నించారు.

దైవదూత జిబ్రయీల్ అనేకసార్లు ప్రవక్త ముహమ్మద్ వద్దకు వచ్చారు. కొన్ని సందర్భాల్లో దైవదూత తన అసలు రూపమైన దైవదూత రూపంలో కూడా వచ్చారని ప్రవక్త ముహమ్మద్ తెలియజేశారు. కొన్ని సార్లు మానవాకారంలో వచ్చేవారు. కొన్ని సార్లు ప్రవక్త ముహమ్మద్ గంట మోగుతున్న శబ్ధం వంటిది వినేవారు. హఠాత్తుగా దైవవాక్యాలు అవతరించేవి. ఆయన అత్యంత నిశితమైన ఏకాగ్రత చూపవలసి వచ్చేది. ఊపిరిసలపని పరిస్థితికి గురయ్యేవారు. ఈ విధంగా, అంటే గంటలు మోగుతున్నట్లు వచ్చే దైవవాక్యాల అవతరణ ఆయనకు చాలా బాధాకరంగా ఉండేది. అయినా దైవవాక్యాల అవతరణ ముగిసిన పిదప ఆయన ఆ వాక్యాలను ఒక్క అక్షరం పొల్లుపోకుడా పునశ్చరణ చేయగలిగేవారు. దాదాపు 23 సంవత్సరాల కాలం దైవదూత ఆయనకు దైవాదేశాలను చేరవేస్తూ వచ్చారు. వివిధ పరిస్థితుల్లో, వివిధ సందర్భాల్లో ఆయనకు మార్గదర్శనమిచ్చే దైవాదేశాలు ఆయనకు చేరవేస్తూ వచ్చారు. అవే చివరకు దివ్యఖుర్‌ఆన్‌గా క్రోడీకరించబడ్డాయి. దివ్యఖుర్‌ఆన్‌లో దైవవాక్యాలు అవి అవతరించిన క్రమంలో లేవు. వాటిని దైవదూత జిబ్రయీల్ చెప్పిన క్రమంలో ప్రవక్త ముహమ్మద్ క్రోడీకరించారు. ప్రతి సంవత్సరం రమజాను మాసంలో ఆయన దైవదూత జిబ్రయీల్‌కు అప్పటి వరకు అవతరించిన దైవాదేశాలను చదివి వినిపించేవారు. వాటిని దైవదూత జిబ్రయీల్ చెప్పిన క్రమంలో ఉంచేవారు. ఈ విధంగా క్రమం తప్పకుండా దివ్యఖుర్‌ఆన్‌ను ప్రతి సంవత్సరం దైవదూతకు వినిపించడం, నిర్ధారించుకోవడం...ఇలా ఇరవై మూడేళ్ళు జరిగింది. క్రమేణా దివ్యఖుర్‌ఆన్ రూపొందింది.

# ప్రక్షాళన– ప్రార్థన

ఒకసారి ప్రవక్త ముహమ్మద్ మక్కా శివార్లలో నడుస్తున్నప్పుడు దైవదూత జిబ్రయీల్ ఆయన వద్దకు వచ్చారు. మక్కా కన్నా కాస్త ఎత్తయిన ప్రదేశంలో వారిని తీసుకువెళ్ళారు. అక్కడ తన మడమతో కొండరాతిని కొట్టారు. అక్కడ ఒక నీటి ఊట ఉబికి వచ్చింది. దైవదూత అక్కడ ప్రార్థనకు ముందు చేసుకోవలసిన ప్రక్షాళన చేసి చూపించారు. దీన్ని వుజూ అంటారు. ఆ తర్వాత ప్రార్థన చేసే పద్ధతి వివరించారు. నిలబడడం, రుకు అంటే వంగి తలవంచడం, సజ్దా అంటే సాష్టాంగపడడం చూపించారు. ప్రతి భంగిమలోను అల్లాహుఅక్బర్ అంటే...దేవుడు చాలా గొప్పవాడు అని పలకాలని తెలియజేశారు. చివరిగా అస్సలాము అలైకుమ్ అంటే మీకు శాంతి కలుగుగాక అనే పదాలను పలకాలని తెలియజేశారు. ప్రవక్త ముహమ్మద్ ఆయన చెప్పినట్లు చేసి చూపించారు. ఆ పిదప దైవదూత ఆయన్ను వదిలి వెళ్ళారు. ప్రవక్త తన ఇంటికి తిరిగి వెళ్ళారు. తాను నేర్చుకున్నది తన భార్య ఖదీజాకు నేర్పారు. వారిద్దరు కలిసి దేవుని ప్రార్థించారు.

ఈ విధంగా ఇస్లామ్ ధర్మ ప్రార్థనా రీతి ఏర్పడింది. ఖదీజా తర్వాత దీన్ని స్వీకరించినవారు అలీ, జైద్, ప్రవక్త ప్రియమిత్రుడు అబూబక్ర్. ప్రారంభదినాల్లో రోజుకు రెండు సార్లు మాత్రమే ప్రార్థించేవారు. ఉదయం, సాయంత్రం ప్రార్థనలు చేసేవారు. ఆ తర్వాత రోజుకు ఐదుపూటలు ప్రార్థించడం ముస్లిములకు తప్పని సరి విధిగా నిర్దేశించడం జరిగింది.

మక్కా నగరంలో ఎటుచూసినా వ్యతిరేకత అలుముకుంటున్న నేపథ్యంలో ఇస్లామ్ స్వీకరించిన స్త్రీపురుషుల శిక్షణ కొనసాగించారు ప్రవక్త ముహమ్మద్. నిశ్శబ్దంగా ఈ శిక్షణ కొనసాగింది. అర్ధరాత్రులు దైవప్రార్థనల్లో నిమగ్నం కావడం, దివ్యఖుర్ఆన్ వాక్యాలను కంఠస్థం చేయడం జరిగేది. దివ్యఖుర్ఆన్ వాక్యాలు దేవుని కారుణ్యానికి, మనిషి హృదయానికి మధ్య ఒక సంబంధంలాంటివి. ప్రారంభదినాల్లో ఇస్లామ్ స్వీకరించినవారికి లభించిన అత్యంత తీవ్రమైన శిక్షణ ఇది. ధర్మపరాయణత, మృదువైఖరి, నిబద్ధత, దైవకారుణ్యం కోసం ప్రార్థనలు, శాంతి కోసం ప్రార్థనలు, దివ్యఖుర్ఆన్ పారాయణం, చివరి ప్రవక్త ఆచరణలను అనుసరించడం కొనసాగేది. ఇస్లామీయ సందేశంలోని సారం విశ్వప్రభువుతో సన్నిహిత సంబంధం నెలకొల్పడం ద్వారా వ్యక్తమయ్యేది. సృష్టికర్తకు, మనిషికి మధ్య ప్రత్యక్ష సంబంధం ఇది. దేవుడు తన దైవప్రవక్త ద్వారా అత్యున్నతమైన నడవడికి నమూనా చూపించాలనుకున్నాడు. ఈ బోధనలకు సంబంధించిన సారాన్ని మూడు దైవవాక్యాలు స్పష్టంగా ప్రకటించాయి.

"నా దాసులు నన్ను గురించి నిన్ను అడిగితే, నేను వారికి అత్యంత సమీపంలోనే ఉన్నావనీ, పిలిచేవాడు నన్ను పిలిచినప్పుడు నేను అతని పిలుపును వింటాను, సమాధానం పలుకుతాను అనీ, ఓ ప్రవక్తా నీవు వారికి తెలుప"
(దివ్యఖుర్‌ఆన్ 2:186)

ఈ సన్నిహిత సంబంధానికి కేంద్రంగా ప్రవక్త ముహమ్మద్ ఉన్నారు.

"ప్రవక్తా! నీవు ప్రజలకు ఇలా చెప్పు: "మీకు నిజంగానే అల్లాహ్‌పట్ల ప్రేమ ఉంటే నన్ను అనుసరించండి. అప్పుడు అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు. మీ పాపాలను మన్నిస్తాడు" (దివ్యఖుర్‌ఆన్ 3 : 31)

ఆయన ఒక ఆదర్శనమూనాగా నిలిచారు.

"వాస్తవంగానే అల్లాహ్ ప్రవక్తలో మీకు ఒక మంచి ఆదర్శం ఉండినది; అల్లాహ్‌పై, అంతిమ దినంపై ఆశలు పెట్టుకుని అత్యధికంగా అల్లాహ్‌ను స్మరించే ప్రతి వ్యక్తికి."
(దివ్యఖుర్‌ఆన్ 33 : 21)

# 4

# అణిచివేతలు - దౌర్జన్యాలు

దివ్యఖుర్‌ఆన్ మొట్టమొదటి వాక్యం అవతరించిన అనుభవం నుంచి నెమ్మదిగా కోలుకున్న తర్వాత ప్రవక్త ముహమ్మద్ తర్వాత దివ్యఖుర్‌ఆన్ అవతరణలను వరుసగా అందుకోవడం మొదలైంది. తనకు సన్నిహితులైన వారికి ఈ దైవాదేశాలను ఆయన వినిపించేవారు. కాని ప్రజలకు ఈ సందేశాన్ని ఎలా చేరవేయాలన్న విషయమై ఆయనకు ఇంకా ఆదేశాలు రాలేదు. ఈ సందేశానికి తీవ్రమైన వ్యతిరేకత ఎదురవుతుందని ఆయనకు తెలుసు. క్రయిస్తవ సన్యాసి వరకా కూడా ఈ విషయాన్ని ముందుగానే హెచ్చరించాడు.

## బహిరంగ ప్రకటన

మూడేళ్ళ తర్వాత ప్రవక్త ముహమ్మద్ (ఆయనకు శాంతి కలుగుగాక) ఇస్లామీయ సందేశాన్ని బహిరంగంగా ప్రకటించాలన్న దైవాదేశాలు అందాయి.

"నీ దగ్గర బంధువులను హెచ్చరించు" (దివ్యఖుర్‌ఆన్ 26 : 214)

ప్రవక్త ముహమ్మద్ ఈ సందేశాన్ని ముందుగా తన కుటుంబసభ్యులందరికీ, వంశంలోని వారికి తెలియజేయాలని నిర్ణయించుకున్నారు. బంధుత్వ సంబంధాలు ఉన్నవారికి ముందుగా చేరవేయాలనుకున్నారు. అరబ్బు సంప్రదాయాల ప్రకారం ఎవరైనా ఏదైనా ముఖ్యమైన ప్రకటన చేయాలనుకుంటే ఒక కొండ ఎక్కి అక్కడి నుంచి బిగ్గరగా చెప్పేవారు. ఒకరోజు ప్రవక్త ముహమ్మద్ అస్సఫా కొండపైకి ఎక్కారు. వివిధ తెగల నాయకులను ఒక్కొక్కరినీ పేరు పెట్టి పిలిచారు. ఆయన ఏదో అతి ముఖ్యమైన విషయాన్ని చెప్పబోతున్నారని అందరూ అక్కడికి వచ్చారు. వారంత కొండపాదం వద్ద గుమిగూడారు. అక్కడి నుంచి

వారికి కొండకు ఆవల ఏమున్నదో కనబడదు. కాని ప్రవక్త ముహమ్మద్ కొండపై ఉన్నారు. ఆయనకు అటు ఏమున్నదో కూడా కనబడుతుంది.

ప్రవక్త ముహమ్మద్ ఖురైష్ ప్రజలను ఉద్దేశించి బిగ్గరగా "కొండకు ఈ పక్క లోయలో సాయుధ గుర్రపురౌతుల సైన్యం మీపై దాడికి వస్తుందని నేను చెబితే మీరు నమ్ముతారా?" అని ప్రశ్నించారు. అందరూ ఏకగ్రీవంగా మీ మాటలు నమ్ముతాం, మీరెప్పుడు అబద్ధమే చెప్పలేదు, పైగా మీరు ఆ వైపు ఏమున్నదో చూస్తున్నారు అని పలికారు.

అప్పుడు ప్రవక్త వారిని ఉద్దేశించి"నేను మీకు హెచ్చరించడానికి వచ్చాను. రాబోయే ఆపదల గురించి చెప్పడానికి వచ్చాను. నా వాళ్ళందరినీ హెచ్చరించాలని దేవుడు నాకు ఆదేశమిచ్చాడు. మీరు ఒకే ఒక్క దేవుడిని విశ్వసించకపోతే మిమ్మల్ని రక్షించే ఆధికారం నాకు లేదు. ఈ జీవితంలో మీకు శుభం కలిగేలా చేసే అధికారమూ నాకు లేదు." అన్నారు. అంతేకాదు, "నా పరిస్థితి ఎలాంటిదంటే, శత్రు సైన్యాన్ని చూసి తన వారిని హెచ్చరించడానికి పరుగెత్తుకు వచ్చిన వ్యక్తి లాంటిది. జాగ్రత్త..జాగ్రత్త అంటూ పరుగెత్తుకు వచ్చిన వ్యక్తి లాంటిది" అన్నారు.

తక్షణం ప్రతిస్పందించిన వ్యక్తి ప్రవక్త ముహమ్మద్ పినతండ్రి అబూలహబ్, అత్యంత కఠినంగా, వ్యంగ్యంగా ప్రతిస్పందించాడు. "నువ్వు నాశనం అవుగాక, దీనికేనా నువ్వు మమ్మల్ని పిలిచింది?" అంటూ వెనుదిరిగి వెళ్ళిపోయాడు. తనతో పాటు వివిధ తెగల నాయకులను కూడా తీసుకువెళ్ళిపోయాడు. ఆవిధంగా అబూలహబ్ ప్రవక్త సందేశాన్ని తీవ్రంగా వ్యతిరేకించడమే కాదు, ఆయన్ను అడ్డుకోడానికి ఆ తర్వాత కూడా అనేక ప్రయత్నాలు చేశాడు.

ప్రారంభంలో అబూలహబ్, అతడి భార్య, మక్కాలోని ఇతర పెద్దలు ప్రవక్త ముహమ్మద్‌కు లంచమిచ్చి, అధికార ప్రలోభం చూపి ఈ సందేశాన్ని అడ్డుకోవాలనుకున్నారు. ఆయన ఈ సందేశ ప్రచారాన్ని మానుకుంటే ఆయన్ను రాజుగా ప్రకటిస్తామన్న ప్రతిపాదన కూడా చేశారు. ప్రవక్త ఈ ప్రలోభాలకు లొంగలేదు. ఆయన్ను అడ్డుకోడానికి ఇతర మార్గాలు అన్వేషించారు. ఆయనకు దయ్యం ఆవహించిందని ప్రచారం చేశారు. ఆయన పిచ్చివాడయ్యారని ప్రచారం చేసినవారు ఉన్నారు.

ఆ తర్వాత రెండుసార్లు ప్రవక్త ముహమ్మద్ తన వారందరినీ భోజనాలకు పిలిచి సందేశాన్ని వారి ముందు పెట్టారు. మొదటి సందర్భంలో కూడా అబూలహబ్ తీవ్రంగా వ్యతిరేకించడమే కాదు ఇతరులను కూడా ఇస్లామీయ సందేశం పట్ల మొగ్గకుండా అడ్డుకోవడం వల్ల ఆ ప్రయత్నం విఫలమయ్యింది. రెండవసారి మాత్రం ప్రవక్త ముహమ్మద్ ఇస్లామీయ

సందేశ సారాన్ని వచ్చిన అతిథులకు వివరించడంలో సఫలమయ్యారు. చాలా మంది శ్రద్ధగా సందేశాన్ని విన్నారు. కొందరు మనసులోనే దాన్ని మెచ్చుకున్నారు. దాన్ని స్వీకరించారు.

ఆ తర్వాత కూడా ప్రవక్త ముహమ్మద్ తన తెగవారికి ఇస్లామీయ సందేశాన్ని ప్రచారం చేస్తూ వచ్చారు. ఆ పిదప వచ్చిన దైవాదేశాలు ఇక బహిరంగంగా, నిర్ద్వంద్వంగా అందరికీ సత్యాన్ని ప్రకటించాలని పేర్కొన్నాయి.

> "కనుక ప్రవక్తా! నీకు ఆజ్ఞాపించబడుతూ ఉండిన విషయాన్ని బహిరంగంగా ఎలుగెత్తి చాటు. షిర్కు చేసేవారిని ఏమాత్రం లెక్కచేయకు" (దివ్యఖుర్ఆన్ 15 : 94)

ఇప్పుడు ప్రవక్త ఉద్యమం కొత్త దశలో అడుగుపెట్టింది. ఇప్పుడు ప్రవక్త సందేశం కేవలం ఆయన తెగవారికే కాదు అందరికీ ఉద్దేశించి ప్రకటించడం ప్రారంభమయ్యింది. ప్రవక్త చెబుతున్న ఏకదైవారాధన లేదా ఖురైషులు అనుసరించే బహుదైవారాధన ఈ రెంటిలో ఏదో ఒకటి తేల్చుకోవాలని స్పష్టంగా ప్రజల ముందుకు వచ్చింది. విశ్వసనీయులు, నిబద్ధత కలిగిన స్త్రీపురుషులు ప్రవక్త సమూహంలో చేరారు. అందులో కొందరు ఆయన బంధువులు, కాని చాలా మంది వివిధ సామాజిక వర్గాల నుంచి, తెగల నుంచి వచ్చినవారు. వారందరికీ ఆయన మూడేళ్ళుగా ఆధ్యాత్మిక, సామాజిక శిక్షణ ఇస్తూ వచ్చారు. నిబద్ధతతో, సహనంతో ముస్లిములు ఈ వ్యతిరేకతను ఎదుర్కోవలసి ఉంది. వేధింపులను, బహిష్కరణలను చవిచూడవలసి ఉంది. మక్కాలో సమాజం చీలిపోవడం ప్రారంభమయ్యింది.

## ప్రతిపాదనలు - డిమాండులు

ఇస్లామీయ సందేశప్రచారం ఇప్పుడు బహిరంగంగా కొనసాగడం మొదలైంది. కొత్తగా ఇస్లామ్ స్వీకరించిన వారు అల్ అర్ఖామ్ ఇంట పొందిన శిక్షణ సున్నితమైనదే అయినప్పటికీ వారు ఇస్లామీయ సందేశం గురించి తమ బంధువులతోను, తమకు సన్నిహితులతోను మాట్లాడడం కొనసాగించారు. ఖురైషు పెద్దలకు ఇస్లామీయ సందేశం వల్ల ఎదురయ్యే ప్రమాదమేమిటో నానాటికి స్పష్టంగా కనబడసాగింది. వారి దేవతలు, వారి ఆచారవ్యవహారాలపై ఇది ప్రత్యక్షదాడి. చివరకు ఇది తెగల నాయకుల అధికారానికి గండికొట్టవచ్చు. ఇస్లామ్ కనుక వ్యాపిస్తే తెగల ప్రజలు కాబా దర్శనానికి రావడం ఆగిపోవచ్చు. విగ్రహాలను దర్శించడానికి రాకపోవచ్చు. కాబా సంరక్షకులుగా వారికి లభిస్తున్న గౌరవహోదాలన్నీ అంతరించే అవకాశం ఉంది. అంతేకాదు మక్కా ఆర్థిక వ్యవస్థ మొత్తం ఈ విగ్రహాలపైనే ఆధారపడి ఉంది. చుట్టుపక్కల ఉన్న తెగలన్నీ అక్కడికి వచ్చి విగ్రహాలకు నైవేద్యాలు సమర్పిస్తారు. ఈ

యాత్రలతో పాటు వాణిజ్యం కూడా అక్కడ అభివృద్ధి చెందింది. దీని వల్ల మక్కా వారికి ఆదాయమార్గాలు తెరుచుకున్నాయి. ఈ వ్యాపారాలు తప్ప మక్కా వారికి మరో జీవనోపాధి లేదు.

ఖురైష్ నాయకులు మొదట ఒక బృందాన్ని ప్రవక్త ముహమ్మద్ పినతండ్రి అబూతాలిబ్ వద్దకు పంపాలని నిర్ణయించుకున్నారు. ప్రవక్త ముహమ్మద్ ఆయన సంరక్షణలో ఉన్నారు. ప్రవక్త ముహమ్మద్‌తో మాట్లాడి ఈ సందేశప్రచారాన్ని ఆపేలా ఒత్తిడి చేయాలని, ఈ సందేశం ప్రత్యక్షంగా తమ విగ్రహాలపై దాడి చేస్తోందని, తమ తాతముత్తాతల ఆచారవ్యవహారాలపై దాడి చేస్తోందని, అందువల్ల ఇస్లామీయ సందేశాన్ని చాలా ప్రమాదకరమైనదిగా భావిస్తున్నామని ఆయనకు చెప్పారు. కాని అబూతాలిబ్ వారి మాటలు విని కూడా ఏమీ చర్య తీసుకోలేదు. ప్రవక్త తో మాట్లాడనూ లేదు. వారు మళ్ళీ ఆయన వద్దకు వచ్చి, ఇది చాలా ముఖ్యమైన విషయమని ఒత్తిడి తెచ్చారు. అబూతాలిబ్ అప్పుడు ప్రవక్త ముహమ్మద్‌ను పిలిచి ఈ ఇస్లామీయ సందేశం మానుకోవచ్చుగా, దీనివల్ల నాపై ఒత్తిడి పెరుగుతోంది అని నచ్చచెప్పడానికి ప్రయత్నించారు.

ప్రవక్త ముహమ్మద్ ఆయనకు ఖచ్చితమైన జవాబిచ్చారు. "చిన్నాన్నా...నేను ఒకేఒక్క దేవుడు అల్లాహ్‌పై ప్రమాణం చేసి చెబుతున్నాను. వారు కుడిచేతిలో సూర్యుడిని, ఎడమచేతిలో చంద్రుడిని తీసుకొచ్చి పెట్టి ఈ సందేశం మానుకోవాలని కోరినా, నేను మానను. దేవుడు ఈ సందేశానికి విజయం ప్రసాదించేవరకు, లేదా నేను ఈ దారిలో అంతమయ్యేవరకు మానేది లేదు." అన్నారు. ప్రవక్త ముహమ్మద్ దృఢచిత్తం చూసిన అబూతాలిబ్ మరి మాట్లాడలేదు. తాను ఉన్నంత కాలం మద్దతుగా ఉంటానని హామీ ఇచ్చారు.

ఆ తర్వాత ఖురైషు నాయకుల వద్ద నుంచి మరో బృందం ప్రవక్త ముహమ్మద్ వద్దకు వచ్చి ఆయనకు వస్తు, సంపద, అధికారాల ప్రలోభం చూపించే ప్రయత్నం చేసింది. వారి ప్రతిపాదనలన్నింటినీ ఆయన ఒకదాని తర్వాత ఒకటిగా తిరస్కరించారు. కేవలం ఇస్లామీయ సందేశ వ్యాప్తి మాత్రమే తన లక్ష్యమని నిక్కచ్చిగా చెప్పారు. ఒకేఒక్క దేవుని ఆరాధనకు ప్రజలను పిలవడం మాత్రమే తన లక్ష్యమని దానికోసం ఎలాంటి త్యాగానికైనా సిద్ధమని తేల్చి చెప్పారు.

"నాకు ఈ కోరికలేవీ లేవు. అధికారం, గౌరవహోదాలు పొందాలన్న ఆకాంక్షా లేదు. మీ వద్దకు దేవుడు నన్ను తన ప్రవక్తగా పంపించాడు. ఆయన నాకు ఒక గ్రంథాన్ని ప్రసాదించాడు. మీకు శుభవార్తలు తెలియజేయమన్నాడు. వచ్చే ఆపద గురించి హెచ్చరించమన్నాడు. నేను నా ప్రభువు సందేశాన్ని మీకు చేరవేశాను. మీకు మంచి సలహా

ఇచ్చాను. దీన్ని మీరు స్వీకరిస్తే మీరు ఇహపరలోకాల్లో సాఫల్యాన్ని పొందుతారు. కాని ఈ సందేశాన్ని తిరస్కరిస్తే దేవుడు మన మధ్య తీర్పు చెప్పేవరకు నేను సహనంతో వేచి ఉంటాను.” అని స్పష్టంగా చెప్పేశారు.

ఈ మాటల ద్వారా ప్రవక్త ముహమ్మద్ రాజీ ప్రయత్నాలకు హద్దులను కూడా నిర్దేశించారు. ఇస్లామీయ సందేశ ప్రచారాన్ని ఆయన ఆపేది లేదు. ఆయన కేవలం దేవుని మాత్రమే నమ్ముకున్నారు. దాని వల్ల ప్రపంచంలో ఎదురయ్యే పరిణామాలన్నింటిని సహనంతో ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నారు. ఇక శత్రుత్వాలు, వైరాలు మొదలయ్యాయి. తెగల నాయకులు ఆయన్ను అవమానించడం, పరాభవించడం ప్రారంభించారు. ఆయన్ను పిచ్చివాడన్నారు. దయ్యం ఆవహించిందని, జ్యోతిష్యుడని, మంత్రగాడని అపవాదులు వేశారు.

## ఖురైషుల చర్యలు

ప్రవక్త ముహమ్మద్‌ను అవమానించడం, పరిహసించడం, అపహసించడం కొనసాగింది. మక్కా ప్రజలు ఆయన్ను మహిమలు చూపించాలని, దైవప్రవక్తగా ఆధారాలు చూపించాలని ఏవేవో కోరికలు కోరేవారు. ప్రవక్త వారికి అలుపెరుగకుండా దివ్యఖుర్‌ఆన్ వాక్యాలను ఉటంకిస్తూ తాను కేవలం ప్రవక్త మాత్రమేనని చెప్పేవారు. ఒత్తిళ్ళు పెరగసాగాయి. హింసాత్మక వ్యతిరేకతలు ప్రారంభమయ్యాయి.

- ఖురైషు నాయకులు నిస్సహాయ, నిరుపేద ముస్లిములను, ముఖ్యంగా ఏ తెగ సంరక్షణలో లేని ముస్లిములపై దాడులు చేయడం ప్రారంభించారు. బిలాల్ ఒక నిగ్రో బానిస, ఆయన్ను యజమాని ఎడారిలో మండుటెండలో ఒక రాతికి కట్టేశాడు. ఒక పెద్ద బండరాయిని ఆయన కడుపుపై పెట్టాడు. ఇస్లామ్‌ను వదలకపోతే చిత్రహింసలు తప్పవని హెచ్చరించాడు. కాని బిలాల్ మాత్రం తన వైఖరి మార్చుకోలేదు. దేవుడొక్కడే..దేవుడొక్కడే అని చెప్పడం ఆపలేదు. అబూబక్ర్ ఆ తర్వాత బిలాల్‌ను కొనుగోలు చేశారు. ఆయన బిలాల్‌కు స్వేచ్ఛనిచ్చారు. ఈ విధంగా అబూబక్ర్ అనేకమంది బానిసలను కొని స్వేచ్ఛ ఇచ్చేవారు. ఆ తర్వాత బిలాల్ మదీనాలో ప్రార్థనలకు పిలుపునిచ్చే గౌరవప్రదమైన ముఅజ్జన్‌గా మారారు. ఆయన విశ్వాసశక్తిని అందరూ గౌరవించేవారు. ఆయన స్వరం చాలా మృదుమధురంగా ఉండేది. అందుకే ఆయన అజాన్ పలికేవారు.

- సరికొత్తగా ప్రారంభమైన వేధింపుల్లో ఇస్లామ్ శత్రువు అబూలహబ్ చాలా చురుగ్గా పాల్గొన్నాడు. ప్రవక్తను నష్టపరచడానికి, ఆయనకు హాని కలిగించడానిక అనేక ప్రయత్నాలు చేశాడు. ప్రవక్తపై రాళ్ళు విసరడం, తన కుమారులతో ప్రవక్త కుమార్తెలకు బలవంతంగా

విడాకులు ఇప్పించడం, ప్రవక్త రెండవ కుమారుడు చనిపోయినప్పుడు పండగచేసుకుంటూ, ప్రవక్తకు ఇక వంశం మిగల్లేదని ఎగతాళి చేయడం వంటి చేష్టలకు పాల్పడేవాడు. అబ్దుల్లా కుమారుడు తారిక్ ప్రకారం అబూలహబ్ కేవలం మాటలతో ఎగతాళి చేయడం, దూషించడం మాత్రమే కాదు, ప్రవక్తపై రాళ్ళు విసిరి రక్తం కారేలా కూడా చేసేవాడు.

- అబూలహబ్ భార్యపేరు ఉమ్మె జమీల్. ఆమె కూడా అత్యంత క్రూరంగా ప్రవక్తను వ్యతిరేకించింది. తన భర్త కన్నా తాను తక్కువ కాదని నిరూపించుకుంది. ఆయన్ను గాయపరచడానికి ఆయన నడిచేదారిలో ముళ్ళు పరిచేది. ఖర్జూరపు ఆకుల నారతో తాళ్ళు పేని ముళ్ళను వాటికి కట్టి ఆయన దారిలో పరిచేది.

ఆమె చాలా చెడుస్వభావం కలిగిన మహిళ. నోట దుర్భాషలుండేవి. కుట్రలు కుతంత్రాలకు పెట్టింది పేరు. విద్వేషాన్ని రెచ్చగొట్టేది. ఆమెను దివ్యఖుర్ఆన్ తీవ్రంగా అభిశంసించింది.

- ఒకరోజు ప్రవక్త ముహమ్మద్ కాబాగృహంలో ప్రార్థనలు చేస్తున్నారు. అక్కడ ఇస్లామ్ శత్రువుల్లో ప్రముఖుడైన అబూజహల్ కొందరు మిత్రులతో కూర్చుని ఉన్నాడు. వారిలో ఒకడు "మీలో ఎవరైనా ఒంటె ప్రేవులను తీసుకొచ్చి ముహమ్మద్ సాష్టాంగపడినప్పుడు ఆయన వీపున పెట్టగలరా?" అన్నాడు. వారందరిలోను అత్యంత నికృష్టుడు ఉక్బా వెంటనే లేచి ఒంటె ప్రేవులను తీసుకొచ్చాడు. ప్రవక్త సాష్టాంగపడే వరకు కాచుకుని కూర్చున్నాడు. ఆయన సాష్టాంగపడగానే ఆయన వీపుపై పెట్టాడు.

ఆ తర్వాత వాళ్ళంతా విరగబడి నవ్వడం ప్రారంభించారు. ప్రవక్త సజ్దాలో ఉన్నారు. ఆయన వీపుపై బరువు వల్ల లేవలేకపోయారు. చివరకు ఆయన కుమార్తె ఫాతిమా వచ్చి వాటిని తొలగించేవరకు ఆయన అలాగే ఉన్నారు.

- ఒకసారి ప్రవక్త ముహమ్మద కాబాగృహంలో ప్రార్థన చేస్తున్నప్పుడు ఈ శత్రుమూక ఆయన్ను చుట్టుముట్టింది. ఉక్బా తన వస్త్రాన్ని తీసి ప్రవక్త మెడకు చుట్టేసి ఊపిరాడకుండా చేశాడు. ఎవరో అది చూసి అబూబక్ర్‌ని గట్టిగా అరిచి పిలిచారు. "చూడు..మీ ప్రవక్తను చూడు" అన్నారు. అబూబక్ర్ అక్కడికి వచ్చి ఉక్బా భుజాన్ని పట్టుకుని వెనక్కి తోశారు. "నా ప్రభువు ఒక్క అల్లాహ్ మాత్రమే అన్నందుకు మనిషిని చంపుతావా" అని నిలదీశారు.

- ఒకసారి ఉక్బా గర్వంగా ప్రవక్త వద్దకు వచ్చి నేను ఈ సందేశాన్ని విశ్వసించడం లేదు. నేను ఖుర్ఆన్‌ను విశ్వసించడం లేదు. అంటూ మీదికి వచ్చి ఆయన చొక్క పట్టుకుని చింపేశాడు. ఆయనపై ఉమ్మడానికి ప్రయత్నించాడు.

- ఇస్లామ్ ప్రధాన శత్రువుల్లో ఒకడైన అబూజహల్ తన వారితో కలిసి కుట్రకు పూనుకున్నాడు. "ఖురైష్ ప్రజలారా! ముహమ్మద్ మన మతంలో తప్పులు వెదికే పని మానుకునేలా లేదు.

మన తాతముత్తాతలను అవమానిస్తున్నాడు. మన జీవనమార్గాన్ని కాదంటున్నాడు. నేను మన దేవుళ్ళ సాక్షిగా చెబుతున్నాను, ముహమ్మద్ సమస్య మీకు లేకుండా చేయడానికి అతను సాష్టాంగపడుతున్నప్పుడు పెద్ద బండరాయి ఆయన తలపై పారేయాలనుకుంటున్నాను. ఆయన తెగ ఏం చేస్తుందన్న విషయమై నేనేం భయపడడం లేదు" అన్నాడు. దురదృష్టవశాత్తు అక్కడ గుమిగూడిన వారందరూ అతని లాంటి వారే. అతడిని మరింత రెచ్చగొట్టారు. అలాగే చేయమన్నారు.

మర్నాడు అబూజహల్ ప్రవక్త కోసం కాబాగృహంలో కాచుకుని కూర్చున్నాడు. ఖురైషు నేతలు తమ సమావేశ మందిరంలో ఈ వార్త వినడానికి కూర్చుని ఉన్నారు.

ప్రవక్త ప్రార్ధనలో సాష్టాంగపడినప్పుడు అబూజహల్ ఒక పెద్ద బండరాయి తీసుకుని ముందుకు వచ్చాడు. తన దుర్మార్గపు ఆలోచన అమలు చేయడానికి అడుగు ముందుకు వేశాడు. కాని ప్రవక్తను సమీపించిన వెంటనే వెనక్కి తిరిగాడు, ముఖం పాలిపోయింది. బండరాయి జారిపోయింది. గజగజవణకసాగాడు. అతడిని చూస్తున్న వాళ్ళు పరుగెత్తుకు వచ్చారు. ఏమైందని ప్రశ్నించారు. అతడు జవాబిస్తూ "నేను ఆయన వద్దకు వెళ్ళినప్పుడు ఒక ఒంటె, అసాధారణమైన రూపంతో, భయంకరమైన పళ్ళతో నన్ను అడ్డుకోవడమే కాదు, నన్ను తినేయడానికి ముందుకు వచ్చింది." అన్నాడు. ఈ విషయమై ప్రవక్త వ్యాఖ్యలను ఇబ్నే ఇష్క్ ఇలా చెప్పారు : "అలా కనిపించింది జిబ్రయీల్ దూత. అబూజహల్ మరికాస్త దగ్గరకు వచ్చి ఉన్నట్లయితే దైవదూత అతడిని హతమార్చి ఉండేవాడు"

## మీడియా వక్రప్రచారాలు

## భావప్రకటనాస్వేచ్ఛ దుర్వినియోగం

ప్రవక్త ముహమ్మద్ కాలంలో నేటి మాదిరిగా సాంకేతిక శాస్త్రం అభివృద్ధి చెందలేదు. నిజం చెప్పాలంటే అస్సలు సాంకేతికశాస్త్ర ప్రగతి అనేది లేదు. అప్పట్లో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా అనేది లేదు. కాని ఇలాంటి మీడియా లేకపోయినా ప్రవక్త ముహమ్మద్‌పై వక్రప్రచారాలు, విషప్రచారాలు కొనసాగాయి. ఇస్లామ్‌పై విద్వేష ప్రచారాలు కొనసాగాయి. మక్కాలో కవులకు కొరతలేదు. ప్రవక్త ముహమ్మద్‌ను, ఇస్లామ్‌ను కించపరుస్తూ కవితలు రాసి గానం చేసేవారు. అవి నిజానికి కవితలు కాదు, ప్రవక్త ముహమ్మద్‌ను దూషించే దుర్భాషలు మాత్రమే.

ప్రవక్తను అప్రతిష్టపాలు చేయడానికి కవితలు రాసిన ఈ కవుల పేర్లు కూడా మనకు చరిత్రలో కనబడతాయి. జుహైర్ కొడుకు కాబ్, తలాతిల్ కొడుకు హరిసా, అబీవహాబ్ కొడుకు హుబైరా, నఫీదా కొడుకు హువైరిస్, హంజాల్ కొడుకు అబ్దుల్లా ఇలాంటివారిలో

కొందరు. తమ రచనాసామర్థ్యాన్ని ఆధ్యాత్మిక వికాసానికి వినియోగించే బదులు వీరు ప్రవక్తను అప్రతిష్ఠపాలు చేయడానికి ఉపయోగించారు.

ఖురైషు పెద్దలు ఇలాంటి కవిసమ్మేళనాలు ఏర్పాటు చేసేవారు. అక్కడ ఇస్లామ్‌కు వ్యతిరేకంగా ప్రవక్తకు వ్యతిరేకంగా కవితా గానాలు జరిగేవి. కేవలం కవితాగానాలు కాదు నృత్యాలు కూడా జరిగేవి. ప్రవక్తకు, ఇస్లామ్‌కు వ్యతిరేకంగా రాసిన కవితలను పాడుతున్నప్పుడు అబ్దుల్లా వద్ద బానిస స్త్రీ ఖర్తానా, ఇక్రమా వద్ద బానిస స్త్రీ సారాలు నాట్యం చేసేవారు. ఖురైషుల మద్యపాన సమావేశాల్లో ఇది సర్వసాధారణంగా జరిగే తంతుగా మారింది. ఈ దుర్భాషలతో కూడిన కవితలు ప్రవక్తను, ఆయన అనుచరులను తీవ్రంగా బాధించేవి. ఇది మానసికమైన హింసగా మారింది.

దివ్యఖుర్ఆన్ చెప్పినట్లు "ప్రతి కష్టం తర్వాత ఒక సదుపాయం ఉంటుంది". ప్రవక్తకు గొప్ప ఊరటగా కొన్ని సంవత్సరాల తర్వాత ఈ సమూహంలో గొప్ప కవులుగా పేరున్న కాబ్, హసన్‌లు స్వయంగా ఇస్లామ్ స్వీకరించారు. ముఖ్యంగా కవి హసన్ ఇస్లామ్ స్వీకరిస్తున్నట్లు చేసిన ప్రకటన ప్రవక్త ముహమ్మద్‌కు అత్యంత సంతోషకరమైన సంఘటనైంది.

ఇస్లామ్ శత్రువులు రాస్తున్న దుర్భాషల కవితలకు జవాబుగా కవితలు రాయాలని ప్రవక్త ముహమ్మద్ కవి హసన్‌ను ప్రోత్సహించారు. ప్రవక్త తాను ప్రసంగించే మింబర్ (ప్రసంగస్థానం) నుంచి కవి హసన్ తన కవితలు వినిపించే అనుమతి కూడా ఇచ్చారు. ఇస్లామీయ విలువలు, సూత్రాలను ప్రతిబింబిస్తూ ఆయన కవితలు రాశారు. ప్రవక్త ఈ కవితలపై స్పందిస్తూ ఒక కవి రాసిన పంక్తులు శత్రువును ఎదుర్కోడానికి కత్తులకన్నా ప్రభావవంతమైనవని" అన్నారు. అంతేకాదు మరోసందర్భంలో ఆయన మాట్లాడుతూ "ఒక ముస్లిమ్ తన కత్తితోను, కలంతోను జిహాద్ చేస్తాడని" చెప్పారు. ఈ విధంగా ఇస్లామ్ వ్యతిరేక, ప్రవక్త వ్యతిరేక కవులకు జవాబీయడం జరిగింది.

నేడు కూడా పరిస్థితి ఇలాగే ఉంది. ప్రపంచంలో విషప్రచారం చేయాలనుకునేవారు, మేధావులుగా, రచయితలుగా, కళాకారులుగా పేరొందినవారు కూడా తమ భావప్రకటనా స్వేచ్ఛను దుర్వినియోగపరచడం చూస్తున్నాము. ప్రవక్త ముహమ్మద్‌ను, ఇస్లామ్‌ను, ముస్లిములను అప్రతిష్ఠపాలు చేసేలా, కించపరిచేలా కార్టూన్లు, రచనలు చేస్తున్నారు. నేటి ఆధునిక ప్రపంచంలో కేవలం ఒకే ఒకవిధమైన భావప్రకటనకు పూర్తి స్వేచ్ఛ ఉన్నట్లు కనబడుతోంది. అదేమంటే ముస్లిములను, ఇస్లామ్‌ను హింసాత్మకంగా, మధ్యయుగాలమతంగా, అజ్ఞానంగా ప్రచారం చేయడానికి మాత్రమే ఇది ఉపయోగపడుతున్నట్లు కనబడుతుంది.

దివ్యఖుర్ఆన్ ఇలాంటి వ్యవహారాల్లో ఇచ్చిన సలహా ఏమంటే, అప్రతిష్ఠపాలు

చేయాలనిచూసేవారిని పట్టించుకోరాదు. తమ కల్పనల్లో, సినిమాల్లో, టెలివిజన్ కార్యక్రమాల్లో, ఇస్లామ్‌ను, ప్రవక్తను కించపరుస్తూ, వక్రప్రచారానికి పాల్పడే వారిని పట్టించుకోవలసిన అవసరం లేదు.

ఇక మతనింద లేదా బ్లాస్ఫమీ విషయానికి వస్తే, లేదా అనుచిత విమర్శల విషయానికి వస్తే దివ్యఖుర్ఆన్ సహనం వహించాలని ఆదేశిస్తుంది. అనవసరంగా ప్రతిస్పందించవద్దని వారిస్తుంది.

> "ప్రవక్తా! ఒకవేళ పుడమిపై నివసించే ప్రజలలో అధికసంఖ్యాకులు చెప్పినట్లుగా నీవు నడిస్తే, వారు నిన్ను అల్లాహ్ మార్గం నుండి తొలగిస్తారు. వారు కేవలం అంచనాలను అనుసరిస్తారు. ఊహాకల్పనలు చేస్తారు." (దివ్యఖుర్ఆన్ 6 : 116)

## మంత్రగాడు

మక్కా ఖురైషులు ప్రవక్త ముహమ్మద్‌ను కించపరుస్త, ఎగతాళి చేయడమే కాదు, ఇతరులను కూడా అలా చేయాలని ప్రోత్సహించేవారు. ఆయన్ను పరాభవించడానికి ప్రయత్నించేవారు. ఎలాంటి అధికారం లేని వ్యక్తిని దేవుడు ప్రవక్తగా ఎలా ఎన్నుకున్నాడని, మామూలు జనం మాదిరిగానే, ప్రత్యేకంగా ప్రవక్త అని సూచించే చిహ్నాలేవీ లేకుండా బజారుకు వెళ్ళే వ్యక్తి ప్రవక్త ఎలా అయ్యాడని ప్రశ్నించేవారు. ఆయన సందేశాన్ని, ఆయన్ను ఎగతాళి చేసేవారు.

అంతేకాదు ప్రవక్త ఒక మంత్రగాడు లేదా ఒక జ్యోతిష్యుడన్న పుకారు పుట్టించారు. ఆయన కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తాడని, పిల్లలను తల్లిదండ్రులకు దూరం చేస్తాడని, భార్యాభర్తలను విడదీస్తాడని, ఆయన చాలా సమస్యలకు మూలమని ప్రచారం మొదలు పెట్టారు.

## దేవుడు తాను తలచుకున్నవారికి మార్గం చూపిస్తాడు

మక్కాలో వార్షిక సంత జరిగే సమయం సమీపిస్తున్నప్పుడు మక్కా ఖురైషులకు ఒక భయం పట్టుకుంది. సంతకు వచ్చే వివిధ ప్రాంతాల వారికి ప్రవక్త ముహమ్మద్ తన సందేశం ప్రచారం చేస్తారనరి అనుకున్నారు. అందువల్ల మక్కా ప్రవేశ మార్గాల వద్ద మనుష్యులను ఉంచారు. మక్కాకు వచ్చేవారికి ముందస్తు జాగ్రత్తలు ఈ మనుష్యులు చెప్పేవారు. ముహమ్మద్ చెప్పే మాటలు వినవద్దు, ఆయన సందేశాన్ని వినవద్దు. ఆయన్ను కలవద్దని చెప్పేవారు.

ఖురైషుల ఈ వ్యూహం చాలా వరకు ఫలించింది. మక్కాకు వచ్చిన వారిలో చాలా

మంది ఈ జాగ్రత్తలు పాటించారు. కాని కొందరు ఎవరి ప్రభావానికి గురికాని బలమైన వ్యక్తిత్వం ఉన్నవారు కూడా ఉంటారు. అలాంటి వారు ఈ జాగ్రత్తలను లక్ష్యపెట్టలేదు. అలాంటి వారిలో బనూ గిఫార్ తెగకు చెందిన అబూజర్ ఒకరు. ఆయన తెగ నిజానికి దోపిడీ వృత్తిగా జీవించే తెగ. ఆయన ఈ కొత్త సందేశం గురించి విన్నాడు. ఒకే దేవుడిని విశ్వసించాలన్న ఈ సందేశం ఆయనకు నచ్చింది. అబూజర్ తిన్నగా ప్రవక్త ముహమ్మద్ వద్దకు వచ్చారు. ఖురైషుల జాగ్రత్తలను ఆయన లక్ష్యపెట్టలేదు. ప్రవక్తను వెదుక్కుంటూ వచ్చారు. ప్రవక్త కాబా దగ్గర నీడలో సేదదీరుతూ కనిపించారు. ఆయన ప్రవక్తను పిలిచి ఆయన సందేశం గురించి అడిగి తెలుసుకున్నాడు. ఆ వెంటనే తాను కూడా ఇస్లామ్ స్వీకరిస్తున్నట్లు ప్రకటించారు. ప్రవక్త కాస్త ఆశ్చర్యపోయారు. “దేవుడు తాను తలచుకున్నవారికి దారి చూపిస్తాడని” వ్యాఖ్యానించారు. అబూజర్ గిఫ్ఫారి ఆ తర్వాత ప్రవక్త సన్నిహిత అనుచరుడిగా మారారు. నిబద్ధతకు, కఠినపరిశ్రమకు మారుపేరుగా నిలిచారు.

## ఇస్లామ్‌లో మొదటి అమరులు

అమ్మార్ ఒక యువకుడు. ఎమన్‌కు చెందిన వాడు. ఇస్లామ్ సందేశం ప్రారంభంలోనే స్వీకరించాడు. అల్ అర్ఖామ్ ఇంట ప్రవక్త వద్ద ఇస్లామ్ శిక్షణ పొందాడు. ఆయన ఇస్లామ్ స్వీకరించిన తర్వాత ఆయన తండ్రి యాసిర్, తల్లి సుమయ్యా కూడా ఇస్లామ్ స్వీకరించారు. వారు ఇస్లామీయ బోధనలను నిబద్ధతతో నేర్చుకోవడం ప్రారంభించారు. ఇస్లామ్ శత్రువు అబూజహల్ తన వైరానికి వారిని లక్ష్యంగా చేసుకున్నాడు. వారిని చావగొట్టడం, ఎండలో కట్టేసి చిత్రహింసలు పెట్టడం ప్రారంభించాడు. ఇది కొన్ని వారాలు కొనసాగింది. ఎన్ని చిత్రహింసలు పెట్టినా యాసర్, సుమయ్యాలు తమ విశ్వాసాన్ని వదులుకోడానికి సిద్ధపడలేదు. సుమయ్య తీవ్రంగా అబూజహల్ పిరికి చేష్టలను విమర్శించారు. ఆగ్రహంతో ఊగిపోయిన అబూజహల్ ఆమెను పొడిచి చంపాడు. అదే కోపంతో ఆమె భర్తను కూడా కొట్టి కొట్టి చంపాడు. ఇస్లామ్ కోసం ప్రాణాలు విడిచిన మొదటి వారు ఈ ఇద్దరు భార్యాభర్తలు. ఒకే ఒక దేవుడిని విశ్వసించినందుకు, ఆ విశ్వాసానికి కట్టుబడినందుకు, దివ్యఖుర్‌ఆన్ సందేశాన్ని సత్యమని నమ్మినందుకు చిత్రహింసలపాలయి ప్రాణాలు విడిచారు.

మక్కాలో పరిస్థితి ముస్లిములకు భరించరానిదయ్యింది. ముఖ్యంగా సామాజికంగా బడుగువర్గాలకు చెందిన ముస్లిములకు, ఏ తెగతోను సంబంధాలు లేనివారికి ఇది మరింత విషమ సమస్యగా మారింది. ప్రవక్త ముహమ్మద్‌కు ఆయన పినతండ్రి అబూతాలిబ్, హంజాల సంరక్షణ ఉంది. కాని ఈ సంరక్షణ ఆయన్ను అనుసరించే ముస్లిములందరికీ వర్తించదు. పైగా పరాభవాలు, అనుచిత వ్యవహారశైలి, చిత్రహింసలు నిత్యకృత్యాలయ్యాయి.

# 5

# సామాజిక, మానసిక విప్లవం

ఖురైషుల వ్యతిరేకత కేవలం ఒక వ్యక్తికి, ఒక సందేశానికి సంబంధించినది కాదు. నిజానికి దైవప్రవక్తలందరూ ఇలాంటి వ్యతిరేకతనే ఎదుర్కున్నారు. ఇలాంటి ద్వేషాన్నే తమ జాతి ప్రజల నుంచి ఎదుర్కోవలసి వచ్చింది. ఎందుకంటే దైవప్రవక్తల సందేశం సమాజంలో పెనుమార్పులు తీసుకొచ్చే సందేశం.

వివిధ కాలాల్లో ప్రవక్తలకు ఎదురైన అనుభవాలను దివ్యఖుర్ఆన్ ప్రస్తావించింది. ప్రవక్తలు తమ జాతి వద్దకు దైవసందేశంతో వచ్చినప్పుడు వారు ఎలాంటి పరిస్థితిని ఎదుర్కోవలసి వచ్చిందో దివ్యఖుర్ఆన్ పేర్కొంది. మొదట ఏ జాతి మార్పును ఇష్టపడలేదు. తిరస్కరించింది. తమ అధికారానికి ప్రమాదం తలెత్తుతుందన్న భయంతో వ్యవహరించారు. ప్రవక్త మూసా, ప్రవక్త హారూన్‌లకు ఇలాంటి పరిస్థితే ఎదురయ్యింది.

> "మా పూర్వీకులు నడిచిన మార్గం నుండి మమ్మల్ని మళ్లించటానికా నీవు వచ్చినది! మీ ఇద్దరి పెద్దరికాన్ని భువిలో స్థాపించటానికా నీవు వచ్చినది? నీ మాటను మేము విశ్వసించము." (దివ్యఖుర్ఆన్ 10 : 78)

ప్రవక్త ముహమ్మద్ ప్రజలను విగ్రహారాధన వదులుకొమ్మని పిలుపునిచ్చారు. ఒకే ఒక దేవుడిని విశ్వసించాలని చెప్పారు. మరణానంతర జీవితాన్ని నమ్మాలని అన్నారు. నీతినియమాలు, నైతిక ప్రమాణాలు పాటించాలని బోధించారు. ఆయన ఒక సామాజిక, మానసిక విప్లవానికి పూనుకున్నారు. ఆయన సందేశం పరలోకజీవిత సాఫల్యం గురించినది. కాని ప్రాపంచిక అధికారాలను తునాతునకలు చేస్తోంది.

ఒకే దేవుడిని విశ్వసించడం, మరణానంతర జీవితం, నైతిక ప్రమాణాలకు కట్టుబడడం ఇవి కొత్తగా ఇస్లామ్ స్వీకరించిన వారికి ఆధ్యాత్మిక, మానసిక, సామాజిక స్వేచ్ఛకు చిహ్నాలుగా కనిపించాయి. ఒకే ఒక్క దేవుడిని విశ్వసించడమంటే దాని ప్రభావమేమిటో ఖురైషులకు బాగా తెలుసు. దాని వల్ల సమాజంలో పెనుమార్పు రాబోతోంది.

> "ఇలా చెప్పెయ్యి, ఆయన అల్లాహ్, అద్వితీయుడు. అల్లాహ్ నిరపేక్షాపరుడు ఎవరి ఆధారమూ, ఎవరి అక్కరా లేనివాడు; అందరూ ఆయనపై ఆధారపడేవారే. ఆయనకు సంతానం ఎవరూ లేరు. ఆయన కూడా ఎవరి సంతానమూ కాదు. ఆయనకు సరిసమానులు ఎవరూ లేరు." (దివ్యఖుర్ఆన్ 112)

దివ్యఖుర్ఆన్‌లోని ఈ క్రింది మరింత స్పష్టంగా ఈ విషయాన్ని వివరించింది.

> "ఇలా ప్రకటించు, ఓ అవిశ్వాసులారా! మీరు ఆరాధించేవాటిని నేను ఆరాధించను. అలాగే నేను ఆరాధించే ఆయన్ని మీరు ఆరాధించరు. మీరు ఆరాధిస్తున్న వాటిని నేను ఆరాధించేవాణ్ణి కాను. అలానే నేను ఆరాధించే ఆయన్ని మీరు ఆరాధించేవారు కారు. మీ ధర్మం మీదే, నా ధర్మం నాదే. " (దివ్యఖుర్ఆన్ 109)

పైన పేర్కొన్న దివ్యఖుర్ఆన్ అధ్యాయం అవతరించిన నేపథ్యం కూడా గమనించదగింది. కొందరు ఖురైష్ నాయకులు తమ తాతముత్తాతల బహుదైవారాధక విశ్వాసానికి, ప్రవక్త పేర్కొనే ఏకదైవారాధక విశ్వాసానికి మధ్యస్థంగా ఒక రాజీ ఏర్పాటు కోసం మాట్లాడినప్పుడు ఈ అధ్యాయం అవతరించింది. ఈ అధ్యాయం స్పష్టంగా ప్రకటించింది. ఈ రెంటికి మధ్య స్పష్టమైన భేదాన్ని తేల్చి చెప్పింది.

## మూడు ప్రశ్నలు

ప్రవక్త ముహమ్మద్ సందేశాన్ని ఎలా అడ్డుకోవాలో తెలియని స్థితికి ఖురైషులు చేరుకున్నారు. చివరకు వారు ఒక బృందాన్ని మదీనా పంపాలని నిర్ణయించారు. అక్కడ యూద పెద్దలతో మాట్లాడి ఈ కొత్త సందేశం స్వభావాన్ని, సత్యసంధతను తెలుసుకోవాలనుకున్నారు. మదీనాలో యూదులు కూడా ఏకదైవారాధక విశ్వాసాన్ని పాటించేవారుగా గుర్తింపు పొందారు. ప్రవక్త ముహమ్మద్ కూడా చాలా సార్లు ప్రవక్త మూసాను ప్రస్తావించేవారు. ప్రవక్త మూసా యూదుల ప్రవక్త. అందువల్ల యూదుల అభిప్రాయం లేదా వారి సలహా అవసరమని భావించారు.

కొత్త ప్రవక్త గురించి విన్న యూద రబ్బీలు, మక్కా ప్రజలు ఆ ప్రవక్తను మూడు

ప్రశ్నలు అడగాలని చెప్పారు. ఆయన చెప్పేది నిజంగా దైవం తరఫున వచ్చిందో కాదో తెలుసుకోడానికి ఈ ప్రశ్నలు అడగమన్నారు. ఈ ప్రశ్నలకు జవాబిస్తే అతను దైవప్రవక్తేనని లేకపోతే మోసగాడని అన్నారు. ఇందులో మొదటి ప్రశ్న తమ జాతివారికి దూరంగా వెళ్ళిపోయిన కొందరు యువకులకు సంబంధించినది. రెండవ ప్రశ్న ప్రపంచం తూర్పు, పడమరల హద్దుల వరకు ప్రయాణించిన మహా పర్యాటకుడికి సంబంధించినది. మూడవది ప్రత్యక్షమైన విజ్ఞప్తి, అదేమంటే ఆత్మను నిర్వచించాలన్నది. ఈ ప్రశ్నలకు జవాబులు ఇస్తే ఆయన్ను అనుసరించండని యూద రబ్బీలు సలహా ఇచ్చారు. ఖురైషుల బృందం ఇప్పుడు ప్రవక్త ముహమ్మద్‌ను ఇరుకున పెట్టే ప్రశ్నలు దొరికాయని సంతోషంగా వెనుదిరిగి వచ్చింది. మక్కాకు వచ్చిన తర్వాత ప్రవక్త ముహమ్మద్ వద్దకు వెళ్ళి ఈ మూడు ప్రశ్నలు అడిగారు. ప్రవక్త వెంటనే "ఈ ప్రశ్నలకు రేపు సమాధానమిస్తాను" అన్నారు.

కాని రెండవరోజు దైవదూత జిబ్రయీల్ రాలేదు. ఎలాంటి దైవాదేశాలు అవతరించలేదు. ఆ తర్వాతి రోజు కూడా జిబ్రయీల్ దూత రాలేదు. ఆ తర్వాతి పధ్నాలుగు రోజుల వరకు దైవదూత రాలేదు.

ఖురైషులు చాలా ఆనందించారు. చివరకు ప్రవక్త ముహమ్మద్‌ను ఒక మోసగాడిగా నిరూపించేశామని సంబరపడ్డారు. ఆయన యూద రబ్బీల ప్రశ్నలకు సమాధానం చెప్పలేకపోయారని ప్రచారం మొదలు పెట్టారు. ప్రవక్త ముహమ్మద్ చాలా విచారంలో మునిగిపోయారు. రోజులు గడిచేకొద్దీ ఆయనకు తనను విడిచిపెట్టడం జరిగిందన్న చింత ప్రారంభమయ్యింది. ఆయన దేవుడిని సందేహించలేదు. శత్రువుల ఎగతాళి వల్ల ఆయనకు అనుమానాలు ఎక్కువయ్యాయి.

## ఇన్షాఅల్లాహ్
## దేవుడు తలిస్తే

రెండువారాల తర్వాత, ప్రవక్త ముహమ్మద్‌కు దైవాదేశాలు అందాయి. వివరణలు కూడా దొరికాయి.

> "ఏ విషయాన్ని గురించియైనా, ఎన్నడూ "నేను ఈ పనిని రేపు చేస్తాను" అని అనకు. (నీవు ఏమీ చేయలేవు) అల్లాహ్ కోరితే తప్ప. ఒకవేళ మరపు వల్ల నీవు అలా అంటే, వెంటనే నీ ప్రభువును స్మరించుకొని ఇలా అను, "నా ప్రభువు ఈ

వ్యవహారంలో సత్యానికి అతి దగ్గరగా ఉన్న విషయం వైపునకు నాకు మార్గం చూపుతాడని నేను ఆశిస్తున్నాను." (దివ్యఖుర్‌ఆన్18: 23-24)

ఈ అవతరణలో ఒక మందలింపు ఉంది, ఒక బోధన ఉంది. తన హెూదా, తన జ్ఞానం, తన భవిష్యత్తు అన్నీ విశ్వప్రభువు చేతిలో ఉన్నాయని ఆయనకు గుర్తు చేయడం జరిగింది. ఆయన ఒక్కడే విశ్వానికి ప్రభువు. ఆ విషయాన్ని ఎన్నడూ మరిచిపోరాదు. ఇన్షాఅల్లాహ్ అన్న పదబంధం అర్థాన్ని ఈ నేపథ్యంలో అర్థం చేసుకోవాలి. దైవం తలిస్తే.. అనడంలో మన పరిమితుల ప్రకటన ఉంది. ఏదైనా జరిగేలా చేసే శక్తి ఒక్క దేవునికి మాత్రమే ఉంది. మనిషి ఏదైనా చేస్తాననడంలో అతని పరిమితులను ఈ పదబంధం ఉపయోగం వల్ల ప్రకటించడం జరుగుతుంది. ఇది నిష్క్రియాపరత్వాన్ని ప్రోత్సహించే తాత్విక సందేశం కాదు, నిజానికి ఇది మనిషిని క్రియాశీలంగా మార్చే సందేశం. ఎల్లప్పుడు ప్రయత్నిస్తూ ఉండాలి, మనిషికి ఉన్న పరిమితులను ఎల్లప్పుడు దృష్టిలో ఉంచుకోవాలి. ఈ విధంగా విశ్వప్రభువు ఒక గొప్ప బోధనను, మందలింపుతో ఆయనకు అందించాడు. మనిషి ఎలాంటి క్లిష్టపరిస్థితిలో తాను ఉన్నప్పటికీ, మనిషి శక్తిసామర్థ్యాలు, స్వేచ్ఛ అన్నీ సృష్టికర్తపై ఆధారపడి ఉన్నాయన్న స్పృహ ఎల్లప్పుడు ఉండాలి.

ఆ తర్వాత ఆయనకు మూడు ప్రశ్నలకు జవాబులు దొరికాయి. ఈ ఆలస్యం విశ్వాసుల విశ్వాస బలాన్ని మరింత పెంచింది. ఇది ఆశ్చర్యకరమైన పరిణామం. ఈ ప్రశ్నలకు ప్రవక్త తనకు తానే జవాబీయలేకపోవడం, తర్వాత దైవాదేశాల అవతరణలో జాప్యం ఇవన్నీ పరిశీలిస్తే ఆయన నిస్సందేహంగా దైవ ప్రవక్త అని, ఆయన వద్దకు దైవాదేశాలు వచ్చేవని అర్థం అవుతుంది. ఆయన ఈ దివ్యఖుర్‌ఆన్‌ను రాయలేదు. ఇది దేవుని తరఫున అవతరించింది. ఆయన విశ్వప్రభువు ఇష్టాయిష్టాలపై ఆధారపడి పనిచేశారు.

ఇక ఆత్మకు, అంటే అర్రూహ్‌కు సంబంధించిన ప్రశ్న సూటిగా నిర్వచనాన్ని కోరిన ప్రశ్న. ఈ ప్రశ్నకు జవాబు కూడా ఇంతకు ముందు ప్రవక్తకు బోధించిన నమ్రత, దైవంపై ఆధారపడే లక్షణాలను వ్యక్తం చేస్తూ ఇవ్వబడింది.

"ఈ ప్రజలు నిన్ను ఆత్మను గురించి ప్రశ్నిస్తున్నారు. ఇలా అను: "ఈ ఆత్మ నా ప్రభువు ఆజ్ఞానుసారం వస్తుంది. కాని మీకు ప్రసాదించబడిన జ్ఞానం బహుస్వల్పమైనది." (దివ్యఖుర్‌ఆన్ 17 : 85)

ఇక రెండు కథలకు సంబంధించి (ఎఫీసస్‌కు చెందిన ఏడుగురు నిద్రించే యువకుల కథ, పర్యాటకుడు జుల్‌ఖర్నైన్ కథ) ఇవి దివ్యఖుర్‌ఆన్‌లోని 18వ అధ్యాయంలో వివరించడం

జరిగింది. ఈ కథలు పూర్తి వివరాలు, సమాచారంతో ఉండడంతో మక్కా ఖురైషులు, మదీనా రబ్బీలు ఆశ్చర్యపోయారు. ఈ కథల గురించి దైవాదేశాలు అవతరించకముందు ప్రవక్తకు ఏమాత్రం తెలియదు. ఇదే అధ్యాయంలో ప్రవక్త మూసా కథను కూడా దివ్యఖుర్‌ఆన్ ప్రస్తావించింది. ఆయన ఒక బలహీనక్షణంలో పొరబాటున తాను ప్రవక్త కాబట్టి తనకు తెలుసని అన్నారు. ఆ వెంటనే దేవుడు ఆయన్ను పరీక్షకు గురిచేసి ఆయనకన్నా ఎక్కువగా తెలిసిన వ్యక్తి వద్దకు పంపాడు. దివ్యఖుర్‌ఆన్‌లో అల్ ఖిజర్ గురించిన ప్రస్తావన మూసా ప్రవక్తకు దేవుడి అత్యున్నత జ్ఞానాన్ని గురించి తెలియజేసింది. సహనంతో, నమ్రతగా వ్యవహరించాలని బోధించింది.

ప్రవక్త ముహమ్మద్‌కు సంబంధించిన ఈ అనుభవం, యావత్తు మానవాళికి అందించిన బోధనలు అన్నీ మనిషి పరిమితులను గుర్తు చేస్తున్నాయి. హోదాలు ఏవైనా గాని మనిషి దేవుడిపైనే ఆధారపడి ఉన్నాడు. ఈ బోధన ఖుర్‌ఆన్‌లోని ఈ ఆధ్యాయం చివరి వరకు కొనసాగింది. ఆ తర్వాత ప్రవక్త ముస్లిములందరికీ ఈ అధ్యాయాన్ని ప్రతి శు క్రవారం చదవాలని చెప్పారు. ఆ విధంగా ప్రతి వారం తమ పరిమితులను, దేవుని అధికారాలను మనిషి పునశ్చరణ చేసుకోవాలని బోధించారు.

# 6

# వలస

## అబిసీనియా

మక్కాలో వేధింపులు, దౌర్జన్యాలు ఎక్కువయ్యాయి. దివ్యఖుర్ఆన్ వాక్యాల అవతరణ కొనసాగుతూ వచ్చింది. ఇప్పుడు వేధింపులు కేవలం బలహీనవర్గాల వారికే పరిమితం కాలేదు, కొద్దోగొప్పో సామాజిక రక్షణ ఉన్న ముస్లిములకు కూడా వేధింపులు తప్పడం లేదు. అబూబక్ర్ వంటి వారికి కూడ వేధింపులు తప్పలేదు. ప్రవక్త ముహమ్మద్ ఆయన పినతండ్రి అబూతాలిబ్ సంరక్షణలో ఉన్నారు. ఆయన్ను కూడా ఎగతాళి చేయడం, హింసించడం జరిగింది. మక్కాలో దిగజారుతున్న పరిస్థితిని గమనించి ప్రవక్త కింది సూచన చేశారు.

> "మీరు గనుక అబిసీనియాకు వెళితే అక్కడ ఒక రాజు ఉన్నాడు. ఆ రాజు పాలనలో అన్యాయం జరగదు. ఆ దేశం మతపరంగా నిజాయితీ ఉన్న దేశం. మీరు ఇప్పుడు అనుభవిస్తున్న వేధింపులు తొలగే వరకు మీరు అక్కడే ఉండండి." అన్నారు.

ప్రవక్త ముహమ్మద అబిసీనియా రాజు నీగస్ గురించి ప్రస్తావించారు. ఆయన ఒక క్రయిస్తవుడు. న్యాయశీలుడని, నిష్పక్షపాతంగా పాలిస్తాడని పేరొందిన రాజు. ఆ తర్వాత కొందరు ముస్లిములు అబిసీనియా వలస వెళ్ళడానికి ఏర్పాట్లు చేసుకోసాగారు. త్వరలోనే కొందరు ముస్లిములు, కుటుంబాలు అబిసీనియా తరలి పోయాయి. దాదాపు వందమంది వెళ్ళారు. అందులో 82 లేదా 83 మంది పురుషులు, దాదాపు ఇరవై మంది మహిళలు ఉన్నారు.

ఇది కామన్ ఎరా 615లో జరిగింది. అప్పటికి దివ్యఖుర్ఆన్ అవతరణ ప్రారంభమై ఐదేళ్ళు గడిచిపోయాయి. బహిరంగ సందేశ ప్రచారం ప్రారంభమై రెండేళ్ళు గడిచాయి.

మక్కాలో పరిస్థితి ఎంతగా దిగజారిందంటే ముస్లిములు తుదకు సుదూరాన ఉన్న అబిసీనియాకు వలస వెళ్ళే పరిస్థితి తలెత్తింది.

ఖురైషులకు ఈ విషయం తెలిసింది. కొందరు ముస్లిములు, సామాజికంగా బలహీనవర్గాల వారే కాదు, ఇతరులు కూడా మక్కా వదిలి వెళ్ళిపోయారని గుర్తించారు. వారు ఎక్కడికి వెళ్ళింది తెలుసుకోవడం వారికి పెద్ద కష్టం కాలేదు. ఖురైషుల్లో మరో ఆందోళన మొదలైంది. ఈ గుప్పెడు మంది ముస్లిములు మరో దేశానికి వెళ్ళి అక్కడ స్థిరపడితే, మక్కా ప్రతిష్ఠ దెబ్బతింటుంది. తమ పట్ల అక్కడ శత్రుభావం పెరుగుతుంది. అక్కడి రాజుతో కలిసి తమకు వ్యతిరేకంగా పనిచేయవచ్చు. ఆ రాజు కూడా ఏకదైవారాధక విశ్వాసం కలిగినవాడే. ముస్లిములు వలస వెళ్ళిన తర్వాత ఖురైషులు ఆలోచించి రెండు ప్రతినిధి బృందాలను అబిసీనియా రాజు నీగస్ వద్దకు పంపాలని నిర్ణయించారు. అల్ ఆస్ కుమారుడు అమ్ర్, రాబియా కుమారుడు అబ్దుల్లాలను పంపాలని నిర్ణయించారు. రాజు నీగస్‌ను కలిసి ముస్లిములకు శరణు ఇవ్వకుండా నచ్చచెప్పాలని భావించారు.

అబిసీనియాలో ఉన్న ముస్లిములను తిరిగి మక్కా పంపేలా ఒప్పించాలని కూడా అనుకున్నారు. ఈ ఇద్దరు ప్రతినిధులు నీగస్ దర్బారుకు చేరుకున్నారు. అబిసీనియా రాజదర్బారుకు ఆసక్తికరమైన కానుకలు తీసుకుని వెళ్ళారు. రాజదర్బారులోని ప్రముఖులను ఒకరి తర్వాత ఒకరిని కలుసుకున్నారు. వారికి కానుకలు ఇచ్చి వారి మద్దతు గురించి హామీ పొందారు. రాజు వద్ద తమ విజ్ఞప్తిని బలపరచాలని రాజదర్బారు ప్రముఖులతో మాట తీసుకున్నారు.

## రాజు నీగస్

ఖురైష్ ప్రతినిధులు అల్ ఆస్, అబ్దుల్లాలు నీగస్ వద్ద తమ వాదన వినిపించి అస్సలు ముస్లిములకు తమ వాదన వినిపించే అవకాశం కూడా లేకుండా వారిని తిరిగి మక్కాకు తీసుకెళ్ళాలనుకున్నారు. కాని నీగస్ అందుకు ఒప్పుకోలేదు. తన వద్ద శరణుకోరి వచ్చిన వారికి వారి వాదన వినిపించే పూర్తి హక్కు ఉందని అన్నాడు. మక్కా ప్రతినిధులు తమ వాదన వినిపించడానికి, మక్కానుంచి వచ్చిన ముస్లిమ్ శరణార్థులు తమ వాదన వినిపించడానికి ఏర్పాట్లు చేశాడు. ముస్లిములు అబూతాలిబ్ కుమారుడు జాఫర్‌ను తమ నాయకుడిగా చేసుకున్నారు. ఆయన తెలివైన వాడు. చక్కని వక్త. ఆయన తమ వాదనను చక్కగా వినిపిస్తాడని ఆయన్ను ఎన్నుకున్నారు. రాజు వారిని ఎందుకు వలస వచ్చారని, ముఖ్యంగా ప్రవక్త ముహమ్మద్ తీసుకొచ్చిన కొత్త సందేశం ఏమిటని ప్రశ్నించాడు. జాఫర్ ఆయనకు ప్రవక్త ముహమ్మద్ బోధనలను, దివ్యఖుర్‌ఆన్ సందేశ సారాన్ని వివరించారు.

ఒకే ఒక్క దేవుడిని ఆరాధించడం, విగ్రహారాధనను తిరస్కరించడం, కుటుంబసంబంధాలను గౌరవించడం, సత్యాన్ని పలకడం, అన్యాయాన్ని వ్యతిరేకించడం గురించి వివరించారు.

ఆయన వాదన ఇలా సాగింది :

> "ఓ రాజా! మేము అజ్ఞానంలో, ఆటవికదశలో పూర్తిగా మునిగిపోయి ఉండేవాళ్లం. విగ్రహాలను ఆరాధించేవాళ్లం. పాపాల్లో జీవించేవాళ్ళం. మరణించిన పశుమాంసం తినేవాళ్ళం. విద్వేషాన్ని ప్రచారం చేసేవాళ్లం. మానవత్వానికి సంబంధించిన ప్రతి భావనను మేము నిర్లక్ష్యం చేస్తూ ఉండేవాళ్ళం. ఎప్పుడు అతిథి సత్కారాన్ని పాటించలేదు. పొరుగువారితో మంచిగా వ్యవహరించడం ఎరుగము. మాకు ఏ చట్టమూ తెలియదు. బలవంతుడిదే రాజ్యంగా బతికేవాళ్ళం. మాలో ఒక మనిషిని దేవుడు ఎన్నుకున్నాడు. ఆయన వంశం, ఆయన సత్యసంధత, ఆయన నిజాయితీ, ఆయనలోని స్వచ్ఛత అందరికీ బాగా తెలుసు. ఆయన మమ్మల్ని ఒకే దేవుడిని విశ్వసించాలని బోధించాడు. దేవుడికి భాగస్వాములను చేర్చరాదని చెప్పారు. విగ్రహారాధన వద్దని నివారించారు. సత్యమే పలకాలని, కృతజ్ఞత కలిగి ఉండాలని, కరుణతో వ్యవహరించాలని, పొరుగువారి హక్కులను గౌరవించాలని బోధించారు. మహిళల పట్ల చెడుగా మాట్లాడరాదని, అనాథల ఆస్తులు కాజేయరాదని నివారించారు. చెడులకు దూరంగా ఉండాలని, ప్రార్థనలు చేయాలని, దానాలు చేయాలని, ఉపవాసాలు ఉండాలని చెప్పారు. ఆయన్ను మేము విశ్వసించాము. ఆయన బోధనలు స్వీకరించాము. ఈ కారణం వల్లనే మా వాళ్ళు మాపై కక్షకట్టారు. మమ్మల్ని వేధించారు. ఏకదైవారాధక విశ్వాసాన్ని వదిలేయాలని, కలపతో, రాతితో చేసిన విగ్రహారాధన ప్రారంభించాలని మమ్మల్ని చిత్రహింసలకు గురిచేశారు. ఇక అక్కడ మాకు భద్రత కరువయ్యింది. మీ దేశానికి వచ్చాము. మీరు ఈ అణిచివేతల నుంచి మాకు రక్షణ కల్పిస్తారని ఆశిస్తున్నాము." అన్నారు.

ఆయన ప్రసంగం విని రాజు నీగస్ చాలా ప్రభావితుడయ్యాడు. ప్రవక్త ముహమ్మద్‌పై అవతరిస్తున్న సందేశం మీ వద్ద ఉంటే చదివి వినిపిస్తారా అని అడిగాడు. జాఫర్ అలాగేనని మర్యమ్ సూరాలోని వాక్యాలను పఠించారు.

> "ప్రవక్తా! ఈ గ్రంథంలో, మర్యమ్ తన వారి నుండి వేరైపోయి, తూర్పు దిక్కు ఏకాంతంగా కూర్చుండి, వారికి చాటుగా తెర కట్టుకుని ఉండిపోయినప్పటి వృత్తాంతాన్ని ప్రస్తావించు. ఈ స్థితిలో ఆమె వద్దకు మా ఆత్మను (అంటే దూతను) పంపాము. అప్పుడు అతడు ఆమె ముందు పరిపూర్ణమైన మానవాకారంలో ప్రత్యక్షమయ్యాడు. వెంటనే మర్యమ్ ఇలా పలికింది. "నీవు దైవభీతిగల మనిషివే

అయితే, నేను నీ బారినుండి రక్షించవలసినదిగా దయామయుడైన దేవుని శరణుకోరుకుంటున్నాను." అతను "నేను నీ ప్రభువు దూతను మాత్రమే. నీకు ఒక పరిశుద్ధ పుత్రుణ్ణి ఇచ్చేందుకు పంపబడ్డాను" అని చెప్పాడు. మర్యమ్ "నాకు పుత్రుడు ఎలా పుడతాడు, నన్ను పురుషుడు ఎవడూ తాకనైనా లేదు, నేను చెడనడత గల దానినీ కాను" అని అన్నది. దైవదూత ఇలా అన్నాడు, "అలాగే జరుగుతుంది" నీ ప్రభువు, "అలా చేయటం నాకు చాల సులభం. ఆ బాలుణ్ణి ప్రజల కొరకు ఒక సూచనగా, మా తరపునుండి ఒక కారుణ్యంగా చేయాలని మేము ఈ పని చేస్తున్నాము. ఇది జరిగి తీరవలసిన విషయమే." (దివ్యఖుర్ఆన్ 19:16-21)

అరబీ భాషలో ఉన్న ఆ సందేశం విని రాజు ఆయన దర్బారులోని ప్రముఖులు చాలా ప్రభావితులయ్యారు. ఆ అరబీ అనువాదాన్ని విని మరింత ప్రభావితులయ్యారు. దివ్యఖుర్ఆన్ ప్రవక్త ఏసుక్రీస్తు జననంలోని మహత్యాన్ని ఆమోదిస్తుందని తెలుసుకున్నారు. రాజు నీగస్ మాట్లాడుతూ "నిస్సందేహంగా ఈ సందేశం కూడా ప్రవక్త ఏసుక్రీస్తు తీసుకొచ్చిన సందేశం నుంచి వచ్చినదే" అన్నాడు. ఆ తర్వాత మక్కా ప్రతినిధుల వైపు తిరిగి వారి విజ్ఞప్తిని మన్నించలేమని చెప్పాడు. ముస్లిమ్ శరణార్థులను వారికి అప్పగించేది లేదన్నాడు. వారికి తన దేశంలో శరణు కొనసాగిస్తామని తేల్చి చెప్పాడు.

## మేరీమాత పుత్రుడు ఏసుక్రీస్తు

మక్కా ప్రతినిధులు అమ్ర్, అబ్దుల్లాలు దర్బారు నుంచి బయటకు వచ్చేశారు. వారికి తీవ్రమైన నిరాశ ఆగ్రహాలు ముప్పిరిగొన్నాయి. కాని అమ్ర్ వెంటనే ఒక నిర్ణయం తీసుకున్నాడు, దర్బారులోకి మళ్ళీ వెళదామన్నాడు. ప్రవక్త ముహమ్మద్ సందేశం ఏసుక్రీస్తు గురించి అస్సలేం చెబుతుందో రాజుకు చెప్పాలన్నాడు. ఈ సందేశం క్రయిస్తవ విశ్వాసాలకు పూర్తిగా అనుగుణమైనేది కాదు. మర్నాడు దర్బారుకు వెళ్ళి రాజుతో ఇదే చెప్పాడు. అతను చెప్పింది విన్న తర్వాత మళ్ళీ రాజు ముస్లిములను పిలిచాడు. ప్రవక్త ముహమ్మద్ తన సందేశంలో ఏసుక్రీస్తు గురించి ఏం చెప్పారో చెప్పండని అడిగాడు. ఈ ప్రశ్నలో ఉన్న ప్రమాదం ముస్లిములకు తెలుసు. రెండు విశ్వాసాల్లో ఉన్న భేదాన్ని వివరిస్తే రాజు నీగస్ విశ్వాసానికి విరుద్ధమైన విశ్వాసం అని తెలిసిపోతుంది. రాజు కుపితుడై వారిని మక్కాకు తిప్పి పంపించవచ్చు. ఏది ఏమైనా దైవసందేశాన్ని మార్చడానికి వీలులేదు. కాబట్టి ఉన్న విషయాన్ని యథాతథంగా చెప్పాలని నిర్ణయించుకున్నారు. నీగస్ వారికి ఒక ప్రత్యక్షమైన ప్రశ్న వేశాడు. జవాబు కూడా అదేవిధంగా ఉండాలి. నీగస్ అడిగిన ప్రశ్న చాలా సూటిగా ఉంది. "మేరీ మాత పుత్రుడు ఏసుక్రీస్తు గురించి ఏమంటారు?" అన్నది ఆ ప్రశ్న. జాఫర్ కూడా అంతే సూటిగా జవాబిచ్చారు. "మా ప్రవక్త చెప్పిందే మేము చెబుతాం. ఏసుక్రీస్తు దేవుని దాసుడు,

దేవుని ప్రవక్త, దేవుని ఆత్మ, దేవుని వాక్కు, దేవుడు కన్య మేరీ గర్భంలో ఆయన్ను ఊదాడు." ఇందులో ఎక్కడా ఏసుక్రీస్తు దేవుని కుమారుడు అన్న ప్రస్తావన లేదు. అయినా రాజు నీగస్ వెంటనే ప్రతిస్పందించాడు. కింద నుంచి ఒక గడ్డిపరక తీసుకుని "మేరీ మాత పుత్రుడు ఏసుక్రీస్తు మీరు చెప్పినదానికన్నా ఈ గడ్డిపోచ ఎక్కువ కాదు" అన్నాడు. రాజదర్బారులో ఉన్న మతపెద్దలు కూడా ఈ జవాబు విని ఆశ్చర్యపోయారు. నెమ్మదిగా దగ్గుతూ తమ అసమ్మతి కూడా కొందరు తెలియజేశారు. కాని నీగస్ పట్టించుకోలేదు. మక్కా నుంచి వచ్చిన ప్రతినిధులను తిప్పి పంపాలని ఆదేశాలు జారీ చేశాడు. వారు తెచ్చిన కానుకలన్నీ వెనక్కి తీసుకెళ్ళాలని కూడాచెప్పాడు. ముస్లిములకు మళ్ళీ ఆహ్వానం పలుకుతూ శరణు కొనసాగించాడు. తన దేశంలో వారికి పూర్తి భద్రత రక్షణ ఉంటాయని హామీ ఇచ్చాడు.

## సత్యం - ప్రమాదాలు

ఇది మక్కావారికి పెద్ద నిరాశ. అబిసీనియా నుంచి ప్రతినిధులు నిరాశగా వెనక్కి వచ్చిన తర్వాత మక్కాలో ఉన్న ముస్లిములపై దౌర్జన్యాలు మరింత పెరిగాయి. ఇక అక్కడ అబిసీనియాలో జాఫర్ ఆయనతో పాటు ఉన్న కొందరు ముస్లిములు ఒక క్రయిస్తవ దేశంలో శరణార్థులుగా ఉన్నారు. అక్కడి ప్రజల మతవిశ్వాసాలకు వారి మతవిశ్వాసాలకు మధ్య భేదం ఉంది. అయినా వారికి అక్కడ భద్రత లభించింది. రాజు నీగస్ వద్ద ప్రమాదకరమైన పరిస్థితిలోకూడా ముస్లిములు సత్యమే పలకాలని నిర్ణయించుకున్నారు. వారు ఆ ప్రశ్నను దాటవేసే ప్రయత్నమూ చేయలేదు, ప్రవక్త బోధనల విషయంలో అబద్ధమూ చెప్పలేదు. మేరీ మాత పుత్రుడు ఏసుక్రీస్తు గురించి తమకు ప్రవక్త ముహమ్మద్ చెప్పిన మాటలనే అక్కడా చెప్పారు. నిజానికి ఆ మాటలు చెప్పడం వల్ల వారిని మక్కాకు తిప్పి పంపే ప్రమాదం ఉన్నప్పటికీ వారు వెనుకాడలేదు. ప్రమాదం ఉన్నప్పటికీ మరో దారిలేదనుకున్నారు. వారు తమ విశ్వాసానికి కట్టుబడ్డారు. నిజాయితీగా ప్రకటించారు. సత్యం పలకడం తప్ప మరో దారిలేదు. అదే చేశారు.

ఆ తర్వాత రాజు నీగస్ ఇస్లామ్ స్వీకరించడం జరిగింది. ప్రవక్త ముహమ్మద్‌తో సంబంధం కొనసాగించాడు. నీగస్ మరణించినప్పుడు అతని కోసం సలాతల్ గైబ్ ప్రార్థనలు చేశారు ప్రవక్త ముహమ్మద్. అబిసీనియా వెళ్ళిన ముస్లిములు అక్కడ దాదాపు పదిహేను సంవత్సరాల వరకు ఉన్నారు. ఖైబర్ యుద్ధం వరకు అక్కడే ఉన్నారు. ఆ తర్వాత వారు మదీనాలో ప్రవక్త ముహమ్మద్ వద్దకు చేరుకున్నారు. కొందరు మక్కాలో పరిస్థితులు కుదుటపడిన తర్వాత మక్కాకు వెళ్ళిపోయారు. కాని ఎవరూ నీగస్ రాజ్యంలో ఎలాంటి ఇబ్బందులకు గురికాలేదు.

# ధైర్యసాహసాలు

## హజ్రత్ హంజా

( దేవుడు ఆయనతో ప్రసన్నుడవుగాక )

అన్యాయాల కారుమబ్బులు కమ్ముకున్న నిరాశాపూరిత వాతావరణంలో, దౌర్జన్యాలు, అణిచివేతలు అనుభవిస్తున్న ముస్లిములకు ఒక ఆశాకిరణం కనబడింది. అది హజ్రత్ హంజా ఇస్లామ్ స్వీకరణ. ఇది ప్రవక్త నియామక ప్రకటన తర్వాత ఆరేళ్ళకు జరిగింది. హంజా అబ్దుల్ ముత్తలిబ్ కుమారుడు.

ఇది ఎలా జరిగిందంటే, ఒకరోజు ప్రవక్త ముహమ్మద్ కాబా దగ్గర సఫా గుట్టపై కూర్చుని ఉన్నారు. అబూజహల్ అటుగా వెళుతున్నాడు. వెళ్తూ వెళ్తూ ప్రవక్త బోధిస్తున్న మతాన్ని దూషించాడు. ప్రవక్త ముహమ్మద్ మౌనంగా ఊరుకున్నారు. అబూజహల్ మరింత పేట్రేగిపోయి ఒక రాయితో ఆయన నుదుటిపై కొట్టాడు. ఆయన నుదురు రక్తం కారసాగింది. ఆ వెంటనే అబూజహల్ ఖురైషుల సమావేశ మందిరానికి వెళ్ళాడు. ఇది జరిగిన కాసేపటికి హంజా, ఆయన అప్పటికి ఇస్లామ్ స్వీకరించలేదు, వేట నుంచి తిరిగి వచ్చారు. ఆయన అదే దారిన వస్తున్నారు. ఆయన విల్లు భుజానికి వేలాడుతూనే ఉంది. ప్రవక్త ముహమ్మద్‌పై అబూజహల్ దాడి చేయడాన్ని ఒక బానిస అమ్మాయి చూసింది. ఆమె వెంటనే హంజా వద్దకు వెళ్ళి జరిగిందంతా చెప్పింది.

ఇది వినగానే హంజా కోపంతో ఊగిపోయారు. తిన్నగా కాబాగృహానికి వెళ్ళారు. కాబా ఆవరణలో అబూజహల్ తన మిత్రబృందంతో కూర్చుని ఉన్నాడు. హంజా తిన్నాగా అబూజహల్ వద్దకు వెళ్లి వింటితో వాడి నెత్తిన కొట్టారు. "నువ్వు ముహమ్మద్‌పై దౌర్జన్యం చేస్తావా? ఆయనేం చెబుతున్నాడో ఆ మతాన్ని నేను కూడా స్వీకరిస్తాను. ఆయన చెప్పిన

మాటలు నేను కూడా పాటిస్తాను." అని అక్కడే చెప్పేశారు. అక్కడి నుంచి తిన్నగా ప్రవక్త వద్దకు వెళ్ళారు. "ముహమ్మద్! అబూజహల్‌పై మీ ప్రతీకారం నేను తీర్చుకున్నాను." అన్నారు. ప్రవక్త ముహమ్మద్ జవాబిస్తూ, "ఈ ప్రతీకారం పట్ల నాకు ఆసక్తి లేదు, మీరు గనుక ముస్లిమ్ అయ్యేదయితే దేవుడికి విధేయత చూపండి, నేను చాలా సంతోషిస్తాను" అన్నారు. హంజా ఇస్లామ్ సందేశాన్ని తెలుసుకుని, అర్థం చేసుకుని ముస్లిమ్‌గా మారారు.

హంజా ప్రవక్తకు పినతండ్రి. తాను ముస్లిమ్ అయిన వెంటనే ఆయన ఈ విషయాన్ని ప్రకటించడమే కాదు, తాను ప్రవక్తకు సంరక్షకుడిగా ఉన్నానని కూడా ప్రకటించారు. ఈ ప్రకటన తర్వాత అబూజహల్ ప్రవక్తను వేధించడానికి సాహసించలేదు. కాని తన కసి అంతా ప్రవక్త అనుచరుల్లో నిరుపేదలు, సామాజిక రక్షణ లేనివారిపై తీర్చుకోవడం ప్రారంభించాడు.

నిజానికి హంజా ఇస్లామ్ స్వీకరణ అనేది కుటుంబ ప్రతిష్ఠకు సంబంధించిన సమస్యగా భావించి చేపట్టిన చర్య. తన కుటుంబానికి చెందిన మనిషిని, తన రక్తసంబంధీకుడిని మరొకరు పరాభవించడాన్ని ఆయన సహించలేకపోయారు. కాని ఆ తర్వాత హంజాలోని ఈ వైఖరిని దేవుడు సరిదిద్దాడు, ఆయన ఒక అత్యుత్తమ ముస్లిముగా, ప్రవక్త అనుచరుల్లో అతిముఖ్యమైన అనుచరుడిగా ఇస్లామ్ కోసం పనిచేశారు.

# ఉమర్

( దైవం ఆయన పట్ల ప్రసన్నుడవుగాక )

ఇస్లామ్‌కు లభించిన మరో గొప్ప బలం హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ ఇస్లామ్ స్వీకరణ. ప్రవక్తగా ముహమ్మద్ (ఆయనకు శాంతి కలుగుగాక) నియమించబడిన ఆరవసంవత్సరంలో ఉమర్ బిన్ ఖత్తాబ్ ఇస్లామ్ స్వీకరించారు. హజ్రత్ హంజా ఇస్లామ్ స్వీకరించిన మూడు రోజులకే హజ్రత్ ఉమర్ ఇస్లామ్ స్వీకరించారు. ఉమర్ దృఢసంకల్పం కలిగిన, ధైర్యసాహసాలున్న వ్యక్తి. మక్కాలో ఆయన్ను అందరూ గౌరవించేవారు. అందరూ ఆయనంటే భయపడేవారు. నిజానికి ఆయన కొత్తధర్మాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ వచ్చారు. కొన్ని చారిత్రక ఆధారాలవల్ల తెలుస్తున్నదేమంటే ఒకసారి ప్రవక్త ముహమ్మద్ తన చేతులెత్తి దేవుని ప్రార్థిస్తూ

"ప్రభూ! ఉమర్ బిన్ ఖత్తాబ్ లేదా అబూ జహల్ బిన్ హిష్షామ్, ఈ ఇద్దరిలో ఎవరిని నీవు ఎక్కువగా ఇష్టపడతావో అతని ద్వారా ఇస్లామ్‌కు బలం ప్రసాదించు" అని కోరుకున్నారు.

ప్రవక్త ముహమ్మద్ ప్రబోధిస్తున్న కొత్తధర్మాన్ని ఉమర్ తీవ్రంగా వ్యతిరేకించేవారు. ఒకరోజు ఆయన విపరీతమైన ఆగ్రహంతో, ఈ కొత్తధర్మం నుంచి సమాజానికి విముక్తి లభించాలంటే ఒక్కటే మార్గం, ప్రవక్త ముహమ్మద్‌ను తుదముట్టించడమేనని నిర్ణయించుకున్నారు. మక్కా సమాజానికి ప్రమాదంగా మారిన ఈ తిరుగుబాటును, విప్లవాన్ని నిర్మూలించాలంటే అంతకన్నా మంచి పద్ధతి లేదనుకున్నారు.

వెంటనే ఆయన ఇంటి నుంచి బయలుదేరారు. చేతిలో నగ్న కరవాలం. ప్రవక్త ముహమ్మద్‌ను వెదుకుతూ బయలుదేరారు. దారిలో ఆయనకు నువామ్ కలిశారు. నువామ్ అంతకు ముందే రహస్యంగా ఇస్లామ్ స్వీకరించిన వ్యక్తి. నువామ్ ఆయనతో ఎందుకంత కోపంగా ఉన్నారని వాకాబు చేశాడు. ఉమర్ ఏమాత్రం దాపరికం లేకుండా తన ఉద్దేశ్యం ఆయనకు చెప్పేశారు. ఉమర్ గురించి బాగా తెలిసిన నువామ్ వెంటనే ఆయన్ను పక్కదారి పట్టించడానికి ఆలోచించి, ప్రవక్త ముహమ్మద్ గురించి తర్వాత ఆలోచిద్దురు గాని ముందు మీ కుటుంబంలో పరిస్థితి చక్కబెట్టుకోండి అంటూ, మీ సోదరి ఫాతిమా, మీ బావ సయీద్ ఇద్దరు ముస్లిములైపోయారు తెలుసా అని చెప్పారు. ఈ వార్త విని ఉమర్‌కు కోపం మరింత పేట్రేగిపోయింది. ఆయన ప్రవక్త ముహమ్మద్ కోసం వెదకడం మాని తిన్నగా సోదరి ఇంటికి బయలుదేరారు.

ఉమర్ సోదరి ఫాతిమా (దైవం ఆమెతో ప్రసన్నుడవుగాక), ఆమె భర్త కలిసి దివ్యఖుర్ఆన్ చదువుతున్నారు. ప్రవక్త అనుచరుడు ఖబ్బాబ్ (దైవం ఆయనతో ప్రసన్నుడవుగాక) వారిద్దరికి ఖుర్ఆన్ నేర్పుతున్నారు. ఎవరో వచ్చిన అలికిడి వినగానే ఖబ్బాబ్ దివ్యఖుర్ఆన్ పారాయణాన్ని ఆపేశారు. ఖుర్ఆన్ ప్రతిని దాచేశారు. కాని అప్పటికే ఉమర్ దివ్యఖుర్ఆన్ పారాయణాన్ని విన్నారు. వారిపై మండిపడుతూ, ఏం చదువుతున్నారని నిలదీశారు. వారు భయపడి నోరు విప్పలేదు. కాని ఉమర్ తాను ఏదో చదవడం విన్నానని అడిగారు. వారసలు ఆయనతో ఆ విషయం మాట్లాడ్డానికి ఇష్టపడలేదు. ఉమర్‌కు కోపం మరింత పెరిగింది. కోపంతో బావను పట్టుకుని కొట్టారు. అడ్డొచ్చిన సోదరిని కూడా నిర్దాక్షిణ్యంగా కొట్టారు. కోపంతో ఎంత గట్టిగా కొట్టారంటే వారికి రక్తం కారసాగింది. తన సోదరి ముఖంపై రక్తంకారుతుండడం చూడగానే ఆయన చల్లబడిపోయారు. అప్పటికి చెల్లెలు ఫాతిమా రక్తమోడుతూనే కోపంగా "అవును మేం ముస్లిములుగా మారిపోయాం. మేము ఒకే ఒక్క

దేవుడిని విశ్వసిస్తున్నాము. ఆయన పంపిన ప్రవక్తను విశ్వసిస్తున్నాము. ఇక నువ్వు నీ ఇష్టం వచ్చినట్లు చేసుకోవచ్చు." అన్నారు. చెల్లెలి మాటలు విని ఉమర్ వెనక్కి తగ్గారు. చెల్లెల్ని గాయపరిచినందుకు ఆయన్ను లోపల బాధ పిండేస్తోంది. కాని వారిద్దరు ముస్లిములుగా మారిపోయారన్న వార్త ఆయన్ను కలచివేస్తోంది. "సరే, మీరు చదువుతున్నదేమిటో నాకు చూపించండి" అన్నారు. చెల్లెలు ఇవ్వడానికి సిద్ధపడలేదు. ముందు వుజూ చేసుకురా (అంటే ప్రక్షాళన పద్ధతి, కాళ్ళుచేతులు, ముఖము కడగడం ద్వారా పరిశుద్ధం కావడం) ఆ తర్వాత ఇస్తానని చెప్పారు. కోపం కాస్త తగ్గుముఖం పట్టడంతో ఉమర్ ఆమె చెప్పినట్లు చేసారు. వుజు చేసుకుని చదవడం ప్రారంభించారు.

> "తాహా, మేము ఈ ఖుర్ఆన్‌ను నీపై అవతరింపజేసింది నిన్ను కష్టానికి గురిచేయటానికి మాత్రం కాదు. ఇది భయపడే ప్రతి వ్యక్తికీ ఒక జ్ఞాపిక. భూమినీ, ఎత్తైన ఆకాశాలనూ సృష్టించిన వాని తరపునుండి ఇది అవతరింపజేయబడింది. ఆ కరుణామయుడు (సృష్టి) సామ్రాజ్య పీఠంపై ఆసీనుడై ఉన్నాడు. ఆకాశాలలో, భూమిలో మరియు భూమ్యాకాశాల మధ్య, ఇంకా నేల క్రింద ఉన్న వాటినన్నింటికీ ఆయన యజమాని. నీవు నీ మాటను బిగ్గరగా పలికినా పరవాలేదు. ఆయన మెల్లగా పలికినా మాటను మాత్రమే కాదు, దానికంటే అతి గోప్యమైన మాటను సైతమూ ఎరుగును. ఆయన అల్లాహ్, ఆయన తప్ప మరొక దేవుడేలేడు. ఆయనకు ఉత్తమమైన పేర్లు ఉన్నాయి." (దివ్యఖుర్ఆన్ 20: 1-8)

ఉమర్ చదవడం ప్రారంభించిన మొదటి వాక్యాలివి. ఆ తర్వాత ఆయన ఇక చదవడం ఆపలేదు. ఈ వాక్యాల్లో దేవుడు మూసా ప్రవక్తను సీనా కొండలపై పిలిచిన ప్రస్తావన ఉంది. ఉమర్ చదువుతూ చివరకు ఈ క్రింది వాక్యం వద్దకు వచ్చారు :

> "నేనే అల్లాహ్‌ను, నేను తప్ప మరొక దేవుడు లేడు. కనుక నీవు నాకు దాస్యం చెయ్యి, నా జ్ఞాపకం కోసం నమాజును స్థాపించు" (దివ్యఖుర్ఆన్ 20 : 14)

ఉమర్ చదవడం ఆపేసి ఎంత గొప్పగా ఉంది ఈ వచనం, అద్భుతం, అతి సుందరం అంటూ ప్రశంసించడం మొదలుపెట్టారు. ఉమర్ కోపం తగ్గిపోయి, ప్రశంసించడం చూసిన ఖబ్బాబ్ కాస్త ధైర్యం చిక్కపట్టుకుని తాను దాక్కున్న చోటు నుంచి బయటకు వచ్చారు. ప్రవక్త ముహమ్మద్ దేవునితో ప్రార్థిస్తూ ఇద్దరిలో ఒకరి ద్వారా ఇస్లామ్‌కు బలం ప్రసాదించాలని కోరారని, ఆ ఇద్దరి పేర్లు ఒకటి ఉమర్, రెండవది అబూజహల్ అని తెలియజేశారు. ప్రవక్త ముహమ్మద్ ఎక్కడు ఉన్నారని ఉమర్ ఆయన్ను ప్రశ్నించారు. ప్రవక్త ముహమ్మద్ అల్

అర్ఖామ్ ఇంట ఉన్నారని తెలుసుకుని అక్కడకు బయలుదేరారు. ఆయన అల్‌అర్ఖామ్ ఇంటికి వెళ్ళినప్పుడు ఆయన రావడం చూసి అక్కడ అందరూ భయపడ్డారు. ఆయన చేతిలో కరవాలం అలాగే ఉంది. నగ్న కరవాలాన్ని ఊపుతూ ఆయన అక్కడికి వచ్చాడు. కాని ప్రవక్త వారిని భయపడవద్దని చెబుతూ ఆయన్ను లోనికి రానీయండన్నారు. ఉమర్ లోనికి వస్తూనే తాను ముస్లిమ్‌గా మారాలనుకుంటున్నానని ప్రకటించారు. ప్రవక్త ముహమ్మద్ అల్లాహు అక్బర్ (దేవుడు చాలా గొప్పవాడు) అంటూ స్వాగతించారు. తన ప్రార్థనలకు దేవుడు ఇచ్చిన జవాబు ఉమర్ రూపంలో దొరికిందని సంతోషించారు.

## మానసిక విప్లవం

ప్రవక్త ముహమ్మద్‌కు బాగా తెలుసు, హృదయాలను మార్చే శక్తి తనకు లేదు. దౌర్జన్యాలు, కష్టాలు, అణిచివేతల పరిస్థితుల్లో ఆయన దేవునిపైనే ఆధారపడ్డారు. ఆ ఇద్దరిలో (అబూజహల్, ఉమర్) ఎవరో ఒకరిని, ఎవరిలో మానవత్వం అధికంగా ఉందో వారిని, సమాజంలో ఎదురవుతున్న పరిస్థితుల్లో ఇస్లామ్‌కు తగిన బలసంపత్తి ప్రసాదించేవారిని దేవుడే తన వద్దకు పంపుతాడని ఆశించారు. హృదయాలను మార్చే శక్తి కేవలం దేవునికి మాత్రమే ఉందన్న వాస్తవం ప్రవక్త ముహమ్మద్‌కు బాగా తెలుసు. కొందరికి ఇస్లామ్ స్వీకరించడం ఒక సుదీర్ఘమైన ప్రక్రియగా కొనసాగుతుంది. అనేక ప్రశ్నలకు సమాధానాలు అన్వేషించి, అనేక సందేహాలు నివారించుకుని, ఒక అడుగు ముందుకు, రెండు అడుగులు వెనక్కు వేస్తూ ఉంటారు. కాని మరి కొందరికి ఇస్లామ్‌లోకి మారడం అన్నది అకస్మాత్తుగా, హఠాత్తుగా జరిగిపోతుంది. దివ్యఖుర్‌ఆన్ వాక్యాలు కొన్ని చదవగానే, ఏదో ఒక సంఘటనకు ప్రతిస్పందనగా వెంటనే ఇస్లామ్ లోకి మారిపోతారు. దీన్ని వివరించడం సాధ్యం కాదు. సుదీర్ఘకాలం ఆలోచించి ఇస్లామ్‌లోకి మారిన వారి విశ్వాసం దృఢంగా ఉంటుందన్న నియమం ఏదీ లేదు. అలాగే హఠాత్తుగా నిర్ణయం తీసుకున్నవారి విశ్వాసం బలహీనంగా ఉంటుందని కూడ చెప్పలేము. ఇస్లామ్ స్వీకరణ విషయానికి వస్తే మానసిక భావాలు, విశ్వాసబీజాలు, దైవప్రేమ ఇవే ముఖ్యమైనవి. మిగిలిందంతా దైవికంగా జరుగుతుంది.

ఉమర్ ఇంటి నుంచి ప్రవక్త ముహమ్మద్‌ను తుదముట్టించాలని బయలుదేరారు. ఏకదైవారాధన విశ్వాసాన్ని గుడ్డిగా తిరస్కరిస్తూ వచ్చారు. కేవలం కొన్ని గంటల్లోనే ఆయనలో మార్పు వచ్చింది. పూర్తిగా మారిపోయారు. దివ్యఖుర్‌ఆన్ వాక్యాల పఠనం ద్వారా, నిజదైవాన్ని గ్రహించడం వల్ల వచ్చిందీ మార్పు. ఆ తర్వాత ఆయన జీవితాంతం నిబద్ధత కలిగిన ముస్లిమ్‌గా, ప్రవక్త ముహమ్మద్‌కు అత్యంత సన్నిహిత సహచరునిగా జీవించారు. తాను

ఎవరిని చంపాలనుకున్నారో ఆ వ్యక్తికి జీవితాంతం నమ్మదగ్గ అనుచరునిగా ఉన్నారు. ఆ కాలంలో ఉమర్ వంటి వ్యక్తి ఇస్లామ్ స్వీకరిస్తాడని ఎవరూ భావించలేదు. ఉమర్ ఇస్లామ్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తూ, ద్వేషిస్తూ వచ్చిన వ్యక్తి. ఆయన హృదయపరివర్తనం ఒక సూచన వంటిది. ఇందులో రెండు బోధనలున్నాయి. దేవుడికి అసాధ్యం అంటూ ఏదీ లేదు. రెండవ బోధన ఏ విషయం గురించైనా, ఎవరి గురించైనా సరే ఇలాంటి వ్యక్తి అని లేదా ఇలా జరగుతుందని ఎవరూ తీర్పు చెప్పరాదు.

ఉమర్ ధైర్యసాహసాలకు మారుపేరు, ధృఢసంకల్పం ఉన్న వ్యక్తి. ఇస్లామ్ స్వీకరించిన తర్వాత రహస్యంగా ఉంచడానికి ఇష్టపడలేదు. వెంటనే బహిరంగంగా ప్రకటించడానికి పూనుకున్నారు. వెంటనే ఆయన అబూజహల్ వద్దకు వెళ్ళి ఈ విషయం తెలియజేశారు. అంతేకాదు, కాబాగృహంలో బహిరంగంగా ప్రార్థనలు చేద్దామని ప్రవక్త ముహమ్మద్‌కు సూచించారు. కాని అలా చేయడంలో చాలా ప్రమాదాలున్నాయి. కాని దీనివల్ల లాభాలు కూడా ఉన్నాయి. ఇస్లామ్‌ను తీవ్రంగా ద్వేషిస్తున్న ఖురైష్ నాయకులకు ముస్లిముల ధృఢసంకల్పాన్ని చాటి చెప్పినట్లవుతుంది. ముస్లిముల బలం వారు ఊహిస్తున్నంత తక్కువ కాదన్నది కూడా తెలుస్తుంది. ముఖ్యంగా ఉమర్, హంజా, వీరిద్దరు బలమైన వ్యక్తిత్వం కలిగినవారు. మక్కాలో వీరంటే భయం ఉంది. ముస్లిమ్ బృందానికి ముందు వీరిద్దరు నడుస్తూ కాబాగృహంలోకి ప్రవేశించారు. ముస్లిములందరూ కలిసి సాముదాయికంగా అక్కడ ప్రార్థనలు చేశారు. జోక్యం చేసుకోడానికి ఎవ్వరూ సాహసించలేదు.

# 7

# నిషేధం

కాని పరిస్థితులు మరింత దిగజారడం ప్రారంభమయ్యింది. ప్రతిరోజు ఉద్రిక్తత తారాస్థాయికి చేరుకుంటోంది. ఇస్లామ్ విస్తరణను ఎలాగైనా అడ్డుకోవాలని ఖురైష్ నాయకులు భావించారు. మరింత కఠినమైన చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. ఖురైషులకు ఇక్కడ ఒక ఇబ్బంది ఉంది. ఇస్లామ్ స్వీకరించినవారిలో అన్ని తెగల వారున్నారు. కాబట్టి సంప్రదాయకంగా తెగల సమీకరణాల వల్ల ఖచ్చితమైన వ్యూహం సాధ్యం కాదు. వివిధ తెగలతో వైరాన్ని కొనితెచ్చుకోవడమే అవుతుంది. ఖురైషులు దానికి సిద్ధంగా లేరు. ఖురైషుల సమావేశ మందిరంలో చాలా తీవ్రమైన చర్చలు జరిగాయి. ఎవరి వాదనలు వారు వినిపించారు. చివరకు ఒక నిర్ణయానికి వచ్చారు. ప్రవక్త ముహమ్మద్‌కు చెందిన బనూహాషిం తెగ మొత్తాన్ని బహిష్కరించాలని నిర్ణయం తీసుకున్నారు. తెగలోని అందరికీ వర్తించేలా బహిష్కరణ నిర్ణయం తీసుకున్నారు. అంటే ఆ తెగలోని వారందరూ, ముస్లిములైనా కాకపోయినా అందరికీ ఇది వర్తిస్తుంది. బనూ హాషింతో వివాహ సంబంధాలు పెట్టుకోరాదు, వారితో వ్యాపారం చేయరాదు, వారితో ఎలాంటి సంబంధాలు కొనసాగించరాదు.

ఈ విషయమై ఒక ఒప్పందాన్ని నలభై మంది ఖురైష్ నాయకులు రాసుకుని దానిపై సంతకాలు చేశారు. ఈ ప్రకటనను కాబా గోడకు వేలాడదీశారు. అబూలహబ్ కూడా హాషీం తెగకు చెందినవాడే. కాని ఇస్లామ్‌ను తీవ్రంగా ద్వేషించేవాడు. తాను బనూ హాషిం తెగ నుంచి వేరుపడుతున్నానని ప్రకటించి ఈ బహిష్కరణకు మద్దతిచ్చాడు.

ఈ బహిష్కరణ కాలం ముస్లిములకు, బనూ హాషిం తెగవారికి అత్యంత కష్టకాలం. బహిష్కరణ అమలులో ఉన్నందువల్ల బనూహాషిం పెద్దగా ప్రవక్త పినతండ్రి అబూతాలిబ్ తన వారందరినీ తీసుకుని షిఅబె అబూతాలిబ్ అనే ప్రదేశానికి వెళ్ళి తలదాచుకున్నారు.

అక్కడే వారు మూడేళ్ళు ఉండవలసి వచ్చింది. ప్రవక్త ముహమ్మద్ ఆయన అనుచరులు అందరూ అక్కడే ఈ మూడేళ్ళు ఉన్నారు. వారికి ఎలాంటి ఆహారపదార్థాలు అక్కడికి అందేవి కావు. అందరూ వారితో సంబంధాలు తెగతెంపులు చేసుకున్నారు. ప్రవక్త ఆయన అనుచరులు ఆకులు అలుములు తిని బతకవలసి వచ్చింది.

బహిష్కరణ వల్ల వారి పరిస్థితి అత్యంత దారుణంగా తయారైంది. వ్యాధులకు గురయ్యారు. ఆకలి బాధకు తట్టుకోలేకపోయేవారు. ఈ బహిష్కరణ మూడేళ్ళకు మించి కొనసాగింది. ఈ బహిష్కరణ రెండు తెగలను ఆర్థికంగా క్రుంగదీసింది. అబూబక్ర్ దీనివల్ల చాలా నష్టపోయారు. సామాజిక, మానసిక ఒత్తిడి భరించరాని స్థాయికి చేరుకుంది.

# బహిష్కరణ రద్దు

ఖురైషుల్లోనే చాలా మంది ఈ బహిష్కరణను వ్యతిరేకించడం ప్రారంభించారు. ఇది అనవసరమని అభిప్రాయపడ్డారు. దీనివల్ల ఎలాంటి ఉపయోగం లేదన్నారు. ఇందులో చాలా మందికి బనూహాషింతో బంధుత్వాలు ఉండడం కూడా దానికి కారణం. బంధుత్వసంబంధాలను మరిచిపోవడం, విస్మరించడం అంత తేలిక కాదు. ఈ బహిష్కరణను రద్దుచేయించడానికి అనేక ప్రయత్నాలు జరిగాయి. కాని ఈ ప్రయత్నాలను అబూజహల్, అబూలహబ్ వంటి వారు తీవ్రంగా వ్యతిరేకించడం వల్ల ముందుకు సాగలేదు. చివరకు కొందరు తీసుకున్న చొరవవల్ల మార్పు వచ్చింది. కొందరు వ్యక్తుల బృందం ప్రతి తెగతోను మాట్లాడివారి మద్దతు పొందింది. బహిష్కరణ విషయమై చేసుకున్న ఒప్పందంలోని అంశాలన్నీ చెల్లవని ప్రకటించింది. ఈ బహిష్కరణ ప్రకటనను చింపిపారేసే వరకు విశ్రమించేది లేదని వాళ్ళు ప్రకటించారు. కాని అక్కడ ఉన్న అబూజహల్ ఆ ప్రకటన పత్రం చించడానికి వీల్లేదని వాదించాడు.

ఈ లోగా అబూతాలిబ్ అక్కడకు వచ్చి ప్రవక్త ముహమ్మద్‌కు దివ్యఖుర్ఆన్ వాక్యాలు అవతరించాయని, ఆ వాక్యాల ప్రకారం కాబాకు వేలాడదీసిన ప్రకటన పత్రాన్ని చెదలు తినేశాయని తెలియజేశారు. ఆ ప్రకటన పత్రంలో అన్యాయపు, అణిచివేతల అంశాలన్నింటిని చెదలు తినేశాయని, కేవలం దేవుని పేరున్న ముక్క మాత్రమే మిగిలిందని చెప్పారు. ఒకవేళ తన మాటలు అబద్ధమైతే తాను స్వయంగా తన సోదరుడి కుమారుడైన ప్రవక్త ముహమ్మద్‌ను అప్పగిస్తానని కూడా ఒప్పుకున్నారు. తన మాటలు నిజమైతే ఈ బహిష్కరణ ఇంతటితో ముగించాలని చెప్పారు. మక్కావాసులు దీనికి ఒప్పుకున్నారు. ఖురైష్ నాయకుడు ముతీమ్ ఆ ప్రకటన పత్రాన్ని చూడ్డానికి కాబాకు వెళ్ళాడు. ఒక గొర్రె చర్మంపై రాసిన ప్రకటన అది.

దాన్నంతా చెదలు తినేశాయి. కేవలం దేవుని పేరుతో అన్న వాక్యం తప్ప మరేమీ మిగల్లేదు.

ఇక బహిష్కరణ విషయమై పట్టుపట్టడం వల్ల ఉపయోగం లేదని ఖురైషులు భావించారు. ఆ విధంగా బహిష్కరణ రద్దయ్యింది. ప్రవక్త ముహమ్మద్ ఆయన అనుచరులందరూ తిరిగి తమ ఇండ్లకు చేరుకున్నారు. ముస్లిములు ఎదుర్కున్న ఈ విపత్కర పరిస్థితిలో ఖురైష్ నాయకులకు ప్రవక్త ముహమ్మద్ నిజమైన దైవప్రవక్త అని తెలియజేసే అనేక సూచనలు ఉన్నాయి. చెదలు ఆ ప్రకటన పత్రాన్ని మొత్తం తినేయడం, కేవలం దేవుని పేరుతో అన్న వాక్యం మాత్రమే మిగలడం వంటి ఈ సూచనలను కూడా ఆ దురదృష్టవంతులు చూడలేకపోయారు.

> "వారు ఏ సూచనను చూసినా తమ ముఖాలను తిప్పుకుంటున్నారు. ఇది నడుస్తున్న మంత్రజాలమే అని అంటున్నారు." (దివ్యఖుర్ఆన్ 54:2)

## శోకసంవత్సరం

బహిష్కరణ ముగిసిన అనేక నెలల తర్వాత నెమ్మదిగా మక్కాలోని అతిచిన్న ముస్లిం సముదాయం నెమ్మదిగా కుదుటపడింది. ఖురైషులతో సంబంధాలు, వ్యాపార లావాదేవీలు నెమ్మదిగా మొదలయ్యాయి. ప్రవక్త ముహమ్మద్ ఇస్లామీయ సందేశాన్ని మక్కాలో ప్రచారం చేస్తూనే ఉన్నారు. పరాభవాలు, ఎగతాళి, అపహాస్యాలు, దౌర్జన్యాలు తగ్గుముఖం పట్టలేదు.

పరిస్థితులు నాటకీయంగా మారడం మొదలయ్యింది. ప్రవక్త ముహమ్మద్ అర్ధాంగి బహిష్కరణ రద్దయిన కొద్ది కాలానికే స్వర్గస్తులయ్యారు. ఆమె మక్కాలో అత్యంత సంపన్న మహిళ. ఆమె తన సంపదనంతా దానధర్మాలకు ఖర్చు చేశారు. ఆమె ముహమ్మద్ ప్రియసతి, ఆయన ధార్మికవిశ్వాసంలో కొండంత అండగా వెంట నిలిచారు. దాదాపు పాతిక సంవత్సరాల పాటు ఆయనకు వెన్నుదన్నుగా ఉన్నారు. ఇస్లామీయ సందేశప్రచారోద్యమం ప్రారంభమైన తొమ్మిది సంవత్సరాలకు, అంటే కామన్ ఎరా 619లో ఆమెను దేవుడు తన వద్దకు పిలుచుకున్నాడు. ఆమె ఎడబాటు ప్రవక్తకు భరించరాని విషాద సంఘటన. తన పక్కన ఖదీజా ఉండడమంటే దేవుని సంరక్షణకు, ప్రేమాభిమానాలకు సూచన అని ఆయనకు తెలుసు.

ఆ తర్వాత కొద్దికాలానికే ప్రవక్త పినతండ్రి, అంతవరకు ఆయనకు సంరక్షకునిగా నిలిచిన అబూతాలిబ్ జబ్బుపడ్డారు. ప్రవక్త ముహమ్మద్ ఆయన్ను పరామర్శించడానికి వెళ్ళారు. అక్కడ ఇస్లామ్ బద్ధ శత్రువులు అబీ ఉమయ్యా, అబూజహల్ కూడా ఉన్నారు. ప్రవక్త

ముహమ్మద్ తన పినతండ్రిని చూస్తూ "బాబాయీ, మీరు అల్లాహ్ తప్ప మరో దేవుడెవ్వడూ లేడని ఒక్క మాట చెప్పండి. మీరు నిజమైన విశ్వాసిగా నేను దేవుని ముందు సాక్ష్యమిస్తాను" అన్నారు. అబూజహల్, అబీ ఉమయ్యాలు వెంటనే కలుగజేసుకుని "అబూతాలిబ్, నువ్వు మన తాతముత్తాతల ధర్మాన్ని వదిలేస్తావా" అన్నారు. ప్రవక్త ఆయనకు విజ్ఞప్తి చేస్తూనే ఉన్నారు. వాళ్ళిద్దరు అడ్డుకుంటూ అబూతాలిబ్‌పై తమ ఒత్తిడి పెంచారు. చివరకు అబూతాలిబ్ తన నిర్ణయాన్ని ప్రకటిస్తూ తాను తన తాతముత్తాతల ధర్మానికే కట్టుబడి ఉంటానని, అల్లాహ్ తప్ప మరో దేవుడు లేడన్న మతవిశ్వాసాన్ని స్వీకరించలేనని చెప్పారు. అబూతాలిబ్ జీవితాంతం ప్రవక్త ముహమ్మద్‌కు సంరక్షకునిగా నిలిచిన పినతండ్రి. ఆయన మాటలు విన్న తర్వాత ప్రవక్త ముహమ్మద్ ఇలా అన్నారు : "దేవుని సాక్షి, నేను మీ కోసం క్షమాభిక్ష కోరుతూనే ఉంటాను. ఆ పని చేయకుండా నన్ను నిషేధించే వరకు చేస్తాను"

ఈ విషయమై మరింత మాట్లాడే సమయం కూడా అక్కడ లేదు. ప్రవక్త అక్కడున్నప్పుడే అబూతాలిబ్ చివరి శ్వాస విడిచారు. అబూతాలిబ్ ధైర్యంగా, హుందాగా తన సోదరుడి కుమారుడైన ప్రవక్త ముహమ్మద్‌కు సంరక్షకునిగా నిలిచారు. ప్రవక్త ముహమ్మద్‌ను ఎంతో ప్రేమాభిమానాలతో చూశారు. కాని ఇస్లామ్ స్వీకరించలేదు. ప్రవక్త ముహమ్మద్ ఆయన్ను ఎంతో ప్రేమించేవారు. ఎంతో గౌరవించేవారు. ఆయన మరణం పట్ల ప్రవక్త చాలా దు:ఖించారు. ప్రవక్త ఎంతగానో ప్రేమించిన ఇద్దరు వ్యక్తులు ఇహలోకాన్ని వదిలి వెళ్ళిపోయారు. అత్యంత శోకతప్తమైన ఈ సమయంలో దివ్యఖుర్‌ఆన్ వాక్యాలు జీవిత సత్యాలను తెలియజేస్తూ అవతరించాయి.

> "ప్రవక్తా! నీకు ఇష్టమైన వారికి నీవు మార్గదర్శకత్వాన్ని ప్రసాదించలేవు. కాని అల్లాహ్ తనకు ఇష్టమైన వారికి మార్గదర్శకత్వాన్ని ప్రసాదించగలడు, ఆయన తన మార్గదర్శకత్వాన్ని స్వీకరించే వారిని బాగా ఎరుగును" (దివ్యఖుర్‌ఆన్ 28:56)

# ఖదీజా

# ఆదర్శ ధర్మపత్ని

( దైవం ఆయన పట్ల ప్రసన్నుడవుగాక )

హజ్రత్ ఖదీజా నిర్వహించిన పాత్ర గురించి తెలుసుకోవడం ఇక్కడ ఎంతైనా అవసరం. ఇస్లామీయ సందేశప్రచారం జరుగుతున్న ఈ కాలంలో అనేక సంఘటనల్లో, అనేక కష్టాలు, కడగండ్లు, విపత్తులలో ఆమె పోషించిన పాత్ర ఎంతో ముఖ్యమైనది. ప్రవక్త ముహమ్మద్

విశిష్ట వ్యక్తిత్వాన్ని ఆమె మొదట గుర్తించారు. ప్రవక్త లోని నిజాయితీ, సత్యసంధత, నిష్పక్షపాతాలను గుర్తించారు. ఆ లక్షణాల కారణంగానే ఆయన్ను తన భర్తగా ఎన్నుకున్నారు. సాధారణ సంప్రదాయాలను కాదని తన తరఫున పెళ్ళి ప్రతిపాదనను ధైర్యంగా తన స్నేహితురాలు నుఫైసా ద్వారా పంపారు. వారిద్దరి వివాహ జీవితం ఎంతో అన్యోన్యమైనది. అందులో విషాదాలు కూడా ఉన్నాయి. ఇద్దరు కుమారులను పోగొట్టుకున్నారు. వారికి పుట్టిన ఖాసిమ్, అబ్దుల్లాలు చిన్నవయసులోనే మరణించారు. నలుగురు కుమార్తెలు మాత్రమే పెరిగి పెద్దయ్యారు. ఈ కుటుంబం ఒక కష్టాల బాటన ప్రయాణించింది. అరబ్బుల్లో ఆ కాలంలో ఆడపిల్ల పుట్టుకను అత్యంత అప్రతిష్టకరమైనదిగా భావించే కాలంలో ప్రవక్త ముహమ్మద్, ఆయన ధర్మపత్ని ఖదీజా తమ ఆడపిల్లల్ని అల్లారుముద్దుగా చూసుకునేవారు. అంతేకాదు తాము కుమార్తెలను ఎంతో ముద్దుగా చూసుకుంటామన్న విషయాన్ని బహిరంగంగానే చెప్పేవారు. ఎవరు ఏమనుకుంటారని సంకోచించేవారు కాదు.

నలభై సంవత్సరాల వయసులో ప్రవక్త ముహమ్మద్ దైవసందేశాన్ని స్వీకరించారు. ఆ వెంటనే ఈ విషయాన్ని, ఈ అనుభవాన్ని ఆయన తెలియజేసింది తన భార్య ఖదీజాకే. ఆయనకు ధైర్యమిచ్చి మద్దతుగా నిలిచిన మొదటి వ్యక్తి ఆమెయే. వైవాహిక జీవితంలో ఆమె గొప్ప వ్యక్తిత్వం కలిగిన ప్రవక్తను అతి సన్నిహితంగా పరిశీలించారు. హీరా గుహ నుంచి ప్రవక్త ముహమ్మద్ ఆమెవద్దకు వచ్చినప్పుడు ఆందోళనతో ఉన్నప్పుడు, తనకేమవుతుందో తెలియక అనేక సందేహాలతో సతమతమవుతున్నప్పుడు ఆమె తన ప్రేమాభిమానాలతో ఆయన్ను ఆదుకున్నారు. ఆయనలోని గొప్ప లక్షణాలను ఆయనకు గుర్తుచేశారు. ఆయనలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించారు. దివ్యఖుర్ఆన్ మొదటి అవతరణ ఒక గొప్ప కానుక మాత్రమే కాదు ఇది ఒక పెద్ద పరీక్ష కూడాను. ఆయన ఒంటరిగా, అయోమయంగా ఉన్న అవస్థ అది. అలాంటి పరిస్థితిలో ఆయన వెంటనే వెళ్ళింది తన భార్య వద్దకే. ఆమె తక్షణం ఆయనకు ఆసరాగా నిలబడడమే కాదు ఆయనలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించారు. అప్పటి నుంచి ఆ ఇద్దరికీ పరీక్షలు తప్పలేదు. దేవుని ఆదేశాలను పాటించడం, అర్థం చేసుకోవడం, ఆధ్యాత్మిక మార్గాన నడవడం కొనసాగించారు. ఈ వివరాలన్నీ పరిశీలిస్తే హజ్రత్ ఖదీజా ప్రవక్త ముహమ్మద్‌కు వెన్నుదన్నుగా నిలవడం కూడా దేవుడి సూచనల్లో ఒకటని అర్థమవుతుంది. అందరికన్నా ముందు ఇస్లామ్ స్వీకరించింది ఆమెయే. ప్రవక్త ముహమ్మద్ ఇస్లామీయ సందేశ ప్రచారం కొనసాగించిన మొదటి పదిసంవత్సరాల కాలంలో ఆయనకు బాసటగా ఆమె అనుక్షణం ఉన్నారు. ప్రవక్త జీవితంలో ఆమె పోషించిన పాత్ర సాటిలేనిది. పాతికేళ్ళ కాలం ఆమె మాత్రమే ఆయనకు భార్యగా ఉన్నారు. ఆమె ఉనికి ప్రవక్తకు ఒక రక్షణగా మారింది. అణిచివేతలు, దౌర్జన్యాలు, బహిష్కరణల కష్టాలన్నింటిలోను ఆయనకు తోడునీడగా ఆమె నిలిచారు. ప్రవక్త ఆమెను ఎంతో

ప్రేమించేవారు. దేవుడు ప్రవక్తగా ఆయన్ను ఎన్నుకున్నాడన్న శుభవార్తను ఆమె గ్రహించారు. ఆమె చాలా స్వతంత్ర వ్యక్తిత్వం ఉన్న మహిళ. హుందాతనం, గౌరవమర్యాదలున్న మహిళ. ఒక భార్యగా ఆమె విశ్వసనీయురాలైన, బలమైన, నిబద్ధత, దృఢసంకల్పం కలిగిన మహిళ. అత్యంత ఆత్మవిశ్వాసం ఆమెకు స్వంతం. ధర్మపరాయణత కలిగిన ముస్లిమ్, నిజాయితీ, నిబద్ధత, సహనస్వభావాలకు ప్రతిరూపం. ఆమె ఉనికి వల్ల ఎన్నడూ ప్రవక్త ముహమ్మద్ ఒంటరిగా లేరు. ఆయన జీవితంలో ఖదీజా వంటి మహిళ రావడం ప్రవక్త పట్ల దేవుడికి ఉన్న ప్రేమాభిమానాలకు నిదర్శనం.

> ఆమె వ్యక్తిత్వం, ప్రవక్త జీవితంలో ఆమె పోషించిన పాత్రలను పరిశీలిస్తే ఆ తర్వాత కొంతకాలానికి అవతరించిన ఒక దివ్యఖుర్ఆన్ వాక్యంలో మనకు అనేక అర్థాలు తెలుస్తాయి. ఆ దివ్యఖుర్ఆన్ వాక్యం భార్యభర్తల సంబంధాన్ని ఇలా వర్ణించింది. "వారు మీకు దుస్తులు, మీరు వారికి దుస్తులు "(దివ్యఖుర్ఆన్ 2:187)

మానసికంగాను, శారీరకంగాను, భావావేశాల పరంగాను ఆయనకు రక్షణ కల్పించే వస్త్రం అయ్యారామె. బలహీనతలు, సందేహాలు, సంపదలు కప్పిపుచ్చి వెచ్చటి సాంత్వనను, బలాన్ని, హోదాను, హుందాతనాన్ని, మర్యాదను ఇచ్చే వస్త్రంగా మారారు.

తన భార్య ఖదీజా ఎడబాటుకు ప్రవక్త చాలా దు:ఖించారు.

"ప్రజలు నన్ను నమ్మనప్పుడు ఆమె నన్ను నమ్మింది. ప్రజలు నన్ను కాదన్నప్పుడు ఆమె నన్ను విశ్వసించింది. ఎవ్వరు నా కోసం ముందుకు రానప్పుడునాకు సహాయంగా, సాంత్వనగా తన వ్యక్తిత్వంతో, తన సంపదతో ఆమె నిలబడింది. దేవుడు నాకు ఆమె ద్వారా సంతానాన్ని ప్రసాదించాడు." అని ఎంతో ఆవేదనగా అన్నారు

## తాయిఫ్

కేవలం కొన్ని నెలలోనే ప్రవక్త చాలా బలహీనమైపోయారు. ఆయనకు ప్రేమాభిమానాలు పంచి ఇచ్చిన వ్యక్తి ఈ లోకాన్ని విడిచివెళ్ళిపోయింది. ఆయనకు సంరక్షకుడిగా నిలిచిన వ్యక్తి కూడా మరణించారు. ఈ విషాద సమయంలో కూడా ఆయన సత్వరం ప్రతిస్పందించవలసిన పరిస్థితులున్నాయి. మక్కాలో ఉన్న అతిచిన్న ముస్లిమ్ సముదాయం భద్రత విషయమై ఆలోచించవలసి ఉంది. మక్కాకు బయట సహాయం కోసం ప్రయత్నించాలని ఆయన భావించారు.

కామన్ ఎరా 619, జూన్ మాసం ప్రారంభంలో, అంటే ప్రవక్తగా బాధ్యతలు

స్వీకరించిన పదవసంవత్సరంలో ఆయన మక్కాకు 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న తాయిఫ్‌కు కాలినడకన బయలుదేరారు. ఆయనతో పాటు ఆయన స్వేచ్ఛ ప్రసాదించిన బానిస జైద్ ఉన్నారు. ఇస్లామ్ సందేశ ప్రచారానికి, తాయిఫ్ తెగ నాయకులతో మాట్లాడి ఇస్లామీయ సందేశం గురించి నచ్చచెప్పాలని భావించారు. తాయిఫ్ తెగ నాయకులు అర్థం చేసుకుంటారని ఆశించారు. కాని ఆయన్ను అక్కడ ఎవరు ఆదరించలేదు. ఆయన ప్రవక్తగా చెప్పడాన్ని తాయిఫ్ నాయకులు ఎగతాళి చేశారు. అపరిచిత తెగల మద్దతు కోసం ప్రాధేయపడేలా దేవుడు తన ప్రవక్తను తయారు చేశాడా అని అపహాస్యం చేశారు. వాళ్ళు ఈ విషయమై మాట్లాడడానికి కూడా సిద్ధపడలేదు. అంతేకాదు, ఆయన తిరిగి వెళుతున్నప్పుడు అల్లరి శక్తులను రెచ్చగొట్టి ఆయనపై దాడులు చేయించారు. అవమానకరంగా ఆయన్ను ఎగతాళి చేస్తూ, పిల్లలతో ఆయనపై రాళ్ళు వేయిస్తూ ఈ గుంపు ఆయన్ను వెంటాడడం మొదలుపెట్టింది. ఆయన కాళ్ళ నుంచి రక్తం ధారగా కారసాగింది. జైద్ ఆయనకు రక్షణగా రాళ్ళదెబ్బలు కాచుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఆయనకు తలపై తీవ్రంగా దెబ్బతగిలింది. ఆ ఇసుక మైదానంలో ఆయన్ను రెండు మూడు మైళ్ళ వరకు వారు వెంటాడి వేధించారు. ఆయన అక్కడి కొండల్లోకి వెళ్ళారు. వాళ్ళ నుంచి తప్పించుకోడానికి, అలసి సొలసి, రక్తమోడుతున్న దేహంతో ఆయన ఒక తోటలోకి ప్రవేశించారు.

"ప్రభూ! నా బలహీనతలు, నా వనరుల కొరత, ఈ మనుష్యుల మధ్య నా హోదా స్థాయి విషయంలో నేను నీకు తప్ప మరెవ్వరికీ మొరపెట్టుకోలేను. కరుణామయుడైన దేవా నీవే బలహీనులకు ప్రభువు. నీవే నాకు ప్రభువు. నీవు నన్ను ఎవరిచేతుల్లో వదిలేస్తున్నావు. నా పట్ల అనుచితంగా వ్యవహరించే అపరిచితుల్లోనా? లేక నా వ్యవహారాల విషయంలో నీవు అధికారం ప్రసాదించిన నా శత్రువుల చేతుల్లోనా? నీకు నా పట్ల ఆగ్రహం లేనంత కాలం నేను ఎవరికీ భయపడను. నీ కరుణాభరితమైన మద్దతు చాలు నాకు కొత్త ద్వారాలు తెరువడానికి, కొత్త అవకాశాలు రావడానికి. నిన్నే శరణు వేడుకుంటున్నాను. నీ వల్లనే సమస్త చీకట్లు తొలగిపోతాయి. ఇహ పరలోకాల్లో వ్యవహారాలన్నీ చక్కదిద్దుకుంటాయి. ఈ విధంగా నేను నీ ఆగ్రహం నుంచి రక్షణ పొందుతున్నాను. నీవు సంతృప్తి చెందనంత వరకు నా విషయంలో సర్వ నిర్ణయాలు నీవే. నీవు తప్ప శక్తిసామర్థ్యాలు ఎక్కడా లేవు."

ఆ క్షణంలో, ఒంటరిగా, తన నగరానికి దూరంగా, తన ప్రభువు పట్ల అచంచల విశ్వాసంతో ఆయన తన్ను తాను దేవుడికి పూర్తిగా సమర్పించుకున్నారు. ఈ ప్రార్థన ద్వారా ఆయన దేవునిపై నమ్మకం ద్వారా పొందుతున్న ఆత్మవిశ్వాసాన్ని, శాంతిని మనం అర్థం చేసుకోవచ్చు. ఇది చాలా ప్రముఖమైన ప్రార్థన. మానవాళి బలహీనతలు, ప్రవక్తలో ఉన్న అసాధారణమైన ఆధ్యాత్మిక శక్తికి ఈ ప్రార్థన ఒక నిదర్శనం. ఒంటరిగా ఎక్కడి నుంచి

ఎలాంటి మానవసహాయం లభించే అవకాశం లేని చోట కూడా ఆయన తాను ఒంటరిగా లేనన్నది ఆయనకు తెలుసు.

## ఒక బానిస

ఆ తోట యజమానులు ఇద్దరు ప్రవక్త ముహమ్మద్ తోటలోకి ప్రవేశించడాన్ని, చేతులెత్తి దేవుని ప్రార్థించడాన్ని దూరం నుంచి చూశారు. ఆయన వద్దకు వారు తమ బానిస అద్దాస్‌ను పంపించారు. అతను ఒక క్రయిస్తవ యువకుడు. కొన్ని ద్రాక్షపండ్లు తీసుకుని అతను వచ్చాడు. అతను ఆ ద్రాక్షపండ్లను ప్రవక్త ముహమ్మద్‌కు ఇచ్చినప్పుడు ఆయన బిస్మిల్లా అంటూ స్వీకరించడాన్ని అతను విన్నాడు. బిస్మిల్లా అంటే దేవుని పేరుతో అని అర్థం. అద్దాస్ ఆశ్చర్యపోయి ఆయన గురించి వివరాలు అడిగాడు. అద్దాస్ ఆశ్చర్యానికి కారణమేమంటే అతను ఒక క్రయిస్తవుడు, బహుదైవారాధకులు ఇలాంటి పదాన్ని ఉచ్చరించడం అతనెప్పుడు వినలేదు. ప్రవక్త అతడి వివరాలు అడిగారు. ఎక్కడి నుంచి వచ్చావన్నారు. అతను తాను నినేవా (ఇప్పుడు ఇస్రాయీల్‌లో ఉంది) నుంచి వచ్చానని చెప్పాడతను. అంటే మత్తా కుమారుడు జోనా దేశం నుంచన్నమాట అన్నారు ప్రవక్త. ఆ యువకుడు మరింత నిర్ఘాంతపోయాడు. ఆయనకు ఈ వివరాలు ఎలా తెలుసో అతడికి అర్థం కాలేదు. తాను ఒక క్రయిస్తవుడినని చెప్పి ఆ యువకుడు ప్రవక్త గురించి అడిగాడు. ఈ వివరాలు మీకెలా తెలుసని ప్రశ్నించాడు. ప్రవక్త అతడికి జవాబిస్తూ :

"జోనా నాకు సోదరుడు ఆయన ఒక ప్రవక్త. నేను ఒక ప్రవక్తను" అన్నారు.

అద్దాస్ కొంతసేపు ప్రవక్తను తేరిపార చూశాడు. ఆ తర్వాత ప్రవక్త తలను, చేతులను, కాళ్ళను ముద్దుపెట్టుకున్నాడు. అద్దాస్ యజమానులు దూరం నుంచి ఇది చూసి ఆశ్చర్యపోయారు. అతను వారి వద్దకు వెళ్ళి ప్రవక్త ముహమ్మద్ చెప్పిన మాటలు ఒక ప్రవక్త మాత్రమే చెప్పగలడని, ఆ వివరాలు మరొకరికి తెలిసే అవకాశం లేదని అన్నాడు. కొన్ని నిముషాల సంభాషణలోనే అద్దాస్ ఇస్లామ్ స్వీకరించాడు.

అబిసీనియాకు చెందిన క్రయిస్తవ రాజు నీగస్ కూడా తక్షణం ఈ సందేశంలోని సత్యసంధతను గుర్తించాడు. అలాగే మరో క్రయిస్తవుడు, ఒక బానిస యువకుడు కూడా తక్షణం సందేశాన్ని గుర్తించాడు. అప్పటికి రెండుసార్లు ప్రవక్త కష్టాల్లో ఉన్నప్పుడు ఒక క్రయిస్తవుడు ఆయనకు సహాయం అందించడం జరిగింది. ఆయన్ను గౌరవించి, ఆయనకు ఆశ్రయం ఇవ్వడం జరిగింది. ఒక క్రయిస్తవ రాజు ముస్లిములను ఆహ్వానించి తన దేశంలో

ఆశ్రయమిచ్చాడు. తాయిఫ్‌లో అందరూ ప్రవక్తను తిరస్కరించి ఆయనపై దాడికి పూనుకున్నప్పుడు ఒక క్రయిస్తవ బానిస ఆయనకు సేవలందించాడు.

అక్కడ కాస్త సేదదీరిన తర్వాత ప్రవక్త కాస్త కుదుట పడ్డారు. దైవికంగా లభించిన ఈ సహాయం వల్ల ఆయనకు సాంత్వన లభించింది. ఆయన లేచి మక్కా వైపు ప్రయాణమయ్యారు.

## మదీనాలో ప్రతిస్పందన

మక్కాకు దగ్గరగా ఉన్న ప్రదేశం అల్ అకాబా. అక్కడ ప్రవక్త ముహమ్మద్ మదీనాకు చెందిన ఒక బృందాన్ని కలుసుకుని సమావేశమయ్యారు. వారంతా ఖజ్‌రజ్ తెగకు చెందినవారు. మదీనలోని రెండు ముఖ్యమైన తెగల్లో ఇది ఒకటి. ఈ రెండు తెగల మధ్య వైరం కొనసాగుతూ ఉంది. రెండవ తెగ ఔస్. వారికి ప్రవక్త ముహమ్మద్ ఇస్లామీయ సందేశాన్ని వినిపించారు. వారు శ్రద్ధగా విన్నారు. తర్వాత ఆ సందేశాన్ని స్వీకరిస్తున్నామని చెప్పారు. తాము మదీనా వెళ్ళి ఈ సందేశ సారాన్ని తమ ప్రజలకు తెలియజేస్తామని కూడా అన్నారు. ప్రవక్తతో శాశ్వత సంబంధాలు కొనసాగిస్తామని కూడా చెప్పారు. వారు వెనక్కి వెళ్ళి మదీనాలో ఇస్లామీయ సందేశ ప్రచారం ప్రారంభించారు.

ఒక సంవత్సరం తర్వాత మళ్ళీ మక్కాకు యాత్రికుల రాక మొదలైంది. ప్రవక్తకు, మదీనా బృందానికి మధ్య అల్ అకాబా వద్ద రెండో సమావేశం ఏర్పాటు చేయబడింది. మదీనాలో పరిస్థితి గురించి ఈ బృందం ప్రవక్తకు నివేదించడానికి వచ్చింది. మొత్తం పన్నెండు మంది మదీనా బృందంలో ఉన్నారు. అందులో ఇద్దరు ఔస్ తెగకు చెందినవారు కూడా ఉన్నారు. వారు ప్రవక్తతో మైత్రి ప్రతిజ్ఞ చేశారు. తాము ఒకే ఒక్క దేవుడిని ఆరాధిస్తామని, ఇస్లామీయ విధులను పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఆ విధంగా వారు మదీనాలో మొదటి ముస్లిమ్ సముదాయంగా ఏర్పడ్డారు. వారితో పాటు ప్రవక్త ముహమ్మద్ ముసాబ్ బిన్ ఉమైర్‌ను పంపించారు. ముసాబ్ నెమ్మదస్తుడు, వివేకం కలిగినవాడు, దివ్యఖుర్‌ఆన్ చక్కగా చదవగలడు. ఆయన అక్కడ ముస్లిమ్ సముదాయం శిక్షణ కోసం వెళ్ళారు.

మదీనాలో ఈ బృందం ఇస్లామీయ సందేశాన్ని ప్రచారం చేయడం ప్రారంభించింది. ముసాబ్ వారికి ఇస్లామీయ మౌలికాంశాల శిక్షణ ఇవ్వసాగారు. దివ్యఖుర్‌ఆన్ పఠించి వినిపించేవారు. వారికి నేర్పేవారు. మదీనా ప్రజలు అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పేవారు.

మదీనాలో ఖజ్‌రజ్, ఔస్ తెగలకు మధ్య సుదీర్ఘమైన వైరం ఉంది. అయినప్పటికీ,

ఇరు తెగలకు చెందిన అనేకమంది ఇస్లామ్ స్వీకరించారు. తమ పాతవైరాలు అర్థంలేనివిగా తెలుసుకున్నారు. ఇస్లామ్ లోని సౌభ్రాత్ర సందేశం వారిని ఒక్కటి చేసింది. కాని తెగల నాయకులు మాత్రం ఇస్లామ్ స్వీకరించడానికి ముందుకు రాలేదు.

ముసాబ్ వారితో వాదనకు దిగేవారు కాదు, చాలా నెమ్మదిగా వ్యవహరించేవారు. కూర్చొండి, ఇస్లామ్ సందేశాన్ని వినండి. మీకు నచ్చితే స్వీకరించండి లేదా వదిలేయండి అనేవారు. ఫలితంగా తెగల పెద్దల్లోను చాలా మంది ఇస్లామ్ స్వీకరించడం మొదలైంది.

ఆ తర్వాతి సంవత్సరం హజ్ యాత్ర సందర్భంగా ప్రవక్త మదీనా నుంచి వచ్చిన ముస్లిముల ఒక ముఖ్యమైన బృందాన్ని కలుసుకున్నారు. అందులో 72 మంది ఉన్న ఆ బృందంలో ఇద్దరు మహిళలు కూడా ఉన్నారు. వారు ఖజ్రజ్, ఔస్ రెండు తెగలకు చెందినవారు. వారు ఇస్లామ్ పట్ల తమ నిబద్ధతను ప్రవక్తకు తెలియజేయడానికి వచ్చారు. తమ భవిష్య సంబంధాల గురించి కొద్దిపాటి చర్చ జరిగింది. ఆ తర్వాత వారు మరో ప్రతిజ్ఞ చేశారు. ప్రవక్తకు రక్షణ కల్పిస్తామని, మక్కా ముస్లిములకు కూడా ఆశ్రయమిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఎలాంటి దాడులు ఎదురైనా భద్రత కల్పిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

మదీనా ముస్లిములు చేసిన ఈ రెండవ ప్రతిజ్ఞ, మక్కాలోని ముస్లిమ్ పురుషులు, స్త్రీలు, పిల్లలు అందరికీ ఆశ్రయం కల్పిస్తామని, రక్షణ కల్పిస్తామని చేసిన ప్రతిజ్ఞ తర్వాత ప్రవక్తకు ఇస్లామ్ సందేశ ప్రచారానికి కొత్త దారులు తెరుచుకున్నాయి. అప్పటి నుంచి ప్రవక్త ముస్లిములను మదీనాకు రహస్యంగా వలస వెళ్ళవలసిందిగా ప్రోత్సహించారు. ఆయన, కొందరు సన్నిహిత అనుచరులు మాత్రమే మక్కాలో మిగిలారు.

## కుట్ర

ప్రవక్త ముహమ్మద్‌కు సంరక్షకుడిగా ఉన్న ముతీమ్ మరణించారు. పరిస్థితి మరింత విషమంగా తయారైంది. ఖురైషులు కూడా ముస్లిములు మక్కా వదిలిపోవడాన్ని గమనించసాగారు. మరింత హింసాత్మకంగా ఇస్లామ్‌ను వ్యతిరేకించసాగారు. ఖురైషులందరూ ఈ సమస్య పరిష్కారానికి ఒక్కటయ్యారు. అబూలహబ్, అబూజహల్‌ల ప్రోద్బలంతో ప్రవక్తను తుదముట్టించే కుట్రకు పూనుకున్నారు. వారి పథకమేమిటంటే, ప్రతి తెగ నుంచి ఒక యువకుడిని ఎన్నుకుని, ఆ యువకులందరూ కలిసి ప్రవక్తపై దాడి చేయడం. అలా చేయడం వల్ల ఏదో ఒక తెగపై ఈ బాధ్యత ఉండదు. ప్రవక్తకు చెందిన బనూహాషిం తెగ ఏదో ఒక తెగపై ప్రతీకారం లేదా రక్తపరిహారం తీర్చుకునే ప్రసక్తి ఉండదు. అన్ని తెగలపై ప్రతీకారం

తీర్చుకోవడం వారికి సాధ్యం కాదు. ఈ పథకం అమలు చేయడానికి ఇక ఆలసించరాదని, తక్షణం అమలు చేయాలని నిర్ణయించారు.

ప్రవక్తకు వచ్చిన ఒక స్వప్నం గురించి వివరించడానికి దైవదూత జిబ్రయీల్ ఆయన వద్దకు వచ్చారు. కలలో ఆయన కళకళలాడే ఒక నగరం తనకు స్వాగతం పలకడాన్ని చూశారు. ఆయన మదీనా వలస వెళ్ళడానికి ఏర్పాట్లు చేసుకోవాలని, ఆ సమయం ఆసన్నమయ్యిందని దైవదూత వివరించారు. ఆయనకు సహచరుడిగా అబూబక్ర్‌ను తీసుకెళ్ళాలని చెప్పారు. ఈ వార్తను ప్రవక్త తన మిత్రుడు అబూబక్ర్‌కు తెలియజేశారు. ఆయనకు సంతోషంతో ఆనందభాష్పాలు వచ్చాయి. తర్వాతి రోజు రాత్రి ప్రవక్త తన దగ్గరి బంధువైన అలీని తన పక్కపై పడుకోవాలని చెప్పారు. తాను చెప్పే వరకు మక్కా వదిలి వెళ్ళరాదని ఆదేశించారు.

ఖురైష్‌లు నియమించిన దుండగులు ప్రవక్త ఇంటిని చుట్టుముట్టి ఉన్నారు. ఇంటిలో శబ్దాలు విని ప్రవక్త నిద్రలేచి ఇంటి నుంచి బయటకు వస్తున్నారని భావించారు. వారు దాడికి సిద్ధంగా ఉన్నారు. కానీ తీరా చూస్తే లోపల ఉంది ప్రవక్త కాదు, అలీ ఉన్నారు. ఖురైషుల పథకం ఫలించలేదు.

# 8

# హిజ్రత్

## వలస

ప్రవక్త ముహమ్మద్ కేవలం ఒకే ఒక్క దేవుడిని నమ్ముకున్నారు. ఆయన నమ్ముకున్న దైవం ఆయన్ను ఎన్నడూ దారితప్పనీయలేదు. పరిస్థితుల ప్రవాహంలో కొట్టుకుపోకుండా ఆయన్ను కాపాడుతూ వచ్చాడు. దివ్యఖుర్ఆన్ వాక్యాలు ఆయన్ను ఏ పనికైనా ముందు ఇన్షాఅల్లాహ్ పలకాలని బోధించాయి. ఇన్షాఅల్లాహ్ అంటే అర్థం దేవుడు తలిస్తే అని. ఆయన ఏ పనయినా చేయాలని నిర్ణయించుకున్నప్పుడు ఎంతో వినమ్రంగా దేవుని జ్ఞాపకం చేసుకునేవారు (ఒక మానవునిగా తనకున్న పరిమిత శక్తిసామర్థ్యాల స్పృహ ఆయనకు ఎప్పుడూ ఉండేది)

మదీనాకు వలస పోవాలని ప్రవక్త ముహమ్మద్ దాదాపు రెండు సంవత్సరాలుగా ఆలోచిస్తున్నారు. అందువల్ల అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. తన మానవ పరిమిత శక్తిసామర్థ్యాలను వాటి పరిధి మేరకు ఉపయోగిస్తూ ఆయన దేవునిపై విశ్వాసంతో పనిచేసేవారు. ఆ విధంగా అత్తవకుల్ అలల్లాహ్ అన్న వాక్యానికి భావార్థాన్ని ఆయన తన ఆచరణల ద్వారా తెలియజేశారు. అత్తవకుల్ అలల్లాహ్ అంటే దేవునిపై ఆధారపడడం, ఒకే ఒక్క దేవుడిని పూర్తిగా విశ్వసించడం. మనలో ప్రతి ఒక్కరికి వారి వారి ప్రత్యేక శక్తిసామర్థ్యాలున్నాయి. మేథోపరమైన, ఆధ్యాత్మికమైన, మానసికమైన, భావావేశపరమైన ప్రత్యేక లక్షణాలున్నాయి. వాటిని ఉపయోగించుకునే సామర్థ్యము ప్రతి ఒక్కరికి ఉంటుంది. అయితే మానవ ప్రయత్నానికి ఆవల సాధ్యమయ్యే పనులను కేవలం దేవుడు ఒక్కడే చేయగలడని వినమ్రంగా స్మరించుకోవాలి. ఇది నిజానికి కర్మసిద్ధాంతానికి పూర్తిగా వ్యతిరేకమైనది. కర్మ సిద్ధాంతం ప్రకారం జరిగే ప్రతి పని ముందుగా నిర్ణయించబడిన కర్మ

ప్రకారమే జరుగుతుంది. అంటే మనిషి వాటిని మార్చలేడు. కాని ఈ సిద్ధాంతం అలాంటిది కాదు. మనిషి ప్రయత్నం తర్వాత మాత్రమే దేవుడు చర్య తీసుకుంటాడు. మనిషి తన స్థాయిలో చేయవలసిన ప్రయత్నం చేసిన తర్వాతనే దేవుడు చర్య తీసుకుంటాడు. క్రింది దివ్యఖుర్ఆన్ వాక్యంలోని అర్థమిదే :

"యదార్థం ఏమిటంటే, ఒక జాతి స్వయంగా తన లక్షణాలను మార్చుకోనంతవరకు అల్లాహ్ దాని స్థితిని మార్చడు." (దివ్యఖుర్ఆన్ 13 : 11)

## అబూబక్ర్

(ఆయన పట్ల దేవుడు ప్రసన్నుడవుగాక)

ప్రవక్త ముహమ్మద్ తన ప్రియ మిత్రుడు అబూబక్ర్‌తో కలిసి మదీనా నగరానికి రాత్రి చీకటిలో బయలుదేరారు. వారు ఎమన్ మీదుగా ప్రయాణమయ్యారు. మక్కా నుంచి దక్షిణం వైపుగా ప్రయాణించి సౌర్ గుహకు చేరుకుని అక్కడ కొన్ని రోజులు రహస్యంగా ఉండిపోయారు.

ప్రవక్త ముహమ్మద్ దాడి నుంచి తప్పించుకు వెళ్ళిపోయారని గ్రహించిన ఖురైషులు ఆయన కోసం వెదుకులాట ప్రారంభించారు. అందులో కాస్త తెలివిగా ఆలోచించేవారు దక్షిణం వైపు వెదుకుతూ వచ్చారు. వారు గుహ ముఖద్వారం వరకు వచ్చారు. వారు లోనికి ప్రవేశించడానికి సిద్ధమవుతున్నారు. గుహలో ప్రవక్త, అబూబక్ర్ ఇద్దరు ఉన్నారు. అబూబక్ర్ గుహలోపలి నుంచి వాళ్ళను చూడగలుగుతున్నారు. వాళ్ళు కాస్త వంగి లోపలికి తొంగి చూస్తే తామిద్దరం కనబడతామని ప్రవక్తకు చెప్పారు. ప్రవక్త ముహమ్మద్ ఆయనకు హామీ ఇస్తూ నెమ్మదిగా "భయం లేదు, దేవుడు మనతో ఉన్నాడు" (దివ్యఖుర్ఆన్ 9:40) అన్నారు.

ఆ తర్వాత ఆయన ఇంకా ఇలా అన్నారు "మూడో వ్యక్తి స్వయంగా దేవుడే అయిన ఆ ఇద్దరి గురించి నీవేమనుకుంటున్నావు" అన్నారు. ఈ మాటలతో అబూబక్ర్ నెమ్మదించారు. సౌర్ గుహ ముఖద్వారాన్ని ఒక సాలెగూడు అల్లుకుని ఉండడాన్ని ఆ వచ్చిన వాళ్ళు చూశారు. ఒక పావురం కూడా గుడ్లు పెట్టింది. ప్రవక్త ముహమ్మద్ ఆ గుహలోకి వెళ్ళి ఉండే అవకాశం లేదని వాళ్ళు భావించారు. అక్కడి నుంచి వెనక్కి వెళ్ళిపోయారు.

ఎంతో జాగ్రత్తగా పథకం ప్రకారం మక్కా నుంచి ఎమన్ దారిమీదుగా వెళ్ళాలని నిర్ణయించుకున్నప్పటికీ వారి పథకం మానవసహజ పరిమితులకు లోబడే ఉంది. పరీక్షలు

ఎదురయ్యాయి. దైవికంగా వాటిని అధిగమించడం జరిగింది. ఒక బలహీనమైన సాలెగూడు వారి ప్రాణాలు కాపాడింది. దైవంపై విశ్వాసం (తవక్కులుల్ అలల్లాహ్) గురించి ప్రవక్త ముహమ్మద్ తన మిత్రుడు అబూబక్ర్‌కు గుర్తు చేసింది ఇదే. ఈ విధంగా ఆయన చెప్పిన మాటలకు అర్థం సాక్షాత్కరించింది. తన ప్రవక్తను కాపాడే శక్తి కేవలం దేవుడికి ఒక్కడికి మాత్రమే ఉంది. ప్రవక్త ముహమ్మద్ వలస వెళ్ళడానికి ముందు మక్కాలో ఎవరికీ ఏ విషయంలోను బకాయిలు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఆయన ఎవరి నుంచి కానుకలు తీసుకోలేదు, రుణాలు తీర్చేశారు. ఆయన వద్ద చాలా మంది తమ వస్తువులు సంపద దాచుకునేవారు, అవన్నీ ఎవరివి వారికి వాపసు చేసేశారు. కాని ఆయనకు తెలుసు తాను విశ్వప్రభువుకు చాలా రుణపడి ఉన్నానని. ఆయన రుణం ఎన్నటికీ తీర్చలేనని కూడా తెలుసు.

మక్కా నుంచి మదీనా చాలా దూరాన ఉంది. అక్కడికి సురక్షితమైన దారిన తీసుకువెళ్ళడానికి ఒక ముస్లిమేతర బదూయిన్ అరబ్బును అబూబక్ర్ నియమించారు. అతని పేరు ఉరైఖత్. చెప్పిన సమయానికి ఉరైఖత్ ఆ గుహ దగ్గరకు వచ్చాడు. తనతో ఒంటెలను తీసుకువచ్చాడు. అక్కడి నుంచి వారు పశ్చిమదిక్కుగా ప్రయాణమయ్యారు. ఆ తర్వాత దక్షిణానికి తిరిగారు. తుదకు ఉత్తరదిక్కుకు ప్రయాణమై మక్కా నుంచి 340 కిలోమీటర్ల దూరాన ఉన్న మదీనా వైపు ప్రయాణమయ్యారు. ఇది చాలా ప్రమాదకరమైన ప్రయాణం. ఖురైషులు ఈ ముగ్గురు ప్రయాణీకులను ఎప్పుడైనా పట్టుకోవచ్చు. దొరికితే తుదముట్టించడానికే ప్రయత్నిస్తారు. ఆ విధంగా ఇస్లామీయ ఉద్యమాన్ని నిర్మూలించాలనే చూస్తారు.

ప్రవక్త ముహమ్మద్ ఆయన సహచరుడు అబూబక్ర్ దేవునిపై నమ్మకంతో ముందుకు సాగారు. వారు ఒక ముస్లిమేతర, బహుదైవారాధక బదూయిన్ సేవలు వినియోగించుకోడానికి వెనుకాడలేదు. అతను వారికి బాగా తెలిసిన వాడు, నమ్మకస్తుడు (అతను ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాడు). ఒక గైడ్‌గా అతడి శక్తిసామర్థ్యాలు ప్రశంసించదగ్గవి. వారు ప్రయాణించాలనుకున్న మనుష్యసంచారం లేని, నిట్టనిలువు కొండదారులు అతడికి కొట్టినపిండి. ప్రవక్త జీవితంలో ఇలాంటి వైఖరి మనకు చాలా సందర్భాల్లో కనిపిస్తుంది. ఆయన చుట్టు ఉన్న స్త్రీపురుషుల్లో ఇస్లామీయ విశ్వాసం లేనివారు కూడా ఉండేవారు. కాని వారు ఆయనకు బాగా తెలిసినవారు. వారి నైతికగుణగణాలు, మానవీయ లక్షణాలు ఆయనకు బాగా తెలుసు. ప్రవక్త అవసరమైనప్పుడు వారిపై ఆధారపడడానికి సంశయించేవారు కాదు.

# హిజ్రత్

## విశ్వాసానికి పరీక్ష

ప్రవక్త ముహమ్మద్, ఆయన అనుచరులు తమ వారి చేతుల్లోనే, తమ స్వంత తెగ మనుష్యుల వల్లనే అనేక బాధలు భరించారు. దౌర్జన్యాలు సహించారు. చివరకు స్వంత ఊరిని వదిలి వలసవెళ్ళవలసి వచ్చింది. వారికి మక్కాలో పరిస్థితి అత్యంత దయానీయంగా ఉండేది. అనేకమంది మరణించారు. ఖురైషుల చేతుల్లో తీవ్రమైన చిత్రహింసలకు గురయ్యారు. చివరకు ఖురైషులు ప్రవక్త ముహమ్మద్‌నే తుదముట్టించడానికి పథకాలు వేశారు. తమ మతవిశ్వాసాలను స్వేచ్ఛగా పాటించే అవకాశం లేని చోట, తమ మతవిశ్వాసం కోసం ఆ ప్రాంతాన్ని వదలాలని నిర్ణయించుకున్నారు. ఎందుకంటే దివ్యఖుర్‌ఆన్ ప్రకారం దేవుని నేల చాలా విశాలమైనది. వారు తమ మాతృభూమిని వదలాలని నిర్ణయించుకున్నారు. తమ ఇల్లువాకిళ్ళు వదిలి కొత్త ప్రాంతంలో ఇస్లామీయ విశ్వాసం కోసం శరణార్థులుగా వెళ్లడానికి సిద్ధపడ్డారు.

ఇలాంటి కఠినమైన, ఆర్థికంగా చాలా నష్టదాయకమైన నిర్ణయం తీసుకున్న ప్రారంభకాలంలోని ముస్లిములు ఒకే ఒక్క దేవుని పట్ల తమ విశ్వాసానికి కట్టుబడి ధైర్యంగా తీసుకున్న ఈ నిర్ణయాన్ని దివ్యఖుర్‌ఆన్ ప్రశంసించింది.

> “దౌర్జన్యాన్ని అనుభవించిన తరువాత అల్లాహ్ కోసం వలసపోయిన వారికి మేము ప్రపంచంలో తప్పకుండా మంచి నివాసాన్ని ఇస్తాము. పరలోక ప్రతిఫలమైతే ఇంతకంటే గొప్పగా ఉంటుంది, సహనం చూపినటువంటి, తమ ప్రభువుపై నమ్మకంతో పనిచేస్తున్నటువంటి బాధితులు (ఎంతో చక్కని ముగింపు తమ కొరకు వేచి చూస్తోందని) తెలుసుకుంటే ఎంత బాగుండును!” (దివ్యఖుర్‌ఆన్ 16:41-42)

శరణార్థులుగా వెళ్ళడం మరో పరీక్ష. ప్రవక్తలందరూ ఈ పరీక్షను ఎదుర్కున్నారు. అలాగే విశ్వాసులందరూ ఈ పరీక్షను ఎదుర్కున్నారు. వారు ఎంత దూరం వెళ్లడానికి సిద్ధపడ్డారు? ఎన్ని త్యాగాలు చేయడానికి సిద్ధపడ్డారు? ఇదంతా కేవలం ఒకే ఒక్క దేవుని విశ్వసించడానికి, ఆ దేవుని ప్రసన్నత పొందడానికి మాత్రమే చేశారు. ఇవి ధార్మిక విశ్వాసానికి సంబంధించిన అతిముఖ్యమైన అంశాలు. ప్రాపంచికంగాను, చారిత్రకంగాను ఈ ప్రతి విశ్వాసి ఈ పరీక్షల అనుభవాలు ఎదుర్కోవలసి వచ్చింది. ముస్లిమ్ సముదాయం

ప్రారంభంలోనే ఎదుర్కున్న పరీక్షల్లో ఇది కూడా ఒకటి.

ఒకవిధంగా చెప్పాలంటే ఇది అవసరం కూడాను. ఇస్లామ్ స్వీకరించిన ఈ చిన్న సమూహం కొత్త ప్రదేశానికి తరలిపోయినా, సంస్కృతి, సంప్రదాయాలు మారినా ఇస్లామీయ బోధనల పట్ల నిబద్ధతతో ఉండడం ఎలాగో నేర్చుకోవడానికి ఇది తోడ్పడుతుంది. మదీనా అంటే కొత్త ఆచారవ్యవహారాలు, కొత్త సాంఘీక సంబంధాలు.

వలసపోవడమన్నది ఒక లోతయిన ప్రభావం వేసే అనుభవం. తన ప్రాంతం నుంచి వైదొలగి కొత్త ప్రాంతానికి వెళ్ళడం, కాని తన విశ్వాసాన్ని మాత్రం సజీవంగా కాపాడుకోవడం. వాతావరణం మారినా, పరిస్థితులు మారినా విశ్వాసంలో లోటు రాకుండా చూసుకోవడం.

ఇస్లామీయ విశ్వాసం కారణంగా అణిచివేతలకు గురయిన ముస్లిములు తమపై దౌర్జన్యాలకు పాల్పడుతున్న వారికి దూరంగా స్వేచ్ఛ వైపు వెళ్ళాలని నిర్ణయించుకున్నారు. ఇలా చేయడం ద్వారా తాము అణిచివేతను భరించేది లేదని, బాధితులుగా జీవించడానికి సిద్ధంగా లేమని చాటి చెప్పారు. ఇక్కడ సమస్య చాలా సరళమైనది. బహిరంగంగా దేవుని పేరు ఉచ్ఛరించడం అంటే స్వేచ్ఛను ప్రకటించడం లేదా విడిపోవడం. ఈ సందేశాన్ని ప్రవక్త ముహమ్మద్ ఆ తర్వాత ఆయన మిత్రుడు అబూబక్ర్ మక్కాలోని బానిసలకు చాటి చెప్పారు. ఇస్లామ్ స్వీకరించడమంటే వారు స్వేచ్ఛను పొందడం. ఇస్లామీయ బోధనలన్నీ బానిసత్వ నిర్మూలన లక్ష్యంగా సాగినవే. మొత్తం ముస్లిమ్ సముదాయాన్ని ఉద్దేశించి ఈ పిలుపు ఇవ్వడం జరిగింది. ధార్మిక విశ్వాసానికి స్వేచ్ఛ అవసరం. న్యాయం అవసరం. అందుకు త్యాగాలకు సిద్ధపడాలి. వలస వెళ్ళడానికి సిద్ధపడి మూల్యంకూడా చెల్లించాలి.

హిజ్రా లేదా వలస వెళ్ళడం అన్నది మనోభావాల వలస. ఇది కుహనా దేవుళ్ళ నుంచి వలసపోవడం. పాపాలు, దుర్మార్గాల నుంచి వలసపోవడం. మనిషి జీవితంలోని విగ్రహాలు (అధికారం, సంపద వగైరా)నుంచి వలస పోవడం. అబద్ధాలు, అనైతిక జీవనవిధానం నుంచి వలసపోవడం. ఈ చెడులన్నింటికి దూరమై మనిషి తనకు తాను స్వేచ్ఛ సాధించడం. హిజ్రా లేదా వలసకు సంబంధించిన ఆధ్యాత్మిక అవసరాలివి. తర్వాతి కాలంలో ఒక అనుచరుడు హిజ్రా గురించి ప్రవక్తను ప్రశ్నిస్తూ ఏది ఉత్తమమైన హిజ్రా అని అడిగినప్పుడు ఆయన ఇలా అన్నారు:“నువ్వు చెడుకు దూరంగా వలసపోవడం” అని జవాబిచ్చారు.

ఈ ఆధ్యాత్మిక వలస అవసరం అనేక రూపాల్లో తర్వాత మన ముందుకు వచ్చింది.

ఆ విధంగా మక్కా నుంచి మదీనా వచ్చిన ముస్లిములు ఇస్లామీయ బోధనల మరో

కోణాన్ని దర్శించారు. వారు హృదయాంతరాళల్లో కూడా హిజ్రా చేయవలసి ఉంది. వారు భౌతికంగా మక్కా నుంచి మదీనాకు తరలి రావడం అన్నది మానసికంగా వారి అంతరాత్మలోకి ప్రయాణంగా మారింది. వారు తమ ఊరిని, తమ వేళ్ళను వదులుకుని రావడం ద్వారా వారు తమకు తాము చేరువయ్యారు. దేవునికి చేరువయ్యారు. తమ జీవితాల అర్థానికి చేరువయ్యారు. చారిత్రక అవసరాలకు మించి వారు తమ ప్రయాణాన్ని పూర్తి చేశారు.

ఆ తర్వాతి కాలంలో హజ్రత్ ఉమర్ ఈ సంఘటనను, అంటే హిజ్రా చేసిన సంఘటన దగ్గరి నుంచి ఇస్లామీయ కేలండర్‌ను ప్రారంభించారు. కామన్ ఎరా 622 నుంచి ఇది ప్రారంభమవుతుంది.

ఆ తర్వాత ఆధ్యాత్మిక వలసను చరిత్ర దర్శించింది. ఈ వలస ద్వారా ప్రతి మనిషి తనకు తాను దగ్గరయ్యాడు. తనకు సంబంధించి, ప్రపంచానికి సంబంధించిన కృత్రిమ భ్రమల నుంచి విముక్తి పొందాడు.

నిజానికి దేవుని మార్గంలో వలస వెళ్ళడమన్నది దేవుడు మనిషిని అడిగే ఒక ప్రశ్నల పరంపర వంటిది.

ఆ ప్రశ్నలు:

నీవెవరివి? నీ జీవితానికి అర్థమేమిటి?

> నీవెక్కడికి వెళుతున్నావు? వలస వెళ్ళడానికి సిద్ధపడి ప్రమాదం కొనితెచ్చుకోడానికి ఒకే ఒక్క దేవుడిని విశ్వసించడం అనేది జవాబు అయినప్పుడు, నీ ద్వారా నేను నా వైపు వాపసు అయ్యాను. ఇప్పుడు నేను స్వేచ్ఛను పొందాను అన్నది దానికి భావం.

# 9

# మదీనా

మక్కా నుంచి ఖుబా చేరడానికి ఇరవై రోజులు పట్టింది. ప్రవక్త ముహమ్మద్, హజ్రత్ అబూబక్ర్ ఆ చిన్న ఊరు ఖుబాకు చేరుకున్నారు. మదీనాకు దగ్గరగా ఈ ఊరు ఉంది. అక్కడి ప్రజలు వారి కోసం ఎదురుచూస్తున్నారు. ఆయనకు ఘనస్వాగతం పలికారు. అక్కడ వారు మూడురోజులు బసచేశారు. అక్కడ ఒక మస్జిదు నిర్మాణం ప్రారంభించారు. ఖుబా నుంచి బయలుదేరిన తర్వాత ప్రవక్త మదీనా వైపు కొనసాగారు. మధ్యాహ్నం ఒక చోట ఆగారు. అప్పటికి ప్రార్ధన సమయం అయ్యింది. రనూన లోయలో ఆయన తన అనుచరులతో కలిసి మొదటి సారి శుక్రవారపు ప్రార్ధనలు చేయించారు. అక్కడ కూడా ఒక మస్జిదు నిర్మాణం ప్రారంభించారు. ఆ తర్వాత ఆయన మదీనాకు కామన్ ఎరా 622, అక్టోబర్ 4న చేరుకున్నారు. ఇది హిజ్రా మొదటి సంవత్సరం. మదీనాలో ఘనస్వాగతం లభించింది. అనేకమంది ఆయన్ను తమ ఇంట బస చేయాలని కోరారు. ప్రవక్త వారితో తన ఒంటె ఖస్వాను నిర్ణయించనీయమని చెప్పారు. ఆ ఒంటెను స్వేచ్ఛగా వెళ్ళనిచ్చారు. ఒంటె ఎక్కడ ఆగుతుందో అక్కడ బస చేయాలని అనుకున్నారు. ఒంటె జనంలో అటూ యిటూ తిరిగి చివరకు ఒక ప్రదేశంలో ఆగింది. ఆ స్థలం ఇద్దరు అనాధలకు చెందిన స్థలం. ప్రవక్త వారికి ఆ స్థలం విలువ కన్నా రెట్టింపు మొత్తం చెల్లించి ఆ స్థలాన్ని కొనుగోలు చేశారు. ఆ స్థలంలో ఆయన నివాసం, మస్జిదు నిర్మాణం వెంటనే ప్రారంభించారు.

## మస్జిదు

ఈ మూడు మస్జిదులు, అంటే ఖుబాలో, రునానాలో, మదీనాలో మస్జిదులు నిర్మించడం ద్వారా ప్రవక్త ఇస్లామీయ వ్యవస్థలో మస్జిదు ప్రాముఖ్యాన్ని చాటి చెప్పారు. దేవుడికి, మానవసముదాయాలకు, నేలకు మస్జిదుకు మధ్య సంబంధాన్ని ఆయన తెలియజేశారు.

మస్జిదు భవనం అంటే సజ్దా చేసే స్థలం. ప్రవక్త ఒక సందర్భంలో యావత్తు భూమి మస్జిదేనని అన్నారు. అంటే భూమిపై ఎక్కడైనా సజ్దా చేసే అనుమతి ప్రవక్తకు ఈయబడిందని దీనికి అర్థం. అంటే భూమిపై ఏ భాగమూ అపవిత్రమైనది లేదు. అదేవిధంగా ముస్లిములు ఇస్లామీయ చట్టం ప్రకారం ఎక్కడైనా నమాజు చేయవచ్చు. అందువల్లనే పార్కుల్లో, రోడ్డుపక్కన, రైల్వే ప్లాట్‌ఫాంపై, ఎయిర్‌పోర్టు టెర్మినల్ వగైరా స్థలాల్లో ముస్లిములు ప్రార్థన చేస్తూ కనిపిస్తూ ఉంటారు. యావత్తు భూమి ముస్లిముల దృష్టిలో ఆరాధనాస్థలమే. నిర్ణీత సమయంలో వారు ఎక్కడున్నా అక్కడే ప్రార్థన చేసుకుంటారు.

ఇది ప్రవక్త చెప్పిన మాటలకు సరళమైన అర్థం. ఈ అర్థమే కాకుండా లోతయిన మరో భావం కూడా ఉంది. ముస్లిమ్‌కు మస్జిదు అనేది శాంతి ప్రదేశం. ప్రజలు అందులోకి పవిత్రమైన స్థితిలో ప్రవేశిస్తారు. వారి శరీరం, వారి దుస్తులు పరిశుభ్రంగా ఉంటాయి. వారు దేవునికి విధేయులైన దాసులుగా నమ్రతతతో ప్రవేశిస్తారు. వారు మస్జిదులో ప్రవేశించేటప్పుడు అస్సలాము అలైకుమ్ అని అంటారు. అంటే అర్థం మీపై శాంతి కలుగుగాక అన్న ప్రార్థన. అప్పటికే అక్కడ ఉన్నవారిని ఉద్దేశించి చేసిన ప్రార్థన. ఇది కొత్తగా మస్జిదులోకి ప్రవేశిస్తున్నవారు అప్పటికే అక్కడున్న వారితో చేసే శాంతి ప్రకటన. మస్జిదు శాంతిని, సామరస్యాన్ని ప్రసరింపజేస్తుంది. ఇక్కడ దేవుడు ఒక్కడే, మనుష్యులు ఒక్కటే అన్న సందేశం ప్రసారమవుతుంది. ప్రపంచంలో కేంద్ర మస్జిదు కాబా. కాబాగృహాన్ని హరంగా ప్రకటించడం జరిగింది. కాబా ఆవరణలో ఎలాంటి రక్తపాతానికి అనుమతి లేదు. అంటే మస్జిదుకు అనుబంధంగా శాంతి సందేశం ఉంది. కాబాగృహం అత్యుత్తమ శాంతి సందేశానికి నిలయం.

ప్రవక్త చెప్పిన మాటలు యావత్తు భూమి మస్జిదే అన్న మాటలకు భావం భూమిని శాంతినిలయంగా మార్చడమని. భూమిపై ప్రతిచోట మానవులందరూ శాంతియుతంగా ఉండే పరిస్థితి ఉండాలి. ప్రవక్త ప్రకారం భూమి ఒక మస్జిదుగా మారినప్పుడు, మస్జిదులా దేవుడు ఒక్కడే, మనుష్యులు ఒక్కటే అన్న సందేశాన్ని ప్రసారం చేసినప్పుడు ఇది శాంతినిలయంగా మారుతుంది.

## అస్సలాము అలైకుమ్
## దేవుని శాంతి మీపై వర్షించుగాక

ప్రవక్త ముహమ్మద్ ఖుబా చేరుకున్న వెంటనే చెప్పిన మొదటి మాటలు, ముస్లిముల ప్రథమ బాధ్యతను వారికి ఎరుకపరిచిన మాటలు. ఇస్లామీయ సంబోధన అస్సలాము అలైకుమ్ ద్వారా శాంతిని వ్యాపింపజేయడం. దీనికి జవాబు వాలైకుమ్ అస్సలామ్, దీనికి అర్థం మీపై కూడా దేవుని శాంతి వర్షించుగాక అని. అన్నార్తులకు భోజనం పెట్టడం, బంధుత్వ

సంబంధాలను గౌరవించడం, అందరూ నిద్రిస్తున్న సమయంలో కూడా ప్రార్థనలు చేయాలని బోధించారు. ఆవిధంగా శాంతిని సాధించాలని, పరలోక సాఫల్యంపొందాలని బోధించారు. అస్సలాము అలైకుమ్ దానికి జవాబు వాలైకుమ్ అస్సలామ్ … ఇందులో శాంతికలగాలన్న ప్రార్థన గమనిస్తే ప్రవక్త తన అనుచరులు కొత్త ప్రదేశంలో ఎలా స్థిరపడాలని కోరుకున్నారో అర్థమవుతుంది. నిరుపేదలను ఆదరించడం, బంధుత్వ సంబంధాలను గౌరవించడం ముస్లిములు నైతిక పునాదిగా చేసుకున్నారు. ప్రతి ముస్లిమ్ దీన్ని పాటిస్తానని శాశ్వతంగా ప్రతిజ్ఞ చేశారు. రాత్రి ప్రార్థనలు, ప్రజలంతా నిద్రలో ఉన్నప్పుడు కూడా ప్రార్థనలు ఈ ఆధ్యాత్మిక వలసకు ఆధారాలయ్యాయి. ఆవిధంగా నైతికవిలువలకు కట్టుబడే, శాంతిని ప్రచారం చేసే శక్తిసామర్థ్యాలు లభించాయి. ఈ విధంగా అంతర్గత శాంతి కోసం చేసిన ప్రయత్నాలు (దానితో పాటు కుటుంబ సంబంధాలు, వాటి ప్రేమాభిమానాలను కాపాడ్డం) ఒక విశ్వాసి నడవవలసిన మార్గాన్ని నిర్దేశించాయి. ఈ మార్గంపై నడుస్తూ శాంతిని విస్తరిస్తూ, నిరుపేదలకు సహాయపడుతూ ముందుకు సాగవలసి ఉంది.

మదీనాలో ప్రతిదశలోను ప్రవక్త బోధనల్లో ఇవి కనబడతాయి. మదీనాకు వచ్చినప్పుడే ఆయన మదీనాలోని ప్రముఖుల కన్నా ఎక్కువ పలుకుబడి, రాజకీయ బలాన్ని పొందారు. చాలా మంది మదీనా పౌరులు ఇస్లామ్ స్వీకరించారు. వారంతా ఆయన్ను దేవుని ప్రవక్తగా గుర్తించారు. ఇలా ఇస్లామ్‌లోకి మారినవారిలో ఔస్, ఖజ్‌రజ్ రెండు తెగలకు చెందిన వారున్నారు. ఈ రెండు తెగలు సుదీర్ఘకాలంగా పోరాటాల్లో గడిపిన తెగలని గమనించాలి. ఇస్లామ్ సందేశం ఎంత బలమైనదంటే ఘర్షణ పడుతున్న అనేక తెగల మధ్య ఐక్యతను సాధించింది. వివిధ సామాజిక వర్గాలు ఒకే వేదికపైకి వచ్చాయి.

## యూదులతో ఒప్పందం

మదీనాలోకి రాగానే ప్రవక్త ఇస్లామీయ సముదాయం స్థిరపడడానికి పునాదులు పటిష్టంగా నిర్మించే పని చేపట్టారు. పాలనాపరమైన, రాజకీయమైన, సైద్ధాంతికమైన సూత్రాల ఆధారంగా సమైక్యతను సాధించారు. ముస్లిమేతరులతో పటిష్టమైన సంబంధాలు నెలకొల్పుకునే ప్రయత్నం చేశారు. ఈ ప్రయత్నాలన్నీ కేవలం శాంతిని సాధించడానికి, మానవాళికి భద్రత, సౌభాగ్యాలు సాధించడానికి చేసిన ప్రయత్నాలు. ముఖ్యంగా ఆ ప్రాంతంలో ఆధ్యాత్మిక అవగాహన పెంచడానికి ప్రయత్నించారు. విభిన్న వర్గాల మధ్య సుహృద్భావ సంబంధాలకు కృషి చేశారు.

భౌగోళికంగా చూస్తే మదీనా ప్రజలకు సన్నిహితులు యూదులు. ప్రవక్త పట్ల వారిలో తీవ్రమైన వ్యతిరేకత గూడుకట్టుకుని ఉన్నప్పటికీ, ద్వేషం పెల్లుబుకుతున్నప్పటికీ పైకి మాత్రం

వారు ఏమాత్రం తమ వ్యతిరేకతను ప్రదర్శించలేదు. వారితో ప్రవక్త ఒప్పందం చేసుకోవాలని నిర్ణయించారు. వారికి పూర్తి మతపరమైన, సంపదపరమైన పూర్తి స్వాతంత్ర్యాన్నిస్తూ ఒప్పందం చేసుకోవాలని నిర్ణయించారు. వారి పట్ల తీవ్రమైన చర్యలు తీసుకోవాలని ఆయనెన్నడూ భావించలేదు. వారిని బహిష్కరించాలని లేదా వారి ఆస్తిపాస్తులు జప్తు చేసుకోవాలని ఆయనెన్నడూ తలవలేదు. ఈ ఒప్పందం ముస్లిముల వివిధ తెగలమధ్య సంబంధాలను కూడా మెరుగుపరిచే ఒప్పందంగా ముందుకు వచ్చింది.

ఈ ఒప్పందం తర్వాత మదీనా ఆ చుట్టుపక్కల ప్రాంతాలు ఒక సంకీర్ణ ప్రజాస్వామిక రాజ్యంగా ఏర్పడ్డాయి. మదీనా రాజధానిగా, ప్రవక్త ముహమ్మద్ ఈ రాజ్యానికి అధ్యక్షుడిగా ఒక వ్యవస్థ ఏర్పడింది. రాజ్యాధికారం ప్రధానంగా ముస్లిముల చేతుల్లోనే ఉండేది కాబట్టి మదీనా ఒక ఇస్లామీయ రాజ్యానికి రాజధానిగా మారింది. శాంతి భద్రతల పరిధిని విస్తరించడానికి ప్రవక్త ఇలాంటి ఒప్పందాలు విభిన్న తెగలతో చేసుకోవాలని నిర్ణయించారు. మదీనా చుట్టు ఉంటున్న విభిన్న తెగలతో ఇలాంటి ఒప్పందాలకు పూనుకున్నారు.

ఒప్పందం, కాంట్రాక్టు లేదా అల్ అహద్ అనేది ఇస్లామీయ వ్యవహారాలకు కేంద్రమయ్యింది. వివాహ ఒప్పందం కాని, సామాజిక, ఆర్థిక ఒప్పందాలు కాని, ఘర్షణలను నివారించే ఒప్పందాలు కాని...ఒప్పందాలకు పెద్దపీట వేయడం జరిగింది. దివ్యఖుర్ఆన్ ఒప్పందాల ప్రాముఖ్యాన్ని నొక్కి వక్కాణించింది. ఒప్పందంలోని షరతులకు కట్టుబడాలని నిర్దేశించింది. "చేసిన వాగ్దానాన్ని నెరవేర్చండి. నిస్సందేహంగా వాగ్దానం విషయంలో మీరు సమాధానం చెప్పవలసి ఉంటుంది." (దివ్యఖుర్ఆన్ 17:34)

ప్రవక్త ముహమ్మద్ ఈ విషయమై ఇలా అన్నారు.

"ముస్లిములు తాము చేసుకున్న ఒప్పందాల షరతులకు కట్టుబడాలి."

## కపటులు

ఒప్పందాలు జరిగినప్పటికీ, ప్రవక్త ముహమ్మద్ వివిధ తెగల నాయకులు, వివిధ మతపెద్దలకు హామీలు ఇచ్చినప్పటికీ పరిస్థితి అంత సరళమైనది కాదు. ఇక్కడ కొందరి అసూయాద్వేషాలు, అత్యాశ, అధికారం కోసం ఆరాటం ఇవన్నీ ఉన్నాయి. కొందరిలో నిరాశ నిస్పృహలు కూడా గూడుకట్టుకుని ఉన్నాయి.

మదీనాలో ప్రవక్తకు ఎదురైన విభిన్న మనస్తత్వాలు ఆయన మక్కాలో చూసి ఎరుగరు. మక్కాలో పరిస్థితి వేరు. అక్కడ ఇస్లామ్‌లోకి మారిన వారు త్యాగాలు చేసి, కష్టాలు భరించి ఇస్లామ్‌లోకి వచ్చారు. అక్కడ ఇస్లామ్‌ను నమ్మినవారు మాత్రమే ఇస్లామ్ స్వీకరించారు.

ఇస్లామ్‌ను నమ్మని వారు బహిరంగంగా వైరానికి దిగారు. కాని మదీనాలో పరిస్థితి వేరు. మదీనాలో సామాజిక సమీకరణాలు వేరు. ఇక్కడ వేర్వేరు అధికార కేంద్రాలున్నాయి. కాగా ప్రవక్త ముహమ్మద్ (ఆయనకు శాంతి కలుగుగాక) విభిన్న వర్గాల ప్రజలందరి మనోమస్తిష్కాలను ప్రభావితం చేస్తున్న పరిస్థితి వల్ల జనించిన అసూయాద్వేషాలు ఉన్నాయి. ఒక సంక్లిష్టమైన పరిస్థితి మనకు మదీనాలో కనబడుతుంది. ఈ పరిస్థితిలో కొందరు ఇస్లామ్ స్వీకరించడం ద్వారా ప్రయోజనాలు పొందాలని, అధికారం అందుకోవాలని కూడా ప్రయత్నించారు. మదీనాలో అవతరించిన మొదటి దివ్యఖుర్ఆన్ అధ్యయంలో ఇలాంటి కపటుల గురించి ప్రస్తావన ఉంది. ఈ కపటులను దివ్యఖుర్ఆన్ మునాఫిఖూన్ అని సంబోధించింది. ముస్లిమ్ సముదాయం లోపల ఉండి దాడి చేసే వీళ్ళు అత్యంత ప్రమాదకరమైనవారు. దివ్యఖుర్ఆన్‌లోని రెండవ అధ్యాయం (అల్ బకర, ఆవు)లో పదమూడు పెద్ద పెద్ద వాక్యాలు (ఈ ఆధ్యాయం దివ్యఖుర్ఆన్‌లో అతిపెద్ద అధ్యాయం) ఈ విషయాన్ని ప్రస్తావించాయి. కపటుల వైఖరి, వారి మాట తీరు, ద్వంద్వప్రమాణాలు, మోసం, ద్రోహాలను బట్టబయలు చేశాయి.

> "“అల్లాహ్‌ను, అంతిమదినాన్ని మేము విశ్వసించాము” అని అనేవారు కూడా కొందరు ఉన్నారు. కాని వాస్తవంగా వారు విశ్వాసులు కారు. అల్లాహ్‌నూ, విశ్వాసులనూ వారు మోసం చేస్తున్నారు. కాని యథార్థంగా వారు తమను తాము తప్ప మరెవరినీ మోసం చెయ్యటం లేదు. అయితే ఈ విషయాన్ని వారు గ్రహించటం లేదు." (దివ్యఖుర్ఆన్ 2 : 8-9)

ఇంకా ఇలా పేర్కొంది

> "విశ్వాసులను కలిసినప్పుడు వారు “మేము విశ్వసించాము” అని అంటారు. కాని తమ షైతానులను ఏకాంతంగా కలిసినప్పుడు వారు “అసలు మేము మీతోనే ఉన్నాము. వారిని కేవలం ఎగతాళి చేస్తున్నాము.” అని అంటారు."
> (దివ్యఖుర్ఆన్ 2 : 14)

కపటుల వల్ల వాటిల్లిన ప్రమాదం చాలా క్లిష్టమైనది. పైగా అది శాశ్వత ప్రమాదంగా మారుతోంది. ఈ కపటుల్లో కొందరు ఔస్, ఖజ్‌రజ్ తెగల మధ్య పాత వైరాన్ని తిరగదోడుతున్నారు, విద్వేషాలు రెచ్చగొడుగున్నారు. నిజానికి ఒకసారి వారి ప్రయత్నాలు దాదాపు సఫలమయ్యాయి. రెండుతెగలు కత్తులు దూసుకునే పరిస్థితి వచ్చింది. ఈ లోగా అందులోని ఒక వ్యక్తి ఇస్లామ్‌లోని అత్యున్నత సౌభ్రాత్ర భావనను వారికి గుర్తు చేసి పరిస్థితిని చక్కదిద్దాడు.

జరిగిందేమిటంటే, ఖజ్‌రజ్ తెగకు చెందిన ఉబై కుమారుడు అబ్దుల్లా ఇస్లామ్ స్వీకరించాడు. కాని అతడిని చాలా మంది కపటిగా భావించేవారు. దివ్యఖుర్‌ఆన్ ప్రస్తావించిన కపటుల లక్షణాలు ఇంతకు ముందు ఔస్ తెగలోని అబూ ఆమిర్ విషయంలోను నిజమయ్యాయి. అబూ ఆమిర్ విద్వేషాన్ని రెచ్చగొట్టి అనేక సమస్యలు సృష్టించాడు. అతడిపై ప్రత్యేకంగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు కానీ ముస్లిములు ఇలాంటి కపటుల పట్ల కాస్త జాగ్రత్తగా వ్యవహరించేవారు. ముస్లిముల్లో చిచ్చుపెట్టే వారి ఎత్తుగడలకు బలికాకుండా జాగ్రత్తలు పడేవారు.

## సౌభ్రాత్ర శిఖరం

ముస్లిముల్లో సంబంధాలను మరింత పటిష్టం చేయడానికి, ముఖ్యంగా మదీనాకు చెందిన ముస్లిములు (వీరిని అన్సార్లు అనేవారు), మక్కా నుంచి వలస వచ్చిన ముస్లిములు (వీరిని ముహాజిర్లు అనేవారు), ఈ రెండు వర్గాల మధ్య పటిష్టమైన సంబంధాలు ఏర్పరచడానికి ప్రవక్త ముహమ్మద్ ఒక లాంఛనమైన సౌభ్రాత్ర ఒప్పందం చేయించాలని నిర్ణయించారు. అంటే ప్రతి అన్సార్ ఈ ఒప్పందం ప్రకారం ఒక ముహాజిర్‌కు సోదరుడవుతాడు. మక్కా నుంచి వచ్చిన ఆ ముహాజిర్‌కు సహాయం చేయడం, తన సంపద నుంచి అతడికి వాటా ఇచ్చి, మదీనాలో స్థిరపడానికి ఆదుకోవడం అతడి బాధ్యత అవుతుంది. మౌలికంగా వారిద్దరి మధ్య సంబంధం సోదరసంబంధం అయిపోతుంది. పంచుకోవడం, ఆధ్యాత్మిక సహాయసహకారాలు ఈ సంబంధానికి పునాదులు. మక్కా నుంచి వచ్చిన ముస్లిము ప్రవాసులు మదీనాలో ఉన్న వారికి ధార్మికమైన జ్ఞానాన్ని అందించాలి. ఈ ఒప్పందం ముఖ్యమైన ఉద్దేశ్యమేమంటే ముస్లిమ్ సముదాయాన్ని మదీనాలో ఒక బలమైన సముదాయంగా రూపొందించడం. ఇస్లామ్‌ను విశ్వసించేవారిలో అత్యంత దృఢమైన సౌభ్రాత్ర సంబంధాలను ఏర్పరచడం జరిగింది. వారందరి మధ్య దేవుని పట్ల అచంచలమైన విశ్వాసం, ప్రేమలే దీనికి పునాదులు. ముస్లిమ్ విశ్వాసంలో ఇది సౌభ్రాత్రత్వానికి శిఖరమానమైన ఉదాహరణ. ప్రవక్త అనుచరులు ఈ అత్యుత్తమ సోదరభావానికి ఉదాహరణలుగా నిలిచే ప్రయత్నం ఆచరణాత్మకంగా చేశారు. "పునరుజ్జీవన దినాన అల్లాహ్ ఇలా చెబుతాడు : "కేవలం నా కోసం ఒకరినొకరు ప్రేమించిన వారెక్కడున్నారు? ఏ నీడ దొరకని ఈ రోజున నేను వారికి నా నీడ ప్రసాదిస్తాను"

ముస్లిములు అనేక కష్టభరితమైన, ప్రమాదకరమైన పరిస్థితులను ఎదుర్కున్న తీరును పరిశీలిస్తే వారిలో అత్యంత ఉన్నతమైన సోదరభావం, పరస్పర విశ్వాసాలు మనకు తెలుస్తాయి.

ఎలాంటి పరిస్థితులు కూడా వాటిని ఏ మాత్రం మార్చలేవన్నది స్పష్టమైంది.

ఈ సంబంధాలే ముస్లిమ్ సమాజానికి ఆధ్యాత్మిక, సామాజిక బలంగా మారాయి. దీనిలోని వారి సాఫల్యం దాగి ఉంది. దేవునిపై విశ్వాసం, తల్లిదండ్రుల పట్ల ప్రేమ, ప్రజల్లో సౌభ్రాత్ర భావన, నీతి నియమాలు ఇవే వారి సాఫల్యానికి కారణలాయ్యాయి.

# అజాన్
# ప్రార్థనకు పిలుపు

నెలలు గడిచాయి, ఆధ్యాత్మిక ఆచరణలను నెమ్మదిగా వ్యవస్థీకరించడం జరిగింది. రమజాన్ మాసంలో ఉపవాసాలు, జకాత్ నిబంధనలు అన్నీ వ్యవస్థీకృతమయ్యాయి. జకాత్ అంటే అల్లాహ్ అనుగ్రహం పొందడానికి మనిషి తన సంపదను పరిశుద్ధం చేసుకోవడం. ఆ విధంగా సంపద మంచిపద్ధతుల ద్వారా పెరిగేలా చేసుకోవడం. ప్రార్థనలతో పాటు ఉపవాసాలు, జకాత్ కూడా విశ్వాసుల ఆధ్యాత్మిక ఆచరణల్లో చేర్చడం జరిగింది. ముస్లిములు మస్జిదులో నిర్ధారిత వేళకు చేరుకుని ప్రార్థనలు చేసేవారు.

ప్రవక్త ముహమ్మద్ ప్రార్థనలకు ప్రజల్ని పిలిచే మంచి పద్ధతి గురించి ఆలోచించసాగారు. యూద లేదా క్రయిస్తవ ఆచరణల మాదిరిగా గంట కొట్టడం లేదా కొమ్ముబూర ఊదడం వంటి పద్దతుల గురించి ప్రస్తావనలు వచ్చాయి. ఒకరోజు అబ్దుల్లా కుమారుడు జైద్ ప్రవక్త ముహమ్మద్ వద్దకు వచ్చాడు. ఆయన ఒక అన్సార్. తనకు వచ్చిన ఒక కల గురించి ఆయన ప్రవక్తకు తెలియజేశారు. ప్రార్థనలకు ప్రజలను ఎలా పిలువాలో ఆ పదాలను ఒక వ్యక్తి తనకు కలలో చెప్పారని వివరించారు. ప్రవక్త ఆయన చెప్పిన మాటలను శ్రద్ధగా విన్నారు. ఆయన చెప్పింది నిజమేనని గుర్తించారు. వెంటనే స్వేచ్ఛ పొందిన బానిస బిలాల్ కోసం కబురంపారు. బిలాల్ గొంతు అత్యంత మధురమైనది. మస్జిదుకు దగ్గరగా ఉన్న ఎత్తయిన ఇంటిపైన నిలబడి ప్రార్థనలకు కింది విధంగా పిలవాలని ఆదేశించారు. ఆ పిలుపులో ఉన్న పదాలివి

1. *అల్లాహు అక్బర్* — అల్లాహ్ అత్యున్నతుడు (నాలుగుసార్లు)
2. *అష్హదు అన్ లాయిలాహ్ ఇల్లల్లాహ్* — ఒకేఒక్క దేవుడు తప్ప మరో దేవుడు లేదని సాక్ష్యమిస్తున్నాను. (రెండుసార్లు)

| | |
|---|---|
| 3. *అష్‌హదుఅన్న ముహమ్మదుర్రసూలుల్లాహ్* | ముహమ్మద్ దేవుని ప్రవక్త అని సాక్ష్యమిస్తున్నాను (రెండుసార్లు) |
| 4. *హయ్యఅలస్సలా* | ప్రార్థనకు త్వరగా రండి (రెండుసార్లు) |
| 5. *హయ్య అలల్ ఫలా* | సాఫల్యం వైపునకు త్వరగా రండి (రెండుసార్లు) |
| 6. *అల్లాహు అక్బర్* | అల్లాహ్ అత్యున్నతుడు (రెండు సార్లు) |
| 7. *లాయిలాహ ఇల్లల్లాహ్* | ఒకే ఒక్క దేవుడు తప్ప మరో దేవుడు లేదు (ఒకసారి) |

ప్రాత:కాల ప్రార్థనలకు హయ్యాఅలల్ ఫలా తర్వాత మరో రెండు వాక్యాలను అదనంగా చేర్చడం జరిగింది. ఆ వాక్యాలు :

| | |
|---|---|
| *అస్సలాతు ఖైరుమ్మినన్నౌమ్* | నిద్ర కన్నా ప్రార్థన మేలైనది (రెండుసార్లు) |

ఈ ప్రార్థనల పిలుపు, ఏమాత్రం ఎన్నడూ మార్పు లేకుండా దేవుని ఔన్నత్యం (అల్లాహు అక్బర్) ప్రాతిపదికగా విశ్వాసానికి (ఒకేఒక్క దేవుడు తప్ప మరో దేవుడు లేడని, ముహమ్మద్ దేవుని ప్రవక్త అని సాక్ష్యమిస్తున్నాను అన్న విశ్వాసానికి) పునాదిగా కొనసాగుతూ వస్తోంది. ఈ ప్రార్థనల పిలుపు నమాజుకు ఆహ్వానంగా, ఇహపరలోకాల్లో సాఫల్యానికి పిలుపుగా ఎలాంటి మార్పు లేకుండా పదిహేను శతాబ్దాలుగా ముస్లిములు నివసిస్తున్న ప్రాంతాల్లో ప్రతిధ్వనిస్తూనే ఉంది. వివిధ యాసల్లో, వివిధ లయలతో, విభిన్న స్వరాలతో అత్యంత మధురమైన సంగీతంలా దేవుని ఔన్నత్యాన్ని స్తుతిస్తూనే ఉంది. ప్రజలను ఆధ్యాత్మికత వైపునకు పిలుస్తూనే ఉంది. ప్రాత:కాలంలో మేలుకొలుపులా, శ్రమతో గడిచిన పగలు ముగిసిందన్న సంకేతంగా, రాత్రి విశ్రాంతికి ముందు మనిషిని ఆధ్యాత్మిక ప్రశాంతతను ప్రసాదించే స్వరంలా వినిపిస్తూనే ఉంది.

ఒకే ఒక్క దేవుడిని ఈ పిలుపు గుర్తు చేస్తుంది. దేవుడు తన దాసులు రోజువారి పనుల్లోను ఆధ్యాత్మిక స్పృహను కోల్పోకుండా, ఆధ్యాత్మికత, ధర్మపరాయణతలను స్మరించుకుని తిరిగి తమ కార్యకలాపాల్లో నిమగ్నమయ్యేలా చేసిన ఏర్పాటు ఇది.

# మదీనా

## శ్రేయో రాజ్యం

ప్రవక్త ముహమ్మద్ ఆయన అనుచరులు మక్కా నుంచి వచ్చి మదీనాలో నెమ్మదిగా స్థిరపడసాగారు. కొత్త పరిసరాల్లో తమ ఉనికిని ఏర్పరచుకుంటున్నారు. ఒక విభిన్నమైన పరిస్థితుల్లో కొత్త సమాజం రూపుదిద్దుకోవడం ప్రారంభమైంది. తెగల మధ్య ఘర్షణలు, అధికార జగడాలు ముస్లిములకు, యూదుల తెగలకు మధ్య సంబంధాలను దెబ్బతీసేవి. ఒప్పందాలు ఉన్నప్పటికీ ఈ సమస్య కొనసాగింది.

ప్రవక్త ముహమ్మద్ ఆయన అనుచరులు ఆధ్యాత్మిక, ధార్మిక విద్యాబోధన కొనసాగుతూనే ఉంది. ముస్లిములు కట్టుబడవలసిన ధార్మిక సూత్రాలను గుర్తు చేయడానికి ప్రవక్త ముహమ్మద్ ఎల్లప్పుడు అందుబాటులో ఉండేవారు.

మక్కాలో నిరాశ, ఆగ్రహాలు తారాస్థాయికి చేరాయి. వలసపోవడం ద్వారా ముస్లిములు సాధించిన విజయం వారికి చాలా అవమానకరంగా కనబడింది. పైగా దీనివల్ల అరేబియా ద్వీపకల్పంలో అధికార సమతుల్యంలో మార్పులు రావడం ఖాయంగా కనబడింది. దశాబ్దాలుగా ఖురైషులు ఎదురులేని అధికారాన్ని అనుభవించారు. వారి గత చరిత్ర వల్ల కాని, లేదా మక్కా నగరానికి వారు ఆధిపత్యం వహించడం వల్ల కాని వారికి ఈ ఆధిపత్యం లభించింది. మక్కాపై అధికారం కలిగి ఉండడమంటే చాలా ప్రముఖమైన విషయం. ద్వీపకల్పంలోని అన్ని తెగలు ఏడాదికి ఒకసారి అక్కడికి ధర్మయాత్ర కొరకు వచ్చేవి. అది ముఖ్యమైన కూడలి. మక్కా వాణిజ్యానికి కేంద్రం వంటిది.

ప్రవక్త ముహమ్మద్ మదీనా చేరుకోవడం, అక్కడ ముస్లిములు స్థిరపడడం ఈ వార్త మొత్తం అరేబియా ద్వీపకల్పంలో వ్యాపించింది. దీనివల్ల ఖురైషుల అభిజాత్యం దెబ్బతిన్నది. వారి అధికారాన్ని సవాలు చేసి విజయం సాధించారాయన. ప్రవక్త ముహమ్మద్‌కు ఆయన అనుచరులకు ఈ పరిణామాలు బాగా తెలుసు. కాబట్టి ఖురైషుల నుంచి ప్రతిస్పందన వస్తుందని ఊహించారు. వారంతా ఎవరో పరాయివారు కాదు. స్వంత తెగ మనుష్యులే, స్వంత బంధువులే. వారు ఎలా ప్రతిస్పందిస్తారన్న అవగాహన ఉంది.

# ఖురైషులతో వివాదాలు

ముస్లిములందరు మదీనాకు తరలి రాలేదు. మక్కాలోనే ఉండిపోయిన ముస్లిములను ఖురైషులు వేధించడం ప్రారంభించారు. ప్రవక్త ముహమ్మద్ మదీనా చేరుకుని తన ఉద్యమాన్ని కొనసాగించడంతో వారిలో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఆ కోపాన్ని మక్కాలో ఇంకా మిగిలి ఉన్న ముస్లిములపై చూపడం మొదలుపెట్టారు. నిజానికి కొందరు ముస్లిములు తాము ఇస్లామ్ స్వీకరించిన విషయాన్ని బయటపెట్టకుండా మక్కాలోనే ఇంకా ఉన్నారు. తాము ముస్లిములుగా మారామన్న విషయం తెలిస్తే దౌర్జన్యాలకు గురవుతామని భయపడసాగారు.

అరేబియా లోని తెగలన్నీ గౌరవించే సంప్రదాయాలను కూడా తుంగల్లోతొక్కి మక్కా వదిలిపోయిన ముస్లిముల ఆస్తిపాస్తులను స్వాధీనం చేసుకోవాలని కూడా ఖురైషులు పూనుకున్నారు. ఖురైషుల ఈ వ్యవహారం గురించి మదీనాలో ఉన్న ముస్లిములు విన్నారు. ఖురైషుల ఈ వ్యవహారం అత్యంత లజ్జాకరమైనది, పిరికిపందల చర్య. ఖురైషుల ఈ ధోరణి పట్ల సహజంగానే ప్రవక్త ముహమ్మద్‌కు ఆయన అనుచరులకు కోపం ఉంది.

దాదాపు ఒక సంవత్సరం ప్రవక్త ముహమ్మద్ ఎర్రసముద్ర తీరాన నివసిస్తున్న వివిధ తెగలతో ఒప్పందాలు చేసుకుని శాంతిని స్థాపించే ప్రయత్నం చేశారు. మక్కా వాణిజ్య బృందాలు ఇరాక్, సిరియా వెళ్ళాలంటే ఈ మార్గానే మదీనా మీదుగా వెళ్ళవలసి ఉంటుంది. ఈ పరిస్థితి ఖురైషులకు చాలా ఇబ్బందిగా మారింది. కాబట్టి వాళ్ళు తూర్పుగా ప్రయాణించడానికి కొత్త మార్గాలు వెదకవలసి వచ్చింది. నెమ్మదిగా ఉద్రికత్తలు పెరగసాగాయి. మరోవైపు ఖురైషులు ముస్లిముల ప్రతిష్ఠ మంటగలపడానికి ప్రయత్నిస్తూ వివిధ తెగలను ముస్లిములపై రెచ్చగొట్టడం ప్రారంభించారు.

ప్రవక్త ముహమ్మద్ ముందు జాగ్రత్తలు తీసుకున్నారు. ఖురైషుల కదలికలు, కార్యకలాపాలు, వారి పథకాల వివరాలు రాబట్టడానికి గూఢచార బృందాలను వినియోగించేవారు. ముఖ్యంగా యుద్ధప్రయత్నాలేవైనా జరుగుతున్నాయా అన్నది నిఘాపెట్టారు. ఆ ప్రాంతంలో ఖురైషులు ఎవరెవరితో మైత్రి ఒప్పందాలు చేసుకుంటున్నారన్నది కూడా గమనించసాగారు. ఈ నిఘా ఎంతైనా అవసరం. ఎందుకంటే ఖురైషుల వైరం నానాటికీ తీవ్రమవుతూ ఉంది. బహిరంగంగానే విద్వేష ప్రకటనలు వస్తున్నాయి. ప్రవక్త సేకరించిన సమాచారాన్ని బట్టి యుద్ధం తప్పేలా లేదని తేలిపోయింది.

# జిహాద్

## ప్రతిఘటన

ప్రత్యర్థులు దాడిచేసిన ప్రతిసారి ప్రవక్త ముహమ్మద్ వారికి జవాబుగా దివ్యఖుర్ఆన్ వాక్యాలనే ఉపయోగించేవారు. తన ఆత్మరక్షణకు ఆయన దివ్యఖుర్ఆన్ వాక్యాలతోనే ప్రయత్నించేవారు. ఇదే దివ్యఖుర్ఆన్ ఆయనకు నేర్పింది. దివ్యఖుర్ఆన్‌లో జిహాద్ అన్న పదం మొదటిసారి ప్రయోగించిన వాక్యం ఇది :

> "కనుక ప్రవక్తా! అవిశ్వాసుల మాటను ఎంతమాత్రం నమ్మకు. ఈ ఖురాను ద్వారా వారితో మహత్తరమైన పోరాటం జరుపు." (దివ్యఖుర్ఆన్ 25:32)

అన్ని విధాల ఒత్తిళ్ళ మధ్య, హింసాత్మక దాడుల మధ్య, ప్రవక్త ముహమ్మద్ ఒక దివ్యఖుర్ఆన్ వాక్యాన్ని అందుకున్నారు. ఆయన చేపట్టవలసిన ప్రతిఘటన (జిహాద్) పద్దతులు, మార్గాలను ఆ దివ్యఖుర్ఆన్ వాక్యం విశదీకరించింది.

ఇక్కడ మనం జిహాద్ భావనలోని మౌలికమైన, ముఖ్యమైన అర్థాన్ని తెలుసుకోవాలి. అరబీ భాషలో జహద అన్న పదం నుంచి జిహాద్ అన్న పదం వచ్చింది. ఈ పదానికి అర్థం ప్రయత్నించడం. ఇలాంటి సందర్భాల్లో ప్రతిఘటన అన్న అర్థం కూడా ఉంది. అంటే దౌర్జన్యాన్ని, అణిచివేతను ప్రతిఘటించడం కూడా కావచ్చు.

విశ్వప్రభువు అల్లాహ్ తన ప్రవక్తకు ఆదేశిస్తూ దివ్యఖుర్ఆన్‌పై ఆధారపడి ఖురైషుల దౌర్జన్యాలను ప్రతిఘటించాలని పేర్కొన్నాడు. ఖురైషుల అణిచివేతలకు వ్యతిరేకంగా ప్రవక్త ముహమ్మద్ వద్ద ఉన్న ఆధ్యాత్మిక, మేధోపరమైన ఆయుధం దివ్యఖుర్ఆన్. ఎగతాళి చేసేవారు, పరాభవించేవారు, అవమానించేవారు, దాడులు చేసేవారు, హింసకు పాల్పడేవారు, హత్యలకు పాల్పడేవారు, మహత్యాలను రుజువులుగా చూపమనేవారు... ఇలాంటి వారందరికీ ప్రవక్త ముహమ్మద్ దివ్యఖుర్ఆన్ ద్వారానే జవాబిచ్చారు.

దివ్యఖుర్‌ఆన్ జ్ఞానం ఆయన వద్ద ఉన్న ఆయుధం. ప్రవక్త ముహమ్మద్ ఆయన అనుచరులు శాంతియుతంగా, ఎలాంటి ఘర్షణలు లేకుండా ఇస్లామీయ సందేశ ప్రచారానికి అలుపెరుగని ప్రయత్నాలు చేశారు. కాని ఖురైషులు పరిస్థితిని హింసాత్మకంగా మార్చసాగారు. అణిచివేతలు శృతిమించాయి. మరోవైపు దివ్యఖుర్‌ఆన్ వాక్యాలు కూడా ఒకటి తర్వాత ఒకటిగా అవతరించడం ప్రారంభమైంది. ప్రవక్త ముహమ్మద్, ప్రారంభంలో ఇస్లామ్ స్వీకరించిన ఆయన అనుచరులు తమపై జరిగే దాడులకు ప్రతిఘటనగా చేపట్టిన జిహాద్ .... ఒకే ఒక్క దేవుడిని గుర్తించాలని ప్రజలకు చెప్పడం, మరణానంతర జీవితాన్ని విశ్వసించాలని, తీర్పుదినాన్ని, మంచిపనులను విశ్వసించాలని ప్రచారం చేయడం. దివ్యఖుర్‌ఆన్ వారికెల్లప్పుడు ఆధ్యాత్మిక, మేధోపరమైన ఆయుధంగా మాత్రమే కాదు, భౌతికదాడుల్లో కూడా దివ్యఖుర్‌ఆన్ వారికి డాలుగా మారేది.

కాని దౌర్జన్యాలు, అణిచివేతలు మరింత తీవ్రమయ్యాయి. నిరంతరంగా కొనసాగేవి. ప్రతిఘటన ఈ విధంగా కొనసాగించడం కూడా కష్టమైంది. ఒకరోజు కొందరు ముస్లిములు ప్రవక్త ముహమ్మద్ వద్దకు వచ్చారు. "ప్రవక్త, మీరు దేవుని ప్రార్థించి మనకు సహాయపడేలా చేయరా?" అని ప్రశ్నించారు. ప్రవక్త వారికి జవాబిస్తూ :

"మీ కన్నా ముందు గతించిన జాతుల్లో ముస్లిములను చాలా మందిని సజీవంగా సమాధి చేశారు. తల నుంచి పాదాల వరకు రంపాలతో కోశారు. ఈ చిత్రహింసలేవీ వారిని వారి విశ్వాసం నుంచి మరలేలా చేయలేకపోయాయి. ఇనుప దువ్వెనలతో మాంసాన్ని ఎముకల నుంచి చీల్చేసినా వారు తమ విశ్వాసాన్ని వదలలేదు. దేవుని తోడు ఈ విశ్వాసం విజయం సాధిస్తుంది. ఒంటరి బాటసారి సనా నుంచి హజ్రామౌంట్ (ఎమన్‌లో ఉంది) వరకు దైవభయం తప్ప మరే భయం లేకుండా లేదా తన గొర్రెలను తోడేలు తింటుందన్న భయం తప్ప మరే భయం లేకుండా సురక్షితంగా ప్రయాణించే రోజు తప్పక వస్తుంది. కాని మీరు చాలా అసహనంగా ఉన్నారు." అని చెప్పారు.

అందువల్ల ముస్లిములు సహనంతో, ఓరిమితో వ్యవహరించవలసి ఉంది. అల్లాహ్ పట్ల, ఆయన అభీష్టం పట్ల ఎన్నడూ నిరాశ చెందరాదు. దైవవిశ్వాసికి కష్టాలు, భరించరాని బాధలు ఎదురవుతాయని ప్రవక్త వారికి బోధించేవారు. భౌతికంగాను, నైతికంగాను వారు ఎదుర్కున్న బాధలు వారిని తీర్చిదిద్దాయి. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కునేలా మార్చాయి. తమపై సందేహం తప్ప దేవునిపై ఎలాంటి సందేహం లేని స్థితికి వారు చేరుకున్నారు.

# ఖితాల్

# సాయుధ ప్రతిఘటన

ఇదే కాలంలో ప్రవక్త రెండు ముఖ్యమైన దివ్యఖుర్ఆన్ వాక్యాలను అందుకున్నారు. ఈ రెండు అవతరణలు పూర్తిగా విభిన్న అంశాలకు చెందినవి. ఈ రెండు వాక్యాలు కూడా గతం నుంచి పూర్తిగా తెగతెంపులు చేసుకునే వాక్యాలు. దాదాపు పదమూడు సంవత్సరాలుగా ముస్లిములను సహనం వహించాలని, ఖురైషు నాయకుల దౌర్జన్యాలను, అణిచివేతలను శాంతియుతంగా ప్రతిఘటించాలని బోధించడం జరిగింది. వారు అనేక దౌర్జన్యాలు భరించారు, అణిచివేతలకు గురయ్యారు. ఆ తర్వాత మదీనాకు వలస వెళ్ళారు. ఎలాంటి తిరుగుబాటులు లేకుండా అణిచివేతకు ప్రతిస్పందనగా అక్కడి నుంచి తరలిపోయారు.

ముస్లిములు మదీనాలో స్థిరపడిన తర్వాత ఖురైషులు తమ అణిచివేతను, వైరాన్ని మరింత తీవ్రం చేశారు. ప్రవక్త ప్రారంభించిన ఇస్లామీయ ఉద్యమాన్ని నిర్మూలించాలని పూనుకున్నారు. ఇప్పుడు ఇస్లామీయ ఉద్యమం కేవలం మక్కాలో సమాజిక సమతుల్యాన్ని మాత్రమే కాదు, మొత్తం అరబ్బు ద్వీపకల్పంలో రాజకీయాధికారాల సమతుల్యాన్ని దెబ్బతీసే స్థాయికి చేరింది. ముఖ్యంగా వివిధ తెగల మధ్య ఖురైషులకు ఉన్న ఆధిపత్యం, వారి ధార్మిక, సైనిక పెత్తనం అన్నీ దెబ్బతినే ప్రమాదం వారికి కనబడింది.

ఆ పరిస్థితుల్లో ప్రవక్త ఒక దివ్యఖుర్ఆన్ అవతరణను స్వీకరించారు. ఆ దివ్యఖుర్ఆన్ వాక్యం నిర్ద్వంద్వంగా ఇలా ప్రకటించింది :

> "ఎవరికి వ్యతిరేకంగా యుద్ధం చెయ్యబడుతూ ఉందో, వారికి (యుద్ధం చేయటానికి) అనుమతి ఇవ్వబడింది; ఎందుకంటే వారు అన్యాయానికి గురిఅయిన వారు. నిశ్చయంగా అల్లాహ్ వారికి సహాయం చేయగల సమర్థుడు. వారు అన్యాయంగా తమ ఇళ్లనుండి తరిమివేయబడినవారు. వారి తప్పు కేవలం "అల్లాహ్ మా ప్రభువు" అని అనటమే." (దివ్యఖుర్ఆన్ 22:39-40)

ఇక నుంచి ముస్లిములు సహనంతో భరించవలసిన అవసరం లేదు. శత్రువుల ఆక్రమణలను, అణిచివేతల నుంచి ఆత్మరక్షణ చేసుకోవాలి. ఆధ్యాత్మిక, మేధోపరమైన జిహాద్ అంటే, ఇది స్వార్థం, దురాశ తదితర ఆకర్షణలు, ఆకాంక్షలకు వ్యతిరేకంగా మనిషి అంతర్గతంగా జరిగే సంఘర్షణ, అలాగే అవిశ్వాస అరబ్బు గిరిజనులు అడిగే నానావిధ ప్రశ్నలకు శాంతియుతంగా జవాబు ఇవ్వడం. కాని ఇప్పుడు జిహాద్‌లో ఒక కొత్త కోణం

కూడా చేరింది. అది అల్ కితాల్ అంటే, అంటే అవసరమైన మేరకు సాయుధ ప్రతిఘటన. సాయుధ దాడులు జరిగినప్పుడు ఆత్మరక్షణకు చేపట్టే చర్య.

జిహాద్‌కు సంబంధించిన ఈ రూపాలన్నీ ఒకదానితో ఒకటి సంబంధం ఉన్నవే. ఇవన్నీ ప్రతిఘటనలే. అంతర్గతంగా మనిషి ఆకాంక్షలతో చేసే ప్రతిఘటన కాని, సాయుధ దాడుల్లో చేసే ప్రతిఘటన కాని. దీనికి సంబంధించిన దివ్యఖుర్ఆన్ వాక్యం చివరిలో మనుష్యుల సహజ విస్తరణా వాంఛను, అణిచివేతలను ప్రతిఘటించడానికి పోరాటం అవసరమని పేర్కొంటుంది.

ఈ దివ్యఖుర్ఆన్ వాక్యం చూడండి

> "అల్లాహ్ గనక ప్రజలను ఒకరి ద్వారా మరొకరిని తొలగిస్తూ ఉండకపోతే, ఆశ్రమాలు, చర్చీలు, యూదుల ప్రార్థనాలయాలు, మశీదులు– వేటిలో అల్లాహ్ పేరు అత్యధికంగా స్మరింపబడుతుందో – అన్నీ ధ్వంసం చేయబడి ఉండేవే. అల్లాహ్ తనకు సహాయం చేసేవారికి తప్పకుండా సహాయపడతాడు. అల్లాహ్ మహాశక్తిమంతుడు, మహాబలవంతుడూను." (దివ్యఖుర్ఆన్ 22:40)

మానవప్రవృత్తి దృష్ట్యా వివిధ శక్తుల మధ్య సమతుల్యం అవసరం. ఒకే వ్యక్తికి, ఒకే జాతికి, ఒకే సామ్రాజ్యానికి సర్వాధిపత్యం లభిస్తే ప్రజల్లో ఉన్న వైవిధ్యం నాశనమై పోతుంది. వివిధ ఆరాధనాలయాలు ధ్వంసం అవుతాయి (ఈ జాబితా చివరన మస్జిదులున్నాయి). ఈ వాక్యం మనకు ధార్మిక స్వేచ్ఛను చాటి చెబుతోంది. దేవుడు ఈ అనుమతి ఇచ్చాడు. అందువల్లనే వివిధ శక్తుల మధ్య పోరాటాలు, మానవప్రవృత్తిలో యుద్ధానికి దిగే స్వభావాన్ని ఇక్కడ ప్రస్తావించడం జరిగింది. మరో దివ్యఖుర్ఆన్ వాక్యంలో మరింత సాధారణీకరిస్తూ ఇలా చెప్పడం జరిగింది :

> "అల్లాహ్ మానవుల ఒక వర్గాన్ని మరొక వర్గం ద్వారా తొలగించకపోతే, భూలోక వ్యవస్థ ఛిన్నాభిన్నమై ఉండేది. కాని ప్రపంచ మానవులపై అల్లాహకు ఎనలేని అనుగ్రహం." (దివ్యఖుర్ఆన్ 2 : 251)

మానవులు ప్రవృత్తి రీత్యా అధికారం పట్ల దురాశ కలిగి ఉంటారు. దుర్మార్గాలు, హత్యలు విస్తరిస్తాయి. మరో స్వభావం ఏమంటే మనిషి న్యాయాన్ని, మంచిని ఇష్టపడతాడు.

జిహాద్ సారమేమంటే, శాంతిస్థాపన. దీనికి కొన్ని సందర్భాల్లో సాయుధ ప్రతిఘటన అవసరమవుతుంది.

# అత్యున్నత జిహాద్

ఇస్లామ్‌ను అర్థం చేసుకోవాలని అభిలషించే ప్రజలందరికీ ప్రవక్త ముహమ్మద్ అందుబాటులో ఉండేవారు. ఆయన వారి మాటలు శ్రద్ధగా వినేవారు, వారి సందేహాలకు సమాధానాలు చెప్పేవారు. వారి ప్రగతి వికాసాలపై దృష్టిపెట్టేవారు. చాలా సంవత్సరాల తర్వాత హునైన్ యుద్ధం నుంచి తిరిగివస్తున్నప్పుడు ప్రవక్త స్పష్టంగా ఇలా ప్రకటించారు : "మనం ఒక తక్కువ జిహాద్ నుంచి వెనక్కి వస్తున్నాం. అత్యున్నత జిహాద్ వైపునకు వెళుతున్నాం." ఈ మాటలు విని ఒక అనుచరుడు అత్యున్నత జిహాద్ అంటే ఏమిటని ప్రశ్నించాడు. ప్రవక్త జవాబిస్తూ మనోకాంక్షలతో పోరాడ్డమే అత్యున్నత జిహాద్ అన్నారు. ముస్లిములకైనా, ముస్లిమేతరులకైనా మానవాళి అందరికీ ఈ అంతర్గత పోరాటం చాలా కష్టమైనది. అత్యున్నతమైనది. ఈ పోరాటానికి అవగాహన, క్షమాహృదయం, తన పట్ల తాను నిజాయితీగా ఉండడం చాలా అవసరం.

యుద్ధం లేదా తక్కువ జిహాద్ వల్ల దేవుని కొరకు ప్రాణత్యాగం చేయడం ఎంత కష్టమో తెలుస్తుంది. కాని దేవుని కొరకు జీవించడం మరింత కష్టమని అత్యున్నత జిహాద్ స్పష్టం చేస్తుంది.

# 10

# మొదటి యుద్ధం

## బద్ర్

ఖురైష్ నాయకుడు అబూ సుఫియాన్ నాయకత్వంలోని ఒక వ్యాపార బృందం పెద్ద ఎత్తున వ్యాపార సామగ్రితో సిరియా నుంచి వస్తున్నట్లు ప్రవక్త ముహమ్మద్‌కు సమాచారం అందింది. ఈ వ్యాపారసామగ్రిలో చాలా ఖురైష్ తెగల వాటాలున్నాయి. ఖురైషులు తమ వ్యాపారసామగ్రిని కాపాడుకోడానికి మదీనావైపు సైన్యాన్ని నడిపారు. ఇదే అదునుగా అప్పుడప్పుడే నిలదొక్కుకుంటున్న మదీనా ముస్లిములను అణిచేయాలని భావించారు.

ప్రవక్త ముహమ్మద్ 313 మంది ఉన్న దళంతో బయలుదేరారు. వారు నిజానికి యుద్ధానికి తగిన స్థితిలో లేరు. ఆయుధాలు కూడా అంతంత మాత్రమే. అప్పుడు ప్రవక్త ముహమ్మద్ కుమార్తె రుఖయ్యా తీవ్రమైన అనారోగ్యంతో ఉన్నారు. ఇలాంటి సందర్భాల్లో ఎల్లప్పుడు ప్రవక్త వెంట ఉండే ఉస్మాన్ ఆమె భర్త. ప్రవక్త ఆయన్ను ఇంటివద్దనే ఉండి ఆమె బాగోగులు చూసుకోవాలని ఆదేశించారు.

ఖురైష్ నాయకుడు అబూసుఫియాన్‌కు తమ వ్యాపారబృందంపై దాడి జరగవచ్చని గూఢచారుల వర్తమానం అందించారు. ఆయన వెంటనే మక్కా ఖురైషులకు సమాచారం పంపించి, తమపై దాడి జరిగే అవకాశం ఉంది కాబట్టి వెంటనే సహాయం పంపాలన్నారు. వెంటనే ఆయన తన మార్గాన్ని కూడా మార్చేశాడు. చివరకు దాడి జరిగే అవకాశాలను తప్పించినట్లు ఆయన రూఢిపరచుకున్న తర్వాత ఆయన మక్కా ఖురైష్ నాయకులకు ఆ సమాచారం పంపించి, తమపై దాడి జరిగే అవకాశాలు లేవని తెలియజేశాడు. అంతేకాదు, సహాయం పంపవలసిన అవసరం లేదని కూడా చెప్పాడు.

కాని అప్పటికే ఖురైషు నాయకులు యుద్ధానికి సన్నద్ధమై బయలుదేరారు. దాదాపు వెయ్యి మంది సైనికులతో భారీ ఎత్తున ఏర్పాట్లతో ఉన్నారు. వ్యాపారబృందంపై దాడి జరిగే అవకాశం లేకపోయినప్పటికీ, ముందుకు సాగాలని అబూజహల్ ఒత్తిడి చేశాడు. నిజానికి ఇక్కడ యుద్ధాన్ని జరక్కుండా చూడ్డం చాలా తేలికైనా తమ బలాన్ని ముస్లిములకు తెలియజేయాలని భావించారు.

ప్రవక్త ముహమ్మద్ ఆయన అనుచరులు బద్ర్ గ్రామం వద్ద తమ శిబిరాలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ గ్రామం మదీనాకు 130 కిలోమీటర్ల దూరంలో ఉంది. మక్కా నుంచి పెద్ద సైన్యమే వస్తుందన్న వార్త వారికి చేరింది. అంటే వారి కన్నా మూడు రెట్లు పెద్దసైన్యం. ఖురైష్ నాయకులు ఇక తాడోపేడో తేల్చుకోవాలన్న ధోరణిలో ఉన్నారని కూడా తెలిసింది. ఇది యుద్ధం నిజానికి ముస్లిములు ఈ యుద్ధానికి సిద్ధంగా లేరు.

## సంప్రదింపులు

ప్రవక్త ముహమ్మద్ తన అనుచరులతో సంప్రదించాలని నిర్ణయించారు. ఈ వ్యవహారం గురించి వారేమనుకుంటున్నారో తెలుసుకోవడం కూడా చాలా అవసరం. పూర్తి స్థాయి యుద్ధప్రమాదం ఉన్నప్పటికీ ఎదుర్కొందామని, ముందుకు సాగుదామని వారన్నారు. అల్ మిక్దాద్ మాట్లాడుతూ : “ముందుకు సాగండి, మీరు మీ ప్రభువు పోరాడండి. మీతో పాటు మేము ఉన్నాం. మేము పోరాడుతాం, మీకు కుడిఎడమల, మీ ముందు వెనుకల మేము పోరాడుతాం” అన్నాడు.

వారి వైఖరి ప్రవక్త ముహమ్మద్‌కు కావలసిన ప్రోత్సాహాన్ని ఇచ్చింది. ఈ ప్రతిస్పందన మక్కా నుంచి వలస వచ్చిన ముహాజిర్ల నుంచి రావడం సహజమే, కాని మదీనాకు చెందిన అన్సార్ల నుంచి ఆయనకు స్పష్టమైన మద్దతు అవసరం. ఎందుకంటే ఈ వ్యవహారంతో వారికి ప్రత్యక్షంగా ఎలాంటి సంబంధమూ లేదు. ఖురైషులతో వారికి ఎలాంటి ఘర్షణ లేదు. వారు ప్రవక్తతో ఒప్పందం చేసుకున్నది కూడా మదీనాలో యుద్ధం సంభవిస్తే ఆయనకు అండగా నిలుస్తామన్నదే. మదీనాకు బయట జరిగే యుద్ధంతో ఆ ఒప్పందానికి సంబంధం లేదు. అన్సార్ల తరఫున సాద్ లేచి నిలబడి “మీరేది మంచిదనుకుంటే అది చేయండి. మేమంతా మీతో ఉన్నాం. మీకు సత్యసందేశం ఇచ్చి పంపిన దేముడితోడు, మీరు ఆదేశిస్తే మీతో పాటు సముద్రంలో దూకమన్నా దూకుతాం. ఒక్కరు కూడా వెనుకంజ వేయరు” అన్నాడు. ఈ విధంగా ప్రవక్త అన్సార్ల నుంచి కూడా కావలసిన మద్దతు పొందారు. ఖురైష్ సైనిక విన్యాసాల ప్రభావం తమపై పడకుండా ముందుకు సాగాలనే ప్రవక్త నిర్ణయించారు.

# ప్రజాస్వామిక విలువలు

సాముదాయిక జీవితంలో ప్రవక్త ముహమ్మద్ ఆలోచనల స్వేచ్ఛను, ప్రజాస్వామిక విలువలను ఎలా పాటించేవారో గమనిస్తే ఆశ్చర్యమనిపిస్తుంది. ముఖ్యంగా ఆ కాలంలో రాజకీయాధికారం, ధార్మికాధికారం చేతుల్లో ఉన్నవారు ఎలా వ్యవహరించేవారన్నది తెలుసుకుంటే, ప్రవక్త వైఖరి మరింత ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. మతపెద్దలు ఎవరినీ ఏ విషయంలోను సంప్రదించేవారు కాదు. ఎందుకంటే తాము దేవుని మార్గదర్శనం పొందుతున్నామని భావించేవారు. లేదా తామే దైవస్వరూపులమని భావించేవారు. ఇది పాతకాలంలోనే కాదు నేడు కూడా కొనసాగుతున్న చేదు నిజం.

ప్రవక్త ఎల్లప్పుడు తన అనుచరులతో సంప్రదింపులు కొనసాగిస్తూనే ఉండేవారు. వారి సలహాలు కోరేవారు. వారి అభిప్రాయాలు చెప్పాలని ప్రోత్సహించేవారు. వారు చెప్పేది శ్రద్ధగా వినేవారు. అంతేకాదు, అంతేకాదు ఆయన అందరినీ ప్రోత్సహించి వారి వారి శక్తిసామర్థ్యాలు, ప్రత్యేక నైపుణ్యాలు పదునుపెట్టుకునేలా చేసేవారు.

ఆయన తరచు వివిధ అంశాలపై వారిని ప్రశ్నలడిగేవారు. అనుచరులు తమ అభిప్రాయాలు చెప్పిన తర్వాత ఆయా ప్రశ్నలకు జవాబులు ఇచ్చేవారు. కొన్ని సందర్భాల్లో ఆయన ఏదైనా ఒక వ్యాఖ్య చేసి అనుచరులు దానిపై ఆలోచించేలా చేసేవారు. ఉదాహరణకు ఆయన ఒకసారి "శత్రువును ఓడించినవాడు బలవంతుడు కాదు" అన్నారు. అనుచరులు ఈ వ్యాఖ్య విషయంలో చాలా సేపు ఆలోచించి తర్వాత "అయితే బలవంతుడు ఎవరు?" అని ఆయన్నే ప్రశ్నించారు. ప్రవక్త వారందరినీ చకితులయ్యేలా చేస్తూ, వారిలో అవగాహనను మరింత పెంచుతూ "కోపంలో తన్ను తాను అదుపు చేసుకునేవాడే నిజమైన బలవంతుడు" అన్నారు.

కొన్ని సందర్భాల్లో ఆయన సూచనాప్రాయంగా కొన్ని విషయాలు చెప్పేవారు. ఉదాహరణకు "మీ వద్ద ఉన్న ఆస్తుల్లో సంపద లేదు" అన్నారు. అనుచరులు దానిపై ఆలోచిస్తున్నప్పుడు ఆయన "నిజమైన సంపద మనస్సులో ఉంటుంది" అన్నారు.

కొన్ని సందర్భాల్లో ఆయన వ్యాఖ్యలు సాధారణ విషయాలకు విరుద్ధంగా ఉన్నట్లు కనబడేవి. ఉదాహరణకు "మీ సోదరుడికి సహాయం చేయండి, అతను న్యాయంపై ఉన్నా, అన్యాయంపై ఉన్నా" అన్నారు. ప్రవక్త అనుచరులు ఆశ్చర్యపోయారు. అన్యాయానికి పాల్పడే సోదరుడికి ఎలా సహాయం చేయడం? ప్రవక్త జవాబిస్తూ "

"అన్యాయానికి పాల్పడకుండా అతన్ని ఆపడం ద్వారా సహాయం చేయండి. అతడికి సహాయం చేసే పద్ధతి ఇదే" అన్నారు.

ఈవిధంగా అనుచరులకు ప్రశ్నలడిగి వాటికి సమాధానాలివ్వడం, కొన్ని వ్యాఖ్యలు చేసి వాటికి వివరణలు ఇవ్వడం ద్వారా ఆయన వారికి శిక్షణ గరిపేవారు. ఆ విధంగా వారిలో ఆలోచనలకు ఆయన పదునుపెట్టారు. గుడ్డిగా అనుసరించడం కాదు, ఆలోచించి నిర్ణయాలు తీసుకునేవారిగా రూపొందించారు. ఈ శిక్షణ వల్ల వారు అవసరమైన సలహా సంప్రదింపుల్లో తగిన సూచనలు చేయగలిగిన స్థాయికి చేరుకున్నారు. ప్రవక్త వ్యక్తిత్వం వల్ల తీవ్రంగా ప్రభావితులైన వారే ప్రవక్త ముందు స్వేచ్ఛగా, స్వతంత్రంగా తమ అభిప్రాయాలను ప్రకటించేవారు. వారిని ప్రోత్సహించడం ద్వారా ప్రవక్త వారిలో మేధోశక్తిని వికసింపచేశారు. వారికి పూర్తిగా భావప్రకటనా స్వేచ్ఛ ఇవ్వడం ద్వారా ఆయన వారికి తమ అభిప్రాయాలను బలంగా వినిపించే వ్యక్తులుగా మలిచారు. ఆయనలోని నాయకత్వ లక్షణాలకు ఇది మరో ఉదాహరణ.

యువకుడైన హుబాబ్ ఈ శిక్షణకు మంచి ఉదాహరణ. ప్రవక్త ముహమ్మద్ బద్ర్ వద్దకు చేరుకున్నప్పుడు ఆయన తనకు కనబడిన మొదటి బావి వద్ద శిబిరాలు వేయాలని నిర్ణయించుకున్నారు. ఇది చూసి హుబాబ్ ఆయన వద్దకు వచ్చాడు. దేవుడు మీకు శిబిరం వేయడానికి ఎన్నుకున్న ప్రదేశం ఇదేనా? ఇక్కడి నుంచి ముందుకు కాని వెనక్కి కాని వెళ్ళే అవకాశం లేదు, ఇది మీకు దేవుడు చెప్పిన ప్రదేశమా లేక మీరు స్వంతంగా నిర్ణయించిన ప్రదేశమా? అని ప్రశ్నించాడు. ప్రవక్త జవాబిస్తూ ఇది తన వ్యక్తిగత నిర్ణయమని అన్నారు. హుబాబ్ వెంటనే మరో పెద్ద బావి వద్దకు వెళ్ళి అక్కడ శిబిరాలు వేయడం మంచిదని, అది శత్రుసైన్యాలు వచ్చే దారికి దగ్గరగా ఉందని, అక్కడ సైనికశిబిరాలు వేయడం ద్వారా ఈ ప్రాంతంలోని ఇతర బావులకు శత్రుసైన్యాలు చేరుకునే మార్గాలు మూసివేయవచ్చని, ఆ విధంగా శత్రువులకు నీటిసరఫరా ఉండదని అన్నాడు. ఆ యుద్ధంలో ఖురైష్ సైన్యాలు అలాగే నీటికి కటకటలాడాయి. ప్రవక్త ముహమ్మద్ ఆ యువకుడు చెప్పిన మాటలను శ్రద్ధగా విన్నారు. వినడమే కాదు ఆ వ్యూహాన్ని వెంటనే ఒప్పుకున్నారు. హుబ్బాబ్ ఆలోచన ప్రకారమే సైనిక శిబిరాలు ఏర్పాటు చేశారు.

ఈ ఉదాహరణ వల్ల మనకు ఒక స్పష్టమైన విషయం అర్థమవుతోంది. ప్రవక్త అనుచరులు ప్రవక్తపై అవతరించే దైవాదేశాలకు, ప్రవక్త వ్యక్తిగత అభిప్రాయాలకు మధ్య స్పష్టమైన విచక్షణ చూపించేవారు. దైవాదేశాలను వారు తూ.చ.తప్పకుండా పాటించేవారు. ప్రవక్త వ్యక్తిగత అభిప్రాయాల విషయంలో వారు తమ సూచనలు సలహాలిచ్చేవారు. వ్యూహాల

రూపకల్పనలో తమ వంతు భాగస్వామ్యాన్ని అందించేవారు. ప్రవక్త అధికారంతో వారి ఆలోచనలను అణిచివేయడం ఉండేది కాదు. ప్రవక్త అభిప్రాయాలపై వారు చర్చించకుండా ఉండడమూ జరిగేది కాదు. సలహా సంప్రదింపుల్లో అనుచరులకు ఆయన పూర్తి స్వేచ్ఛ ఇచ్చేవారు. ఆయన వారికి ఇచ్చిన శిక్షణ వల్ల నిర్మాణాత్మక సూచనలు చేయగలిగిన మేధోస్థాయి వారిలో పెంపొందింది.

స్వతంత్రంగా వ్యవహరించే ఆత్మవిశ్వాసాన్ని, స్థాయిని ప్రవక్త వారందరికీ, స్త్రీలకు, పురుషులకు కలుగజేశారు. ఆయన అభిప్రాయాలను ప్రశ్నించగలిగేవారు. అలా ప్రశ్నించడం ఆయన హోదా గౌరవాలకు భంగమని ప్రవక్త భావించేవారు కాదు, అనుచరులు అలా అనుకునేవారు కాదు. అలాంటి వాతావరణాన్ని ప్రవక్త ఏర్పరిచారు. ఈ విధంగా వారి మేధోశక్తిని ప్రవక్త గౌరవించేవారు. అనుచరులు హృదయపూర్వకంగా ఆయన్ను ప్రేమించేవారు. ఆయన పట్ల పూర్తి విధేయత చూపేవారు. ఆయన వారి శక్తిసామర్థ్యాలను గౌరవిస్తూ ఎల్లప్పుడు వారికి అందుబాటులో ఉండే నాయకుడు.

# బద్ర్ యుద్ధం

ఖురైష్ నాయకుడు అబూ సుఫియాన్ వర్తక బృందం దారి మార్చి తప్పించుకున్నాడని, ఇక పూర్తి స్థాయి యుద్ధం తప్పదని తెలిసిన తర్వాత ప్రవక్త ముహమ్మద్ ఎలాగైనా యుద్ధాన్ని నివారించాలనుకున్నారు. ఆయన ఉమర్ (దైవప్రసన్నత ఆయనకు లభించుగాక)ను ఖురైష్ నాయకుల వద్దకు దూతగా పంపి వారిని వెనక్కి వెళ్ళేలా నచ్చచెప్పమన్నారు. ఖురైషుల్లో కూడా కొందరు ఈ యుద్ధాన్ని నివారించాలనుకున్నారు. కాని ఈ ప్రయత్నాలేనవి ఫలించలేదు. యుద్ధం కోసం కాలుదువ్వుతున్న కొందరు ఖురైష్ నాయకులు వినలేదు. వారికి బాగా తెలుసు, తమ సైనికబలం చాలా పెద్దది, ముస్లిములను అణిచివేయడానికి ఇంతకన్నా మంచి అదును లేదనుకున్నారు. ఉమర్ శాంతి కోసం చేసిన ప్రయత్నాలు చూసి అది ముస్లిముల బలహీనత అనుకున్నారు. ముస్లిములను దెబ్బతీసి, ప్రవక్త ముహమ్మద్ సృష్టించిన ఈ సమస్యను నిర్మూలించడానికి ఇంతకన్నా మంచి సమయం లేదనుకున్నారు.

ప్రవక్త శత్రు సైన్యం కదలికల గురించి పూర్తి సమాచారం సేకరిస్తూనే ఉన్నారు. మదీనాకు బయటనే శత్రువులను ఎదుర్కోవాలని భావించారు. బద్ర్ గ్రామం వద్దనే వారిని నిలవరించాలని నిర్ణయించారు. బద్ర్ మదీనాకు 319 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఆయనతో పాటు 313మంది అనుచరులు ఉన్నారు. ఈ చిన్న బలగం మదీనానుంచి బయలుదేరింది. సైనికపతాకాన్ని అలీ చేబట్టారు. ఆ మర్నాడు ఉదయం అంటే క్రీ.శ.624,

మార్చి 13వ తేదీన, అంటే హిజ్రా శకం రెండవ సంవత్సరం రమజాన్ 17వ తేదీన ప్రవక్త యుద్ధవ్యూహాన్ని రచించారు. తన చిన్న బలగాన్ని ఐదు విభాగాలు చేశారు. ఒక్కో విభాగానికి కమాండర్లను నియమించారు. యుద్ధమైదానం కుడి, ఎడమ, మధ్యలలో సైనిక కదలికలను నిర్దేశించారు. తన వారి భద్రతకు అవసరమైన జాగ్రత్తలన్నీ తీసుకున్నారు. ఒక చిన్న గుట్టపైన చిన్న గుడిసెలాంటిది వేశారు. అక్కడి నుంచి ప్రవక్త యుద్ధరంగం పరిస్థితులన్నీ గమనించే వీలుండేది. యుద్ధరంగాన్ని పరిశీలించి అవసరమైన ఆదేశాలు అందించడం తేలికయ్యింది. ఆయన ముస్లిమ్ సైన్యం సర్వసైన్యాధ్యక్షుడిగా తన విధులు నిర్వర్తించడం ప్రారంభించారు. నిఘాబృందాలను నియమించారు.

నిఘాబృందాలు ఇద్దరు వ్యక్తులను నిర్బంధించి ప్రవక్త వద్దాకు తీసుకువచ్చాయి. వారిద్దరు అక్కడి బావి నుంచి నీరు తీసుకోవడానికి వచ్చిన శత్రువర్గం మనుష్యులు. ప్రవక్త ఆ సమయంలో ప్రార్థనలో ఉన్నారు. ముస్లిమ్ సైనికులు ఆ ఇద్దరినీ ప్రశ్నించారు. వారిద్దరు తాము మక్కా సైన్యంలో ఉన్నామని చెప్పారు. కాదు మీ ఇద్దరు అబూసూఫియాన్ వర్తక బృందంలోని మనుష్యులని ముస్లిమ్ సైనికులు వారిపై ఒత్తిడి తెచ్చారు. వారు ఒత్తిడికి తలొగ్గి అలాగే చెప్పారు. మళ్ళీ ప్రశ్నించినప్పుడు మాత్రం తాము మక్కా సైన్యంలో ఉన్నామని చెప్పారు.

ప్రవక్త తన ప్రార్థనలు ముగించుకుని వచ్చిన తర్వాత తన సైనికులతో "వాళ్ళు నిజం చెప్పినప్పుడు మీరు వారిని కొట్టారు. వారు అబద్ధం చెప్పినప్పుడు వదిలేశారు" అని వ్యాఖ్యానించారు. ఆ పిదప వారిద్దరిని ప్రవక్త స్వయంగా ప్రశ్నించారు. తాము మక్కా సైన్యంలో ఉన్నామని వారన్నారు. సైన్యంలో ఎంతమంది ఉన్నారని ప్రవక్త ప్రశ్నించారు. తమకు తెలియదని వాళ్ళు జవాబిచ్చారు. నిజంగానే వారికి తెలిసే అవకాశం లేదు. మీ సైన్యం భోజనాలకు రోజు ఎన్ని ఒంటెలు కోస్తున్నారని ప్రవక్త ప్రశ్నించారు. ఒకరోజు తొమ్మిది, ఒక్కోరోజు పది ఒంటెలని వారన్నారు. ఒక ఒంటెను కోస్తే కనీసం వందమందికి ఆహారం సరిపోతుంది. దాన్ని బట్టి ప్రవక్త వారి సైన్యం తొమ్మిది వందల నుంచి వెయ్యి వరకు ఉండవచ్చని అంచనా వేశారు. నిజానికి మక్కా సైన్యంలో 950 మంది అప్పుడు ఉన్నారు. సైన్యంలో వివిధ విభాగాలు, కుడి, ఎడమ, మధ్య విభాగాలకు కమాండింగ్ ఎవరు చేస్తున్నారని ప్రశ్నించారు. ఆయా సైన్యాధ్యక్షుల పేర్లు విన్నారు. వారంతా ప్రవక్తకు బాగా తెలిసిన వారే.

మక్కా సైన్యాన్ని అబూజహల్ నడుపుతున్నాడు. మొత్తం సైన్యం 950 మంది. ముస్లిమ్ సైన్యం 313. ముస్లిమ్ సైన్యంలో అశ్వికదళం లేదు, కేవలం రెండు గుర్రాలు మాత్రమే ఉన్నాయి. అటు ఖురైష్ సైన్యంలో అశ్వికదళం వంద గుర్రాలతో బలంగా ఉంది. ముస్లిముల

వద్ద కవచాలు కూడా లేవు. మహా అయితే ఒక డజను మందికి ఉన్నాయి. ఖురైష్ సైన్యంలో దాదాపు రెండువందలమంది కవచధారులున్నారు. ఎలా చూసినా, అన్ని విభాగాల్లో శత్రువు చాలా బలంగా ఉన్నాడు. యుద్ధం తప్పేలా లేదు.

ఆ రాత్రంతా ప్రవక్త ప్రార్థనల్లో గడిపారు. దేవునితో మొరపెట్టుకున్నారు. అత్యంత వేదనాభరితమైన ప్రార్థనలవి

"ఈ రోజు ఈ చిన్న విశ్వాసుల సమూహం ఓటమి పాలైతే, ఇక తీర్పుదినం వరకు ప్రభూ, నిన్ను ఆరాధించేవార్వెరు ఉండరు."...అంటూ ఆయన ప్రార్థనలు కొనసాగాయి.

అరబ్బు సంప్రదాయాల ప్రకారం మూడు ద్వంద్వయుద్ధాల తర్వాత యుద్ధం ప్రారంభమైంది. ముస్లిముల తరఫున ద్వంద్వయుద్ధాల్లో హంజా, అలీ, ఉబైదా పాల్గొన్నారు. హంజా, అలీ, శత్రువును మట్టి కరిపించారు. కాని ఉబైదా తీవ్రంగా గాయపడ్డారు. ఆ తర్వాత ప్రారంభమైన యుద్ధం అత్యంత భయంకరంగా కొనసాగింది. కాసేపటికే ఖురైషుల్లో ఉన్న బలహీనత బయల్పడింది. మూడింతలు సైన్యం ఉన్నప్పటికీ వెనుకంజ వేయడం ప్రారంభమైంది. ముస్లిమ్ సైన్యానికిది చావుబతుకుల సమస్య. అందువల్ల ప్రాణాలొడ్డి పోరాడుతున్నారు.

ప్రవక్త సాంప్రదాయిక యుద్ధవ్యూహాలకు భిన్నంగా వ్యవహరించారు. సైనికపంక్తులను నిలబెట్టడంలో కొత్త విధానాలను ప్రవేశపెట్టారు. వివిధ విభాగాలకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. ఎడారి యుద్ధాల్లో అప్పటి వరకు లేని యుద్ధతంత్రాలివి. అంతకు ముందు ఎడారియుద్ధాల్లో ప్రత్యేక క్రమశిక్షణ కనిపించేది కాదు. ప్రవక్త నిలబెట్టిన సైనికపంక్తుల్లో క్రమశిక్షణ ఒక ఉక్కుగోడలా నిలబడింది. సైనికపంక్తులను వెనక్కి నెట్టడం శత్రువుకు సాధ్యం కాలేదు. ఖచ్చితమైన యుద్ధవ్యూహం లేనిదే ఈ పంక్తులను చెల్లచెదరు చేయడం సాధ్యం కాదు. నలుగురేసి సభ్యులున్న చిన్న చిన్న దళాలు ఒకే యూనిట్‌గా పోరాడేలా ప్రవక్త యుద్ధవ్యూహం రచించారు. ఈ నలుగురు ఒకరికి ఒకరు సహాయంగా నిలబడుతూ పోరాడ్డం వల్ల శత్రువు అయోమయానికి గురయ్యాడు. ఒకే డాలుతో నలుగురు శత్రువు దెబ్బలను కాచుకుంటూ, కరవాలాలు, ఈటెలు, బాణాలతో దాడులు చేయడం కొనసాగించారు. ఒక నిపుణుడైన సైన్యాధ్యక్షుడిగా ఆయన తన చిన్న సైన్యాన్ని ముందుకు నడిపారు.

ఆ తర్వాత వచ్చిన దివ్యఖుర్‌ఆన్ అవతరణ యుద్ధంలో దేవుని సహాయం నిరంతరం లభించిందని స్పష్టం చేసింది. దైవదూతలు సహాయమందించారని, దేవుడు తన వాగ్దానం

నెరవేర్చుకున్నాడని ఈ దివ్యఖుర్ఆన్ వాక్యం తెలియజేసింది.

> "బద్ర్ సంగ్రామంలో అల్లాహ్ మీకు సహాయం చేశాడు కదా! యథార్థానికి అప్పుడు మీరు చాలా బలహీనంగా ఉన్నారు. కనుక అల్లాహ్ పట్ల కృతఘ్నతకు దూరంగా ఉండండి, తద్వారా ఇప్పుడైనా మీరు కృతజ్ఞులైతారని ఆశ"
> (దివ్యఖుర్ఆన్ 3 : 123)

అత్యంత బలమైన ఖురైష్ సైన్యం ఈ యుద్ధంలో తీవ్రపరాభవం పాలయ్యింది. ఇది ఒక గొప్ప మలుపు. ఖురైషుల ప్రతిష్ఠ, వారి ప్రాబల్యం అన్ని దెబ్బతిన్నాయి. అరబ్బు ద్వీపకల్పమంతటా ఖురైషుల ఓటమి వార్త దావానలంలా వ్యాపించింది.

ముస్లిమ్ సైన్యంలో 14 మంది మరణించారు. మక్కా సైన్యంలో 70 మంది కన్నా ఎక్కువ మరణించారు. ఇస్లామ్‌ను తీవ్రంగా ద్వేషించిన మక్కా సైన్యాధ్యక్షుడు అబూజహల్ హతమయ్యాడు. అబూజహల్ ఈ యుద్ధం జరగాలంటే జరగాలని పట్టుబట్టిన వ్యక్తి.

ఖురైషుల్లో 70 మంది యుద్ధఖైదీలుగా పట్టుబడ్డారు. ఇలా పట్టుబడిన వారిలో ప్రవక్త పినతండ్రి అబ్బాస్ కూడా ఉన్నారు.

## మక్కా

## ప్రతీకార నినాదాలు

ఖురైష్ సైన్యం అత్యంత పరాభవ భారంతో మక్కాలోకి ప్రవేశించింది. ప్రతి తెగలోను ప్రాణనష్టం సంభవించింది. కొందరు ప్రతీకారం తీర్చుకోవాలని నినాదాలు చేయసాగారు. ఇలాంటి వారిలో హింద్ ముఖ్యమైనది. ఆమె తండ్రి, సోదరుడు, పినతండ్రి యుద్ధంలో చనిపోయారు. ఆమె తండ్రి, పినతండ్రి ఇద్దరు హజ్రత్ హంజా చేతుల్లో నిహతులయ్యారు. హంజా రక్తం తాగుతానని ఆమె ప్రతిజ్ఞ చేసింది. ఖురైషుల్లో ప్రతీకారజ్వాలలు భగ్గుమన్నాయి. వెంటనే వారు కార్యరంగంలోకి దిగారు. వివిధ తెగలతో సంప్రదింపులు, ఒప్పందాలు మొదలయ్యాయి. చుట్టు ఉన్న పట్టణాలు, ప్రాంతాల్లో వివిధ తెగలతో మైత్రి ఒప్పందాలు చేసుకోసాగారు. ముస్లిములపై మళ్ళీ దాడి చేయడానికి ప్రతీకారం తీర్చుకోడానికి ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. అరబ్బు ద్వీపకల్పంలో ముస్లిముల ఉనికిని తుడిచేయాలని నిర్ణయించారు.

ఇస్లామ్‌ను తీవ్రంగా ద్వేషించే మరో వ్యక్తి అబూలహబ్. అనారోగ్యం వల్ల బద్ర్ యుద్ధంలో పాల్గొనలేదు. అతను అబూసూఫియాన్ వద్దకు వచ్చి ఏం జరిగిందో, యుద్ధంలో ఎలా ఓటమి ఎదురైందో వివరించమని అడిగాడు. అబూసూఫియాన్ జవాబిస్తూ "చెప్పడానికేముంది, మేం శత్రువును ఎదుర్కొన్నాం, వెన్నుచూపి వెనుదిరిగాం, వారు యుద్ధంలో మమ్మల్ని తరిమికొట్టారు, కొందరిని బంధించారు. మనవాళ్ళలో ఎవ్వరినీ నేను తప్పు పట్టలేను. ఎందుకంటే, యుద్ధంలో కేవలం శత్రువులనే కాదు, తెల్లని దుస్తుల్లో, రంగురంగుల గుర్రాలపై భూమ్యాకాశాలకు మధ్య దూసుకొచ్చిన దళాలను ఎదిరించి ఎవరూ నిలబడలేరు." అన్నాడు.

అబూసూఫియాన్ ఈ విషయాలు చెబుతున్నప్పుడు అక్కడే కూర్చుని వింటున్న బానిస అబూ రాఫి, అతను కూడా ముస్లిమ్‌గా మారాడు, కాని ఈ విషయాన్ని రహస్యంగా ఉంచాడు, ఈ మాట వినగానే ప్రవక్త విజయం పట్ల తన సంతోషాన్ని ఆపుకోలేకపోయాడు. అతను "తెల్లని దుస్తుల్లో, రంగురంగుల గుర్రాలపై భూమ్యాకాశాలకు మధ్య దూసుకొచ్చిన దళాలు" అన్న మాటలు వినగానే అతను ఆనందాశ్చర్యాలతో "వారు దైవదూతలు" అని అరిచాడు. అబూలహబ్ కోపం పట్టలేక అబూరాఫీపై లంఘించి పిడికిలితో ముఖంపై కొట్టాడు.

అబూలహబ్ మరదలు, అబ్బాస్ భార్య కూడా రహస్యంగా ఇస్లామ్ స్వీకరించి ఉన్నారు. ఈ సంఘటన జరిగినప్పుడు ఆమె కూడా అక్కడే ఉన్నారు. అబూరాఫిని తన బావ కొట్టడం చూసి ఆమె ఆగ్రహంతో ఒక్కుదుటున అక్కడికి వెళ్ళి అక్కడే ఉన్న శిబిరాలు వేసే గుంజతో అబూలహబ్‌పై దాడి చేశారు. ఆమె కొట్టిన దెబ్బ అబూలహబ్ తలపై బలంగా తగిలింది. తర్వాత ఆ దెబ్బ గాయంగా మారి, ఇన్‌ఫెక్షన్ శరీరమంతా పాకింది. కొన్ని వారాల్లోనే అతను ఆ గాయంతో మరణించాడు. అబూలహబ్, అతడి భార్య ఇద్దరు ఇస్లామ్ పట్ల విద్వేషానికి మారుపేరుగా ఉండేవారు. నిజానికి దివ్యఖుర్ఆన్ వారిద్దరిని నరకవాసులుగా ప్రకటించింది. (దివ్యఖుర్ఆన్ 3, దివ్యఖుర్ఆన్ పేరు పెట్టి అభిశంసించిన ఒకే ఒక వ్యక్తి అబూలహబ్). ఖురైషుల్లో చాలా మంది వ్యతిరేకులు కొంత మెతకదనాన్ని చూపించేవారు, తర్వాత కొందరు మార్పు చెందారు, కాని అబూలహబ్, అతడి భార్య మాత్రం ఎన్నడూ ప్రవక్త ముహమ్మద్ సందేశం పట్ల ఎన్నడూ సానుభూతి చూపలేదు. అబూలహబ్ మరణం ఒక హింసాత్మక సంఘటన కారణంగా జరిగింది. దివ్యఖుర్ఆన్ వాక్యాలు మరోసారి నిజమయ్యాయి. వారిద్దరు చివరకు అభిశంసనకు గురైన వారిలో మిగిలారు.

# మదీనాలో ఆనంద విషాదాలు

మదీనా శివారుల్లోని అర్రవా ప్రాంతంలో ముస్లిమ్ సైన్యాన్ని మదీనా ప్రజలు స్వాగతించారు. ప్రవక్తను అభినందించడానికి, తమ ఆనందం ప్రకటించడానికి వారక్కడికి వచ్చారు. దేవుడు ఆయనకు ప్రసాదించిన గొప్ప విజయానికి శుభాభినందనలు తెలియజేశారు.

కాని అప్పుడే ఆయనకు ప్రియకుమార్తె రుఖయ్యా మరణవార్త కూడా చేరింది. ఇస్లామ్‌ను ప్రారంభకాలంలో స్వీకరించి ఆయన్ను వెన్నంటి ఉన్న అనుచరులను అప్పుడే ఆయన బద్ర్ యుద్ధంలో కొందరిని పోగొట్టుకుని వస్తున్నారు. ఇక్కడ ప్రియకుమార్తె విడిచి వెళ్ళిపోయిందన్న వార్త అందింది. అది కూడా యుద్ధంలో విజయం సాధించి వస్తున్న సందర్భంలో ఈ వార్త అందింది. ఒకవైపు ఆనందం, మరోవైపు విషాదం ఆయన్ను అలుముకున్నాయి. మానవజీవితం ఎంత సున్నితమైనదో మరోసారి స్పష్టమైంది. ఎలాంటి కష్టపరిస్థితి ఉన్నా దేవుని పట్ల విశ్వాసం దృఢంగా ఉండాలన్నది మరోసారి తెలిసివచ్చింది.

బద్ర్ యుద్ధఖైదీలను బాగా చూసుకోవాలని ప్రవక్త తనవారిని ఆదేశించారు. ముస్లిములు తమ రొట్టెలను వారికి ఇచ్చి తాము కేవలం ఖర్జూరాలు తిని కడుపునింపుకునే వారు. అప్పట్లో రొట్టెలు చాలా విలువైనవి.

ఖైదీల బంధువులు చర్చలకు రావడం మొదలైంది. కొందరు పరిహారం చెల్లించి తమవారిని విడిపించుకుని వెళ్ళారు. కొందరిని ఎలాంటి పరిహారం లేకుండానే విడిచిపెట్టారు. పేదవారి విషయంలో వ్యక్తిగతంగా వారి పరిస్థితిని చూసి నిర్ణయాలు తీసుకున్నారు. అందులో చదువుకున్నవారు ఉంటే అలాంటి వారు మదీనాలో పదిమందికి చదవడం రాయడం నేర్పి విడుదల పొందవచ్చని చెప్పారు. ఈ విధంగా మరోసారి ప్రవక్త ముహమ్మద్ విద్యాభ్యాసం ఎంత ముఖ్యమో తనవారికి చాటి చెప్పారు. శాంతి సమయంలో అయినా, యుద్ధసమయంలో అయినా చదువు మనిషికి కావలసిన నైపుణ్యాలను అందిస్తుంది. వారికి గౌరవోన్నతులు ప్రసాదిస్తుంది. ఆ విధంగా కొందరు యుద్ధఖైదీలు తమ వద్ద ఉన్న జ్ఞానసంపద పంచి ఇచ్చి స్వేచ్ఛ పొందారు.

# న్యాయం నిండిన హృదయం

ప్రవక్త ముహమ్మద్ అనుచరుల్లో ఒకరు అబూ లుబాబా. ప్రవక్త ఆయన్ను చాలా అభిమానించేవారు. బద్ర్ యుద్ధానికి వెళుతున్నప్పుడు మదీనా వ్యవహారాలను లుబాబాకు అప్పగించి వెళ్ళారు. కొన్ని రోజుల తర్వాత ఒక ఒక అనాధ కుర్రాడు ప్రవక్త వద్దకు వచ్చి అబూలుబాబా తనకు చెందిన ఒక ఖర్జూర వృక్షాన్ని ఆక్రమించుకున్నారని ఫిర్యాదు చేశాడు. ప్రవక్త వెంటనే అబూలుబాబాను పిలిచి వివరణ అడిగారు. విచారణలో ఆ ఖర్జూరవృక్షం అబూలుబాబాదేనని తేలింది. ప్రవక్త ముహమ్మద్ అబూలుబాబాకు అనుకూలంగా తీర్పు ఇచ్చారు. దీనివల్ల ఆ అనాథ చాలా నిరాశ చెందాడు. అతనికి చెందిన ఒక సంపద కోల్పోయాడు.

ఈ తీర్పు ఇచ్చిన తర్వాత అబూలుబాబాను ప్రవక్త వ్యక్తిగతంగా పిలిచి తీర్పు అయిపోయింది, ఇప్పుడు మీరు ఆ ఖర్జూర వృక్షాన్ని ఆ అనాధ కుర్రాడికి ఇచ్చేయండి అని చెప్పారు. ఆ ఖర్జూరం చెట్టు ఆ అనాథ కుర్రాడికి ఆధారం. కాని అబూలుబాబా మొండిగా తిరస్కరించారు. ఆ ఖర్జూరవృక్షాన్ని వదులుకునేది లేదని, అది తనదేనన్నారు.

ఈ సందర్భంగా గుర్తుంచుకోవలసిన విషయమేమంటే, దివ్యఖుర్ఆన్ వ్యక్తిగత స్థాయిలోను, సాముదాయిక స్థాయిలోను ఆధ్యాత్మిక నడవడిని బోధిస్తుంది. ఒక్కోసారి న్యాయం పరిధిని మించి సముచితమైన వైఖరిని చూపాలి. క్షమాహృదయంలో ప్రజలకు వారి హక్కుకు మించి కూడా ఇవ్వాలి.

> "న్యాయం చేయండి అనీ, ఉపకారం చెయ్యండి అనీ, బంధువుల హక్కులు నెరవేర్చండి అనీ అల్లాహ్ ఆజ్ఞపిస్తున్నాడు." (దివ్యఖుర్ఆన్ 16 : 90)

ఇది ఒకరి హక్కును వదులుకోవడం కాదు. అబూలుబాబా తన హక్కును డిమాండ్ చేయడం సరయిన విషయమే, కాని కొన్ని సందర్భాల్లో హక్కును క్షమాహృదయంలో, మానవీయ దృక్కోణంతో వదులకుని ఇతరులకు ఆదుకోవడం కూడా అవసరం. అబూలుబాబా వైఖరి చూసి ప్రవక్త చాలా బాధపడ్డారు. ఆయను అబూలుబాబా అంటే చాలా అభిమానం. నిజానికి లుబాబా కూడా ఆ సంపద మీద వ్యామోహంతో నిరాకరించడం లేదు. ఇస్లామ్

బోధించే న్యాయానికి కట్టుబడాలన్న సూత్రానికి ఆయన తూ.చ.తప్పకుండా కట్టుబడాలనుకుంటున్నారు. దాదాపు గుడ్డిగా దాన్ని పాటిస్తున్నారు. అందువల్ల న్యాయ పరిధిని దాటి ముందుకు పోవడం లేదు. కరుణ, దయాస్వభావాల ప్రతిస్పందనలను కూడా ఈ న్యాయసూత్రం అడ్డుకుంటోంది.

అయితే మరో అనుచరుడు తబీత్ ఈ మొత్తం వ్యవహారాన్ని గమనిస్తూన్నారు. ఆయన ముందుకు వచ్చి తన ఖర్జూర తోట మొత్తం ఆ ఒక్క ఖర్జూర చెట్టుకు బదులుగా ఇస్తానని ప్రతిపాదించారు. ఆ ఖర్జూర వృక్షాన్ని అలా తీసుకుని ఆ అనాధకు ఇచ్చేశారు. ఇది చూసి ప్రవక్త చాలా సంతోషించారు. అయితే ఆయన అబూలుబాబా వైఖరిని కూడా తప్పుపట్టలేదు. ఆయన పట్ల నిరాశ కూడా చెందలేదు. లుబాబా న్యాయసూత్రాలకు ఎంత కఠినంగా కట్టుబడతారో ఈ సంఘటన చాటి చెప్పింది. ప్రవక్త ఆ విషయాన్ని తన దృష్టిలో ఉంచుకున్నారు.

ఆ తర్వాత ప్రవక్త ఆయనకు ఇతర బాధ్యతలు చాలా అప్పగించారు. యూద తెగ బనూ ఖురైజాకు లొంగుబాటు షరతులు తెలియజేయడం తదితర బాధ్యతలు ఆయనే నిర్వర్తించారు. బనూ ఖురైజాను ముట్టడించినప్పుడు వారితో చర్చించడానికి బనూఖురైజానే పంపించారు ప్రవక్త. అయితే ఆయన అనుకోకుండా ముస్లిములకు సంబంధించిన ఒక రహస్యాన్ని వారికి చెప్పేశారు. తన ఈ ప్రవర్తన పట్ల ఆయన చాలా సిగ్గుపడ్డారు. అంతే కాదు దానికి శిక్షగా తన్నుతాను మస్జిదు గుంజకు కట్టేసుకున్నారు. తన పొరబాటును దేవుడు దైవప్రవక్త క్షమించాలని ప్రార్థిస్తూ అలాగే ఆరు రోజులపాటు ఉన్నారు.

ఒకరోజు ప్రవక్త ఉమ్మె సల్మా ఇంట ఉన్నప్పుడు ఆయన హఠాత్తుగా నవ్వుతూ లేచి నిలబడ్డారు. ఉమ్మె సల్మా అది చూసి "దేవుడు మీ చిరునవ్వు ఎల్లప్పుడు ఇలాగే ఉంచాలి, ఎందుకు అంత ఆనందంగా ఉన్నారని" ప్రశ్నించారు. ప్రవక్త జవాబిస్తూ "అబూలుబాబా క్షమాయాచన స్వీకరించబడింది. కావాలంటే నువ్వే ఈ వార్త చెప్పవచ్చు" అన్నారు. ఆ వెంటనే ఉమ్మెసల్మా తన గుమ్మం దగ్గర నిలబడి బిగ్గరగా "అబూ లుబాబా! శుభాకాంక్షలు, మీ పశ్చాత్తాపం స్వీకరించబడింది" అన్నారు. ఆమె గొంతు విని మొత్తం మదీనా నగరం మస్జిదుకు తరలి వచ్చింది.

ఆ తర్వాత ప్రవక్త స్వయంగా ఆయన కట్లు విప్పారు.

ఈ సంఘటన ద్వారా తెలిసేదేమంటే, అధ్యాత్మిక శిక్షణ అనేది ఎన్నడూ సంపూర్ణంగా సాధించలేము. ఎల్లప్పుడు నేర్చుకుంటూ ఉండాలి. ప్రవక్త తన అనుచరుల వెంట ఎల్లప్పుడు ఉండేవారు. వారి పట్ల దయతో కరుణతో వ్యవహరించేవారు.

II

# మృదువైఖరి, ప్రేమాభిమానాలు

ప్రవక్త రోజువారి పనులు ఎన్ని ఉన్నప్పటికీ ఆయన జీవితానికి సంబంధించిన చిన్న చిన్న విషయాల పట్ల కూడా చాలా జాగ్రత్తలు తీసుకునేవారు. తన చుట్టు ఉన్నవారి ఏమాశిస్తున్నారన్నది ఎల్లప్పుడు దృష్టిలో ఉంచుకునేవారు. ఆయన రాత్రులు చాలా సేపటి వరకు ప్రార్థనల్లో గడపడాన్ని ఆయన భార్యలు, అనుచరులు రోజూ చూసేవారు. ఆయన ఒంటరిగా ప్రార్థనల్లో గంటలతరబడి నిమగ్నమయ్యేవారు. ప్రవక్త ముహమ్మద్ భార్య అయిషా (దైవం ఆమెతో ప్రసన్నుడవుగాక) ఒకసారి ఆయనతో "దేవుడు మీ గత భవిష్యత్ పాపాలన్నీ మన్నించాడు కదా, అయినా మీరు ఇంతగా ప్రార్థనల్లో గడపాలా?" అని ప్రశ్నించారు. ప్రవక్త జవాబిస్తూ "నేను ఒక కృతజ్ఞుడయిన సేవకుడిగా కాక మరోలా ఎలా ఉండగలను" అన్నారు.

ప్రవక్త తన మాదిరిగా అందరూ కఠినమైన ప్రార్థనల్లో గడపాలని ఎన్నడూ చెప్పలేదు. తనలా ధ్యానంలో గంటలతరబడి గడపాలని కూడా చెప్పలేదు. పైగా ఆయన అనుచరులతో మధ్యస్థంగా ఉండాలని మరీ కఠినంగా ఆరాధనల్లో గడపరాదని చెప్పేవారు. కొందరు అనుచరులు ధర్మపరాయణ జీవితం కోసం లైంగిక సంబంధాలు లేకుండా జీవించాలని అనుకున్నారు. రాత్రంతా ప్రార్థనల్లో గడుపుతూ, దినమంతా ఉపవాసాలు చేస్తూ గడపడం మొదలెట్టారు. ఉదాహరణకు మాజూన్ కుమారుడు ఉస్మాన్, అమ్ర్ కుమారుడు అబ్దుల్లా వంటి వారు. అప్పుడు ప్రవక్త వారితో :

> "అలా చేయకండి. కొన్ని రోజులు ఉపవాసం ఉండండి. మరి కొన్ని రోజులు మామూలుగానే తింటూ ఉండండి. రాత్రి కొంతభాగం నిద్రించండి. కొంతసేపు ప్రార్థనల్లో గడపండి. మీ శరీరానికి కూడా కొన్ని హక్కులున్నాయి. మీ కళ్ళకు

కూడా హక్కులున్నాయి. మీ భార్యకు మీపై హక్కు ఉంది. మీ అతిథులకు మీపై హక్కు ఉంది.'' అన్నారు. ఒకసారి ఆయన ''అతికి పాల్పడే వారు అభిశంసించబడతారు" అని మూడుసార్లు నొక్కి చెప్పారు. మరో సందర్భంలో ఆయన "మధ్యస్థంగా ఉండండి, మధ్యస్థంగా ఉండండి. మధ్యస్థవైఖరి మాత్రమే సాఫల్యాన్నిస్తుంది" అన్నారు.

ముస్లిములు తమ వైఫల్యాలు, బలహీనతల విషయంలో భయపడుతూ, బాధపడుతూ ఉంటే ఆయన వారికి ధైర్యమిస్తూ వారిని ప్రోత్సహించేవారు. ఒకరోజు ప్రవక్త అనుచరుడు హంజలా వెళ్ళి అబూబక్ర్‌ను కలిశారు. తాను ద్వంద్వవైఖరి కలిగి ఉన్నానని, తాను విరుద్ధభావాల మధ్య నలుగుతున్నానని, ప్రవక్త సమక్షంలో ఉన్నప్పుడు తనకు స్వర్గనరకాలు రెండు కనిపిస్తున్నాయి, కాని తాను తన తన రోజువారి కార్యకలాపాల్లో నిమగ్నమైనప్పుడు, భార్యపిల్లలతో ఉన్నప్పుడు వాటిని మరిచిపోతున్నానని చెప్పారు. అబూబక్ర్ సమాధానమిస్తూ తాను కూడా అలాంటి భావాలే అనుభవించానని అన్నారు. వారిద్దరు కలిసి ప్రవక్త వద్దకు వెళ్ళి తమ ఆధ్యాత్మిక ప్రమాణాల్లోని లోపం గురించి అడిగారు. వారు చెప్పింది విని ప్రవక్త ఇలా అన్నారు :

> "నా ఆత్మను తన చేతుల్లో ఉంచుకున్న వాని తోడు, మీరు నా సమక్షంలో ఉన్నప్పుడు పొందే ఆధ్యాత్మికస్థితిని శాశ్వతంగా సాధించగలిగితే దైవదూతలు మీ పడకల వద్దకు వచ్చి, మీ దారిలో నిలబడి మీకు కరచలనం చేసేవారు. కాని అలా జరగదు. హంజలా, దీనికి(ధ్యానం, ఆరాధన)కు సమయం ఉంది, దానికి (విశ్రాంతి, వినోదాలు) సమయం ఉంది." అన్నారు.

వారి పరిస్థితి నిజానికి ద్వంద్వవైఖరి కాదు, ఇది కాపట్యం కాదు. ఇది మానవసహజమైన వైఖరి. గుర్తుచేసుకోవడం, మరిచిపోవడం. మరిచిపోవడం జరుగుతుంది కాబట్టే గుర్తు చేసుకుంటారు. ఎందుకంటే మనుష్యులు దైవదూతలు కాదు.

ప్రవక్త ముహమ్మద్ తన వ్యాఖ్యలతో అనుచరులకు నిరంతర శిక్షణ గరుపుతూ ఉండేవారు. ''మంచి చేయడం ధర్మం, చెడుకు దూరంగా ఉండడం ధర్మం, చివరకు జీవితభాగస్వామితో లైంగికంగా కలవడం కూడా ధర్మమే" అని వ్యాఖ్యానించారు ఒకసారి. అనుచరులు ఆశ్చర్యంగా "ప్రవక్తా! మేము మా కోరికను తీర్చుకుంటే దానికి కూడా దేవుడు అనుగ్రహిస్తాడా?" అని అడిగారు. ప్రవక్త వారికి బదులిస్తూ :

> "మీలో ఎవరైనా అక్రమ సంబంధం కలిగి ఉంటే అతను పాపం చేసినట్లే కదా,

అలాగే క్రమబద్ధమైన, ధర్మబద్ధమైన పద్ధతిలో లైంగిక సంబంధ కలిగి ఉన్నప్పుడు పుణ్యమే, దానికి ప్రతిఫలం లభించాలి" అన్నారు.

ఈవిధంగా వారిలో తగిన గుణగణాలను సృజిస్తూ వారిలో ఆత్మనిగ్రహాన్ని పెంపొందించేవారు. ఆధ్యాత్మికత అంటే మనిషి తన కాంక్షలను అదుపులో ఉంచుకోవడం. మనిషి నియమబద్ధంగా సహజవాంఛలను తీర్చుకోవడం కూడా ప్రార్థనతో సమానమైనదే. అలా చేయడం తప్పు కాదు. అందులో ద్వంద్వ ప్రమాణాలు లేవు.

అనుచరులు అనవసరంగా దోషభావనకు గురికాకుండా ప్రవక్త జాగ్రత్తలు తీసుకునేవారు. ఎన్నడూ దేవునితో విన్నవించుకోడాన్ని ఆపరాదనేవారు. దేవుడు అత్యంత కరుణామయుడు, కృపాశీలుడు. ఆయన అందరినీ తన అనుగ్రహాల ఛత్రఛాయలోకి ఆహ్వానిస్తాడు. మనసులోని నిజాయితీని ఇష్టపడతాడు. తప్పులకు పశ్చాత్తాపపడి తనవైపు మరలేవారిని అనుగ్రహిస్తాడు. ఇదే తౌబాకు అర్థం. ఏదైనా పొరబాటు జరిగితే వెంటనే పశ్చాత్తాపపడి దేవునివైపు మరలాలి. దేవుడు పశ్చత్తాపపడి తనవైపు మరలేవారిని ప్రేమిస్తాడు. క్షమించి ఆదరిస్తాడు.

ప్రవక్త తన అనుచరులందరినీ ఈ దైవానుగ్రహం వైపునకు ఆహ్వానించేవారు.

"మీరు మీ సోదరుడి విషయంలో మీరు ఇష్టపడని వ్యవహారాన్ని చూస్తే, అతని తరఫున దెబ్బయి సాకులైనా వినండి. అయినా మీరు తృప్తిపడకపోతే, మీరు అర్థం చేసుకోని సాకనుకుని సర్దుబాటు చేసుకోండి" అన్నారు.

ప్రవక్త తమను గౌరవిస్తారని, అర్థం చేసుకుంటారని, ప్రేమిస్తారని అనుచరులందరూ భావించేవారు. ఆయన వారిని చాలా ప్రేమించేవారు. ఆ విషయాన్ని వారికి చాలా సార్లు చెప్పేవారు కూడా. ఆ విధంగా ప్రవక్త వారికి ప్రేమాభిమానాలతో బోధించేవారు. అత్యంత ప్రేమభావనతో చేసే ఈ బోధనలు వారిని ఆకట్టుకునేవి.

## అహ్లె సుఫ్ఫా
## అరుగు ప్రజలు

ఇస్లామ్ స్వీకరించిన కొత్తవారిలో కొందరు ఇల్లువాకిలి లేనివారు. వారు మస్జిదు దగ్గర ప్రవక్త గృహానికి దగ్గరగా ఉండేవారు. చాలా పేదవారు. తినడానికి కూడా లేనివారు. ముస్లిములు ఇచ్చే విరాళాలతో జీవించేవారు. ఇలాంటి వారి సంఖ్య పెరగసాగింది. వారిని అహ్లెసుఫ్ఫా

అని పిలిచేవారు. ఎందుకంటే ప్రవక్త ఇంటికి దగ్గరగా ఒక అరుగుపై వారు ఉండేవారు. ప్రవక్త వారి బాగోగుల గురించి శ్రద్ధ తీసుకునేవారు. వారు చెప్పేది శ్రద్ధగా వినేవారు. వారి ప్రశ్నలకు జవాబులు ఇచ్చేవారు. వారి పనులు పర్యవేక్షించేవారు. ప్రవక్త అందరి విషయంలోను వారు ఆధ్యాత్మికత, విశ్వాసం, విద్య గురించి ప్రశ్నించినప్పుడు లేదా ఏదైనా సందేహం వెలిబుచ్చినప్పుడు వెంటనే దానికి జవాబిచ్చేవారు. ఒకే ప్రశ్నకు విభిన్నమైన జవాబులు కూడా ఇచ్చేవారు. అడిగేవారిని మేధోపరమైన స్థాయిని బట్టి ఆయన జవాబు మారేది.

ప్రవక్త ముహమ్మద్ చాలా నిరాడంబరమైన జీవితం గడిపేవారు. ఆయన ఇల్లు చాలా సాదాసీదాగా ఉండేది. ఇంట చాలా సందర్భాల్లో తినడానికి కొన్ని ఖర్జూరాలు తప్ప మరేమీ ఉండేది కాదు. అయినా ఆయన తన వద్దకు వచ్చిన అవసరార్ధులను ఆదుకునేవారు. ముఖ్యంగా అహ్లె సుఫ్ఫా విషయంలో వారికి ఎల్లప్పుడు సహాయపడుతూ ఉండేవారు.

ఈ నిరాడంబర జీవనాన్ని ఆయన ఎల్లప్పుడు కొనసాగించారు. తనవాళ్ళకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండేవారు. ఆయనకు స్వంత ఆస్తి అంటూ ఏదీ లేదు. స్త్రీలు, పిల్లలు, బానిసలు, నిరుపేదలు ఆయన వద్దకు సహాయం కోరి వస్తూ ఉండేవారు. వారిలో ఒకరిగా ఆయన జీవించారు.

# ఫాతిమా

# కుమార్తె

( దేవుడు ఆమె పట్ల ప్రసన్నుడవుగాక )

ప్రవక్త ముహమ్మద్ కుమార్తె ఫాతిమా. ఆమె ప్రవక్తకు చాలా సన్నిహితంగా ఉండేవారు. అలీని వివాహమాడారు. అలీ ప్రవక్తకు బంధువు. ఆమె తన తండ్రి నివాసానికి దగ్గరగానే ఉండేవారు. నిరుపేదలను చాలా ఆదరించేవారు. ముఖ్యంగా అహ్లె సుఫ్ఫా విషయంలో చాలా సహాయపడేవారు.

ప్రవక్త ముహమ్మద్‌కు ముగ్గురు కుమారులు కలిగారు. కుమారులందరూ పసిప్రాయంలోనే మరణించారు. ఆయనకున్న నలుగురు కుమార్తెలు మొదటిభార్య ఖదీజా వల్లనే జన్మించారు. వారంతా పెరిగి పెద్దయ్యారు. ఫాతిమా అందరి కన్నా చిన్న కుమార్తె.

ఆమెను ఆయన చాలా అభిమానించేవారు. ఆయన ఏదన్నా ప్రయాణం నుంచి వెనక్కి వచ్చినప్పుడు మస్జిదుకు వెళ్ళి ప్రార్ధన చేసిన వెంటనే మొదటిగా ఆయన ఫాతిమా వద్దకు వెళ్ళి ఆమె చేతిని, నుదుటిని ముద్దాడేవారు. ఉమైర్ కుమారుడు జుమాయి ఒకసారి అయిషాతో ప్రవక్త ఎవరిని ఎక్కువగా ప్రేమిస్తారని ప్రశ్నిస్తే ఆమె "ఫాతిమా" అని జవాబిచ్చారు. ఒకసారి ప్రవక్త "ఫాతిమా నాలో భాగం. ఆమెకు కోపం కలిగించినవారు నాకు కోపం కలిగించినట్లే" అని కూడా అన్నారు.

ప్రవక్త ఇంట ఉన్నా లేక బయట ఉన్నా తన కుమార్తె ఫాతిమా అక్కడికి వస్తే ఆయన వెంటనే లేచి ఆమెకు స్వాగతం పలికేవారు. ఆమె పట్ల అత్యంత గౌరవాన్ని, ఆదరాన్ని చూపించేవారు. ఒక కుమార్తె పట్ల ఇలా అత్యంత గౌరవాదరాలు ప్రదర్శించడం చూసి మదీనా, మక్కా ప్రజలందరూ కాస్త ఆశ్చర్యపోయేవారు. ఎందుకంటే, సాంప్రదాయికంగా కుమార్తె పట్ల ఇలాంటి గౌరవాదరాలు చూపించడం వారు ఎరుగరు.

ప్రవక్త తన కుమార్తెను ముద్దాడేవారు. ఆమెతో ఆదరంగా మాట్లాడేవారు. ఆమెతో తన విషయాలు చెప్పుకునేవారు. తన పక్కన కూర్చుండబెట్టుకునేవారు. ఇలా కుమార్తె పట్ల బహిరంగంగా గౌరవాదరాలు చూపిస్తే, కుమార్తె పుట్టుకే అప్రతిష్ఠగా భావించిన ఒకనాటి సమాజంలో ఎవరేమనుకుంటారో అని కూడా ఆయన లెక్కచేసేవారు కాదు.

ఒకసారి ఆయన తన మనుమడు, ఫాతిమా కుమారుడు హసన్‌ను ముద్దుపెట్టుకున్నారు. అక్కడ బదూయిన్ అరబ్బుల బృందం ఉంది. ఇది చూసి వారు ఆశ్చర్యపోయారు. వారిలో అల్ అక్రా కాస్త ఆశ్చర్యంగా "నాకు పదిమంది పిల్లలు ఉన్నారు. నేను వారిలో ఎవరినీ ఎన్నడూ ముద్దాడలేదు" అన్నాడు. ప్రవక్త జవాబిస్తూ "ఉదారంగా (ప్రేమాభిమానాలతో) లేని వ్యక్తి పట్ల దేవుడు కూడా ఉదారంగా ఉండడు" అన్నారు. తన నడవడి ద్వారా తన వ్యాఖ్యల ద్వారా వారికి ఆయన శిక్షణ కొనసాగించేవారు. ప్రవక్త తన అనుచరులకు ఉత్తమ గుణగణాలు, నడవడి, దయ, మృదువైఖరి, పిల్లల పట్ల గౌరవాదరాలు, మహిళల పట్ల గౌరవమర్యాదలు నేర్పారు. ఒక సందర్భంలో ఆయన "నేను ఉత్తమ నడవడిని సంపూర్ణం చేయడానికి పంపబడ్డాను" అన్నారు.

ఫాతిమా తన తండ్రి నుంచి ఈ పాఠాలు గ్రహించారు. పేదలకు సేవాకార్యక్రమాల ద్వారా ఈ పాఠాలను పదిమందికి బోధించేవారు. ఒకరోజు ఫాతిమా తన భర్త అలీతో తనకున్న ఇబ్బందులు చెప్పుకున్నారు. ప్రవక్త మాదిరిగానే ఆమె ఇంట కూడా ఏమీ ఉండేది కాదు. ఆమెకు రోజువారి పనులు చేసుకోవడంలో ఇబ్బంది ఉండేది. కుటుంబాన్ని చూసుకోవాలి, పిల్లలను చూసుకోవాలి, సేవాకార్యక్రమాలు. ఆమె భర్త సలహా ఇస్తూ ఒకసారి

మీ నాన్న వద్దకు వెళ్ళి సహాయం అడగరాదా అన్నారు. ఆమె తండ్రి వద్దకు వెళ్ళారు. కాని తన ఇబ్బంది చెప్పుకోలేకపోయారు. ఆమె తండ్రిని చాలా గౌరవించేవారు.

ఆమె ఉత్తచేతులతో వెనుదిరిగి రావడం అలీ చూశారు. ఈసారి అలీ కూడా ఆమెతో కలిసి వెళ్ళి సహాయం కోసం అడగాలని నిర్ణయించుకున్నారు. ప్రవక్త వారు చెప్పింది శ్రద్ధగా విన్నారు. కాని తాను వారికి ఎలాంటి సహాయమూ చేయలేనని, వారి పరిస్థితి అహ్లె సుఫ్ఫా వారి కన్నా బాగుందని, అహ్లె సుఫ్ఫాకు వెంటనే సహాయం చేయవలసిన అవసరం ఉందని చెప్పారు. కాబట్టి సహనం వహించాలని, ఓరిమితో ఉండాలని బోధించారు. వారు నిరాశగా వెనుదిరిగారు. ఆమె ప్రవక్తకు స్వయాన కుమార్తె, అందులోను ఆయన అత్యంత ప్రేమించే కుమార్తె, ఆమె భర్త ఆయనకు స్వంత బంధువు. అయినా వారికి ఎలాంటి సామాజిక ప్రత్యేక హోదా లేదు. వారు కూడా అలాంటిది కావాలని కోరలేదు.

ఆరోజు సాయంత్రం ప్రవక్త స్వయంగా వారి ఇంటికి వచ్చారు. ఆయన్ను చూసి స్వాగతించడానికి వారు లేవబోయారు. కాని ఆయన వారిస్తూ వచ్చి వారి పక్కన కూర్చున్నారు. అనునయంగా వారితో "మీరు అడిగినదాని కన్నా మేలైనది నేనివ్వనా" అన్నారు. వారిద్దరు ఇవ్వమని అడిగారు.

దైవదూత జిబ్రయీల్ నాకు నేర్పిన పదాలివి. ప్రతి ప్రార్థన తర్వాత పదిసార్లు చదవండి, అంటూ ఇలా చెప్పారు:

సుభానల్లా (ఔన్నత్యం దేవునికే చెందుతుంది)

అల్‌హందులిల్లాహ్ (సకల స్తోత్రాలు దేవునికే)

అల్లాహు అక్బర్ (దేవుడు అత్యున్నతుడు)

మీరు పడుకునే ముందు ఈ వాక్యాలు ప్రతి ఒక్కటి ముప్పయి మూడు సార్లు వల్లెవేయండి అన్నారు.

ఈ ఆధ్యాత్మిక బోధన శతాబ్దాలుగా తరతరాలు పాటిస్తూ వస్తున్నాయి. ప్రతిరోజు ముస్లిములు తమ నిత్యజీవన కార్యకలాపాల్లో దీన్ని పాటిస్తూనే ఉన్నాదు. ఫాతిమా కూడా తన భర్తలానే అత్యంత ధర్మపరాయణత కలిగినవారు. ప్రేమాభిమానాలు, దయాహృదయం కలిగిన మహిళ. ఆమె తన తండ్రి ఆధ్యాత్మిక బోధనల వెలుగులో జీవితాన్ని గడిపారు. అత్యంత తక్కువ లభించినా తృప్తి చెందేవారు. దేవుని తప్ప మరెవ్వరినీ ఏదీ కోరేవారు కాదు. తన వద్ద ఉన్నదంతా ఇతరులకు దానం చేసేవారు.

ఒకరోజు ప్రవక్త ప్రియ పుత్రిక ఫాతిమా ఆయన వద్దకు వచ్చారు. ఆమె అడిగిన ఒక ప్రశ్నకు జవాబిస్తూ ప్రవక్త "ఫాతిమా, నువ్వు ప్రవక్త కుమార్తెగా స్వర్గంలో ప్రత్యేకహోదా పొందగలనని భావించవద్దు. నీ ఆచరణలే నీ హోదాను నిర్ధారిస్తాయి" అన్నారు. ప్రవక్తతో రక్త సంబంధం వల్ల తీర్పుదినాన ఎవరికీ ఎలాంటి ప్రత్యేక సహాయమూ లభించదని ఆయన స్పష్టం చేశారు. ధర్మపరాయణుడితో రక్తసంబంధం కలిగి ఉండడం, అలాంటి తెగ, వంశాలకు చెందినవారు కావడం వల్ల ఎవరికి ఎలాంటి ప్రత్యేక మినహాయింపు లభించదని ఆయన తేటతెల్లం చేశారు. మనిషి ఆచరణలే మనిషికి అక్కడ ఉపయోగపడతాయి.

అనేక సంవత్సరాల తర్వాత ప్రవక్త ముహమ్మద్ తీవ్రమైన అనారోగ్యంతో మృత్యుశయ్యపై ఉన్నప్పుడు ఆమె తండ్రి పక్కన కూర్చుని రోదిస్తున్నప్పుడు ప్రవక్త ఆమె చెవిలో గుసగుసగా దేవుడు తనను పిలుచుకుంటున్నాడని, వీడ్కోలు తీసుకునే సమయం వచ్చిందని చెప్పారు. ఆ తర్వాత కొన్ని క్షణాలకు ఫాతిమా ముఖంలో చిరునవ్వు కనిపించింది. ప్రవక్త మళ్ళీ గుసగుసగా ఆమెతో పరలోకంలో తనను కుటుంబంలో అందరికన్నా ముందు చేరుకునేది నువ్వే అని చెప్పడం వల్ల ఆమె ముఖంలో చిరుహాస్యం చోటు చేసుకుంది. ఈ తండ్రి కుమార్తెల బాంధవ్యాన్ని, ప్రేమాభిమానాలను ఈ సంఘటన చాలా చక్కగా వివరిస్తుంది.

# ఆయిషా

## భార్య

(దేవుడామెతో ప్రసన్నుడవుగాక)

ప్రవక్త ముహమ్మద్ భార్యల్లో ఆయిషా ఒకరు. ప్రవక్తతో సుదీర్ఘకాలం ఉండి ఆయన వద్దనే శిక్షణ పొందిన వారు. ప్రవక్త ముహమ్మద్ ఆచరణలను, ఆయన సంప్రదాయాలను తర్వాతి తరాలకు అందించారు. ప్రవక్త వ్యక్తిత్వం, వ్యక్తిగత జీవితంలో ఆయన నడవడి, సాముదాయికంగా ఆయన చేసిన వ్యాఖ్యలు మొదలైన సమాచారం ఆమె అందించారు. మదీనాలో ప్రవక్త ఇంటికి ఆమె చాలా చిన్నవయసులోనే వచ్చారు. అప్పటి నుంచి ప్రవక్త ఆమె పట్ల ఎంత శ్రద్ధ తీసుకునేవారో ఆమె వివరంగా తెలిపారు. వారి జీవితంలో ఆటలాడుకోవడం కూడా కొనసాగేది. ఆమె జిజ్ఞాసను ఆయన ఎన్నడూ అడ్డుకోలేదు. ఒకసారి అబిసీనియా నుంచి ఒక బృందం ఆయన వద్దకు వచ్చింది. వారు ఆయన ఇంటి ముందు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రవక్త గుమ్మం వద్ద తన వెనక నుంచి ఆయిషా

కూడా చూడడానికి వీలుగా నిలబడ్డారు.

ఆయిషా అనేక సందర్భాల్లో ప్రవక్త తన పట్ల ప్రదర్శించిన శ్రద్ధానక్తులను, ప్రేమాభిమానాలను, ఆయన ఇచ్చిన గౌరవాదరాలను, స్వేచ్ఛా స్వాతంత్ర్యాల గురించి వివరంగా తెలిపారు. ఆమె తెలియజేసిన అనేక హదీసులు (ప్రవక్త ఆచరణలు, వ్యాఖ్యలు, సంప్రదాయాలు) ప్రవక్త జీవనశైలిని ఆవిష్కరించాయి. ప్రవక్త ఆమెతో ఎలా మాట్లాడేవారో, ఎంత ప్రేమగా ఉండేవారో ఆమె తెలిపిన వివరాలు ఒక భర్త తన భార్యతో ఎలా ఉండాలో తెలియజేసే బోధనలు.

ఆయిసా కూడా సగటు మహిళల్లాగే వ్యవహరించేవారు. మదీనా సామాజిక కార్యకలాపాల్లో ఆమె పాలుపంచుకునేవారు. ఆమె ద్వారా మహిళలు ఎలాంటి పాత్ర పోషించాలో ఆయన అందరికీ తెలియజేశారు.

ఒకసారి ఒక పర్షియాకు చెందిన పొరుగువాడు ప్రవక్తను విందుకు ఆహ్వానించాడు. ప్రవక్త అతనితో మరి ఆమె సంగతి ఏమిటి (తన భార్య ఆయిషాను సూచిస్తూ) అని అడిగారు. ఆహ్వానం కేవలం ఆయన ఒక్కడికే అని ఆ వ్యక్తి అన్నాడు. ప్రవక్త ఆ ఆహ్వానాన్ని తిరస్కరించారు. కొంతకాలం తర్వాత ఆ వ్యక్తి మరోసారి ఆయన్ను ఆహ్వానించాడు. ప్రవక్త మళ్ళీ అతడితో "ఆమె సంగతి ఏంటని" అడిగారు. అప్పుడు కూడా ఆ వ్యక్తి ఆహ్వానం ప్రవక్త ఒక్కరికే అన్నాడు. ప్రవక్త రెండవసారి కూడా తిరస్కరించారు. మూడోసారి ఆ పర్షియా వ్యక్తి ఆహ్వానించినప్పుడు కూడా అదే ప్రశ్న అడిగారు. ఈసారి అతను ఇద్దరికీ ఆహ్వానం ఉందని చెప్పాడు. ప్రవక్త దాన్ని మన్నించి తన భార్య ఆయిషాతో కలిసి వెళ్ళారు. ప్రవక్త నిలకడగా ఒక వైఖరిని ప్రదర్శిస్తూ రావడం ద్వారా అరబ్బుల్లో ముఖ్యంగా సంచార అరబ్బుల్లో ఉన్న సంప్రదాయాలను సంస్కరించేవారు. ప్రత్యక్షంగా వారి సంప్రదాయాలపై దాడి చేసే బదులు తన ఉదాహరణల ద్వారా సంస్కరణ కొనసాగించారు. ఆయిషా, అంతకు ముందు ఖదీజా, నిజానికి ఆయన భార్యలందరూ, ఆయన కుమార్తెలందరూ సామాజిక కార్యకలాపాల్లో పాల్గొన్నవారే. స్త్రీలు సామాజిక, రాజకీయ, ఆర్థిక, సైనిక రంగాలకు దూరంగా ఉండడమే ధర్మపరాయణతగా వారెన్నడూ భావించలేదు.

వారి భావవ్యక్తీకరణకు అభిప్రాయప్రకటనకు కావలసిన పూర్తి స్వేచ్ఛ ప్రవక్త ఇచ్చేవారు. అనవసరపు లజ్జాభావంతో భావాలను దాచుకునేవారు కాదు. ప్రతి విషయం గురించి విమర్శనాత్మకంగా మాట్లాడేవారు. చాలా సంవత్సరాల తర్వాత ఆనాటి పరిస్థితులను గుర్తుచేసుకుంటూ ఆయిషా మదీనా మహిళల నిర్భీతిని, మేధోశక్తిని ప్రశంసించారు. మదీనా మహిళలు మక్కా మహిళల్లా కాదు. వారు నిర్భయంగా మాట్లాడేవారు. సూటిగా ప్రశ్నలు

అడిగేవారు. అయిషా వారి గురించి చెబుతూ "అన్సార్ మహిళలపై అనుగ్రహాలు కురవాలి. ధార్మికంగా అవసరమైన సూచనలు పొందకుండా వారిని లజ్జాభావం ఎన్నడూ ఆపలేదు." అన్నారు.

ఆయిషా ప్రత్యక్షంగా ప్రవక్త వద్ద శిక్షణ పొందారు. నిజానికి ఆమె ప్రవక్త ఎలా శిక్షణ పొందారో అదేవిధంగా శిక్షణ పొందారు. దివ్యఖుర్ఆన్ వాక్యాల అవతరణ జరుగుతున్న అనేక సందర్భాల్లో ఆమె అక్కడ ఉండేవారు. ఆయన ఆ సందేశాన్ని ప్రజలకు తెలిపేటప్పుడు కూడా ఆమె ఆయన పక్కనే ఉండేవారు. ఆయన ఒంటరిగా ఉన్నప్పుడు కూడా ఆయనతోనే ఉండేవారు. తన భర్త వైఖరి, ధోరణి, ఎంపికల గురించి ప్రశ్నించేవారు. అవసరమైన జ్ఞానాన్ని పొందుతూ ఉండేవారు. ఆమె జ్ఞాపకశక్తి, ఆమె తెలివితేటలు, విమర్శనా దృష్టి చాలా గొప్పవి. దాదాపు రెండువేల ప్రవక్త హదీసులు ఆమె ద్వారా ముస్లిమ్ సమాజానికి తెలిసాయి. ఇతర అనుచరులు చెప్పిన హదీసులను కూడా ఆమె సరిదిద్దేవారు.

ప్రవక్త ముహమ్మద్, ఆయిషాలు ఒకరిపట్ల ఒకరు చూపించిన ప్రేమాభిమానాలు చాలా ఉన్నతమైనవి. అయిసా తన ధార్మిక విశ్వాసం పట్ల అత్యంత నిజాయితీగా వ్యవహరించేవారు. భర్త పట్ల ఆమె ప్రేమ సాటిలేనిది. ధర్మపరాయణతకు, నిబద్ధతకు మాత్రమే కాదు, తెలివితేటలకు, సామాజిక బాధ్యతకు కూడా ఆమె ఒక ఉదాహరణగా నిలిచారు. ఆమె ఇంటనే ప్రవక్త తన తుదిశ్వాస వదలాలనుకున్నారు. అక్కడే సమాధి కావాలనుకున్నారు.

# 12

# ఉహుద్

## ఏదీ చివరిది కాదు

ప్రవక్త ముహమ్మద్ తన అనుచరులకు ఆధ్యాత్మిక బోధనలు అందజేయడంతో పాటు చాలా జాగ్రత్తగా మదీనా భద్రత గురించి కూడా ఆలోచించాకు. ఖురైషులు ప్రతీకారం కోసం చూస్తున్నారని, బద్ర్ పరాభవానికి పగతీర్చుకునే ఆలోచనతో ఉన్నారని ఆయనకు బాగా తెలుసు. దాదాపు 3000మంది సైనికులతో ఖురైషులు మదీనాపై దండెత్తి వస్తున్నారన్న సమాచారాన్ని ఆయన పినతండ్రి అబ్బాస్ మక్కా నుంచి పంపారు. కేవలం వారం రోజుల్లోగా ఈ సైన్యాన్ని ఎదుర్కునే ఏర్పాట్లు చేసుకోవాలి.

ప్రవక్త వెంటనే సలహామండలి (షురా) సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మదీనాలోనే ఉండి శత్రువు రాకకోసం వేచిఉండాలా? లేక మదీనా బయట మైదానంలో శత్రువును ఎదుర్కోవాల అన్నది కూడా నిర్ణయించాలి. చాలా మంది అనుచరులు, స్వయంగా ప్రవక్త కూడా మదీనాలోనే ఉండి శత్రువు కోసం కాచుకుని ఉండాలని భావించారు. కపటవిశ్వాసుల నాయకుడు ఉబై కుమారుడు అబ్దుల్లా కూడా ఇదే మాట చెప్పాడు. కాని యువకులు, బద్ర్‌యుద్ధంలో పాలుపంచుకోని వారు మాత్రం మదీనా బయటకు వెళ్ళి శత్రువును మైదాన ప్రాంతంలో ఎదుర్కోవాలని చెప్పారు. మెజారిటీ అభిప్రాయం మదీనాకు బయటనే యుద్ధం చేయాలి. శత్రువును ముఖాముఖీ మార్కోవాలి. ప్రవక్త వారి అభిప్రాయాన్ని అంగీకరించారు. వెంటనే ఇక సమయం వృర్థం చేయకుండా యుద్ధకవచం ధరించడానికి ఇంటికి బయలుదేరారు. అప్పుడు కూడా ఆయన మనసులో తాము మదీనాలో ఉండి శత్రువును ఎదిరించడమే మంచిదన్న అభిప్రాయం ఉంది. కొందరు అనుచరులు ఆయన వద్దకు వచ్చి నిర్ణయాన్ని ప్రవక్త ఇష్టపడితే మార్చవచ్చని సూచించారు. కాని ప్రవక్త మాత్రం మెజారిటీ అభిప్రాయానికి కట్టుబడదాం అన్నారు. ఆయన యుద్ధకవచం ధరించారు. ఇక వెనుదిరిగే ప్రసక్తి లేదు.

# ఉహుద్ వైపు...

ముస్లిములు మదీనాకు 5 కిలోమీటర్ల దూరాన ఉన్న ఉహుద్ వైపు మార్చి 23, కామన్ ఎరా 625వ తేదీన బయలుదేరారు. ఇది హిజ్రా మూడవ సంవత్సరం. ముస్లిము సైన్యంలో 1000 మంది ఉన్నారు. మూడువేల సైన్యాన్ని వాళ్ళు ఎదిరించాలి. దారిలోనే కపటుల నాయకుడు ఉబై కుమారుడు అబ్దుల్లా తన వెంట ఉన్న మూడువందలమందిని తీసుకుని సైన్యాన్ని వదిలి వెనక్కి వెళ్ళిపోయాడు. అనుభవం లేని యువకుల మాట విని ప్రవక్త సైన్యాన్ని మదీనా బయటకు తీసుకువచ్చారని, ఆయన స్వంత నిర్ణయం తీసుకోవలసిందని అబ్దుల్లా నిరసన వ్యక్తం చేశాడు. ప్రవక్త మాదిరిగా అతను కూడా చర్చల్లో మదీనాలోనే ఉండాలని వాదించాడు. అబ్దుల్లా ఇలా వెనుదిరిగి పోవడం పెద్ద ఎదురుదెబ్బ. దీనివల్ల ముస్లిముల సైన్యం కేవలం 700కు పడిపోయింది. ఇప్పుడు వెనుదిరిగే ప్రసక్తి లేదు. ఉబై కాపట్యం అందరికీ తెలిసిందే. అతడికి కూడా తన చర్య వల్ల ముస్లిము సైన్యం దెబ్బతింటుందని తెలుసు. అందుకే ఈ మోసానికి పాల్పడ్డాడు. ముస్లిము సైన్యం చాలా బలహీనపడినా ముందుకు సాగింది.

తమ కదలికల గురించి శత్రువు కనిపెట్టకుండా ఉహుద్ చేరాలి. అలాంటి మార్గంలో సైన్యాన్ని నడపాలి. మరోసారి ప్రవక్త ఒక ముస్లిమేతర గైడ్ సహాయాన్ని తీసుకున్నారు. అతను సమర్ధుడైన గైడ్, ముస్లిమ్ సైన్యం ఎవరి కంట పడకుండా నిర్ణీత ప్రాంతానికి చేర్చాడు. ప్రవక్త వెంటనే తన యుద్ధవ్యూహాన్ని రచించారు. అశ్వికదళం, కాల్బలం శత్రువును మైదానంలో ముఖాముఖి ఎదిరించాలి. కొందరు విలుకాండ్రను అక్కడి కొండపై నియమించారు. వారిని ఉద్దేశించి ప్రవక్త:

“కింద యుద్ధమైదానంలో మేము ఊచకోతకు గురవుతున్నట్లు మీరు చూసినా మా సహాయానికి రావద్దు. పక్షులు మా శరీరాలను పీక్కుతింటున్న దృశ్యాన్ని చూసినా మీ స్థానాలు వదిలి ముందుకురావద్దు. నేను పిలిచే వరకు మీ స్థానాల్లోనే ఉండండి. మనం యుద్ధం గెలిచినా, ఓడినా మీ స్థానాలనుంచి కదలవద్దు. గుర్తుంచుకోండి, మీరు ఉన్న కొండదాటి అటునుంచి కింద మాపై దాడి జరగరాదు”

ఎలాంటి పరిస్థితిలోను తమ స్థానాలు వదలరాదని విలుకాండ్రకు ప్రవక్త ఆదేశించారు. కొండమార్గం నుంచి తమపై దాడి జరగకుండా కాపలా కాయాలన్నారు. యుద్ధం మొదటిదశలో ఖురైష్ దళాలు అటునుంచి దెబ్బతీయాలని ప్రయత్నించాయి. కాని కొండపై నుంచి కురిసిన బాణాల వర్షానికి వెనుకంజవేశాయి. ఈ వ్యూహం చక్కగా పనిచేసింది.

# ఉహుద్ యుద్ధం

యుద్ధం మొదలైంది. యుద్ధరంగంలో ముస్లిమ్ సైన్యం నెమ్మదిగా పైచేయి సాధిస్తోంది. ఖురైషులు వెనుకంజ వేసే పరస్థితి ఎదురయ్యింది. ముస్లిమ్ సైన్యం అనితరసాధ్యమైన ధైర్యసాహసాలు చూపింది. సైన్యంలో ఇద్దరు మహిళలను ప్రత్యేకంగా ప్రస్తావించాలి. ఒకరు ఉమ్మె సులైమాన్, అన్సార్ మహిళ. ఆమెను నుసైబా అని పిలిచేవారు. ఆమె వాస్తవానికి నీరు అందించడానికి, గాయపడిన వారికి సేవచేయడానికి అక్కడికి వచ్చారు. చివరకు ఆమె కూడా కరవాలం చేతబట్టారు. ఖురైషులను తీవ్రంగా ప్రతిఘటించారు. ప్రవక్త ఎన్నడూ మహిళలను యుద్ధరంగంలో పోరాడాలని చెప్పలేదు. కాని యుద్ధరంగంలో నుసైబాను చూసి ఆయన ఆమెను ప్రశంసించారు. ఆమెను కాపాడాలని దేవుడిని ప్రార్థించారు.

ముస్లిమ్ సైన్యం గెలిచే సూచనలు వ్యక్తం కాసాగాయి. చాలా మంది అనుచరులు అమరగతులైనప్పటికీ విజయం వారిదే అవుతోంది. కాని ఇంకా నిర్ణాయక దశ రాలేదు. ముస్లిమ్ సైన్యం ముందుకు సాగుతోంది. ఖురైషులు వెనుకంజలో ఉన్నారు. వారి గుర్రాలను, వస్తువులను వెనకనే వదిలేసి వెనుకడుగు వేస్తున్నారు.

పైన కొండపై ఉన్న విలుకాండ్రు ఈ సంఘటనలను చూస్తున్నారు. తమ సైన్యం పురోగమించడం, శత్రువు దెబ్బతినడం వారికి స్పష్టంగా కనబడింది. ఇక విజయం తమదే అనుకున్నారు. కింద శత్రుసైన్యం వదిలి వెళుతున్న వస్తుసంపద పడవేసి ఉంది. ఈ యుద్ధసొత్తులో వాళ్ళకు కూడా భాగం ఉంటుంది. యుద్ధం గెలిచిన తర్వాత ఇక అక్కడ ఉండవలసిన అవసరం లేదని భావించి, యుద్ధసొత్తు సేకరించడానికి వాళ్ళు కొండదిగి వచ్చారు. కేవలం జుబైర్ కుమారుడు అబ్దుల్లా మరి కొందరు తప్ప మిగిలిన అందరు, దాదాపు నలభై మంది విలుకాండ్రు కొండదిగి యుద్ధరంగంలోకి వచ్చేశారు.

ఖురైస్ సైన్యంలో యుద్ధవ్యూహ నిపుణుడు, ఖురైషుల మూడుదళాలకు నాయకత్వం వహిస్తున్న ఖాలిద్ విలుకాండ్ర కదలికలు గమనించాడు. వెంటనే ఆయన తన వ్యూహాన్ని మార్చుకున్నాడు. తన దళాలను కొండమార్గానికి మళ్లించాడు. కొండదారి నుంచి ముస్లిమ్ సైన్యంపై వెనుక నుంచి దాడిచేయాలని పూనుకున్నాడు. విలుకాండ్రు కొండదిగిపోవడం వల్ల కొండదారిని కాపాడేవారు ఎవరూ లేరు. ఖాలిద్ వ్యూహం ఫలించింది. ఖాలిద్ వెనుకవైపు నుంచి సైన్యాన్ని కమ్ముకునేలా చేయడంతో ముస్లిమ్ సైన్యంలో అయోమయం నెలకొంది. చాలా మంది హతమయ్యారు. సైన్యం చెల్లచెదరైంది. ఇతరులు పోరాడుతున్నారు. కాని పోరాటక్రమం తప్పింది.

ప్రవక్త ముహమ్మద్‌పై తీవ్రమైన దాడి జరిగింది. ఆయన వెంట్రుకవాసిలో చావునుంచి బయటపడ్డారు. వడిసెల నుంచి వచ్చిన రాయి ఆయన పై పెదవిని రక్తసిక్తం చేసింది. ఒకపన్ను విరిగింది. మరో రాతి దెబ్బవల్ల శిరస్త్రాణానికి ఉన్న ఇనుప రింగులు ఆయన శరీరంలో లోతుగా దిగబడ్డాయి. ఆయన రక్షణకు ఉన్న వారిలో ఆరుగురు హతమయ్యారు. ఏడవ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ప్రవక్త మరణించారన్న పుకారు యుద్ధరంగంలో వ్యాపించింది. దీంతో ముస్లిమ్ సైన్యంలో అయోమయం మరింత వ్యాపించింది. కొందరు అనుచరులు వెంటనే గాయపడిన ప్రవక్తను సురక్షిత స్థానానికి చేర్చారు. ముస్లిములు అతికష్టం మీద వెనక్కి తప్పుకోగలిగారు. యుద్ధరంగంలో పరిస్థితి అగమ్యగోచరంగా కనబడింది. వెనక్కి తగ్గిన ముస్లిమ్ సైన్యం కాస్త కుదుటపడింది. అవసరమైతే సైన్యాన్ని మళ్ళీ ఎదిరించడానికి సమాయత్తమయ్యింది. యుద్ధం ముగిసేసరికి ఖురైషుల్లో కేవలం 22 మంది మరణించగా, ముస్లిమ్ సైన్యంలో 70 మంది మరణించారు.

## ప్రతీకారం

ప్రవక్త పినతండ్రి హంజాను లక్ష్యంగా చేసుకుని యుద్ధరంగంలో ఖురైష్ నాయకుడు సుఫియాన్ భార్య హింద్ దాడి చేయించింది. అబిసీనియాకు చెందిన ఈటెగాడు వహషీని కేవలం ఇదే పనికి నియమించింది. యుద్ధరంగంలో అతడి పని కేవలం హంజాను వెదికి ఆయనపై దొంగదెబ్బ తీయడం. యుద్ధరంగంలో పోరాడుతున్న హంజాకు దగ్గరగా వెళ్ళిన వహషీ అత్యంత లాఘవంగా విసిరిన ఈటెకు ఆయన అక్కడికక్కడే నేలకొరిగారు. ఆ తర్వాత హింద్ యుద్దరంగంలో హంజా శరీరాన్ని వెదికి తన బంధువులు హత్యకు ప్రతీకారంగా ఆయన రక్తం తాగుతానని చేసిన ప్రతిజ్ఞ పూర్తిచేసుకుంది. అత్యంత హీనంగా ఆయన శరీరాన్ని అవమానపరిచింది. ముక్కుచెవులు కోసి కక్ష్యతీర్చుకుంది.

ఖురైషులు మరణించిన తమవారి శరీరాలు తీసుకువెళ్ళారు. ముస్లిములు తమ వారి మృతదేహాలను తరలించడానికి అక్కడికి వెళ్ళినప్పుడు మృతదేహాలు అతినీచంగా అవమానపరచబడి ఉండడాన్ని చూశారు. తన పినతండ్రి హంజా మృతదేహాన్ని అత్యంత హీనంగా అవమానపరచడాన్ని చూసి ప్రవక్త చాలా దు:ఖించారు.

బతికి ఉన్నవారి పట్ల మాత్రమే కాదు, మరణించిన వారి మృతదేహాల పట్ల కూడా మర్యాద చూపాలని ప్రవక్త చెప్పేవారు. మృతదేహాల అవయవాలు ఖండించడం, అవమానించడం జరగరాదనేవారు. సృష్టి పట్ల గౌరవం, మానవుల పట్ల మర్యాదల రీత్యా ఇలాంటి అనుచిత చేష్టలు ఏమాత్రమూ ఆమోదయోగ్యం కావు.

# విలుకాండ్ర అవిధేయత

విలుకాండ్రు తమ స్థానాలను వదిలిరావడం వల్ల యుద్ధరంగం పరిస్థితి మారిపోయింది. వారు కింద యుద్ధరంగంలో కనబడుతున్న యుద్ధసొత్తుకు ఆశపడ్డారు. ఇస్లామ్‌ను స్వీకరించి ముస్లిములుగా మారినప్పటికీ, గతంలోని అజ్ఞాన కాలపు అలవాట్లు వారిని వదలిపెట్టలేదు. ఒకే దేవుడి విశ్వాసం, ఐహిక సంపదల పట్ల వ్యామోహాన్ని వదులుకోవడం, న్యాయానికి కట్టుబడడం ఇవన్నీ తెలిసినా, ఒక్కసారి యుద్ధరంగంలో పరిస్థితి చూసి, యుద్ధసొత్తు కోసం ఆశపడ్డారు. పాత అరబ్బు సంప్రదాయాల ప్రకారం యుద్ధవిజయాలను అక్కడ స్వాధీనం చేసుకున్న యుద్ధసొత్తు ప్రకటించేది. ఇది సుదీర్ఘకాలంగా కొనసాగుతూ వస్తున్న ఆచారం. యుద్ధవ్యూహాల్లో అందెవేసిన చేయి ఖాలిద్ విలుకాండ్ర కదలికను గమనించిన వెంటనే దాడి ఎత్తుగడ మార్చేశారు. ముస్లిము సైన్యాన్ని తీవ్రంగా దెబ్బతీశారు. ఖాలిద్ ఆ తర్వాత కొంతకాలానికి తానే స్వయంగా ముస్లిమ్‌గా మారిపోయారు. ఉహుద్ యుద్ధం ఈవిధంగా అనేక గుణపాఠాలు నేర్పింది. మనుష్యులు తమ పాత అలవాట్లు, సంస్కృతి సంప్రదాయాల నుంచి పూర్తిగా బయటకు రావడం చాలా కష్టం.అలాగే ఎవరి గురించి తుదితీర్పు చెప్పలేము. ఎవరు ఎప్పుడు ఎలా మార్పు చెందుతారో కూడా ఊహించలేము. ఖాలిద్ ముస్లిమ్ సైన్యాన్ని చావుదెబ్బ తీసిన నాయకుడు కూడా హఠాత్తుగా మనసు మార్చుకుని ముస్లిమ్‌గా మారిపోయారు. అందువల్ల ఎవరి గురించి కూడ తుది నిర్ణయం ప్రకటించలేము. ఆశాదీపం ఎల్లప్పుడు వెలుగుతూనే ఉంటుంది.

# షురా

# సలహామండలి

ముస్లిములు మదీనాకు తిరుగుముఖం పట్టారు. విలుకాండ్ర పొరబాటు వల్ల వారికి భారీనష్టం చెల్లించుకోవలసి వచ్చింది. అనేకమంది అనుచరులు నిహతులయ్యారు. ప్రవక్తతో సహా అనేకమంది గాయపడ్డారు. ఆ తర్వాత అవతరించిన దివ్యఖుర్‌ఆన్ వాక్యాలు ఈ సంఘటనలను సమీక్షించాయి. యుద్ధవ్యూహం విషయంలో అభిప్రాయభేదాలు, విలుకాండ్ర క్రమశిక్షణా రాహిత్యం, ప్రాణనష్టం, ప్రవక్త ధోరణి అన్నింటిని ప్రస్తావించింది.

యుద్ధసొత్తు కోసం తమ స్థానాలను వదిలి కిందికి వచ్చిన వారి పట్ల ప్రవక్త సానుభూతితోను వ్యవహరించారు. వారి పరిస్థితిని అర్థం చేసుకున్నారు. వారు ఆయన ప్రత్యక్ష ఆదేశాల పట్ల అవిధేయత చూపినా ఆయన క్షమించారు. ప్రవక్తలోని ఈ మృదువైఖరి ఆయన వ్యక్తిత్వం ప్రత్యేకత. ఈ విషయాలను దివ్యఖుర్‌ఆన్ వాక్యాలు ఇలా ప్రస్తావించాయి.

> "(ప్రవక్తా!) అల్లాహ్ యొక్క అనంత కరుణ వల్లనే నీవు వారిపట్ల మృదుస్వభావిఉడవు అయ్యావు. నీవే గనుక కర్కశుడవు, కఠినహృదయుడవు అయినట్లయితే వారందరూ నీ చుట్టుపక్కల నుంచి దూరంగా పోయేవారు. వారి తప్పులను మన్నించు, వారిని క్షమించు అని అల్లాహ్‌ను ప్రార్థించు. ధర్మానికి సంబంధించిన పనిలో వారిని కూడా సంప్రదించు. అయితే ఒక నిర్ణయాన్ని తీసుకుని దాన్ని అమలుపరచటానికి సంకల్పించినప్పుడు అల్లాహ్‌పై భారం వెయ్యి. తననే నమ్ముకుని పనిచేసేఉ వారంటే అల్లాహ్‌కు ఎంతో ఇష్టం." (దివ్యఖుర్‌ఆన్ 3 : 159)

మొత్తం సంఘటనల పరంపర యుద్ధవ్యూహం విషయంలో ప్రవక్త అభిప్రాయాన్ని కాదని మదీనాకు బయట శత్రువుతో ముఖాముఖి ఎదుర్కోవాలన్న నిర్ణయం మొదలు ఆ తర్వాత విలుకాండ్ర పొరబాటు వరకు అన్నింటా బలహీనతలు బయటపడ్డాయి. ఫలితాలు ఏవైనా గానిక సలహా సంప్రదింపుల వైఖరి మంచిదని దివ్యఖుర్‌ఆన్ నిర్ధారించింది. మెజారిటీ అభిప్రాయాన్ని గౌరవించాలని పేర్కొంది.

అందువల్ల ముస్లిములు తమ వ్యవహారాలను సలహామండలిలో సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవాలి. ఈ సూత్రం శాశ్వత ప్రాతిపదిక గలిగిన సూత్రంగా గుర్తింపు పొందింది. ఇక విలుకాండ్ర అవిధేయత పొరబాటుల విషయానికి వస్తే ప్రవక్త వ్యక్తిగత గుణగణాల వల్లనే తర్వాత ముస్లిమ్ సైన్యాన్ని ఆయన నిలబెట్టగలిగారు. ఆయన కఠినహృదయుడు కాదు, పాత అలవాట్ల వల్ల వారు ఒక్కసారి యుద్ధసొత్తు కోసం ఆశపడడాన్ని ఆయన నిందించలేదు. ఆయన మృదువైఖరి అనుచరులను ఓదార్చింది. ఈ సంఘటనల నుంచి పాఠాలు గ్రహించేలా చేసింది.

# నమ్రత

ప్రవక్త ముహమ్మద్ ఒకసందర్భంలో ఇలా అన్నారు

"నమ్రత, ఉదారతలు దేవుని దాస్యం వంటివి"

దివ్యఖుర్ఆన్‌లో దేవుడు ఇలా వివరించాడు :

> "భూమిపై విర్రవీగుతూ తిరగకండి. మీరు భూమిని చీల్చనూ లేరు. పర్వతాల ఎత్తుకు చేరనూ లేరు." (దివ్యఖుర్ఆన్ 17 : 37)

అంతేకాదు

> "ప్రజలతో ముఖం పక్కకు తిప్పి మాట్లాడకు. భూమిపై నిక్కుతూ నడవకు. అహంభావి, బడాయికోరు అయిన ఏ వ్యక్తినీ అల్లాహ్ ప్రేమించడు."
> (దివ్యఖుర్ఆన్ 31 : 18)

ప్రవక్త ఎల్లప్పుడు దైవభీతితో జీవించేవారు. ఆయన వైఖరిలో నమ్రత ఎల్లప్పుడు ఉట్టిపడేది. మదీనాలో ఆయన నివసించిన గృహం మట్టి ఇటుకలతో చేసిన సాధారణ ఇల్లు. పైన ఖర్జూరపు ఆకుల కప్పు. ఆ కప్పు వేయడంలో ఆయన స్వయంగా పనిచేసుకున్నారు. ఆయన భార్యల కోసం వివిధ భాగాలుగా విభజించి ఉండేది. బదూయిన్ అరబ్బుల సంప్రదాయం ప్రకారం, తన శిబిరంలో ప్రత్యేకంగా వ్యక్తిగత శయనమందిరం లాంటిది ఏదీ ఆయనకు లేదు. ఆయన అత్యంత నిరాడంబరమైన జీవితాన్ని గడిపారు. చాలా సాధారణమైన జీవితం ఆయనది. పగలంతా ఆయన చాలా పనుల ఒత్తిడిలో ఉండేవారు. ఆయన రాజ్యానికి అధినేత, ప్రధాన న్యాయమూర్తి, సర్వసైన్యాధ్యక్షుడు, ఉపాధ్యాయుడు తదితర పాత్రలు పోషించేవారు. రాత్రులు అత్యంత భక్తితో ప్రార్థనల్లో గడిపేవారు. రాత్రి చాలా సేపటి వరకు ఆయన ప్రార్థనల్లో, ధ్యానంలో గడిపేవారు. తన విధిబాధ్యతలు నిర్వర్తించే శక్తిసామర్థ్యాలు ప్రసాదించాలిన దేవుడిని గద్గద స్వరంతో వేడుకునేవారు.

ఆయన ఇంట వస్తువులు కూడా చాలా తక్కువ. ఒక ఖర్జూరపు చాప. జగ్గులు, బ్లాంకెట్ వంటి సాధారణ వస్తువులు మాత్రమే ఇంట ఉండేవి. ఆయన అప్పటికి అరేబియా ద్వీపకల్పానికి రారాజుగా అధికారం పొందినా ఆయన ఇంటిలో పరిస్థితి ఇదే. అత్యంత నిరాడంబరమైన జీవనం ఆయనది. ఒకసారి ఆయన భార్యలు కొన్ని సదుపాయాల కోసం ఒత్తిడి చేసినా వారికి అవేవీ దక్కలేదు. ఆయన ఎన్నడూ టేబుల్‌పై కూర్చుని భోజనం చేయలేదు. క్రింద కూర్చుని బదూయిన్ పద్ధతిలోనే భోంచేసేవారు. కుడిచేతితోనే తినేవారు. తింటున్నప్పుడు ఎప్పుడు కత్తి ఉపయోగించలేదు. సాధారణమైన తెల్లని దుస్తులు ఇష్టపడేవారు. ఆయన తుదిశ్వాస విడిచినప్పుడు, ప్రపంచానికి వెలుగుపంచిన ఆ ఇంట చమురులేనందువల్ల చీకటిగానే ఉండింది.

- ఆయనకు సర్వాధికారాలు ఉన్నప్పటికీ ప్రవక్త తన కుటుంబం కోసం ఏదీ సంపాదించి ఇవ్వలేదు. ఆయన ఎలాంటి విలునామా ఇవ్వలేదు. ఆయన వదిలి వెళ్ళింది కేవలం ఈ వాక్యాలే :

"ప్రవక్తలకు వారసులు లేరు. మేం వదిలి వెళ్ళిందాన్ని పేదలకు పంచండి"

ప్రపంచంలో గొప్ప సామ్రాజ్యాన్ని స్థాపించిన వ్యక్తి మాటలివి. ఆసియా, ఆఫ్రికా, యూరప్ ఖండాల్లో విస్తరించే సామ్రాజ్యాధిపతి చెప్పిన మాటలివి.

## నేను ఒక బాటసారిని

ప్రవక్త ముహమ్మద్ అరేబియా ద్వీపకల్పానికి పాలకుడు, ఆయన అనుచరులు ఆయన పట్ల అత్యంత విశ్వాసంగా ఉండేవారు. నాయకుడి పట్ల ఇలాంటి అచంచల విశ్వాసం కలిగిన అనుచరులు మనకు చరిత్రలో మరెక్కడా కనబడరు.

ఉమర్ ఒకసారి తాను ప్రవక్త ఇంటికి వెళ్ళినప్పుడు చూసిన పరిస్థితిని ఇలా వివరించారు. "నేను లోపలికి వెళ్ళినప్పుడు ఆయన ఒక చాపపై పడుకుని ఉన్నారు. ఖర్జూరపు ఆకులతో నేసిన చాప అది. ఆయన చొక్కా తొడుక్కుని లేరు. ఆయన వీపుపై చాప గుర్తులు స్పష్టంగా కనబడుతున్నాయి. ఒక మూల ఒక చెక్కబల్ల ఉంది. కొద్దిగా బార్లి ఉంది." ఇది చూసి నేను నా దు:ఖాన్ని ఆపుకోలేకపోయాను. ఆయన నాతో ఎందుకు బాధపడుతున్నావు అని అడిగారు. రోమన్, పర్షియన్ సామ్రాజ్యాలు సమస్త భోగభాగ్యాలు అనుభవిస్తుంటే మీరు దైవప్రవక్త అయివుండి ఇలా ఉండడం ఏమిటన్నాను. ఈ మాటలు విని ఆయన లేచి కూర్చున్నారు. "ఉమర్! నువ్వు చెబుతున్న మాటలకు అర్థమేమిటి? నువ్వు చెప్పేవారికి ఈ ఇహలోకమే దక్కనీ, మనకు పరలోకం కావాలని నువ్వు కోరడం లేదా?" అని ప్రశ్నించారు.

● ప్రవక్త ముహమ్మద్ జీవించిన మొత్త మదీనా రాజ్యం ఆయన బతికి ఉన్నప్పుడే భోగభాగ్యాలతో తులతూగే స్థాయికి చేరుకుంది. ఆ రోజుల్లో కూడా అరేబియా ద్వీపకల్పానికి చక్రవర్తి స్థాయి అందుకున్న ఆయన ఇంట అనేక రోజుల పాటు పొయ్యి వెలిగేది కాదు. కేవలం ఖర్జూరాలు తిని నీళ్ళు తాగి గడిపేవారు. రాత్రి తినడానికి ఏమీ లేకపోవడం వల్ల కుటుంబసభ్యులు ఆకలితో నిద్రపోయిన రాత్రులు ఎన్నో.

ఒకసారి ప్రవక్త అనుచరుడు ఉర్వా ప్రవక్త భార్యలతో అంత తక్కువ ఆహారంతో ఎలా బతుకుతున్నారని ప్రశ్నించారు. వారు జవాబిస్తూ తాము తినేది కేవలం ఖర్జూరాలు మాత్రమేనని, అవి తిని నీళ్ళుతాగుతామని చెప్పారు. ప్రవక్త ఇంట మూడురోజుల వరకు సరిపడే ఆహారదినుసులు ఉండడమన్నది ఎప్పుడు జరగలేదు.

● ఒకసారి ఒక అన్సార్ మహిళ ఆయిషా వద్దకు వచ్చింది. ఆమె ప్రవక్త నిద్రించే పడక చూసింది. అది కేవలం గడ్డికూరిన పడక. ఆమె వెంటనే ఇంటికి వెళ్ళి ఉన్ని నింపిన పరుపు తీసుకుని వచ్చింది. ఆ తర్వాత ప్రవక్త ఇంటికి వచ్చి అది చూసి, ఇదేమిటని ఆయిషాను ప్రశ్నించారు. “ప్రవక్తా! ఒక అన్సార్ మహిళ వచ్చింది. మీ పడక చూసి, ఇది పంపించింది.” అన్నారు. ప్రవక్త వెంటనే దాన్ని తిప్పి పంపేయమని చెప్పారు. కాని ఆయిషా ఆ పరుపును పంపలేదు. ఆ పరుపు వాడినా వాడకపోయినా ఇంట ఉండడమే మంచిదని భావించారు. ప్రవక్త ఆమెతో “అయిషా, దేవుని తోడు, నేను కావాలనుకుంటే దేవుడు వెండి బంగారం కొండలు నాకు ఇచ్చి ఉండేవాడు” అన్నారు.

● ఒకరోజు ప్రవక్త ఒక ముతక చాపపై విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయన శరీరంపై దాని గుర్తులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కొందరు అనుచరులు అది చూసి “మీరు అనుమతిస్తే కాస్త మెత్తటి పడక తీసుకొస్తామన్నారు” ప్రవక్త జవాబిస్తూ “ఈ ప్రాపంచిక సుఖాలు నాకెందుకు? నేను ఒక బాటసారిలాంటి వాడిని. ఎండలో ఒక చెట్టు నీడన కాస్సేపు విశ్రాంతి తీసుకుని మరలా ప్రయాణం కొనసాగించడమే నా పని.” అన్నారు.

## ఉదారస్వభావం

ప్రవక్త ఇంటిలో ఉన్నప్పుడు ఇంటిపనిలో పూర్తిగా సహాయపడేవారు. ఈ విషయాలను వివరిస్తూ ఆయిషా ఇలా చెప్పారు. “తన దుస్తులు తానే మరమ్మత్తు చేసుకునేవారు. తన పాదరక్షలు తానే బాగుచేసుకునేవారు. మేకల పాలు పితికేవారు. చిరిగిన దుస్తులు కుట్టుకునేవారు, తోలుసంచులను కుట్టుకునేవారు. బరువులు మోసేవారు. పశువులకు మేతవేసేవారు. నౌకరు

ఎవరైనా పనిచేస్తున్నా కూడా ఆయన కూడా పాలుపంచుకుని సహాయం చేసేవారు. బజారు నుంచి తానే సరుకులు కొని తెచ్చేవారు. ఆయన ఇంటిలో అత్యంత ఉదారంగా వ్యవహరించేవారు. ప్రవక్త కన్నా కుటుంబసభ్యుల పట్ల అత్యంత ప్రేమాభిమానాలతో వ్యవహరించిన వారు ఎవరూ ఉండరు."

- వాహనంగా ఆయన గుర్రాన్ని ఇష్టపడేవారు. తన గుర్రం నోరు, కండ్లు, ముక్కు తానే శుభ్రం చేసేవారు.

## ప్రత్యేక సదుపాయాలు లేవు

ప్రవక్త ముహమ్మద్ తన అనుచరుల కన్నా కాస్త ముందు నడవడం, అంటే ఒక హెూదాను ప్రదర్శిస్తూ నడవడం ఎన్నడూ జరగలేదు. కొన్నిసార్లు దారిలో అందరికన్నా ముందు నౌకర్లు, లేదా పిల్లలు నడిచినా ఆయన అనుమతించేవారు.

- ఏదన్నా సమావేశానికి వెళ్ళినప్పుడు ఆయన తన కోసం ప్రత్యేక ఆసనం అనుమతించేవారు కదు. ఎక్కడ చోటు దొరికితే అక్కడ కూర్చునేవారు. ఆయన తన అనుచరులతో "నేను మీలాంటి వాడినే. నేను మీలాగే ఆహారం తింటాను. అలిసిపోతే మీలాగే కూర్చుంటాను." అనేవారు.

- ప్రజలు తనకు వంగి దండాలు పెట్టాలని, లేదా తాను వచ్చినప్పుడు గౌరవసూచకంగా లేచినిలబడడాన్ని ఆయన ఇష్టపడలేదు. ఆయన పట్ల గౌరవంతో ఆయన రాగానే లేచినిలబడితే ఆయన అయిష్టం వ్యక్తం చేశారు. ఇలాంటి ఆడంబరాలు పాటించవద్దని మందలించారు కూడా. అంటే ఆయన తన కోసం ఎలాంటి ప్రత్యేక హెూదాలు కోరుకోలేదు.

> "కరుణామయుని (అసలు) ఎవరంటే, నేలపై అణకువతో నడిచేవారూ, మూర్ఖులు వారిని పలుకరించినప్పుడు, మీకో సలామ్ అని అనేవారూ."
> (దివ్యఖుర్ఆన్ 25 : 63)

## వివక్షలేదు

ఒకసారి ఒక ప్రయాణంలో ప్రవక్త తన అనుచరులతో మేకను రోస్ట్ చేయమని కోరారు. మేకను కోసేపని ఒకరిది, చర్మం వలిచే పని ఒకరిది, వంట చేసే పని ఒకరిది...ఇలా పనులు పంచుకున్నారు. ప్రవక్త తాను వెళ్ళి వంటచెరుకు తీసుకొస్తానని అన్నారు. అనుచరులు

అడ్డు చెబుతూ "ప్రవక్తా, మేం చేస్తాం కదా" అన్నారు. ప్రవక్త జవాబిస్తూ, మీరు చేస్తారని తెలుసు, కాని అలా చేయడం వివక్ష చూపడం కాదా, అది నాకు ఇష్టం లేదు. తన అనుచరుల కన్నా ఎక్కువగా భావించడాన్ని దేవుడు ఇష్టపడడన్నారు.

# ఓరిమి

ఒకసారి ప్రవక్త ఒక యూదుడి వద్ద కొంత అప్పు తీసుకున్నారు. అప్పు తీర్చడానికి అడిగిన గడువు కన్నా ముందే ఆ యూదుడు వచ్చి తన సొమ్ము ఇమ్మని అడిగాడు. అతను ప్రవక్త వద్దకు వెళ్ళి దురుసుగా దుస్తులు పట్టుకుంటూ, "ముహమ్మద్, నా అప్పు ఎందుకు తీర్చడం లేదు. ముత్తలిబ్ వంశంలో అందరూ ఇంతే అనుకుంటాను'' అంటూ పరుషంగా మాట్లాడసాగాడు. అప్పుడు అక్కడే ఉన్న ఉమర్ ఆగ్రహంతో ఊగిపోయారు. ఆ యూదుడిని గట్టిగా మందలిస్తూ కొట్టబోయారు. కాని ప్రవక్త ఆయన్ను ఆపేశారు. ప్రవక్త ఆ యూదుడితో "నీ అప్పు తీర్చడానికి అడిగిన వ్యవధికి ఇంకా మూడురోజులున్నాయి." అన్నారు.

ఆతర్వాత ఆయన ఉమర్‌వైపు తిరిగి "నువ్వు అతని పట్ల, నా పట్ల కూడా ఇంకాస్త మేలుగా వ్యవహరించవలసింది. అప్పు తీర్చమని నువ్వు నాకు చెప్పవలసింది. అప్పు తీర్చమని అడగడంలో కాస్త గౌరవంగా అడగవచ్చని అతడికి చెప్పవలసింది. ఇప్పుడు అతడిని నీతో తీసుకువెళ్ళి అతని అప్పు తీర్చేయ్. మరో 20 సాలు (దాదాపు 40 కిలోలు) ఖర్జూరాలు అదనంగా కూడా ఇవ్వు. ఎందుకంటే అనవసరంగా అతడిని బెదిరించావు." అన్నారు.

ఇక్కడ గమనించవలసిన విషయమేమంటే ఆయన ఒక రాజ్యాధిపతి హోదాలో ఉండి కూడా ఈ సహనాన్ని, ఓరిమిని, నమ్రతను ప్రదర్శించడం.

# చిరునవ్వు

ప్రవక్త ఇతరులతో పాటు వారితో సమానంగా జీవించారు. ఎలాంటి విమర్శలు ఎదురైనా ఆయన చిరునవ్వుతో స్వీకరించేవారు. ఒకసారి ఒక ఎడారి వాసి ఆయన వద్దకు వచ్చి, కోపంగా ఆయన దుస్తులు గట్టిగా లాగుతూ (ఆయన మెడపై దానివల్ల గుర్తుకూడా పడింది) నాకు రెండు ఒంటెల వస్తుసామగ్రి తక్షణం ఇవ్వు. నీ వద్ద ఉన్న సొమ్ము నీది కాదు, నీ తండ్రిది కూడా కాదు, అంతా దేవుడిదే అన్నాడు. ప్రవక్త జవాబిస్తూ, నేను దేవుడి దాసుడ్ని అన్నారు. ఆ తర్వాత అతడితో మాట్లాడుతూ "ఇలా నాతో మాట్లాడ్డానికి నువ్వు భయపడలేదా?" అనడిగారు. అతను లేదన్నాడు. ప్రవక్త ఎందుకు భయం లేదని మళ్ళీ రెట్టించారు. అతను

జవాబిస్తూ, చెడును చెడుతో ఎదిరించవలసిన అవసరం మీకు లేదని నాకు తెలుసు అన్నాడు. ఆ మాటలు విని ప్రవక్త చిరునవ్వు నవ్వారు. తర్వాత ఒక ఒంటెమోసే స్థాయి బార్లీ, మరో ఒంటె మోసేపాటి ఖర్జూరాలు అతడికి ఇచ్చి పంపారు.

## ప్రేమాభిమానాలు

మదీనా మస్జిదులో ఒక నల్ల స్త్రీ ఊడ్చే పని చేసేది. ఒకరోజు ఆమె మస్జిదులో కనబడలేదు. వెంటనే ప్రవక్త ఆమె గురించి అడిగారు. ఆమె మరణించిందని తెలిసింది. ప్రవక్త అప్పుడు "ఈ విషయాన్ని నాకెందుకు చెప్పలేదు" అని ప్రశ్నించారు. ఆమె సమాధి ఎక్కడుందో చూపించండని తన అనుచరులతో ఆమె సమాధి వద్దకు వెళ్ళారు. సమాధి వద్ద నిలబడి ఆమె కోసం ప్రార్థించారు.

## హుందాతనం

ఆయన చప్పుళ్ళను ఇష్టపడేవారు కాదు. తన పనిలో ప్రశాంతత, హుందాతనం ఉండాలని కోరుకునేవారు. ప్రార్థనలకైనా మస్జిదుకు పరుగెత్తడాన్ని నివారించారు. ఆయన ఎల్లప్పుడు "ప్రశాంతత, హుందాతనం ఉండాలనేవారు." ఒకసారి ఆయన హజ్ యాత్ర సందర్భంగా చాలా గగ్గోలుగా ఉంది. ప్రవక్త వెంటనే "అనవసరంగా తొందరపడడం ధర్మపరాయణత కాదంటూ" ప్రశాంత పరిస్థితి నెలకొలిపారు.

## మానవాళికి సాఫల్యం

సాధారణంగా విజేతలు అహంకారాన్ని, ప్రతీకారాన్ని ప్రదర్శిస్తారు. కాని ప్రవక్త ముహమ్మద్ మాత్రం మక్కా విజయం తర్వాత అణకువను చూపారు. ఆయన విజయం దైవప్రవక్త సాధించిన విజయం. ఇబ్నె ఇషాక్ ప్రకారం ప్రవక్త ముహమ్మద్ మక్కా నగరంలోకి ప్రవేశించినప్పుడు ఆయన తలదించుకుని వచ్చారు. ఆయన ఎంతగా వంగిపోయారంటే, ఒంటె మూపునకు ఆయన గెడ్డం తాకుతూ కనబడింది. విజయోత్సవంలో కూడా ఆయన చూపిన అణకువ, నమ్రతలు సాటిలేనివి. కాబాగృహం ద్వారం వద్ద నిలబడి ఆయన చేసిన ప్రసంగంలో "ఒక్క దేవుడు తప్ప మరెవ్వరికీ దాస్యం ఆమోదయోగ్యం కాదు. ఆయన తన దాసుడికి సహాయం

చేశాడు. తన వాగ్దానం నిలబెట్టుకున్నాడు. ఆయన మాత్రమే శత్రువులను లొంగదీశాడు" అన్నారు.

ఆయన ఈ విజయ ప్రతిష్ట తాను పొందలేదు. ఇదంతా దేవుని సహాయమే అన్నారు.

# నేను దైవదాసుడిని

ఒకసారి ఒక అనుచరుడు ఆయనతో "ఇది దేవుడి అభీష్టమైతే..దైవప్రవక్త అభీష్టమైతే..." అంటూ చెప్పబోయారు. ఒక్కసారి ప్రవక్త ముఖంలో కోపం చోటుచేసుకుంది. ఆయన ఈ మాటలు విని చాలా ఆగ్రహించారు.

> "నువ్వు నన్ను దేవుడితో సమానంగా చూపాలనుకుంటున్నావా?" అని తీవ్రంగా ప్రశ్నించారు. "దేవుడి అభీష్టమైతే" అని చెప్పు అంతే అన్నారు.

ఆయన ఇంకా ఇలా చెప్పారు

> "క్రయిస్తవులు ఏసుక్రీస్తు విషయంలో చేసిన మాదిరిగా నన్ను ప్రశంసించడంలో హద్దులు మీరవద్దు. నన్ను ఒక దాసుడిగా, దైవప్రవక్తగా మాత్రమే పిలవండి.(అంటే దేవుడి కుమారుడు కాదు, దైవిక లక్షణాలు ఏవీ కలిగి లేరు)" అని ఖచ్చితంగా చెప్పారు.

ఇంకా ఇలా చెప్పారు

> "తమ ప్రవక్తల సమాధులను ఆరాధనాలయాలుగా మార్చుకున్నవారు నశించుగాక. నా సమాధిని ఆరాధనాస్థలంగా మార్చకండి" అన్నారు

# 13

# కందకం, మోసం, దగా

మదీనాలో పరిస్థితి దిగజారసాగింది. ఉహుద్ యుద్ధఫలితాలు కొత్తకొత్తరూపాల్లో వస్తున్నాయి. వారి ప్రతిష్ట చుట్టుపక్కల తెగల్లో మసకబారసాగింది. వారిని బలహీనులుగా పరిగణించడం మొదలయ్యింది. ఈ బలహీనతపై దెబ్బకొట్టే ప్రయత్నాలు జరిగాయి. మదీనాపై ప్రణాళికాబద్ధమైన దాడి జరుగుతోందన్న హెచ్చరిక ప్రవక్తకు ముందుగానే చేరింది. ఆయన కొన్ని బృందాలను నియమించారు. 100 నుంచి 150 మంది ఒక్కో బృందంలో ఉండేవారు. ఈ బృందాలు వివిధ తెగల వద్దకు వెళ్ళి వారికి నచ్చచెప్పడానికి ప్రయత్నించాయి. మదీనాపై దాడులకు తెగబడకుండా నివారించే ప్రయత్నాలు చేశాయి.

హిజ్రీ శకం నాల్గవ సంవత్సరం ఇలాంటి చెదురుమదురు దాడులతో గడిచింది. ఈ దాడులు ఈ ప్రాంతంలో ఒకవిధంగా బలసమతుల్యం కొనసాగేలా కూడా ఉపయోగపడ్డాయి. ఇది ఒకరకంగా మక్కా ఖురైషులకు, మదీనా ముస్లిములకు మధ్య చదరంగంలా సాగింది. మదీనా వారికి తెలుసు పూర్తిస్థాయి యుద్ధం తప్పేలా లేదని. అరేబియా ద్వీపకల్పం నుంచి ముస్లిములను తుడిచేస్తామని ఖురైషులు బహిరంగంగానే చెబుతున్నారు. అందుకోసం ప్రయత్నాలు కూడా మొదలెట్టారు. చుట్టుపక్కల తెగలతో మైత్రిఒప్పందాలు చేసుకున్నారు. కాని వారికి కొన్ని ఇబ్బందులు ఉన్నాయి. సిరియా, ఇరాక్‌కు వెళ్ళే వాణిజ్యమార్గం మదీనా నుంచి వెళుతుంది. ఈ ప్రాంతమంతా మదీనా ముస్లిముల అధీనంలో ఉంది. ఈ మార్గాన్ని కాపాడుకోవాలంటే కఠినమైన చర్యలు తీసుకోవాలని ఖురైష్ నేతలు భావించారు.

# మిత్రపక్షాలు

ఇస్లామేతర శక్తులన్నీ కలిశాయి. మదీనా ముస్లిములపై పూర్తిస్థాయి యుద్ధం ద్వారా ప్రవక్త ప్రారంభించిన ఈ సమస్యను సమూలంగా తుడిచేయాలని సంకల్పించాయి. బనూ నాదిర్ తెగ నాయకుడు హుయాయ్ తన ఖైబర్ నుంచి యూద నాయకులను తీసుకుని సంప్రదింపుల కోసం ఖురైష్‌నాయకులను కలిశాడు. వారు మైత్రి ఒప్పందం చేసుకున్నారు. వారు ఇతర తెగలతో సంప్రదించి అందరినీ ప్రవక్తకు, మదీనా ముస్లిములకు వ్యతిరేకంగా ఒక్కటి చేసే ప్రయత్నాలు చేశారు. బనూ నాదిర్, అసద్, బనూ గఫ్తాన్, బనూ సులైమ్ తెగలు చేతులు కలిపాయి. మరోవైపు ఖురైష్ తెగలన్నీ ఒక్కటయ్యాయి. ఈ సైన్యాలన్నీ మదీనావైపు కదలడం ప్రారంభించినప్పుడు ముస్లిముల బలం వారి ముందు దిగదుడుపే అనిపించింది. ఖురైష్ సైన్యం, వారి దక్షిణాది మిత్రపక్షాలు అందరూ కలిసి నాలుగువేల పైచిలుకున్నారు. తూర్పున నజ్ద్ నుంచి మరో పెద్ద సైన్యం వస్తోంది. అందులో వివిధ తెగలకు చెందిన సైన్యాలు దాదాపు ఆరువేలకు పైబడి ఉంటారు. మదీనాపై రెండువైపుల నుంచి దాడి జరగబోతోంది. ఒక పటిష్టమైన ముట్టడి. మదీనాలోని ముస్లిములు ఎవ్వరు కూడా హాని లేకుండా బయటపడడం అసాధ్యంలా కనబడింది.

మక్కా నుంచి సైన్యం బయలుదేరగానే, మక్కాలోనే ఉన్న ప్రవక్త పినతండ్రి అబ్బాస్ వెంటనే ప్రవక్తకు సమాచారం పంపించారు. ఈ సమాచారం తీసుకొచ్చిన బృందం మదీనా చేరిన తర్వాత కేవలం ఒక్క నెలరోజులే మిగిలిఉంది. యుద్ధానికి ఏర్పాట్లు ఇంత తక్కువ సమయంలో చాలా కష్టం. ప్రతిఘటన ప్రయత్నాలకు సమయం చాలదు. కేవలం మూడువేల సైన్యమే సిద్ధమయ్యింది. ఇది శత్రుసైన్యంలో మూడోవంతు కూడా లేదు.

# వినూత్న యుద్ధవ్యూహం

ఇస్లామీయ సంప్రదాయం ప్రకారం ప్రవక్త వెంటనే సలహామండలి సమావేశం నిర్వహించారు. పరిస్థితిని వివరించారు. ఏం చేయాలన్న చర్చలు మొదలయ్యాయి. కొందరు మదీనాకు బయటే శత్రువును నిలవరించాలని అన్నారు. బద్ర్‌లో అలా చేసి విజయం సాధించారు. కాని మరికొందరు ఈ ఆలోచనను వ్యతిరేకించారు. మదీనాలోనే ఉండి శత్రుదాడిని కాచుకోవాలన్నారు. పైగా ఉహుద్ యుద్ధం నుంచి పాఠాలు గ్రహించాలని కూడా సూచించారు. ప్రవక్త అనుచరుల్లో ఒక పర్షియన్ కూడా ఉన్నారు. ఆయన పేరు సల్మాన్. ఆయన్ను సల్మాన్

ఫార్సీ అనేవారు. ఆయన కథ కూడా ఆసక్తిదాయకమైనది. చాలా కాలం సత్యదైవం ఎవరన్న అన్వేషణలో గడిపిన వ్యక్తి. ప్రవక్తకు దగ్గరగా నివసించాలన్న ఉద్దేశ్యంతో మక్కాకు వచ్చారు. ఆయన ఈ సమావేశంలో ఈ వాదనలు విన్నారు. ఆయన లేచి ఒక యుద్ధవ్యూహాన్ని వివరించారు. అంతవరకు అరేబియా యుద్ధాల్లో ఈ వ్యూహం ఎవరికీ తెలియదు. సల్మాన్ ఫార్సీ పర్షియన్. ఆయనలేచి "ప్రవక్తా! పర్షియాలో మేము శత్రుదాడి భయం ఉన్నప్పుడు నగరం చుట్టు కందకం తవ్వేస్తాం. ఇక్కడ కూడా మదీనా చుట్టు కందకం తవ్వుదాం." అన్నారు. ఈ ఆలోచన కొత్తది. అందరికీ నచ్చింది. దాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. కేవలం ఒక నెలరోజుల సమయం మాత్రమే ఉంది. శత్రుగుర్రాలు దుమకలేనంత వెడల్పు లోతు ఉన్న కందకం నగరం చుట్టు తవ్వాలి. అందులో పడిన వ్యక్తి పైకి రాలేనంత లోతు ఉండాలి.

ఇది ఖురైషులతో జరిగిన మూడో అతిపెద్ద యుద్ధం. నిజానికి ఇక్కడ యుద్ధం జరగనేలేదు. ఈ యుద్ధంలో ప్రవక్త అనుసరించిన యుద్ధవ్యూహం కూడా మారింది. బద్ర్‌లో ఆయన నీటిబావులను తన అధీనంలో ఉంచుకుంటూ యుద్ధవ్యూహాన్ని రచించారు. ఉహుద్ యుద్ధంలో ఒక కొండను వ్యూహాత్మకంగా ఉపయోగించుకుంటూ వ్యూహాన్ని రచించారు. క్రమశిక్షణా రాహిత్యం చోటుచేసుకోకుండా ఉన్నట్లయితే అక్కడ ఫలితం మరోలా ఉండేది. ఇప్పుడు కందకం తవ్వడం ద్వారా శత్రువు నగరంలోకి రాకుండా అడ్డుకుని ముట్టడిని తట్టుకోవడం. అంతకు మించి మరో మార్గం కూడా లేదు. ముట్టడి సుదీర్ఘంగా కొనసాగినా మదీనలో ఉన్నవారికి తగిన ఏర్పాట్లు చేసుకునే సమయం లభిస్తుంది. ఈ ప్రతిపాదన అనుచరుల్లోనుంచి వచ్చింది. వారి సృజనాత్మక శక్తిసామర్థ్యాలు వికసించేలా ప్రవక్త ఇచ్చిన శిక్షణే ఇది. ప్రవక్త కాని, ఆయన అనుచరులు కాని ఒక విదేశీ యుద్ధవ్యూహాన్ని అమలు చేయడానికి వెనుకాడలేదు. మదీనాలో తమ పరిస్థితికి అనుగుణంగా ఆ వ్యూహాన్ని మార్చుకున్నారు. ప్రజల తెలివితేటలు, జాతి వివేకం, మానవీయ సృజనాత్మకత ఇవన్నీ ఇక్కడ మనకు కనిపిస్తాయి. ప్రవక్త ఈ ప్రతిపాదన వినగానే "వివేకం విశ్వాసికి సంపద. ఎక్కడ దొరికినా దాన్ని అతివిలువైనదిగా స్వీకరించాలి" అన్నారు.

మానవ ఆలోచనల్లో మంచివాటిని స్వీకరించడం, వాటిని అధ్యయనం చేయడం, మానవాళి నిర్మాణాత్మక వారసత్వాన్ని స్వీకరించడం చాలా ముఖ్యం (మారూఫ్ అంటే అందరికీ మంచి చేసేది). అంటే జిజ్ఞాస కలిగి ఉండడం, మానవ వ్యవహారాల నిర్వహణలో సృజనాత్మకతను ప్రదర్శించడం. ఇది కేవలం యుద్ధవ్యూహాల్లోనే కాదు ప్రవక్త తన జీవితంలో అనేక విషయాల్లో ఈ ధోరణి ప్రదర్శించారు.

# కందకం

మదీనా చుట్టు మూడువైపుల ఓయాసిస్సులు, ప్రజల ఇండ్లు ఉన్నాయి. ఒకేవైపు నుంచి నగరంలోకి ప్రవేశించవచ్చు. ప్రవక్త మొత్తం 3000 మంది అనుచరులను కందకం తవ్వడానికి నియమించారు. ప్రతి ఒక్కరికి పదిగజాల దూరం తవ్వమన్నారు. ఆరు కిలోమీటర్ల పొడుగు, 10 గజాల వెడల్పు, 5 గజాల లోతు కందకం తవ్వేపని ప్రారంభమైంది. ఆవిధంగా దాదాపు 3 లక్షల 28వేల ఘనపు గజాల మట్టిని తవ్విపోశారు. కేవలం మూడువారాల్లో పని ముగించారు. ఇది చరిత్రలో ఒక ప్రత్యేక సంఘటన. నిజానికి వారి వద్ద పరికరాలు కూడా లేవు. బనూ ఖురైజా యుదుల నుంచి అద్దెకు తీసుకుని పలుగుపారలు సంపాదించారు. పొద్దుటి నుంచి రాత్రి వరకు తవ్వకం కొనసాగేది.

నేను కూడా పనివాడినే అన్నారు ప్రవక్త. ఆత్మరక్షణకు తవ్వుతున్న కందకం పనిలో కూడా ఆయన ఒక పారతీసుకుని పాల్గొన్నారు. తన భుజాలపై మట్టిమోశారు. సల్మాన్ ఫార్సి ఒక పలుగుతో కందకం తవ్వుతున్నప్పుడు ఒక పెద్ద బండరాయి అడ్డువచ్చింది. దాన్ని పగులగొట్టడానికి ఆయన కష్టపడుతున్నారు. ప్రవక్త ఆయన్ను చూసి సహాయానికి వచ్చారు. పలుగు తన చేతుల్లో తీసుకుని బలంగా ఒకే దెబ్బకు రాతిని రెండుముక్కలు చేశారు.

ఏ పని అయినా ప్రవక్త తానుకూడా పంచుకునేవారు. అది చివరకు ఇంటిలో చేసే సాధారణ ఇంటిపనులైనా. ప్రవక్త చివరి రోజుల్లో ఆయన ఇంట పనిచేసిన అనస్ మాట్లాడుతూ "నేనాయనకు చేసిన సేవల కన్నా ఆయన నాకు చేసిన సేవలు ఎక్కువ. ఆయనెప్పుడు నాతో కోపంగా మాట్లాడలేదు. కఠినంగా చూడలేదు" అన్నారు.

ఇతరులు పనిచేస్తుంటే కూర్చుని చూడ్డం ఆయన వల్ల కానిపని. ఆయన పనిలో పాలుపంచుకునేవారు. ఆయన నెమ్మదిగా దేవుని స్మరిస్తూ ఉండడాన్ని అనుచరులు వినేవారు. కొన్ని సార్లు ఆయన కవితలు చదువుతూ పనిచేసేవారు. మిగిలినవాళ్ళు కూడా ఆయన గొంతులో గొంతు కలిపేవారు. ఈ విధంగా కలిసి పనిచేసే సంస్కృతి వారిలో ఒక సముదాయం అందరూ ఒక్కటే అన్న భావాన్ని బలపరిచింది. వారిలో సాముదాయిక ఆశావాద దృక్పథాన్ని పెంచింది. దేవుని పట్ల చెక్కుచెదరని విశ్వాసం, భావావేశాలను కవితాత్మకంగా వ్యక్తీకరించడం, పాటల్లో ధ్వనించే సంగీతం ఇవన్నీ వారిని ప్రోత్సహించేవి. సాముదాయికంగా పనుల్లో పాల్గొంటూ ఆయన తాను దేవుని సేవలో ఉన్నా, వారిలో ఒక్కడిగా వారి చరిత్రను పంచుకున్నారు.

చివరకు శత్రువుల గుర్రాలు లంఘించలేని కందకం నిర్మించడం పూర్తయ్యింది. శత్రువులు దుస్సాహసానికి పూనుకున్నా వారిని నివారించడం ముస్లిమ్ విలుకాండ్రకు తేలికయ్యింది.

# సాటిలేని సైన్యాధ్యక్షుడు

కందక యుద్ధంలో ప్రవక్త ముహమ్మద్ ప్రదర్శించిన చాతుర్యం, యుద్ధతంత్రం గమనించదగ్గవి. కందక యుద్ధానికి ముందే ఆయన అనేక చర్యలు చేపట్టారు. ఆయన తన గుర్రంపై అనుచరులను వెంటపెట్టుకుని మదీనా పర్యటించారు. ఎక్కడ రక్షణ వ్యవస్థ బలహీనంగా ఉంది. ఎక్కడ కందకం తవ్వడం అవసరమన్నది సర్వే చేశారు. ఆయన ముందుండి కందకం తవ్వించారు. ఆయనే అక్కడ ఇంజనీరు.

అరేబియా ద్వీపకల్పంలోని ప్రజలకు నగరం చుట్టు ఇలా కందంకం తవ్వడమన్నది ఏమాత్రం తెలియని విషయం. ప్రవక్తకు ఈ వాస్తవం బాగా తెలుసు. మదీనాపై కోలుకోలేని దెబ్బతీయాలని వస్తున్న శత్రుసైన్యాలకు కందకం గురించి సమాచారం ఏమాత్రం అందకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. మదీనా నుంచి ప్రజలు బయటకు రాకపోకలను పూర్తిగా నిషేధించారు. ఆవిధంగా సమాచారం శత్రువులకు అందే అవకాశం లేకుండా చేశారు. శత్రువును ఆశ్చర్యంలో ముంచి దెబ్బతీయాలని భావించారు. మదీనా సరిహద్దులపై నిఘా ఉంచడానికి అలీ నాయకత్వంలో కొందరు అనుచరులను నియమించారు. వాచ్ టవర్లను నిర్మించి శత్రువుల కదలికలపై కన్నేసే వ్యవస్థ ఏర్పాటు చేశారు.

ప్రవక్త ఆదేశాల మేరకు అనుచరులు మదీనా బయట ఉన్న తోటల నుంచి ఆహారపదార్థాలన్నింటిని మదీనాకు తరలించారు. ఇక ఇప్పుడు శత్రువులు తమతో ఉన్న ఆహారపదార్థాలపై మాత్రమే ఆధారపడవలసి వస్తుంది. దీనివల్ల ముట్టడి వారికి కష్టమవుతుంది. ఆహారపదార్థాలను మదీనా లోపలికి తరలించడం ద్వారా అవి శత్రువుల చేతులకు చిక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

ఖురైష్ సైన్యం మదీనాకు చేరుకుంటున్నప్పుడు ముస్లిముల బలం కేవలం 3000. వారు శత్రుసైన్యాన్ని గమనించి త్వరత్వరగా కందకం ఇవతల నగరంలోకి చేరుకున్నారు. శత్రువుల కోసం వేచి చూడసాగారు.

ఫ్రాన్సుకు చెందిన కాన్‌స్టాంటిన్ వర్గిల్ గోర్ఘ్యు రోమనియన్ రచయిత. ఆయన ఈ యుద్ధవ్యూహం గురించి రాస్తూ :

"జర్మనీపై యుద్ధంలో సోవియట్ సైన్యం కూడా ఇదే ఎత్తుగడను అనుసరించింది. వారు పొలాల్లో పంటను తమ ఇండ్లకు చేరవేశారు, లేదా దాన్ని నాశనం చేశారు. ముందుకు చొచ్చుకు వస్తున్న జర్మన్ సైన్యానికి ఆ పంట దక్కకుండా చేశారు. ఇది 20వ శతాబ్ధంలో

అనుసరించిన ఎత్తుగడ. కాని ప్రవక్త ముహమ్మద్ 7వ శతాబ్దంలోనే ఈ ఎత్తుగడ అనుసరించారు. ఖురైషులు మదీనా సరిహద్దుల వద్దకు వచ్చినప్పుడు వారు నోరెళ్లబెట్టారు. శత్రువు ఇలా తెలివిగా కందకం ద్వారా ముఖాముఖి పోరాటాన్ని తప్పించడం వారంతకు ముందు ఎక్కడా చూడలేదు. అలాగే నగరం చుట్టు ఉన్న తోటలు పొలాల నుంచి ఆహారం అందకుండా ముందే జాగ్రత్తలు తీసుకున్న శత్రువును కూడా వారు చూడలేదు. ఖురైషులకు వారి సైన్యానికి కావలసిన ఆహారం కొరత త్వరలోనే ఎదురయ్యింది. కనీసం గుర్రాలకు, ఒంటెలకు మేత కూడా దొరకలేదు.'

## ముట్టడి

మదీనాకు దక్షిణాన, తూర్పున దాదాపు 10,000 మక్కా ఖురైషుల సైన్యం వచ్చిపడింది. ఆరువందల గుర్రాలు, ఎన్నో ఒంటెలు మదీనాను ముట్టడించాయి. ఇది కామన్ ఎరా 627, మార్చి 31వ తేదీ. హిజ్రీ శకం నాల్గవ సంవత్సరం. ఒయాసిస్సుల వద్ద పంటలన్నీ కోసేసి ఉన్నాయి. గుర్రాలు, ఒంటెలు మేయడానికి మేత లేదు. మదీనా ముస్లిములను సాధ్యమైనంత త్వరగా లొంగదీయకపోతే యుద్ధంలో వారి పరిస్థితి తలకిందులవుతుంది. అందువల్ల వారు మదీనా వైపు త్వరగా కదిలారు. కాని అక్కడ పెద్ద కందకం స్వాగతం పలికింది. మదీనాను నలువైపుల నుంచి చుట్టుముట్టి లొంగదీయాలనుకున్నారు. ఇక్కడ పెద్ద కందకం ఎదురయ్యింది. ఈ యుద్ధవ్యూహం అరేబియా సైన్యాలు కనివిని ఎరుగనిది. అందువల్ల మదీనాను లొంగదీయడానికి యుద్ధంలో ఎత్తుగడ మార్చవలసిన పరిస్థితి వారికి ఎదురయ్యింది.

ఖురైష్ సైనిక నేతలకు, వారి మిత్రపక్షాలైన తెగలకు మధ్య చర్చలు జరిగాయి. ముట్టడి సాధ్యమైనంత త్వరగా ముగించి మదీనాను వశం చేసుకోవడం ఎలా అని ఆలోచించారు. ఉత్తరం వైపున దాడి తీవ్రం చేయాలని, ముస్లిం సైన్యాలు అటు కదిలినప్పుడు దక్షిణాన కందకాన్ని దాటే ప్రయత్నాలు ప్రారంభించాలని భావించారు. ఎందుకంటే, దక్షిణాన ఉన్న బండరాళ్ళ వల్ల కందకం దాటడం కాస్త తేలికనిపించింది.

## మోసం

ఈ ప్రాంతంలో యూద తెగ బనూ ఖురైజా నివసిస్తోంది. వారికి ప్రవక్తకు మధ్య మైత్రి ఒప్పందం ఉంది. కాని మదీనా సమైక్యతలో బనూ ఖురైజా బలహీనమైన అంశం. బనూ నాదిర్ తెగ నాయకుడు వెళ్ళి బనూ ఖురైజా తెగ నాయకుడితో మాట్లాడాడు. ప్రవక్తతో

చేసుకున్న ఒప్పందాన్ని రద్దుచేసుకోవాలని ఒత్తిడి చేశాడు. బనూ ఖురైజా తెగ నాయకుడు కాబ్ మొదట దీనికి అంగీకరించలేదు. కాని ఈ రెండు కూడా యూద తెగలే. చివరకు బనూ నాదిర్ తెగ నాయకుడు హుయాయ్ ఒత్తిడికి లొంగి ఒప్పుకున్నాడు.

బనూ ఖురైజా తెగ వెన్నుపోటు పొడవడమంటే మదీనా ఆత్మరక్షణ వ్యూహం యావత్తు కుప్పకూలినట్లే. ఎందుకంటే బనూ ఖురైజా తెగ శత్రువుతో చేతులు కలిపితే మదీనాలోకి ప్రవేశించే అవకాశం శత్రుసైన్యాలకు తేలిగ్గా దొరుకుతుంది. అంటే ఓటమి ఖాయం, అంతేకాదు, ముస్లిముల ఊచకోతలు కూడా జరగవచ్చు.

బనూ ఖురైజా తెగ ఖురైషులతో చేతులు కలపడానికి నిర్ణయించుకుంది. కాని ప్రవక్త ముహమ్మద్ శత్రు సైన్యాల కదలికలను నిశితంగా గమనిస్తున్నారు. ఉత్తరాదివైపు సైన్యం కదలికలు చూడగానే ఆయనకు ఎత్తుగడ అర్ధమయ్యింది. దక్షిణాన ఉన్న బనూ ఖురైజా తనతో చేసుకున్న మైత్రి ఒప్పందానికి ఎంతవరకు కట్టుబడి ఉన్నదో తేల్చుకోవాలని నిర్ణయించుకున్నారు. ఆయనకు తెలుసు బనూ ఖురైజా ఏ క్షణాన్నయినా ఒప్పందాన్ని తుంగల్లో తొక్కవచ్చు.

ఈ లోగానే ఆయనకు బనూ ఖురైజా నాయకుడు ఏకపక్షంగా ఒప్పందాన్ని రద్దు చేసిన సమాచారం కూడా అందింది. ఇది నిజానికి ఒక పుకారు వంటిది. ఈ పుకారు నిజమైతే ముస్లిముల ఆత్మవిశ్వాసం దెబ్బతింటుంది. యుద్ధం గెలిచే అవకాశాలు కూడా అడుగంటుతాయి. ప్రవక్త ఇద్దరు గూఢచారులను సమాచార సేకరణకు నియమించారు. ఈ పుకారు అబద్ధమని తేలితే, వెంటనే బిగ్గరగా ఈ వార్తను ముస్లిము సైన్యాలన్నీ వినేలా ప్రకటించాలి. దాని వల్ల వారిలో ఆత్మవిశ్వాసం ఇనుమడిస్తుంది. కాని పుకారు నిజమని తేలితే ఆ విషయాన్ని రహస్యంగా ప్రవక్తకు తెలపాలి. ప్రవక్త ముహమ్మద్ తక్షణం చేపట్టవలసిన చర్యలు కూడా తీసుకున్నారు. జైద్ నాయకత్వంలో మూడువందల మంది ఉన్న దళాన్ని దక్షిణాదికి పంపారు. బనూఖురైజా సహాయంతో అటు నుంచి శత్రువులు నగరంలోకి రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

ముట్టడి కొనసాగించడం వారికి కూడా కష్టంగా మారింది. ముస్లిములు అనుక్షణం అప్రమత్తంగా కాపలా కాయవలసిన పరిస్థితి. ఒకరోజయితే దాడులు అత్యంత తీవ్రంగా కొనసాగాయి. అనేక ప్రాంతాల నుంచి దాడులు జరిగాయి. ముస్లిము సైన్యం మధ్యాహ్న ప్రార్ధనలు, సాయంకాల ప్రార్ధనలకు కూడా సమయం చిక్కలేదు. ప్రవక్త చాలా విసిగిపోయారు. అనుచరుల ఆత్మవిశ్వాసంపై కూడా ముట్టడి ప్రభావం పడుతోంది. ఒక దివ్యఖుర్ఆన్ వాక్యం వారి పరిస్థితిని ఇలా తెలిపింది.

"శత్రువులు మీ వద్దకు పై నుండి, క్రిందినుండి దండెత్తి వచ్చినప్పుడు, భయం వల్ల మీ కళ్లు తేలగిల్లినప్పుడు మీ గుండెకాయలు గొంతులల్లోనికి వచ్చినప్పుడు, మీరు అల్లాహ్‌ను గురించి రకరకాలుగా అనుమానిస్తున్నప్పుడు, ఆ సమయంలో విశ్వాసులు కఠిన పరీక్షకు గురి అయ్యారు, తీవ్రంగా ఊపివేయబడ్డారు." (దివ్యఖుర్ఆన్ 33 : 10-11)

ఇది పరీక్ష. కఠినమైన పరీక్ష. వ్యక్తులు, తెగల నిజాయితీ, విశ్వాసాలను కూడా ఇది పరీక్షకు పెట్టింది. ఈ యుద్ధం బనూ ఖురైజా తెగ ద్వంద్వవైఖరిని తేటతెల్లం చేసింది. అంతేకాదు, మదీనాలో ఉన్న కపటవిశ్వాసుల వైఖరి కూడా బట్టబయలైంది. వారు దొరికిన అవకాశాన్ని ఉపయోగించుకోవాలనుకున్నారు.

ఈ విషయమై దివ్యఖుర్ఆన్

"కపటులూ, రోగగ్రస్త హృదయులూ అందరూ, "అల్లాహ్, ఆయన ప్రవక్త మనతో చేసిన వాగ్దానాలన్నీ భ్రమలు తప్ప మరేమీ కావు" అని స్పష్టంగా ప్రకటించినప్పటి సమయాన్ని జ్ఞాపకం తెచ్చుకో." (దివ్యఖుర్ఆన్ 33:12)

మరో సందర్భంలో దివ్యఖుర్ఆన్ ఇలా పేర్కొంది.

"అప్పుడు వారిలోని మరొక వర్గం "మా గృహాలు ప్రమాదంలో చిక్కుకున్నాయి" అని దైవప్రవక్తకు చెప్పి సెలవుకోరింది." (దివ్యఖుర్ఆన్ : 33 : 13)

ఇతరులు ఈ యుద్ధం నుంచి బయటపడి ఎలాగైన తమను తాము రక్షించుకోవాలనుకుంటున్నారు. ఎందుకంటే ముస్లిముల ఆత్మరక్షణ ఎత్తుగడ ఎంతోకాలం ఫలితాన్నివ్వదని తేలిపోతోంది. ఇలా రోజులకొద్ది ప్రతిఘటించడం సాధ్యపడేలా కనబడడం లేదు.

ముస్లిములు ప్రవక్త పట్ల పూర్తి విశ్వాసాన్ని కలిగి ఉన్నారు. ఈ పరీక్షా సమయంలోనే నిబద్ధత, విశ్వాసబలం మరింత స్పష్టంగా తెలిసివచ్చింది. ఈ సందర్భంగానే క్రింది దివ్యఖుర్ఆన్ వాక్యం అవతరించింది.

"వాస్తవంగానే అల్లాహ్ ప్రవక్తలో మీకు ఒక మంచి ఆదర్శం ఉండినది; అల్లాహ్‌పై, అంతిమ దినంపై ఆశలు పెట్టుకుని అత్యధికంగా అల్లాహ్‌ను స్మరించే ప్రతి వ్యక్తికి." (దివ్యఖుర్ఆన్ : 33: 21)

ఈ వాక్యం కేవలం యుద్ధానికి సంబంధించింది మాత్రమే కాదు. ప్రవక్త వ్యక్తిత్వం, ఆయన నిర్వహించే పాత్ర, ఆయన హెూదా, ప్రతి ముస్లిమ్‌కు ఎంత ముఖ్యమైనవో తేల్చి

చెప్పింది. పైగా ఒక ముట్టడి సమయంలో, తీవ్రమైన పరీక్షా కాలంలో ఈ వాక్యం అవతరించింది. నిరాశ నిస్పృహలు అలుముకుంటున్న వాతావరణంలో దేవుడు వారికి చెప్పిన మాటలివి. ఇలాంటి పరిస్థితిలో కూడా ప్రవక్తను అంటిపెట్టుకుని ఉన్నారు విశ్వాసులు. దివ్యఖుర్ఆన్ ఈ విషయాన్ని వివరిస్తూ, విశ్వాసులు మిత్రపక్షాల సైన్యాన్ని చూసినప్పుడు ఇలా అన్నారని ప్రకటించింది.

> "అల్లాహ్ ఆయన ప్రవక్త మనకు వాగ్దానం చేసిన విషయం ఇదే. అల్లాహ్ ఆయన ప్రవక్త నిజమే పలికారు". ఈ సంఘటన వారి విశ్వాసాన్ని, వారి ఆత్మసమర్పణనూ మరింత అధికం చేసింది. (దివ్యఖుర్ఆన్ 33 : 22)

# యుద్ధచాతుర్యం

ముస్లిములు తీవ్రమైన సంకటంలో ఉన్నారు. కాని రోజులు గడిచిన కొద్ది ఖురైషులకు కూడా కష్టాలు పెరిగాయి. వారి వద్ద ఆహారపదార్థాలు లేవు. పైగా రాత్రులు చలి భరించరానిదిగా ఉంది.

ఈ పరిస్థితిలో ప్రవక్త ముహమ్మద్ వద్దకు నూయామ్ వచ్చాడు. ఆయన ఖురైషు పెద్ద. వయోవృద్ధుడు.ఆయన్ను చాలా మంది గౌరవిస్తారు. నుయామ్ ప్రవక్త వద్దకు వచ్చి తాను ఇస్లామ్ స్వీకరించానని కాని ఇంకా ఈ విషయం ఎవరికీ చెప్పలేదని అన్నారు. తాను ప్రవక్త సేవలో సిద్ధంగా ఉన్నానని అన్నాడాయన.

ఇబ్నే హిష్షామ్ ఈ సంఘటనను వివరిస్తూ, నుయామ్ అందరికీ చిరపరిచితుడు, అన్ని తెగలు ఆయన్ను గౌరవిస్తాయి. మదీనాను చుట్టుముట్టిన తెగల నాయకులందరూ ఆయన మాట వింటారు. ప్రవక్త ముహమ్మద్‌కు కూడా ఈ విషయం తెలుసు. ఆయన నుయామ్‌తో :

"వారిలో విభేదాలు వచ్చేలా చేయడానికి ఏం చేయగలరో అన్నీ చేయండి, మాపై ముట్టడి సడలిపోయేలా సాధ్యమైన ప్రయత్నాలు చేయండి. యుద్ధం మంచిది కాదు." అన్నారు.

నుయామ్ చక్కని ఎత్తుగడ వేశారు. ఆయన వెంటనే యూద తెగ బనూ ఖురైజా వద్దకు వెళ్ళారు. ఖురైషులు మిమ్మల్ని మధ్యలో వదిలేసి వెళ్ళరని హామీ ఏముంది? కాబట్టి కొందరు ఖురైష్ యువకులను మీ వద్ద కుదువపెట్టమని ఖురైషులను అడగండి అని సలహా ఇచ్చారు. ఈ మాట బనూ ఖురైజాకు కూడా నచ్చింది. వెంటనే తమ మనిషిని ఖురైషుల వద్దకు పంపారు. ఆ వెంటనే నుయామ్ త్వరగా ఖురైష్ నాయకుల వద్దకు వెళ్ళారు. ఖురైష్

సైన్యాధ్యక్షుడు అబూసుఫియాన్‌ను కలిశారు. బనూ ఖురైజా మాటతప్పే ఆలోచనలో ఉందని చెప్పారు. వారు నిజానికి ప్రవక్తకు ఇంకా మిత్రులుగానే ఉన్నారని అన్నారు. ఖురైష్ యువకులను తమ వద్ద కుదువపెట్టాలని కోరే ఆలోచనలో కూడా ఉన్నారని చెప్పారు. అలా ఖురైష్ యువకులను పంపితే వాళ్ళను ప్రవక్తకు బంధీలుగా అప్పగించి ప్రవక్తకు తమపై నమ్మకం కుదిరేలా చేయాలని చూస్తున్నారని అన్నారు.

బనూ ఖురైజా మనిషి అబూసుఫియాన్‌ను కలిసి తమ నాయకుడి విజ్ఞప్తిని వినిపించగానే అబూసుఫియాన్‌కు నుయామ్ చెప్పిన మాటలపై నమ్మకం కుదిరింది. బనూ ఖురైజా మోసం చేస్తుందని నమ్మాడు. ఆయన వెంటనే బనూ నాదిర్ నాయకుడు హుయాయ్‌ని పిలిచాడు. ఈ మోసం గురించి తీవ్రంగా ప్రశ్నించాడు. హుయాయ్ నిర్ఘాంతపోయాడు. ఏం చెప్పాలో తెలియక తత్తరపడ్డాడు. అబూసుఫియాన్ ఈ తత్తరపాటు చూసి బనూ నాదిర్ కూడా ఇందులో చేతులు కలిపిందని అనుమానించాడు.

ఖురైష్ మిత్రపక్షాల్లో విభేదాలకు బీజం పడింది. నమ్మకం పోయింది. ఒకరిపై ఒకరికి అనుమానాలు పెరిగాయి. ఈ వార్త బయటకు పొక్కింది. సైన్యంలో ఆత్మవిశ్వాసం దిగజారింది. దాదాపు రెండువారాలుగా ముట్టడి కొనసాగుతోంది. ఆహారపదార్థాలు అడుగంటాయి. గుర్రాలు మేత లేక ఆకలితో చస్తున్నాయి. కొన్ని ఒంటెలు కూడా చనిపోయాయి. ఖురైష్ మిత్రపక్షాల్లో ఒకవిధమైన నిరాశ అలుముకుంది. ఒకరోజు విపరీతమైన గాలివాన వారి సైనిక పంక్తులను అతలాకుతలం చేసింది. మదీనా ప్రతిఘటనను ఛేదించడం తమ వల్ల అయ్యే పనికాదనుకున్నారు.

మరోవైపు ప్రవక్త శత్రుసైన్యం కదలికలపై గట్టి నిఘా పెట్టారు. రాత్రి శత్రుసైన్యం కదలికలను గమనించాలని తన అనుచరుడు హుజైఫాను ఆదేశించారు. ఆయన వచ్చి శత్రువుల్లో గందరగోళం నెలకొందని, తీవ్రమైన చలి, గాలివానలతో పరిస్థితి మరింత దిగజారిందని తెలిపారు. చాలా మంది సైనికులు తిరుగుముఖం పట్టారని కూడా చెప్పారు.

మర్నాడు పొద్దుటి ప్రార్థనల తర్వాత ప్రవక్త తన అనుచరులకు ఈ శుభవార్త చెప్పారు. కాస్త వెలుతురు వచ్చిన తర్వాత చూస్తే శత్రువులు ముట్టడి విరమించి వెళ్ళిపోయారన్నది నిర్ధారణ అయ్యింది. ఈ ముట్టడి 25 రోజులపాటు కొనసాగింది. చివరకు ఖురైష్ మిత్రపక్షాలు నిరాశగా వెనుదిరిగాయి. నిజానికి యుద్ధమే జరగలేదు. అయినా ఓటమి తప్పలేదు.

ఈ వార్తా అరబ్బు ద్వీపకల్పంలో వ్యాపించింది. బలాబలాల సమతుల్యంపై వివిధ తెగల ఆలోచనలు మారిపోయాయి. పదివేల సైన్యాన్ని ముస్లిములు నిలువరించడమే కాదు, ఓడించారు.

# ముస్లిముల దయాగుణం

ప్రవక్త ముహమ్మద్ కుమార్తె జైనబ్ వివాహం అబుల్ ఆస్ తో జరిగింది. అతను ఇస్లామ్ స్వీకరించలేదు. ఆమె మొదట మక్కాలోనే ఉండేవారు. ప్రవక్త ఆమెను మదీనాకు వచ్చేయమని కోరారు. జైనబ్ తన భర్తను చాలా ప్రేమించేవారు. కాని వారిద్దరి జీవనమార్గాల ఎన్నిక చివరకు వారిని వేరు చేసింది. వారిద్దరిలో ఎవ్వరు కూడా పునర్వివాహం చేసుకోలేదు.

కందక యుద్ధం తర్వాత కొన్ని రోజులకు అబుల్ ఆస్ నాయకత్వంలో ఒక వ్యాపారబృందం సిరియా నుంచి వస్తుందన్న వార్త ప్రవక్తకు చేరింది. చాలా ఖురైష్ తెగల వ్యాపార సామగ్రి ఆ వాణిజ్యబృందంలో ఉంది. దాన్ని అడ్డుకోవాలని ప్రవక్త నిర్ణయించారు. సిరియా నుంచి వస్తున్న ఆ వాణిజ్యబృందాన్ని అడ్డుకోవాలని జైద్ నాయకత్వంలో సైన్యాన్నిచ్చి పంపారు. ముస్లిములు మక్కా నుంచి మదీనాకు తరలి వచ్చినప్పుడు ముస్లిముల ఆస్తులన్నింటిని మక్కా ఖురైషులు ఆక్రమించుకున్నారు. ఇప్పుడు వారి వాణిజ్యబృందం పెద్ద ఎత్తున సంపదతో వస్తుంది. కాబట్టి ఆ పరిహారం ఇప్పుడు వసూలు చేయాలనుకున్నారు. మదీనాపై దాడులకు అనుక్షణం ప్రయత్నిస్తున్న ఖురైషులకు ఇది ఒక హెచ్చరికగా కూడా ఉపయోగపడుతుంది.

జైద్ తన సైన్యంతో వాణిజ్యబృందాన్ని అడ్డుకోవడమే కాదు, అందులోని సాయుధలను లొంగదీసారు. కొందరిని నిర్బంధించారు. కొందరు పారిపోయారు. అబుల్ ఆస్ తప్పించుకున్నారు. ఆయన మక్కాకు తిరుగుముఖమయ్యాడు. కాని ఒక్కసారి రహస్యంగా మదీనాలో ప్రవేశించి తన భార్యను, కుమార్తెను చూడాలనుకున్నాడు. నిజానికి అది దుస్సాహసం. కాని భార్యను కుమార్తెను చూడాలన్న కోరిక బలంగా ప్రవేశించింది. ప్రమాదాన్ని లెక్కచేయకుండా మదీనాలోకి ప్రవేశించాడు. తిన్నగా తన భార్య జైనబ్ ఇంటికి వెళ్ళి తలుపు తట్టాడు. జైనబ్ ఆయన్ను లోపలికి రమ్మంది. ఆ రాత్రి అతను అక్కడే ఉన్నాడు.

తెల్లవారుతున్నప్పుడు జైనబ్ ప్రార్థనకు మస్జిదుకు వెళ్ళారు. ఆమె మస్జిదులో మహిళల

వరుసలో ముందు వరుసలో నిలబడ్డారు. ప్రవక్త ప్రార్థన ప్రారంభాన్ని ప్రకటిస్తున్నప్పుడు దొరికిన కొద్దిపాటి సమయంలో ఆమె "ప్రజలారా! నేను రబీ కుమారుడు అబుల్ ఆస్‌కు శరణు ఇచ్చాను" అని ప్రకటించారు. ప్రార్థన పూర్తయ్యింది. తన కుమార్తెకు, ఆమె భర్తకు మధ్య ఏం జరిగిందన్నది ప్రవక్తకు తెలియదు. ఇతర అనుచరులు విన్నారు. తన కుమార్తె ఇచ్చిన శరణైనా, ఇతర ముస్లిములు ఇచ్చిన శరణైనా దాన్ని మన్నించవలసిందే.

ఆ తర్వాత ప్రవక్త తన కుమార్తె జైనబ్ వద్దకు వెళ్ళారు. విషయమేమిటని ప్రశ్నించారు. ఆమె అబుల్ ఆస్ పరిస్థితిని వివరించారు. ఇటీవలి దాడిలో అబుల్ ఆస్ వ్యాపార సరుకు మొత్తం స్వాధీనం చేసుకోవడం జరిగింది. మక్కాలోని అనేక తెగల సరుకులు అందులో ఉన్నాయి. వాటి బాధ్యత అబుల్ ఆస్‌పై ఉంది. అతను వారందరికీ ఇప్పుడు రుణపడి ఉన్నాడు. ప్రవక్త దీనికి స్పందిస్తూ, అబుల్ ఆస్ వ్యాపార సరుకులు ఎవరి వద్ద ఉన్నాయో వారు ఇష్టపడితే వెనక్కి ఇవ్వవచ్చునని ప్రకటించారు. అందరూ ఒప్పుకున్నారు. కొందరు అనుచరులు అబుల్ ఆస్‌కు సలహా ఇస్తూ ఇస్లామ్ స్వీకరించి ఇక్కడే ఉండిపో, ఈ సరుకులన్నీ నువ్వు ఉంచుకో అన్నారు. కాని అతను ఒప్పుకోలేదు, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసి ఇస్లామ్ స్వీకరించలేనన్నాడు. అతను సరుకులన్నీ తీసుకుని తిన్నగా మక్కా చేరుకున్నాడు. ఎవరిది వారికి పంచేశాడు. ఆ తర్వాత మళ్ళీ మదీనా తిరిగి వచ్చి ఇస్లామ్ స్వీకరించాడు.తన భార్య జైనబ్, కుమార్తె ఉమామాలతో కలుసుకున్నాడు.

ఆ విధంగా ముస్లిముల దయాగుణం, విశాలహృదయం మరోసారి ప్రపంచానికి తెలిసింది. ప్రవక్త మాదిరిగానే అనుచరులు కూడా అబుల్ ఆస్ నుంచి ఏమీ కోరలేదు. అతను ముస్లిమ్ కాదు. శత్రువర్గానికి చెందినవ్యక్తి. పైగా అతను స్పష్టంగా ఇస్లామ్ స్వీకరించేది లేదని తిరస్కరించాడు. అయినా వారు అతన్ని పోనిచ్చారు. అతని ఆధ్యాత్మిక వికాసానికి కావలసిన సమయం తీసుకోనిచ్చారు. ఆ తర్వాత అతను కొన్ని క్లిష్టమైన తెగల అంతర్గత ఘర్షణల కాలంలో ముస్లిముల భద్రత బాధ్యతలు కూడా నిర్వర్తించాడు.

## భావప్రకటనా స్వేచ్ఛ

ప్రవక్త ముహమ్మద్ కుమార్తె జైనబ్ బహిరంగంగా, గట్టిగా తన భర్త కోసం వాదించారు. ఆమె చాలా సార్లు మస్జిదుకు వెళ్ళేవారు. అక్కడ బహిరంగంగానే ప్రకటనలు చేసేవారు. బహిరంగంగా తమ అభిప్రాయాలను వెల్లడించడం అప్పట్లో ముస్లిమ్ మహిళలందరిలోను కనబడుతుంది. మదీనాలో ప్రవక్త మస్జిదులో ఒక మహిళ ప్రవక్త వద్దకు ఒక ఫిర్యాదుతో వచ్చింది. ఆమె పేరు ఖౌలా. తలాబా కుమార్తె, ఔస్ అబీ తాబిత్ భార్య. తన భర్త తనను

అవమానిస్తున్నాడని, వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసిందామె. ఇది మామూలు ఫిర్యాదు కాదు. ఆమె ప్రవక్తతో తీవ్రంగా వాగ్వివాదానికి దిగింది. ఆమె తన అభిప్రాయాన్ని చాలా బలంగా వ్యక్తంచేసింది. దివ్యఖుర్ఆన్‌లోని అధ్యాయం 58 ప్రారంభ వాక్యం ఇదే సంఘటనను సూచిస్తుంది.

"... తన భర్త వ్యవహారంలో నీతో వాదిస్తూ ఉన్న, అల్లాహ్‌తో మొరపెట్టుకుంటూ ఉన్న స్త్రీ మాటలను అల్లాహ్! విన్నాడు. అల్లాహ్ మీ ఉభయుల సంభాషణను వింటున్నాడు; ఆయన అన్నీ వినేవాడు," (దివ్యఖుర్ఆన్ 58 : 1)

ఈ వివాదం ఒక విడాకులకు సంబంధించినది. అరబ్బు బహుదైవారాధక తెగలు అనుసరించే విడాకుల సంప్రదాయానికి సంబంధించినది. ఈ సంప్రదాయం ప్రకారం విడాకులు పొందిన మహిళకు మళ్ళీ వేరొకరిని పెళ్లాడే అవకాశమూ ఉండదు. సంసార జీవితం గడిపే అవకాశమూ ఉండదు. ఈ సంప్రదాయం గురించి మరో దివ్యఖుర్ఆన్ వాక్యం ఇలా తెలిపింది.

"మీలో ఎవరు తన భార్యలను "జిహార్" ద్వారా దూరంగా ఉంచుతారో వారికి వారి భార్యలు తల్లులు కాజాలరు. వారిని కన్నవారే వారి తల్లులు, వారు ఎంతో అనుచితమైన, ఎంతో అసత్యమైన మాటను పలుకుతున్నారు. యథార్థమేమిటంటే అల్లాహ్ ఎంతో క్షమించేవాడు, (దోషాలను) ఉపేక్షించేవాడూను."
(దివ్యఖుర్ఆన్ 58:2)

దివ్యఖుర్ఆన్ వాక్యాలు ఆ మహిళలను సమర్థించాయి. అరబ్బు బహుదైవారాధక విడాకుల్లో ఈ క్రూరమైన సంప్రదాయాలను మార్చడం జరిగింది. ఇలా బహిరంగంగా, బలంగా తమ అభిప్రాయాలను ప్రకటించడం వల్ల న్యాయం నిలబడుతుంది. అవగాహన పెరుగుతుంది.

ప్రవక్త మస్జిదులో మహిళలు పురుషుల వెనుక వరుసల్లో నిలబడేవారు. ఎందుకంటే ప్రార్థనల్లో వివిధ భంగిమల దృష్ట్యా మహిళలు పురుషుల వెనుక వరుసల్లో ఉండడమే సముచితంగా నిర్ణయించారు. మహిళలు అక్కడ ప్రార్థనలు చేసుకునేవారు, తమ అభిప్రాయాలు పంచుకునేవారు, అధ్యయనం చేసేవారు.

మహిళలు మస్జిదు నుంచి బయటకు వెళ్ళేవరకు పురుషులు తమ స్థానంలో కూర్చునే ఉండాలని ప్రవక్త నిర్దేశించారు. ఆ విధంగా వారికి ఎలాంటి అసౌకర్యం జరగకుండా చూసేవారు. ఆయన ఎల్లప్పుడు మహిళల పట్ల హుందాగా, మృదువుగా వ్యవహరించేవారు. వారి అభిప్రాయాలను శ్రద్ధగా వినేవారు. వారి భావప్రకటనాస్వేచ్ఛను గౌరవించేవారు.

# దేవుడు నన్ను క్షమించుగాక...

ఒకసారి జరిగిన ఒక సంఘటన ఈ భావప్రకటనా స్వేచ్ఛను మరింతగా స్పష్టం చేసింది. ఉమర్ ఖలీఫాగా ఉన్న కాలంలో మదీనా అష్టయిశ్వర్యాలతో తులతూగింది. వివాహసమయాల్లో మహర్ (స్త్రీ ధనం) భారీగా నిర్ణయించడం ప్రారంభమయ్యింది. ఈ పరిస్థితి చూసి ఉమర్ దీన్ని అదుపు చేయాలనుకున్నారు. ఇస్లామీయ రాజ్యాధిపతిగా ఆయన ఒక ఆదేశాన్ని జారీచేస్తూ ఎవరు కూడా నాలుగు వందల దిర్హములు కన్నా ఎక్కువగా మెహర్ వసూలు చేయరాదని అన్నారు. అంతకన్నా ఎక్కువగా వసూలు చేస్తే, అదనపు మొత్తాన్ని స్వాధీనపరచుకుని ప్రజాధనాగారంలో జమచేస్తామని చెప్పారు.

ఈ ఆదేశాన్ని ప్రకటించి ఖలీఫా ఉమర్ ప్రసంగస్థానం నుంచి కిందికి దిగగానే పొడవుగా ఉన్న ఒక వృద్ధమహిళ లేచి గట్టిగా "దివ్యఖుర్ఆన్ ఈవిషయంలో ఎలాంటి ఆంక్షలు పెట్టలేదు. మహర్‌పై పరిమితి విధించే హక్కు ఉమర్‌కు లేదు" అని చెప్పింది. తన వాదనకు బలంగా ఆమె క్రింది దివ్యఖుర్ఆన్ వాక్యాన్ని పఠించింది

> "ఒకవేళ మీరు ఒక భార్యస్థానంలో మరొక భార్యను తీసుకొచ్చే సంకల్పమే చేసుకుంటే, మీరు ఆమెకు ఒక పెద్ద దనరాశిని ఇచ్చే ఉన్నాసరే దానినుండి ఏ కొంచెం కూడా తిరిగి తీసుకోవద్దు. ఆమెపై అపనిందమోపి, ఘోరమైన అన్యాయానికి పాల్పడి దాన్ని తిరిగి తీసుకుంటారా?" (దివ్యఖుర్ఆన్ 4 : 20)

ఖలీఫా ఉమర్‌కు తన తప్పు తెలిసివచ్చింది. ఆయన వెంటనే ఒప్పుకున్నారు కూడా. "దేవుడు నన్ను క్షమించాలి. అందరికీ ఉమర్ కన్నా బాగా తెలుసు. ఈ వృద్ధమహిళకు కూడా" అన్నారు.

# మానవసేవ

ప్రారంభం నుంచి రెండు విషయాలను దివ్యఖుర్‌ఆన్ గట్టిగా బోధించింది. మొదట మనిషికి దేవునితో సంబంధం పటిష్టంగా ఉండాలి. ఒక్క దేవుడినే ఆరాధించాలి. ఆ దేవుడికి తప్ప మరెవ్వరికీ తలవంచరాదు. రెండవది మనిసి తన తోటి వారిపట్ల అత్యంత ఉన్నతంగా వ్యవహరించాలి. ఇతరుల హక్కులను గుర్తించాలి. తన తల్లిదండ్రులు, బంధువులు, పొరుగువారు, అనాథలు, పేదల హక్కులను గుర్తించాలి. బలవంతుడైతే బలహీనులపై చేయిఎత్తరాదు. వారికి బలాన్నిచ్చే వ్యక్తిగా బతకాలి. తన స్వంత ధనప్రాణాలు గౌరవమర్యాదలను ఎలా కాపాడుకుంటాడో, ఇతరుల ధనప్రాణాలు గౌరవమర్యాదలను కూడా అలాగే కాపాడాలి. మోసానికి పాల్పడరాదు. నిజాయితీగా ఉండాలి. అతని వల్ల సమాజం ఇబ్బందుల పాలు కారాదు. శాంతికి కారకుడు కావాలి. ఈ బోధనలకు దివ్యఖుర్‌ఆన్ చాలా ప్రాముఖ్యం ఇచ్చింది. అనేక సందర్భాల్లో ఈ బోధనలు కనబడతాయి. దివ్యఖుర్‌ఆన్ అధ్యాయం 17, బనీ ఇస్రాయీల్‌లో ఈ బోధనల మంచి ఉదాహరణ ఉంది.

# దైవానుగ్రహం

ప్రపంచంలో కొందరికి దేవుని అనుగ్రహం వల్ల అన్ని సౌకర్యాలు లభిస్తాయి. కొందరికి లభించవు. సౌకర్యాలు లభించినవారు ఇతరులకు సహాయం చేయాలని దివ్యఖుర్‌ఆన్ బోధిస్తుంది.

జీవితంలో అన్నీ లభించిన వ్యక్తి దేవుడికి కృతజ్ఞుడిగా ఉండాలి. ఈ కృతజ్ఞత వ్యక్తం చేసే మంచి పద్ధతి ఇతరులకు సహాయపడడం. దేవుడు మనకు ప్రసాదించిన దాంట్లో తోటివారికి కూడా భాగం ఉంది. ఈ భాగాన్ని పంచి ఇవ్వకపోతే దేవుడికి కృతజ్ఞత చూపించడం అన్నది సంపూర్ణం కాదు. దైవానుగ్రహంతో కావలసిన సంపద పొందిన తర్వాత కూడా మనిషి ఇతరులకు సహాయపడకపోతే మనిషి మనస్సు కృశిస్తుంది.

ఇస్లామ్‌లో మానవాళికి సేవచేయడం దేవుని సేవించడంతో సమానం. అవసరమున్న వారికి సహాయం చేయడం దేవునికి సహాయం చేయడమే. ఒక మనిషిని ఉత్తచేతులతో పంపించడం దేవుడికి సహాయాన్ని కాదనడమే. దేవుని సృష్టి సంతృప్తి చెందేలా వ్యవహరించడమే దేవుని ప్రసన్నత పొందడానికి మంచి పద్ధతి. భూమిపై ఉన్నవారు ఒకరి పట్ల మరొకరు దయతో వ్యవహరించకపోతే స్వర్గం కూడా భూమిపై ఉన్నవారి పట్ల దయతో వ్యవహరించదు.

# సేవ అందరికీ

సేవ అనేది కేవలం ముస్లిములకే కాదు, అందరికీ అందాలని ఇస్లామ్ ఖచ్చితంగా చెప్పింది. దురభిమానం మనిషికి విద్వేషాన్ని బోధిస్తుంది. జాతీయ దురభిమానం ఉన్న వ్యక్తి ఇతర జాతుల పట్ల సానుభూతితో వ్యవహరించలేడు. ఇస్లామ్ దీనికి విరుద్ధం. ఇస్లామ్ దేవుని సృష్టి అంతా ఒకే కుటుంబంగా బావిస్తుంది. ప్రవక్త ప్రవచనాన్ని అనుచరుడు అనస్ ఇలా వివరించారు. "అన్ని ప్రాణులు దేవుని కుటుంబం. ఈ కుటుంబానికి సేవలందించే మనిషి దేవునికి చాలా ఇష్టమైనవాడు."

దివ్యఖుర్ఆన్ అవసరార్థులను ఆదుకోవాలని ఒక సాధారణ ఆదేశాన్ని జారీచేసింది. నిరుపేదలు, వికలాంగులు, అనాథలు, బలహీనులను ఆదుకోవాలని బోధించింది. కేవలం ముస్లిములకు మాత్రమే సహాయం చేయాలని దివ్యఖుర్ఆన్ ఎన్నడూ చెప్పలేదు. వారు మనకు సంబంధించిన వారయినా, కాకపోయినా, మన భావాలతో ఏకీభవించేవారు అయినా, కాకపోయినా మన భాష మాట్లాడేవారు అయినా కాకపోయినా అందరికీ అవసరమైతే సహాయం అందజేయాలి. కష్టంలో ఉన్న ప్రతివ్యక్తిని ఆదుకోవాలి. ఎందుకంటే భిన్న జాతులు, విభిన్న దేశాలు, వివిధ వర్ణాల ప్రజలందరూ ఒకే మూలం నుంచి సృష్టించబడ్డారు. వారు ఒకరికి ఒకరు సంబంధించినవారే. ప్రవక్త ప్రవచనాలు కొన్ని ఈ వాస్తవాన్ని చాటి చెప్పాయి

1. అబ్దుల్లా కుమారుడు జాబిర్ ప్రకారం ప్రవక్త ఇలా చెప్పారు : "ఇతరుల పట్ల కరుణ చూపని వ్యక్తిపై దేవుడు కూడా కరుణ చూపడు"

2. ఉమర్ కుమారుడు అబ్దుల్లా ప్రకారం ప్రవక్త ఇలా అన్నారు :"రహ్మాన్, అంటే కరుణామయుడు ఇతరులపై కరుణ చూపేవారిని కరుణిస్తాడు. భూమిపై ఉన్నవారిపట్ల కరుణ చూపండి. ఆయన మీపై కరుణ చూపిస్తాడు."

3. మసూద్ కుమారుడు అబ్దుల్లా ప్రకారం ప్రవక్త ఇలా చెప్పారు : "మీరు కరుణ లేనివారయితే మీరు విశ్వాసులు కాదు."

ప్రవక్త అనుచరులు ఇది విని ప్రవక్తా, మాలో అందరు కరుణగానే వ్యవహరిస్తారు అని చెప్పారు. దానికి ప్రవక్త జవాబిస్తూ, మీరు మీ బంధువులు సంబంధీకులపై చూపేది కాదు, అందరి పట్ల ఆ కరుణ ఉండాలి అన్నారు.

4. అబూహురైరా ప్రకారం కొందరు అనుచరులు కూర్చుని ఉండగా ప్రవక్త అక్కడికి వచ్చారు. మీకు మంచి వ్యక్తి ఎవరో చెడు వ్యక్తి ఎవరో చెప్పనా అని అడిగారు. ఆ ప్రశ్నకు అందరూ మౌనంగా వినసాగారు. ఆయన అదే ప్రశ్నను మూడుసార్లు అడిగినప్పుడు ఒక అనుచరుడు "ప్రవక్తా, చెప్పండి మాలో ఎవరు మంచి వ్యక్తి ఎవరు, చెడు వ్యక్తి ఎవరు అని ప్రశ్నించినప్పుడు ప్రవక్త జవాబిస్తూ, ప్రజలు ఎవరి విషయంలో మంచిని మాత్రమే ఆశిస్తారో, ఎవరి వల్ల హాని ఉండదని భావిస్తారో అతను మంచివాడు. ప్రజలు ఎవరి వల్ల మంచిని ఆశించలేరో, ఎవరివల్ల చెడు జరుగుతుందని భయపడతారో అతను చెడ్డవాడు అన్నారు.

ప్రాణులన్నింటినీ ఎలాంటి వివక్ష లేకుండా ఆదుకోవాలని ఈ బోధనలు చెబుతున్నాయి. మన సానుభూతి, సహాయం అవసరం ఉన్న వారికెవరికైనా సహాయం చేయాలని దివ్యఖుర్ఆన్ ఆదేశిస్తుంది. ప్రజలను వివిధ తరగతులుగా, మతసముదాయాలుగా పరిగణించి సహాయం చేయకుండా ఆగిపోవడాన్ని ఖండిస్తుంది.

# సేవాభావం కూడా ఆరాధనే

### మనిషి జీవితలక్ష్యం ఆరాధనే

దైవసాన్నిహిత్యం, ప్రసన్నతలు పొందడానికి ఆరాధనలు చేస్తాం. ఆరాధన భౌతికమైనది కావచ్చు, ఆర్థికమైనది కావచ్చు. భౌతిక ఆరాధనలంటే ప్రార్థనలు. మానవాళిని ఆదుకోడానికి తన సంపదను ఖర్చు చేయడం కూడా ఆరాధనే. అలా సహాయం చేస్తున్నప్పుడు దీనిద్వారా దైవప్రసన్నతను పొందాలన్న ఆలోచన మనస్సులో ఉండాలి. ఆవిధంగా సేవాకార్యక్రమాల్లో కూడా మనిషి ఆరాధనల్లోని మాధుర్యాన్ని చవిచూస్తాడు.

తోటివారికి సహాయపడడం ఒక ప్రాపంచిక వ్యవహారమైనా ఇది కూడా ఆరాధనే అవుతుంది. దీన్ని అర్థం చేసుకోవాలంటే మనం ఆరాధనల వ్యవస్థను అవగాహన చేసుకోవాలి.

# కృతజ్ఞత

ఖుర్ఆన్ బోధించే ముఖ్యమైన నైతిక విలువ కృతజ్ఞతా భావం. దేవునికి కృతజ్ఞులై ఉండాలని బోధించడం జరిగింది.

"సహనశీలుడూ కృతజ్ఞుడూ అయిన ప్రతి మనిషికీ గొప్ప నిదర్శనాలు ఉన్నాయి."
(దివ్యఖుర్ఆన్ 14:5)

"తన సహాయంతో మీ చేతులకు బలం చేకూర్చాడు. మీకు మంచి ఉపాధిని ఏర్పాటుచేశాడు, బహుశా మీరు కృతజ్ఞతలు అవుతారేమో అని."
(దివ్యఖుర్ఆన్ ౪8:26)

"మీరు కృతజ్ఞతలు చూపే దాసులుగా ఉన్నప్పుడు, విశ్వాస మార్గంలో నడుస్తూ ఉన్నప్పుడు మిమ్మల్ని అల్లాహ్ నిష్కారణంగా ఎందుకు శిక్షిస్తాడు? అల్లాహ్ యోగ్యతకు ఎంతో విలువ ఇస్తాడు. ఆయన అందరి స్థితినీ ఎరిగినవాడు."
(దివ్యఖుర్ఆన్ 4 : 147)

కృతజ్ఞత అనేది మనోమస్తిష్కాల నుంచి జనిస్తుంది. దేవుని సృష్టి పట్ల మన ఆలోచనలను ఇది ప్రతిఫలిస్తుంది.

దేవుడు దివ్యఖుర్ఆన్‌లో ఇలా అన్నాడు

"కనుక మీరు నన్ను జ్ఞాపకం పెట్టుకోండి. నేను మిమ్మల్ని జ్ఞాపకం పెట్టుకుంటాను. నాకు కృతజ్ఞతలు తెలుపండి. చేసిన మేలును మరువకండి."
(దివ్యఖుర్ఆన్ 2 : 152)

ముస్లిమ్ విశ్వాసులకు ఇలా చెప్పాలని ఆదేశించడం జరిగింది:

"నీవు ప్రసాదించిన మహాభాగ్యాలకు గాను, నీకు కృతజ్ఞతలు తెలిపే, నీవు ఇష్టపడే సత్కార్యాలు చేసే సద్బుద్ధిని నాకు ప్రసాదించు" (దివ్యఖుర్ఆన్ : 46:15)

కృతజ్ఞతలేని వారిని, కృతఘ్నులను దివ్యఖుర్ఆన్ అనేక సందర్భాల్లో విమర్శించింది.

"వారిలో అనేకమంది కృతజ్ఞత చూపరు" (దివ్యఖుర్ఆన్ 10:60)

మరోచోట

"నీ ప్రభువు ప్రజల పట్ల చాలా అనుగ్రహం కలవాడు. కాని చాలా మంది కృతజ్ఞత చూపరు." (దివ్యఖుర్ఆన్ 27 : 73)

మానవాళికి సేవ చేయడం చేయకపోవడంలోనే కృతజ్ఞత ఉందా లేదా అన్నది తెలిసిపోతుంది. కృతజ్ఞత అనేది అంతర్గత, బాహ్య కోణాలు కలిగి ఉంది. ఇతరులకు సహాయపడడం ద్వారా మన చుట్టు ఉన్న వాతావరణాన్ని ఆనందమయం చేయడమన్నది బాహ్య కోణం. దివ్యఖుర్ఆన్ దానధర్మాలకు, తోటివారికి సహాయపడడానికి, మంచి పనుల్లో సంపద ఖర్చు చేయడానికి ఎంతో ప్రాముఖ్యం ఇచ్చింది. అవసరమున్న వారికి ఆదుకోవడమన్నది ఏదో సమయం ఉన్నప్పుడు లేదా స్వచ్ఛందంగా చేసే పని కాదు. ఇస్లామీయ విశ్వాసం ప్రకారం మనిషి ఏదో ఒకవిధంగా మానవ ఔన్నత్యాన్ని, గౌరవమర్యాదలను పెంపొందించే పని చేపట్టాలి. శాంతి, సుహృద్భావాలను పెంచే పనులు చేపట్టాలి. దేవునికి కృతజ్ఞతలు చూపే అతి ఉత్తమమైన పద్ధతి ఇతరులకు సహాయపడడం.

మొత్తం సమాజాన్ని వ్యవస్థీకరించి ప్రణాళికాబద్దంగా ముస్లిములు ముస్లిమేతరులు అందరికీ న్యాయం, సమానత్వం, శాంతి సుహృద్భావాలు లభించేలా చర్యలు చేపట్టడం అత్యున్నతమైన పద్ధతి.

# 14

# హుదైబియా

# శాంతితో యుద్ధాలు గెలవవచ్చు

కందక యుద్ధంలో ఖురైష్ మిత్రపక్షాలపై మదీనా సాధించిన విజయంతో అరేబియా ద్వీపకల్పంలో పరిస్థితి చాలా మారింది. ప్రవక్త ముహమ్మద్, ముస్లిము రాజ్యం బలం ఎలాంటిదో కూడా తెలిసివచ్చింది. బైజాంటైన్, పర్షియన్ సామ్రాజ్యాల్లో ప్రవక్త ముహమ్మద్ గురించి చర్చలు మొదలయ్యాయి. అరబ్బుల బలమైన రాజుగా ఆయన పేరు ప్రచారం పొందింది. ఆయన్ను వారు ఎదురులేని ప్రాంతీయశక్తిగా చూడడం మొదలుపెట్టారు.

## రమజాన్ ఒక కల

రమజాన్ మాసం ప్రారంభమయ్యింది. ప్రవక్త ఎప్పటి మాదిరిగానే రాత్రి ప్రార్థనలు మరింత అధికం చేశారు. పేదలు అనాథలకు సహాయసహకారాల కార్యక్రమాలు కూడా అధికమయ్యాయి. ఆధ్యాత్మిక శిక్షణా మాసం రమజాన్. ఈ నెలలో ప్రవక్త దివ్యఖుర్ఆన్ మొత్తం దైవదూత జిబ్రయీల్‌కు వినిపించేవారు. ఈ మాసంలో ఆయన సాధారణ నమాజులను కూడా పొడిగించేవారు. రాత్రిళ్ళు ప్రత్యేక ప్రార్థనలు తరావీహ్ చేస్తుండేవారు. అలాగే దేవునికి విన్నవించుకోవడం, దుఆలు చేయడం కూడా చాలా ఎక్కువగా జరిగేది. స్త్రీపురుషులందరూ రమజాన్‌లో పగలంతా ఉపవాసం ఉండేవారు. అన్నపానీయాలకు, లైంగికవాంఛలకు దూరంగా ఉండేవారు. సహజవాంఛలను అదుపు చేయడం ద్వారా దైవిక లక్షణాల సామీప్యాన్ని పొందేవారు. ధ్యానంలో దైవసాన్నిహిత్యాన్ని అనుభూతి చెందేవారు.

రమజాన్ మాసం దివ్యఖుర్‌ఆన్ మాసం. ఇది కారుణ్యమాసం. ముస్లిమ్ స్త్రీపురుషులు, పిల్లలు కూడా రమజాన్ మాసం చివరిలో తప్పనిసరిగా ప్రత్యేక దానాలు చేయవలసి ఉంటుంది. దేవుని సాన్నిహిత్యం పొందాలన్న తపనతో చేసే ప్రయత్నాలన్నింటిలోను ముఖ్యమైనది తోటివారికి సహాయ సహకారాలందించడం ద్వారా దేవుని సాన్నిహిత్యాన్ని పొందే ప్రయత్నం. పేదలకు దగ్గరగా ఉండడం ద్వారా దేవునికి దగ్గరగా ఉంటాము.

ఆ రమజాన్ మాసంలో ప్రవక్త ముహమ్మద్ ఒక ఆశ్చర్యకరమైన స్వప్నాన్ని చూశారు. ఆయన కాబాగృహం లోకి ప్రవేశించినట్లు కలలో చూశారు. తలనీలాలు తొలగించుకుని, కుడిచేతిలో కాబాగృహం తాళాలు పట్టుకుని లోపలికి వెళుతున్నారు. ఈ కలకు అంతరార్థం ఆయన గ్రహించారు. మర్నాడు ఆయన తన అనుచరులకు ఈ కల గురించి చెప్పి మక్కాకు వెళుతున్నాం సిద్ధం కావాలని అన్నారు. మక్కాకు ఉమ్రా యాత్రకు వెళ్ళాలని నిర్ణయించారు (ఉమ్రా యాత్ర సంవత్సరంలో ఎప్పుడైనా చేసేది. హజ్ మాత్రం కేవలం నిర్దిష్ట మాసాల్లోనే చేయాలి).

పన్నెండు నుంచి పద్నాలుగు వందలమంది అనుచరులతో ఆయన ఉమ్రాయాత్రకు మక్కా బయలుదేరారు. ఈ యాత్ర చాలా ప్రమాదకరమైనది. కాని ప్రవక్త ఎలాంటి ఆయుధాలు ధరించరాదని ముందే కఠినంగా చెప్పారు. తనతో పాటు భార్య ఉమ్మె సలమాను తీసుకుని ఆయన బయలుదేరారు. ముస్లిముల ఒక బృందం మక్కాకు వస్తుందని ఖురైషులకు వర్తమానం అందింది. వారు కాబా సందర్శనానికి వస్తున్నారని కూడా తెలిసింది. కాబా యాత్రకు అరేబియా తెగలు వస్తూ ఉండడం వారి హక్కు. దీన్ని అడ్డుకోవడం కుదరదు.

## ఖురైషుల సమస్య

ఖురైషులకు ఇప్పుడు ఏం చేయాలో తెలియని ఒక అయోమయం. ప్రవక్తను ఆయన అనుచరులను రాకుండా అడ్డుకోవడం ఎలా? అలా అని ముస్లిములను మక్కాలో ప్రవేశించే అనుమతి ఇస్తే వారి ప్రతిష్ఠ మరింత పెరుగుతుంది. ముస్లిములు మక్కా దగ్గరకు రాకుండా అడ్డుకోవాలని ఖాలిద్ బిన్ వలీద్‌ను ఖురైషులు రెండువందలమంది సాయుధులనిచ్చి పంపించారు. మదీనాకు 310 కిలోమీటర్ల దూరంలో పవిత్ర ప్రదేశం హద్దుల్లో హుదైబియా అనే ప్రాంతం మక్కాకు 18 కిలోమీటర్ల దూరాన ఉంది. అక్కడ ప్రవక్త అధిరోహించిన ఒంటె ఖస్వా ఆగిపోయింది. ముందుకు నడవనని మొండికేసింది. అంతకు ముందు ఏడేళ్ళ క్రితం ప్రవక్త మదీనా వచ్చినప్పుడు కూడా ఈ ఒంటె ఒక ప్రదేశంలో ఆగిపోయి ముందుకు

సాగలేదు. ఇందులో దైవిక సూచన ఉందనుకున్నారు ప్రవక్త. ఆయన అక్కడ ఆగి ముస్లిములు మక్కా ప్రవేశించే విషయమై ఖురైషులతో చర్చించాలని నిర్ణయించారు.

ఖురైషులకు ఇది అర్థం కాని అయోమయంలో పడవేసింది. వారికి తెలిసిన సాంస్కృతిక, ధార్మిక, యుద్ధ సంప్రదాయాల్లో ఇలాంటిది ఎక్కడా చూడలేదు. ఆయన మదీనాలో అధికారాన్ని స్థిరపరచుకున్నారు. అలాంటి పరిస్థితిలో ఆయన నిరాయుధుడిగా మక్కా రావడమేమిటి, తన్ను తాను ప్రమాదంలో పడవేయడమేమిటి? కాని దేవుడు ఆయనకు శత్రువుల కన్నా ఎక్కువ ఆధిక్యత ప్రసాదించాడు.

మరో విషయమేమిటంటే ఆయన ఒక కొత్త మతాన్ని ప్రచారం చేస్తున్నారు. కాని వారి దాడుల నుంచి రక్షణగా పాత అరబ్బు సంప్రదాయాలపై ఆధారపడడానికి ఆయన వెనుకాడడం లేదు. ఇలా చేయడం ద్వారా ఆయన ఖురైషులను అయోమయంలో పడవేశారు. ఇప్పుడు ఖురైషులు తమ సంప్రదాయాలనైనా గౌరవించి ఆయన్ను మక్కాలోకి రానీయాలి. అలా చేస్తే ముస్లిముల ప్రతిష్ట పెరిగి తమ ప్రతిష్ట అడుగంటుతుంది. రానీయకుండా అడ్డుకుంటే తమ స్వంత సంప్రదాయాలనే కాలరాచినవారవుతారు.

# సంప్రదింపులు

ముస్లిములను అనుమతించరాదని ఖురైషులు తీర్మానించుకున్నారు. రాజకీయంగా దీనివల్ల వారికి చాలా నష్టం ఉంది. అంతేకాకుండా, అస్సలు ప్రవక్త ఉద్దేశ్యమేమిటన్నది వారికి అంతుబట్టడం లేదు. అందువల్ల బనూ ఖుజఆ తెగ నుంచి బుదాయిల్ ను తమ రాయబారిగా ముస్లిముల వద్దకు పంపాలని నిర్ణయించారు. ఆయనకు ఏ తెగతోను ఎలాంటి వైరం లేదు. అందువల్ల మధ్యవర్తిగా ఆయన వ్యవహరించాలని భావించారు. ఆయన ప్రవక్త వద్దకు వచ్చాడు. ప్రవక్త ఆయనతో మాట్లాడుతూ తాము యుద్ధం చేయడానికి రాలేదని, కేవలం ఉమ్రా యాత్రకు వచ్చామని చెప్పారు. అయితే ఇతర తెగల మాదిరిగా తమను స్వేచ్ఛగా కాబాలోకి ప్రవేశించకుండా ఎవరైనా అడ్డుకుంటే ఖచ్చితంగా పోరాడుతామని కూడా తెలియజేశారు. ఒకవేళ తమను అనుమతించడానికి ఖురైషులు సమయం కోరుతున్నట్లయితే తమకు అభ్యంతరం లేదని, ఇక్కడే హుదైబియా వద్ద వేచి ఉంటామని అన్నారు. బుదాయిల్ వెనక్కు వెళ్ళి ముస్లిములను మక్కాలోకి అనుమతించండని ఖురైషులకు సలహా ఇచ్చాడు. కాని ఆయన సలహాను ఎవరూ పట్టించుకోలేదు. అబూజహల్ కుమారుడు ఇక్రమా దాన్నితీవ్రంగా వ్యతిరేకించాడు.

నాలుగుసార్లు చర్చలు విఫలమయ్యాయి. ఖురైషులు మొండిపట్టు వదలడం లేదు. ప్రవక్త చివరిగా ఒక రాయబారిని పంపడానికి నిర్ణయించారు. మక్కాలో అందరూ గౌరవించే వ్యక్తి, ప్రవక్త సన్నిహిత అనుచరుడు, స్వయాన అల్లుడు ఉస్మాన్‌ను మక్కా పంపాలని భావించారు. ఉస్మాన్‌పై దాడి చేయడానికి మక్కాలో ఎవరూ సాహసించరు. ఉస్మాన్ అక్కడికి వెళ్ళారు. నిజానికి ఆయన్ను మక్కా ఖురైషులు చాలా ఆదరంగానే ఆహ్వానించారు. కాని ముస్లిములు మక్కాలో ప్రవేశించడానికి అనుమతించేది లేదని గట్టిగా తిరస్కరించారు. ఆయన వ్యక్తిగతంగా కాబా ప్రదక్షిణ చేయాలనుకుంటే చేయవచ్చునని అన్నారు. కాని ప్రవక్తను ఆయన అనుచరులును మక్కాలో అనుమతించే ప్రసక్తి లేదన్నారు. ఉస్మాన్ తనకు వారిచ్చిన అవకాశాన్ని తిరస్కరించారు. ఆయన చర్చలు సంప్రదింపులు అనుకున్న సమయం కన్నా కాస్త ఎక్కువ సమయం కొనసాగాయి. మూడు నాలుగు రోజుల వరకు ఆయన నుంచి ఎలాంటి సమాచారమూ ప్రవక్తకు చేరలేదు.

ఉస్మాన్‌ను ఖురైషులు హత్యచేసారన్న పుకారు ఎలాగో పుట్టింది. ప్రవక్తకు ఈ పుకారు చాలా బాధ కలిగించింది. ఖురైషులు చర్చలకు వచ్చిన రాయబారిని చంపుతారా, పవిత్రమాసంలో హత్యకు పాల్పడుతారా, కాబాని సందర్శించే తమ హక్కును కాదంటారా, కాబాను సందర్శించే హక్కు అన్ని తెగలకు ఉంది. దాన్ని కాదనే అధికారం ఎవరికీ లేదు. ఖురైషుల చర్య యుద్ధప్రకటనగానే తీసుకోవాలి. ఇక యుద్ధానికి సిద్ధం కావాలి.

# విధేయతా ప్రతిజ్ఞ

ప్రవక్త తన అనుచరులందరినీ పిలిచారు. అందరు వెంటనే సమావేశమయ్యారు. ఆయన ఒక చెట్టు కింద కూర్చున్నారు. ప్రతి ఒక్కరితో తనపట్ల విధేయతా ప్రతిజ్ఞ చేయించారు (బైతురిజ్వాన్). ఎలాంటి పరిస్థితులు ఎదురైనా తాము ప్రవక్తతోనే ఉంటామని వారు ఆ ప్రతిజ్ఞ ద్వారా స్పష్టం చేశారు. వారు అక్కడికి ఒక ధార్మిక యాత్ర కోసమని వచ్చారు. వారు నిరాయుధులుగా ఉన్నారు. ఇప్పుడు యుద్ధం వారిపై రుద్దబడుతోంది. ఈ యుద్ధానికి వారు సిద్ధంగా లేరు. వారు ప్రవక్తకు ప్రతిజ్ఞ చేయడమంటే అర్థం అవసరమైతే ప్రాణత్యాగానికి సిద్ధమని చెప్పడం. ఎందుకంటే, ఇప్పుడు వారి బలం చాలా తక్కువ. ఖురైషుల దాడిని తట్టుకునేస్థితిలో లేరు. ప్రవక్త తన ఎడమచేతిని కుడిచేతిపై ఉంచి, ఇది ఉస్మాన్ చేసిన ప్రతిజ్ఞ అని చెబుతూ ఆయన ఇప్పుడు లేరని, ఆయన ఇంకా తిరిగిరాలేదని, కాబట్టి మరణించినట్లు భావిస్తున్నామని అన్నారు.

అయితే చివరి అనుచరుడు తన ప్రతిజ్ఞ ముగించిన కొద్దిసేపటికే హఠాత్తుగా అక్కడికి

ఉస్మాన్ వచ్చారు. ఆయన్ను చూడగానే ప్రవక్తకు పట్టరాని ఆనందమనిపించింది. పవిత్రమాసాల్లో హింసకు దూరంగా ఉండాలన్న సంప్రదాయాన్ని ఖురైషులు వదులుకోలేదు. కాబట్టి ఇక ఖురైషులతో ఘర్షణ పడే పరిస్థితి లేదు. ఖురైషులు మరో రాయబారి సుహైల్‌ని పంపి ముస్లిములతో ఒప్పందానికి సిద్ధంగా ఉన్నారని తెలిసింది. ప్రవక్త ఆ రాయబారిని కలుసుకుని వారి ప్రతిపాదనలు పరిశీలించాలని భావించారు.

ఇప్పుడు పరిస్థితి కూడా మారింది. ప్రవక్త తన వారి తరఫున ప్రత్యక్షంగా తానే చర్చల్లో పాల్గొంటున్నారు. తీవ్రమైన సంకటపరిస్థితిలో వారంతా ఆయన పట్ల విధేయతా ప్రతిజ్ఞ చేశారు. ఇప్పుడు ఒప్పందపత్రంలో షరతులకు కట్టుబడే విషయంలోను అదే విధేయత వారు పాటించవలసి ఉంటుంది. దివ్యఖుర్‌ఆన్ ఈ ఒప్పందాన్ని ఇలా పేర్కొంది

> "విశ్వాసులు వృక్షం క్రింద నీతో విధేయతా ప్రమాణం చేస్తున్నప్పుడు అల్లాహ్ వారిని చూసి ఆనందించాడు." (దివ్యఖుర్‌ఆన్ 48:18)

ముస్లిములు వారి హక్కును కోరుతున్నారు. ఇటీవలి యుద్ధాల తర్వాత వారి ప్రతిష్ట కూడా పెరిగింది. కాబట్టి ఒకమెట్టు దిగి మాట్లాడవలసిన అవసరం కూడా లేదు.

## సృష్టికర్త - సృష్టి

చాలాకాలం తర్వాత ప్రవక్త ముహమ్మద్ పరలోకగతులైన తర్వాత, ఆ ప్రాంతం ఏ చెట్టు కింద ప్రవక్త కూర్చున్నారో ఆ ప్రదేశం ఎక్కడైతే ప్రవక్త తన అనుచరులతో విధేయతా ప్రతిజ్ఞ తీసుకున్నారో ఆ ప్రదేశం ప్రాముఖ్యం పెరిగింది. ప్రజలు దాన్ని పవిత్రమైన ప్రదేశంగా భావించడం ప్రారంభమయ్యింది. రోగులు దాని కింద కూర్చుని స్వస్థత పొందాలనుకునేవారు. ఇలా ఈ చెట్టు కింద కూర్చుంటే రోగాలు తగ్గుతాయన్న ప్రచారం ఊపందుకుంది. చివరకు ఆ చెట్టును పూజించే స్థాయికి చేరుకుంది. ప్రవక్త ఇలాంటి చర్యలను బోధించలేదు. ఇది ఇస్లామీయ ఏకేశ్వరోపాసనకు పూర్తిగా విరుద్ధమైనది. దేవునికి భాగస్వాములను కల్పించే చర్య. ఇస్లామీయ ఏకదైవారాధక విశ్వాసాన్ని బలిష్టం చేయడానికి, ప్రజల్లో ఈ దురాచారాన్ని దూరం చేయడానికి ఖలీఫా ఉమర్ ఆ చెట్టును వేళ్ళతో పెకలించి వేయమన్నారు. "ప్రజలు కేవలం సృష్టికర్తను మాత్రమే ఆరాధించాలి. ఆయన సృష్టించిన వాటిని కాదు" అని ఖచ్చితంగా చెప్పారు. దీన్ని బట్టి స్పష్టంగా తెలిసేదేమంటే ప్రవక్తకు సంబంధించిన ఏ చిహ్నమైనా దానికి దేవునితో సంబంధం కలిపే అవకాశం లేనేలేదు.

# హుదైబియా ఒప్పందం

ఇది మదీనా రాజ్యానికి, మక్కాలోని ఖురైషు ప్రజలకు మధ్య కుదిరిన ఒప్పందం. కామన్ ఎరా 628 మార్చి అంటే హిజ్రీ శకం ఆరవ సంవత్సరంలో ఈ ఒప్పందం కుదిరింది. ప్రవక్త ముహమ్మద్ ఖురైష్ రాయబారిని సగౌరవంగా ఆహ్వానించారు. సుహైల్‌తో పాటు మిర్కాజ్, హువాయిద్ అనే ఇద్దరు కూడా వచ్చారు. అనుచరులకు కొంత దూరంలో కూర్చుని చర్చలు ప్రారంభించారు. ఒప్పందంలోని ప్రతి అంశంపై చర్చ జరిగింది. చర్చలు కొన్నిసార్లు తీవ్రంగా కూడా జరిగాయి. చివరకు ఒప్పందం షరతులపై అంగీకారం కుదిరిన తర్వాత ఆ షరతులను పత్రంపై రాయమని ప్రవక్త తన అనుచరుడు అలీని కోరారు. అలీ సాధారణంగా ముస్లిముల సంప్రదాయం ప్రకారం బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్ అన్న వాక్యంతో ప్రారంభించారు. ఈ వాక్యానికి అర్థం అనంత కరుణామయుడు అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను. సుహైల్ దానికి అభ్యంతర పెట్టాడు. తమకు అర్రహ్మాన్ గురించి తెలియదని, ఒప్పందపత్రంలో బిస్మిక అల్లాహుమ్మ (నీ పేరుతో ఓ అల్లాహ్) అన్న వాక్యంతో ప్రారంభించాలని అన్నాడు. అల్లాహ్ అన్న పదం అరబ్బులందరికీ తెలిసిన పదమే. బహుదైవారాధకులు కూడా అల్లాహ్ ప్రధానదైవంగా విశ్వసించేవారు. అనుచరుల్లో కొందరు కోపంగా బిస్మిల్లా వాక్యాన్ని మార్చడానికి వీలులేదని అన్నారు. కాని ప్రవక్త కల్పించుకుని అలీతో బిస్మిక అల్లాహుమ్మ అనే మొదలుపెట్టమన్నారు.

ఆ తర్వాత ప్రవక్త ఒప్పంద పత్రాన్ని రాయిస్తు అలీతో ఈ ఒప్పందం దేవుని ప్రవక్త ముహమ్మద్‌కు, అమ్ర్ కుమారుడు సుహైల్‌కు మధ్య కుదిరింది అని రాయమన్నారు. సుహైల్ దీనికి కూడా అభ్యంతర పెట్టాడు. “మీరు దేవుని ప్రవక్తని మేం గుర్తించేదయితే మేము మీతో యుద్ధాలు చేసేవాళ్ళం కాదు కదా” అన్నాడు. దానికి బదులు అబ్దుల్లా కుమారుడు ముహమ్మద్ అని రాయమన్నాడు. కాని అప్పటికే అలీ ఎప్పుడు రాసే ఆ పంక్తిని రాశారు. ఆ వాక్యాన్ని మార్చడానికి అలీ ఒప్పుకోలేదు. ప్రవక్త కల్పించుకుని ఆ వాక్యం ఎక్కడ రాశావో చూపించమని అలీని అడిగారు. అలీ ఆయనకు ఎక్కడ రాసింది చూపించారు. ప్రవక్త స్వయంగా దాన్ని చెరిపేసి సుహైల్ చెప్పినట్లు రాయమన్నారు. అలీ, ఇతర అనుచరులు నిర్ఘాంతపోయి చూస్తున్నారు. ప్రవక్త ఏం చేస్తున్నారో వారికి అర్థం కాలేదు.

ఆ తర్వాత ఒప్పందంలోని షరతులు కూడా ముస్లిముల్లో అసంతృప్తిని మరింత పెంచాయి. ఆ షరతులన్నీ ముస్లిములకు ప్రతికూలంగా ఖురైషులకు అనుకూలంగా కనబడ్డాయి.

ఈ ఒప్పందం ఐదు ముఖ్యమైన షరతులపై ఆధారపడింది.

1. ఆ సంవత్సరం ముస్లిములు యాత్రచేయరాదు. వెనక్కి తిరిగి వెళ్ళిపోవాలి. మరుసటి సంవత్సరం వారు యాత్రకు రావచ్చు. మూడు రోజులకు మించి మక్కాలో ఉండరాదు.

2. ఇరుపక్షాలు పదేళ్ళ నిర్యుద్ధకాలానికి కట్టుబడాలి. అందరూ ఈ ప్రాంతాల్లో స్వేచ్ఛగా ప్రయాణించవచ్చు.

3. ఇరుపక్షాలలో ఏ పక్షంతోనైనా ఏదైనా తెగ చేరితే ఆ తెగకు కూడా ఈ షరతులు వర్తిస్తాయి.

4. ఎవరైనా ముస్లిమ్ మక్కా వదిలి మదీనాకు వస్తే వెంటనే అతడిని మక్కావాసులకు అప్పగించాలి. కాని ఎవరైనా మదీనా వదిలి మక్కావాసుల శరణు కోరితే అతడిని వెనక్కు పంపడం జరగదు.

5. కత్తులు ఒరల్లోనే ఉండాలి. ఎలాంటి ద్రోహానికి పాల్పడరాదు.

ఇలాంటి మరికొన్ని షరతులున్నాయి. ఇవన్నీ ముస్లిములకు వ్యతిరేకంగా, వారిని పరాభవించేలా ఉన్న షరతులు. కాని ప్రవక్త వాటన్నింటిని ఒప్పుకున్నారు. తాను శాంతి కోసమే వచ్చానని, మక్కావారి డిమాండ్లను ఒప్పుకుంటున్నానని అన్నారు.

## ఇద్దరు శత్రువుల మధ్య మదీనా

ప్రముఖ న్యాయవేత్త సరాఖీ ఒక మంచి పాయింట్ చెప్పారు. మదీనాకు ఉత్తరాన ఖైబర్ ఉంది. మక్కా దక్షిణాన ఉంది. ఆ విధంగా చూస్తే మదీనా ఇద్దరు శత్రువుల మధ్య ఇరుక్కుని ఉంది. ఖైబర్‌కు చెందిన యూదులు, మక్కాలోని ఖురైషులు మదీనా ముస్లిములతో యుద్ధాల్లో ఉన్నారు. వారిద్దరు మిత్రులే. ముస్లిములు వారిపై దాడి చేస్తే ఒకరికొకరు సహాయపడాలన్న ఒప్పందాలు వారిమధ్య ఉన్నాయి. ప్రవక్త ఖైబర్‌పై సైన్యాన్ని నడిపితే, ఇటు మక్కా సైన్యం దాడికి వస్తుంది. ఆయన మక్కావైపు సైన్యాన్ని నడిపితే ఖైబర్ సైన్యం మదీనావైపు వస్తుంది.

ఈ పరిస్థితిలో సమర్థుడైన సేనాధ్యక్షుడెవరైనా సరే యుద్ధం కోరుకోడు. పరిస్థితుల అవగాహన ఉన్న రాజకీయవేత్త శాంతి సాధించాలనే చూస్తాడు. ఒప్పందం ద్వారా ఒక శత్రువును యుద్ధానికి దూరంగా ఉంచగలగడం ఈ ఒప్పందం సాధించిన విజయం. ఇప్పుడు

రెండవ ప్రమాదాన్ని ఎదుర్కోవడం తేలిక. ఈ పరిస్థితుల్లోనే ఆయన ఖురైషుల షరతులకు తలొగ్గి ఒప్పందం చేసుకున్నారు. అసలు ఇద్దరు శత్రువులలో ఎవరితో శాంతి చేసుకోవాలన్న నిర్ణయమే కీలకమైనది. ఖైబర్‌తో శాంతి చేసుకోవాలా లేక మక్కాతో శాంతి చేసుకోవాలా? ఖైబర్‌తో శాంతి ప్రయత్నాలకు అవకాశం లేదు. బనూ నాదిర్ తెగ యూదుల్ని మదీనా నుంచి బహిష్కరించడం జరిగింది. వారు మదీనాలోకి మళ్ళీ అనుమతించాలని మొదటి షరతు పెడతారు. వారు సంపన్నులు కాబట్టి ఆర్థిక పరిహారాన్ని స్వీకరించే అవకాశం లేదు.

మరోవైపు మక్కాలో ఖురైషులు ప్రవక్తకు బంధువులున్నారు. మదీనాకు వలస వచ్చిన అనేకమంది ముస్లిముల బంధువులున్నారక్కడ. అందువల్ల యూదులతో సంధి చేసుకుని ఇక్కడ రక్తసంబంధీకులపై యుద్ధవాతావరణాన్ని కొనసాగించడం మంచిది కాదు. పైగా వరుసగా మూడు యుద్ధాల్లో మక్కా చాలా బలహీనమైంది. వారి ఆర్థిక స్థితి దిగజారింది. వాణిజ్యం కుప్పకూలింది. వారికి శాంతి అవసరం. అందువల్ల వారిని శాంతి ఒప్పందానికి సిద్ధం చేయడం సులభం. వివిధ కారణాల వల్ల మక్కావాసులు ముస్లిములతో శాంతి ఒప్పందానికి సిద్ధంగా ఉన్నారు. ముఖ్యంగా కరువు కాలంలో మక్కాప్రజల హృదయాలను ప్రవక్త గెలుచుకున్నారు.

ఒక్క షరతు విషయంలో తప్ప మిగిలిన షరతులన్నింటి విషయంలోను ఒప్పందంపై అంగీకారం కుదిరింది. ఆ ఒక్క షరతు సగం వాక్యంగా రాసిన షరతు. లా ఇస్లాల్ వ లాఇగ్లాల్. ఇది చాలా కీలకమైన షరతు. ఆ వాక్యానికి అర్థమేమిటంటే, ఆయుధాలు ఒరల్లోంచి బయటకు తీయరాదు. మోసానికి పాల్పడరాదు.

ఒప్పందం ప్రకారం మక్కాప్రజలు, మదీనా ప్రజలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకోరాదని అంగీకరించారు. ఒండొరులపై కుట్రలు కుతంత్రాలకు పాల్పడమని ఒప్పుకున్నారు. అంటే ఒకవేళ మదీనా ముస్లిములు మూడోపక్షంతో యుద్ధానికి దిగితే మక్కా తటస్థంగా ఉండాలి. ఈ విషయంలో కుట్రలు కుతంత్రాలు ఉండరాదు.

మక్కావారి షరతులన్నింటికీ ప్రవక్త ఒప్పుకున్నారు, కాని తన ఈ షరతుకు వారు ఒప్పుకోవలసిందేనని చెప్పారు. పదిసంవత్సరాల శాంతికాలానికి ఆయన అంగీకరించారు. మక్కా వాణిజ్యబృందాలకు మార్గం తెరవడానికి ఒప్పుకున్నారు. అందుకు బదులుగా భవిష్యత్తులో మదీనా ముస్లిమలు మూడో పక్షంతో యుద్ధానికి దిగితే మక్కా తటస్థంగా ఉండాలన్న ఖచ్చితమైన హామీ అడిగారు. ఆయన మక్కావైపు పురోగమించేబదులు, యాత్ర అక్కడే హుదైబియా వద్ద ముగించాలని అనుచరులకు చెప్పారు. అనుచరుల్లో తీవ్రమైన అసంతృప్తి, నిరాశ ఉన్నప్పటికీ ఆయనకు విధేయత చూపారు.

# అసంతృప్తి

ఒక అవమానకరమైన ఒప్పందానికి అంగీకరించి, కాబా యాత్ర చేయకుండానే వెనుదిరిగే పరిస్థితి.

ఉమర్‌కు ఈ పరిస్థితి భరించరానిదిగా తయారైంది. ఆయన ప్రవక్త వద్దకు వెళ్ళి తీవ్రంగానే తన అసంతృప్తిని ప్రకటించారు. వరుసగా అనేక ప్రశ్నలు వేశారు. “మీరు దైవప్రవక్త కాదా?”, “మీరు సత్యంపై లేరా?”, “మన శత్రువులు అంత బలంగా ఉన్నారా?”, “మనం ఇంత అవమానకరమైన షరతులకు ఎందుకు ఒప్పుకోవాలి?”, ఆయన ప్రశ్నలన్నింటిని ప్రవక్త మౌనంగా విన్నారు. కాని ఆయన మౌనంవల్ల ఉమర్ శాంతించలేదు. ఆయన అబూబక్ర్ వైపు తిరిగారు. అబూబక్ర్ ఆయన్ను శాంతించాలని చెప్పారు. ప్రవక్త చేసింది సరయినదే అనుకుంటున్నాను. శాంతించండి అన్నారు. ఉమర్ తన్ను తాను అదుపు చేసుకుని వెళ్ళిపోయారు. కాని ఈ ఒప్పందం ఒక అవమానమనే ఆయన భావించారు.

ఈ పరిస్థితి చూసి ముస్లిములు చాలా నిరాశకు గురయ్యారు. ప్రవక్త చర్యల వెనుక ఉన్న వివేకాన్ని వారు గ్రహించలేదు. ఆయన వారికి ధైర్యసాహసాలు, గౌరవమర్యాదలు నేర్పారు, కాని ఇప్పుడు ఒక అవమానకరమైన ఒప్పందానికి అంగీకరించారు.

ప్రవక్త తన అనుచరులతో పశువులను అక్కడే ఖుర్బానీ చేయమని ఆదేశించారు. కాని అనుచరుల్లో ఎవరు కూడా కదలలేదు. వారంతా తీవ్రమైన అసంతృప్తితో, నిరాశతో ఉన్నారు. ప్రవక్త మూడుసార్లు ఆదేశించినా వారు ప్రతిస్పందించలేదు. ప్రవక్త అనుచరులు ఆ కొద్దిపాటి అవిధేయతైనా చూపించడం అదే మొదటిసారి. ఆయన ఆశ్చర్యపోయారు, కాస్త నిరాశపడ్డారు, వెనుదిరిగి తన శిబిరంలోకి వెళ్ళి జరిగింది తన భార్య ఉమ్మె సలామాకు చెప్పారు. ఆయన చెప్పింది ఉమ్మె సలామా శ్రద్ధగా విన్నారు. మీరు కాస్త తెలివిగా, మౌనంగా వ్యవహరించండి అని సలహా ఇచ్చారు. బయటకు వెళ్ళి ఎవరికీ ఏమీ చెప్పకుండా మౌనంగా మీ ఒంటెను మీరు ఖుర్బానీ చేయండి. దాంతో వారికి ఒక ఉదాహరణ లభిస్తుంది. వారు మిమ్మల్ని అనుసరిస్తారు అన్నారామె. “ఓ ప్రవక్తా, ఈ పదిహేనువందల మందిని వారికి ఇష్టం లేని పని మీరు చేయించలేరు. మీరు మీ పని చేయండి. మీపై అల్లాహ్ విధించిన బాధ్యత నెరవేర్చండి. బయటకు వెళ్ళి మీ విధులు మీరు నిర్వర్తించండి. బహిరంగ ప్రదేశంలో చేయండి. వారందరూ చూడగలగాలి. అలా చేస్తే చాలు.” అన్నారు. ఆమె సలహాను ప్రవక్త చాలా శ్రద్ధగా విన్నారు. గొప్ప సమయస్ఫూర్తితో ఇచ్చిన సలహా అది. ఆయన బయటకు వచ్చారు. తిన్నగా తన ఒంటె వద్దకు వెళ్ళారు. దేవుని పేరు పలుకుతూ దాన్ని ఖుర్బానీ చేశారు. అనుచరులు ఇదంతా చూస్తున్నారు. ఒకరితర్వాత ఒకరుగా వారు లేచారు. అందరూ

ప్రవక్తను అనుసరించారు. ప్రవక్త తర్వాత శిరోముండనం చేయించుకున్నారు. అనుచరులు ఆయన్ను అనుసరించారు. మక్కాలో చేయవలసిన క్రతువులన్నీ అక్కడే ముగించారు.

## అంధవిశ్వాసం – వివేకం

ఒప్పందం గురించి తమ అభిప్రాయాలు తప్పని త్వరలోనే అనుచరులకు తెలిసిపోయింది. ప్రవక్త ముహమ్మద్ ఆధ్యాత్మిక స్థాయిని, హేతుబద్ధ వైఖరిని, అసమాన వివేకాన్ని, వ్యూహాత్మక చతురతను అర్థం చేసుకోవడంలో పొరబడ్డామన్నది వారికి తెలిసి వచ్చింది. ఆయన స్పష్టమైన సూచనల కోసం చూశారు. తన ఒంటె హుదైబియా వద్ద ఆగిపోగానే అక్కడే ముస్లిములు ఆ సంవత్సరం హుదైబియా మైదానం కన్నా ముందుకు వెళ్ళడం మంచిది కాదని గ్రహించారు. మొదటి నాలుగు సంప్రదింపులు విఫలమైనప్పుడు, ఖురైషులు మొండిగా వ్యవహరిస్తున్నప్పుడు ఆయన సహనం చూపడం అవసరమన్న నిర్ణయానికి వచ్చారు. ఆయనకు తన కల అంతరార్థం తెలుసు. ఆయన కలలో కాబాగృహంలోకి అడుగుపెడుతున్నట్లు చూశారు. అది తప్పక నిజం అవుతుంది. కాని ఎప్పుడన్నది వెంటనే తెలియడం లేదు.

ప్రవక్త పట్ల విధేయత ప్రతిజ్ఞ అనుచరులు యుద్ధం కారణంగా చేశారు. ఆ తర్వాత ఒప్పందంలోని షరతుల విషయంలో ఆ ప్రతిజ్ఞ ఉపయోగపడింది. పైగా ఖురైషుల ప్రతినిధి రెండు వాక్యాల విషయంలో, దేవుని విషయంలో, దైవప్రవక్త విషయంలో తిరస్కరించడం అనుచరులకు కోపం తెప్పించినా, ప్రవక్త మాత్రం ప్రత్యర్థి దృక్కోణంతో ఆలోచించారు. సుహైల్ అభిప్రాయాల ప్రకారం అతడు చెప్పింది నిజమే. నిజానికి ఖురైషులు ఆయన్ను దైవప్రవక్తగా ఒప్పుకున్నట్లయితే యుద్ధాలు జరిగేవే కాదు. కాబట్టి ఒక పక్షం అంగీకరించడానికి సిద్ధంగా లేని విషయాన్ని ఇరుపక్షాలు సమానస్థాయిలో చేసుకుంటున్న ఒప్పందంలో చేర్చడం సమ్మతం కాబోదు. కాని దైవప్రవక్త పట్ల అత్యంత గౌరవాదరాలు ఉన్న అనుచరులకు సుహైల్ వ్యవహారం ఆగ్రహం కలిగించింది. కాని ప్రవక్త ప్రత్యర్థి మాటల్లో ఉన్న నిజాయితీని గుర్తించారు.

ఇక్కడ ఆలోచించవలసిన విషయమేమంటే సత్యం పట్ల మన నిబద్ధత అంధవిశ్వాసంగా మారకూడదు. పరిస్థితిని విశ్లేషించే హేతుబద్ధమైన వైఖరి ఉండాలి. ఇతరుల అభిప్రాయాలను వారి దృక్కోణంలో అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలి. ముస్లిముల వైపు నుంచి ఆలోచిస్తే సుహైల్ అభ్యంతరాలు ఏమాత్రం భరించదగినవి కాదు. కాని నిష్పక్షపాత వైఖరితో ఇరుపక్షాలకు సమానస్థాయి కల్పించే విధంగా ఆలోచిస్తే సుహైల్ భావాలకు స్థానమివ్వవలసి ఉంటుంది.

ప్రవక్త ముహమ్మద్ ముస్లిముల ప్రతిష్ఠ కోసమని ఖురైషుల పట్ల అవమానకరమైన

షరతులేవీ పెట్టలేదు. కందక పోరాటం తర్వాత లభించిన పై చేయితో ఖురైషులను అణచాలని చూడలేదు. ఆ సంవత్సరం మక్కాలోకి రాకుండా వెనక్కి వెళతామని ఒప్పుకోవడం వెనుక ఖురైషుల ప్రతిష్ఠను కాపాడే ప్రయత్నమూ ఉంది. పైగా దీనివల్ల సుదీర్ఘకాలం శాంతి నెలకొంటుంది. శాంతి ఇరుపక్షాలకు అవసరమే. తర్వాత ఈ శాంతికాలం ముస్లిములకు చాలా ఉపయోగపడింది.

ముస్లిముల గౌరవప్రతిష్ఠలను కాపాడడానికి గాను ఖురైషుల పరాభవించాలని ప్రవక్త అనుకోలేదు. కందక యుద్ధ విజయం తర్వాత లభించిన పైచేయితో వారిని అణచాలని చూడలేదు. ఖురైషుల బలహీనతను దృష్టిలో ఉంచుకునే ఆ సంవత్సరం మక్కాలోకి ప్రవేశించకూడదన్న షరతుకు ఒప్పుకున్నారు. ఆ విధంగా ఖురైషుల ప్రతిష్ఠను కాపాడారు. దీని వల్ల దీర్ఘకాలిక శాంతికి అవకాశం కలిగింది. ఈ శాంతియుత వాతావరణం తర్వాత ముస్లిములకు అనుకూలంగా మారింది.

మక్కా నుంచి ఎవరైనా ముస్లిమ్ మదీనాకు వస్తే వెంటనే అప్పగించాలని, మదీనా నుంచి ఎవరైనా మక్కాశరణు కోరితే తిరిగి ఇవ్వమని పెట్టిన షరతు వల్ల నిజానికి ముస్లిములకు పెద్ద నష్టమేమీ కలుగలేదు. మదీనా వదిలివెళ్ళే ఒక ముస్లిమేతరుడిని మదీనాలోనే పట్టి ఉంచడం వల్ల ముస్లిములకు ఎలాంటి ప్రయోజనమూ ఉండదు. మక్కా నుంచి పారిపోయి వచ్చిన ఒక ముస్లిమ్‌ను తిరిగి అప్పగించడం బాధాకరమే అయినప్పటికీ దానివల్ల ఆ ముస్లిమ్ విశ్వాసం ఏమాత్రం చెక్కుచెదరలేదు.

# స్పష్టమైన విజయం

ప్రవక్త ముహమ్మద్ దేవునిపై దృఢమైన విశ్వాసం కలిగిఉన్నారు. ఆయన సత్యానికి ఎల్లప్పుడు కట్టుబడి ఉండేవారు. ఆయన మేధస్సు అత్యంత చురుకుగా పనిచేసేది. ఈ ఒప్పందం ద్వారా ఆయన పదేళ్ళ శాంతికాలాన్ని సాధించుకున్నారు. మరుసటి సంవత్సరం మక్కాకు వెళ్ళే అవకాశం దొరికింది. చాలా మంది అనుచరులు, ఉమర్‌తో సహా చాలా మంది అప్పటికప్పుడు లభించే ఫలితాలపై దృష్టిపెట్టారు. అందువల్లనే ఇది ఒక ఓటమిగా భావించి బాధపడ్డారు. ప్రవక్తతో వాగ్వివాదానికి దిగినందుకు ఆయన బాధపడ్డారు, కాని ఈ ఒప్పందం విషయంలో ఇది ఓటమి అనే భావించారు. వారు వెనుదిరిగి వెళుతున్నప్పుడు, ప్రవక్త పిలుస్తున్నారన్న వర్తమానం ఉమర్‌కు అందింది. తన దుందుడుకు స్వభావానికి ప్రవక్త కోపగిస్తారని ఆయన కొంత భయపడ్డారు. లేదా తన దుడుకు స్వభావాన్ని నిరసిస్తూ ఏదైనా ఖుర్ఆన్ వాక్యం అవతరించి ఉండవచ్చని కూడా భయపడ్డారు.

ప్రవక్త ముఖం ఉల్లాసంగా ఉండడాన్ని ఉమర్ చూశారు. ఉమర్ ఊహించని ఒక ఖుర్ఆన్ వాక్యం గురించి ప్రవక్త ఆయనకు తెలియజేశారు.

> దివ్యఖుర్ఆన్ వాక్యం ఇలా ప్రకటించింది "ఓ ప్రవక్తా! మేము నీకు స్పష్టమైన విజయాన్ని ప్రసాదించాము." (దివ్యఖుర్ఆన్ 48:1)

విధేయతా ప్రతిజ్ఞ గురించి కూడా ఖుర్ఆన్ ప్రస్తావించింది.

> "విశ్వాసులు వృక్షం క్రింద నీతో విధేయతా ప్రమాణం చేస్తున్నప్పుడు అల్లాహ్ వారిని చూసి ఆనందించాడు. వారి హృదయాల స్థితి ఆయనకు తెలుసు. వారికి సకీనత్ (శాంతి సంతృప్తులను) ప్రసాదించాడు. వారికి బహుమానంగా సమీపంలోని విజయాన్ని ప్రసాదించాడు." (దివ్యఖుర్ఆన్ 48 : 18)

ఇదంతా ప్రవక్త ముహమ్మద్ చూసిన కల నేపథ్యంలో

> "నిశ్చయంగా అల్లాహ్ తన ప్రవక్తకు సత్యమైన స్వప్నాన్ని చూపించాడు. అది పూర్తిగా సత్యానికి అనుగుణంగా ఉన్నది. అల్లాహ్ సంకల్పిస్తే, మీరు తప్పకుండా మస్జిదే హరామ్‌లో పూర్తి శాంతితో ప్రవేవిస్తారు. మీరు విరోముండనం చేయించుకొంటారు, వెండ్రుకలను కత్తిరించుకొంటారు. మీకు ఏ బయమూ ఉ ఒడదు. మీకు తెలియని విషయం ఆయనకు తెలుసు. కనుక ఆ స్వప్నం నిజం కాకముందే, ఆయన ఈ సమీప విజయాన్ని మీకు ప్రసాదించాడు."
> (దివ్యఖుర్ఆన్ 48:27)

జరిగిన సంఘటనలన్నీ ప్రస్తావిస్తూ అనుచరుల ధృక్కోణానికి విరుద్ధంగా కొత్త ధృక్కోణంలో పరిచయం చేయడం జరిగింది. నిజానిక యుద్ధం కోసం చేయించిన విధేయతా ప్రతిజ్ఞ తర్వాత శాంతి కోసం ఉపయోగపడింది. ఓటమిలా కనబడిన ఒప్పందం స్పష్టమైన విజయంగా వర్ణించబడింది. ఒక కల త్వరలోనే నిజం కాబోతుందన్న శుభవార్త ఇవ్వడం జరిగింది. మీరు పవిత్ర మస్జిదులోకి ప్రవేశిస్తారని తెలియజేయడం జరిగింది. కాని చాలా మంది అనుచరులు ఒప్పందం వల్ల లభించే ప్రయోజనాలను అర్థం చేసుకోలేకపోయారు.

ఈ ఒప్పందం నిజానికి ఆధ్యాత్మిక, మేధోపరమైన శక్తిసామర్థ్యాలకు నిదర్శనంగా నిలిచింది. ఎదుటి పక్షం చెప్పే మాటను వినడం, వారి ప్రతిష్ఠ పట్ల సానుకూలంగా స్పందించడం, ముందుచూపుతో వ్యవహరించడం ద్వారా ప్రవక్త తన వ్యక్తిత్వంలోని ప్రత్యేకతలను చాటి చెప్పారు.

# ఉమ్మె సల్మా సలహా

ప్రవక్త జీవితం మరోకోణంలో కూడా అందరికీ ఆదర్శం. అనుచరులు ఆయన ఆదేశానికి స్పందించకుండా ఉన్నప్పుడు ఆయన తన శిబిరానికి వెళ్ళి ఈ విషయాన్ని తన భార్యతో చర్చించారు. ఆమె ఆయన మాటలు విని ధైర్యం చెప్పడమే కాదు, మంచి సలహా ఇచ్చారు. ఆయన పట్ల తన విశ్వాసాన్ని వ్యక్తంచేయడమే కాదు, సమస్యకు పరిష్కారాన్ని కూడా చూపించారు. ఈ సంఘటన ప్రవక్త తన భార్యల పట్ల ఎలా వ్యవహరించేవారో తెలియజేస్తోంది. ఆయన మొదటి భార్య ఖదీజాతోను ఆయన ఇలాగే సమస్యలు చర్చించేవారు. ఆయన జీవితంలో వివిధ సందర్భాల్లో తన భార్యలతో సంప్రదించడం అనేక సందర్భాల్లో చూస్తాం. ఒక సంక్షోభ సమయంలో, విధేయతలు తడబడుతున్నప్పుడు, యుద్ధం, శాంతి మధ్య కొట్టుమిట్టాడుతున్నప్పుడు ఆయన ఒక మామూలు మనిషిలా తన భార్యతో సమస్యను పంచుకున్నారు. ఆమె నుంచి ప్రేమాభిమానాలు, సలహాలు ఆశించారు. ఇది ప్రతి మగవాడికి ఒక ఉదాహరణ

ఉమ్మె సలామా ధర్మపరాయణత కలిగిన మహిళ, వివేకవంతురాలు, అందమైనవారు, ప్రవక్త వద్ద ఆమె ప్రత్యేక పాత్ర పోషించేవారు. ఆయిషా ఒక సందర్భంలో తాను ఉమ్మె సలామా పట్ల అసూయ చెందుతున్నానని అన్నారు. ప్రవక్త ఆమె మాటలను వినేవారు. ఆమె అభిప్రాయాల ప్రభావం ఆయనపై ఉండేది.

# ఇస్లామ్‌కు తలుపులు తెరుచుకున్నాయి

ముస్లిములు మదీనా చేరుకున్నారు. సాధారణ జీవితం మళ్ళీ ప్రారంభమయ్యింది. ఇక యుద్ధప్రమాదాలు తొలిగిపోయాయి కాబట్టి ఇప్పుడు అంతర్గత సమస్యలపై దృష్టి పెట్టడానికి వీలయ్యింది. ఇస్లామ్ ప్రచారానికి, అభివృద్ధి పథకాలకు అవకాశం దొరికింది.

ఇస్లామ్ సందేశం అరేబియా ద్వీపకల్పంలో మూలమూలలకు వ్యాపించింది. ప్రతి తెగలోను ప్రవక్త బోధిస్తున్న సందేశాన్ని ఇష్టపడేవారు చాలా మంది ఉన్నారు. ప్రవక్త వ్యక్తిత్వం కూడా అంత విశిష్టమైనది. ఇస్లామ్‌లోకి రాకుండా ప్రజలను అనేక కారణాలు అంతవరకు అడ్డుకుంటూ వస్తున్నాయి. చాలా తెగలు ఇస్లామ్‌ను ఇష్టపడినప్పటికీ ఆ విషయాన్ని పైకి ప్రకటిస్తే ఖురైషులతో విరోధం కొని తెచ్చుకోవడమని, వారితో యుద్ధానికి దిగవలసి రావచ్చని భయపడుతూ వచ్చాయి. అందువల్ల ఖురైషుల ఆగ్రహానికి గురికావడం ఎందుకని మిన్నకుండిపోయాయి. పైగా ఖురైషులతో స్నేహసంబంధాల వల్ల లభించే ఆర్థిక ప్రయోజనాలు కూడా కోల్పోతామని భయపడ్డారు.

కాని హుదైబియా ఒప్పందం అలాంటి తెగలకు గొప్ప అవకాశాన్నిచ్చింది. ఈ ఒప్పందం వల్ల ద్వీపకల్పంలో యుద్ధమేఘాలు తొలగిపోయి శాంతివచ్చింది. ఇరుపక్షాలు నిర్యుద్ధ సంధి చేసుకున్నాయి. పదేళ్ళపాటు శాంతికాలాన్ని కొనసాగించాలని నిర్ణయించాయి. దీనివల్ల ఎవరైనా ముస్లిములుగా మారినా ఖురైషులు చర్య తీసుకునే పరిస్థితిలో లేరు. ఇక కొన్ని తెగలు ఇస్లామ్ స్వీకరించకుండా అడ్డుకునే కారణం ఏదీ మిగల్లేదు. ప్రజలు తండోపతండాలుగా ఇస్లామ్ స్వీకరించడం ప్రారంభమైంది.

యుద్ధాల కన్నా ఈ శాంతి ఒప్పందం వల్ల ముస్లిములకు చాలా ప్రయోజనం లభించింది. ఈ ఒప్పందం జరిగిన రెండుసంవత్సరాల్లోనే వేలాది మంది ఇస్లామ్ స్వీకరించారు. ఊగిసలాటలో ఉన్న చాలా మంది కూడా సమాజంలో ఒక పెద్దబలంగా ఇస్లామ్ ఏర్పడడాన్ని చూసి వెంటనే ఇస్లామ్‌వైపు వచ్చారు. ప్రవక్త కేవలం 1400 మందితో హుదైబియా వెళ్ళారు. ఆ తర్వాత రెండేళ్ళకు ఆయన మక్కాపై దాడికి వెళ్ళినప్పుడు ఆయనతో 10,000 మంది ఉన్నారు.

ఇస్లామ్ కొత్తగా స్వీకరిస్తున్న వారి శిక్షణకు ఏర్పాట్లు చేయవలసి ఉంది. అందుకు తగిన ఏర్పాటు చేయడం జరిగింది. అరబ్ ద్వీపకల్పంలో అత్యంత ప్రముఖులు ఇస్లామ్ స్వీకరించి మదీనా చేరుకున్నారు.

# గొప్ప పాఠం

హుదైబియా నేర్పే గొప్ప పాఠం ఏమంటే, మనిషి సహనంతో వ్యవహరించాలి. పైకి కనబడుతున్నదాన్ని చూసి నిర్ణయాలు తీసుకోరాదు. నిశితంగా పరిశీలించాలి. ముస్లిములకు ప్రతికూలంగా ఉన్న హుదైబియా ఒప్పందం వారికి గొప్ప విజయంగా మారింది. కేవలం ముందుచూపు ఉన్నవారు మాత్రమే దీన్ని గుర్తించగలరు. ఈ ఒప్పందం దౌత్యనీతిలో కొత్త పాఠాన్ని నేర్పింది. ఈ ఒప్పందాన్ని అనుచరుల్లో సహనభావాన్ని పెంచే అవకాశంగా కూడా ప్రవక్త ఉపయోగించుకున్నారు.

హుదైబియా ఒప్పందం గురించి అబూబక్ర్ చేసిన కొన్ని వ్యాఖ్యలను తర్వాత ఇబ్నె అసాకిర్ రికార్డు చేశారు. అది గొప్ప విజయంగా ఆయన అభివర్ణించారు. "ఆ రోజు ప్రజలు ప్రవక్తకు, దేవుడికి మధ్య ఉన్న రహస్యాలను తెలుసుకోవడంలో పొరబాటు చేశారు. ప్రజలు అసహనంగా ఉన్నారు, కాని దేవుడు కాదు, ఆయన వ్యవహారాలు వాటి దారిన కొనసాగనిచ్చాడు. ఆయన కోరిన ఫలితాల వరకు చేరనిచ్చాడు." అన్నారు. నిజానికి ప్రజలు అప్పటికప్పుడు ఫలితాలు కావాలనుకుంటారు. కాని వాస్తవదృష్టి వల్లనే ఫలితాలు లభిస్తాయి. ప్రజలు సహనం వహించారు. సుదీర్ఘకాలం వివిధ దశలను దాటడానికి ఇష్టపడరు అన్నారాయన.

# సరిహద్దులు దాటి వివిధ పాలకులకు

ఈ ఒప్పందం జరిగిన తర్వాత ముస్లిముల సంఖ్య రెట్టింపయ్యింది. ఈ కాలంలో ప్రవక్త వివిద సామ్రాజ్యాధినేతలకు, రాజులకు, పాలకులకు ఇస్లామీయ సందేశం లేఖల ద్వారా తెలిపి వారిని ఇస్లామ్‌లోకి ఆహ్వానించారు. ఒక వెండి ముద్రికను తయారు చేయించారు. దానిపై దైవప్రవక్త ముహమ్మద్ అన్న అక్షరాలు వేయించారు. ఈ ముద్రితో ఆ లేఖలై అధికారిక ముద్ర వేసి పంపించారు.

ఆవిధంగా అబిసీనియా రాజు నీగస్ ఇస్లామ్ స్వీకరణకు ముందు ప్రవక్త ముహమ్మద్ నుంచి ఈ లేఖను అందుకున్నారు. ప్రవక్త ముహమ్మద్ పర్షియా చక్రవర్తి కుస్రోకు, బైజాంటైన్ చక్రవర్తి హెర్క్యులిస్‌కు కూడా లేఖలు రాశారు. ఈజిప్టు పాలకుడు ముఖావిస్, బహ్రెయిన్ రాజు ముంజిర్, అరేబియాలో సిరియాకు ఆనుకుని ఉన్న ప్రాంతాల పాలకుడు అల్ హారిస్ తదితరులకు లేఖలు రాశారు.

ఈ లేఖల సారాంశం ఒక్కటే. తాను దైవప్రవక్తనని పరిచయం చేసుకుంటూ, దేవుడు ఒక్కడేఅన్న వాస్తవాన్ని గుర్తించాలని, ఇస్లామ్‌ను స్వీకరించాలని ఆ లేఖల్లో ఆహ్వానించారు. వారు తిరస్కరిస్తే వారి ప్రజలందరికీ సత్యం తెలుసుకునే అవకాశం నిరాకరించినందుకు దేవుని ముందు జవాబు చెప్పుకోవలసి ఉంటుందన్న హెచ్చరిక కూడా అందులో ఉంది. ఈ లేఖలకు విభిన్న ప్రతిస్పందనలు వచ్చాయి. నీగస్, ముంజిర్‌లు ప్రవక్త సందేశాన్ని అంగీకరించి ఇస్లామ్ స్వీకరించారు. ముఖావిస్, హెర్క్యులిస్‌లు లేఖ గౌరవంగా ఆ లేఖను స్వీకరించారు. ఇస్లామ్ స్వీకరించలేదు, విభేదించనూ లేదు. అల్‌హారిస్ వంటి వారు లేఖను తిరస్కరించడమే కాదు దాడి చేస్తామని హెచ్చరికలు పంపారు. ఏదిఏమైనా లేఖల సారాంశం అందరివద్దకు వెళ్ళింది. మదీనాలో ముస్లిమ్ సముదాయం స్థిరపడిందని, ఒక ప్రత్యేక ధార్మిక గుర్తింపు పొందిందని, ఒక ప్రాంతీయశక్తిగా ఎదిగిందన్న సందేశం అందరికీ వెళ్ళింది. ఈ రాజ్యానికి అధిపతి అబ్దుల్లా కుమారుడు ముహమ్మద్, ఆయనకు ఈ అధికారాన్ని దేవుడు ప్రసాదించాడు, ఆయన దైవప్రవక్త.

హుదైబియా ఒప్పందం ఒక విజయంగా ఇలా కూడా రుజువయ్యింది. ప్రపంచంలోని వివిధ ప్రాంతాలకు సందేశం చేరుకుంది. నిజానికి యుద్ధాల్లో ముస్లిమ్ సముదాయం శక్తిసామర్థ్యాలన్నీ వ్యర్థమయ్యేవి. ఆత్మరక్షణ ప్రతిఘటన ప్రయత్నాల్లోనే రోజులు గడిచిపోయేవి. కాని ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. శాంతియుత పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ పరిస్థితులను ఉపయోగించుకుని ప్రవక్త ఇస్లామీయ సందేశాన్ని వివిధ ప్రాంతాలకు చేరవేసే ప్రయత్నాలు ప్రారంభించారు. దేవుడు ఒక్కడే అన్న ఈ సందేశం మనుష్యులను అధికారపీఠాల దాస్యం నుంచి విముక్తి చేసింది. ఆధ్యాత్మిక, నైతిక ప్రమాణాలు పెంచింది. అరేబియాలో ఏర్పడిన శాంతియుత పరిస్థితి వల్ల అనేక తెగలు ఇస్లామీయ సందేశ సారాన్ని తెలుసుకునే అవకాశం దొరికింది. చాలా మంది ఇస్లామ్ స్వీకరించారు. కొందరు ఇస్లామ్ స్వీకరించకపోయినా దాని పట్ల గౌరవం చూపించారు. కొందరు పోరాడారు.

# 15

# ప్రవక్త ముహమ్మద్ ముస్లిమేతరులతో

సహకారం, పరస్పరచర్యలు, సంభాషణలు, సహనం మానవసమాజాల్లో ఉండాలని ఇస్లామ్ కోరుతుంది. ప్రవక్త ముహమ్మద్ సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ సహకారాన్ని కొనసాగించేవారు. జాతీయ, సాముదాయిక, సాంస్కృతిక తదితర అంశాలన్నింటా వారికి సహకారం అందించేవారు. ఆయన ఉన్నత వ్యక్తిత్వం, కారుణ్యం ముస్లిములకు, ముస్లిమేతరులకు అందరిపట్ల ఒకేవిధంగా ఉండేవి. మానవ సమాజాల విషయంలో ఇస్లామీయ దృక్పథాన్ని చాటి చెప్పే కొన్ని వివరాలు కింద చదవండి.

## మక్కాలో ముస్లిమేతరులతో సంబంధాలు

### వ్యాపారభాగస్వాములుగా ముస్లిమేతరులు

ప్రవక్త యుక్తవయస్సు నుంచి భాగస్వామ్య ప్రాతిపదికన వాణిజ్యం నిర్వహించారు. ఆయన మక్కా వ్యాపారుల సరుకులను సిరియా, ఎమన్ తీసుకువెళ్ళేవారు. లాభాల్లో వాటా తీసుకునేవారు. సంపన్న మహిళ ఖదీజాతో వివాహం తర్వాత భార్యాభర్తలిరువురు సంయుక్తంగా వాణిజ్యం నిర్వహించారు. ప్రవక్తగా మారిని తర్వాత ఆయన పూర్తికాలం ప్రవక్త విధిబాధ్యతల నిర్వహణకే వెచ్చించేవారు. వ్యాపారం చేసే సమయం ఆయనకు ఉ

ండేది కాదు. అందువల్ల ఆయన తన సరుకులను ఖురైష్ వ్యాపారులతో పంపేవారు. ఖురైషేతర ఏజంట్లతో కూడా లావాదేవీలు జరిపేవారు. దీనివల్ల ఆయన ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది. వ్యాపారం నిమిత్తం ప్రవక్త తన సరుకులను ముస్లిమేతర వ్యాపారి అబూసుఫియానతో సిరియా పంపారు. అందులో ఆయనకు చాలా లాభాలు వచ్చాయి. ఒక వ్యాపారిగా అబూసుఫియాన్ చాకచక్యంపై, నిజాయితీపై ఆయనకు చాలా నమ్మకం ఉండేది. ప్రవక్త ముహమ్మద్ ఇస్లామీయ సందేశ ప్రచారం గురించి తెలిసినప్పటికీ అబూసుఫియాన్ ఆయనతో వ్యాపారలావాదేవీలు మానలేదు.

ఇబ్నే కసీర్ ఒక సంఘటన వివరించారు. ఒకసారి అబూసుఫియాన్ వ్యాపారం నిమిత్తం సిరియా, ఎమన్‌లకు వెళ్ళారు. ఆయనతో పాటు మిత్రుడు ఉమయ్యా ఉన్నారు. ఐదునెలల తర్వాత ఆయన మక్కా తిరిగివచ్చారు. వారి పెట్టుబడుల గురించి అడగడానికి చాలా మంది వచ్చారు. ప్రవక్త ముహమ్మద్ కూడా ఆయనవద్దకు వెళ్ళారు. అప్పుడు అబూసుఫియాన్ భార్య హింద్ పిల్లలతో ఆడుకుంటున్నది. ప్రవక్త అబూసూఫియాన్‌ను పలకరించి, క్షేమంగా వచ్చినందుకు శుభాకాంక్షలందించారు. ఆయన ప్రయాణం గురించి అక్కడ బస చేసిన ప్రదేశాల గురించి అడిగారు. కాని తన వాటా గురించి ఒక్క ప్రశ్న కూడా అడగలేదు. ప్రవక్త వెళ్ళిపోయిన తర్వాత అబూసుఫియాన్ తన భార్యతో "ఈ మనిషి మంచి ముత్యం. నాకు ఈయనంటే చాలా ఇష్టం. ప్రతి ఖురైష్ నాకు తన సరుకులు ఇచ్చిన ప్రతి ఒక్కడు తన లాభాల గురించి అడిగాడు. కాని ఈ మనిషి మాత్రం తన సరుకు గురించి ఒక్క ప్రశ్న అడగలేదు." అన్నాడు. ఆ తర్వాత అబూసుఫియాన్ కాబాగృహానికి వెళ్ళి అక్కడ ప్రవక్త ముహమ్మద్‌ని కలిశాడు. ఆయనకు వచ్చిన లాభాల గురించి చెప్పి తన వద్ద నుంచి తీసుకొమ్మని అన్నారు. అబూసుఫియాన్ సాధారణంగా తాను తీసుకునే కమీషన్ కూడా తీసుకోనన్నాడు. కాని ప్రవక్త బలవంతం చేసి ఆయన కమీషన్ ఇచ్చేశారు.

ఒకరోజు ప్రవక్త ఇస్లామ్ గురించి బోధిస్తున్నప్పుడు అబూసుఫియాన్ తన వాణిజ్య పర్యటన నుంచి తిరిగవచ్చాడు. ఆయన సిరియాకు అనేకమంది సరుకులతో పాటు ప్రవక్త సరుకులను కూడా తీసుకునివెళ్ళాడు. ప్రవక్త ఆయన వచ్చాడని తెలిసి, అబూసుఫియాన్ వ్యాపారంలో చాలా నిజాయితీగా ఉంటాడని వ్యాఖ్యనించారు.

## వర్తక సంబంధాలు

సమాజంలో సాంఘీక జీవనానికి ఆర్థికవ్యవస్థే ప్రాణం. సంపద అనేది శరీరంలో రక్తం లాంటిది. సముదాయం ఉనికికి ఎంతైనా అవసరం. ప్రజలు ఆర్థికంగా సరయిన స్థితిలో

లేకపోతే, ఇతరులపై ఆధారపడి ఉంటే, వారి జీవితాలు కడగండ్ల పాలవుతాయి. ప్రవక్త ముహమ్మద్, కొందరు మక్కా ముస్లిములు మౌలికంగా వ్యాపారులు. సామాజిక, ఆర్థిక జీవితాల్లో సంపద ప్రాముఖ్యం ఏమిటో బాగా తెలిసినవారు.

ప్రవక్త ముహమ్మద్ ఆయన అనుచరులు తమ కాళ్ళపై తాము నిలబడాలనుకున్నారు. ఆ విధంగా తమ ఆర్థిక జీవనాన్ని నిలబెట్టుకోవాలనుకున్నారు. వారు తమ వ్యాపార కార్యకలాపాల కోసం ఒక చక్కని పథకం రచించారు. వ్యవస్థీకృతంగా దాన్ని అమలు చేశారు. ఒక్క అబూసుఫియాన్‌తో మాత్రమే కాదు, ప్రవక్త ముహమ్మద్‌కు ఇతర తెగల అరబ్బు వర్తకులతో కూడా వాణిజ్య సంబంధాలుండేవి. ముస్లిమేతరుల్లో ఆయనతో వర్తకసంబంధాలున్న వారిలో ప్రముఖులు హాకిమ్, అబ్దుల్లా, అల్‌తైమీ, అల్ సాయిబ్, ఖైస్. అల్‌బగ్దాదీ తదితర రచయితలు ప్రవక్త ఖురైష్ వ్యాపారులతో సంబంధాల గురించి విస్తృతంగా రాశారు. అల్ బగ్దాదీ దాదాపు 58 మంది ముస్లిమ్, ముస్లిమేతర వర్తక భాగస్వాముల గురించిరాశారు.

ఇక ప్రవక్త అనుచరుల్లో అబ్దుల్ అబ్దుర్రహ్మాన్ ఔఫ్ కూడా ముస్లిమేతర వ్యాపారితో భాగస్వామ్య కలిగి ఉండేవారు. ఆయనకు దగ్గరి మిత్రుడు వ్యాపార భాగస్వామి ఉమయ్యా ఇబ్నే ఖలఫ్. ఇతను మక్కాలో ప్రముఖ వ్యాపారి. ఇస్లామ్‌ను తీవ్రంగా వ్యతరేకించేవాడు. ఖురైష్ నాయకుడు ఉత్బా కుమారుడు అల్ వాలిద్‌తో అబ్బాస్ వ్యాపార సంబంధాలు కలిగి ఉండేవారు. అబ్బాస్, అబూసుఫియాన్ ఇద్దరు కూడా వ్యాపార భాగస్వాములే. వారిద్దరు భాగస్వాములుగా, మంచి మిత్రులుగా జీవితాంతం ఉన్నారు. యుద్ధాలు వారి సంబంధాలను దెబ్బతీయలేదు. మతపరమైన విభేదాలు వారి సంబంధాలపై ప్రభావం వేయలేదు.

## వైవాహిక సంబంధాలు

మక్కా కాలంలో ముస్లిములకు, ముస్లిమేతర ఖురైషులకు మధ్య వైవాహిక సంబంధాలను పరిశీలిస్తే, ప్రవక్త పెద్ద కుమార్తె జైనబ్ వివాహం అబుల్ ఆస్‌తో జరిగింది. ఆయన ముస్లిమ్ కాదు. అబుల్ ఆస్ నిజానికి ఖదీజాకు దగ్గరి బంధువు. ఇబ్నే హిష్షామ్ ప్రకారం, ఇస్లామ్‌కు ముందే వీరిద్దరి మధ్య నిశ్చితార్థం స్వయంగా ఖదీజా జరిపారు. ప్రవక్త కూడా ఈ సంబంధాన్ని ఇష్టపడ్డారు. (ముస్లిమ్ మహిళలు ముస్లిమేతర పురుషులనతు వివాహమాడ్డాన్ని నిషేధించిన ఖుర్ఆన్ ఆదేశం అప్పటికీ అవతరించలేదు.)

ఇంకో ఆసక్తికరమైన విషయాన్ని ఇబ్నే సాద్ వివరించారు. నిజానికి మక్కా నాయకుడు ముతీమ్ కుమారుడు జుబైర్‌తో ఆయిషా వివాహం జరగవలసింది. అబూతాలిబ్ మరణించిన

తర్వాత ప్రవక్త ముహమ్మద్‌కు శరణు పొడిగించిన వ్యక్తి ముతీమ్. కాని తర్వాత ముతీమ్ ఆయన కుటుంబం ఒక ముస్లిమ్ వధువును స్వీకరించడానికి ఇష్టపడలేదు. ఆమె తమ కుటుంబంలో ఇస్లామ్ స్వీకరించేలా ఒత్తిడి చేస్తుందని భయపడ్డారు. ఈ సంఘటన కూడా రెండు సముదాయాల మధ్య వైవాహిక సంబంధాలు ఉండేవని తెలుపుతుంది.

## ఖురైష్ మెజారిటీ ముస్లిమ్ మైనారిటీ సంకీర్ణ ప్రభుత్వం

ప్రవక్త కాలంలో ఖురైష్ తెగ పన్నెండు అతి ముఖ్యమైన రాజకీయ, సామాజిక హోదాలు కలిగి ఉండేది. ఇవి వారసత్వంగా ఖురైష్‌లోని పన్నెండు ముఖ్యమైన కుటుంబాలకు లభించేవి. ఇందులో కొన్ని కుటుంబాలు ఇస్లామ్ స్వీకరించాయి. ఉదాహరణకు అబూబక్ర్ ప్రారంభకాలంలోనే ఇస్లామ్ స్వీకరించారు. తర్వాత ఉమర్ ఇస్లామ్ స్వీకరించారు. అబ్బాస్ కూడా ప్రారంభకాలంలోనే ఇస్లామ్ స్వీకరించారు. ఉస్మాన్, ఖాలిద్‌లు కూడా ఇస్లామ్ స్వీకరించారు. దాదాపు సగం మంది ఖురైష్ నాయకులు తమ పూర్వికుల ధర్మాన్ని వదిలి ఇస్లామ్ స్వీకరించారు. కాని వంశపారంపర్యంగా వారికి లభించిన హోదా అలాగే కొనసాగింది. ఎందుకంటే, అరబ్బు తెగలు వారినే తమ వ్యవహారాలు నడపాలని కోరేవి. అందువల్ల ఇస్లామ్ స్వీకరించిన తర్వాత కూడా వీరు తమ తెగల వ్యవహారాలు చూసేవారు. మక్కా నాయకులతో సహకారం అందించేవారు. ఇది మదీనాకు వలసపోయే వరకు కొనసాగింది. అంటే అంత కాలం మక్కా పరిపాలన ముస్లిమ్, ముస్లిమేతర సంకీర్ణ వ్యవస్థ ద్వారానే నడిచింది. ప్రవక్త ఎల్లప్పుడు స్నేహపూర్వకమైన, సుహృద్భావ సంబంధాల కోసమే ప్రయత్నించేవారు. రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక అంశాల్లో సహకారాన్నే ప్రోత్సహించారు. ఖురైషులు కూడా తమ ప్రయోజనాల దృష్ట్యా వాటినే అనుసరించారు.

# సామాజిక సంబంధాలు

## ప్రవక్త ఇచ్చిన విందులు

ఇస్లామ్ సందేశాన్ని బహిరంగంగా ప్రచారం చేయాలన్న దైవిక ఆదేశాలు అందిన తర్వాత ప్రవక్త ముహమ్మద్ ముస్లిమేతర ఖురైషులకు ఒక విందు ఏర్పాటు చేశారు. సామాజిక సంబంధాలను మెరుగుపరచడానికి, ఇస్లామ్ సందేశం ప్రచారం చేయడానికి ఈ విందు ఏర్పాటు జరిగింది. ఇది అరబ్బు సామాజిక సంప్రదాయాలను ప్రతిబింబిస్తుంది. ప్రవక్త ముహమ్మద్, ఆయన అనుచరులు దీన్ని క్రమం తప్పకుండా కొనసాగించారు. అబూబక్ర్

తన ఇంటికి ఉస్మాన్, జుబైర్, తల్హా, అబ్దుర్రహ్మాన్, సాద్‌లను విందుకు ఆహ్వానించారు. ఇది ఈ ప్రముఖులు ఇస్లామ్ స్వీకరించక ముందు జరిగిన విందు.

## బానిసలను కొని స్వేచ్ఛ ఇవ్వడం

ప్రవక్త అనేకమంది ముస్లిమేతర బానిసలను వారి క్రూరులైన యజమానుల నుంచి కొని వారికి స్వేచ్ఛ ఇచ్చేవారు. స్వేచ్ఛ ఇవ్వబడిన బానిసకు స్వతంత్రుడితో సమానస్థాయి కల్పించారు. ప్రవక్త మృదువైఖరి వారికి ఎంతో ఉపశమనం ఇచ్చేది. కొందరు సంపన్నులైన అనుచరులు కూడా బానిసలను కొని వారికి స్వేచ్ఛ ఇచ్చేవారు. ప్రవక్త సంపన్నులైన ముస్లిములను ఇలా చేయమని ప్రోత్సహించేవారు. ముస్లిమ్ సమాజంలోనిక సంపన్నులందరూ ఆయన మాటలను పాటించారు. ముస్లిముల మాత, ప్రవక్త మొదటి భార్య ఖదీజా తన సంపదనంతా ఈ పుణ్యకార్యం కోసం అర్పించారు. అబూబక్ర్ అనేకమంది బానిసలను విడిపించారు. ఈ విధంగా బలహీనులను ఆదుకోవడం జరిగింది. మక్కా కాలంలో అబూ బక్ర్ వద్ద నలభైవేలకు మించి దిర్హముల సంపద ఉండేది. ఇది కాక ఆయన వద్ద లెక్కకు మించి ఆస్తులు, బంగారం ఉండేవి. బానిసలను విడుదల చేయించడానికి ఆయన ఇదంతా ఖర్చు పెడుతూ వచ్చారు. మక్కా వదిలి మదీనా తరలి పోతున్నప్పుడు ఆయన వద్ద కేవలం ఐదువేల దిర్హములు మిగిలాయి. అది కూడా ఆయన ముస్లిమ్ సముదాయం కోసమే ఖర్చు చేశారు. ఉమర్, అబ్దుర్రహ్మాన్ వంటి సంపన్నులు తమ సంపదను ఉదారంగా బానిసల స్వేచ్ఛ కోసంఖర్చు చేశారు. అబ్దుల్లా అల్ నహ్హామ్ అనేకమంది ముస్లిమేతర బానిసల విడుదలకు తోడ్పడ్డారు. ఈ దానగుణం చూసి ఖురైషుల్లో మతదురభిమానం అధికంగా ఉన్నవాళ్ళు కూడా మెచ్చుకోకుండా ఉండలేకపోయారు. నహ్హామ్ మదీనా వెళ్ళాలనుకున్నప్పుడు వారు ఆయన్ను వదలడానికి ఇష్టపడలేదు. ఆయన ఆదుకుంటున్న అనాథలు, నిరుపేదలను ఆ తర్వాత ఎవరు చూస్తారన్న భయం కూడా వారిలో ఉండేది. ఆయన నిరుపేదలను ఆదుకోవాలన్న ఇస్లామీయ ఆదేశాలను ఆదర్శవంతంగా అమలు చేసి చూపించారు.

## అత్యున్నత గౌరవం

వివిధ తెగలతో ప్రవక్త ముహమ్మద్ పటిష్టమైన సంబంధాలు కలిగి ఉండేవారు. తన బంధువుల్లో, ఇస్లామ్ స్వీకరించని వారితోను ఆయన సంబంధాలు పటిష్టంగా ఉండేవి. ఆయన పినతండ్రి అబూతాలిబ్ ఇస్లామ్ స్వీకరించలేదు. ఆయన వల్లనే ప్రవక్తకు ఖురైషుల

నుంచి దాడుల ప్రమాదం లేని శరణు లభించింది. ఆయన తన తుదిశ్వాస విడుస్తున్నప్పుడు ప్రవక్త ఆయన వద్దకు వెళ్ళారు. ప్రవక్తకు శరణు ఇచ్చినందుకు తనకు సంతోషంగా ఉందని ఆయన చెప్పాడు. ఎప్పుడు న్యాయంగా వ్యవహరించే మనిషికి శరణు ఇచ్చానని అన్నారు. ఆయన ప్రవక్తను చాలా ప్రేమించేవారు. చాలా హుందాగా వ్యవహరించేవారు. కాని ఇస్లామ్ స్వీకరించలేదు. ఆయన్ను ప్రవక్త చాలా ప్రేమించారు. చాలా గౌరవించారు. ఆయన మరణం ప్రవక్తకు చాలా విషాదకారణమైంది.

# దృఢమైన నమ్మకం

మరో పినతండ్రి అబ్బాస్ ఇస్లామ్ స్వీకరించకపోయిన ప్రవక్తకు మద్దతుగా నిలబడ్డారు. ప్రవక్తకు ఆయన మీద చెప్పరాని నమ్మకం. ముస్లిమ్ సముదాయం భవిష్యత్తుకు సంబంధించిన రహస్య సంప్రదింపుల్లో కూడా అబ్బాస్ ఉండడాన్ని ప్రవక్త ఆమోదించేవారు. అబ్బాస్‌తో అనేక విషయలు చర్చించేవారు. అల్ అక్బా వద్ద మదీనా ప్రతినిధి బృందంతో జరిగిన రెండవసమావేశంలోను అబ్బాస్ ఉన్నారు. అత్యంత రహస్యమైన సమాచారాన్ని, మదీనాకు వలసపోయే సమాచారాన్ని కూడా ఆయనకు చెప్పడానికి ప్రవక్త వెనుకాడలేదు. అబ్బాస్ బహుదైవారాధకుడిగా ఉన్నప్పటికీ ప్రవక్తను చాలా గౌరవించేవారు. ఆయన ప్రమాదాలకు కూడా భయపడకుండా ప్రవక్తకు సహాయమందించారు.

# నిజాయితీ

ఇస్లామ్ పట్ల నమ్మకంలేనివారు కూడా ప్రవక్తను నిజాయితీకి ప్రతిరూపమని నమ్మేవారు. మక్కా నగరంలో ఆయన ఉన్నంత కాలం, ఇస్లామ్‌ను వ్యతిరేకించిన అనేకమంది ఖురైషులు తమ సంపదను ఆయన వద్దనే దాచుకునేవారు. అనేకమంది ముస్లిమేతర వర్తకులు తమ సంపదను ఆయన మీద విశ్వాసంతో ఆయనకే అప్పగించేవారు. మదీనాకు ఆయన వలసపోతున్నప్పుడు అలీని అక్కడే వదిలి ఎవరి సంపద వారికి వాపసు ఇవ్వమని ఆదేశించారు. ఆయన నిజాయితీకి పూర్తిగా కట్టుబడ్డారు. న్యాయానికి నిలబడ్డారు. ఈ సూత్రాలనే ఇస్లామ్ బోధిస్తోంది. ఎవరి విషయంలోనైనా, ముస్లిములైనా, ముస్లిమేతరులైనా న్యాయం, నిజాయితీలకు కట్టుబడి వ్యవహరించాలి.

# విశ్వసనీయత

ప్రవక్త ముహమ్మద్, ఆయన అనుచరుడు అబూబక్ర్ మదీనాకు వలసపోవాలని నిర్ణయించుకున్నారు. తమ వ్యవహారాన్ని దేవునికే అప్పగించారు. ఈ పరిస్థితిలో కూడా వారు తమ శత్రువుల మతవిశ్వాసాలను పాటించే ఒక ముస్లిమేతర గైడ్ సహాయం తీసుకోడానికి వెనుకాడలేదు. ఆ ముస్లిమేతరుడు నమ్మదగ్గ వ్యక్తి, నైపుణ్యం కలిగినవాడు. మక్కా నుంచి మదీనాకు దుర్గమమైన దారుల్లో ఎవరి కంటా పడకుండా వారిని చేర్చవలసిన బాధ్యత అతడిపై ఉంది. ఖురైషులు ప్రవక్తను పట్టి తీసుకొచ్చిన వారికి వంద ఎర్ర ఒంటెల బహుమతి ప్రకటించిన ప్రమాదకరమైన పరిస్థితి అది. ప్రవక్తను మోసగిస్తే తనకు లభించే రివార్డు గురించి కూడా అతడికి తెలుసు. కాని అతను నిజాయితీగా ప్రవక్తను మదీనా చేర్చాడు. తన మాటపై నిలబడ్డాడు.

# మంచితనం

ప్రతిరోజు ప్రవక్త తన ఇంటి నుంచి కాబాగృహానికి వెళుతున్నప్పుడు ఒక వృద్ధ మహిళ ఆయన దారిలో చెత్తాచెదారం పారేసేది. ప్రవక్త తమ తాతముత్తాతల మతాన్ని కాదని ఇస్లామ్ సందేశం ప్రచారం చేయడం ఆమెకు ఇష్టం లేదు. ఒకరోజు ప్రవక్తకు దారిలో చెత్త కనబడలేదు. ఆయన ఆమె ఇంటికి వెళ్ళారు. ఆయన్ను తన ఇంటికి రావడం చూసి ఆమె నిర్ఘాంతపోయింది. ఎందుకొచ్చారని అడిగింది. ప్రవక్త ఆమెతో మాట్లాడుతూ, దారిలో చెత్త కనబడలేదు, మీ ఆరోగ్యం ఎలా ఉందో ఒకసారి చూసిపోదామని వచ్చాను అన్నారు. ఆమె ఈ మంచితనం చూసి ముచ్చటపడింది. తాను చేసిన పనికి సిగ్గుపడింది. ప్రవక్త వ్యక్తిత్వం ఆమెను ఎంతగా ప్రభావితం చేసిందంటే, ఇస్లామ్‌ను ద్వేషించిన ఆమె వెంటనే ఇస్లామ్ స్వీకరించింది.

# దయాస్వభావం

మక్కా విజయం తర్వాత ప్రవక్త ఒకరోజు మక్కా వీథుల్లో పరిస్థితిని పరిశీలించడానికి తిరుగుతున్నారు. దారిలో ఒక వృద్ధమహిళ భుజాలపై మూట ఒకటి పెట్టుకుని నడవలేక నడవడాన్ని గమనించారు. ఆమె మక్కా వదలి పోతున్నది. మక్కా ఆమె మూటను తన భుజాలపై పెట్టుకుని ఆమెను మక్కా శివార్ల వరకు తీసుకువెళ్ళారు. నడుస్తూ, ఇంత చీకటివేళ

ఆమె మక్కా వదిలి ఎందుకు వెళుతున్నదో ప్రవక్త అడిగారు. ఆమె జవాబిస్తూ "మక్కాను ప్రవక్త ఆక్రమించుకున్నాడు. నేను ముస్లిమేతరురాలిని. ప్రవక్త సైన్యం నన్ను బంధించి తీసుకెళ్ళవచ్చు. నాకు హాని చేయవచ్చు. వాళ్ళు విజేతలు కదా, మక్కాను నాశనం చేస్తారు. అదంతా నేను చూడాలనుకోవడం లేదు" అంది. తనకు ఈ పరిస్థితి వచ్చినందుకు ఆమె ప్రవక్తను నానావిధాలుగా శపించింది. నాకు ఇంత సహాయం చేసిన నీ మేలు మరువలేనన్నది. అంతసేపు మాట్లాడిన ఆ మహిళ చివరికి నీవెవరు నాయనా అని అడిగింది. ముస్లిములు నిన్ను బంధించవచ్చు జాగ్రత్త అని కూడా చెప్పింది. ప్రవక్త చిరునవ్వుతో, నేను ఆ ముహమ్మద్‌ని అన్నారు. ఆ మహిళ నమ్మలేకపోయింది. ఆశ్చర్యపోయింది. ప్రవక్త ముహమ్మద్, ఈ ముహమ్మద్ ఒక్కరేనా అని మళ్ళీ అడిగింది. మక్కాను జయించిన ఈ మనిషి ఇంత జాలిహృధయం కలవాడా వీధుల్లో తిరుగుతూ ప్రజల బాగోగులు తెలుసుకుంటున్నారుఅని ఆశ్చర్యపోయింది. ఆయన మృదువైఖరి, దయాహృదయం చూసి ఆమె తన మాటలకు క్షమాపణలు కోరుకుంటూ ఇస్లామ్ స్వీకరించింది.

# మదీనా ముస్లిమేతరులతో సంబంధాలు

# సహనం శాంతియుత సహజీవనం

మదీనాకు వలస వచ్చిన తర్వాత ముస్లిమ్ సమాజాన్ని బలమైన రాజకీయ, ఆర్థిక, పరిపాలనాపరమైన పునాదులపై పటిష్టపరచిన తర్వాత ప్రవక్త ముస్లిమేతరులతో సంబంధాలు మెరుగుపరచుకునే ప్రయత్నాలు చేశారు. శాంతి, సౌభాగ్యాలను సాధించడానికే ఈ ప్రయత్నాలు జరిగాయి. అవగాహన, సుహృద్భావ వాతావరణం ఏర్పాటు చేయడానికి కృషి చేశారు.

భౌగోళికంగా మదీనాకు దగ్గరగా ఉన్న ప్రజలు యూదులు. వారితో మొదట ఒప్పందం చేసుకోవాలనుకున్నారు. మత, ఆస్తి స్వేచ్ఛలను పూర్తిగా గౌరవిస్తూ ఒప్పందంలోని షరతులను రాశారు. ఆయన ఎవరినీ ఇస్లామ్ స్వీకరించాలని బలవంతం చేయలేదు. ఆయన కొత్త సమాజంలో సంబంధాలు ప్రజాస్వామిక సూత్రాలపై నెలకొల్పడానికి ప్రయత్నించారు. వ్యక్తుల పట్ల వ్యక్తిగత విశ్వాసాల పట్ల ఆయన అత్యంత గౌరవం చూపేవారు.

– చాలా కాలంగా ఒక యూదయువకుడు ప్రవక్తతో ఉన్నాడు. ఆయనతో పాటు ప్రతిచోటికి వచ్చేవాడు. ప్రవక్తతో పాటు ఉండడం అతడికి చాలా ఇష్టం. ప్రవక్త ఎన్నడూ అతడిని ఇస్లామ్ స్వీకరించాలని కోరలేదు. కొంతకాలం తర్వాత ఆ యువకుడు తీవ్రంగా జబ్బుపడ్డాడు. మృత్యుశయ్యపై ఆ యువకుడు తన తండ్రితో ఇస్లామ్ స్వీకరిస్తాను అనుమతించాలని కోరాడు. తన తండ్రి అనుమతితో అతడు ఇస్లామ్ స్వీకరించాడు. కాని ప్రవక్తతో ఉన్న కాలమంతా అతడు యూదుడిగానే ఉన్నాడు.

– ప్రవక్త కాలంలో క్రయిస్తవులతో సంబంధాలు చాలా సుహృద్భావంతో ఉండేవి. ప్రవక్త భార్య ఆయిషా తన బంధువు ఉర్వాతో ఒకసారి మాట్లాడుతూ తమ పొరుగున కొందరు క్రయిస్తవులున్నారని, వారికి పశువులు ఉన్నాయని, ప్రవక్తకు వారు అప్పుడప్పుడు పాలు కానుకగా పంపేవారని చెప్పారు.

# పరస్పర విశ్వాసం

ప్రవక్త ముస్లిమేతరులపై కూడా చాలా నమ్మకం, విశ్వాసం ఉంచేవారు. ముస్లిములు అబిసీనియాకు వెళ్ళేలా ఆయన ప్రోత్సహించారు. అక్కడి రాజు ముస్లిమ్ కాదు. ఈ వైఖరి ప్రవక్త జీవితకాలమంతా కనిపిస్తుంది. ఆయన విశ్వాసం, విలువల ప్రాతిపదికన సంబంధాలు కొనసాగించేవారు. కేవలం మతప్రాతిపదికన కాదు. ఆయన అనుచరులు కూడా దీన్ని బాగా అర్థం చేసుకున్నారు. వారు కూడా ముస్లిమేతరులతో విశ్వాసం, నమ్మకం ప్రాతిపదికన పటిష్టమైన సంబంధాలు కలిగి ఉండేవారు. చివరకు ప్రమాదకరమైన పరిస్థితుల్లో కూడా ఈ సంబంధాలు కొనసాగేవి.

మక్కా నుంచి ఉమ్మ సలామా ఆమె కుటుంబం మదీనాకు వస్తున్నప్పుడు మధ్యలో వారిని నిర్బంధించడం జరిగింది. ఆమెను ఆమె భర్త వద్దకు పంపేది లేదని నిర్బంధించారు. ఆమె బంధువులు ఆమె పిల్లలను కూడా ఆమెనుంచి వేరు చేశారు. ఆమె దాదాపు సంవత్సరం పాటు ఈ బాధను భరించారు. ప్రతిరోజు ఉదయమే ఆమె మదీనా వైపు వెళ్ళే రహదారి వద్దకు వచ్చేవారు. అక్కడే సాయంత్రం వరకు రోదిస్తూ ఉండేవారు. వరుసకు ఆమె సోదరుల్లో ఒకరు ఇది చూసి ఆమె పిల్లలను ఆమె వద్దకు చేర్చారు. ఆమె దు:ఖం చూడలేక ఆమెను మదీనా వెళ్లడానికి అనుమతిచ్చారు. ఆమె ఒక ఒంటెపై మదీనాకు వంటరిగా బయలుదేరారు. ఎడారి మార్గం, ఇసుక దారుల్లో ఆమెను తల్హా కుమారుడు ఉస్మాన్ చూశాడు. ఆయన ముస్లిమ్ కాదు. ఆమెను చూడగానే అతను సహాయానికి వచ్చాడు. ఆమెను సురక్షిత ప్రదేశం వరకు వెంటపెట్టుకుని వెళ్ళాడు. ఆమె భర్త ఉన్న ప్రదేశానికి తీసుకెళ్ళి ఎంతో గౌరవంగా సెలవు తీసుకున్నాడు. అతడిని నమ్మడానికి ఆమె వెనుకాడలేదు. ఆమెను, ఆమె పిల్లలను వారి గమ్యస్థానం వరకు అతను వెంట ఉన్నాడు. ఉమ్మె సలామా ఎల్లప్పుడు ఈ సంఘటన చెబుతూ ఉస్మాన్‌ను ప్రశంసించేవారు.

మక్కా ఖురైషుల్లో అబూసుఫియాన్ ఇలాంటి మంచి గుణగణాలున్న వ్యక్తి. ఆయన తన కుటుంబాన్ని ఎంతో ప్రేమించేవారు. ప్రవక్త పెద్ద కుమార్తె జైనబ్ మదీనా వెళ్ళడానికి ఆయనే సహకరించారు. బద్ర్ యుద్ధంలో ఆమె భర్త ఖైదీగా పట్టుబడ్డాడు. అతను అప్పటికి ముస్లిమ్ కాదు. జైనబ్‌ను మదీనాకు తిప్పి పంపే షరతుమీద అతడిని మదీనాలో విడుదల చేశారు. కాని అబూసూఫియాన్ భార్య హింద్‌కు ఈ విషయం తెలిసింది. ఆమె జైనబ్‌కు సహాయపడతానని చెప్పింది. కాని జైనబ్‌కు ఆమెపై నమ్మకం లేదు. చివరకు ఆమె తన భర్త సోదరుడు కినాన్‌తో పాటు వెళ్ళడానికి సిద్ధపడింది. కాని కొందరు ఖురైష్ నాయకులు ఆమెను బలవంతంగా ఆపేశారు. కినాన్ ఇది చూసి ఆగ్రహించాడు. నిజానికి అతను కూడా

ముస్లిమ్ కాదు. కినాన్ కత్తిదూసి యుద్ధానికి సిద్ధపడ్డాడు. రక్తపాతం తప్పని పరిస్థితి తలెత్తింది. అబూసుఫియాన్ అప్పుడు అక్కడికి చేరుకుని కినాన్‌కు, జైనబ్‌కు నచ్చచెప్పి మక్కా వెనక్కి పంపించాడు. పరిస్థితి చల్లబడిన తర్వాత అబూసూఫియాన్ స్వయంగా వారిని మదీనాకు పంపించాడు.

ఇలాంటి ఉదాహరణలు అనేకం. ప్రవక్త కాని ఆయన అనుచరులు కాని ముస్లిమేతరులతో అనేక రంగాల్లో సంబంధాలను కొనసాగిస్తూ వచ్చారు. ఆ తర్వాత ఖుర్‌ఆన్ ఇలాంటి సంబంధాల్లో విశ్వాసం, పరస్పర నమ్మకం పునాదులుగా ఏర్పడాలని పేర్కొంది.

> "ఎవరైతే దర్మం విషయంలో మీతో యుద్ధం చేయలేదో, మిమ్మల్ని మీ ఇళ్ళ నుండి వెళ్ళగొట్టలేదో, వారిపట్ల మీరు మంచితనంతో, న్యాయంతో వ్యవహరించటాన్ని అల్లాహ్ నిరోధించడు. అల్లాహ్ న్యాయం చేసేవారిని ప్రేమిస్తాడు. ఎవరు మీతో దర్మం విషయంలో యుద్ధం చేశారో, మిమ్మల్ని మీ ఇళ్లనుండి బహిష్కరించారో, మిమ్మల్ని బహిష్కరించటంలో పరస్పరం సహకరించుకున్నారో, వారితో మీరు స్నేహం చేయటాన్ని మాత్రం అల్లాహ్ వారిస్తున్నాడు. అటువంటి వారితో స్నేహం చేసేవారే దుర్మార్గులు." (దివ్యఖుర్‌ఆన్ 60:89)

పరిస్థితి ఎలా ఉన్నా, క్లిష్టపరిస్థితులు, యుద్ధం, ఒప్పందాలు, మోసాలు ఏవైనా కాని ఈ ఖుర్‌ఆన్ బోధన శాశ్వతస్థాయి కలిగింది. ఎవరిని బలవంతంగా మతం మార్చడం కుదరదు. అభిప్రాయభేదాల పట్ల సహనం వహించాలి. అందరిపట్ల న్యాయంగా వ్యవహరించాలి. ఇది దివ్యఖుర్‌ఆన్ సందేశం సారం. ప్రవక్త ఆచరణలన్నీ దీనికి అనుగుణంగానే ఉన్నాయి. పోరాటాలు, యుద్ధాలకు సంబంధించిన దివ్యఖుర్‌ఆన్ వాక్యాలను వాటి అవతరణ నేపథ్యం దృష్ట్యా చదవవలసి ఉంటుంది. ముస్లిములు యుద్ధపరిస్థితిలో ఉన్నప్పుడు ప్రతిఘటన పోరాటాలు తప్పనిసరి.

## ప్రేమాభిమానాలు

ముస్లిమేతరులకు విరుద్ధంగా ఎలాంటి వివక్షకు తావులేదు. ప్రవక్త తన యూద పొరుగువారి పట్ల చాలా ప్రేమాభిమానాలతో ఉండేవారు. వారి ఇంట ఎవరైనా జబ్బుపడితే తప్పనిసరిగా వెళ్ళి పరామర్శించేవారు. బనూ ఆరిద్ అన్న యూద తెగ మదీనాలో ఉండేది. వారిపట్ల ప్రవక్త ఎంతో అభిమానాన్ని ప్రదర్శించారు. వారి వైఖరిని ఎంతో ఇష్టపడేవారు. ఈ తెగకు వార్షిక పారితోషికం కూడా ప్రకటించారు.

# విశ్వసనీయత

ముస్లిములు తమ ముస్లిమేతర సోదరుల పట్ల దయ, ప్రేమాభిమానాలు, సహనభావంతో వ్యవహరించేవారు. ముస్లిమేతరులు కూడా చాలా విశ్వాసంతో వ్యవహరించేవారు. హిజ్రి శకం రెండవ సంవత్సరం బద్ర్ యుద్ధ విజయానంతరం, మక్కా ఖురైషులు మరో బృందాన్ని నీగస్ వద్దకు పంపారు. అబిసీనియాలో శరణు ఇచ్చిన ముస్లిములను తమతో పంపాలని కోరారు. వారిని చంపి బద్ర్‌యుద్ధ ప్రతీకారాన్ని తీర్చుకోవాలనుకున్నారు. ఈ ఎత్తుగడను తిప్పికొట్టడానికి ప్రవక్త ముహమ్మద్ వెంటనే ఉమయ్యా కుమారుడు అమ్ర్‌ను అబిసీనియా పంపించారు. అమ్ర్ ముస్లిమ్ కాదు. అక్కడ ఖురైష్‌ల ఎత్తుగడలను అమ్ర్ సమర్థవంతంగా తిప్పికొట్టాడు.

# యుద్ధాల్లో ముస్లిమేతరుల సహకారం

ప్రవక్త చాలా వాస్తవికతా దృక్పథంతో వ్యవహరించేవారు. ఆయన యుద్ధఏర్పాట్లు చేసినప్పుడు ఎక్కడ ఎలాంటి పొరబాటు లేకుండాజాగ్రత్తలు తీసుకునేవారు. ఆయన భౌతిక, ఆధ్యాత్మిక సమతుల్యాన్ని సాధించారు. మానవచరిత్రలో సాటిలేని నైతికస్థాయిని తన అనుచరులకు అందించడానికి ఆయన ఆధ్యాత్మికత బోధనలతో ప్రయత్నించారు. శత్రువులను ఎదుర్కోవడానికి ఉపయోగించవలసిన సమస్త విధానాలతో తన సైన్యాన్ని సంసిద్ధం చేసేవారు. హునైన్ యుద్ధంలో ఆయన వద్ద పన్నెండువేల బలమైన సైన్యం ఉన్నప్పటికీ ఆయన సఫ్వాన్ బిన్ ఉమయ్యా అనే ముస్లిమేతరుడి వద్దనుంచి వంద కవచాలను అద్దెకు తీసుకున్నారు. ఆ విధంగా సైనికరక్షణను మరింత పటిష్టం చేసుకున్నారు. ఆవిధంగా హునైన్ యుద్ధంలో ఒక ముస్లిమేతరుడు సహాయం చేశాడు.

- హునైన్ యుద్ధంలో ముస్లిములతో పాటు ఇద్దరు ముస్లిమేతరులు సఫ్వాన్, సుహైల్ అత్యంత ధైర్యసాహసాలతో శత్రువును ఎదిరించి పోరాడారు. ప్రవక్త వారిని గుర్తించి సన్మానించారు. ప్రవక్త యుద్ధసొత్తును పంచుతున్నప్పుడు వారిద్దరికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారు. వారిని ఇస్లామ్ స్వీకరించాలని ఆయనేమి ఒత్తిడి తీసుకురాలేదు.

- ఉహుద్ యుద్ధానికి ముందు ప్రవక్త తన సైన్యాన్ని రహస్యంగా ఉహుద్ ప్రాంతానికి తరలించాలనుకున్నారు. శత్రువుకు ఏమాత్రం అనుమానం కలుగకుండా వెళ్ళాలి. ఈ పనికోసం ప్రవక్త ఒక ముస్లిమేతర గైడ్‌నుఎంచుకున్నారు. ఈ ముస్లిమేతర గైడ్ ముస్లిమ్ సైన్యాన్ని ఉహుద్ వరకు నడిపాడు.

# అపరాధం

ప్రవక్త ముహమ్మద్ మదీనా వచ్చిన తర్వాత ఎవరినీ ఇస్లామ్ స్వీకరించాలని ఒత్తిడి చేయలేదు. కొత్త సమాజంలో ప్రజాస్వామిక సూత్రాల ప్రాతిపదికన సంబంధాలు పటిష్టపరిచే ప్రయత్నం చేశారు. కాని తర్వాత పోరాటాలు, ఘర్షణల నేపథ్యంలో పరిస్థితి దిగజారింది. యూద తెగలతో సంబంధాలు దిగజారాయి.

ఉదాహరణకు, ముస్లిములకు ఒక యూదతెగకు ఘర్షణ వాతావరణం నెలకొంది. ఆ యూదతెగ మోసానికి పాల్పడుతుందని ముస్లిములు అనుమానించారు. ఈ వాతావరణంలో ఒక ముస్లిమ్ తన దొంగతనాన్ని ఒక యూదుడిపై వేసి తప్పించుకోవాలనుకున్నాడు.

ప్రవక్త ముహమ్మద్ ఈ సంఘటనపై వెంటనే విచారణకు ఆదేశించారు. విచారణలో దొంగతనం చేసింది ముస్లిమేనని తేలింది. యూదుడిపై ఆ నేరం నెట్టాడని కూడా తేలింది.

ఆ తర్వాత ఎనిమిది దివ్యఖుర్ఆన్ వాక్యాలు ఆ ముస్లిమ్ వ్యక్తి పాల్పడిన అపరాధాన్ని తీవ్రంగా ఖండించాయి. యూదుడి నిర్దోషిత్వాన్ని ప్రకటించాయి.
(ఖుర్ఆన్ 4:108-115)

"ఎవడైనా ఏదైనా నేరంగాని, లేక పాపంగాని చేసి, ఆ నిందను ఏ నిర్దోషిపైనైనా మోపితే అతడు తీవ్రమైన అపనిందను, ఘోరపాతకాన్ని మూటగట్టుకుంటాడు."
(దివ్యఖుర్ఆన్ 4 : 112)

యుద్ధం, పోరాటాల కారణంగా జనించే విద్వేషం వల్ల ముస్లిములు తాము పాటించవలసిన ఇస్లామీయ సూత్రాలను వదులుకోరాదని దివ్యఖుర్ఆన్ స్పష్టంగా బోధించింది.

"అల్లాహ్ కొరకు సత్యంపై స్థిరంగా ఉండండి. న్యాయానికి సాక్షులుగా ఉండండి. (ఏదైనా) వర్గంతో ఉన్న వైరం కారణంగా మీరు ఆవేశానికి లోనయి న్యాయాన్ని త్యజించకండి. న్యాయం చెయ్యండి. ఇది దైవభక్తికి సరసమానమైనది. అల్లాహ్‌కు భయపడుతూ వ్యవహరించండి. మీరు చేసేదంతా అల్లాహ్‌కు పూర్తిగా తెలుసు"
(దివ్యఖుర్ఆన్ 5 : 8)

# సహనం

మృదువైఖరి, సహనం ఈ రెండు ప్రవక్త బోధనల్లో ముఖ్యమైనవి. ఆయన ఎల్లప్పుడు "దేవుడు మృదువైఖరి కలిగినవాడు. ఆయన అన్నింటా మృదువైఖరిని ఇష్టపడతాడు" అనేవారు

ఒక అనుచరుడితో మాట్లాడుతూ ప్రవక్త ఇలా అన్నారు:

"మీలో రెండు లక్షణాలను దేవుడు చాలా ఇష్టపడతాడు. మృదువైఖరి, సహనం"

ప్రవక్త వివిధ సందర్భాల్లో అత్యంత సహనాన్ని చూపించారు. ఒకసారి ఒక బదూయిన్ అరబ్బు మస్జిదులోనే మూత్ర విసర్జన చేశాడు. ముస్లిముల అతడిని కొట్టడానికి వెళ్ళారు. ప్రవక్త అతడిని వదిలేయమని చెప్పారు. వాడు మూత్రం పోసిన చోట నీటితో కడిగేశారు. ఆ తర్వాత వాడితో నెమ్మదిగా ఇది ఆరాధనాస్థలమని, ఇక్కడ ఇలాంటి పనులు చేయరాదని చాలా మృదువుగా చెప్పారు. అతడు అక్కడినుంచి వెళ్ళిన తర్వాత ప్రవక్త తన అనుచరులతో

"మీరు వ్యవహారాలను తేలిక చేయడానికి వచ్చారు. మరీ కష్టంగా మార్చడానికి కాదు." అన్నారు.

ఈ సంఘటనలో తెలిసేదేమంటే ఆ సంచార బదూయిన్ చాలా మొరటు మనిషి. సంస్కారం లేని పల్లెటూరివాడు. అలాంటి వ్యక్తి అనాగరిక ప్రవర్తన పట్ల కాస్త సహనం చూపాలని ఆయన బోధించారు. అలాంటివారికి మృదువుగా తెలియజేయాలని చెప్పారు.

# మతసహనం

ఖుర్‌ఆన్‌లో దేవుడు ఇలా చెప్పాడు

"వారు అల్లాహ్‌ను కాదని వేడుకునే ఇతరులను దూషించకండి."
(దివ్యఖుర్‌ఆన్ 6:108)

ప్రవక్త ముహమ్మద్ చాలా స్పష్టంగా ఇతరుల పట్ల నాగరికమైన భాష ఉపయోగించాలని చెప్పారు. ఇతరుల దేవతలు, వారి పవిత్రగ్రంథాలను అవమానించరాదని బోధించారు. ఇతరుల దేవతలను చెడుపేర్లతో పిలవరాదని, వారు కూడా అలాగే అల్లాహ్‌ను పిలిచే ప్రమాదం ఉందని వారించారు.

ఖైబర్ నుంచి మదీనాకు ప్రవక్త ఆయన అనుచరులు బయలుదేరినప్పుడు జరిగిన సంఘటన మతసహనానికి మరో ఉదాహరణ.

కొందరు యువముస్లిములు యూదుల పవిత్రగ్రంథం తోరా కాపీలను యుద్ధసొత్తుగా తమతో తీసుకెళ్ళడాన్ని ఒక యూద రబ్బీ చూశాడు. దీనిపై రబ్బీ ప్రవక్త ముహమ్మద్ వద్ద అభ్యంతరం తెలియజేశాడు. ప్రవక్త ఇది తెలిసి చాలా ఆగ్రహించారు. వెంటనే తోరా కాపీలన్నింటిని వాపసు ఇవ్వాలని ఆదేశించారు. ప్రవక్త వ్యక్తిగతంగా తన అనుచరుల పనికి క్షమాపణ చెప్పారు.

ఈ సంఘటనపై ప్రముఖ యూద మేధావి డా.ఇస్రాయీల్ వెల్ఫెన్‌సన్ వ్యాఖ్యానిస్తూ మతగ్రంథం పట్ల ప్రవక్త చూపిన అత్యున్నత గౌరవానికి ఇది నిదర్శనమని అన్నారు. ఆయన ప్రదర్శించిన సహనస్వభావం యూదులను ఆకట్టుకుంది. తమ పవిత్ర గ్రంథాన్ని అవమానించేవిధంగా ప్రవక్త ఏదీ చేయని విషయాన్ని వారు ఎన్నటికి మరిచిపోలేరు. రోమన్లు క్రీ.పూ.70లో జెరుసలేమ్‌ను ఆక్రమించుకున్నప్పుడు యూద పవిత్రగ్రంథాన్ని మంటల్లో కాల్చి కాళ్ళతో ఎలా తొక్కారో యూదులు మరిచిపోలేదు. మతోన్మాద క్రయిస్తవులు స్పెయిన్‌లో యూదులను ఊచకోత కోసి వారి మతగ్రంథాన్ని ఇలాగే మంటల్లో పడేశారు. ఈ విజేతలకు ప్రవక్తకు మధ్య ఉన్న పెద్ద తేడా ఇదే, అన్నాడు.

# ధర్మంలో నిర్బంధం లేదు

దివ్యఖుర్ఆన్ స్పష్టంగా "ధర్మంలో ఎలాంటి నిర్బంధం లేదు"(దివ్యఖుర్ఆన్ 2 : 256) అని ప్రకటించింది. ప్రవక్త ప్రజలను సన్మార్గం వైపునకు, సాఫల్యం వైపునకు ఆహ్వానించేవారు మాత్రమే. అది కూడా బెదిరింపులతో ఒత్తిళ్ళతో కాదు, మృదువైఖరితో ఆహ్వానించే వ్యక్తి మాత్రమే.

దివ్యఖుర్ఆన్ స్పష్టంగా ఇలా ప్రకటించింది.

> "ప్రవక్తా! నీ ప్రభువు మార్గంవైపునకు ఆహ్వానించు, వివేకంతో చక్కని హితబోధతో. ప్రజలతో ఉత్తమోత్తమమైనరీతిలో వాదించు" (దివ్యఖుర్ఆన్ 16 : 125)

నజ్రాన్ (ఎమన్) నుంచి 14 మంది క్రయిస్తవ ప్రముఖుల బృందం ప్రవక్త వద్దకు వచ్చి కొత్త మతం గురించి వాకాబు చేయదలిచింది. వారు కొత్తమతం గురించి, వారి విశ్వాసం గురించి, ఏసుక్రీస్తు విషయంలో ఆయన అభిప్రాయాల గురించి ప్రశ్నించింది. ప్రవక్త వారి ప్రశ్నలకు సమాధానమిచ్చారు. రెండు సంప్రదాయాలు, ఇస్లామ్, క్రయిస్తవాల మధ్య సంబంధాన్ని సూచిస్తూ ఇస్లామ్ ప్రవక్త ఏసుక్రీస్తు సందేశానికి కొనసాగింపు అన్నారు. ఆయన స్పష్టంగా త్రిత్వ సిద్ధాంతాన్ని తిరస్కరించారు.

ఒకేదేవుడిని ఆరాధించండని వారిని ఆయన ఆహ్వానించారు. ఇస్లామ్‌ను ధర్మంగా స్వీకరించండని చెప్పారు. దివ్యఖుర్ఆన్ చివరి దైవాదేశంగా విశ్వసించాలని కోరారు. దీని ద్వారా ఆయన గతకాలాల గ్రంథాలు అన్నింటిని గుర్తిస్తున్నామని ధృవీకరించారు. మూసా ప్రవక్త, ఏసుక్రీస్తుల ద్వారా వచ్చిన గ్రంథాలను గుర్తిస్తున్నామని, అదే ఏకదైవారాధక విశ్వాసానికి కొనసాగింపు ఇస్లామ్.

క్రయిస్తవ బృందం ఈ మాటలను శ్రద్ధగా వింది. వారి వాదనలను వినిపించారు. వారు ఇస్లామ్ స్వీకరించడానికి నిరాకరించారు. వెళ్ళే ముందు వారు మస్జిదులో తమ

ప్రార్థనలు చేసుకోవాలనుకున్నారు. అక్కడ ఉన్న ముస్లిములు దీనికి ఒప్పుకోరదాని భావించారు. కాని ప్రవక్త కలుగజేసుకుని వారిని ప్రార్థించుకోనివ్వండి అన్నారు. క్రయిస్తవులు మస్జిదులోనే తూర్పుదిక్కుగా తిరిగి ప్రార్థనలు చేసుకున్నారు.

క్రయిస్తవ బృందం వెళ్ళే ముందు తమతో ఎవరైనా ఒక ప్రతినిధిని పంపాలని ప్రవక్తను కోరారు. తమకు కొత్త మతం గురించి సందేహాలు తీర్చుకోడానికి ఉపకరిస్తుందని అన్నారు. ప్రవక్త వారితో పాటు అబూ ఉబైదాను పంపించారు.

ఈ క్రయిస్తవ బృందం తమ ప్రాంతానికి చేరుకుంది. క్రయిస్తవ బృందం మదీనాకు వచ్చింది. ప్రవక్త సందేశాన్ని విన్నది. తమ వాదనలు వినిపించారు. ఇస్లామ్ స్వీకరించడానికి నిరాకరించారు. మస్జిదులోనే ప్రార్థనలు చేసుకున్నారు. వారికి ఎలాంటి హానీ కలుగలేదు. పైగా వెళుతూ తమతో పాటు ఉబైదాను తీసుకుని వెళ్ళారు. ప్రవక్త అనుచరుల్లో మొదటితరం వారు ప్రవక్త ప్రదర్శించిన ఈ వైఖరిని మరిచిపోలేదు. ఇతరుల పట్ల గౌరవం చూపడం, సహనం, సుహృద్భావాలతో వ్యవహరించడం ఇస్లామ్ బోధిస్తుంది.

క్రయిస్తవులతో కాని ఇతర మతస్తులతో కాని లేదా ఇతర ఆధ్యాత్మిక సంప్రదాయాలతో కాని వారిని కలుసుకోవడం, భావాలు పంచుకోవడం, శాంతియుతంగా కలసిజీవించడం, ఇవన్నీ మూడు సూత్రాల ప్రాతిపదికన జరుగుతాయి. ఇతరుల గురించి తెలుసుకోవడం, సమావేశాల్లో నిజాయితీగా ఉండడం, తనవద్దనే సత్యం ఉందని వాదించేవారి పట్ల మృదువుగా వ్యవహరించడం. ఇది ప్రవక్త అనుసరించిన తీరు. ఆయన క్రయిస్తవ విశ్వాసాలతో విభేదించడానికి సంకోచించలేదు. త్రిత్వ సిద్ధాంతాన్ని నిర్మొహమాటంగా తిరస్కరించారు. కాని ఆయన వైఖరి విజ్ఞానం, నిజాయితీ, నమ్రతలను ప్రతిఫలించింది. తర్వాత ఈ చర్చలు ప్రవక్త ప్రతినిధితో కొనసాగాయి.

దివ్యఖుర్ఆన్‌లో ఉన్న ధర్మం విషయంలో నిర్బంధం లేదు అన్న ఆదేశం వైవిధ్యానికి సంబంధించి ఈ గౌరవప్రదమైన వైఖరినే సూచిస్తుంది.

# ధార్మిక వైవిధ్యం

దివ్యఖుర్ఆన్ బహుళ మతాల పట్ల చాలా వాస్తవికతా దృక్పథాన్ని చూపించింది. ఇతర మతాల పట్ల శత్రువైఖరి ఎక్కడా లేదు. దివ్యఖుర్ఆన్ విభిన్న మతాల పట్ల సుహృద్భావాన్ని ప్రోత్సహించింది. ఇతర మతాలను గౌరవంగా చూడాలని ఇస్లామ్ పేర్కొంది.

మతావలంబికులు గుర్తుంచుకోవలసిన విషయమేమంటే మతపరమైన భేదాభిప్రాయాలు ఖచ్చితంగా ఉంటాయి. ఈ భేదాభిప్రాయాలను పక్కనపెట్టి ఒకరికి ఒకరు సహాయసహకారాలు అందించుకోవాలి. అందుకే దివ్యఖుర్ఆన్ మంచి చేయడమనే ఉమ్మడి వేదికపై ఏకం కమ్మని కోరుతుంది. విలువలు, నైతికప్రమాణాలు...ఇవి మంచిని పెంపొందిస్తాయి. శాంతినిస్థాపిస్తాయి.

> "ప్రవక్తా! ఇలా చెప్పు! "గ్రంథప్రజలారా! మాకూ మీకూ మధ్య సమానమైన ఒక విషయం వైపునకు రండి." (దివ్యఖుర్ఆన్ 3 : 64)

బహుళ మతాలున్న సమాజంలో మతసుహృద్భావాన్ని ప్రోత్సహించడానికి దివ్యఖుర్ఆన్ అనేక మార్గదర్శక సూత్రాలను ప్రతిపాదించింది. వివిధ మతసముదాయాలు అతివాదానికి పోరాదు.

> "గ్రంథ ప్రజలారా! మీ దర్మ విషయాలలో అతిగా ప్రవర్తించకండి. అల్లాహ్‌కు సత్యంతప్ప వేరే విషయాన్ని ఆపాదించకండి." (దివ్యఖుర్ఆన్ 4 : 171)

రెండవ విషయం

> ఒకరితో ఒకరు ఉత్తమమైన పద్ధతిలో వ్యవహరించాలని చెప్పడం జరిగింది. దేవుని గురించి వాదిస్తున్నప్పుడు సౌజన్యంతో వాదన కొనసాగాలి. "ప్రవక్తా! నీ ప్రభువు మార్గంవైపునకు ఆహ్వానించు, వివేకంతో చక్కని హితబోధతో. ప్రజలతో ఉత్తమోత్తమమైనరీతిలో వాదించు" (దివ్యఖుర్ఆన్ 16:125).

"ప్రవక్తా! నా దాసుల (అంటే విశ్వాసులైన దాసుల)కు, వారు తమ నోట అత్యుత్తమమైన మాటనే పలుకుతూ ఉండాలి అని చెప్పు" (దివ్య ఖుర్ఆన్ 17:53)

మూడవ విషయం, ఇతరుల మతవిశ్వాసాల పట్ల అనుచితంగా మాట్లాడరాదని, బహుదైవారాధకులు దేవుళ్ళను కూడా దూషించరాదని స్పష్టంగా పేర్కొనడం జరిగింది.

"వారు అల్లాహ్‌ను కాదని వేడుకునే ఇతరులను దూషించకండి."
(దివ్యఖుర్ఆన్ 6 :108)

నాల్గవ విషయం, వారు అనవసరపు ఘర్షణలను నివారించాలి. ఖుర్ఆన్ ఇలా పేర్కొంది.

"కరుణామయుని (అసలు) ఎవరంటే, నేలపై అణకువతో నడిచేవారూ, మూర్ఖులు వారిని పలుకరించినప్పుడు, మీకో సలామ్ అని అనేవారూ."
(దివ్యఖుర్ఆన్ 25 : 63)

ఒకరిపట్ల ఒకరు గౌరవం చూపడం, మృదువుగా వ్యవహరించడం అనేవి మౌలిక ధార్మిక భేదాభిప్రాయాల వ్యక్తీకరణలో చాలకపోవచ్చు. భేదాభిప్రాయాలు తీవ్రమైనప్పుడు ముస్లిములు బతుకు, బతకనివ్వు వైఖరిని అవలంబించాలి, అక్కడితో వివాదాన్ని ఆపి ముందుకు సాగాలి.

"ఇలా ప్రకటించు, ఓ అవిశ్వాసులారా! మీరు ఆరాదించేవాటిని నేను ఆరాధించను. అలాగే నేను ఆరాధించే ఆయన్ని మీరు ఆరాధించరు. మీరు ఆరాధిస్తున్న వాటిని నేను ఆరాధించేవాణ్ణి కాను. అలాగే నేను ఆరాధించే ఆయన్ని మీరు ఆరాధించేవారు కారు. మీ దర్మం మీదే. నా ధర్మం నాదే." (దివ్యఖుర్ఆన్ 109:1-6)

అన్నింటికి మించి దివ్యఖుర్ఆన్ చెప్పే బోధనేమిటంటే, అన్ని మతాలవారు గమనించవలసిన ఆ బోధన : సమస్తం తెలిసిన వాడు దేవుడు ఒక్కడే.

# 16

# ఖైబర్

ఖైబర్ నగరం మదీనాకు 150 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇది యూదులు ప్రాంతీయ శక్తి. అందరు ఆవైపు చూడాలంటే భయపడేవారు. దానిపై దాడి చేయడం ఊహాతీతం. బలమైన కోటలు, ఆయుధాలు, సంపద సాటిలేనివి. శత్రువుల కన్నా చాలా బలమైనవారు. మదీనాతో సహా ఎవరు దానిపై దాడిచేసి లొంగదీయడం కష్టం. ఖైబర్ నాయకులు యూద తెగలు బనూ కైనుకా, బనూ నాదిర్, బనూ ఖురైజా వీరంతా ప్రవక్త పట్ల శత్రుభావం ఉన్నవారే. ఈ ప్రాంతంలో ప్రవక్త ఉనికిని వారు భరించలేకపోయారు. తమ ద్వేషాన్ని అప్పుడప్పుడు ప్రకటిస్తూ వచ్చారు. ముస్లిం సముదాయాన్ని దెబ్బతీయడానికి, వ్యక్తులపై దాడులు చేయడానికి వెనుకాడలేదు.

ఖైబర్ నాయకులు మక్కా ఖురైషులవద్దకు ప్రత్యేక రాయబారులను పంపారు. ఇతర ఇస్లామ్ వ్యతిరేక శక్తుల వద్దకు కూడ పంపారు. ఉదాహరణకు గఫ్తాన్, హవాజిన్ తెగల వద్దకు కూడా పంపించారు. ఖురైషులు మదీనాపై దాడి చేయడానికి ఆర్థికంగా సహాయం కూడా చేశారు. కందక యుద్ధంలో ఖైబర్ యూదుల కుట్రల వల్ల ముస్లిముల పరిస్థితి సంకటంలో పడింది. వారు ప్రవక్తపై హత్యాయత్నానికి కూడా పాల్పడ్డారు. అందువల్ల ముస్లిములు హుదైబియా నుంచి వచ్చిన పదిహేను రోజుల్లోనే ప్రవక్త ఖైబర్ విషయం తేల్చుకోవాలనుకున్నారు. హుదైబియా ఒప్పందం వల్ల మక్కాతో శాంతి కుదిరింది. ఇప్పుడు మక్కా దాడి ప్రమాదం లేదు కాబట్టి ఖైబర్ వ్యవహారం తేల్చుకోవడమే ఉత్తమమని భావించారు.

ప్రవక్త అనేక రాయబార బృందాలను ఖైబర్‌కు పంపించారు. శాంతియుత ఒప్పందానికి ప్రయత్నించారు. కాని ఏవీ ఫలించలేదు. చివరకు ప్రవక్త ఖైబర్‌పై దాడికి

వెళ్ళడమే మార్గమని భావించారు. అయితే చివరి వరకు దాన్ని రహస్యంగా ఉంచాలని అనుకున్నారు. శత్రువును అప్రమత్తం చేయరాదని భావించారు. ఖైబర్ యూదులు వారి మిత్రులు కలిసి మొత్తం పద్నాలుగు వేలమంది పురుషులు ఉంటారు. ప్రవక్త అక్కడికి కేవలం పద్నాలుగు వందల సైన్యంతో వెళ్ళాలని నిర్ణయించారు. అంతకన్నా ఎక్కువ సైన్యాన్ని సమీకరించే అవకాశం ఉన్నప్పటికీ ఆయన కేవలం పద్నాలుగువందల మందితో వెళ్ళాలనుకున్నారు. నగరానికి దగ్గరగా చేరుకున్న తర్వాత ఆ ప్రాంతం గురించి బాగా అవగాహన ఉన్న ఒక గైడ్‌ను పిలిచారు. తన శిబిరాన్ని రెండు ఖైబర్ కోటల మధ్య ఏర్పాటు చేసుకున్నారు. అక్కడ సైన్యాన్ని దించడం ద్వారా ఆయన గష్తాన్‌కు ఖైబర్‌కు మధ్య మార్గాన్ని అడ్డుకున్నారు. ఉదయం ముస్లిమ్ సైన్యాన్ని చూసి ఖైబర్ యూదులు ఆశ్చర్యపోయారు. వారి పంక్తుల్లో ఒక్కసారి భయం ఆవహించింది. ఈ ముట్టడి కొన్ని రోజులపాటు కొనసాగింది. ఈ కాలంలో ప్రవక్త ముహమ్మద్ ఆయన అనుచరులు అవసరమైన సమాచారాన్ని సేకరించి, శత్రువును దెబ్బతీయడానికి తగిన వ్యూహాలను రచించుకున్నారు. ఒకటి తర్వాత ఒకటిగా కోటలపై దాడిచేయాలని నిర్ణయించారు. అత్యంత బలహీనమైన కోటను ముందుగా లక్ష్యం చేసుకున్నారు. ఈ పద్ధతి ఫలితాన్నిచ్చింది. కొద్ది సమయానికే ఆ కోట వశమైంది. లొంగుబాటు షరతులను ప్రతికోట విషయంలో ప్రత్యేకంగానే చర్చించారు. వారి సంపద స్వాధీనం చేసుకోవడం వారిని అక్కడి నుంచి బహిష్కరించడమే ఈ షరతుల్లో ముఖ్యమైనవి.

చివరి పెద్ద కోట ఖమూస్. ఈ కోట దాదాపు పద్నాలుగు రోజులు ప్రతిఘటించింది. చివరకు వారు కూడా లొంగిపోయారు. ముట్టడి వారికి భరించరానిదయ్యింది. ఆ తర్వాత మరోరెండు కోటలను కూడా స్వాధీనం చేసుకున్నారు. వారు తమ లొంగుబాటు షరతులను ప్రత్యేకంగా చర్చించుకున్నారు.

## ఒప్పందం - విషప్రయోగం

ప్రవక్త ముహమ్మద్ వారు అక్కడ ఉండడానికి, తోటలు, భూములు సేద్యం చేసుకోడానికి అంగీకరించారు. అయితే క్రమం తప్పకుండా మదీనాకు కప్పం చెల్లించాలి.

యూదులు ఈ షరతులకు ఒప్పుకున్నారు. ఈ సందర్భంగా ప్రవక్త ముహమ్మద్‌ను విందుకు ఆహ్వానించారు. ప్రవక్త వద్దకు ఒక మేక కాలును తీసుకొచ్చి వడ్డించారు. ఆయన కొంత నోటిలో పెట్టుకున్నారు. కాని రుచిలో తేడా గుర్తించి ఆగిపోయారు. వెంటనే దాన్ని ఉమ్మేశారు. ఆయన తన అనుచరుడు బిషర్‌ను హెచ్చరించడానికి ప్రయత్నించారు, కాని అప్పటికే ఆలస్యమైంది. విషాహారం తిన్న ఆయన అక్కడికక్కడే మరణించారు. ఆ మేకను

వండిన మహిళను పిలిచారు. మాంసంలో విషం కలిపినట్లు ఆమె ఒప్పుకుంది. అయితే ఒక సాకు చెప్పింది. తినేవాడు మమూలు రాజు అయితే మరణిస్తాడు, కాని ప్రవక్త అయితే విషాన్ని గ్రహించగలడన్నది తన అభిప్రాయమని చెప్పుకొచ్చింది. ప్రవక్త తనపై జరిగిన హత్యాయత్నం గురించి పెద్దగా పట్టించుకోలేదు, కాని ఆయన అనుచరుడు మరణించారు. ఇది హత్యానేరం. దానికి మరణశిక్ష తప్పదు. ఈ సంఘటనతో ముస్లిములు కోపోద్రిక్తులయ్యారు. ఒప్పందాన్ని రద్దుచేసి యుద్ధం కొనసాగించాలని భావించారు. కాని ప్రవక్త యూదులను క్షమించి వదిలేశారు. ఒప్పందాన్ని కొనసాగించారు.

# సఫియా దేవుడిని దైవప్రవక్తను ఎన్నుకున్నారు

యుద్ధఖైదీల్లో హుయాయ్ కుమార్తె సఫియా (దైవం ఆమెతో ప్రసన్నుడవుగాక) కూడా ఉన్నారు. ఆమె తండ్రి హుయాయ్ రెండు యూద తెగలకు నాయకుడు. కాని సఫియాకు ఆమె తండ్రికి ఏ విషయంలోను పోలికలేదు. ఆమె చాలా కాలంగా ప్రవక్త ముహమ్మద్ సందేశం గురించి తెలుసుకుంటూ వస్తున్నారు. ధర్మపరాయణత కలిగిన మహిళ.తనవాళ్ళు ప్రవక్తను ద్వేషించినా ఆమె ఎన్నడూ ఆ ద్వేషంలో పాలు పంచుకోలేదు. ప్రవక్త కూడా ఆమె గురించి విని ఉన్నారు. ఆమె ఆధ్యాత్మిక భావాల గురించి తెలుసుకుని ఉన్నారు. ఆమె తనకు వచ్చిన ఒక కల గురించి ఆయనకు నిస్సంకోచంగా చెప్పారు. మదీనా ముస్లిములతో తన భవిష్యత్తు ముడిపడిఉన్నట్లు ఆమె కలలో చూశారు. ప్రవక్త ముహమ్మద్ ఆమె చెప్పినదంతా విన్నారు. ఆమె ఒక యూద మహిళగా కొనసాగుతూ తన వాళ్ళ వద్దకు వెళ్ళిపోవచ్చు, లేదా ఆమె ఒక ముస్లిమ్‌గా మారవచ్చు. ఆమె "నేను దేవుడిని, దైవప్రవక్తను ఎన్నుకున్నానని" జవాబిచ్చారు.

ప్రవక్త ఆమెకు స్వేచ్ఛనిచ్చారు. తర్వాత కొంతకాలానికి ఆమెను వివాహం చేసుకున్నారు. విజేతలు పరాజిత రాజుల కుమార్తెలను, భార్యలను వివాహం చేసుకోవడం ద్వారా యుద్ధం సృష్టించిన విద్వేషాన్ని కొంతవరకు చల్లార్చే ప్రయత్నం చేయడం జరుగుతూ వస్తున్నదే. ఇదే పద్ధతిలో ప్రవక్త పరాజిత యూద మనోభావాలను శాంతపరిచే ప్రయత్నం చేశారు.

హిజ్రీ శకం 7వ సంవత్సరంలో (కామన్ ఎరా 628) ప్రవక్త ఆ ప్రాంతంలో కోటలన్నీ వశం చేసుకున్నారు. అక్కడ చిట్టచివరి పెద్ద శత్రువును కూడా ఆయన లొంగదీశారు. అరబ్ ద్వీపకల్పంలో ఇప్పుడు శాంతి నెలకొంది. ముస్లిములకు ఉత్తరాది నుంచి దాడుల భయం ఇకలేదు. తెగల సంబంధాలను నిర్వచించే ఒప్పందాలు, వ్యాపార ఒప్పందాల వల్ల ముస్లిములు కాస్త కుదుటపడే అవకాశం లభించింది.

ఈ పరిస్థితి సాధించడం వెనుక ప్రవక్త చేసుకున్న వివాహాలు కూడా కారణమయ్యాయి. ఆయా తెగలకు ఆయన బంధువయ్యారు. వివిధ తెగలకు చెందిన మహిళలను ఆయన వివాహం చేసుకున్నారు. అందువల్ల ఆయా తెగలన్నీ ఆయన్ను తమకు సహజ మిత్రుడిగా భావించే వాతావరణం ఏర్పడింది. మదీనాలో ముస్లిం సముదాయం బలం పెరిగింది. కేవలం ఎనిమిది సంవత్సరాల కాలంలో ముస్లిము సముదాయం కొత్త నగరం మదీనాలో స్థిరపడడమే కాదు, ప్రాంతీయ శక్తిగా ఎదిగింది.

# దయార్ద్ర హృదయం

ఈ కాలంలో మక్కా కరువుతో అల్లాడడం ప్రారంభమైంది. మక్కాలో వ్యవసాయం లేదు. బయటి నుంచి ఆహారం దిగుమతి చేసుకోవాలి. కాని మక్కాకు ఆహారం సరఫరా చేసే ప్రాంతాల్లో కరువు తాండవిస్తోంది. అరబ్బు ద్వీపకల్పంలో కరువు బారిన పడకుండా మిగిలిన ఒకేఒక్క ప్రాంతం నజ్ద్. మక్కాకు ఆహారపదార్థాలు సరఫరా చేయగలిగిన స్థితిలో ఉన్న ఏకైక ప్రాంతం అది.

ఒకరోజు ఇబ్నే ముస్లిమా నాయకత్వంలో 30 మంది ఉన్న నిఘా బృందం విధులు నిర్వర్తిస్తోంది. వారు ఒక వ్యక్తిని నిర్బంధించారు. అతడి కదలికలు అనుమానస్పదంగా ఉన్నాయి. అతడిని తీసుకుని మదీనా వచ్చారు. ప్రవక్త ఆ వ్యక్తిని గుర్తించారు. అతను నజ్ద్ ప్రాంతం నాయకుడు. అతని పేరు తుమామా. అతను ఇంతకు ముందు మక్కా ఒకసారి వచ్చాడు. అప్పుడు ప్రవక్త మక్కాలో ఇస్లామ్ సందేశ ప్రచారం చేస్తున్నారు. ఇతనికి కూడా ఇస్లామ్ గురించి వివరించారు. అప్పుడు ఈ వ్యక్తి కోపంగా ప్రవక్తను చంపుతానని బెదిరించారు. ఆ వ్యక్తి ఇప్పుడు నిర్బంధితుడై ప్రవక్త ముందున్నాడు. ప్రవక్త అతడితో "విగ్రహారాధన వదిలి దైవవిధేయత చూపే సమయం రాలేదా" అన్నారు. అతను జవాబిస్తూ "ముహమ్మద్, మీరు నన్ను చంపాలనుకుంటే, మీరు ఒక హంతకుడిని చంపుతారు. మీరు కరుణ చూపాలనుకుంటే ఒక కృతజ్ఞతగా ఉండే వ్యక్తిపై కరుణ చూపినట్లే. మీరు పరిహారం కావాలనుకుంటే అడగండి, నేను ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను." అన్నాడు. ఈ మాటలు విని ప్రవక్త మౌనం వహించారు. అతను చెప్పిన అరబీ వాక్యాలు అస్పష్టమైన భావాలను ప్రకటించాయి. అతని మాటలకు అర్థం అతను ఎవరినో హత్య చేశాడు. అందువల్ల ఆ శిక్షకు అతడికి మరణశిక్ష విధించే అవకాశం ఉంది. అంటే అతను బహుశా ఎవరో ముస్లిమ్‌ను హత్యచేసి ఉంటాడు. వారిద్దరి మధ్య సంభాషణ అంతటితో ముగిసింది. అయితే ప్రవక్త అతడిని ఖైదీ అతిథిగా చూడాలని ఆదేశించారు. ఈ హోదా వల్ల అతను రోజు మస్జిదులో

ముస్లిముల దినచర్యను చూడగలడు. రెండవ రోజు కూడా ఇదే జరిగింది. మూడవ రోజు కూడా అతను అదే జవాబు ఇచ్చాడు. ప్రవక్త అతడిని వదిలేయాలని ఆదేశించారు. "తుమామా, నువ్వుప్పుడు స్వేచ్ఛగా ఎక్కడకు వెళ్ళాలన్నా వెళ్ళవచ్చు" అన్నారు.

ప్రవక్త ఇంత దయగా వ్యవహరిస్తారని అతను భావించలేదు. ఈ దయాస్వభావం చూసి అతను చలించిపోయాడు. అతను మస్జిదు నుంచి బయటకు నడిచి ఒక బావి దగ్గరకు వెళ్ళాడు. స్నానం చేశాడు. మళ్ళీ మస్జిదు వద్దకు వచ్చాడు. ప్రవక్త ముందు హాజరై "ఒకే ఒక్క దేవుడు తప్ప మరో దేవుడు లేడని, మీరు దైవప్రవక్తఅని సాక్ష్యమిస్తున్నాను" అని ప్రకటించాడు. అంతటితో ఆగకుండా "కొన్ని క్షణాల వరకు నేను అత్యధికంగా ద్వేషించిన వ్యక్తి మీరు. ఇప్పుడు నేను అత్యధికంగా ప్రేమించే వ్యక్తి మీరే, ఒకప్పుడు మీ మతం కన్నా నేను ఎక్కువ ద్వేషించిన మతం లేదు, నేడు మీ మతం కన్నా ఎక్కువగా నేను ప్రేమించే మతంలేదు, ఒకప్పుడు మదీనా కన్నా హీనమైన నగరం నా దృష్టిలో లేదు. నేడు మదీనా కన్నా అందమైన నగరం నా దృష్టిలో ఎక్కడా లేదు." అన్నాడు.

తుమామా ఇస్లామ్ స్వీకరించడం వల్ల నజ్ద్ ప్రాంతంలో ఇస్లామ్ వ్యాపించే అవకాశం దొరికింది. నజ్ద్ రాజకీయంగా చాలా ముఖ్యమైన ప్రాంతం. ఆ తర్వాతి సంభాషణలో అతను ప్రవక్తతో మాట్లాడుతూ ప్రవక్త అనుమతి లేకుండా నజ్ద్ నుంచి మక్కాకు ఆహారపదార్థాల సరఫరా ఉండదని, మక్కాకు ఆహారమార్గాలను అడ్డుకుంటానని చెప్పాడు. దీనివల్ల మక్కాలో అసలే కరువుతో అలమటిస్తున్న వారి పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. చివరకు మక్కా బృందం మదీనా వచ్చింది. ప్రవక్త కరుణ చూపాలని విజ్ఞప్తి చేసింది. ప్రవక్త ఆ వెంటనే తుమామాకు వర్తమానం పంపి మక్కాకు ఆహారసరఫారపై నిషేధాన్ని సడలించాలని సిఫారసు చేశారు. అంతేకాదు తుమామాకు పంపిన వర్తమానంలో :

''అందరికీ ఆహారమిచ్చేవాడు దేవుడు. ఆయన తన శత్రువులకు కూడా ఆహారాన్నిస్తాడు. ఇంతకు ముందు మీరు చేస్తున్నపనే చేయండి (ఆహారం సరఫరా చేయండి). కాస్త ఎక్కువే పంపండి." అని తెలిపారు.

అంతేకాదు ప్రవక్త ముహమ్మద్ మక్కా నాయకుడు అబూసుఫియాన్‌కు ఐదువందల బంగారు నాణాలను పంపారు. ఇది చాలా పెద్ద మొత్తం ఆరోజుల్లో. మక్కాలో పేదలకు పంచడానికి ఈ సొమ్మును పంపించారు. ఇస్లామ్ పట్ల తీవ్రమైన వైరం ఉన్న అబూసుఫియాన్ ఇది చూసి నొసలు ముడివేసాడు. ఆయన మన యువకులను తప్పుదారి పట్టించడానికి ప్రయత్నిస్తున్నాడన్నాడు. కాని ఆ మొత్తాన్ని పంపించే స్థితిలో ఆయన లేడు.

ఖురైషులు ఆయనకు, ఆయన కుటుంబానికి, ఆయన అనుచరులకు అనేక విధాలుగా వేధించారు. మక్కాలో ఉన్నంతకాలం వారి దౌర్జన్యాలు, అణిచివేతలు వర్ణించరానివిగా కొనసాగాయి. మూడేళ్ళపాటు ప్రవక్తను ఆయన కుటుంబాన్ని సంఘం నుంచి బహిష్కరించారు. ఈ అమానుష వ్యవహారశైలి తర్వాత కూడా ప్రవక్త తుమామా ద్వారా మక్కాకు ఆహారపదార్థాల సరఫరాను పునరుద్ధరించారు. వారిని ఆకలి నుంచి కాపాడారు.

తర్వాత ఇలాంటి మరికొన్ని సంఘటనలు జరిగాయి. ఈ సంఘటనల ప్రభావం వల్ల మక్కాలో సాధారణ ప్రజలు ప్రవక్తను తమ శత్రువుగా కాక ఆయన్ను చూసి గర్వించడం మొదలైంది. రోజు రోజుకు బలపడుతున్న తమ సోదరుడిని చూసినట్లు ఆయన్ను చూడసాగారు. అయితే ఖురైషు నాయకుల ముందు ఈ మాటలు చెప్పే ధైర్యం వారికి లేదు. కాని ఆయన పట్ల, ఆయన ధర్మం పట్ల వారిలో ఆసక్తి పెరిగింది.

# వినోదం

మనిషిలో కొత్త ఉత్సాహం నింపడానికి, వినూత్న ఉత్తేజం పొందడానికి వినోదం కూడా ఎంతో అవసరం. కొద్దిపాటి వినోదం ద్వారా ప్రజలు జీవితంలోని కఠినశ్రమను కాసేపు మరిచిపోయి, శక్తిపుంజుకుంటారు.

ప్రవక్త తన అనుచరులకు, హాని కలిగించని, పరిశుభ్రమైన, స్వచ్ఛమైన అనుమతించిన పరిధుల్లో వినోదాన్ని అంగీకరించేవారు. ఆయన కొన్ని సార్లు ఒంటరిగా ఉద్యానవనాలకు వెళ్ళేవారు. కొన్నిసార్లు తన అనుచరులతో కలిసి వెళ్ళేవారు. చెట్ల నీడ క్రింద వారితో అనేక విషయాల గురించి మాట్లాడేవారు. కొన్ని సందర్భాల్లో ఆయన అనుచరుల మధ్య ఈతపోటీలు ఏర్పాటు చేసేవారు. అలాంటి ఒక సందర్భంలో అబూబక్ర్ ఆయనతో పాటు ఉన్నారు. చాలా కాలం తర్వాత వర్షం కురిసిందప్పుడు, ప్రవక్త ఒక పొడుగైన వస్త్రం ధరించి ఆ వర్షపునీటిలో స్నానం చేశారు.

ఆయన గుర్రపు పందేలు, విలువిద్యపోటీల్లో కూడా పాల్గొనేవారు, కుస్తీల్లో పాల్గొనేవారు. అందరితో కలిసి హాయిగా నవ్వేవారు.

ఆనంద సమయాల్లో ఆయన డప్పువాయిద్యం ఇష్టపడేవారు. ఒకవైపున తెరుచుకునే ఉండే దఫ్‌ను ఇష్టపడేవారు. ఒకసారి ఈద్ పండుగ రోజున ఆయన భార్య పక్కన ఇద్దరు అమ్మాయిలు కూర్చుని ఉన్నారు. వారు పాటలు పాడుతున్నారు. ఇది చూసి అబూబక్ర్ కాస్త కోపంగా మందలించారు. కాని ప్రవక్త కల్పించుకుని వారిని పాడమన్నారు.

వివాహాల సందర్భంగా డప్పువాయిద్యాలను ఆయన అనుమతించేవారు. ఆయన భార్య ఆయిషాతో పాటు నివసించే ఒక అన్సారీ అమ్మాయి పెళ్ళి జరుగుతున్నప్పుడు కొందరు అమ్మాయిలు ఆమె చుట్టు కూర్చుని పాటలు పాడుతున్నారు. వారు సంగీతంతో పాటలు పాడడాన్ని ప్రవక్త అనుమతించారు. అన్సార్లకు సంగీతమంటే ప్రాణమని ఆయన అన్నారు. అందువల్ల ఒక పాటలు పాడే అమ్మాయిని కూడా వధువుతో పాటు పంపండని చెప్పారు.

ఒక ప్రయాణంలో ప్రవక్తతో పాటు ఆయన భార్య ఆయిషా ఉన్నారు. ఆమె ప్రవక్తతో పరుగుపందెం వేసి ఆయన్ను ఓడించారు కూడా. కాని తర్వాత కొంతకాలనికి ఆమె మళ్ళీ పరుగుపందెం అన్నారు. కాని అప్పటికి ఆమె కాస్త లావెక్కారు. అప్పుడు మాత్రం ఓడిపోయారు.

# 17

# ఉమ్రా

## కాబాయాత్ర

హుదైబియా ఒప్పందం జరిగి ఒక సంవత్సరం ముగిసింది. ఇప్పుడు ఒప్పందం ప్రకారం కాబాయాత్రకు వెళ్ళే అవకాశం ఉంది. ప్రవక్త ముహమ్మద్‌తో పాటు 2000 మంది ముస్లిములు మక్కా యాత్రకు బయలుదేరారు. వారంతా ఉమ్రాయాత్రకు ఉద్దేశ్యంతో బయలుదేరారు. హజ్ మాసాల్లో చేసే మక్కా యాత్రను హజ్ అంటారు. ఆ తర్వాత ఎప్పుడైనా చేసే మక్కా యాత్రను ఉమ్రా అంటారు. అలా బయలుదేరినవారిలో ఒక పేదముస్లిం కూడా ఉన్నారు. ఆయన మక్కా నుంచి వచ్చి మదీనాలో స్థిరపడ్డారు. అహ్లె సుఫ్ఫాతో పాటు ఉండేవారు. ఆయన చాలా పేదవారు. చాలా అణకువగా ఉండేవారు. ఆయనకు పిల్లులంటే చాలా ఇష్టం. ఆయన్ను ప్రవక్త పిల్లులపిత అంటూ పిలిచేవారు. ఆయనే అబూ హురైరా. ఆయన ద్వారా మనకు ప్రవక్త ప్రవచనాలు, సంప్రదాయాలు అనేకం తెలిశాయి.

యాత్రికులు మక్కా శివార్ల వరకు వెళ్ళారు. ఆ ప్రాంతం నుంచి ఖురైషులు తొలగడానికి సమయమిస్తూ అక్కడనే వేచిఉన్నారు. ఖురైషులు తొలగితే ముస్లిములు అక్కడ తమ ఉమ్రా ఆచరణలు స్వేచ్ఛగా చేసుకునే అవకాశం ఉంటుంది. ముస్లిములు యాత్రను సూచించే సాధారణ దుస్తులు ధరించి ఉన్నారు. వారు వినమ్రంగా మక్కాలోకి ప్రవేశించారు. ఖురైషులు చుట్టు ఉన్న కొండల్లోంచి వారిని యాత్ర చేసే వారి తీరును పరిశీలించసాగారు. ప్రవక్త కాబా చుట్టు ప్రదక్షిణలు చేశారు. ఏడుసార్లు ప్రదక్షిణలు, ఆ తర్వాత సఫా మర్వా కొండలమధ్య ఏడుసార్లు తిరగడం, ఆ తర్వాత ఒక ఒంటెను ఆయన ఖుర్బానీ చేశారు. శిరోముండనం చేయించుకున్నారు. ఆ విధంగా ఆయన ఉమ్రాయాత్ర క్రతువులన్నీ ముగించారు. ఇతరులకు కూడా ఆయన్ను అనుసరిస్తూ తమ తమ క్రతువులు పూర్తిచేసుకున్నారు. ఆయన కాబాలోపలికి

ప్రవేశించాలనుకున్నారు. కాని ఖురైషులు దానికి ఒప్పుకోలేదు. అది తమ ఒప్పందంలో లేదన్నారు. ప్రవక్త ఆ విషయమై వారితో వాదన చేయలేదు. ఆయన మక్కాలో ఉన్నంత కాలం కాబాలోనే ఉన్నారు. అక్కడి నుంచి బిలాల్ తన మధురస్వరంతో నమాజుకు యాత్రికలను పిలిచేవారు. కొండల్లోంచి చూస్తున్న అనేకమంది ఖురైషులు ఇదంతా చూసి చాలా ప్రభావితులయ్యారు. ముస్లిముల ధార్మిక ఆచరణల్లోని సాదాసీదా శైలి, హుందాతనం వారిని ఆకర్షించాయి. ఈ సమయంలోనే ప్రవక్త పినతండ్రి అబ్బాస్ తాను కూడా ఇస్లామ్ స్వీకరించానని బహిరంగ ప్రకటన చేశారు.

# అంతరాత్మ

ప్రవక్త మదీనా తిరిగి వచ్చిన తర్వాత ముగ్గురు వ్యక్తులు ఆయన్నుకలవడానికి వచ్చారు. వారు తల్హా కుమారుడు ఉమర్, వాలిద్ కుమారుడు ఖాలిద్, అల్ ఆస్ కుమారుడు అమ్ర్. వారు ఇస్లామ్ స్వీకరించడానికి వచ్చారు. ముస్లిములకు వ్యతిరేకంగా జరిగిన యుద్ధాల్లో వీరోచితంగా, ప్రాణాలకు తెగించి పోరాడిన యోధులు వారు. ఇస్లామ్ తీవ్రంగా వ్యతిరేకించివారు. వారు ఇస్లామ్ స్వీకరించడం వల్ల ప్రవక్త చాలా సంతోషించారు. మిగిలిన ముస్లిములు కూడా ఇది తెలిసి చాలా సంతోషించారు. ఆ ముగ్గురి గురించి ముస్లిములకు బాగా తెలుసు. వారు నిబద్ధత కలిగిన మనుష్యులు. సుదీర్ఘకాలం ఇస్లామ్‌కు వ్యతిరేకంగా అంతే నిజాయితీతో పోరాడారు. దాదాపు ముస్లిములు పోరాడిన అన్ని యుద్ధాలలోను ఈ ముగ్గురు ఉన్నారు. అంతకు కొంతకాలం ముందు అబూహురైరా ఇస్లామ్ స్వీకరణ మాదిరిగానే ఈ ముగ్గురి ఇస్లామ్ స్వీకరణ ఒక కీలకమలుపు వంటిది.

దాదాపు 20 సంవత్సరాల పాటు ప్రవక్త ముహమ్మద్‌ను, ఇస్లామ్‌ను వారు వ్యతిరేకించారు. వారు ఈ కాలంలో తీవ్రమైన మార్పుకు గురయ్యారు. కాబట్టి ఇస్లామీయ విశ్వాసం ఎంత బలంగా ఉందన్నది ఎప్పుడు ఇస్లామ్ స్వీకరించారన్న విషయంపై ఆధారపడి ఉండదు. ఆలస్యంగా ఇస్లామ్ స్వీకరించిన వ్యక్తుల్లోను పటిష్టమైన నిబద్ధత ఉండవచ్చు. ముఖ్యంగా గ్రహించవలసిన విషయం చెక్కుచెదరని సంకల్పంతో ఇస్లామ్‌ను వ్యతిరేకించినవారు కూడా ఇస్లామ్‌లోని సుగుణాల ప్రభావానికి గురయ్యారు. వారిలో మార్పు వచ్చింది. తమకు తామే ఇస్లామ్ స్వీకరించడానికి ముందుకు వచ్చారు. ఉమర్ విషయంలోను ఇలాగే జరిగింది. ఇస్లామ్‌ను ద్వేషించిన ఆయన చివరకు ప్రవక్త వద్దకు వచ్చి ఇస్లామ్ స్వీకరించారు. ఇప్పుడు ఖాలిద్ బిన్ వలీద్, అమ్ర్ బిన్ ఆస్ వంటి యోధులు, యుద్ధనిపుణులు, రెండుదశాబ్దాలుగా ఇస్లామ్‌ను వ్యతిరేకించి యుద్ధాల్లో దళాలను ముందుకు నడిపినవారు చివరకు ప్రవక్త వద్దకు వచ్చి ఇస్లామ్ స్వీకరించారు.

# సిరియాతో పోరాటం

ఆ తర్వాత కొంతకాలానికి ప్రవక్త బృందాలను సిరియావైపు పంపాలనుకున్నారు. ఆ వైపు తెగలతో సామరస్య సంబంధాలు పెంచుకోడానికి, ముస్లిములు సిరియా వరకు ప్రయాణించే సామర్థ్యం కలిగి ఉన్నారని చాటి చెప్పడానికి ఉద్దేశించిన యాత్రలివి. పదిహేను మంది బయలుదేరారు. అందులో పద్నాలుగు మంది హత్యకు గురయ్యారు. అదే సమయాన బస్రాకు పంపబడిన ప్రతినిధిని కూడా మధ్యలో అడ్డుకుని చంపడం జరిగింది. గస్సాన్ తెగ సర్దారు ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. సిరియా నుంచి ప్రమాదం రోజు రోజుకు పెరుగుతోంది. శాంతియుతంగా ప్రయాణిస్తున్న ప్రతినిధులను హతమార్చిన చర్యకు జవాబు చెప్పవలసి ఉంది. రాయబారులను చంపడం అన్నది చాలా నీచమైన నేరంగాను, యుద్ధప్రకటనగాను ప్రకటనగాను పరిగణించబడేది. ఈ వార్తలు విని ప్రవక్త నిర్ఘాంతపోయారు. మూడువేల సైన్యాన్ని అటుగా పంపాలని నిర్ణయించారు. స్వేచ్ఛ పొందిన బానిస జైద్ సేనానాయకుడిగా ఈ సైన్యం బయలుదేరింది. ఈ నియామకం చాలా మందిని ఆశ్చర్యానికి గురిచేసింది. ఒకవేళ జైద్ యుద్ధంలో అమరగతి పొందితే ఇటీవల అబీసినియా నుంచి తిరిగి వచ్చిన జాఫర్ సైన్యాన్ని నడపాలని, జాఫర్ కూడా అమరగతి పొందితే అబ్దుల్లా బిన్ రవాహ్ సైన్యాన్ని నడపాలని ఆదేశించారు.

ప్రవక్త ముహమ్మద్ జీవితంలో జరిగిన యుద్ధాల్లో సిరియా యుద్ధం అత్యంత బీభత్సకరమైనది. క్రయిస్తవ భూభాగాల్లోకి విస్తరణకు ఇది ప్రారంభమైంది. ఇది కామన్ ఎరా 629లో అంటే హిజ్రీ శకం ఎనిమిదవ సంవత్సరం జరిగింది. గ్రేటర్ సిరియా సరిహద్దుల్లో, పలస్తీనాకు దగ్గరగా ఉన్న ముతా అనే ప్రాంతంలో ఈ యుద్ధం జరిగింది.

ముస్లిమ్ సైన్యం సిరియా దగ్గరకు చేరినప్పుడు అనేకమంది ఇస్లామ్ వ్యతిరేక అరబ్బు తెగలు ఒక్కటయ్యాయని, వారు బైజాంటైన్ చక్రవర్తి మద్దతు సంపాదించుకున్నారని తెలిసింది. అంటే వారి సైనిక బలం లక్షకన్నా ఎక్కువ ఉంటుంది. ముస్లిముల సైన్యం మూడువేలు. వారు ముతా వద్దకు చేరగానే అక్కడ భౌగోళిక పరిస్థితి చాలా అనుకూలంగా కనిపించింది. అక్కడే శిబిరాలు వేశారు. జైద్ శత్రువుపై హఠాత్తుగా దాడి చేయాలని నిర్ణయించారు. శత్రువును దిగ్భ్రాంతికి గురిచేయాలనుకున్నారు. ఈ వ్యూహం వల్ల ప్రారంభంలో శత్రువులు తడబడ్డారు. గందరగోళానికి లోనయ్యారు. కాని ఇది యుద్ధంలో పరిస్థితి ముస్లిములకు అనుకూలంగా మార్చడానికి చాలలేదు. సైనికబలం సంఖ్యలో చాలా తక్కువ ఉంది. యుద్ధంలో వరుసగా జైద్, జాఫర్, అబ్దుల్లాలు ఒకరి తర్వాత ఒకరుగా అమరగతి పొందారు. ముస్లిము

సైన్యం కకావికలయ్యింది. చివరకు ఖాలిద్ బిన్ వలీద్ సైనిక బాధ్యతలు స్వీకరించారు. ఆయన ముస్లిమ్ సైన్యాన్ని మళ్ళీ సమీకరించారు. కొత్త దాడులకు జవాబివ్వడం ప్రారంభించారు. ముస్లిములు కేవలం ఎనిమిది మంది మాత్రమే మరణించారు. కాని వారు వెనకడుగు వేయక తప్పడం లేదు. ఇది స్పష్టమైన ఓటమి. కాని యుద్ధకళలో ఆరితేరిన ఖాలిద్ ముఖాముఖీ పోరాటాన్ని తప్పించారు. లేకపోతే పెద్దస్థాయిలో ప్రాణనష్టం సంభవించి ఉండేది.

# విషాదం

ఈ సమయంలో మదీనాలో ఉన్న సహచరులు ఒక అసాధారణమైన అనుభవాన్ని చవిచూశారు. ప్రవక్త కలలు, ప్రవక్త దృష్టితో చూసే సంఘటనలు నిజమవుతాయని వారికి తెలుసు. ప్రవక్త దైవికంగా ప్రభావితులవుతారని వారికి తెలుసు.

ఒకరోజు ప్రవక్త వారి వద్దకు వచ్చారు. యుద్ధరంగం నుంచి ప్రతినిధి ఎవరూ ఇంకా రాలేదు. అక్కడి వార్తలు తెలియవు. ప్రవక్త యుద్ధరంగం పరిస్థితిని వారికి తాను అక్కడ చూసినట్లు వివరించడం ప్రారంభించారు. కళ్ళల్లో అశ్రుధారలతో గద్గదంగా ఆయన జైద్, జాఫర్, అబ్దుల్లాల అమరత్వం గురించి తెలియజేశారు. ఖాలిద్ చాకచక్యాన్ని ప్రశంసించారు. ఖాలిద్‌ను సైఫుల్లా (దేవుని ఖడ్గం) అంటూ పిలిచారు. కాని ఆయనకు అత్యంత ఆప్తులైన వారి మరణం ఆయన్ను చాలా విషాదానికి గురిచేసింది.

ఆయన జాఫర్ ఇంటికి వెళ్ళి వారికి ఈ వార్త తెలియజేయడానికి స్వయంగా బయలుదేరారు. జరిగింది చెప్పే ముందే ఆయన గొంతు గద్గదమైంది. భర్త మరణవార్త విని జాఫర్ భార్య అస్మా గుండెలవిసేలా రోదించారు. అక్కడి నుంచి ఆయన జైద్ ఇంటికి వెళ్ళారు.జైద్ భార్య ఉమె ఐమాన్‌కు విషాదవార్త తెలియజేశారు. జైద్ ఆయనకు కుమారుని వంటివాడు. జైద్ కుటుంబం ఆయనకు చాలా ప్రియమైనవారు. ఆయన వెనుదిరుగుతున్నప్పుడు జైద్ చిన్న కుమార్తె పరుగున ఆయన వద్దకు వచ్చింది. ఆమెను ఓదారుస్తున్నప్పుడు ఆయన వెక్కిళ్ళు ఆపుకోలేకపోయారు.

ఇది చూసి అటుగా వచ్చిన అనుచరుడు సాద్ ఆశ్చర్యపోయారు. ప్రవక్త కన్నీళ్ళు చూసి ఆశ్చర్యంగా ఏమైందని ప్రశ్నించారు. ప్రవక్త జవాబిస్తూ ఆప్తులను కోల్పోయిన వ్యక్తి దు:ఖమని అన్నారు. ప్రవక్త తన అనుచరులకు ప్రేమాభిమానాలతో బతకాలని బోధించారు. ఆప్తులను కోల్పోయినప్పుడు ప్రేమను వ్యక్తం చేసే కన్నీళ్ళ విలువను వారికి బోధించారు.

ముస్లిమ్ సైన్యం సిరియానుంచి వెనుదిరిగింది. ఖాలిద్ నాయకత్వంలో వెనుదిరిగి వచ్చిన సైన్యం ప్రవక్త చెప్పిన వార్తలను ధృవీకరించింది. ఆయన చెప్పినట్లే యుద్ధరంగంలో జరిగింది. ముగ్గురు యోధులు పోరాడుతూ మరణించారు. ముస్లిమ్ సముదాయానికి దీనితో ప్రవక్త దైవికంగా నియమించబడిన దైవప్రవక్త అనడానికి ఇది మరో ఆధారం. ఆయన అసాధారణ వ్యక్తి. ఆయన మరోవ్యక్తిని పోలినవారుకాదు. అయినా ఆయన వినమ్రంగా ఉండేవారు. వారిలో ఒకరిగా ఉండేవారు. విషాదంలో దు:ఖించేవారు.

ఉత్తరాదిన పరిస్థితి మరింత దిగజారింది. ముతాలో ముస్లిముల ఓటమిని ఇస్లామ్ వ్యతిరేక అరబ్బు తెగలు తమకు అనుకూలంగా మార్చుకోవాలని ప్రయత్నిస్తున్నాయి. కొన్ని తెగలు మదీనాపై పూర్తిస్థాయి యుద్ధానికి ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు కూడా ప్రవక్త సమాచారం అందుకున్నారు. ఆయన ఒక బలమైన సైన్యాన్ని అమ్ర్ నాయకత్వంలో పంపాలని నిర్ణయించారు. ముస్లిమ్ దళాలు మరోసారి సిరియావైపు కదిలాయి. అప్పటికి తమ మిత్రపక్షాలుగా ఉన్న తెగలతో ఒప్పందాలను పటిష్టం చేసుకుంటూ, కొత్త తెగలతో ఒప్పందాలు చేసుకుంటూ పురోగమించాయి. చివరకు ఆ ప్రాంతంలో సమస్యను కూడా నివారించడం జరిగింది.

# ఒప్పంద ఉల్లంఘన

ఇంతకు ముందు వివరించినట్లు హుదైబియా ఒప్పందం కేవలం మక్కా, మదీనాలకు మధ్య కుదిరిన ఒప్పందం మాత్రమేకాదు. వారి మిత్రపక్షాలకు కూడా ఇది వర్తిస్తుంది. ఖుజాఆ ప్రవక్తకు మిత్రపక్షం. ఇందులో ఒక తెగ బనూకాఫ్. ఖురైషులకు మిత్రపక్షమైన బనూ బక్ర్ ఒక రాత్రి దొంగచాటుగా బనూ కాఫ్‌పై దాడిచేసి ఒకరిని హతమార్చింది. ఈ సంఘటన గురించి వెంటనే బనూ కాబ్ ప్రవక్తకు సమాచారం పంపింది. ఇది ఒప్పంద ఉల్లంఘన కిందికి వస్తుంది. ఈ నేరాన్ని శిక్షించకుండా వదలరాదని ప్రవక్త నిర్ణయించారు. మిత్రపక్షం ఖుజాఆకు సహాయం చేయాల్సిందే.

ఖురైషులకు కూడా ఇది ఎంత తీవ్రమైన విషయమో తెలుసు. వారు ప్రవక్త వద్దకు ఒక ప్రతినిధిని పంపారు. ఒక్క సంఘటనపై తీవ్రంగా ప్రతిస్పందించవద్దని నచ్చచెప్పడానికి ప్రయత్నించారు. కాని వాస్తవమేమంటే, ఒప్పందంపై సంతకాలు జరిగిన తర్వాతి నుంచి అప్పటి వరకు అనేక సందర్భాల్లో ఇలా ఒప్పంద ఉల్లంఘనలకు ఖురైష్ పాల్పడుతూనే వస్తోంది. ఇతర తెగలను ముస్లిములపై రెచ్చగొట్టే కుట్రలు పన్నుతూనే ఉన్నారు. ముస్లిములను బలహీనపరచడానికి, వారిపై దాడులు చేయించడానికి ప్రయత్నాలు జరిగాయి. కాని ఈసారి

పరిస్థితి మరింత తీవ్రమైంది. అందువల్లనే ఖురైష్ నాయకుడు అబూసుఫియాన్ స్వయంగా మదీనా వచ్చాడు. ప్రవక్తతో మాట్లాడాలనుకున్నాడు. మదీనాలో తనకు లభించే మద్దతును ముందుగా బేరీజు వేసుకున్నాడు. ఆయన కుమార్తె ఉమ్మె హబీబా స్వయాన ప్రవక్తకు భార్య. ఆ తర్వాత అలీ ఆయనకు సన్నిహితుడే. కాని వారి వద్ద మద్దతు దొరికే అవకాశం లేదని తేలిపోయింది. ప్రవక్త మౌనంగా ఉన్నారు. అనుచరులు కూడా మౌనంగానే ఉన్నారు. ఈ పరిస్థితిని ఎలా పరిగణించాలో అబూసుఫియాన్‌కు అర్థం కాలేదు. ప్రవక్త ఒక అంగీకారానిక రావాలన్న ప్రతిపాదనను తిరస్కరించారు. అబూసుఫియాన్ ఉత్తచేతులతో మక్కాకు వెనుదిరిగాడు. ఈ సంఘటనలు మక్కా వైపు ముస్లిమ్ సైన్యం కదులుతుందన్న సంకేతాలిచ్చాయి.

# మక్కా విజయం

ఆ తర్వాత ప్రవక్త తన అనుచరులను సంసిద్ధం చేశారు. అయితే ఏం చేయబోతున్నారన్నది రహస్యంగానే ఉంచారు. కేవలం కొద్దిమంది సన్నిహిత అనుచరులకు మాత్రమే తెలుసు. ముస్లిమ్ సైన్యం మరోసారి సిరియావైపు కదులుతుందన్న పుకార్లు వ్యాపించాయి. సిరియాకాదు, తాయిఫ్ అని, కాదు హవాజిన్ అని రకరకాలుగా పుకార్లు షికారు చేశాయి. ఈ పుకార్లు మొత్తం అరేబియాలో కలకలం రేపాయి.

ముస్లిం సైన్యం రమజాన్ మాసంలో బయలుదేరింది. ముస్లిములు ఉపవాసాలు పాటించే నెల అది. వారు మార్ అల్ జహ్రాన్ వద్దకు చేరుకున్న తర్వాత ప్రవక్త వారితో ఉపవాసాలు ఇక ఆపాలని సూచించారు. యుద్ధంలో ఉపవాసాలతో కొనసాగడం కష్టం. వారికి అవసరమైన శక్తి లోపిస్తుంది. మార్ అల్ జహ్రా శిబిరం ఒక కూడలిలోఉంది. అక్కడి నుంచి వారు నజ్ద్‌కు కాని, తాయిఫ్‌కు కాని, మక్కా కు కాని పురోగమించవచ్చు. మక్కా నుంచి మదీనా చేరుకున్న అబ్బాస్ కూడా అక్కడి నుంచి వచ్చి సైన్యంతో కలిశారు. వారు శిబిరాలు ఏర్పాటు చేసుకున్న తర్వాత ప్రవక్త ప్రతి సైనికుడు ఒక కాగడా వెలిగించాలని చెప్పారు. ఒక్కసారి పదివేల కాగడాలు వెలిగాయి. దూరాన చూస్తున్నవారికి ఒక పెద్ద సైన్యం వస్తున్నట్లు కనిపించింది. ఎందుకంటే, ఒక కాగడా కనీసం ఐదారుగురు సైనికులకు వెలుగునిస్తుంది. దూరం నుంచి చూసేవారికి ఈ సైన్యం సంఖ్య కనీసం యాభైవేలు అనిపిస్తుంది.

దాడి జరుగుతుందని భయపడుతున్న ఖురైషులు ఇతర తెగలు రాయబార బృందాలను పంపాయి.

# అబూసుఫియాన్

మరోసారి అబూసుఫియాన్ ప్రవక్త వద్దకు వచ్చారు. ఆయనతో పాటు ఇద్దరు ప్రతినిధులు కూడా ఉన్నారు. హాకిమ్, బుదేల్. వాళ్ళు ప్రవక్తను దాడి విరమించేలా ఒప్పించడానికి వచ్చారు. చాలా సేపు చర్చలు జరిగాయి. కాని ప్రవక్త గట్టి సంకల్పంతో ఉన్నారని వారికి అర్థమయ్యింది. అంతేకాదు, సైన్యంలో అనుచరులు, వారి నడవడి, ప్రశాంత వాతావరణం ఇవన్నీ గమనించారు. హాకిమ్, బుదేల్ ఇద్దరు కూడా అక్కడికక్కడే ఇస్లామ్ స్వీకరించాలని నిర్ణయించారు. అబూసుఫియాన్ కూడా తాను విశ్వాసవచనంలో మొదటి భాగాన్ని స్వీకరిస్తున్నానని అన్నాడు. అంటే ఒకేఒక్క దేవుడు తప్ప మరో దేవుడు లేడు అన్న భాగం వరకు, కాని ప్రవక్త ముహమ్మద్ హోదాకు సంబంధించి తనకు సందేహాలున్నాయని చెప్పాడు. విశ్వాసవచనంలో రెండవభాగాన్ని కూడా విశ్వసించాలంటే ఆయనకు ఇంకాస్త సమయం అవసరం. ఆ రాత్రి ఆయన అక్కడే ఉన్నాడు. ఉదయం ప్రాత:కాల ప్రార్థనల తర్వాత ముస్లిముల వ్యవహారశైలి వారి నడివడి, ఆధ్యాత్మిక సరళి చూసిన తర్వాత, ముస్లిములు ప్రవక్తతో వ్యవహరిస్తున్న తీరు చూసి, ఆ తర్వాత అబ్బాస్ ఇచ్చిన సలహా ఇవన్నీ ఆయనపై ప్రభావం వేశాయి. చివరకు ఆయన కూడా ఇస్లామ్ స్వీకరించి ముస్లిమ్‌గా మారాలని నిర్ణయించుకున్నాడు.

ప్రవక్తకు బాగా తెలుసు. అబూసుఫియాన్‌లో వచ్చిన మార్పు చాలా బలహీనమైనది. అబూసుఫియాన్‌తో పాటు లోయ చివరి వరకు వెళ్ళిరావాలని అబ్బాస్‌ను కోరారు. దారిలో ముస్లిమ్ సైన్యం కదలికలు అబూసుఫియాన్ చూడాలిన చెప్పారు. దీంతో అబూసుఫీయాన్‌పై పడవలసిన ప్రభావం పడింది. అంతకు ముందు అబ్బాస్ ప్రవక్త ముహమ్మద్‌తో మాట్లాడుతూ అబూసుఫియాన్ తనను అందరూ గౌరవించాలని కోరే మనిషి ఈ విషయాన్ని గుర్తుంచుకోండి అన్నారు. ప్రవక్త స్వయంగా మానసిక పరిస్థితిని అంచనా వేయడంలో నిపుణులు. ఆయన ఆ తర్వాత మక్కాకు ఒక వార్త పంపారు. మక్కా ప్రజల్లో ఎవరైతే అబూసుఫియాన్ ఇంట ఆశ్రయం పొందుతారో, లేదా కాబా ఆవరణలో ఆశ్రయం పొందుతారో లేదా తమ ఇండ్ల

నుంచి బయటకు రాకుండా ఉండిపోతారో వారికి ఎలాంటి భయం ఉండదని తెలియజేశారు. అబూసుఫియాన్ ముస్లిమ్ సైన్యం రాకముందే త్వరితగతిన మక్కా చేరుకున్నారు. అక్కడ స్వయంగా ఆయన భార్య హింద్, అబూజహల్ కుమారుడు ఇక్రమా వంటి వారు ఆయన్ను కించపరుస్తూ మాట్లాడారు. పిచ్చివాడన్నారు, పిరికివాడన్నారు. కాని అబూసుఫియాన్ అవేవీ లెక్కచేయలేదు, లొంగిపోవాలంటూ అందరికీ సలహా ఇచ్చాడు. ప్రవక్త సైన్యాన్ని ప్రతిఘటించవద్దని సూచించాడు.

ప్రవక్త ముహమ్మద్ ఖురైష్ నాయకుడు అబూసుఫియాన్‌ను తన మిత్రుడిగా మార్చేయడానికి కారణం ఆయన ఇస్లామ్ స్వీకరించడం మాత్రమే కాదు, ప్రవక్తకు అబూసుఫియాన్ వ్యక్తిత్వం బాగా తెలుసు. అబూసుఫియాన్ దేవుడిని మొదట గుర్తించాడు. తాను సుదీర్ఘకాలం పోరాడిన వ్యక్తిని దైవప్రవక్తగా అంగీకరించడానికి సిద్ధపడలేదు. తనతో సమానంగా మాత్రమే పరిగణించాడు. ఈ విషయాన్ని ప్రవక్త కూడా గ్రహించారు. అందుకే ఈ విషయమై ఆయన కూడా తొందరపడలేదు. అబుసుఫియాన్ ముస్లిములను పరిశీలించి తానే గ్రహించేలా ఊరుకున్నారు. అబూసుఫియాన్ ఇస్లామ్ స్వీకరించిన తర్వాత కూడా ఆయనలో హెూదా గౌరవాల పట్ల ఉన్న కోరిక ఎలాంటిదో కూడా ప్రవక్త గ్రహించారు. అందుకే ముస్లిమ్ సైన్యం క్రమశిక్షణ, బలసంపత్తి ఆయన చూసేలా చేశారు. ఈ సంక్షోభం సద్దుమణిగితే ఇలాంటి మహోన్నతమైన సైన్యంలో తన పాత్ర ఖచ్చితంగా ఉంటుందన్న భావం ఆయనలో కలుగజేశారు.

ప్రవక్త కొన్ని సందర్భాల్లో ప్రత్యేక గుణగణాలు, లక్షణాలను కూడా పరిగణనలోకి తీసుకుని అందుకు అనుగుణంగా వ్యవహరించేవారు. ప్రతి వ్యక్తిలోని ప్రత్యేక లక్షణాలే వ్యక్తిత్వాన్ని రూపొందిస్తాయి. సమానత్వం, న్యాయమే ఆయన సందేశం. కాని ఈ సందర్భంగా వ్యక్తుల్లోని ప్రత్యేక లక్షణాలను, శక్తిసామర్థ్యాలను కూడా దృష్టిలో ఉంచుకోవాలి.

# 18

# మహోన్నత విజయం

క్రీ.శ.630, జనవరిలో ప్రవక్త ముహమ్మద్ మక్కాను జయించారు. హిజ్రీ శకం ఎనిమిదవ సంవత్సరం రమజాన్ మాసం 10వ రోజు. దీన్ని మహోన్నత విజయంగా, ఫతే ముబీన్‌గా పిలిచారు. ప్రవక్త మదీనా నుంచి 3000 సైన్యంతో బయలుదేరారు. దారిలో ఆయన సైన్యంతో కలిసిన వివిధ తెగల సైన్యాలు అన్నీ కలిసి 10000 సైన్యం మక్కాలోకి ప్రవేశించింది. ప్రవక్త తన సైన్యాన్ని వివిధ డివిజన్లుగా విభజించారు. ఈ డివిజన్లన్నీ మక్కాను చుట్టుముట్టాయి. అన్ని ఒకేసారి మక్కాలోకి ప్రవేశించాయి.

సైన్యం "కదా" ప్రాంతం నుంచి మక్కాలో ప్రవేశించడానికి ప్రయత్నిస్తున్నప్పుడు ప్రవక్త సలహా మేరకు అబుసూఫియాన్‌ను అబ్బాస్ తీసుకెళ్ళి ఆ సైన్యం కదలికలు చూపించారు. వరుసగా ఒక్కో తెగకు సంబంధించిన సైనికపటాలం వారి పతాకంతో ముందుకు కదులుతున్నాయి. ఒక్కో సైనిక పటాలం వివరాలు అబూసుఫియాన్ అడగసాగాడు. పురోగమిస్తున్న సైన్యంలో సాద్ అక్కడినుంచి అబూసుఫియాన్‌ను చూశాడు. ఖురైషుల దౌర్జన్యాలు, అణిచివేతలు ఆయన కళ్ళముందు తిరిగాయి. అబూసుఫియాన్‌ని ఉద్దేశించి "ఈ రోజు మహా యుద్ధం రోజు. ఈ రోజు కాబా పవిత్రత మాదే" అని అరిచారు. ఈ మాటలు విన్న ప్రవక్త ముఖం జేవురించింది. సాద్ మాటలను ఆయన తీవ్రంగా ఖండించారు. సాద్ చేతిలో ఉన్న పటాలం పతాకాన్ని వెనక్కి తీసుకున వేరొకరికి ఇవ్వాలని ఆదేశించారు.

"ఇది కాబా ఔన్నత్యానికి సంబంధించిన రోజు. కారుణ్యం విలువ తెలిపేరోజు" అని వ్యాఖ్యానించారు. ప్రవక్త సైన్యాలను ప్రతిఘటించడానికి కొన్ని ఖురైష్ దళాలు ప్రయత్నించాయి. కొండల్లో ఉన్న ఈ దళాలకు సుహైల్, ఇక్రమా, సఫ్వాన్‌లు నాయకత్వం వహించారు. కాని మొదటి దాడిలోనే వారికి అర్థమయ్యింది. ఈ ప్రతిఘటన అర్థం లేనిదని. సుహైల్ తన ఇంటిలోనే శరణుపొందాడు. ఇక్రమా, సఫ్వాన్‌లు పారిపోయారు.

ఆ రోజు ఎలాంటి పోరాటాలు జరగరాదని ప్రవక్త చెప్పారు. అది కారుణ్యదినంగా ప్రకటించారు. ఎనిమిది సంవత్సరాల క్రితం ప్రవక్త ఈ నగరం నుంచి రహస్యంగా, హుందాగా తలెత్తుకు వెళ్ళారు. నేడు పట్టపగలు ప్రవక్త మక్కా నగరానికి తిరిగివచ్చారు. విజేతగా ప్రవేశించారు. కాని ఆయన తల వినమ్రంగా వంచుకుని వచ్చారు. ఆయన దేవునికి కృతజ్ఞతలు అర్పిస్తూ, తలవంచి దివ్యఖుర్ఆన్‌లోని అల్ ఫతా అధ్యాయన్ని పఠిస్తూ ప్రవేశించారు.

> "ఓ ప్రవక్తా! మేము నీకు స్పష్టమైన విజయాన్ని ప్రసాదించాము, అల్లాహ్ నీ పూర్వపు పొరపాట్లను, భావికాలపు పొరపాట్లను మన్నించాలని, నీపై తన అనుగ్రహాన్ని పూర్తి చేయాలని, నీకు రుజుమార్గం చూపాలని, నీకు గొప్ప సహాయం చేయాలని. ఆయనే విశ్వాసుల హృదయాలపై సకీనత్ (శాంతి సంతృప్తులను అవతరింపజేవాడు. తమ విశ్వాసానికి వారు అదనంగా మరొక విశ్వాసాన్ని కలుపుకోవాలని" (దివ్యఖుర్ఆన్ 48:1-4)

ప్రవక్త ముహమ్మద్ మక్కాలోకి అత్యంత వినమ్రంగా ప్రవేశించడమే కాదు, శత్రువుల పట్ల అసాధారణ కారుణ్యాన్ని ప్రదర్శించారు. వుజు చేసి అక్కడ నమాజు చేసుకున్నారు. కాస్సేపు విశ్రమించిన తర్వాత తన ఒంటె ఖాస్వపై కాబాకు వెళ్ళారు. అక్కడ ఏడుసార్లు ప్రదక్షిణలు చేశారు. ఆ తర్వాత దివ్యఖుర్ఆన్ వాక్యాలను పఠిస్తూ ఆయన తన కర్రతో లోపల ఉన్న విగ్రహాలను తొలగించారు.

> "సత్యం వచ్చేసింది. అసత్యం నవించింది. అసత్యం నవించక తప్పదు."
> (దివ్యఖుర్ఆన్ 17:81)

కాబా గృహం తాళం చెవులు ప్రవక్త వద్దకు తీసుకురాబడ్డాయి. లోపల వున్న చిత్రాలు అన్ని తుడిచేయాలని ఆదేశించారు. ఒకే ఒక్క దేవుని, చిత్రపటాలతో లేదా విగ్రహాలతో చూపించడం సాధ్యంకాని ఏకైక దేవుడి ఆరాధనకు నిర్మించబడిన కాబా పాతహోదాను పునరుద్ధరించారు.

> "ఆయనను పోలినదేదీ సృష్టిలో లేదు. ఆయన అన్నీ వినేవాడు. అన్నీ చూసేవాడూను" (దివ్యఖుర్ఆన్ 42 : 11)

మక్కాను వదిలిన తర్వాత ప్రవక్త చేస్తూ వచ్చిన ఆచరణలకు, బోధనలకు విరుద్ధంగా ఆయన ఇప్పుడు కాబాలో విగ్రహాలను తొలగించారు. విగ్రహాలు, చిత్రపటాలు లేని ఆరాధనాస్థలం మస్జిదులను ఆయన నిర్మిస్తూ వచ్చారు. ఒకే ఒక్క దేవుడి ఆరాధనాస్థలాలుగా

వాటిని నిర్మించారు. నిజానికి కాబాగృహం అలా స్వచ్ఛమైన ఆరాధనకు నిర్మించబడిన ఆరాధనాస్థలమే. కాని శతాబ్దాల కాలక్రమంలో అందులో కాలుష్యాలు ప్రవేశించాయి. వాటిని ఆయన తొలగించారు. ఆవిధంగా కాబా అసలు హోదాను పునరుద్ధరించారు. ఇక అక్కడ ఒకే ఒక్క దేవుని ఆరాధన జరుగుతుంది.

ఖురైషులు నెమ్మదిగా తమ ఇండ్ల నుంచి బయటకు వచ్చి కాబా ఆవరణలో గుమిగూడారు. కాబాలో విగ్రహాలను తొలగించిన తర్వాత ప్రవక్త :

“ఒకే ఒక్క దేవుడు తప్ప మరో దేవుడు లేడు. ఆయనకు భాగస్వాములు లేరు. ఆయన తన వాగ్దానాన్ని నెరవేర్చాడు. తన దాసుడికి సహాయం చేశాడు. శత్రుతెగలను లొంగదీశాడు. ఆయన ఒక్కడే ఇదంతా చేసింది” అన్నారు.

ఆ తర్వాత ఆయన ఖురైషుల వైపు తిరిగి వారికి ఇస్లామ్ నియమాలు తెలియజేశారు. దివ్యఖుర్ఆన్ వాక్యాలను పఠించారు:

> “మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషునినుండి, ఒకే స్త్రీ నుండి సృజించాము. తరువాత మీరు ఒకరినొకరు పరిచయం చేసుకునేందుకు మిమ్మల్ని జాతులుగానూ, తెగలుగానూ చేశాము. వాస్తవానికి మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ గౌరవపాత్రుడు. నిష్చయంగా అల్లాహ్ సర్వజ్ఞానం కలవాడు, సకల విషయాలూ తెలిసనవాడూను.” (దివ్యఖుర్ఆన్ 49:13)

ఆ తర్వాత వారిని ఉద్దేశించి వారిపట్ల తన వ్యవహారశైలి ఎలా ఉంటుందనుకుంటున్నారని ప్రశ్నించారు. వారు జవాబిస్తు ఒక మంచి సోదరుడు, ఒక మంచి సోదరుడి కుమారుడి వ్యవహారశైలి ఉంటుందని, తప్పకుండా మేలైన రీతిలో ఉంటుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. అప్పుడు ప్రవక్త దివ్యఖుర్ఆన్‌లో ప్రవక్త యూసుఫ్ కథ ఉన్న వాక్యాలను వినిపించారు. ప్రవక్త యూసుఫ్‌ను ఆయన సోదరులు హత్యచేయాలిన ప్రయత్నించారు. చాలా కాలం తర్వాత ఆయన ఆ సోదరులను కలిసినప్పుడు కథను దివ్యఖుర్ఆన్ ప్రస్తావించింది.

> “ఈరోజు మిమ్మల్ని నిందించడం జరగదు. అల్లాహ్ కరుణించేవాడు.”
> (దివ్యఖుర్ఆన్ 12:92)

ఆ తర్వాత ఆయన వారితో వెళ్ళండి మీరు స్వేచ్ఛ పొందారని చెప్పారు.తన వద్దకు వచ్చిన స్త్రీ పురుషులందరికీ ఆయన క్షమాభిక్ష ప్రసాదించారు.

# కారుణ్యదినోత్సవం

ప్రవక్త ముహమ్మద్ విజేతగా మక్కాలో ప్రవేశించారు. కాని అక్కడ ఎలాంటి డప్పుల మోత లేదు. ఉత్సాహంతో ఉద్రూతలూగుతూ, బణాసంచా కాల్చడమూ లేదు. ఆయన తలవంచుకుని, దేవునికి కృతజ్ఞతలు తెలియజేస్తూ మక్కాలోకి ప్రవేశించారు. ద్వారంలో తలవంచి ప్రవేశించడండి అని అందరినీ ఆదేశించారు.

ప్రవక్త తన అనుచరుడు బిలాల్‌ను కాబాగృహం పైకెక్కి ముస్లిములను ప్రార్ధనకు పిలవాలని ఆదేశించారు. ప్రవక్త స్వయంగా ప్రార్ధనలకు నాయకత్వం వహించారు. ప్రార్ధనల తర్వాత ఆయన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. రెండు దశాబ్దాలుగా ఖురైషుల అణిచివేతలను, దౌర్జన్యాలను ప్రస్తావించారు. ఇప్పుడు నేను మీ పట్ల ఎలా వ్యవహరిస్తాననుకుంటున్నారని ప్రశ్నించారు. ఎదురులేని అధికారం ఆయన చేతుల్లో ఉ ందప్పుడు. ఆయన కనుసైగ చేస్తే చాలు వెంటనే అమలు పరిచే సైన్యం సంసిద్ధంగా ఉంది. మక్కా ఖురైషులు చేసిన దౌర్జన్యాలు, హింసాకాండ కూడా సాధారణమైనది కాదు. సైన్యంలో ఈ దౌర్జన్యాలకు గురయినవారు కూడా ఉన్నారు. ఇప్పుడాయన వద్ద బలమైన సైన్యం ఉ ంది. ఆయన కోసం ప్రాణాలు ధారబోయడానికి వెనుకాడని సైన్యమది. మక్కా నగరం ఆయన అధీనంలో ఉంది. ఆయనపై, ముస్లిములపై అమానుష హింసాకాండకు పాల్పడినవారు పరాజితులై నిలబడి ఉన్నారు. ఆయన తలచుకుంటే వారందరిని ఊచకోతకు గురిచేయడం క్షణాల్లో పని. అలాంటి శిక్షకు తగినవారే వారంతా. కనీసం వారి ఆస్తిపాస్తులు స్వాధీనం చేసుకోమని ఆదేశించినా క్షణాల్లో ఆ ఆదేశం అమలవుతుంది. ఎందుకంటే వారు ముస్లిముల ఆస్తిపాస్తులను దోచుకున్నవారే. వారందరినీ బానిసలుగా మార్చమని ఆయన ఆదేశించినా, వారంతా అందుకు తగినవారే. పైగా ఆనాటి సమాజిక నేపథ్యంలో విజేతలు చేస్తూ వచ్చింది అదే. కాని ఆయన అలాంటి ఆదేశాలు ఇవ్వలేదు. ఆయన కేవలం ఒకే ఒక్క వాక్యం చెప్పారు.

> "నేను మీ మీద ఎలాంటి ఆరోపణలు లేవు. ఎలాంటి ప్రతీకారం లేదు. వెళ్ళండి..
> మీరందరూ స్వతంత్రులు."

ఆయన చూపించిన ఈ కారుణ్యంతో ఆయన్ను తీవ్రంగా వ్యతిరేకించి ద్వేషించిన శత్రువులు కూడా ఆశ్చర్యపోయారు. అందులో చాలా మంది ఆయన్ను తీవ్రంగా పరాభవించినవారున్నారు. ఆయనతో భయంకరంగా యుద్ధాలు చేసినవారున్నారు. ఆయన

కుటుంబ సభ్యులను హతమార్చినవారున్నారు. ఆయనకు ఆప్తులైన అనుచరులను చంపినవారున్నారు. అందరినీ ఆయన క్షమించారు. అందరికీ భద్రత కల్పించారు.

## అత్తాబ్

ప్రవక్త ముహమ్మద్ అనుచరుడు బిలాల్ కాబాపైకెక్కి నమాజు కోసం అజాన్ ఇచ్చారు. ఇస్లామ్ పట్ల అత్యంత తీవ్రమైన విద్వేషం ఉన్న అత్తాబ్ బిన్ అసిద్ అజాన్ పలుకులు విని తన పక్కన ఉన్న మిత్రుడు అల్ హారిస్ తో వ్యంగ్యంగా మాట్లాడుతూ, నేడు నా తండ్రి బతికి ఉంటే ఇది చూసి కాబాపై నల్ల గాడిద అరుస్తుందనుకునేవాడు అని గుసగుసగా చెప్పాడు. బిలాల్‌ను దూషించాడు. కాని ప్రార్థన అయిపోయిన తర్వాత ప్రవక్త ప్రకటించిన ఈ సాధారణ క్షమాభిక్ష వినగానే ఒక్కసారి లేచి నిలబడ్డాడు. ప్రవక్త ముందుకు వచ్చి "నేను ఆసిద్ కుమారుడు అత్తాబ్, మీకు బాగా తెలిసిన శత్రువును. నేనిప్పుడు ప్రకటిస్తున్నాను. "ఒకే ఒక్క దేవుడు తప్ప మరో దేవుడు లేడు. ముహమ్మద్ దైవప్రవక్త" అన్నాడు.

ప్రవక్త చేసిన సాధారణ క్షమాభిక్ష ప్రకటన ప్రభావం అనూహ్యంగా కనబడింది. అత్తాబ్ ఒక్కడే కాదు, మక్కా నగరంలోని జనాభా మొత్తం ఆ రాత్రికి రాత్రే ఇస్లామ్ స్వీకరించింది. అత్తాబ్ ఇస్లామ్ స్వీకరించినట్లు ప్రకటించిన తర్వాత ప్రవక్త ఆయన్నే మక్కాకు గవర్నర్‌గా నియమించారు. ఆయన జీతభత్యాలు కూడా నిర్ధారించారు. రోజుకొక్క దిర్హమ్ జీతంపై ఆయన్ను మక్కా గవర్నర్‌గా నియమించడం జరిగింది.

## సఫ్వాన్

సఫ్వాన్ మక్కా నాయకుడు, ఇస్లామ్‌కు ప్రాణశత్రువు. ఉమర్ ఇస్లామ్ స్వీకరణకు ముందు, ఆయన్ను రెచ్చగొట్టి ప్రవక్త ముహమ్మద్‌ను హతమారిస్తే గొప్ప బహుమతి ఇస్తానని చెప్పినవాడు. మక్కా విజయం రోజున సఫ్వాన్ అక్కడి నుంచి జిద్దాకు పారిపోయాడు. అక్కడి నుంచి సముద్రమార్గాన ఎమన్ వెళ్ళిపోవాలనుకున్నాడు. ఉమర్ ప్రవక్త వద్దకు వచ్చి "ప్రవక్తా, సఫ్వాన్ తన తెగకు నాయకుడు, ఇప్పుడు భయపడి పారిపోయాడు. సముద్రంలో దూకినా దూకవచ్చు." అని సూచనాప్రాయంగా చెప్పి ఊరుకున్నారు. ప్రవక్త అర్థం చేసుకున్నారు. "అతనికి భద్రత ఉంది" అన్నారు. ఉమర్ చాలా ముక్కుసూటి మనిషి. "దైవప్రవక్తా, నాకు ఏదైనా భద్రత చిహ్నం ఇవ్వగలరా, అది చూసి సఫ్వాన్‌కు నమ్మకం కుదరడానికి" అని అడిగారు. ప్రవక్త చిరునవ్వుతో తన తలపాగా తీసి ఆయనకిచ్చేశారు. ఉమర్ ఆ తలపాగా తీసుకుని తిన్నగా సఫ్వాన్ వద్దకు వెళ్ళారు. కాని సఫ్వాన్ తాను మక్కాకు వస్తే ప్రాణభయం

ఉందని చెప్పాడు. ఉమర్ జవాబిస్తూ "సఫ్వాన్, ప్రవక్త ఎంత నమ్రతగా, ఎంత మృదువుగా వ్యవహరిస్తారో నీకు తెలియదు. ఆయనలోని క్షమాగుణం నీవు ఎరుగవు." అన్నారు. సఫ్వాన్ మక్కాకు తిరిగివచ్చి ప్రవక్త వద్ద హాజరయ్యాడు. "మీరు నాకు భద్రత ప్రకటించారని ఉమర్ చెప్పారు." అన్నాడు. "అవును నిజమే" అన్నారు ప్రవక్త.

సఫ్వాన్ జవాబిస్తూ తనకు రెండు నెలలు సమయం కావాలని అన్నాడు. రెండు నెలలు కాదు నాలుగు నెలలు ఆలోచించుకొమ్మన్నారు ప్రవక్త. ప్రవక్త అతడిని ఇస్లామ్ స్వీకరించాలని బలవంతం చేయలేదు. ఆలోచించుకోడానికి నిర్ణయం తీసుకోడానికి అవకాశం ఇచ్చారు.

## హబర్

ఇస్లామ్‌కు మరో ప్రాణ శత్రువు హబర్. ప్రవక్త ముహమ్మద్ కుమార్తె జైనబ్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన దుర్మార్గుడు. అప్పుడామె మక్కా నుంచి మదీనాకు వెళుతున్నారు. పైగా ఆమె గర్భవతి కూడా. హబర్ ఆమెపై దాడిచేసాడు. ఆమెను ఒంటెపై నుంచి కిందికి పడదోశాడు. ఆమె తీవ్రంగా గాయపడ్డారు. గర్భస్రావమయ్యింది. ప్రవక్త ప్రకటించిన క్షమాభిక్ష గురించి విని హబర్ తిన్నగా ప్రవక్త వద్దకు వచ్చాడు. "ప్రవక్తా, నేను పర్షియా పారిపోవాలనుకున్నాను. కాని మీరు ప్రకటించిన క్షమాబిక్ష, మీ అనుగ్రహాల గురించి విన్నాను. నేను నా అజ్ఞానాన్ని, నా నేరాలను ఒప్పుకుంటున్నాను. ఇప్పుడు నేను ఇస్లామ్ స్వీకరించడానికి వచ్చాను." అన్నాడు. ప్రవక్త అతడిని క్షమించి వదిలేశారు. ఒక గొప్ప కారుణ్యభావం అక్కడి వాతావరణంలో అలుముకుంది.

## అబూసూఫియాన్

అబూసుఫియాన్ గురించి అందరికీ తెలిసినదే. బద్ర్ యుద్ధం నుంచి అబూసుఫియాన్ ఇస్లామ్‌కు ప్రధాన శత్రువుగా కొనసాగాడు. ప్రవక్తకు వ్యతిరేకంగా జరిగిన యుద్ధాలు, హింసాకాండ యావత్తు అబూసుఫియాన్ నాయకత్వంలోనే జరిగింది. కాని అబ్బాస్ మక్కా విజయం రోజున అబూసుఫియాన్‌ను ప్రవక్త వద్దకు తీసుకువచ్చారు. ప్రవక్త ఆయన పట్ల చాలా మర్యాదగా వ్యవహరించారు. ఉమర్ అయితే కోపంగా అబూసుఫియాన్‌కు మరణశిక్ష విధించాలన్నారు. కాని ప్రవక్త అతడిని క్షమించారు. క్షమించడమే కాదు, మక్కా విజయం రోజున అబూసుఫియాన్ ఇంట శరణు పొందినవారికి ప్రమాదం ఉండదన్న అభయ ప్రకటన కూడా చేశారు.

# హింద్

అబూసుఫియాన్ భార్య హింద్. ఆమె ఇస్లామ్‌ను తీవ్రంగా ద్వేషించింది. హంజాపై ప్రతీకారం తీర్చుకుంటానని ప్రతిజ్ఞ చేసింది. ఉహుద్ యుద్ధంలో హంజాను హతమార్చడానికి మనిషిని నియమించింది. హంజా భౌతికకాయం రొమ్ముచీల్చింది. కాలేయాన్ని బయటకు లాగి నమిలింది. స్వయాన ప్రవక్తకు పినతండ్రి అయిన హంజా పట్ల అత్యంత క్రూరంగా వ్యవహరించిన హింద్ కూడా ఆరోజు ప్రవక్త ముందు హాజరయ్యింది. తన నేరాలకు క్షమాభిక్ష కోరింది. ప్రవక్త ఆమెను కూడా క్షమించారు. ఆమె ఇస్లామ్ స్వీకరించి ఇంటికి వెళ్ళగాను విగ్రహాలన్నింటిని విరగ్గొడుతూ "నన్ను తప్పు దారి పట్టించింది మీరే" అని అరవడం చాలా మంది విన్నారు.

# ఇక్రమా

అబూజహల్ కుమారుడు ఇక్రమా. తండ్రి మాదిరిగానే ఇక్రమా కూడా ఇస్లామ్‌ను తీవ్రంగా ద్వేషించాడు. ఇస్లామ్ వ్యతిరేకత విషయంలో ఎన్నడూ రాజీపడలేదు. మక్కాలో తనకు ప్రాణభయం ఉందని గ్రహించిన వెంటనే ఎమన్ పారిపోయాడు. అతడి భార్య ఉమ్మె హాకిమ్ ఇస్లామ్ స్వీకరించింది. ఆమె ప్రవక్త వద్దకు వచ్చి తన భర్తకు శరణు ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. ఆమె విజ్ఞప్తిని మన్నించడం, ఆమె ఎమన్ వెళ్ళి భర్తను వెంటబెట్టుకుని మళ్ళీ ప్రవక్త వద్దకు వచ్చింది.

ఇక్రమా తన వద్దకు రావడాన్ని దూరంగా గమనించిన ప్రవక్త తన అనుచరులతో "అబూజహల్ కుమారుడు ఇక్రమా ఇస్లామ్ స్వీకరించడానికి మన వద్దకు వస్తున్నాడు. అతని తండ్రి పట్ల అవమానకరంగా మాట్లాడవద్దు. మరణించినవారని అవమానపరిస్తే బతికిఉన్నవారు బాధపడతారు. మీ మాటలు మరణించిన వారికి ఎలాగూ చేరవు." అన్నారు.

ఇక్రమాను చూసి ప్రవక్త లేచి గబగబ ఆనందంగా అతడివైపు నడిచారు. ఆయన భుజాలపై శాలువా జరిపోయినా పట్టించుకోలేదు. ఇక్రమాను చూసి "పారిపోవాలనుకున్న రౌతు..నిన్ను స్వాగతిస్తున్నాము" అన్నారు.

ఒకరు చేసిన తప్పులకు ఒకరిని బాధ్యులు చేయడం కుదరదని ప్రవక్త తన అనుచరులకు ఆచరణాత్మకంగా తెలియజేశారు. దివ్యఖుర్ఆన్ వాక్యాల ప్రకారం తండ్రి చేసిన తప్పులకు కూడా సంతానం బాధ్యత వహించదు.

"బరువు మోసేవాడెవడూ మరొకరి బరువును మోయడు." (దివ్యఖుర్ఆన్ 17:15)

దివ్యఖుర్ఆన్ స్పష్టంగా ఈ ప్రకటన చేసింది. అణగారిన ప్రజలు విజేతలైనప్పుడు వారు మానవీయంగా హుందాగా వ్యవహరించాలని పేర్కొన్నది.

"...కనుక వారికి భూమిపై అధికారాన్ని ప్రసాదిస్తే, వారు నమాజ్‌ను స్థాపిస్తారు. జకాత్ ఇస్తారు. మంచి చేయమని ఆజ్ఞాపిస్తారు. చెడునుండి నిరోధిస్తారు." (దివ్యఖుర్ఆన్ 22:41)

ఇలాంటి మేలైన వ్యవహారశైలికి ఆచరణాత్మక ఉదాహరణగా ప్రవక్త జీవించారు. పగ ప్రతీకారం, సంపద, అధికారం వీటి పట్ల ఆయనెప్పుడు ఆసక్తి చూపలేదు. ఆయన తలవంచుకుని మక్కాలో ప్రవేశించారు. కాబాగృహంలో దేవుని ముందు సాష్టాంగపడ్డారు. దేవునిపై తన నమ్మకాన్ని ప్రకటించారు. దేవుడికి కృతజ్ఞతలు అర్పించుకున్నారు. చివరకు మక్కాలో శాంతియుత వాతావరణాన్ని స్థాపించారు.

# హృదయాల పరివర్తన

విజేతలు సాధారణంగా పరాజిత ప్రాంతాల్లో చాలా క్రూరంగా వ్యవహరిస్తారు. చరిత్రలో ఇలాంటి సంఘటనలు అనేకం. కాని ప్రవక్త పరాజిత ప్రజల పట్ల దయాభావంతో వ్యవహరించారు. ప్రాణశత్రువులను సయితం క్షమించి వదిలేశారు.

ఖురైషులు రెండు దశాబ్దాలకు పైబడి ప్రవక్తను, ఆయన అనుచరులు తీవ్ర పరాభవాల పాలు చేశారు. ఎగతాళి చేశారు. చిత్రహింసల పాలు చేశారు. రాళ్ళతో కొట్టారు. ప్రవక్తను హతమార్చే ప్రయత్నాలు జరిగాయి. ఆయన కుటుంబాన్ని, అనుచరులు నిర్బంధించారు. సాంఘిక బహిష్కరణకు గురిచేసి ఆకలికి అలమటించేలా చేశారు. ఇదంతా చేయడానికి కారణం ఒక్కటే దేవుడు ఒక్కడే అని చెప్పడం. మనుష్యులంతా ఒక్కటేనని చెప్పడం. ఇస్లామ్‌ను నిర్మూలించడానికి ఖురైషులు చేయని ప్రయత్నం అంటూ లేదు. కాని మూడు యుద్ధాలు చివరకు మక్కా విజయం తర్వాత ఖురైషులు పరాజిత జాతిగా మిగిలారు. ఇప్పుడు ప్రవక్త తలచుకుంటే ప్రతీకారం కష్టమేమీ కాదు. వారిన క్షమించడమే కాదు, వారు ఇంతకు ముందు దౌర్జన్యంగా లాక్కున్న ముస్లిముల ఆస్తులను, ముస్లిములు మదీనా వెళ్ళిపోయినప్పుడు ఆక్రమించుకున్న ఆస్తులను కూడా వారికే వదిలేశారు. అంతేకాదు అప్పటి వరకు సాంప్రదాయికంగా వారు నిర్వహిస్తున్న కాబా సంరక్షణ బాధ్యతలను కూడా వారికే విడిచిపెట్టారు. ఆయా హెూదాల్లో కూడా మార్పులు చేయలేదు.

మక్కా విజయం తర్వాత ప్రవక్త శాంతిస్థాపనకు, క్షమాభిక్షకు అధిక ప్రాధాన్యం ఇచ్చి తెలివిగా వ్యవహరించారు. దీనివల్ల ప్రజల హృదయాల్లో పరివర్తన వస్తుందని ఆయనకు తెలుసు. సంస్కరణకు మార్గాలు తెరుచుకుంటాయన్నది కూడా ఆయన గ్రహించారు. పగ ప్రతీకారాలు, శిక్షల వల్ల ఒక విషవలయం నిరంతరంగా కొనసాగుతూ ఉంటుంది. ఆయనకు కావలసింది ప్రజల హృదయాల్లో మార్పు. అది రావాలంటే ఉదారంగా వ్యవహరించాలి. వారు తమ తప్పులపై పశ్చాత్తాపపడే పరిస్థితిని సృష్టించాలి.

ఖురైష్ నాయకులు అరేబియా ద్వీపకల్పంలో ప్రముఖులు. మక్కాలో ఉన్నత హోదాల్లో ఉన్నవారు. తెలివితేటల రీత్యా, పాలనా వ్యవహారాల రీత్యా, ఆచరణాత్మక అనుభవం రీత్యా, పలుకుబడి, హుందాతనం, పాలనానుభవం రీత్యా యోగ్యులు. సైనికవ్యవహారాలు కాని, పరిపాలనా వ్యవహారాలు కాని వారికి బాగా తెలుసు. సుదీర్ఘ అనుభవం వారికి స్వంతం. వివిధ తెగల్లో వారికి పేరుప్రతిష్టలున్నాయి. వారిలో ఉన్న గొప్ప లక్షణాలు ప్రవక్తకు తెలుసు. వారిని ఉపయోగించుకోవడం వల్ల ఆయన తలపెట్టిన సంస్కరణా ఉద్యమం మరింత ముందుకు సాగుతుంది. అరేబియా నాయకత్వానికి కావలసి యోగ్యతలన్నీ వారికి ఉన్నాయి. ఇస్లామ్‌ను మరింత ముందుకు తీసుకెళ్ళే సామర్థ్యం వారికి ఉంది. ఒక గొప్ప నాగరికతను నిలబెట్టాలంటే అలాంటి ప్రజల సహాయసహకారాలు అవసరం. వారిని పరాజితులుగా పక్కకు నెట్టేయడం వల్ల అది సాధ్యం కాదు. ఖురైషులు తమ తాతముత్తాతల వ్యవస్థను గుడ్డిగా నమ్మారు, దాన్ని కాపాడుకోవడం కోసం ప్రాణాలకు తెగించి పోరాడారు. అదే నిబద్ధత వారు ఇస్లామ్ విషయంలో చూపించాలన్నది ప్రవక్త అభిప్రాయం. వారి హోదా గౌరవాలకు భద్రత కల్పిస్తే వారు ఇస్లామ్ వైపు మళ్ళుతారన్న ఆశ ఉంది. ఇస్లామ్‌కు ధార్మిక విశ్వాసం, ధర్మపరాయణత అత్యంత ముఖ్యం. అయితే ఇస్లామీయ నాయకత్వానికి చాకచక్యం, పలుకుబడి, అనుభవం, తెలివితేటలు, పాలనాదక్షత, సువిశాల భూభాగాలను అదుపుచేసి పాలించే సామర్థ్యం కూడా అవసరం. బలప్రయోగంతో ఖురైషులను అణిచివేయడం వల్ల వారి నుంచి ఎలాంటి ప్రయోజనాలు ఆశించలేము. ప్రవక్త మక్కా విజయం తర్వాత అత్యంత వినమ్రతతో, దేవుని స్తుతిస్తూ మక్కాలో ప్రవేశించిన దృశ్యం ఖురైషులకు ధైర్యాన్నిచ్చింది. వారు ప్రవక్త ముందుకు వచ్చి క్షమాభిక్ష కోరగలిగారు.

ఈ అసాధారణ క్షమాభిక్ష అరేబియా ద్వీపకల్పం రాజకీయ రూపురేఖల్ని మార్చేసింది. ఇస్లామ్ పట్ల తీవ్రమైన విద్వేషంతో బుసలు కొడుతున్న శత్రువులను సయితం ఇస్లామ్ ఛత్రఛాయల్లోకి వచ్చేలా చేసింది.

# దేవుడా నేను అమాయకుడిని

మక్కా విజయం తర్వాత ప్రవక్త అక్కడ పందొమ్మిది రోజులు ఉన్నారు. నెమ్మదిగా పరిస్థితి కుదుటపడింది. మదీనాకు వెళ్ళే ముందు ఆయన తనతో మైత్రి ఒప్పందాలు చేసుకున్నవారు నిజంగా విగ్రహారాధన మానేశారా లేదా అన్నది ధృవపరచుకోడానికి కొన్ని బృందాలను పంపించారు. బనూ జదీమా తెగ వద్దకు ఇలాంటి బృందానికి నాయకుడిగా ఖాలిద్ వెళ్ళారు. అక్కడ ఘర్షణ జరిగింది. బనూ జదీమా చివరకు ఆయుధాలు విడిచి లొంగిపోయింది. అబ్దుర్రహ్మాన్ ఔఫ్ సలహాను కూడా పెడచెవిన పెట్టి ఖాలిద్ యుద్ధఖైదీలకు మరణశిక్ష విధించారు. నిజానికి ఆయనకు ముందు నుంచి ఆ తెగపట్ల అయిష్టం ఉంది. మరణశిక్ష కొందరికి అమలైన తర్వాత అబ్దుర్రహ్మాన్ ఔఫ్ ఇక భరించలేకపోయారు. ఆయన తీవ్రంగా అభ్యంతరపెట్టారు. ఖాలిద్ తన వ్యక్తిగత కారణాలతో ఈ శిక్షలు విధిస్తున్నాడని, న్యాయానికి, దైవ విశ్వాసానికి ఈ శిక్షలకు ఎలాంటి సంబంధం లేదని గట్టిగా చెప్పి శిక్షలను అడ్డుకున్నారు.

ఖాలిద్ వ్యవహారం తెలిసి ప్రవక్త చాలా ఆగ్రహించారు. ఆయన మరణించిన వారందరికీ పరిహారం చెల్లించాలని నిర్ణయించారు. క్రింది మాటలు వల్లెవేస్తూ పోయారు.

"దేవుడా, ఖాలిద్ చేసిన పనికి నాకు సంబంధం లేదు, నేను అమాయకుడిని." ఆ తర్వాత ఆయన స్పష్టంగా ప్రకటించారు. "ఎవరైన వ్యక్తి, సమూహం లేదా రాజ్యం మానవ జీవితానికి హాని కలిగిస్తే, మతం పేరుతో అమాయకులను హతమార్చడం, బీభత్సాన్ని సృష్టించడం వంటి పనులకు పాల్పడి ప్రవక్త పేరును వాడుకుంటే, ఆ చర్యలు ఇస్లామ్ దెబ్బతీసేవిగా ఉంటే వాటితో ఇస్లామ్‌కు ఎలాంటి సంబంధం లేదు".

మక్కా ముస్లిములు, మదీనా ముస్లిముల మధ్య అవగాహన పెంచడానికి ఇంకా కొంత కాలం గడవవలసి ఉంటుంది. పాత అలవాట్లు, పాత వైరాలు అప్పుడప్పుడు తలెత్తుతూనే ఉంటాయి. పైగా మక్కా ప్రజలు ఒకేసారి ఇస్లామ్ స్వీకరించడం జరిగింది. వారి శిక్షణకు ఇంకా సమయం పడుతుంది. ప్రవక్త తన అనుచరుడు మాజ్ బిన్ జబాల్‌కు ఈ బాధ్యత

అప్పగించారు. మక్కాలో ఇస్లామ్ స్వీకరించిన వారికి ఇస్లామీయ శిక్షణకు ఏర్పాట్లు చేయమన్నారు.

కష్టాలలో కనబడిన సమైక్యత సాధించడం తేలిక. కాని ప్రేమ, ధార్మిక విశ్వాసం, గౌరవాల ప్రాతిపదికన సమైక్యత సాధించడం చాలా కష్టం. ఈ సమైక్యతను సాధించవలసి ఉంది.

ఇది భౌతికమైనది కాదు, ఆధ్యాత్మికమైన ప్రయాణం. హృదయాలను గెలుచుకునే అత్యుత్తమ జిహాద్ ద్వారా ప్రజలను ఉద్రిక్తతలు, వైరాల వాతావరణం నుంచి ఆధ్యాత్మిక బోధనల ద్వారా శాంతియుత వాతావరణానికి ఆహ్వానించే ఉత్తమ ప్రయత్నమది.

# ఆదర్శ సంస్కర్త

ప్రవక్త ముహమ్మద్ తన అనుచరులందరికీ, స్త్రీలైనా, పురుషులైనా పూర్తి భావప్రకటనా స్వేచ్ఛ ఇచ్చేవరు. అవసరమైతే విమర్శించే స్వేచ్ఛ కూడా ఉండేది. ఆయనెన్నడూ ఈ విమర్శలను తన హెూదా గౌరవాలకు వ్యతిరేకంగా భావించలేదు. తన వైఖరి ద్వారా ఆయన అనుచరుల్లో ఆత్మవిశ్వాసాన్ని సృష్టించారు. వారి తెలివితేటలను, దక్షతా సామర్థ్యాలను గౌరవిస్తానన్న స్పష్టమైన సూచన ఆయన వ్యవహారశైలిలో ఉండేది. అనుచరులు ఆయన పట్ల వల్లమాలిన ప్రేమాభిమానాలు, విధేయత కలిగి ఉండేవారు. ఆయనెల్లప్పుడు వారికి అందుబాటులో ఉండేవారు.

ఆయన చేపట్టింది ఒక సంస్కరణా ఉద్యమం. అది ఆయన సాధించి చూపించారు. అందరికీ ఆదర్శంగా జీవించారు. తన ఆచరణలతో తన జీవితాన్నే ఉదాహరణగా వారి ముందు ఉంచారు. అనుచరులను ఆయన తీర్చిదిద్దారు. వారి వ్యక్తిత్వాలను అత్యున్నతంగా మలిచారు. ఆయన వ్యవహారశైలి విశిష్టమైనది. మానవప్రవృత్తి రీత్యా అందరికీ అనుసరించదగ్గది.

ఆయన సంస్కరణ విషయంలో ఎలా వ్యవహరించేవారో చెప్పే కొన్ని ఉదాహరణలు చూద్దాం.

# రాజు పేద తేడా లేదు

ఆయన అందరిపట్ల సమానంగా వ్యవహరించేవారు. ఆయన కారుణ్యం అందరికీ ఒకేలా ఉండేది. పర్షియన్లయినా, రోమన్లయినా, గ్రీకులయినా, ఈజిప్టు ప్రజలైనా, సూడానీలైనా, అబిసీనియన్లయినా అందరినీ ఒకేలా చూసేవారు. సల్మాన్ ఫార్సీ, సుహైల్ రూమీ, ఉస్మాన్ నజ్దీ, జందాల్ రాజు, హామిర్ చక్రవర్తి, ఎమన్ ప్రధాన పూజారి థూమాద్ వంటి ప్రముఖులు కూడా ఆయన సమావేశాల్లో సాధారణ ప్రజలతో పాటు సమానంగా కూర్చునేవారు. రాజకీయ,

సామాజిక, ఆర్థిక హోదా కారణంగా వివక్ష చూపడం జరిగేది కాదు. అందరినీ ఒకేవిధంగా ప్రేమాభిమానాలతో పలకరించేవారు.

## వాస్తవికతా దృక్పథం

అనుచరులు అనుసరించే జీవన విధానాన్నే ఆయన పాటించారు. ఒక కథనం ప్రకారం ఆయన అనుచరులు కొందరు తాము చాలా ధర్మపరాయణ జీవితాన్ని గడుపుతున్నామని గర్వంగా చెప్పుకున్నారు. ఒకరు తాను అస్సలు పెళ్ళి చేసుకోనన్నాడు. రెండవ వాడు మాంసాహారాన్ని పూర్తిగా త్యజించానన్నాడు. మూడవవాడు తాను కటిక నేలమీదే పడుకుంటున్నానన్నాడు. నాల్గవవాడు తాను ప్రతిరోజు ఉపవాసం ఉంటున్నానని చెప్పాడు. ప్రవక్త వారితో "సర్వ స్తోత్రాలు కేవలం దేవుడికే, నేను పెళ్ళి చేసుకున్నాను. నేను ధర్మపరాయణతతోనే బతుకుతున్నాను. మాంసాహారం తింటాను. నేను ఉపవాసాలు ఉంటాను, ఆహారమూ తింటాను, పడుకుంటాను, మేలుకుని ఉంటాను" అన్నారు. ఈ మాటల ద్వారా ఈ అతివాదాలన్నింటిని ఆయన నిర్మూలించారు.

ఆయన ఒక చక్కని సమతుల్యాన్ని చూపించారు. మనిషి ధార్మిక ఆచరణలు, ప్రాపంచిక ఆచరణల మధ్య స్పష్టమైన సమతుల్యాన్ని ఆయన సాధించి చూపించారు. ఆయన ప్రాపంచిక వ్యవహారాలకు అధిక ప్రాముఖ్యమూ ఇవ్వలేదు, ధార్మిక ఆచరణలను తక్కువ చేసి చూపించనూ లేదు. ఆయన సంపద కూడబెట్టుకోడాన్ని, ప్రాపంచిక వ్యామోహాలను తిరస్కరించారు. కాని, కఠినంగా అన్నీ త్యజించి బతకమనలేదు. ఆయన జీవితాన్ని ధార్మిక జీవితం వేరు, ప్రాపంచిక జీవితం వేరుగా ముక్కలు చేయలేదు. ఇస్లామ్ జీవన వ్యవహారాల్లో అతివాదాన్ని ఇష్టపడదు. మధ్యమార్గాన్ని అవలంబించాలంటుంది. ఇస్లామ్ ఒకే భార్యను పెళ్ళాడాలని ప్రోత్సహిస్తుంది. కాని, తప్పనిసరి ఆంక్షగా విధించదు. శాంతిని ప్రోత్సహిస్తుంది. కాని యుద్ధం అవసరమైతే వారించదు. ఇస్లామ్ ముఖ్య సందేశం దేవుని విధేయత. మనిషి శక్తిసామర్థ్యాలు, మానవ ప్రవృత్తి, పరిమితులకు అనుగుణంగా మనిషి వ్యవహారశైలిని నియంత్రిస్తుంది.

## పాలకుడు

ప్రవక్త సాధారణంగా ఎవరైనా తననేమన్నా ప్రశ్నిస్తే ఆ ప్రశ్నకు తగిన సమాధానం, సమస్యకు తగిన పరిష్కారం లభించేవరకు ప్రవక్త చెప్పేవారు. ప్రవక్త సమావేశాల్లో ఈ పద్ధతి తెలియని

ఒక సంచార అరబ్బు అక్కడికి వచ్చి, మధ్యలో కలుగజేసుకుని "ప్రళయం ఎప్పుడు వస్తుంది" అనడిగాడు. ప్రవక్త తాను చెబుతుంది ముగించిన తర్వాత ఈ ప్రశ్న అడిగింది ఎవరని ప్రశ్నించారు. ఆ అరబ్బు లేచి నేనే అడిగానన్నాడు. ప్రజలు తమ విశ్వాసాన్ని వదులుకున్నప్పుడు ప్రళయం వస్తుందని ప్రవక్త చెప్పారు. ప్రజల్లో విశ్వాసం ఎందుకు పోతుందని ఆ వ్యక్తి మళ్ళీ అడిగాడు. ప్రభుత్వ వ్యవహారాలు అసమర్థుల చేతుల్లో ఉన్నప్పుడని ప్రవక్త జవాబిచ్చారు. అంతేకాదు ప్రజలు ఎలా ఉంటారో పాలకులు కూడా అలాంటివారే అవుతారని నొక్కి చెప్పారు.

# పేద ధనిక

తన సమావేశాల్లో ప్రవక్త ప్రజలను ముఖ్యంగా పేదవారిని కోళ్ళఫారాలు పెంచాలని సలహా ఇచ్చేవారు. తక్కువ పెట్టుబడితో ఇలాంటి వ్యాపారం ప్రారంభించవచ్చని, మంచి ఉపాధి లభిస్తుందని చెప్పేవారు. కాస్త ధనికులైతే గొర్రెలు, మేకలు, ఒంటెలు పెంచాలని సలహా ఇచ్చేవారు. ఇందులో పాలకుడిగా ఒక వివేకవంతమైన హెచ్చరిక కూడా నర్మగర్భంగా దాగి ఉంది. ధనికులు ఎక్కువ పెట్టుబడి అవసరమైన వ్యాపారాల్లోనే ఉండాలి, చిన్న వ్యాపారాలను పేదలకు వదిలేయాలన్న సూచన లాంటి హెచ్చరిక ఆయన మాటల్లో ధ్వనించేది.

ఒక ఆరోగ్యకరమైన సమాజానికి ఇలాంటి సమతుల్యం ఎంతైనా అవసరం. పెద్ద పెట్టుబడిదారులు చిన్న చిన్న వ్యాపారాల చైను ప్రారంభిస్తే చిన్న చితక వ్యాపారులు ఉపాధి కోల్పోతారు. సమాజంలో ఒకవిధమైన వర్గపోరాటానికి ఇది దారితీస్తుంది. సమాజంలో శాంతి సుహృద్భావాలు పూర్తిగా దెబ్బతింటాయి.

# సమతుల్యం

ప్రవక్త కొన్ని సందర్భాల్లో రోమన్ చక్రవర్తి, పర్షియా చక్రవర్తుల మాదిరి దుస్తులు కూడా ధరించేవారు. అప్పుడప్పుడు అబిసీనియా రాజు నీగస్ పంపిన తోలు పాదరక్షలు ధరించేవారు. ఒకసారి ఆయన అనుచరుడు సాద్‌కు ఛాతీ నొప్పి వస్తే వెంటనే మదీనాలో ఉన్న క్రయిస్తవ వైద్యుడు హారిస్ వద్దకు తీసుకెళ్ళమని సలహా ఇచ్చారు. ప్రవక్త తన అనుచరులకు భారతీయ ఔషధాలు ఉపయోగించాలంటు సలహా ఇచ్చేవారని తెలుస్తోంది.

# దేవుడు సౌందర్యవంతుడు ఆయన సౌందర్యాన్ని ఇష్టపడతాడు

ప్రవక్త ఈ మాటలు చెప్పారు. దీనికి అర్థం మన మంచి ఆచరణల ద్వారా మనం సాధించే సౌందర్యాన్ని ఆయన ఇష్టపడతాడు. మనం విద్య, జ్ఞానం, కరుణ, స్వచ్ఛత, సద్గుణాలు కలిగి ఉంటే ఆయన ఎంత ఇష్టపడతాడో సచాచరణల ద్వారా సాధించుకునే అంతర్గత సౌందర్యాన్ని కూడా ఆయన అలాగే ఇష్టపడతాడు.

# పరిశుభ్రత సగం ధార్మికత

ఒకసారి ప్రవక్త ముహమ్మద్ ఇలా అన్నారు "పరిశుభ్రత సగం ధార్మిక విశ్వాసం (ఈమాన్). ప్రవక్త ముహమ్మద్ చెప్పిన ఈ మాటలను ఆయిషా వివరించారు. "ఇస్లామ్ ధర్మం పరిశుభ్రతపై ఆధారపడి ఉంది."

ప్రవక్త తన శరీరాన్ని, దుస్తులను ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచుకునేవారు. క్రమం తప్పకుండా స్నానం చేసేవారు. అనుచరులను కూడా శుభ్రంతా ఉండాలని బోధించేవారు. ఆయన అనుచరుడు జాబిర్ ప్రకారం ఒకసారి ప్రవక్త వారిని చూడ్డానికి వచ్చారు. అక్కడ ఒక మనిషి మురికి దుస్తులు ధరించి ఉండడాన్ని చూశారు. "ఈ మనిషికి తన దుస్తులు ఉతకడానికి ఏమీ దొరకలేదా" అని ప్రశ్నించారు.

అబ్దులా బిన్ ఉమర్ ఇలా చెప్పారు : "నేను ప్రవక్త వద్దకు వెళ్ళి "ప్రవక్తా, నేను పరిశుభ్రమైన మంచి దుస్తులు ధరిస్తే అది అహంకారానిక చిహ్నమవుతుందా" అని ప్రశ్నించాను. ప్రవక్త జవాబిస్తూ "మంచి దుస్తులు ధరించడం అల్లాహ్ ఇష్టపడతాడు" అన్నారు."

అబ్దుల్లా బిన్ ఉమర్ ప్రకారం ఆయన ఇలా కూడా చెప్పారు : "ప్రార్థనలకు వెళుతున్నప్పుడు మంచి దుస్తులు ధరించండి. మనిషి అందరికన్నా ఎక్కువగా దేవుడికి రుణపడి ఉన్నాడు. అందువల్ల దేవుడి వద్దకు వెళుతున్నప్పుడు మంచి దుస్తులు ధరించాలి."

మరోవిధంగా చెప్పాలంటే మంచి దుస్తులు ధరించడం అన్నది అహంకారానికి చిహ్నం కాదు. ఇతరుల హక్కులను గుర్తించకపోవడం, ఇతరులను తక్కువగా చూడడం అహంకారమవతుంది.

# 19

# హునైన్

ముస్లిమ్ సమాజానికి మరిన్ని ప్రమాదాలు కాచుకున్నాయన్నది ప్రవక్తకు తెలుసు. చాలా తెగలు ఇంకా ఆయన అధికారాన్ని ఒప్పుకోలేదు. సరయిన సమయం కోసం ఎదురుచూస్తున్నాయి. హవాజిన్ తెగలు వారి మిత్రపక్షాలు కలిసి 20000 సైన్యాన్ని సమీకరించినట్లు వార్తలు వచ్చాయి. మక్కా తూర్పున ఈ సైన్యాల సమీకరణ జరుగుతోంది. దాడికి సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రవక్త పంపిన గూఢచారులు ఈ పుకార్లను నిజాలుగా నిర్ధారించారు. ముస్లిములు సత్వరం సంసిద్ధం కావలసి ఉంది. మదీనా నుంచి వచ్చిన ముస్లిములందరినీ సైన్యంలోకి తీసుకున్నారు. వారితో పాటు 2000 మంది ఖురైషులు కూడా వచ్చారు. ఇందులో చాలా మంది ఖురైషులు ఇస్లామ్ స్వీకరించారు. సుహైల్, సఫ్వాన్ వంటి వారు ఇస్లామ్ స్వీకరించకపోయినా ముస్లిమ్ సైన్యం పక్షాన వీరోచితంగా పోరాడారు.

హునైన్ యుద్ధంలో హవాజిన్, తకీఫ్ వంటి హింసాత్మక తెగలు పాల్గొన్నాయి. కామన్ ఎరా 630లో ఈ యుద్ధం జరిగింగి, అంటే హిజ్రీ శకం తొమ్మిదవ సంవత్సరం. మక్కాకు 16 కి.మీ. దూరంలో ఉన్న హునైన్ వద్ద ఈ యుద్ధం జరిగింది. ప్రవక్త ముహమ్మద్ 12000 సైన్యంతో వెళ్ళారు. ఆయన కమాండ్‌లో అతిపెద్ద సైన్యం ఇదే. అబూబక్ర్ వంటి అనుచరులు కూడా ఇంత పెద్ద సైన్యాన్ని చూసి గర్వంగా మన వద్ద భారీ సైన్యం ఉంది విజయం మనదే అన్నారు. ఈ మాటలు ప్రవక్తకు రుచించలేదు.

హవాజిన్ సైన్యాన్ని నడుపుతున్నది మాలిక్ బిన్ ఔఫ్. యువకుడు, యుద్ధనిపుణుడిగా పేరున్నవాడు. అతను తన సైనికులను వారితో పాటు వారి పిల్లలను కూడా తీసుకురమ్మన్నాడు. ఆవిధంగా భారిసంఖ్యలో సైన్యమున్నట్లు చూపించి శత్రువును భయపెట్టవచ్చన్నది అతడి ఎత్తుగడ. మాలిక్ లోయకు ఇరుపక్కలా భారీ సంఖ్యలో బలగాలను నియమించాడు. ఈ

బలగాలు రహస్యంగా మాటువేశాయి. మిగిలిన సైన్యన్ని లోయనుంచి వస్తున్న ముస్లిములకు ఎదురుగా కనబడేలా పంక్తులు తీర్చాడు. ముస్లిమ్ సైన్యం తెల్లవారుజామున లోయలో ప్రవేశించింది. మాలిక్ లోయకు ఇరువైపులా మాటువేసిన సైనికులకు దాడి ఆదేశాలు ఇచ్చాడు. ఇది హఠాత్తుగా జరిగిన దాడి. సైన్యానికి ముందుభాగాన నడుస్తున్న ఖాలిద్ ఈ దాడిని తట్టుకోవడం చాలా కష్టమైంది. ఇరుకుదారిలో ముస్లిమ్ సైన్యం దొరికిపోయింది.

కాస్త దూరాన వెనుక, కొంత విశాల ప్రదేశంలో ఉన్న ప్రవక్త ఏం జరుగుతుందో చూశారు. ఆయన వెంటనే కొందరు సన్నిహిత అనుచరులను పిలిచి సంప్రదించారు. అబ్బాస్ సహాయంతో చెల్లచెదరవుతున్న తన సైన్యాన్ని మళ్ళీ సమీకరించారు. అబ్బాస్ స్వరం చాలా బిగ్గరగా చాలా గంభీరంగా ఉండేది. ఆయన పిలుపులతో ముస్లిమ్ సైన్యం మళ్ళీ సమీకృతమైంది. ఎదురుదాడికి సిద్ధమయ్యింది. ఎదురుదాడి చాలా ఆకస్మికంగా, శత్రువు ఊహించనివిధంగా, భారీస్థాయిలో ఒకేసారి జరిగింది.

ఈ సైన్యంలో ఉమ్మె సులైమాన్ కూడా ఉన్నారు. ఆమె తన భర్తతో పాటు యుద్ధంలో దిగారు. ఆమె చూపిన ధైర్యసాహసాలు అందరినీ ఆశ్చర్యపరిచాయి. ఇప్పుడు శత్రువు వెనక్కితగ్గే పరిస్థితి వచ్చింది. చివరకు శత్రువులు నెమ్మదిగా వెనక్కి తగ్గడమే కాదు, చివరకు పారిపోవలసి వచ్చింది. ముస్లిమ్ సైన్యం వారిని వెంటాడింది. హవాజిన్ సైన్యాధ్యక్షుడు మాలిక్ చివరకు ప్రాణరక్షణకు తాయిఫ్‌లో తలదాచుకున్నాడు. ఆయనతో పాటు బనూ తఖీఫ్ తెగ సైన్యం కూడా తాయిఫ్ పట్టణంలో తలదాచుకుంది. మిగిలిన వారు కొండల్లో పారిపోయారు. శత్రువులకు భారీ ప్రాణనష్టం తప్పలేదు. మొత్తం యుద్ధరంగం పరిస్థితి మారిపోయింది. ముస్లిమ్ సైన్యం ప్రారంభంలో ఎదుర్కున్న ఆకస్మిక దాడి నుంచి తేరుకోవడమే కాదు, ఎదురుదాడిలో శత్రువును పూర్తిగా ఓడించింది. ఆ తర్వాత దివ్యఖుర్ఆన్ వాక్యం ఈ యుద్ధం నేర్పే విభిన్న ఆధ్యాత్మిక, వాస్తవిక, భావావేశపరమైన అంశాలను వివరించింది.

> "అల్లాహ్ ఇదివరకు చాలా సందర్భాల్లో మీకు సహాయం చేసి ఉన్నాడు. ఇటీవలనే హునైన్ సంగ్రామం రోజున ఆయన సహాయం యొక్క మహిమను మీరు చూసి ఉన్నారు. ఆ రోజు మీరు మీ సంఖ్యాబలాన్ని చూసి గర్వపడ్డారు. కాని అది మీకు ఏవిధంగాను పనికిరాలేదు. భూమి విశాలమైనది అయినప్పటికీ మీకు ఇరుకైపోయింది. మీరు వెన్ను చూపి పారిపోయారు. తరువాత అల్లాహ్ తన (తరుఫునుండి) ప్రశాంతస్థితి తన ప్రవక్తపై విశ్వాసులపై అవతరింపజేసాడు."
> (దివ్యఖుర్ఆన్ 9:25-26)

# యుద్ధసొత్తు

హవాజన్ సైన్యంలో పిల్లలు కూడా ఉన్నారు. శత్రుసైన్యంలో పట్టుబడిన మహిళలు, పిల్లలను బంధీలుగా నీడపట్టు ఉండే ఒక ఆవరణలో ఉంచారు. ప్రవక్త ముహమ్మద్ వచ్చేవరకు వారికి సరయిన అన్నపానీయాలు అందించారు. ఆయన వచ్చిన తర్వాత చూస్తే ఆ యుద్ధఖైదీల్లో చాలా మంది చింపిరి దుస్తులతో కనబడ్డారు. యుద్ధసొత్తు నుంచి పైకం తీసి బంధీలందరికి సరయిన దుస్తులు ఇవ్వాలని ఆయన ఆదేశించారు. ఆ తర్వాత మిగిలిన యుద్ధసొత్తులో నలభై వేల ఔన్సుల వెండి, 24000 ఒంటెలు, 40000 మేకలు అన్నీ సైన్యంలో పంచేశారు. యుద్ధఖైదీలుగా దొరికిన 6000 మందిని నిర్బంధంలోనే ఉంచారు. ఖచ్చితంగా హవాజిన్ తెగ నుంచి ప్రతినిధ బృందం ఈ యుద్ధఖైదీల విషయం చర్చించడానికి వస్తుందని ఆయన అంచనా వేశారు.

ప్రవక్త స్వయంగా యుద్ధసొత్తును పంచారు. ఆయన ఖురైషులకు, ముఖ్యంగా అబూసుఫియాన్, హాకిమ్ (ప్రవక్త భార్య ఖదీజాకు బంధువు)లకు ప్రాధాన్యం ఇచ్చారు. వారిద్దరు ఇటీవల ఇస్లామ్ స్వీకరించినవారు. అలాగే సుహైల్, సఫ్వాన్‌లు ఇస్లామ్ స్వీకరించలేదు, అయినా ముస్లిమ్ సైన్యంతో హునైన్ యుద్ధంలో పోరాడారు, వారికి కూడా ప్రాధాన్యత ఇచ్చారు. ఇది ఎప్పటి నుంచో ఇస్లామ్‌కు కట్టుబడి ఉన్న అన్సార్ ముస్లిములకు (మదీనా ముస్లిములు) ఆశ్చర్యం కలిగించింది. దివ్యఖుర్‌ఆన్ వాక్యం ఈ పంపకం వెనక ఉద్దేశ్యాన్ని తెలియజేసింది. ఎవరి హృదయాలైతే ఇస్లామ్ కోసం ఆలోచిస్తున్నాయో వారికి యుద్ధసొత్తు కొంతభాగం కేటాయించాలని పేర్కొన్నది. "ఎవరి హృదయాలను గెలుచుకోవడం అవసరమో వారికి...." (దివ్యఖుర్‌ఆన్ 9:60) అని పేర్కొంది.

ఇది ప్రజలను మార్చేమార్గం కాదు, కాని లోలోపల ధార్మిక విశ్వాసం ఉండి ఇంకా తటపటాయిస్తున్న వారికి కొంత సదుపాయం కలుగజేయడం మాత్రమే. సుహైల్, సఫ్వాన్ ఇద్దరు ఇస్లామ్ గురించి ఆలోచిస్తున్నారని ప్రవక్తకు తెలుసు, వారిద్దరు ముస్లిములతో కలిసి వీరోచితంగా యుద్ధంలో పాల్గొన్నారు. వారికి ప్రవక్త యుద్ధసొత్తులో ఎక్కువ భాగం ఇచ్చారు. అలా అని వారిని ఇస్లామ్ స్వీకరించాలని అడగనూ లేదు. మక్కా విజయంలో ఆయన చూపిన క్షమాగుణం, యుద్ధరంగంలో పరిస్థితి క్లిష్టంగా మారినప్పుడు ఆయన చూపిన ధైర్యం, చాకచక్యం, యుద్ధం ముగిసినప్పుడు చూపిస్తున్న ఉదారగుణం ఇవన్నీ చూసిన తర్వాత వారిద్దరిలో మార్పు వచ్చింది. ఆయన నిజంగానే దైవప్రవక్త, మామూలు మనిషిలో ఇలాంటి గుణగణాలు దుర్లభం అని భావించారు. ఇక అబూసుఫియాన్ విషయానికి వస్తే

ఆయన సామాజిక గౌరవహోదాలకు ప్రాణం ఇచ్చే మనిషని ప్రవక్తకు తెలుసు. అబూసుఫియాన్ మక్కా సైన్యాలను నడిపిన వాడు. అందుకే ఆయన హోదాను గుర్తిస్తున్నామన్న దానికి సూచనగా ఆయనకు అధికభాగం ఇచ్చారు.

ఇచ్చే చేయి పుచ్చుకునే చేయి కన్నా గొప్పది

హాకిమ్ తన భాగం స్వీకరించినప్పుడు కాస్త గొప్పగా అనుకున్నాడు. అతను తనకు లభించిన భౌతిక ప్రయోజనం చూసి చాలా సంతోషిస్తున్నట్లు కనబడ్డాడు. ప్రవక్త ముహమ్మద్ అతడికి ఆ ప్రయోజనాన్ని ఇస్తూనే ఒక ఉపదేశం కూడా చేశారు. సంపద కలిగి ఉండడం గర్వకారణం కాదని నర్మగర్భంగా చెప్పారు. క్రింది చెయ్యి కన్నా పైచేయి గొప్పదని చెప్పారు. కేవలం ధనాన్ని అడిగి తీసుకునే వారి కన్నా తమ వద్ద ఉన్నదాన్ని పేదలతో పంచుకునేవారు, ఇతరులకు ఇచ్చేవారు ఉన్నత హోదాల ఉంటారని తెలియజేశారు. తనకు వచ్చిన దాంట్లోంచి కొంత భాగాన్ని తనపై ఆధారపడి ఉన్నవారితో పంచుకోవాలని సలహా ఇచ్చారు. అంతేకాదు, ఏదన్నా తీసుకుంటున్నప్పుడు హుందాగా తీసుకోవాలని, ఇస్తున్నప్పుడు నమ్రతతో ఇవ్వాలని చెప్పారు.

# విధేయత

ప్రవక్త ముహమ్మద్ వైఖరిని అన్సారులు ఆశ్చర్యంగా గమనించారు. యుద్ధసొత్తు దాదాపు మొత్తం మక్కావారికే ఆయన పంచేశారు. దీనిపై కొందరు అన్సారులు కాస్త నిరాశగా అసంతృప్తిగా కూడా మాట్లాడారు. ప్రవక్తకు అవసరమున్నప్పుడు అండగా నిలబడిన మదీనా ప్రజలు చేసినదంతా ఆయన మరిచిపోయారని, తన స్వంత ప్రజలైన మక్కావారికే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని కూడా అనుకున్నారు. సాద్ ప్రవక్త వద్దకు అన్సారుల ప్రతినిధిగా వచ్చి వారి అభిప్రాయాలను తెలియజేశారు. ఆయన శ్రద్ధగా విన్నారు. తర్వాత మదీనా ముస్లిములందరినీ సమావేశపరచమని కోరారు. వారితో ఆయన వారితో మాట్లాడారు. తాను వారికి మార్గదర్శనమిచ్చానని దానికి వారు రుణపడి ఉన్నారని అలాగే తనకు అవసరమైనప్పుడు సహాయం చేసారని, అణిచివేతల నుంచి శరణు ఇచ్చారని అందుకు రుణపడి ఉన్నానని అంటూ, తాను ఏదీ మరిచిపోలేదని, మక్కా వారికి యుద్ధసొత్తులో అధికభాగం ఇవ్వడం చూసి నిరాశకు గురికారాదని, కొందరిలో చివురిస్తున్న విశ్వాసానికి బలమీయడానికి ఇది ఉపయోగపడుతుందని అంతకు మించి మరేమీ కాదని చెప్పారు. తన ద్వారా పొందిన యుద్ధసొత్తు పరిమాణాన్ని బట్టి వారిపట్ల తన ప్రేమను

లెక్కించరాదన్నారు. ఇహలోక సంపదను పొందాలన్న ప్రేమలో దేవుడి ప్రేమకు అర్థం మరిచిపోరాదన్నారు. అది ఈ లోకంలోని సంపదలకు అతీతమైనదని చెప్పారు. ఖురైషులు ఒంటెలు, మేకలు వెంటపెట్టుకుని ఇంటికి వెళుతున్నారు, అన్సారులు ప్రవక్తను వెంటపెట్టుకుని వెళుతున్నారు. ఆయన అక్కడే స్థిరపడాలనుకున్నారు. అదే ఆయన స్థానం అని చెప్పారు.

అంతేకాదు, ప్రజలంతా ఒక మార్గాన నడుస్తూ, అన్సార్లు వేరే మార్గాన నడుస్తున్నట్లయితే నేను అన్సార్ల దారిన వారితో పాటు నడుస్తాను. దేవుడు సహాయకులకు (అన్సార్లు) కరుణ చూపాలని ప్రార్థిస్తున్నాను. వారి సంతానాన్ని, సంతానం సంతానాన్ని కరుణించాలని ప్రార్థిస్తున్నా అన్నారు. ఈ మాటలు విన్న అన్సారులను భావావేశాల వరద తడిపేసింది. తాము ప్రవక్తను అర్థం చేసుకోవడంలో పొరబడ్డామని రోదించారు. ఆయన వారి వద్ద ఉండడమే ఆయన వారిని ఎంతగా ప్రేమిస్తున్నారన్నదానికి నిదర్శనం. కొందరిలో చివురిస్తున్న విశ్వాసాన్ని ప్రోత్సహించడానికి, కొందరిలో ఇంకా చావని ప్రపంచవ్యామోహాన్ని గుర్తించినందువల్లనే ఆయన అలా చేశారు అర్థం చేసుకున్నారు.

# భవిష్యవాణులు

ప్రళయాన్ని ఖచ్చితంగా ఎప్పుడు వస్తుందో చెప్పడం ఎవరికీ సాధ్యం కాదు. దాని గురించి కేవలం అల్లాహ్‌కు మాత్రమే తెలుసు. అయితే ఆలోచించే వారు కాస్త విశ్లేషించి ఊహించవచ్చు. పరిశోధనలు,పరిశీలనలు, లెక్కల ద్వారా విజ్ఞానశాస్త్రవేత్తలు ప్రళయాన్ని గుర్తించవచ్చు. ఒక మార్మికుడు, పుణ్యపురుషుడు తన అంతర్‌నేత్రంతో గుర్తించవచ్చు. కాని సాధారణ ప్రజలు తెలుసుకునేదెలా? సాధారణ ప్రజలు కూడా దేవుడు చెప్పిన ఈ సంఘటన తప్పక సంభవిస్తుందని గుర్తించవచ్చు. అందరికీ ఈ విషయమై సహాయం చేయడానికి చివరి ప్రవక్త ముహమ్మద్ (ఆయనకు శాంతి కలుగుగాక) ప్రళయదినం రాబోయే ముందు జరిగే వివిధ సంఘటనల గురించి వివరించారు. ఇవన్నీ సాధారణ దృష్టికి తెలిసే విషయాలే. దీన్ని తెలుసుకోడానికి శాస్త్రవేత్త మేధస్సుగాని, మార్మికుల అంతర్‌నేత్రం అవసరమూ లేదు. మనమందరం ఈ సంఘటనలను చూడవచ్చు. ముఖ్యమైన విషయమేమిటంటే, వాటిని చూసిన తర్వాత మనం గుణపాఠం గ్రహిస్తామా లేక కళ్ళు మూసుకుని మన అంతం వచ్చేవరకు వేచి ఉంటామా అన్నది ముఖ్యం.

ప్రళయానికి ముందు ప్రపంచంలో చోటుచేసుకునే కొన్ని సంఘటనల గురించి ప్రవక్త కొన్ని భవిష్యవాణులు వివరించారు. మనం నేడు జరుగుతున్న సంఘటనలను పరిశీలిస్తే ప్రళయం ఎంతో దూరంలో లేదనిపిస్తుంది.

ప్రవక్త సన్నిహిత అనుచరులు ఇబ్నె అబ్బాస్, అబూ హురైరాల ప్రకారం ప్రవక్త ముహమ్మద్ ప్రళయానికి ముందు జరిగే సంఘటనలను, పరిణామాలను ఈ క్రింది విధంగా వివరించారు.

- మానవరక్తానికి విలువ ఉండదు.
- చట్టాన్ని అతిక్రమించేవారు, చట్టాన్ని ఉల్లంఘించేవారు నాయకులైపోతారు.
- తెగలో అందరికంటే దుర్మార్గుడు తెగకు నాయకుడవుతాడు.
- సముదాయంలో అందరిలోను పనికిరాని వాడు నాయకుడైపోతాడు.

- పాపాలను పెద్దగా పట్టించుకోవడం జరగదు.
- విశృంఖలమైన, పశుతుల్యమైన కామవాంఛలు పెరుగుతాయి.
- పురుషులు పురుషులతో వ్యభిచరిస్తారు. స్త్రీలు స్త్రీలతో వ్యభిచరిస్తారు.
- పాటకత్తెలు, తీగల వాయిద్యాలు (గిటార్, పాప్ మ్యూజిక్ వంటివి) ఎక్కువవుతాయి.
- పాటకత్తెల సంఖ్య పెరుగుతుంది.
- మద్యపానం ఎక్కువవుతుంది.
- వడ్డీ పెరిగిపోతుంది.
- అబద్ధాలు చెప్పడం మంచిదనుకుంటారు.
- నిజం చెప్పేవారిని అబద్ధం చెప్పేవారితో వేరుగా చూడ్డం సాధ్యం కాదు.
- పిల్లలు తల్లిదండ్రుల పట్ల అవిధేయత చూపుతారు.
- మిత్రుడు మిత్రుడితో అనుచితంగా వ్యవహరిస్తాడు.
- ప్రార్ధనలను నిర్లక్ష్యం చేస్తారు.
- అధ్యయనం అనేది ధార్మికేతర ప్రయోజనాలకోసమే జరుగుతుంది.
- వర్షం వల్ల ప్రయోజనం ఉండదు, అకాలవర్షాలు కురుస్తాయి.
- భూకంపలు తరచు వస్తాయి
- ఎత్తయిన భవనాలు కట్టడానికి ప్రజలు పోటీపడతారు.
- చెడు చేస్తాడన్న భయంతోనే మనిషిని గౌరవించడం మొదలవుతుంది.

ప్రవక్త ఆ తర్వాత కొన్ని విషయాల గురించి ఇలా హెచ్చరించారు.

“తీవ్రమైన గాలులు, భూకంపాలు, స్వరూపాలు మారిపోవడం, రాళ్ళవర్షం, వంటి సూచనలు ఒక దారం తెగిన దండలోని పూసల్లా ఒకదాని తర్వాత ఒకటి వచ్చిపడతాయి.”

అనస్ ప్రవక్త ముహమ్మద్ ప్రవచనాన్ని ఇలా చెప్పారు.

“ప్రళయం సమీపించినప్పుడు జ్ఞానం అదృశ్యమవుతుంది. అజ్ఞానం ప్రపంచమంతా అలుముకుంటుంది. వ్యభిచారం పెచ్చుమీరిపోతుంది. మద్యపానం విపరీతమవుతుంది.”

ప్రస్తుతం ఈ పరిణామాలు కొన్ని మనం చూస్తూనే ఉన్నాం. ప్రపంచవ్యాప్తంగా మద్యపానం విపరీతమయ్యింది. లైంగిక విశృంఖలత్వం పెచ్చుమీరింది.

అబ్దుల్లా బిన్ సలామ్ ప్రళయం వచ్చే మొదటి సూచన ఏదంటూ ప్రవక్తను ప్రశ్నించారు. ప్రవక్త జవాబిస్తూ "ప్రళయం వచ్చే ముందు సూచన ఒక అగ్ని. అది ప్రజలను తూర్పు నుంచి పశ్చిమానికి తరుముతుంది." అన్నారు.

ప్రవక్త ముహమ్మద్ చెప్పిన ఈ మాటలకు వివరణ ఇస్తూ ముహమ్మద్ అసద్ (1900-1992), ఈయన ఇంతకు ముందు పేరు లియోపోల్డ్ వేస్, ఆస్ట్రియాకు చెందిన యూదుడు, ఇస్లామ్ స్వీకరించారు, పేరుపొందిన పాత్రికేయుడు, సంస్కర్త, దౌత్యవేత్త, మేధావి, రాజనీతి కోవిదుడు, ఆయన వివరణ ఇస్తూ ఇలా అన్నారు:

"ఇది ఒక సామాజిక విపత్తును సంకేతమాత్రంగా సూచించినట్లు తెలుస్తోంది. అంటే ప్రాచ్య సంస్కృతుల పునాదులను ఈ సామాజిక విపత్తు ధ్వంసం చేస్తుంది. తూర్పు దేశాల ప్రజలు పశ్చిమదేశాల వారిని గుడ్డిగా అనుకరిస్తూ పరుగెత్తేలా చేస్తుంది. దీన్ని ఒక అగ్నిగా వర్ణించడం జరిగింది. ఎందుకంటే ఒక అగ్నిలా పాశ్చాత్య వ్యవస్థ తూర్పు సంస్కృతులన్నింటినీ మింగేస్తుంది. ప్రాచ్యదేశాల గతాన్ని ఒక నిర్జీవ చరిత్రగా మార్చేస్తుంది. వారికి తమ చరిత్రతో వర్తమానానికి ఎలాంటి సంబంధమూ ఉండదు.

ప్రళయం రావడానిక ముందు సూచనలుగా ప్రవక్త చెప్పిన సంఘటనల్లో మరొకటి ఏమంటే, హఠాత్, ఆకస్మిక మరణాల సంఖ్య పెరగుతుంది.

దివ్యఖుర్ఆన్ పేర్కొన్న, ప్రవక్త చెప్పిన సూచనలను జాగ్రత్తగా పరిశీలిస్తే 1500 సంవత్సరాల క్రితం చెప్పిన ఈ మాటలలోని సంఘటనలను ఈ రోజు మనం కొన్నింటిని చూస్తున్నాం. నేటి హైటెక్ నాగరికత, ఉద్రిక్తలు, ఒత్తిళ్ళు, ఉగ్రవాదం, వేర్పాటువాదాలు, అలజడి, హత్యాకాండలు, వ్యభిచారం, మద్యపానం ఇవన్నీ ప్రళయాన్ని ఆహ్వానిస్తున్నాయి.

దీనికి అర్థమేమిటి? ఇది మానవాళికి ఒక హెచ్చరిక. ప్రళయం ఎంతో దూరాన లేదన్న హెచ్చరిక. అంతం తప్పదు. ఈ జ్ఞానంతో గుణపాఠాన్ని గ్రహించేది ఎవరు. పరలోక శిక్ష నుంచి తప్పించుకోవాలని ప్రయత్నించేది ఎవరు? మనం సంఘటనలను మార్చలేము, కాని మనల్ని మనం మార్చుకోవచ్చు.

ప్రవక్త ముహమ్మద్ ఇలా అన్నారు.

"ఆచరణలను వాటి వెనుక ఉద్దేశ్యాల ఆధారంగా చూడ్డం జరుగుతుంది."

కనీసం మనం సరయిన ఉద్దేశ్యాలు కలిగి వుండడానికి ప్రయత్నిద్దాం.

# ప్రవక్త ప్రవచనాలు

ఖాలిద్ (దేవుడు ఆయనపట్ల ప్రసన్నుడవుగాక) క్రింది ప్రవక్త ప్రవచనాన్ని వివరించారు

ఒకరోజు ఒక బదూయిన్ ఎడారి అరబ్బు ప్రవక్త వద్దకు వచ్చాడు. ఆయనతో "దైవ ప్రవక్తా! నేను మరణానంతర జీవితం గురించి కొన్ని ప్రశ్నలు అడగడానికి వచ్చాను" అన్నాడు.

ప్రవక్త జవాబిస్తూ "అడగాలనుకున్నది అడగవచ్చు" అన్నారు. ఆ ప్రశ్న జవాబుల పరంపర ఇలా కొనసాగింది.

*నేనందరికన్నా జ్ఞానవంతుడిని కావాలనుకుంటున్నాను.*

*దేవుడికి భయపడు, నువ్వు అందరికంటే జ్ఞానసంపన్నుడివవుతావు*

*నేను ప్రపంచంలో అందరికన్నా ధనవంతుడిని కావాలనుకుంటున్నాను*

*ఉన్నదాంతో తృప్తిపడడం నేర్చుకో, నువ్వే ప్రపంచంలో అందరికంటే ధనవంతుడివవుతావు.*

*నేను అందరికన్నా న్యాయశీలుడిని కావాలనుకుంటున్నాను*

*నీకు ఏది ఇష్టపడతావో ఇతరులకు కూడా అదే ఇష్టపడు. నువ్వు అందరికన్నా న్యాయశీలుడవవుతావు*

*నేనందరికన్నా ఉత్తముడ్ని కావాలనుకుంటున్నాను*

*ఇతరులకు మేలు చేయి. నువ్వే అందరికన్నా ఉత్తముడవవుతావు.*

నేనందరికన్నా బలవంతుడిని కావాలనుకుంటున్నాను.

నీవు ఒక్క దేవుడిని మాత్రమే నమ్ముకుంటే, నువ్వు అందరికన్నా బలవంతుడివి.

నేను దేవుడికి చాలా ఇష్టమైనవాడిని కావాలనుకుంటున్నాను.

దైవస్తోత్రంలో గడుపు. దేవుడికి అందరికంటే ఇష్టమైనవాడివవుతావు.

నేను నా ధార్మిక విశ్వాసాన్ని సంపూర్ణం చేసుకోవాలనుకుంటున్నాను.

మంచి నడవడి కలిగి ఉంటే నీ ధార్మిక విశ్వాసం సంపూర్ణమవుతుంది.

మంచి చేసేవారిలో ఉండాలనుకుంటున్నాను.

దేవుడిని నువ్వు చూస్తున్నట్లుగా ఆయన్ను ప్రార్థించు. నీకాయన కనబడకపోతే ఆయన నిన్ను చూస్తూ ఉంటాడు. ఈ విధంగా నువ్వు మంచి చేసేవారిలో ఒకడివవుతావు.

నేను దైవవిధేయుడిగా మారాలనుకుంటున్నాను.

నీవు దేవుని ఆదేశాలు పాటిస్తే నీవు దైవవిధేయుడివే

నా ఉపాధి పెంచుకోవాలనుకుంటున్నాను.

నీవు స్వచ్ఛంగా ఉంటే నీ ఉపాధి అల్లాహ్ పెంచుతాడు.

దేవుడు, దైవప్రవక్త నన్ను ప్రేమించాలని అనుకుంటున్నాను.

దేవుడు, దైవప్రవక్త ప్రేమించేవాటిని నువ్వు ప్రేమిస్తే నువ్వు కూడా వారు ప్రేమించేవారిలో ఒకటివి అవుతావు.

*తీర్పుదినాన నేను దేవుని ఆగ్రహం నుంచి భద్రత పొందాలనుకుంటున్నాను*

*నీ తోటివారిపట్ల నువ్వు కోపంగా వ్యవహరించకపోతే తీర్పుదినాన నువ్వు అల్లాహ్ కోపం నుంచి భద్రత పొందుతావు.*

*అల్లాహ్ నన్ను తీర్పుదినాన చిన్నబోయేలా చేయకూడదనుకుంటున్నాను.*

*నవ్వు నీ శీలాన్ని కాపాడుకుంటే, దేవుడు నిన్ను తీర్పుదినాన చిన్నబోయేలా చేయడు.*

*తీర్పుదినాన అల్లాహ్ నాకు రక్షణవలయం ఏర్పాటు చేయాలని భావిస్తున్నాను.*

*నీ తోటి వారి బలహీనతలను బట్టబయలు చేయకు. తీర్పుదినాన దేవుడు నీకు రక్షణ వలయాన్ని ఏర్పాటు చేస్తాడు.*

*దేవుని దృష్టిలో ఉత్తమమైన పనులేవి?*

*మృదువైన నడవడి, లజ్జ, సహనం*

*దేవుని దృష్టిలో నికృష్టమైన చెడులేవి?*

*ముక్కోపం, దురాశ.*

## 20

# మదీనా పట్ల ప్రవక్త ప్రేమ

మక్కాలో రెండువారాలు ఉన్న తర్వాత ప్రవక్త మదీనా వెనుదిరిగి వెళ్ళాలని నిర్ణయించారు. మదీనా వెళ్ళే ముందు ఆయన ఉమ్రా చేశారు. ఉమ్రా అంటే తక్కువస్థాయి కాబా యాత్ర. ఆయన శరణు కోరి మదీనా వచ్చారు. కాని ఇప్పుడు అదే ఆయన ఇల్లు అయ్యింది. మక్కా అలవాట్లు, సంస్కృతికి మదీనాకు మధ్య చాలా తేడా ఉన్నప్పటికీ, మక్కాలో ఆయన దాదాపు అర్ధశతాబ్దిపాటు నివసించినవాడయినప్పటికీ, ఆయన మదీనాలో స్థిరపడ్డారు. అక్కడి ప్రజల అలవాట్లు, సంప్రదాయాలను పరిశీలించారు. వారి మనోభావాలు, వారి ఆశలు అన్నింటినీ గమనించారు. తాను కూడా వారిలో ఒకరిగా మారారు. ఆయన మదీనా ప్రజలు అంటే అన్సార్లను చాలా ప్రేమించేవారు. మదీనా ప్రజల పట్ల ఆయన ప్రేమ వంశం, తెగల అభిమానం కాన్న చాలా ఎక్కువ.

నిత్యజీవితం కొనసాగుతోంది. ముస్లిముల సంఖ్య క్రమేణా పెరుగుతోంది. ప్రవక్త కొత్తగా ఇస్లామ్‌లోకి వస్తున్నవ ఆరి శిక్షణకు ఏర్పాట్లు చేయవలసిన అవసరం ఏర్పడింది. ఆయన ఈ పని తన సన్నిహిత అనుచరులకు అప్పగించారు.

వ్యతిరేకతలు, వైరాలు అప్పుడప్పుడు బయటపడేవి. ప్రవక్త చిన్న చిన్న సైనిక పటాలాలను పంపి తలెత్త సమస్యలను పరిష్కరిస్తూ వచ్చారు. అయితే మదీనాను సవాలు చేయాలని తీర్మానించుకున్న తెగలను ఎదుర్కోక తప్పని పరిస్థితి ఏర్పడసాగింది.

# మనసులోని మాట

ప్రవక్త ముహమ్మద్ ఉత్తరాదిన ఉన్న అరబ్బు బదూయిన్ తెగలపైకి సైనికదళాన్ని పంపించారు. ముఖ్యంగా బనూ ముర్రా తెగ యూద రైతులపై వరుసగా దాడులు చేస్తోంది. ఫదక్ ఓయాసిస్సు వద్ద వ్యవసాయం చేస్తున్న యూదరైతులు బనూ ముర్రా దాడులతో భయభీతులవుతున్నారు. ఈ ప్రాంతం ప్రవక్త అధీనంలో ఉన్న ప్రాంతం. ముస్లిమ్ దళంపై కూడా వారు తీవ్రంగా దాడి చేశారు. దళంలో ఉన్న ముప్పయి మంది ముస్లిములు ప్రాణాలొదిలారు. ప్రవక్త వెంటనే 200 మంది సైనికలుతో మరో దళాన్ని పంపారు. ఆ సైన్యంలో 17 సంవత్సరాల ఉస్మాన్ బిన్ జైద్. ఆ కుర్రవాడి తండ్రిని ప్రవక్త తన స్వంత కుమారుడిలా భావించేవారు.

యుద్ధం చాలా భయంకరంగా కొనసాగింది. అనేక తెగలు కలిసి ముస్లిమ్ సైన్యాన్ని నిర్మూలించాలని ఒక్కటయ్యాయి. ఫదక్ ఓయాసిస్సును ఆక్రమించుకోవాలని భావించాయి. చివరకు ముస్లిమ్ సైన్యం పై చేయి సాధించింది. బనూ ముర్రాలో ఒక సైనికుడు ఉస్మాన్ మరీ పిన్నవయస్కుడిగా ఉండడాన్ని చూసి ఎగతాళి వ్యాఖ్యలు చేశాడు. రెచ్చిపోయిన ఉస్మాన్ అక్కడికక్కడే ముఖాముఖి తేల్చుకోవాలనుకున్నాడు. ప్రత్యర్థి కాస్సేపటికే బలహీనపడి పారిపోవడం మొదలుపెట్టాడు. కాని కోపంతో ఉన్న ఉస్మాన్ వదలకుండా వెంటాడాడు. ముస్లిమ్ సైన్యం నాయకుడు వెనక్కి రమ్మని పిలిచినా, సైన్యం పంక్తులు వదలరాదని చెప్పినా కోపంలో ఉన్న ఉస్మాన్ పట్టించుకోలేదు. వెంటాడి అతడిని పట్టుకుని, కిందికి నెట్టి గాయపరిచాడు. ఆ బదూయిన్ సైనికుడు ఒక్కసారిగా “దేవుడు ఒక్కడే, ముహమ్మద్ దైవప్రవక్త” అంటూ ఇస్లామ్ స్వీకరిస్తున్న విశ్వాస ప్రకటన చేశాడు. ఉస్మాన్ ఉడుకురక్తం ఇదేదీ పట్టించుకోలేదు. అక్కడికక్కడే అతడిని హతమార్చాడు. ఆ తర్వాత అతను ముస్లిమ్ సైనిక శిబిరానికి వచ్చి జరిగింది చెప్పాడు. ముస్లిమ్ దళనాయకుడు, ఇతర సైనికులు కూడా అతడి వ్యవహారం చూసి మెచ్చుకోలేదు, దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉస్మాన్‌కి కూడా తాను చేసిన తప్పు తెలిసివచ్చింది.

మదీనాకు రాగానే ఉస్మాన్ తిన్నగా ప్రవక్త వద్ద హాజరయ్యాడు. ప్రవక్త సాదరంగా ఆహ్వానించి విజయం సాధించినందుకు శుభాకాంక్షలు తెలిపారు. ఉస్మాన్ దాచుకోకుండా ద్వంద్వయుద్ధం ఇతర వివరాలు చెప్పాడు. ప్రవక్త ఈ సంఘటనలో ఉస్మాన్ వ్యవహారాన్ని ఏమాత్రం ఇష్టపడలేదు, తన అయిష్టాన్ని ప్రకటిస్తూనే, “దేవుడు ఒక్కడే అని అతను చెప్పిన తర్వాత నువ్వు చంపావా?” అని ప్రశ్నించారు. అతను కేవలం ప్రాణాలు కాపాడ్డానికి మాత్రమే ఆ మాటలు చెప్పాడని ఉస్మాన్ జవాబిచ్చాడు. ప్రవక్త ఆగ్రహంగా “నువ్వతడి గుండెచీల్చి

లోపలేముందో, నిజం చెబుతున్నాడో, అబద్ధం చెప్పాడో తేల్చగలవా?" అని నిలదీశారు. ఉస్మాన్ భయంతో వణికిపోయాడు. తాను చేసింది క్షమించరాని తప్పని అర్ధమయ్యింది. ప్రవక్త చల్లబడి అతడిని క్షమించారు. యుద్ధసమయంలో అయినా శాంతి సమయంలో అయినా ప్రజలతో వ్యవహరిస్తున్నప్పుడు వారి మాటల పట్ల ఎలా ప్రతిస్పందించాలో ఇస్లామీయ పద్దతులేమిటో అతడికి బోధించి పంపారు.

ఆ బదూయిన్ సైనికుడు ఇస్లామ్ స్వీకరిస్తున్నట్లు చేసిన ప్రకటన దానికి బదులుగా తనను ప్రాణాలతో వదిలేయమన్న ప్రకటనే. కాని ఆ ప్రకటనలో నిజాయితీ ఉంటే అతడి హత్య ఆమోదయోగ్యం కాదు. ఒకవేళ అతను ప్రాణాలు కాపాడుకోడానికి అబద్ధమే చెప్పినా అతడి మాటలు శాంతియుత పరిష్కారానికి ఉపయోగపడతాయి. అలాంటి సందర్భాల్లో సహనంతోను, వివేకంతోను వ్యవహరించాలని దివ్యఖుర్ఆన్ స్పష్టంగా ఆదేశించింది.

''విశ్వసించిన ప్రజలారా! మీరు అల్లాహ్ మార్గంలో ''జిహాద్'' కొరకు బయలుదేరినప్పుడు, మిత్రులు శత్రువుల మధ్య విచక్షణ చేయండి. మీ వైపునకు సలాము చేస్తూ ముందుకు వచ్చేవాణ్ణి "నీవు ముస్లిమువు కావు" అని త్వరపడి అనకండి. మీరు గనక ప్రాపంచిక ప్రయోజనాలను పొందగోరితే, అల్లాహ్ వద్ద మీ కొరకు విజయధానాలు సమృద్ధిగా ఉన్నాయి. దీనికి పూర్వం స్వయంగా మీరూ ఇదే స్థితిలో ఉన్నారు కదా! ఆ తరువాత అల్లాహ్ మిమ్మల్ని కనికరించాడు. కనుక వివేచనతో వ్యవహరించండి. మీరు చేసేదంతా అల్లాహ్‌కు బాగా తెలుసు."
(దివ్యఖుర్ఆన్ 4 : 94)

బదూయిన్ సైనికుడు చావును చూసి శాంతి కోసం అప్పీలు చేశాడు. కాని ఉస్మాన్ తన కోపంలో, తన అహాన్ని సంతృప్తపరచడానికి, తనను ఎగతాళి చేసిన సైనికుడిని వదలరాదనుకున్నాడు. నిజానికి ఉస్మాన్ చేసింది పాత అరబ్బు తెగల అజ్ఞాన సంప్రదాయాలను అనుసరించడమే. అతడి ఇస్లామ్ అవగాహన లోపించింది. బదూయిన్ సైనికుడు అబద్ధం చెప్పినా నిజం చెప్పినా ఉస్మాన్ చర్య సమర్ధించదగింది కాదు. ఉస్మాన్ ఆ తర్వాత మరెన్నడూ అలా చేయరాదని గట్టిగా సంకల్పించుకున్నాడు. అలాగే పరివర్తన చెందాడు కూడాను. మూడేళ్ళ తర్వాత ప్రవక్త ముహమ్మద్ ఇహలోకాన్ని వదిలివెళుతున్నప్పుడు ఇస్లామీయ యుద్ధనియమాలను ఉస్మాన్‌కే అప్పగించారు.

మనుష్యుల మనస్సులో ఏమున్నదో తెలుసుకోవడం మానవ పరిధికి అతీతమైనది. స్వయంగా ప్రవక్త ముహమ్మద్ కూడా సందేహాస్పదమైన నిజాయితీ కలిగిన వారి విషయంలో

చాలా జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకునేవారు. ఆచితూచి వ్యవహరించేవారు. ఆయన చుట్టు అనేకమంది కపట విశ్వాసులున్నారన్నది ఆయనకు స్పష్టంగా తెలిసినా వారిపై ఖచ్చితమైన చర్యలెప్పుడూ తీసుకోలేదు. వారి విషయంలో తుదితీర్పు ప్రకటించలేదు. జాగ్రత్తగా వ్యవహరించేవారు.

# తబూక్

ఉత్తరాది నుంచి వస్తున్న వార్తలు చాలా ఆందోళనకరంగా మారాయి. రోమన్ చక్రవర్తి హెర్క్యులిస్ సేనలు, రోమన్ అరబ్బు తెగలు అన్నీ కలిసి ఒక భారీ దాడిచి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. అప్పటికి ప్రవక్తను వారు అరబ్బుల కొత్త చక్రవర్తిగా వారు భావించసాగారు. వెంటనే చర్య తీసుకోవలసిన అవసరం ఉంది. పైగా ఇది చాలా ప్రమాదకరమైన వ్యవహారం. రోమన్ సైన్యంతో తలపడడం కష్టమే. ప్రవక్త తన అనుచరులందరికీ ఎక్కడికి వెళ్ళవలసి ఉందో చెప్పారు. ఉత్తరాదికి సేనలు కదలాలి. శత్రుసైన్యాలు ఇటువైపు వస్తుంటాయి. వీలయితే వారి భూభాగంలోనే వారిని ఎదుర్కొని దిగ్భ్రాంతికి గురిచేయాలి. వారు తేరుకునేలోగా దాడిచేసి విజయాన్ని సాధించాలి. కాని సైన్యం కదలికలకు వాతావరణం అనుకూలంగా లేదు. భరించాని వేసవి. ఉత్తరాదికి చేరుకునే లోపల ఎడారిలో ఎండను తట్టుకోవడం తేలిక కాదు. యుద్ధ ఖర్చులకు ఎవరికి వీలయినంత విరాళం వారు ఇవ్వాలని ప్రవక్త అనుచరులకు కోరారు. ఉమర్ తన సంపదలో సగం తెచ్చి ఇచ్చారు. అబూబక్ర్ తన వద్ద ఉన్నదంతా ఊడ్చి తెచ్చి ఇచ్చారు. ఉస్మాన్ కూడా అదేవిధంగా సగం సైన్యానికి అవసరమైన సదుపాయాలు కల్పించారు. ఆ ప్రాంతంలో ఉన్న ఒంటెలు, గుర్రాలన్నీ సైనిక అవసరాలకు తీసుకోవడం జరిగింది. కాని సైనికులందరి అవసరాలకు ఆ వాహనాలు చాలవు. ఫలితంగా ప్రవక్త కొందరు అనుచరులు యుద్ధానికి తాము కూడా వస్తామని కోరినా, వాహనాల కొరత వల్ల ప్రవక్త వారిని రావద్దన్నారు. ఇలా నిరాకరించబడిన వారు చాలా బాధపడ్డారు. వారికి తెలుసు ఈ యుద్ధం ఎంత కీలకమైనదో. యుద్ధరంగంలో తమ అవసరం ఎలాంటిదో కూడా వారికి తెలుసు. కాని అక్కడికి చేరుకునే సాధనాలు లేవు. శత్రువు ఎంత బలమైనవాడంటే, పూర్తి ముస్లిమ్ సముదాయం భవిష్యత్తు ప్రమాదంలో పడింది.

మదీనాకు 500 కి.మీ దూరాన ఉన్న తబూక్ కొండ ప్రాంతానికి ముస్లిమ్ సైన్యం బయలుదేరింది. సిరియ నుంచి ముస్లిమ్ సైన్యం ముందుకుసాగింది. కామన్ ఎరా 630 చివరి నాటికి, అంటే హిజ్రీ శకం తొమ్మిదవ సంవత్సరం 30000 ముస్లిమ్ సైనికులు

రోమన్ సైన్యాలను ఎదుర్కోవడానికి ముందుకు నడిచారు. రోమన్ సైన్యం అప్పట్లో ప్రపంచంలో అతిపెద్ద సైన్యం. ప్రవక్త వెంట ఉన్న సైన్యం అరబ్బు ద్వీపకల్పంలో అదే పెద్ద సైన్యం, కాని రోమన్ల బలం చాలా ఎక్కువ. కేవలం ఇస్లామీయ రాజ్యం సరిహద్దుల్లోనే లక్షకు పైగా రోమన్ సైనికులున్నారు. రోమన్ సామ్రాజ్యం వంటి ఒక విదేశీ శక్తి ముందు తమ బలప్రదర్శన చేయడం ఇస్లామీయ రాజ్యానికి అదే మొదటిసారి.

రోమన్ సైనిక ప్రమాణాల ప్రకారం ముస్లిమ్ సైన్యం చాలా చిన్నది. కాని అత్యంత ధైర్యసాహసాలతో ముస్లిమ్ సైన్యం అంతదూరం ముందుకురావడం చూసి రోమన్ చక్రవర్తి వెనక్కి తగ్గాడు. ప్రవక్త ముహమ్మద్ ధైర్యంగా తీసుకున్న నిర్ణయం వల్ల ఆ చుట్టు పక్కలా అంతవరకు ముస్లిముల పట్ల వైరంతో ఉన్న అనేక తెగలు, రాజ్యాలు ముస్లిములతో మైత్రి ఒప్పందాలు చేసుకున్నాయి. అనేక రాజకీయ ఒప్పందాలు జరిగాయి.

తబూక్‌కు సైన్యాన్ని నడుపడం చాలా శ్రమతో కూడుకున్న పనే అయినప్పటికీ, ఈ నిర్ణయం వల్ల అనేక గొప్ప ఫలితాలు లభించాయి. ముస్లిమ్ సైన్యం బలప్రదర్శన అరేబియా ద్వీపకల్పం కళ్ళారా చూసింది. ప్రవక్త ముహమ్మద్ తలచుకుంటే ఎలాంటి సైన్యాన్ని సమీకరించగలరన్నది ఉత్తరాది అరబ్బు తెగలకు అర్ధమయ్యింది. అంతేకాదు, ఈ సైన్యం ఎంత చురుకుగా, ఎలాంటి వాతావరణ పరిస్థితులోనైనా ముందుకు కదిలింది. అనూహ్యంగా తబూక్ వద్ద రోమన్ సామ్రాజ్య సైన్యాలనే సవాలు చేయడానికి వచ్చింది. ఉత్తరాది అరబ్బు తెగలు ఈ బలప్రయోగంతో ఒక్కసారి ఖంగుతిన్నాయి. మదీనా రాజ్యం గురించి తమ అభిప్రాయాలను మార్చుకున్నారు. ప్రవక్త ప్రతిష్ట ఈ ప్రాంతంలో ఒక్కసారి పెరిగిపోయింది. ఎమన్ తదితర సుదూర ప్రాంతాలకు చెందిన తెగల ప్రతినిధి బృందాలు వచ్చి ప్రవక్తను కలుసుకుని, ఇస్లామ్ స్వీకరిస్తున్నట్లు ప్రకటించాయి.

తబూక్‌లో ప్రవక్త క్రయిస్తవ తెగలతోను, యూద తెగలతోను ఒప్పందాలు చేసుకున్నారు. వారు తమ మతాన్ని స్వేచ్ఛగా పాటించవచ్చు. మదీనాకు కప్పం చెల్లించవలసిన ఉంటుంది. వారిపై దాడులు జరిగితే మదీనా ముస్లిమ్ రాజ్యం రక్షణ కల్పిస్తుంది. ఇదే జిజియా. ఇది కొన్ని తెగలు చెల్లించిన సైనిక శిస్తు. ముస్లిములతో పాటు యుద్ధాల్లో పాల్గొనే అవసరం వారికి లేదు. ముస్లిమ్ సైన్యం వారికి రక్షణ కల్పించినందుకు బదులుగా చెల్లించే శిస్తు ఇది.

తబూక్ నుంచి ఖాలిద్ నాయకత్వంలో ప్రవక్త ఒక దళాన్ని మరింత ఉత్తరానికి పంపించారు. ఇరాక్, సిరియా మార్గంపై పట్టు సాధించడానికి గాను ఆ ప్రాంతంలోని వివిధ తెగలతో ఒప్పందాలు చేయించారు. తబూక్ నుంచి జయప్రదంగా ప్రవక్త మదీనాకు తిరిగి వెళ్ళారు.

# బృందాలు

హిజ్రీ శకం తొమ్మిదవ సంవత్సరాన్ని ప్రాతినిధ్య బృందాల సంవత్సరంగా పిలుస్తారు. మదీనాలో ముస్లిమ్ సముదాయం ఇప్పుడు ఒక శక్తివంతమైన రాజ్యంగా ఏర్పడింది. అరేబియా ద్వీపకల్పం నలుమూలల నుంచిప్రాతినిధ్య బృందాలు రావడం మొదలయ్యింది. ఒప్పందాలు, అంగీకారాలు ప్రారంభమయ్యాయి. అందరికన్నా ముందు వచ్చింది బనూ తకీఫ్. హవాజిన్ తెగ సర్దారు మలిక్ వల్ల తకీఫ్ తీవ్ర ఇబ్బందుల్లోపడింది. వారి పట్టణం ఇప్పుడు ఒక ముట్టడి పరిస్థితిలో ఉంది. చుట్టుపక్కల ఉన్న తెగల్లో దాదాపు అన్ని ఇస్లామ్ స్వీకరించడం కాని లేదా ప్రవక్తతో మైత్రి ఒప్పందం కాని చేసుకున్నాయి. ఈ పరిస్థితిలో బనూ తాకిఫ్ ఒక ముట్టడి లాంటి పరిస్థితిలో ఉంది. వారు ఇస్లామ్ స్వీకరించాలని నిర్ణయించారు. అయితే కొన్ని విషయాల్లో చర్చలు జరపాలని భావించారు. వారు లాత్ విగ్రహపూజ కొనసాగించాలనుకున్నారు. అలాగే నమాజు నుంచి మినహాయింపు కావాలన్నారు. ఈ అంశాలపై చర్చలకు ఏమాత్రం అవకాశం లేదని ప్రవక్త తిరస్కరించారు. ఇస్లామ్ స్వీకరించడమంటే ఒకే ఒక్క దేవుడిని తప్ప మరెవ్వరినీ  పూజించేది లేదని స్పష్టంగా ప్రకటించడం. దివ్యఖుర్ఆన్ ఆదేశాలకు అనుగుణంగా ప్రవక్త ఆచరించి చూపిన విధంగా ప్రార్థనలు చేయడం. చివరకు తాకిఫ్ ఈ షరతులన్నింటికి ఒప్పుకుంది.

క్రయిస్తవ, యూద తెగల నుంచి కూడా ప్రతినిధి బృందాలు వచ్చి కలుసుకున్నాయి. ఇస్లామ్ స్వీకరించాలని వారెవ్వరినీ బలవంత పెట్టడం జరగలేదు. వారి విషయంలో కూడా ఇంతకు ముందు ఉత్తరాది తెగల విషయంలో వ్యవహరించినట్లే వ్యవహరించారు. వారితో మైత్రి ఒప్పందం చేసుకున్నారు. వారు జిజియా చెల్లిస్తారు. ఇస్లామీయ రాజ్యం వారికి రక్షణ కల్పిస్తుంది. మొత్తం అరేబియాలో ఇప్పుడు ఈ సందేశం స్పష్టంగా వ్యాపించింది. ఇస్లామ్ స్వీకరించిన తెగలు ఇతర విశ్వాస వ్యవస్థలను వదులుకోవాలి. ఇస్లామ్ స్వీకరించామని ప్రకటించిన తర్వాత గత ధార్మికవిశ్వాసాలను కూడా పాటిస్తూ ఇస్లామ్‌ను పాటించడం అనేది కుదరదు. ఇస్లామీయ నియమాలు, ప్రార్థనలు, ఉపవాసాలు, సామాజిక శిస్తు (జకాత్), హజ్ యాత్ర తప్పనిసరవుతాయి. ఒకవేళ తెగలు తమ పాత విశ్వాసానికే కట్టుబడి ఉండాలనుకుంటే, వారు జిజియా చెల్లించాలి, అందుకు బదులుగా ఇస్లామీయ రాజ్యం వారి రక్షణ బాధ్యతలు స్వీకరిస్తుంది. ఈ రెండింటిలో వారికి ఇష్టమైన మార్గాన్ని ఎంచుకునే స్వేచ్ఛ ప్రవక్త ఇచ్చారు. తబూక్ నుంచి వచ్చిన తర్వాత చాలా తెగలు ఈ రెంటిలో ఏదో ఒక మార్గం  ఎంచుకున్నాయి.

# మానవహక్కులు

బ్రిటీష్ మాగ్నాకార్టతోనే మౌలిక మానవహక్కుల భావన ప్రపంచానికి పరిచయమైందని పాశ్చాత్య వ్యవస్థ మనల్ని నమ్మమంటుంది. కాని మాగ్నాకార్ట అనేది ఇస్లామ్ వచ్చిన ఆరు వందల సంవత్సరాల తర్వాత వచ్చిన ఒప్పందం. నిజానికి అప్పట్లోనే మత, వర్ణ, ప్రాంత, జాతి, తెగ విచక్షణ లేకుండా ప్రవక్త ముహమ్మద్ స్పష్టమైన మానవహక్కుల ప్రకటన చేశారు. మనిషి నడవడి బట్టి విలువ ఉంటుందని స్పష్టం చేశారు.

> "మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుని నుండి, ఒకే స్త్రీ నుండి సృజించాము. తరువాత మీరు ఒకరినొకరు పరిచయం చేసుకునేందుకు మిమ్మల్ని జాతులుగాను, తెగలుగానూ చేశాము. వాస్తవానికి మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువగా గౌరవపాత్రుడు. నిశ్చయంగా అల్లాహ్ సర్వజ్ఞానం కలవాడు. సకల విషయాలు తెలిసినవాడూను."
> (దివ్యఖుర్ఆన్ 49 : 13)

ఈ దివ్యఖుర్ఆన్ వాక్యం కేవలం ముస్లిములను ఉద్దేశించింది కాదు, యావత్తు మానవాళిని ఉద్దేశించింది. మానవసమానత్వాన్ని నొక్కి చెప్పింది. మనుష్యులంతా ఒకే తల్లిదండ్రుల సంతానమని, వారిమధ్య జాతి,తెగ,ప్రాంత భేదాలన్నీ కేవలం గుర్తింపు కోసం మాత్రమేనని స్పష్టం చేసింది.

ప్రవక్త ముహమ్మద్ తన వీడ్కోలు ప్రసంగంలో (మక్కా దగ్గర అరాఫత్ లోయలో, కామన్ ఎరా 632) చెప్పిన మాటలు ఇక్కడ గమనార్హమైనవి:

"ప్రజలారా! మీ ప్రభువు ఒక్కడే, మీ తండ్రి ఒక్కడే. మీరందరూ ఆదమ్‌కు చెందిన వారు. ఆదమ్ మట్టితో చేయబడ్డారు. జాగ్రత్త! ఒక అరబ్బుకు అరబ్బేతరునిపైగాని, అరబ్బేతరునికి అరబ్బుపై గాని, తెల్లవాడికి నల్లవాడిపై గాని, నల్లవాడికి తెల్లవాడిపై గాని ఎలాంటి ఆధిక్యతా లేదు. ఆధిక్యత కేవలం దైవభీతికి మాత్రమే. మీలో అందరికన్నా

ధర్మపరాయణుడే అత్యుత్తముడు."

మానవాళి సమైక్యత గురించి ప్రవక్త చెప్పిన ఈ మాటలు వాస్తవాలు. ఆయన ఇంకా ఇలా చెప్పారు., "ప్రభూ, సమస్త మానవులు సోదరులేని సాక్ష్యమిస్తున్నాను."ఈ సమైక్యతను ఆయన ఆచరణాత్మకంగా అమలు చేసి చూపించారు. ఒకసారి ఆయన తన అనుచరులతో కూర్చుని ఉన్నారు. ఒక శవయాత్ర వెళుతోంది. మరణించిన ఆ వ్యక్తికి మర్యాద సూచకంగా ప్రవక్త లేచి నిలుచున్నారు. అక్కడ ఉన్న వాళ్ళు ఆశ్చర్యంగా ప్రవక్తా, అది ఒక యూదుడి శవయాత్ర అన్నారు. ప్రవక్త హుందాగా, స్పష్టంగా "మనిషిదే కదా" అన్నారు.

ఇస్లామ్ మనిషికి అలాంటి ఉన్నత విలువ ఇస్తుంది. దివ్యఖుర్ఆన్ క్రింది విధంగా ప్రకటించింది. "... ఒక మానవుణ్ణి చంపినవాడు సమస్త మానువులను చంపినట్లే, ఒక మానవుడి ప్రాణాన్ని కాపాడినవాడు మొత్తం మానవుల ప్రాణాలను కాపాడినట్లే." (దివ్యఖుర్ఆన్ 5:32)

ప్రవక్త స్పష్టంగా చేసిన ఒక ప్రకటన కూడా ఇక్కడ గమనించదగ్గది.

"ఇస్లామీయ రాజ్యంలో ముస్లిమేతర పౌరుడిని ఎవరైనా అణిచివేతకు గురిచేస్తే, తీర్పుదినాన అతడి పక్షాన నేను వాదిస్తాను."

# మానవసమానత్వం

విశ్వసోదరభావం అన్న సూత్రంలో మానవసమానత్వ భావన ఉంది. ప్రవక్త ముహమ్మద్ ప్రకటించిన మానవసమానత్వం మానవాళి సామాజికాభివృద్ధిలో ఎంతో ముఖ్యమైనది. అన్ని గొప్ప మతాలు ఈ భావాన్నే బోధించాయి. ప్రవక్త ఈ సిద్ధాంతాన్ని ఆచరణాత్మకంగా చూపించారు. ఈ నమూనాను గ్రహించగలిగితే జాతివివక్షలు అంతరిస్తాయి.

## దేవుడి ముందు రాజైనా పేదైనా ఒక్కటే

భారతకోకిల సరోజిని నాయుడు ఇస్లామ్‌లోని ఈ గొప్పగుణం గురించి మాట్లాడుతూ "ప్రజాస్వామ్యాన్ని బోధించి ఆచరించిన మొదటి మతం ఇస్లామ్. మస్జిదులో అజాన్ ఇచ్చినప్పుడు, నమాజు కోసం వచ్చేవారు ఒకచోటు గుమిగూడుతారు, రాజు, పేద అందరూ ఒకే పంక్తిలో నిలబడి దేవుడు మాత్రమే గొప్పవాడని ప్రకటించే ఈ ప్రజాస్వామ్యం రోజుకు ఐదుసార్లు మనకు కనబడుతుంది." అన్నారు. ఆమె ఇంకా ఇలా చెప్పారు "ఇస్లామ్‌లోని ఈ సమైక్యత నన్ను ఆకట్టుకుంది. మనిషిని సోదరుడిగా మార్చేసే భావం ఇది. మీరు లండన్‌లో ఒక ఈజిప్షియన్, అల్జీరియన్, ఇండియన్, టర్క్‌ని కలవండి. వారి మధ్య తేడా కేవలం వారి మాతృభూమి మాత్రమే. మరేమీ తేడా ఉండదు." అన్నారు.

## హజ్ యాత్ర ఒక సజీవ ఉదాహరణ

ప్రతి సంవత్సరం హజ్ కాలంలో ప్రపంచమంతా ఈ అద్భుతమైన సోదరభావాన్ని చూస్తుంది. జాతి, రంగు, హోదా, తేడాలన్నీ సమసిపోతాయక్కడ. యూరోపియన్లు, అమెరికన్లు, ఆఫ్రికన్లు, పర్షియన్లు, రష్యన్లు, ఆస్ట్రేలియన్లు, ఇండియన్లు , చైనీస్, జపనీస్, ఇంకా అనేక

దేశాల వారు మక్కాలో కలుసుకుంటారు. ఒకే ఒక దైవిక కుటుంబం సభ్యులుగా కలుస్తారు. ఒకేవిధమైన దుస్తులు. ప్రతి ఒక్కరు రెండు ముక్కల వస్త్రాలనే, కుట్లు లేని వస్త్రాలనే దుస్తులుగా ధరిస్తారు. ఒక వస్త్రం నడుంకు చుట్టుకుంటారు. ఒక వస్త్రం భుజాలపై కప్పుకుంటారు. తలపై ఏదీ ధరించరు. ఎలాంటి ఆడంబరాలు లేవు. ఒక మాట వారి నోట ఉంటుంది. "వచ్చేశాను ప్రభూ, వచ్చేశాను. నీ ఆదేశం మేరకు వచ్చేశాను. నీవు ఒక్కడివే. వేరెవ్వరూ లేరు. వచ్చేశాను."అక్కడ ఎవరు గొప్ప ఎవరు తక్కువ అన్న తేడాయే కనబడదు. ప్రతి ఒక్కరు తిరిగి వెళ్ళేటప్పుడు హజ్‌యాత్రలోని అంతర్జాతీయ అనుభవాన్ని తీసుకువెళతారు.

డచ్ మేధావి క్రిస్టియన్ స్నోచ్ హర్‌గోనె మాటల్లో చెప్పాలంటే :

"ఇస్లాం ప్రవక్త స్థాపించిన నానాజాతీ సమితి, అంతర్జాతీయ ఐక్యతకు మానవ సోదరభావానికి సూత్రాలను ప్రదానం చేసింది. ఆ సూత్రాలు సార్వజనీన ప్రాతిపదికలపై ఆధారభూతమయినవి కావడం చేత అవి ఇతర జాతులకు దారి చూపుతున్నాయి." ఆయన ఇంకి ఇలా వ్రాశాడు : "వాస్తవమేమంటే నానాజాతి సమితి భావనను సాధించే మార్గంలో ఇస్లాం చేసినంత కృషికి సమానంగా క్రపపంచంలో మరుఏ జాతి కృషి చేసి చూపలేదు."

# జాతితత్వం

## తెల్లవాళ్ళు నల్లవాళ్ల కన్నా అధికులు కాదు

ఒక అబిసీనియా నల్ల ముస్లిమ్ ముస్లిముల పాలకుడిగా మారినా అతడికి అందరూ విధేయత చూపాలని ప్రవక్త చెప్పారు. ఆయన వర్ణవివక్షను అంతమొందించారు. ఉదాహరణకు

- ఇస్లామీయ చరిత్రలో ప్రసిద్ధికెక్కిన రెండవ ఖలీఫా ఉమర్ ఎప్పుడైనా సరి బిలాల్‌ను చూస్తే వెంటనే లేచి నిలబడి సాదారంగా ఆహ్వానించేవారు. "మా యజమాని వస్తున్నారు" అని చెప్పేవారు. అరబ్బుల్లో దివ్యఖుర్‌ఆన్, ప్రవక్త ముహమ్మద్ సాధించిన అద్భుతమైన మార్పు ఇది. బిలాల్ ఒక నీగ్రో బానిసన్నది గమనించాలి.

- జైద్ బిన్ హారిస్ ఒక బానిస. రోమన్ సామ్రాజ్యంపై ప్రవక్త పంపిన సైన్యానికి అతనే సర్వసైన్యాధ్యక్షుడు.

● ఉసామా ఒక బానిస. ఇతడిని కూడా ప్రవక్త ముస్లిమ్ సైన్యానికి సర్వసైన్యాధ్యక్షుడిగా నియమించారు.

● ఒక రోజు అబూజర్ గిఫ్ఫారి ఒక నల్లముస్లిమ్ పక్కన కూర్చుని ఉన్నారు. అబూజర్ అతడితో "నల్లవాడా" అని సంబోధిస్తూ మాట్లాడ్డం ప్రవక్త విన్నారు. ఆయనకు ఇది నచ్చలేదు. అలా పిలవద్దని అబూజర్‌కి చెబుతూ "తెల్లవాళ్ళు నల్లవాళ్ళకన్నా అధికులు కాదు" అన్నారు. ప్రవక్త మందలింపు వినగానే అబూజర్‌కు తన పొరబాటు తెలిసివచ్చింది. ఆయన పశ్చాత్తాపంతో ఆ నల్లమనిషి ముందు కూలబడి మీ పాదాలతో నా ముఖాన్ని తన్నండి అన్నారు

● ఒకసారి ప్రవక్త ఒక దృశ్యం చూసారు. ఆయన అనుచరుల్లో కాస్త సంపన్నుడైన ఒక అనుచరుడు కాస్త దగ్గరగా ఉన్న ఒక పేదవాడికి తగులకుండా తన వదులు దుస్తులను లాక్కుంటున్నారు. ఆవిధంగా ఆ పేదవాడికి కాస్త దూరాన్ని పాటిస్తున్నారు. ప్రవక్త అది చూసి "ఆయన పేదరికం నీకు తగులుతుందని భయపడుతున్నావా?" అన్నారు.

ప్రవక్త ఎలాంటి మార్పు సాధించారంటే అరబ్బు సమాజంలో కులీనులు, గొప్పవాళు ్ళగా పేరుపడిన వంశాల వారు కూడా తమ అమ్మాయిలను నీగ్రో బానిసలకిచ్చి వివాహం చేయడానికి వెనుకాడలేదు.

అందుకే జర్మన్ కవుల్లో గొప్పకవి గోథే దివ్యఖుర్‌ఆన్ గురించి ఇలా అన్నాడు

"ఈ పుస్తకం అన్ని కాలాల్లోను గొప్ప ప్రభావాన్ని వేస్తుంటుంది."

అందుకే జార్జి బెర్నార్డ్ షా ఇలా రాశాడు

"ఇంగ్లాండ్‌ను పాలించే అవకాశం, మొత్తం యూరోప్‌ను పాలించే అవకాశం రానున్న 100 సంవత్సరాల్లో ఏదైనా మతానికి ఉందనుకుంటే, అది ఇస్లామ్ మాత్రమే"

# యువకులకు ప్రోత్సాహం

మదీనా నుంచి తిరిగి వచ్చిన కొన్ని నెలలకు హిజ్రీశకం 11వ సంవత్సరంలో ప్రవక్త ఉత్తరాదిన సిరియా, పలస్తీనా వైపు సైన్యాన్ని నడపాలని నిర్ణయించారు. కొన్ని సంవత్సరాల క్రితం ఆయన అనుచరులు జాఫర్, అబ్దుల్లా, జైద్‌లు అక్కడ యుద్ధంలో మరణించారు. ఈ సారి సైన్యాన్ని పంపుతూ ప్రవక్త సైనిక నాయకత్వాన్ని పిన్నవయస్కుడైన ఉసామాకు ఇచ్చారు. ఉసామా వయసు అప్పుడు కేవలం 20 సంవత్సరాలు. ఆయన జైద్ కుమారుడు. సైన్యంలో 3000 మంది సైనికులున్నారు. ఇందులో ఉమర్, అబూబక్ర్, అలీ, ఉస్మాన్ వంటి ప్రవక్త సన్నిహిత అనుచరులు, అనేక యుద్ధాల అనుభవం ఉన్న వీరులు, ఇంకా అనేకమంది యుద్ధనిపుణులు ఆ సైన్యంలో ఉన్నారు. అయినా ఇరవయ్యేళ్ళ ఉసామాకు సైనిక కమాండ్ ఇవ్వడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ నియామకంపై విమర్శలు కూడా వచ్చాయి. కాని వాటిన్నంటికి జవాబిస్తూ ప్రవక్త ఖాతరు చేయలేదు.

“మీరు సైన్యం నాయకత్వ బాధ్యత ఉసామాకు ఇవ్వడాన్ని విమర్శిస్తున్నారు. ఇంతకు ముందు కూడా మీరు అతడి తండ్రి నియామకం జరిగినప్పుడు కూడా ఇలాగే విమర్శించారు. ఉసామా నిజంగానే ఈ బాధ్యతలు నిర్వర్తించగల సమర్థుడు. ఆయన తండ్రికి బాధ్యతలు అప్పగించినట్లే, ఇప్పుడు అతడికి బాధ్యతలు అప్పగిస్తున్నాను.” అన్నారు.

అంతకు ముందు ఉసామా తండ్రి జైద్‌ను సైన్యాధ్యక్షుడిగా పంపినప్పుడు కూడా చాలా మంది విమర్శించారు. జైద్‌ను వారింకా బానిసగానే భావించేవారు. అతను స్వేచ్ఛ పొందినప్పటికీ అతడిని తక్కువగానే చూసేవారు. ఇప్పుడు కొందరు ఆయన కుమారుడు ఉసామా నియామకాన్ని విమర్శించసాగారు. ఈసారి ఉసామా విషయంలో విమర్శ అతడి వయస్సు చాలా చిన్నదన్నది మాత్రమే. ప్రవక్త తన ఎంపికను ఖచ్చితంగా ప్రకటిస్తూ, మనిషి సామాజిక హోదాల లేదా వయస్సు ఏవీ అడ్డంకులు కావని. మనిషిలో అవసరమైన ఆధ్యాత్మిక, మేధోపరమైన, నైతికమైన గుణగణాలు ఉంటే తన అధికార బాధ్యతలు చక్కగా

నిర్వర్తించగలడని చాటి చెప్పారు. సమాజంలో నిరుపేదలకు అవకాశాలు కల్పించడానికి, అతి చిన్న వయస్సున్న వారికి బాధ్యతలు అప్పగించడానికి సాహసంతో కూడుకున్న నిర్ణాయక శక్తి ఉండాలి. ప్రవక్త అలాంటి నిర్ణాయక శక్తిని ప్రదర్శించారు. ఆ విధంగా అందరికి వారి శక్తిసామర్థ్యాలు ప్రదర్శించే అవకాశాలు కల్పించారు. మరో విషయమేమంటే, అనుభవజ్ఞులైన అనుచరులకు ఇందులో గ్రహించలసిన పాఠాన్ని కూడా ఆయన చెప్పారు. వారు తమ కుమారుడి వయసున్న నాయకుడి ఆజ్ఞలు పాటించవలసి ఉంది. ప్రవక్తకు తామెంత సన్నిహితులమైనా, సైన్యంలో నాయకుడిగా ఆ కుర్రవాడి ఆదేశాలనే అనుసరించాలి. ఇది సుదీర్ఘకాలంగా ప్రవక్తకు సన్నిహిత సహచరులుగా ఉన్నవారిలో అంతర్గత సంఘర్షణకు, అసలైన గొప్ప జిహాద్. దాంట్లో వారు గెలిచారు. అంతేకాదు, తమ రోజులు ఇక లెక్కకు మిగిలాయన్నది కూడా గ్రహించే పాఠం అందులో ఉంది. ఈ విధంగా ప్రవక్త వారికి కాలం గడిచేకొద్ది మనిషి శక్తిసామర్థ్యాలు క్షీణిస్తాయన్న పాఠాన్ని కూడా వారికి చెప్పారు. అందువల్ల తన శక్తిసామర్థ్యాలను గుర్తించి పక్కకు తప్పుకుని, కొత్తనీటికి దారి వదలాలి. యువకులకు ముందుకు సాగే అవకాశాలు కల్పించాలి.

## 21

# ప్రవక్త ముహమ్మద్ బహువివాహాలు

ప్రవక్త ముహమ్మద్ పేరు వినగానే చాలా వివాహాలు చేసుకున్న వ్యక్తిగా అనేకులు తీర్మానించేస్తూ ఉంటారు. చాలా మంది ముస్లిమేతరులకు ప్రవక్త ముహమ్మద్‌ను అర్థం చేసుకోవడంలో ఇదో పెద్ద అడ్డంకి. పైగా ఆయన గురించి బాధ్యతారహితంగా, అవగాహనలోపంతో అభిప్రాయాలు ఏర్పరచుకుంటారు. ఇక్కడ ఈ విషయమై కొన్ని వాస్తవాలను చూద్దాం.

- ఇస్లామ్‌లో వివాహ వ్యవస్థకు అత్యున్నత స్థానం ఉంది. ఒక ఆరోగ్యవంతమైన సమాజానికి వివాహ వ్యవస్థ ఎంతయినా అవసరం.

- ప్రవక్త ముహమ్మద్ పాతికేళ్ళ వయసు వచ్చేవరకు స్త్రీ స్పర్శ ఎరుగరు. ఆయన పాతికేళ్ళ వయసులో మొదటి పెళ్ళి చేసుకున్నారు. ఆయన శత్రువులు కూడా ఆయన్ను నిజాయితీపరుడు, సత్యవాదిగా ప్రశంసించేవారు. నిజాయితీపరుడైన వ్యాపారిగా ఆయనకు మక్కాలో మంచిపేరు ఉండేది. ఒక మంచి స్నేహితునిగా, పేదవారిని ఆదుకునే వ్యక్తిగా, అనాథలను, వితంతువులను ఆదరించే మంచివానిగా పేరుపొందారు.

## ఖదీజా

ప్రవక్త ముహమ్మద్ మొదటి పెళ్ళి హజ్రత్ ఖదీజా (రజి)తో జరిగింది. ఆమెకు అప్పుడు 40 ఏళ్ళ వితంతు మహిళ. హజ్రత్ ఖదీజా మక్కాలో ఉత్తమ స్త్రీగా, నీతినియమాలతో బతికే మహిళగా పేరుపొందిన స్త్రీ. ప్రవక్త కన్నా ఆమె పదిహేను సంవత్సరాలు వయసులో

పెద్దవారు. ఆమె స్వయంగా పెళ్ళి ప్రతిపాదన ప్రవక్త వద్దకు పంపారు. ఆమె వయసులో పెద్దదయినా, వితంతువైనా ప్రవక్త ఆ ప్రతిపాదనను అంగీకరించారు. అప్పట్లో మక్కాలో ప్రవక్త కావాలనుకుంటే అనేకమంది అందమైన కన్యలు ఆయన్ను పెళ్ళాడడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ ఆయన హజ్రత్ ఖదీజా(రజి)ను, తన కన్నా పదిహేను సంవత్సరాలు పెద్దవారిని పెళ్ళి చేసుకున్నారు.

హజ్రత్ ఖదీజా(రజి)తో ఆయన పాతికేళ్ళపాటు సంతోషకరమైన సంసారజీవనాన్ని గడిపారు. ఆయనకు పుట్టిన పిల్లలందరు, ఒక్కరు తప్ప, హజ్రత్ ఖదీజా వల్లనే కలిగారు. ఆమె జీవించి ఉన్నంత కాలం ఆయన మరో మహిళను పెళ్ళాడలేదు. క్రీ.శ.619 డిసెంబర్ మాసంలో హజ్రత్ ఖదీజా అనారోగ్యంతో మరణించారు. మూడు రోజులు అనారోగ్యంతో బాధపడి ఆమె తుదిశ్వాస వదిలారు. ఆమె మరణం ప్రవక్త కు తీవ్ర విషాదకారణమైంది. తనకు అత్యంత ప్రియమైన జీవిత భాగస్వామి మరణంతో ఆయన చాలా దు:ఖించారు. ఆయన హజ్రత్ ఖదీజాను ఎంతగా ప్రేమించారంటే, ఆమె మరణం తర్వాత ప్రవక్త మిత్రులు ఆయన వద్దకు వచ్చి మళ్ళీ వివాహం చేసుకోవలసిందిగా సలహా ఇచ్చినప్పుడు ఆయన ఇలా అన్నారు :

"ఖదీజా తర్వాత మళ్ళీ పెళ్ళి గురించి ఎలా ఆలోచించగలను? ఆమె జ్ఞాపకాలు నాకు చాలు. ఆమె నాకు చాలా నమ్మకస్తురాలు. ప్రజలు నన్ను నమ్మనప్పుడు ఆమె నాపై నమ్మకం ఉంచింది. ప్రజలు నాకు సహాయం చేయడానికి భయపడినప్పుడు ఆమె నాకు సహాయంగా నిలబడింది. ఆమె నాకు ఉత్తమమైన తోడు. ఆమె నా పిల్లలకు తల్లి" అన్నారు. ఇంతకన్నా ప్రేమించే భర్త ఉంటాడా?

## ఖదీజా వియోగం

మూడేళ్ళపాటు కొనసాగిన సంఘబహిష్కరణ చాలా కఠినంగా గడిచింది. ఈ కాలంలో ప్రవక్త అనుచరులు, ఆయన కుటుంబం బాహ్య ప్రపంచంతో సంబంధాలు లేకుండా గడపవలసి వచ్చింది. పిల్లలు, మహిళలు ఈ పరిస్థితిలో చాలా అలమటించారు. దీనివల్ల వారి ఆరోగ్యపరిస్థితి కూడా దెబ్బతిన్నది. ఖురైష్‌ల సంఘబహిష్కరణ వల్ల కఠినపరిస్థితుల్లో ఖదీజా ఆరోగ్యం కూడా దెబ్బతిన్నది. ఆమె తీవ్రంగా జబ్బుపడ్డారు. క్రీ.శ.619 డిసెంబరులో మూడురోజులు మృత్యుశయ్యపై ఉండి ఆమె ఈ లోకాన్ని వదిలివెళ్ళారు. తాను అమితంగా ప్రేమించే భార్య వియోగం వల్ల ఆయన చాలా దు:ఖించారు.

ప్రవక్తపై ఖురైషుల వేధింపులు దౌర్జన్యాలకు అంతు లేకుండా పోయింది. ఆయన కుటుంబజీవనం కూడా ఇప్పుడు విషాదభరితమైంది. పిల్లలు చిన్నవాళ్ళు. పిల్లలను చూసేవారు ఎవరూ లేరు. ఆయన కష్టాలను, దు:ఖాన్ని చూసి చాలా మంది ఆయన్ను మళ్ళీ వివాహం చేసుకోమన్నారు. పిల్లలను చూసుకోడానికి ఒక వితంతు మహిళను, సంసారసుఖానికి ఒక కన్యను చేసుకోవడం మంచిదన్న సలహా వచ్చింది. మిత్రుల సలహాలు, సూచనల తర్వాత ఆయన ఒకే సంవత్సరం ఇద్దరిని, హ్రజత్ సౌదా , హ్రజత్ ఆయిషా లను వివాహం చేసుకున్నారు. ఈ వివాహాలు ఆయన మిత్రుల ప్రోత్సాహంతో జరిగాయి. ఆయన పిల్లలకు ఆలనాపాలనా చూడడం, ఆయన అవసరాల పరిపూర్తి కోసం ఈ వివాహాలు జరిగాయి. ఇందులో అసాధారణమైన విషయం కాని, లైంగిక విశృంఖలత్వం కాని ఏదీ లేదు. అప్పటి సమయంలో, ఆ పరిస్థితుల్లో, అవసరాల రీత్యా ఆయన ముందుకు వచ్చిన సలహాలు, ప్రతిపాదనలను ఆయన ఆమోదించారు.

## సౌదా

ఆయన పెళ్ళి చేసుకున్న రెండవ మహిళ హ్రజత్ సౌదా (రజి) కూడా వితంతు మహిళ. ప్రవక్త ముహమ్మద్‌ను ప్రారంభకాలంలో విశ్వసించిన వారిలో హ్రజత్ సౌదా , ఆమె భర్త కూడా ఉన్నారు. ఈ దంపతులు మక్కాలో వేధింపులు భరించలేక ప్రవక్త ముహమ్మద్ సలహాతో అబిసీనియాకు వలస వెళ్ళారు. వారు తిరిగి వస్తున్నప్పుడు ఆమె భర్త మరణించారు. ఆమెకు ఆశ్రయం అవసరమైంది. ప్రవక్త ప్రారంభించిన ఇస్లామీయ ఉద్యమంలోనే ఆమె భర్త మరణించారు కాబట్టి సహజంగానే ఆమె భర్త మరణానంతరం ప్రవక్త ముహమ్మద్ వద్దకు వచ్చారు. ప్రవక్త ముహమ్మద్ ఆమెను వివాహమాడి ఆశ్రయమిచ్చారు. వివాహసమయంలో హ్రజత్ సౌదా(రజి) వయసు 55 సంవత్సరాలు. చిన్నవయసులో ఉన్న ప్రవక్త కుమార్తెల బాగోగులు ఆమె చూసుకునేవారు. ఆమెకు మొదటి భర్త ద్వారా ఒక కుమారుడు ఉన్నాడు. ప్రవక్త వల్ల ఆమెకు సంతానం కలుగలేదు.

## ఆయిషా

ప్రవక్త ముహమ్మద్ మూడవభార్య పేరు ఆయిషా . ముహమ్మద్‌కు అత్యంత సన్నిహితుడు, ఆప్తుడు అయిన అనుచరుడు, మొదటి ఖలీఫా, ప్రారంభంలో ఇస్లామ్ స్వీకరించిన అతికొద్ది మందిలో ఒకరైన హ్రజత్ అబూబక్ర్ కుమార్తె ఆమె. ఈ పెళ్ళి వెనుక ముఖ్యమైన కారణాల్లో ఒకటి అబూబక్ర్ ప్రవక్త బంధుత్వ సంబంధం ద్వారా మైత్రిని మరింత దృఢతరం చేసుకోవాలని

భావించడం. ప్రవక్త కు సహాయంగా నిలబడి, శత్రుదాడుల నుంచి కాపాడిన వారిలో అబూబక్ర్ అత్యంత ముఖ్యమైన వారు. రెండవ కారణమేమంటే, అయిషా వంశం రీత్యా గౌరవోన్నతులు, మేథోసంపద ఉన్న వంశానికి చెందినవారు. పెళ్ళి సమయంలో ఆమె వయసు పదిహేను సంవత్సరాలు. ఈ విషయం ఇటీవలి అధ్యయానాల్లో చాలా స్పష్టంగా తెలిసి వచ్చింది. చాలా మంది చెబుతున్నట్లు ఆమె వయసు ఆరేళ్ళు లేదా తొమ్మిదేళ్ళు లేదా పన్నెండేళ్ళు కాదు. ఇందులో ఎలాంటి వివాదం ఇప్పుడు లేదు.

వివాహ వయస్సుకు సంబంధించిన సంప్రదాయాలు సాంస్కృతిక అంశాలపై ఆధారపడి ఉంటాయి. కాలానుగతంగా ఇవి చాలా మారాయి. ఏడవ శతాబ్దానికి చెందిన అరబ్బు సమాజంలో ఉన్న సంప్రదాయాల ప్రకారం చిన్నవయసులో వివాహం, వయసులో తేడా ఇవి అడ్డంకులు కావని గమనించాలి. అమ్మాయి యుక్తవయస్కురాలయిన వెంటనే వివాహం చేసేవారు. మానవసమాజాలన్నింటా యుక్తవయస్కురాలవ్వడాన్నే పెళ్ళికి యోగ్యతగా తీసుకోవడం కనబడుతుంది. వేయేళ్ళకు పైబడిన కాలం తర్వాత వివాహ వయస్సు విషయంలో వచ్చిన మార్పులను ప్రవక్త కాలంలో కూడా ఉండాలని చెప్పడం సముచితం కాదు. ఆ కాలంలో ఉన్న సంస్కృతి సంప్రదాయాల నేపథ్యంలోనే చూడాలి. నేటి ఆధునిక కాలంలో బాల్యానికి ఇచ్చిన నిర్వచనాన్ని పద్నాలుగు వందల సంవత్సరాల క్రితం నాటి సమాజానికి అన్వయించాలని చూడడం సరికాదు. ఇక్కడ గమనించవలసిన మరో విషయమేమంటే ఈ పెళ్ళి విషయంలో విమర్శ అన్నది కూడా ఆధునిక కాలంలోనే వచ్చింది. ప్రవక్త తో పెళ్ళయిన తర్వాత కూడా హజ్రత్ ఆయిషా యుక్తవయస్సుకు చేరినప్పుడే పెళ్ళి పరిపూర్ణమయ్యింది. ఈ పెళ్ళి విషయంలో అప్పట్లో మక్కాలో ఎలాంటి విమర్శలు రాలేదు. మధ్యయుగాల్లో క్రయిస్తవ ప్రాంతాల్లో కూడా ఈ పెళ్ళిపై ఎలాంటి విమర్శలు లేవు.

ప్రవక్త కు అయిషాకు మధ్య ఉన్న సంబంధం ప్రవక్త కు ఇతర భార్యలతో ఉన్న సంబంధం వంటిది కాదు. ఈ సంబంధం చాలా వరకు విద్యాజ్ఞానాలకు సంబంధించిన సంబంధం. ఆయన ఆమె పట్ల చాలా శ్రద్ధ చూపించేవారు. ఎందుకంటే ఆమె ఆయనతో స్వేచ్ఛగా మాట్లాడేవారు, వాదించేవారు. ఆయన వద్ద తెలివైన, ఆసక్తికలిగిన విద్యార్థినిగా ఆమె ధార్మిక విద్యాజ్ఞానాలు పొందారు. మదీనాలో ఉన్నప్పుడు అవతరించిన దివ్యఖుర్ఆన్ వాక్యాల్లో చాలా వాక్యాలు ప్రవక్త ఆమె ఇంట ఉన్నప్పుడే అవతరించాయి. ఇది దేవుని తరఫున తనకు లభించిన ప్రత్యేక అనుగ్రహంగా ఆమె భావించేవారు. తన జీవితాన్ని దగ్గరి నుంచి చూడడం వల్ల, ముఖ్యంగా కుటుంబ జీవనానికి, వ్యక్తిగత జీవనానికి సంబంధించి ఇతరులకు తెలియని విషయాలు కూడా ఆమె సన్నిహితంగా ప్రవక్త ను గమనించడం వల్ల తర్వాతి తరాలకు ఈ విద్యాజ్ఞానాలను ఆమె అందిస్తారని, ఆవిధంగా మానవాళికి ఆమెవల్ల

లభించే గొప్ప ప్రయోజనం ఉందన్న విషయం ప్రవక్త కు తెలుసు. ఇస్లామ్‌కు సంబంధించి సగం జ్ఞానాన్ని ఆయిషా (రజి)వద్ద నేర్చుకోవాలని ఆయన స్వయంగా అనుచరులకు చెప్పి ఉన్నారు. ప్రవక్త ముందుచూపు ఎంత గొప్పదో తర్వాత రుజువైంది. ఆయన మరణించిన తర్వాత ఆమె 45 సంవత్సరాలు జీవించారు. ఆ విధంగా ప్రవక్త కు సంబంధించిన విద్యాజ్ఞానాలకు ప్రధానమైన వనరుగా ఉపయోగపడ్డారు.

ఆమె ద్వారా 2210 ముఖ్యమైన హదీసులు (ప్రవక్త ప్రవచనాలు) ముస్లిమ్ సమాజానికి లభించాయి. ఆమె ధార్మికజ్ఞానం, న్యాయపరమైన పరిజ్ఞానం విషయంలో చాలా పేరుపొందారు. చాలా మంది ముస్లిమ్ పండితులు ఆమెను సంప్రదించేవారు. ఆమెకు సంతానం కలుగలేదు.

ప్రవక్త ఈ ఇద్దరు భార్యలు, అంటే హజ్రత్ సౌదా (రజి), హజ్రత్ ఆయిషా(రజి)లతో ఐదారేళ్ళ కాలం వరకు ఉన్నారు. అంటే ఆయన యాభయ్యారు సంవత్సరాల వయసుకు చేరుకునేవరకు. అప్పటి వరకు ఆయన మరో పెళ్ళి చేసుకోలేదు.

యాభయ్యారు సంవత్సరాల వయసు నుంచి అరవై సంవత్సరాల వరకు ఆయన తొమ్మిది వివాహాలు చేసుకున్నారు. ఇందులో ప్రతి ఒక్క పెళ్ళికి ప్రత్యేక కారణాలున్నాయి. ఆయన జీవితంలో చివరి మూడు సంవత్సరాల కాలంలో ఆయన ఎవరినీ పెళ్ళాడలేదు.

## హఫ్సా

ప్రవక్త ముహమ్మద్ నాల్గవ భార్య హజ్రత్ హఫ్సా . ఈమె ముక్కోపిగా పేరుపొందారు. ప్రవక్త ముహమ్మద్ కు అత్యంత ఆప్తుడైన సహచరుడు హజ్రత్ ఉమర్ కు కుమార్తె. బద్ర్ యుద్ధంలో ఆమె భర్త చనిపోయారు. హజ్రత్ ఉమర్ కు కుమార్తె పట్ల చెప్పలేనంత ప్రేమ. ఆయన వితంతువుగా తన కుమార్తెను చూడలేకపోయారు. తన స్నేహితుడు హజ్రత్ ఉస్మాన్ తో తన కుమార్తెను పెళ్ళాడవలసిందిగా కోరారు. కాని ఆయన ఆ కోరికను మన్నించలేదు. హజ్రత్ అబూబక్ర్ ను అడిగినా ఆయన కూడా తిరస్కరించారు. బహుశా వారిద్దరికి హజ్రత్ హఫ్సా కోపం గురించి ముందుగానే తెలిసి ఉండాలి. హజ్రత్ ఉమర్ నిరాశగా ఉండడాన్ని చూసి ప్రవక్త స్వయంగా ఆయన కుమార్తెను పెళ్ళాడారు.

హఫ్సా ముక్కోపి. స్వయాన ఆమె తండ్రి ఉమర్ ఆమె గురించి చెబుతూ “ఒకసారి నా భార్య ఏదో విషయమై నాతో వాదిస్తోంది. నేను ఆమెతో కోపంగా “నాకు సలహాలివ్వడానికి నువ్వెరనన్నాను'' నా భార్య నాతో ''చిన్న విషయం గురించి కూడా నువ్వు నన్ను

మాట్లాడనియ్యవు. నీ కూతురు మాత్రం ప్రవక్తతో అన్ని విషయాల గురించి వాదిస్తుంది" అని చెప్పింది. నేను వెంటనే లేచి హఫ్సా వద్దకు వెళ్ళాను "నువ్వు ప్రవక్తతో కోపంగా వాదిస్తున్న మాట నిజమేనా?" అని అడిగాను. "అవును నిజమే" అని నిర్మొహమాటంగా నాకు చెప్పేసింది. నేను "ఇలాంటి పనులు చేయకు దేవుడు నిన్ను శిక్షిస్తాడు" అని వచ్చేశాను" అన్నారు.

# జైనబ్

ప్రవక్త ముహమ్మద్ ఐదవ భార్య పేరు హజ్రత్ జైనబ్ . ఆమె ఖుజైమా కుమార్తె. అత్యంత శక్తివంతమైన హవాజున్ తెగకు చెందినవారు. ప్రవక్త పెళ్ళాడినప్పుడు ఆమె వయసు అరవయ్యేళ్ళ వితంతువు. ఆమె చాలా దయాస్వభావం కలిగినవారు. ఎల్లప్పుడు దానధర్మాలు చేస్తూ ఉండేవారు. బలహీనులకు మాతృమూర్తిగా ఆమె పేరుపడ్డారు. పెళ్ళి తర్వాత మూడు నెలలకే ఆమె మరణించారు.

# ఉమ్మెసల్మా

ప్రవక్త ముహమ్మద్ ఆరవ భార్యపేరు హజ్రత్ ఉమ్మె సల్మా . ఈమె కూడా వితంతువే. బనూ ఫిరాస్ తెగకు చెందిన కులీనవంశం నుంచి వచ్చారు. ప్రారంభకాలంలో ఇస్లామ్ స్వీకరించిన తెగ ఇది. ఆమె, ఆమె భర్త ఇద్దరు ఇస్లామ్ స్వీకరించారు. భర్తతో పాటు ఆమె మదీనా వలసపోవడానికి సిద్ధమైనప్పుడు మక్కాలోని శత్రువులు ఆమెను అడ్డుకున్నారు. ఆమె తన బిడ్డను తీసుకువెళ్ళడానికి వీలు లేదని మక్కా ఖురైషులు పేచీపెట్టి అడ్డుకున్నారు. అందువల్ల ఆమె భర్తతో పాటు మదీనా రాలేకపోయారు. మక్కాలో ముస్లిములను అప్పటి శత్రువులు ఎలా వేధించేవారో ఈ సంఘటన బట్టి కూడా తెలుస్తోంది. కొంతకాలం తర్వాత ఆమె ఎలాగో తప్పించుకుని మదీనా చేరుకున్నారు. కాని ఆమె మదీనా వలస వచ్చిన కొంతకాలానికి ఆమె భర్త అమరుడిగా ఇస్లామ్ కోసం ప్రాణాలు అర్పించారు. అప్పుడు ఆమె నలుగురు పిల్లల తల్లి కాగా గర్భంలో మరో శిశువు. ఆమె తీవ్రమైన నిరాశానిస్పృహలకు గురయ్యారు. ప్రవక్త ఆమె పట్ల అత్యంత సానుభూతి ప్రకటించారు. ఆమెను పెళ్ళాడి ఆశ్రయమిచ్చారు. కాని ఆత్మాభిమానం అపారంగా ఉన్న ఉమ్మెసల్మా మొదట పెళ్ళికి సంకోచించారు. మొదటి భర్త వల్ల పిల్లలు ఉన్నారన్నది ఆమె సంకోచం. ఆ పిల్లలను తన స్వంత పిల్లలుగా చూసుకుంటానని ప్రవక్త ఆమెకు హామీ ఇచ్చారు. ఆయన చూపిన అభిమానం ఆమెను

కదిలించింది. ఆ విధంగా ఈ పెళ్ళి జరిగింది.

యాభయ్యారు సంవత్సరాల వ్యక్తి నలుగురు పిల్లల గర్భవతిని పెళ్ళాడడం వెనుక ఎలాంటి ఉద్దేశ్యం ఉంటుంది. ప్రేమాభిమానాలు, సానుభూతి తప్ప మరేముంటాయి? ఈ పెళ్ళిలో గమనించవలసిన మరో ముఖ్యమైన విషయమేమంటే ఉమ్మే సల్మా మక్కాలో అత్యంత శక్తివంతమైన బనీ మక్తూమ్ తెగకు చెందినవారు. అప్పట్లో ఈ తెగ ఇస్లామ్‌కు ప్రధాన శత్రువుల్లో ఒకటి. ఈ పెళ్ళి ద్వారా అత్యంత పలుకుబడి, శక్తిసామర్థ్యాలున్న బనీ మక్తుమ్ తెగను ఇస్లామ్‌కు దగ్గరయ్యేలా చేశారాయన.

ఉమ్మే సల్మా చాలా ధార్మికమైన, పుణ్యస్త్రీ. రాత్రులు తరచుగా ప్రార్థనల్లో గడిపేవారు. నెలకు మూడురోజులు ఉపవాసాలు పాటించేవారు. ప్రవక్త మాటలను అత్యంత గౌరవాదరాలతో వినేవారు. తూ.చ. తప్పకుండా పాటించేవారు.

# జైనబ్

జైనబ్ ప్రవక్త ముహమ్మద్‌కు ఏడవ భార్య. ఆమె మదీనాకు వలస వచ్చినప్పుడు వితంతు మహిళ. ఆమెకు ప్రవక్త తన దత్తపుత్రుడికి ఇచ్చి పెళ్ళి చేశారు. జైద్ బిన్ హారిస ను తన దత్తపుత్రుడిగా ప్రవక్త చూసేవారు. జైద్ ఆమెకు విడాకులిచ్చాడు. ఆ తర్వాత ప్రవక్త స్వయంగా ఆమెను వివాహం చేసుకున్నారు. అప్పుడామె వయసు 38 సంవత్సరాలు. ఈ పెళ్ళిని ఇస్లామ్ విమర్శకులు గొప్ప ఆయుధంగా భావిస్తారు. ఇస్లామ్‌పై, ప్రవక్త పై దాడికి ఈ పెళ్ళిని కూడా వాడుకుంటారు. ఇది నైతికంగా తప్పుడు వివాహమని అంటారు. దానికి రెండు కారణాలు చూపిస్తారు. ఒకటి : హజ్రత్ జైనబ్ ప్రవక్త ముహమ్మద్ దత్తత తీసుకున్న కుమారుడి భార్య. అంటే ఆమె ఆయనకు కుమార్తె వంటిది కదా అనంటారు. రెండవ కారణం : ప్రవక్త ముహమ్మద్ ఆమెకు విడాకులిప్పించి తనను పెళ్ళాడేలా చేశారన్న ఆరోపణ. ఈ ఆరోపణలు విమర్శలన్నీ అర్థరహితమన్నది కాస్త నిశితంగా గమనిస్తే తెలుస్తుంది.

హజ్రత్ జైద్ చిన్నప్పుడు ఒక బానిసగా ప్రవక్త వద్దకు వచ్చారు. ప్రవక్త ఆయనకు స్వేచ్ఛ ప్రసాదించి తన దత్తపుత్రుడిగా ప్రకటించారు. ఆయనకు హజ్రత్ జైద్ అంటే చాలా ఇష్టం. ఆ ఇష్టం వల్లనే తన మేనత్త కుమార్తె జైనబ్‌తో పెళ్ళి జరిపించారు. కాని ఈ పెళ్ళి వల్ల జైనబ్ పెద్దగా సంతోషించలేదు. ఎందుకంటే, జైద్ స్వేచ్ఛ పొందిన బానిస, ఆమె ఒక కులీన కుటుంబానికి చెందిన స్త్రీ. సాంఘీకంగా హోదాలో ఉన్న ఈ తేడా వారి సంబంధంపై ప్రభావం చూపింది.

వీరిద్దరి విడాకులకు ప్రవక్త  కారణమన్న ఆరోపణ సత్యదూరమే కాదు, దుష్టబుద్ధితో కూడుకున్న ఆరోపణ. ఎందుకంటే హజ్రత్ జైనబ్ ను ప్రవక్త  చాలా కాలం నుంచి ఎరుగును. ఆమె స్వయంగా ఆయనకు మేనత్త కూతురు. బాల్యం నుంచి తెలిసిన స్త్రీ. ఆమె కొత్తవారేమీ కాదు. ఆమె మొదటి భర్తను కోల్పోయినందువల్ల ప్రవక్త  ఆమెకు పునరావాసం కల్పించాలనుకున్నారు. ఆమె అందచందాలకు ఆయన నిజంగా అంత ఆకర్షితుడై ఉంటే ఆమె పెళ్ళి జైద్ తో ఎందుకు జరిపిస్తారు. జైద్‌తో పెళ్ళి తర్వాత ఆమె సంతోషంగా లేరు. తనను ఒక బానిసకిచ్చి పెళ్ళి చేశారన్న అసంతృప్తి ఆమెకు ఉండేది. అందువల్ల జైద్‌ను తక్కువగా చూసేది. అవమానకరంగా వ్యవహరించేది. జైద్  ఈ విషయాలను అనేకసార్లు ప్రవక్త (స) వద్ద ఫిర్యాదు చేశారు. ప్రవక్త  సహనం వహించాలని చెప్పేవారు. కాని ఆమె వ్యవహారశైలి భరించలేక జైద్ ఒకరోజు ఆమెకు విడాకులిచ్చేశారు.

ఈ మధ్య కాలంలో దివ్యఖుర్ఆన్ ఆదేశం ఒకటి కొన్ని విషయాలను స్పష్టం చేసింది.

> "(మానవులారా) ముహమ్మద్ మీలోని ఏ పురుషుడికి తండ్రి కారు. కాని ఆయన అల్లాహ్ యొక్క ప్రవక్త, దైవప్రవక్తల పరంపరను సమాప్తం చేసే చివరివారు. అల్లాహ్ సకల విషయాల జ్ఞానం కలవాడు." (దివ్యఖుర్ఆన్ 33:40)

జైనబ్ బంధువులు ఈ విడాకుల తర్వాత ప్రవక్త వద్దకు వచ్చి జైనబ్‌ను పెళ్ళాడాలని ఒత్తిడి తెచ్చారు. కాని ప్రవక్త  అంగీకరించలేదు. ఈ పెళ్ళి గురించి తాను ఆలోచించడం కూడా సాధ్యం కాదని అన్నారు. ఆమె ఎంతైనా దత్తకుమారుడిగా ప్రకటించిన వ్యక్తి భార్య. ఎందుకంటే అప్పటి అరబ్బు తెగల్లో దత్తపుత్రుడు స్వంత కుమారుడితో సమానంగా భావించడం జరిగేది. కాని తర్వాత అవతరించిన దివ్యఖుర్ఆన్ వాక్యాలు ఈ నైతిక అసంబద్ధతను కొట్టివేశాయి. దత్తపుత్రడు స్వంత పుత్రడు కాడని ప్రకటించాయి. ఆవిధంగా జైనబ్‌ను పెళ్ళాడే అనుమతి దేవుడే స్వయంగా ప్రవక్త కు ఇచ్చాడు. ఈ పెళ్ళి వెనుక ఉన్న మరో ముఖ్య ఉద్దేశ్యం సుదీర్ఘకాలంగా అరబ్బు సమాజంలో వేళ్ళూనుకుని ఉన్న దత్తత సంబంధాలు, దత్తపుత్రుడు స్వంత పుత్రుడితో సమానమన్న భావనలను తొలగించడం. ఈ పెళ్ళి దైవికంగా జరిగిన పెళ్ళని చెప్పాలి. ఎందుకంటే, ప్రవక్త  కొందరితో మాట్లాడుతున్నప్పుడు ఆకస్మాత్తుగా దైవదూత జిబ్రయీల్  వచ్చి దైవాదేశాలను ఆయనకు అందించారు. ఆ దివ్యఖుర్ఆన్ వాక్యం ప్రవక్త  వివాహం జైనబ్‌తో అప్పటికే కుదిరిన ఒప్పందంగా పేర్కొంది. "మేము ఆమెను మీకిచ్చి వివాహం చేశాము." (దివ్య ఖుర్ఆన్ : 33:37)

జైనబ్ దేవుడికి సాష్టాంగపడి ప్రార్థించారు. "ప్రభూ, నేను ఆయనకు తగిన దానినయితే

నాకు ఆయనతో వివాహం జరిపించు" అని ప్రార్థించారు. ఆ తర్వాతే పై వాక్యాలు అవతరించాయని అంటారు. ఆ తర్వాత ప్రవక్త ఆమెకు సమాచారం పంపించారు. ఆమెతో తన వివాహం దైవికమని పేర్కొన్నారు. ఈ వార్త వినగానే ఆమె తన ఆభరణాలన్నీ తీసి దాసిపిల్ల సలామాకు కానుకగా ఇచ్చేశారు. ఆ మంచి వార్త తీసుకొచ్చింది సలామా. ఆ తర్వాత దేవుడికి సాష్టాంగపడి రెండు రోజుల ఉపవాసాలు ఉండాలని తీర్మానించుకున్నారు.

జైనబ్‌తో వివాహం తర్వాత ప్రవక్త ఒక పెద్ద విందు ఏర్పాటు చేశారు. దాదాపు 300 మంది ప్రవక్త అనుచరులు వారి కుటుంబాలు ఈ విందులో పాల్గొన్నారు.

# జువైరియా

ప్రవక్త ఎనిమిదవ భార్య పేరు హజ్రత్ జువైరియా . అత్యంత శక్తివంతమైన బనూ ముస్తలక్ తెగ నాయకుడు హారిస్ కుమార్తె జువైరియా. ఆమె మొదటి పెళ్ళి అదే తెగకు చెందిన యువకుడితో జరిగింది. ఆమె తండ్రి, భర్త ఇద్దరు ప్రవక్త పట్ల తీవ్రమైన వైరం వహించినవారు. యుద్ధంలో ఆమె భర్త మరణించాడు. ఆమె యుద్ధఖైదీగా బందీ అయ్యారు. ఆమె తండ్రి హారిస్ సంకోచిస్తూనే ప్రవక్త ముహమ్మద్ వద్దకు వెళ్ళాడు. "నేను నా తెగ ప్రజలకు నాయకుడిని. నా కుమార్తె ఒక పనిమనిషిగా ఇక్కడ ఉండడం నాకు చాలా సిగ్గుచేటు. కాబట్టి ఆమెను విడుదల చేయండి. అందుకు బదులుగా పరిహార ధనం చెల్లించడానికి సిద్ధంగా ఉన్నాను." అన్నాడు. ప్రవక్త జవాబిస్తూ "నిర్ణయాన్ని జువైరియాకే వదిలేయడం మంచిది కదా" అన్నారు. హారిస్ తన కుమార్తె వద్దకు వెళ్ళి ప్రవక్త ఆమె నిర్ణయానికే వదిలేశారని చెప్పాడు. ఆమెను తనతో రమ్మన్నాడు. ఆమె తాను ప్రవక్త సేవలో ఉండడానికే ఇష్టపడుతున్నానని కాబట్టి ప్రవక్త తనను పెళ్ళి చేసుకోవడమే మంచి పద్ధతి అవుతుందని చెప్పారు. ఈ జవాబు విని హారిస్ కూడా సంతోషించాడు. ప్రవక్త అంగీకరించి, ఆమె విడుదలకు అవసరమైన పరిహార ధనం తానే చెల్లించి ఆమెను విడుదల చేసి వివాహమాడారు. ఈ వివాహం వల్ల బనూ ముస్తలక్ తెగ ముస్లిములకు దగ్గరయ్యింది. ఈ పెళ్ళి వల్ల శాంతియుత, స్నేహపూర్వక సంబంధాలు ఏర్పడ్డాయి. వివాహం తర్వాత యుద్ధఖైదీలందరినీ విడుదల చేయడం జరిగింది. ఈ వివాహం తర్వాత శాంతిపూర్వక స్నేహసంబంధాలు ఏర్పడ్డాయి. ఆయిషాకు జువేరియా అంటే చాలా ఇష్టం ఉండేది. ఇస్లామ్ మౌలిక విషయాలు ఆమెకు నేర్పేవారు. త్వరలోనే ఆమె నేర్చుకున్నారు.

# ఉమ్మె హబీబా

ప్రవక్త ముహమ్మద్ తొమ్మిదవ భార్య ఉమ్మెహబీబా . ఇస్లామ్ ప్రధాన శత్రువు అబూసుఫియాన్ కుమార్తె ఆమె. మక్కాలో ఖురైషు సైన్యాలకు ఆయనే నాయకుడు. ఆయన భార్య హింద్. ఉ మ్మె హబీబా ఆమె భర్త ఇరువురు ఇస్లామ్ స్వీకరించారు. ఇరువురి తల్లిదండ్రులకు ఇది నచ్చలేదు. వేధింపులను తప్పించుకోవడానికి ఈ దంపతులు అబిసీనియాకు వలస వెళ్ళారు. అక్కడ ఆమె భర్త క్రయిస్తవం స్వీకరించాడు. కాని ఉమ్మె హబీబా ఇస్లామ్‌ను వదలడానికి నిరాకరించారు. కాలక్రమేణా ఆమె భర్త విలాస జీవితానికి అలవాటు పడ్డాడు. మద్యపానానికి బానిసై చివరకు మరణించాడు. ఆమె తిరిగి వచ్చిన తర్వాత ఆమె పరిస్థితి చూసి ప్రవక్త చాలా చింతించారు. ఆమెను వివాహమాడి ఆశ్రయమిచ్చారు. ఈ వివాహం వల్ల ఆమె కుటుంబం, వంశంలోని అనేకమంది ఇస్లామ్‌కు దగ్గరయ్యారు. ముఖ్యంగా ఖురైషుల్లో ఒక పెద్ద తెగ బనూ అబ్దల్ షమ్స్ ఇస్లామ్ స్వీకరించడానికి ఈ వివాహం కారణమైంది. ఖురైషుల్లో పెద్ద తెగ బనూ అబ్దష్షమ్స్ ఇస్లామ్‌కు దగ్గరవ్వడానికి ఈ వివాహం కారణమయ్యింది. ఉ మ్మె హబీబాతో ప్రవక్త వివాహం గొప్ప ప్రభావాన్ని వేసింది. ఖాలిద్ ఇస్లామ్ స్వీకరించడానికి ఈ వివాహం కూడా కారణమే. ప్రవక్త పట్ల అబూసుఫియాన్ వ్యతిరేకత ఈ వివాహం తర్వాత చాలా వరకు తగ్గిపోయింది. ఖురైషులు ఈ వివాహం తర్వాత ప్రవక్తను తమ శత్రువుగా కాదు తమ బంధువుగా చూడడం మొదలు పెట్టారు. చాలా మంది ఆయనతో పోరాడరాదన్న నిర్ణయానికి వచ్చారు. వివాహ సమయంలో ఆమె వయసు 38 సంవత్సరాలు. ఆమె తన జీవితంలోని ప్రతిక్షణం ప్రవక్త సేవకే అంకితమయ్యారు. ప్రవక్త తర్వాత రెండు దశాబ్దాల వరకు ఆమె జీవించి ఉన్నారు. డెబ్బయి మూడేళ్ళ వయసులో మరణించారు. మొదటి భర్త వల్ల ఆమెకు ఇద్దరు కుమారులు జన్మించారు. ప్రవక్త వల్ల ఆమెకు సంతానం లేదు.

# సఫియా

ప్రవక్త ముహమ్మద్ పదవ భార్య పేరు సఫియా. ఖైబర్ యుద్ధంలో ఆమె యుద్ధఖైదీగా వచ్చారు. ఆమె తల్లిదండ్రులు యూదులు. రెండు ముఖ్యమైన యూదవంశాలకు చెందినవారు. సఫియా మొదటి వివాహం ప్రముఖ యూదకవి బిన్ మష్కామ్‌తో జరిగింది. కాని వారిద్దరికీ సరిపడేది కాదు. చివరకు ఆమె భర్త విడాకులిచ్చాడు. ఆమె మళ్ళీ పెళ్ళి చేసుకున్నారు. గొప్ప యోధుడిగా పేరున్న యువకుడిని పెళ్ళాడారు. కాని ఖైబర్ యుద్ధంలో అతడు

మరణించాడు. ఆ యుద్ధంలో సఫియా తండ్రి, కుటుంబంలోని ఇతర పురుషులు కూడా హతమయ్యారు. సఫియా యుద్ధఖైదీగా బందీ అయ్యారు. ఆమె ఒక ప్రవక్త అనుచరుని ఇంట దాసిగా పనిచేయవలసి వచ్చింది. కాని కొందరు అనుచరులు ఆమె ఒక తెగ నాయకుడికి కుమార్తె కాబట్టి ఆమెను ప్రవక్త ఇంటికే కేటాయించాలని అభిప్రాయపడ్డారు. సపియా కూడా తాను ముస్లిమ్‌గా మారాలని, ముస్లిం నాయకుడిని వివాహం చేసుకుంటానన్న కోరిక వ్యక్తం చేశారు. ఆ విధంగా మాత్రమే తన ప్రజల్తో తన గౌరవం నిలబడుతుందని కూడా అన్నారు.

ప్రవక్త ఆమె మోముపై ఒక ఆకుపచ్చని మచ్చ చూశారు. కంటికి దగ్గరగా ఉన్న ఆ మచ్చ ఏమిటని అడిగారు. ఆమె జవాబిస్తూ "ఒక రోజు నేనో కల చూశాను. అందులో మదీనాలో ఒక చంద్రుడు ఉదయించాడు. నా ఒడిలో పడిపోయాడు. నేను ఈ కల గురించి నా భర్త కనానాకు చెప్పాను. అతను ''నువ్వు మదీనా నుంచి వచ్చే రాజును పెళ్ళాడాలనుకుంటున్నావా?" అంటు ముఖంపై కొట్టాడు. అ దెబ్బ గుర్తు ఇది" అన్నారు.

సఫియా ఆమె తండ్రి వంటిది కాదు. ఆమె చాలా కాలంగా ప్రవక్త సందేశాన్ని అధ్యయనం చేస్తూన్నారు. ఆమె చాలా సుగుణాలున్న స్త్రీ. ప్రవక్త పట్ల తన తెగవారు తీవ్రమైన వైరాన్ని కలిగి ఉన్నప్పటికీ ఆమెలో ఆ వైరం లేదు. ప్రవక్త ఆమె గురించి విని ఉన్నారు. ఆమె ఆధ్యాత్మిక భావాల గురించి కూడా తెలుసుకుని ఉన్నారు. తన భవిష్యత్తు మదీనా ముస్లిములతో ముడిపడాలన్న తన కలను ఆమె ప్రవక్త కు చెప్పడానికి సంకోచించలేదు. ప్రవక్త ఆమె చెప్పిన మాటలు విన్నారు. తర్వాత ఆమెకు రెండు ప్రత్యామ్నయాలు చూపించారు. యూదమహిళగా ఉండడం, తన ప్రజల వద్దకు తిరిగి వెళ్ళిపోవడం. లేదా ముస్లిమ్‌గా మారి అక్కడ ఉండడం. సఫియా ముస్లిమ్‌గా మారి ముస్లిముల నాయకుడిని పెళ్ళాడ్డానికి ఇష్టపడ్డారు. ఆ విధంగా చేయడం వల్ల తన స్థాయి, యూదతెగలో తన హోదా రెండూ దెబ్బతినకుండా ఉంటాయని అభిప్రాయపడ్డారు. "నేను దేవుడిని, దైవప్రవక్తను ఎన్నుకున్నాను" అన్నారామె.

ప్రవక్త ఆమెను విడుదల చేసి ఆ తర్వాత కొంతకాలానికి పెళ్ళి చేసుకున్నారు. విజేతలు తాము జయించిన భూభాగాల రాజుల భార్యలను లేదా కుమార్తెలను వివాహమాడ్డం అన్నది ఇంతకు ముందు నుంచి ఉన్నదే. ఇలాంటి వివాహాల ద్వారా యుద్ధబీభత్సాన్ని కొంత తగ్గించడమూ, పరాజితుల మర్యాదను కొంతవరకు కాపాడ్డమూ రెండు ఉద్దేశ్యాలు నెరవేరుతాయి.

ప్రవక్త జీవించి ఉన్నప్పుడు ఒకసారి హజ్రత్ ఉమర్ ఆమెతో మీరు ఇంకా యూదులతో సంబంధాలు కొనసాగిస్తున్నారా అని ప్రశ్నించారు. ఆమె "నేను శనివారాలు పాటించను, శుక్రవారాలు పాటిస్తానని" కరకుగా జవాబిచ్చారు. "అయితే నేను నా యూద

బంధువుల పట్ల ప్రేమాభిమానాలు కలిగి ఉన్నాను. ఇస్లామ్ దీన్ని నిషేధించలేదు." అని కూడా చెప్పారు. హజ్రత్ ఉమర్ నిరుత్తరుడై ఉండిపోయారు. ఆమెకు పిల్లలు లేరు. అరవయ్యేళ్ళ వయసులో తనువు చాలించారు.

# మారియా

మారియా ఒక బానిసగా, అలెగ్జాండ్రియాకు చెందిన ఆర్చ్‌బిషప్ పంపిన కానుకగా ప్రవక్త వద్దకు వచ్చారు. ప్రవక్త ఆమెకు స్వేచ్ఛ ఇచ్చి వివాహం చేసుకున్నారు. ఆమెను ఒక బానిసగా ఉంచుకోవడం అన్నది ప్రవక్త ఎన్నటికీ చేసే పని కాదు. హజ్రత్ ఖదీజా తర్వాత ఈమె వల్లనే ప్రవక్త కు పిల్లలు కలిగారు. ఒక కుమారుడు కలిగాడు. అతని పేరు ఇబ్రాహీమ్. కాని రెండేళ్ళ వయసులోనే మరణించాడు. పుత్రశోకాన్ని ఆమె భరించలేకపోయారు. కొన్నేళ్ళకు ఆమె కూడా మరణించారు.

# మైమూనా

ప్రవక్త చేసుకున్న చివరి వివాహం ఇది. మైమూనా కూడా వితంతువు. ఆమెకు అంతకు ముందు రెండుసార్లు వివాహమైంది. వివాహమప్పుడు ఆమె వయసు 51 సంవత్సరాలు. ఆమె చాలా దయనీయస్థితిలో ఉన్నారు. అప్పుడు ప్రవక్త వయసు 57 సంవత్సరాలు. ఈ పెళ్ళికి ప్రధాన కారణం ఏమంటే, ఆమె హలాలియ్యాన్ తెగకు చెందినవారు. ఆమె తెగను ఇస్లామ్‌లోకి తీసుకురావడానికి ఆమెను వివాహం చేసుకోవడం మంచిదని ప్రవక్త పినతండ్రి హజ్రత్ అబ్బాస్ సలహా ఇచ్చారు. ఈ వివాహం తర్వాత అలాగే జరిగింది. హలాలియ్యాన్ తెగ యావత్తు ఇస్లామ్ స్వీకరించింది.

ముగింపు

పైన పేర్కొన్న వివరాలను పరిశీలిస్తే ప్రవక్త ముహమ్మద్ దైవాదేశాల ప్రకారమే ఈ వివాహాలకు పూనుకున్నారని తెలుస్తోంది. ఈ వివాహాల వెనుక ఎలాంటి శారీరకవాంఛలు కనబడవు. చివరి వివాహం తర్వాత దేవుడు "ఇంకెవరినీ పెళ్ళాడవద్దు" (దివ్యఖుర్ఆన్ : 33:52) అన్న ఆదేశం కూడా వచ్చింది. ఎందుకంటే అప్పటికీ ప్రవక్త వివాహాల వల్ల సాధించవలసిన లక్ష్యాలు పూర్తయ్యాయి. ప్రవక్త ప్రారంభించిన ఉద్యమం సంపూర్ణం కావచ్చింది.

గమనించవలసిన మరో ముఖ్యమైన విషయమేమంటే, ప్రవక్త చేసుకున్న వివాహాలన్నీ, ఒక్క హజ్రత్ ఆయిషా తప్ప అందరూ అంతకు ముందు పెళ్ళయినవారే. ప్రవక్త తో పెళ్ళి జరిగినప్పుడు ఈ మహిళలందరూ నలభై, యాభై సంవత్సరాల వయసులో ఉన్నవారే. అంటే ఎవరు యవ్వనంలో ఉన్నవారు కాదు. ఇందులో ఎవరు శారీరకంగా సౌందర్యవతులు కూడా కాదు. వీరందరూ విడాకులు పొందిన లేదా వితంతువులైన మహిళలు. చాలా మందికి అంతకు ముందు భర్తల వల్ల పిల్లలు కూడా ఉన్నారు. పెళ్ళికి కన్యలు కావాలనుకునే సమాజాల్లో ఇది ఒక పెద్ద మార్పును తీసుకువచ్చే అంశం.

ప్రవక్త ముహమ్మద్ చేసుకున్న వివాహాల కారణంగా ఆయన నైతికత, ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని సందేహించేవారు ఎవరైనాగాని ఈ క్రింది ప్రశ్నలకు సంతృప్తికరమైన జవాబులు వెదకవలసి ఉంటుంది.

1. పాతికేళ్ళ వయసు వరకు స్త్రీ సంపర్కానికి దూరంగా ఉన్న ఆయన ఎందుకు పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించారు?

2. తన కన్నా పదిహేను సంవత్సరాలు పెద్దదయిన వితంతు మహిళను ఎందుకు పెళ్ళాడారు?

3. ఆమె జీవించి ఉన్నంత కాలం, అంటే ఆయన యాభై సంవత్సరాల వయసు దాటే వరకు మరో పెళ్ళి ఎందుకు చేసుకోలేదు?

4. ఎలాంటి ప్రత్యేక అందచందాలు లేని వితంతువులు, విడాకులు పొందిన నిస్సహాయ స్త్రీలను ఎందుకు తర్వాత స్వీకరించారు?

5. సర్వసుఖాలు, విలాసాలు అనుభవించే అధికారం ఉన్నప్పటికీ ఎందుకు అత్యంత నిరాడంబరంగా పేదగా బతికారు?

6. ఆయన జీవితం చివరి భాగంలో, ఇస్లామీయ కార్యభారం ఎంతో ఎక్కువగా ఉన్న ఐదేళ్ళ కాలంలో, స్వయంగా ఆయన ఉద్యమం, ఆయన సందేశప్రచారం క్లిష్టదశలో ఉన్నప్పుడే ఈ వివాహాలు ఎందుకు చేసుకున్నారు?

7. విమర్శకులు ఆరోపిస్తున్నట్లు కామవాంఛల్లో మునిగిపోయిన మాట వాస్తవమైతే ఆయన ఒక గొప్ప ప్రవక్తగా ఎలా ఉండగలిగారు?

ఈ వివాహాలు విషయలోలత్వం కారణంగా జరిగిన వివాహాలుగా భావించడమే పొరబాటు. ఈ వివాహాలు జరిగిన పరిస్థితులను నిష్పక్షపాతంగా విశ్లేషిస్తే మనకు చాలా వాస్తవాలు అర్ధమవుతాయి.

## వివాహాలకు కారణాలు

ప్రవక్త ముహమ్మద్ లైంగిక వాంఛల పరిపూర్తి కోసం అనేకమందిని పెళ్ళాడారని ఇస్లామ్ శత్రువులు విమర్శిస్తూ, బురదజల్లుతూ తమ అజ్ఞానాన్ని చాటుకుంటూ ఉంటారు. ఎలాంటి అవగాహన లేకుండా తీర్పులు ఇచ్చేస్తుంటారు. ప్రవక్త చేపట్టిన ఉద్యమ స్వభావం, నాటి పరిస్థితులు, ప్రవక్త స్వయంగా జీవించి చూపించిన జీవనవిధానం, ఈ వివాహాలకు ముందు ఆయన బతికిన తీరు, ఈ వివాహాలు చేసుకున్న తర్వాత బతికిన తీరు, మక్కాలో ఆయన జీవితం, మదీనాలో ఆయన జీవితం వీటి గురించి ఏమాత్రం తెలియకుండానే ఆరోపణలు గుప్పిస్తుంటారు.

ప్రవక్త చేసుకున్న వివాహాల్లో చాలా వరకు మదీనాలో ఉన్నప్పుడు జరిగాయి. ఈ వివాహాల వెనుక చాలా కారణాలున్నాయి. వ్యక్తిగత కారణాలు, తెగలకు సంబంధించిన కారణాలు, రాజకీయ కారణాలు వీటి వెనుక ఉన్నాయి. ఆయన ఈ వివాహాలు చేసుకోవడం ప్రారంభించినప్పుడు ఆయన వయసు యాభై ఐదు సంవత్సరాలు. పెళ్ళి చేసుకున్న వారందరు వితంతువులు, విడాకులు పొందిన మహిళలు. ఇద్దరు తప్ప మిగిలిన వారందరూ ముప్పయి ఎనిమిది సంవత్సరాలకు పైబడినవారే. ఆయన యాభై సంవత్సరాలు దాటిన తర్వాత విషయలోలత్వం, స్త్రీ వ్యసనం ప్రారంభించారని ఎవరన్నా చెప్పగలరా? అది కూడా తన జీవితంలో అత్యంత క్లిష్టమైన పరిస్థితులు ఎదుర్కుంటున్నప్పుడు ఈ విషయలోలత్వంతో ఈ వివాహాలు చేసుకున్నారని ఆరోపించడంలో వివేకముందా? అప్పట్లో ఆయన అనేక మంది శత్రువుల దాడుల మధ్య ఉన్నారు. అంతర్గతంగా మదీనాలో కపట విశ్వాసుల ద్రోహాలు, యూదుల కుట్రలు కుతంత్రాలు కొనసాగుతున్నాయి. మరోవైపు ఇస్లామ్ శత్రువులు, ఖురైషులు వరుస దాడులు చేస్తున్నారు. మదీనా చుట్టు ఉన్న శత్రు తెగలు మదీనాకు తలపై వేలాడే కత్తిలా మారాయి. ఈ వాతావరణంలో రాత్రి ప్రశాంతంగా పడుకోవడం కూడా సాధ్యం కాని పరిస్థితి. ఇలాంటి పరిస్థితిలో ఒక సగటు మనిషి కూడా విలాసాలు, శారీరకవాంఛల గురించి ఆలోచించలేనప్పుడు, ప్రవక్త ముహమ్మద్ వంటి ఉత్తమ గుణగణాలున్న ఇలాంటి ఆలోచనలతో వివాహాలు చేసుకున్నారని చెప్పడం ఎంత అవివేకం. ఈ ఆరోపణలన్నీ దుష్టబుద్ధితో, దుర్మార్గంతో కొందరు ప్రచారం చేస్తున్న ఆరోపణలు మాత్రమే.

తమలో ఉన్న నీచమైన ఆలోచనల పునాదులపై ఆలోచిస్తూ, అందరినీ తమ ఆలోచనల కొలబద్దలతో కొలుస్తూ దుష్టబుద్ధితో కొందరు చేసే విమర్శలు మాత్రమే ఇవి.

ప్రవక్త ముహమ్మద్ అత్యంత సాధారణమైన, నిరాడంబరమైన, నిరుపేద జీవితాన్నే గడిపారు. ఆయన ఇంట ఫర్నీచర్ కేవలం చాపలు, జగ్గులు, బ్లాంకెట్లు వగైరా మాత్రమే. పగలంతా ఆయనపై తీవ్రమైన పనుల ఒత్తిడి ఉండేది. ఆ కాలంలో అందరికన్నా ఎక్కువగా పనుల ఒత్తిడిని భరించింది ఆయనే. సర్వసత్తాక అరేబియా ద్వీపకల్పానికి పాలకుడు, ప్రధాన న్యాయమూర్తి, సర్వసైన్యాధ్యక్షుడు, ప్రధాన బోధకుడు అన్నీ ఆయనే. పగలంతా పనుల ఒత్తిడిలో గడిపి, రాత్రంతా దైవభక్తుడిగా, దైవదాసుడిగా ఆరాధనల్లో గడిపేవారు.

దివ్యఖుర్ఆన్ మాటల్లో చెప్పాలంటే :

> "ఓ ప్రవక్తా! నీవు ఒక్కొక్కప్పుడు దాదాపు మూడింట రెండువంతుల రాత్రి, మరొకప్పుడు సగం రాత్రి, ఇంకొకప్పుడు మూడింట ఒకవంతు రాత్రి ఆరాధనలో నిలబడి ఉంటావనీ.." (దివ్య ఖుర్ఆన్ (73:20))

ఆయన పెళ్ళాడిన భార్యలలో చాలా మంది కులీనవంశాలకు, సంపన్నకుటుంబాలకు చెందినవారు. తమ తల్లిదండ్రుల ఇండ్లల్లో అత్యంత విలాసవంతమైన జీవితాన్ని గడిపినవారు. కాని ప్రవక్త ఇంట సౌకర్యాలు, విలాసవస్తుసామగ్రి కాదు కదా కనీస మౌలిక జీవితావసరాలు కూడా దుర్లభంగా ఉండేవి. ప్రవక్త తరచు ఆకలి కడుపుతో ఉండే పరిస్థితి. ఉపవాసాలు పాటిస్తూ ఉండేవారు. ఆయన భార్యలకు నిత్యావసరవస్తువులు కూడా దొరికేవి కావు. ఆయన జీవితం చివరి దశలో సంపద ధనకనక రాశులు అన్ని ప్రాంతాల నుంచి మదీనాకు వరదలా వచ్చేవి. ఇలా మదీనాకు సంపద పెద్దఎత్తున రావడం, ఆ సంపదను మదీనా ప్రజలకు పంపిణీ చేయడం జరిగేది. ఆ సంపదలో ప్రవక్త కుటుంబానికి ఏదో నామమాత్రంగా కొంత లేదా అస్సలు తీసుకోకపోవడం జరిగేది. ఇది చూసి ప్రవక్త భార్యలు తమకు ఆ సంపదల నుంచి తగిన వాటా కావాలని, కనీసం తమ రోజువారి అవసరాలు తీరే స్థాయిలో ఇవ్వాలని డిమాండ్ చేయడం ప్రారంభించారు. ఈ సందర్భంగా దివ్యఖుర్ఆన్ హెచ్చరిక గమనించదగ్గది.

"ప్రవక్త! మీ భార్యలకు చెప్పండి. ఈ ప్రపంచ జీవితం, ఇక్కడి తళుకుబెళుకులు మీరు కోరుకుంటున్నట్లయితే, రండి, మీకు కావలసిన భోగభాగ్యాలు అందిస్తాను, మీకు ఉచితమైన రీతిలో స్వేచ్ఛనిస్తాను."

అంటే, ప్రవక్త తో జీవించడమంటే వారు పేదరికం, నిరాడంబర సాధారణ జీవితంతో తృప్తిపడాలి. లేదా తమకు కావలసిన ధనసంపదలు తీసుకుని ప్రవక్తతో వేర్పడాలి. ప్రవక్త భార్యలందరూ ఆయనతో ఉండడానికి, పేదజీవితం గడపడానికే ఇష్టపడ్డారు. ప్రవక్త ను విమర్శించేవారు ఈ వాస్తవాలు గుర్తించారా? కామకేళి, సుఖవిలాసాల జీవితాన్ని ఇష్టపడేవ్యక్తి ఎవరైనా ఇలాంటి గుణగణాలు, వ్యక్తిత్వాన్ని కలిగి ఉంటాడా? ఇలాంటి విమర్శలు చేస్తున్నవారు మొదట తమ స్వంత జీవితంలో తొంగి చూసుకోవాలి. తామెక్కడున్నారో గ్రహించాలి. తన ఒక్కసైగతో అపార ధనకనకరాశులు తన వద్దకు వచ్చే అధికారం కలిగి ఉన్నా అత్యంత నిరాడంబరంగా, పేదజీవితాన్ని గడిపిన ప్రవక్త ను వేలెత్తి చూపే నైతిక అర్హత తమకు ఎంత ఉందో లెక్కించుకోవాలి. ప్రవక్త జీవితం ఎలా ఉండేదో, ఆయన జీవనశైలి ఎలా ఉండేదో అర్థం చేసుకుని ఆ తర్వాత ఒక నిర్ణయానికి రావాలి.

ఉహుద్ యుద్ధంలో అనేకమంది ముస్లిమ్ సైనికులు హతమయ్యారు. పెద్ద సంఖ్యలో వితంతువులు, అనాథలు సమాజంలో మిగిలారు. ఈ వితంతువులు, అనాథలను ఆదుకోవలసిన బాధ్యత ముస్లిమ్ సమాజంపై పడింది. ఈ వితంతువులు, అనాథలను కాపాడే పద్ధతుల్లో వారి పునర్వివాహం ఒకటి. ఆ విధంగా వారికి పునరావాసం లభిస్తుంది. ప్రవక్త కాని, ఆయన అనుచరులు కాని వైవాహిక బంధం లేకుండా ఈ వితంతువులను తమ ఇండ్లలో అనుమతించడం సాధ్యం కాదు. ఈ క్రమంలో ప్రవక్త వితంతువులైన నిస్సహాయ మహిళలను వివాహం చేసుకుని ఆశ్రయమిచ్చారు.

యుద్ధాల్లో అనేకమందిని ముస్లిములు యుద్ధఖైదీలుగా నిర్బంధించారు. ఈ యుద్ధఖైదీలకు భద్రత కల్పించవలసిన అవసరం ఉంది. యుద్ధఖైదీల విషయంలో వారి హక్కులను నిరాకరించడం జరగలేదు. అమానుషంగా హతమార్చడమూ జరగలేదు. చట్టబద్ధమైన వివాహాల ద్వారా వారికి పునరావాసం కల్పించారు. యుద్ధాల్లో బందీలైన మహిళలు, వితంతువులు వారి పిల్లలకు భద్రత, పునరావాసం కల్పించవలసి ఉంది. వారు ఆకలిదప్పులతో అలమటించకుండా, వారి జీవితాలు సర్వనాశనం కాకుండా చూడవలసి ఉంది. ఈ భారాన్ని ప్రవక్త ముహమ్మద్ ఆయన అనుచరులు తమ భుజాలకెత్తుకున్నారు.

యుద్ధఖైదీలుగా వచ్చిన ఈ మహిళలను సమాజంలో స్వేచ్ఛగా వదిలేస్తే ఏమవుతుంది. వారికి ఆశ్రయం లేదు, భద్రతలేదు, వారి పిల్లల ఆకలిదప్పులు తీర్చేవారు ఉండరు. అలాంటి పరిస్థితిలో యావత్తు సమాజ వాతావరణం కలుషితమయ్యే అవకాశం ఉంది. ఈ వితంతువులు, వారి పిల్లలకు పునర్వివాహాల ద్వారా పునరావాసం కల్పించడం వల్ల యావత్తు సమాజాన్ని పతనం నుంచి కాపాడ్డం కూడా జరిగింది. ప్రవక్త కాని, ఆయన అనుచరులు

కాని యుద్ధఖైదీలుగా వచ్చిన ఈ మహిళలను, వితంతువులను తమ బానిసలుగా చేసుకోలేదు, ఉంపుడుగత్తెలుగా మార్చుకోలేదు. గౌరవప్రదంగా వివాహం చేసుకున్నారు. వారికి గౌరవప్రదమైన హోదా ఇచ్చారు. ఈ వితంతువులు, వారి అనాధపిల్లల సమస్యకు ఇంతకన్నా మంచి పరిష్కారాన్ని ఎవరైనా సూచించగలరా? ఈ పరిణామాలను దివ్యఖుర్‌ఆన్ ముందే ఊహించింది. ఈ వివాహాల ఉద్దేశ్యం గురించి దివ్యఖుర్‌ఆన్ స్వయంగా ఇలా వ్యాఖ్యానించింది: "మీపై ఎలాంటి నింద లేకుండా ఉండడానికి" అని చెప్పింది.

ప్రవక్త ముహమ్మద్ మానవాళికి ఆదర్శంగా ఈ ప్రపంచంలోకి వచ్చారు. అన్ని రంగాల్లోను ఆయన ఆదర్శంగా నిలిచారు. ఆయన మాటలు, ఆచరణలను భద్రపరచడం ద్వారా మానవసమాజాలకు మార్గదర్శకసూత్రాలు లభించాయి. దేవుడు ఆయన్ను మానవాళికి బోధకుడిగా పంపాడు. ముఖ్యంగా ఒక భర్తగా ఆయన అత్యంత దయాస్వభావుడు. ప్రేమమూర్తి, గొప్ప జీవితభాగస్వామి.

మానవాళిలో సగం జనాభా మహిళలదే. మహిళలకు ఇస్లామ్ సందేశాన్ని ప్రభావశీలమైన పద్ధతిలో అందజేయవలసి ఉండేది. ప్రవక్త ప్రతిరోజు సందేశ ప్రచారం చేసేవారు. ఆచరణాత్మకంగా ఆయన ఒక ఉదాహరణగా నిలిచారు. తన బోధనల ద్వారా తెలియజేసేవారు. ఇది చాలా వరకు పురుషులకు పరిమితమైంది. అయితే మహిళలకు కూడా పెద్ద స్థాయిలో ఈ సందేశాన్ని, బోధనలను, ఆచరణాత్మక ఉదాహరణలను అందజేయడానికి నిజాయితీ కలిగిన మహిళల బృందం అవసరమైంది. ఆయన ఇంట ఉండి, ఆయనతో జీవితం పంచుకుంటూ, ఆయన చేసిన పనులను గమనిస్తూ వచ్చిన ఆయన భార్యలు ఇస్లామీయ జ్ఞానసంపదకు కేంద్రాలయ్యారు. అత్యంత వ్యక్తిగతమైన, మహిళలకు సంబంధించి వ్యవహారాలకు సంబంధించిన ఇస్లామీయ జ్ఞానం వీరి ద్వారానే లభించింది. ప్రవక్త భార్యల ప్రమేయమే లేనట్లయితే ఈ జ్ఞానం, ఈ సమాచారం లభించే అవకాశం ఉండేది కాదు. ప్రవక్త భార్యలు అత్యంత విశ్వాసపాత్రంగా ఇస్లామీయ విధానాలను, ఇస్లామీయ జ్ఞానాన్ని, ప్రవక్తఆచరణలను తాము చూసిన, విన్న వాటన్నింటిని, తాము ప్రవక్త తో పాటు ఆచరించిన వాటన్నింటి గురించి సమాజానికి తెలియజేశారు.

ఆయన చేసుకున్న వివాహాలకు కొన్ని కారణాలు

- తెగల మధ్య వివాహాలను ప్రోత్సహించడం
- వితంతు పునర్వివాహం
- విడాకులు పొందిన మహిళల పునర్వివాహం.

కులాంతర వివాహాలను వ్యతిరేకించడమంటే సమాజాన్ని వెనుకబాటుకు తోయడమే. మానవాళికి ఆచరణాత్మక ఉదాహరణగా ప్రవక్త నిలిచారు. ఆయన కులవ్యవస్థను పూర్తిగా తొలగించారు. జాతిపరమైన, ప్రాంతపరమైన, విభేదాలను తొలగించారు. ఆయన ఈజిప్టుకు చెందిన కాప్టిక్ మహిళను వివాహం చేసుకున్నారు. అబిసీనియాకు చెందిన నీగ్రో మహిళను పెళ్ళాడారు. ఒక యూదమహిళను వివాహం చేసుకున్నారు. సఫియా యూదమతానికి చెందిన వారు. స్త్రీ ఏ మతానికి చెందినదైనా, ఏ దేశానికి చెందినదైనా ఆమె దేవునికి భాగస్వాములను కల్పించకుండా, బహుదైవారాధనకు పాల్పడకుండా ఉంటే ఆమెను పెళ్ళాడవచ్చని ఆయన ఆచరణాత్మకంగా చూపించారు. మారియాతో వివాహం కూడా అలాంటిదే. సమానత్వం, సౌభ్రాత్రభావాలను బోధించడంతో ఆయన సరిపెట్టుకోలేదు, ఆచరణాత్మకంగా వాటిని పాటించారు.

వితంతు పునర్వివాహం అన్నది భారతదేశంలో మొన్నమొన్నటి వరకు కూడా సాధ్యంకాని విషయంగానే ఉండేది. ఇస్మామ్‌కు ముందు కాలంలో అరబ్బులు వితంతు పునర్వివాహానికి ఒప్పుకునేవారు కాదు. ప్రవక్త అలాంటి వివాహాలను ప్రోత్సహించారు. వితంతువులను వివాహమాడారు. ఆయనపెళ్ళాడిన మహిళల్లో ఒక్క ఆయిషా తప్ప మిగిలిన వారెవరూ కన్యలు కాదు. విడాకులు పొందిన మహిళ జైనబ్ తప్ప మిగిలిన వారందరూ వితంతువులే.

ఇస్లామ్‌కు ముందు అరబ్బులు విడాకులు పొందిన స్త్రీని పెళ్ళాడేవారు కాదు. ఈ దురాచారాన్ని తొలగించడానికి ప్రవక్త స్వయంగా విడాకులు పొందిన మహిళ జైనబ్‌ను వివాహం చేసుకున్నారు. స్వేచ్ఛ పొందిన బానిస జైద్ విడాకులిచ్చిన జైనబ్‌ను ప్రవక్త వివాహం చేసుకున్నారు.

నిజానికి జైనబ్ ప్రవక్త కు సన్నిహిత బంధువు. జైద్‌తో పెళ్ళికి ముందు ఆమె పెళ్ళి సంబంధం ప్రవక్త వద్దకే వచ్చింది. ప్రవక్త ఆమెను పెళ్ళాడాలన్న ప్రతిపాదన వచ్చింది. కాని అప్పుడు ఆ ప్రతిపాదనను ఆయన తిరస్కరించారు. తానే స్వయంగా జైద్‌తో ఆమెకు వివాహం చేయించారు. జైద్ విడాకులిచ్చిన తర్వాత ఆయన ఆమెను పెళ్ళి చేసుకోడానికి రెండు కారణాలున్నాయి. ఒకటి, విడాకులు పొందిన మహిళ పునర్వివాహాన్ని చట్టబద్ధం చేయడం. రెండు, దత్తతతకు సంబంధించిన అసలు స్థానాన్ని తెలియజేయడం. కాని జైనబ్ వివాహాన్ని ఇస్లామ్ పట్ల బురదజల్లాలనుకునేవారు అనేక కట్టుకథలు అల్లి ప్రవక్త నైతిక ప్రమాణాలను ప్రశ్నించడానికి ప్రయత్నిస్తుంటారు. ఇస్లామ్ శత్రువులు చేసే ఇలాంటి కట్టుకథల విషప్రచారాలు కనీసం పట్టించుకోదగినవి కూడా కాదు (చూడండి దివ్యఖుర్ఆన్ : 33:36-38)

కొందరు ముస్లిమ్ ట్రెడిషనలిస్టులు కావాలని ప్రవక్త మగతనాన్ని చాటి చెప్పడానికి ప్రయత్నించడం ద్వారా తమ ప్రభువుల లైంగిక వ్యవహారాలను సమర్ధించడానికి చేసిన ప్రయత్నాలు దురదృష్టవశాత్తు నేడు ప్రవక్త పై బురద చల్లడానికి ప్రయత్నిస్తున్న శత్రువులకు మంచి అవకాశాలయ్యాయి. ఈ ట్రెడిషనలిస్టుల రాతలు ప్రవక్త వివాహాల స్వభావానికి గాని, ప్రవక్త వైవాహిక సంబంధాల వాస్తవాలతో గాని పొంతన లేనివి. ఓరియంటలిస్టులు, ఇస్లామ్ శత్రువులు వాడుకుంటున్న ఇలాంటి ఈ కల్పితరాతలపై ముస్లిమ్‌లలో తీవ్రమైన నిరసన ఉంది.

దివ్యఖుర్ఆన్ వాక్యాలను వాటి అవతరణల నేపథ్యంలో చూడాలి. దివ్యఖుర్ఆన్ అవతరణల నేపథ్యం అప్పటి పరిస్థితులను మనకు తెలుపుతుంది. ఆయా పరిస్థితుల్లో ఆయన ఎలా వ్యవహరించారో కూడా తెలుస్తోంది. ప్రవక్త చేసుకున్న వివాహాలను ఆనాటి చారిత్రక నేపథ్యం, రాజకీయపరిస్థితులు, సామాజిక పరిస్థితుల రీత్యా పరిశీలించవలసి ఉంటుంది.

బ్రిటీషు బయోగ్రాఫర్ ఆర్.వి.సి.బాడ్లే తన పుస్తకం “ది మెసెంజర్ : లైఫ్ ఆఫ్ ముహమ్మద్”లో ఇలా రాశారు :

“ప్రవక్త ముహమ్మద్ వైవాహిక జీవితాన్ని పాశ్చాత్య ధృక్కోణంతో లేదా క్రయిస్తవ ధృక్కోణంతో చూడరాదు.”

ఆయన ఇంకా ఇలా ప్రశ్నించారు :

> “ఆసియా ఆఫ్రికాల్లోని నియమనిబంధనల కన్నా యూరప్, అమెరికాల్లోని నియమనిబంధనలు గొప్పవని ఎందుకు భావించాలి?”
>
> “పాశ్చాత్య ప్రజలు తమ జీవనశైలి ఇతరుల కన్నా నైతికంగా అత్యున్నతమైనదని నిరూపించనంత కాలం ఇతర దేశాలు, మతవిశ్వాసాలు, వర్గాల విషయంలో ఒక నిర్ణయానికి రాకూడదు.” అని వ్యాఖ్యనించాడు.

ప్రవక్త ముహమ్మద్ వ్యక్తిత్వంపై బురదచల్లడానికి ప్రయత్నించిన విద్వేష ప్రచారకుల జాబితా చాలా పెద్దది. పాశ్చాత్యదేశాలకు చెందిన చాలా మంది ప్రముఖుల పేర్లు కూడా ఇందులో కనబడతాయి. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా ప్రవక్త ముహమ్మద్ వ్యక్తిత్వం, ఆయన తీసుకొచ్చిన ధర్మం ఈ సవాళ్ళన్నింటినీ ఎదుర్కొని నిలబడ్డాయి. గత పదిహేను వందల సంవత్సరాలుగా ఇస్లామ్ అనేకమందిని ఆకర్షిస్తూనే ఉంది. ఇస్లామ్‌పై అణిచివేతలు ఎంతగా కొనసాగాయో అంతగా బలపడిందని చరిత్ర చాటి చెబుతోంది.

# 22

# మదీనా

## ఒక ఆదర్శ నగరం

మదీనాలో ఒక రాజ్యాన్ని ఏర్పాటు చేశారు ప్రవక్త ముహమ్మద్. అక్కడ ఎలాంటి వ్యవస్థీకృత పాలన లేదు. అనేక తెగలుగా విభజించబడిన సమాజాన్ని ఆయన సంస్కరించపూనుకున్నారు. వారంతా తెగల చట్టాలను, విలువలను పాటిస్తూ బతుకుతున్న ప్రజలు. అక్కడ పాలనాసంస్థలు ఏవీ లేవు. న్యాయవ్యవస్థ, సైన్యం, ఖజానా, విద్యావ్యవస్థ, సాధారణ పరిపాలన లాంటివి అక్కడ లేనేలేవు. ఆయన అన్నింటిని ప్రారంభించవలసిన వచ్చింది.

వ్యవస్థీకృత విధానాలు, పరిపాలనా వ్యవస్థ అంటే ఏమిటో తెలియని సమాజం అది. అలాంటి సమాజంలో ప్రవక్త సామాజిక వ్యవస్థీకరణ ప్రారంభించారు. జీవితరంగాల్లో ఆయన సంస్కరించని రంగం అంటూ ఏదీ లేదు. నియమనిబంధనలు ఏర్పాటు చేయడమన్నది చిన్న పనికాదు. పాత విధానాలను రద్దుచేయడం ఇంకా కష్టం. మదీనా నగరాన్ని కొత్త నియమనిబంధనల చట్రంలో తీసుకురావడానికి ఆయన చాలా కృషి చేశారు. దాదాపు రెండువేల సంవత్సరాలుగా అజ్ఞానంలో కొట్టుమిట్టాడుతున్న అరేబియా ద్వీపకల్పంలోని ప్రజలకు మదీనా ఒక ఆదర్శరాజ్యంగా ఆయన పరిచయం చేశారు.

1500 సంవత్సరాల క్రితం ఆయన ప్రవేశపెట్టిన సంస్కరణలను పరిశీలిస్తే ఆ కాలం కన్నా ఆయన ఎంతో ముందుచూపుతో వ్యవహరించారని తెలుస్తోంది. మధ్యప్రాచ్యంలో ఇస్లామీయ నాగరికతగా వికసించిన వ్యవస్థకు ఆయన పునాదులు వేశారు.

ఆయన ప్రారంభించిన సంస్థల్లో మొట్టమొదటిది మస్జిదె నబవీ. అంటే ప్రవక్త మస్జిదు.

మదీనా నగరంలోని అన్ని కార్యకలాపాలకు ఇది కేంద్రమయ్యింది. ప్రవక్త ఇల్లు మస్జిదుకు ఆనుకుని ఉండేది. మస్జిదు సామూహిక ప్రార్థనలకు ఉపయోగపడడమే కాదు, ఒక కమ్యునిటీ సెంటర్‌గా కూడా ఉండేది.

అదే పాలనాపీఠం, అధ్యయనకేంద్రం, వైద్యచికిత్స లభించే ప్రదేశం, పునరావాస కేంద్రం, సంక్షేమ కేంద్రం అంతేకాదు, చట్టబద్ధమైన వినోదకార్యకలాపాలకు కూడా అదే వేదికయ్యింది. కొత్త నగరానికి మధ్యలో ఉండడం ద్వారా అందరికీ అందుబాటులో ఉండేది. ఈ మస్జిదు ఒక పబ్లిక్ ప్రదేశంగా వివిధ భాషలు మాట్లాడేవారు, వివిధ రంగులవారు అక్కడ ఒకరినొకరు కలుసుకునేవారు. ఈ విధంగా ప్రవక్త మస్జిదు సామాజిక సంబంధాలను పెంచింది.

దూరప్రాంతాలనుంచి వచ్చే బృందాలు ఈ మస్జిదు వద్దకే వచ్చేవి. సహాయం అవసరమైనవారు, సహాయం చేయగలవారు అందరూ ఆ మస్జిదు వద్దకే వచ్చేవారు.

## చరిత్రలో మొదటి రాతపూర్వక రాజ్యాంగం

ప్రవక్త మదీనాకు వలస వచ్చిన తర్వాత మదీనా నగరరాజ్యానికి ప్రవక్త పునాదులు వేశారు. దాని రాజ్యాంగాన్ని ప్రకటించారు. చరిత్రలో ఇదే మొట్టమొదటి రాజ్యాంగం. ఇస్లామీయ రాజ్యంలోని ముస్లిములు, యూదులు, క్రయిస్తవులు, సంచార అరబ్బుల హక్కులు బాధ్యతలను ఈ రాజ్యాంగం తేటతెల్లం చేసింది.

## జ్ఞానవిజ్ఞానాలకు ప్రోత్సాహం

విద్యాభ్యాసానికి ప్రవక్త ముహమ్మద్ ఎంతో ప్రాముఖ్యమిచ్చారు. విద్యార్జన ప్రతి ముస్లిం స్త్రీపురుషుల విధిగా ప్రకటించారు. చాలా ప్రార్థనల కన్నా కొంత జ్ఞానం మిన్న అని కూడా చెప్పారు. అంతేకాదు, “ధర్మపరాయణత్వం కలిగిన వ్యక్తి కన్నా జ్ఞానం కలిగిన వ్యక్తి ఆధిక్యత నక్షత్రాలపై చంద్రుడి ఆధిక్యత వంటిదని” వ్యాఖ్యానించారు.

జ్ఞానం పొందాలనుకుంటున్న వ్యక్తిపై దైవదూతలు తమ రెక్కలతో నీడ కల్పిస్తారని కూడా చెప్పారు.

# ఇస్లామ్‌లో మొదటి విశ్వవిద్యాలయం

## అల్ సుఫ్ఫా

ప్రజలను అక్షరాస్యులు చేయాలని ఆయనక ప్రయత్నించారు. పాఠశాలల ఏర్పాటు ద్వారా విద్యాభ్యాసానికి పూనుకున్నారు. అల్ సుఫ్ఫా అలాంటి ఒక ఉదాహరణ. సుఫ్ఫా అనేది ఒక చతురస్రాకారపు అరుగు. మక్కా నుంచి వలస వచ్చిన వారిలో కుటుంబం లేనివారు అక్కడ ఉండేవారు. వారిలో అక్షరాస్యులైన వారు మదీనా ప్రజలకు చదువు చెప్పాలని ప్రవక్త వారిని ఆదేశించారు. కొంత జ్ఞానం ఉన్నవారు ఇస్లామ్ గురించి ప్రజలకు వివరించాలని అన్నారు. ఇక్కడి నుంచి కొందరిని వివిధ తెగలకు పంపించి వారికి ఇస్లామ్ గురించిన మౌలికాంశాల జ్ఞానాన్ని అందజేసేవారు.

సుఫ్ఫా పగలు ఒక స్కూలు, రాత్రి ఒక హాస్టలు. అనేకమంది ముస్లిములు అక్కడే ఉండేవారు. క్లుప్తంగా చెప్పాలంటే ఇస్లామ్‌లో అది మొదటి రెసిడెన్షియల్ యూనివర్శిటీ వంటిది. అక్కడ మాజ్ బిన్ జబల్ పర్యవేక్షకునిగా ఉండేవారు. ఇస్లామ్ కోసం తన శక్తియుక్తులు సర్వస్వం ధారపోసిన వ్యక్తి మాజ్. అందుకోసం తన ఇంటిని కూడా అమ్మేశారు. అల్‌సుఫ్ఫా వద్ద ప్రవక్త కూడా ఒకటి రెండుసార్లు ప్రసంగించారు. మదీనా సమాజంలో ఆయన బాధ్యతలు, ఆయన నిర్వర్తించవలసిన వివిధ విధుల మధ్య కూడా ఆయన అల్‌సుఫ్ఫా వద్ద బోధించడానికి ప్రయత్నించేవారు.

ఒకరోజు ప్రవక్త తన ఇంటి నుంచి అల్‌సుఫ్ఫాకు వచ్చారు. అక్కడ రెండు గ్రూపులు కూర్చుని ఉన్నాయి. ఒక గ్రూపు దైవస్తోత్రంలో నిమగ్నమై ఉంది. రెండవ గ్రూపు కొత్త విషయాలు నేర్చుకునే ప్రయత్నం చేస్తోంది. ప్రవక్త వారి గురించి వ్యాఖ్యానిస్తూ రెండు గ్రూపులు మంచి పనిలో ఉన్నాయి కాని నేర్చుకునే ప్రయత్నం చేస్తున్న గ్రూపు కాస్త ఉత్తమమైనది అన్నారు.

అంతేకాదు ఆయన ఇంకా ఇలా చెప్పారు

> "ప్రార్థనలతో నిద్రలేకుండా గడిపిన రాత్రి కన్నా జ్ఞానం పొందడానికి రాత్రిలో వెచ్చించిన ఒక గంట ఎంతో మేలైనది" అన్నారు. అల్ సుఫ్ఫా తర్వాత ఇంకా అనేక పాఠశాలలు ఏర్పడ్డాయి. మదీనాలోని వివిధ మస్జిదులకు ఆనుకుని ఈ పాఠశాలలు ఏర్పాటు చేశారు.

మదీనా బయట ప్రజలు ఇస్లామ్ స్వీకరిస్తున్న ప్రాంతాలకు ప్రవక్త ఇస్లామ్ బోధించడానికి తన అనుచరులను పంపించేవారు. ఎమన్ గవర్నర్‌గా అమ్ర్ బిన్ హాజమ్ నియమించబడినప్పుడు ఆయన అధికారిక బాధ్యతల్లో పాలనావ్యవహారాలు చూడ్డం మాత్రమే కాదు, విద్యాబోధన కూడా ఉంది.

# స్త్రీ విద్య

ప్రవక్త ముహమ్మద్ ఇలా అన్నారు

> "మీరు ఒక మగవాడికి విద్యబోధిస్తే కేవలం ఒక వ్యక్తికి మాత్రమే విద్యను బోధించినట్లు. మీరు ఒక మహిళకు విద్యబోధిస్తే యావత్తు కుటుంబానికి విద్యబోధించినట్లు."

విద్యార్జన విషయంలో ప్రవక్త స్త్రీపురుషుల మధ్య ఎలాంటి వివక్షను అంగీకరించలేదు. దివ్యఖుర్ఆన్ అవతరణ జరిగిన ప్రతిసారి ప్రవక్త పురుషుల సమావేశంలో దాన్ని చదివి వినిపించేవారు, ఆ వెంటనే మహిళల సమావేశంలో చదివేవారు. వారంలో ఒక రోజు ప్రత్యేకంగా మహిళల బోధనకు కేటాయించేవారు. వారు ఆయన్ను అన్నివిధాల ప్రశ్నలు అడిగేవారు. ఆయన ఎంతో సహనంతో వాటికి జవాబులు ఇచ్చేవారు.

ప్రవక్త ముహమ్మద్ భార్య ఆయిషా ప్రకారం అన్సార్ మహిళలు అంటే మదీనా ముస్లిమ్ మహిళలను ఎంత ప్రశంసించినా తక్కువే. వారు తమ సందేహాలను తీర్చుకోడానికి, నేర్చుకోడానికి సిగ్గుపడేవారు కాదు. ప్రవక్త ముహమ్మద్ జీవితకాలంలోనే కొందరు మహిళలు పూర్తి దివ్యఖుర్ఆన్ కంఠస్థం చేశారు. కొందరు ఖుర్ఆన్ ప్రకారం వివరణలు ఇచ్చే స్థాయి పొందారు. చాలా మంది హదీసులను (ప్రవక్త ఆచరణలు, ప్రవచనాలు) వివరించగలిగేవారు. కొందరు పురుషులతో సమానంగా ఫత్వాలు (ధార్మిక తీర్పులు) ఇచ్చేస్థాయిలో ఉండేవారు. ఒక మహిళ ఉమ్మల్ ఫజల్ కరీమా తన ఇంట పాఠశాల నడిపేవారు.

# సెక్రటరియేట్

ప్రవక్తకు కార్యదర్శులుగా, లేఖకులుగా పనిచేసిన కనీసం యాభై మంది అనుచరుల పేర్లు మనకు చరిత్రలో కనబడతాయి. ఇందులో కొందరు దివ్యఖుర్ఆన్ ఆయతులను రాసేవారు. కొందరు ప్రవక్త తరఫున చక్రవర్తులకు, రాజులకు, గవర్నర్లకు అధికారిక లేఖలు రాసేవారు. కొందరు జకాత్ ఇతర రెవిన్యూ లెక్కలు రాసేవారు.

# రాజముద్రిక

అధికారిక పత్రాలు, ఒప్పందాలు, చార్టర్లు, అధికారులకు సూచనలు, జనాభా లెక్కలకు సంబంధించి దాదాపు 400 పత్రాలు భద్రపరచబడ్డాయి. ప్రవక్త అనేకమంది రాజులకు, చక్రవర్తులకు లేఖలు కూడా పంపించారు. ఇస్లామ్ స్వీకరించాలని వారికి ఆహ్వానాలు పంపించారు.

లేఖలు రాయిస్తున్నప్పుడు ప్రవక్త తన కార్యదర్శితో ముందుగా అనంతకరుణామయుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నానని రాయించేవారు. ఆ తర్వాత పంపిస్తున్నవారి పేరు, చిరునామ ఉండేవి. దాని తర్వాత లేఖపాఠం రాయించేవారు. చివరగా రాజముద్రిక వేసేవారు. తన ప్రవక్తపదవి విశ్వసనీయతను తెలియజేయడానికి ఒక వెండి రాజముద్రికను తయారు చేయించారు. దానిపై దైవప్రవక్త ముహమ్మద్ అన్న అక్షరాలు చెక్కి ఉండేవి.

# కార్యదర్శులు - విదేశీ భాషల శిక్షణ

అబ్దుల్లా బిన్ ఉమర్ ప్రవక్తకు ప్రత్యేక కార్యదర్శిగా వ్యవహరించారు. యువకుడు, తెలివిగలవాడైన అనస్ ఆయనకు మరో కార్యదర్శి. జైద్ బిన్ సబీత్ ఆయనకు ప్రధాన కార్యదర్శి. జైద్ చాలా తెలివితేటలు కలిగినవ్యక్తి. ప్రవక్త ఆయన్ను హిబ్రూ నేర్చుకోమన్నారు. అత్యల్ప సమయంలో హిబ్రూపై ఆయన పట్టు సాధించాడు. ప్రవక్త తన లేఖలు హిబ్రూలో రాయించవలసిన అవసరం ఉండేది. ఆయన ఈ విషయంలో ఇతరులను నమ్మడం అంత తేలిక కాదు. జైద్ హిబ్రూ నేర్చుకోవడమే కాదు, దాంట్లో ప్రావీణ్యం సంపాదించాడు. ఆ విధంగా హిబ్రూ భాషలో ప్రవక్తకు పనిచేయగలిగిన కార్యదర్శి లభించాడు. ఆ తర్వాత ప్రవక్త ఆయన్ను సిరియా భాష నేర్చుకోమన్నారు. జైద్ ఆ భాషనుకూడా అత్యల్ప సమయంలో నేర్చుకున్నారు. హిబ్రూ, సిరియా భాషల్లో దాదాపు పాండిత్యాన్ని సాధించాడాయన.

జైద్ జ్ఞాపకశక్తి అమోఘం, దివ్యఖుర్ఆన్ వాక్యాలను ఆయన అలవోకగా జ్ఞాపకం ఉంచుకోవడమే కాదు, సందర్భాన్ని బట్టి అవసరమైన వాక్యాలను ఉదాహరించేవారు. ఆయనలోని ఈ యోగ్యతల వల్లనే ఆయన ప్రధాన కార్యదర్శిగా ప్రవక్త వద్ద కొనసాగారు. ప్రవక్త కాలంలోనే దివ్యఖుర్ఆన్ సంకలనానికి ఒక కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కమిటీలో అబూబక్ర్, ఉమర్, ఉస్మాన్, అలీ సభ్యులుగా ఉన్నారు. కమిటీకి ఛైర్మన్‌గా జైద్ వ్యవహరించారు.

# జనాభా లెక్కలు

ప్రవక్త మదీనాకు రాగానే నగర జనాభా లెక్కలు సేకరించాలని ఆదేశించారు. నగరంలో మొత్తం జనాభా 10,000 ఉండేది. అందులో ముస్లిముల సంఖ్య మొదట కేవలం 500.

మదీనాలో ఇస్లామ్ ప్రవేశించకముందు యూదులు జనాభా లెక్కలు తీయడాన్ని పాపంగాను, దేవుని సృష్టిలో జోక్యంగాను భావించేవారు.

# పట్టణ ప్రణాళిక

ప్రవక్త మదీనా నగరంలో మునిసిపల్ ఆడ్మినిస్ట్రేషన్ ప్రారంభించారు. దాన్ని బల్దియా అని పిలిచేవారు. బల్ద్ అంటే పట్టణం. ఇప్పుడు కూడా చాలా చోట్ల మునిసిపల్ ఆడ్మినిస్ట్రేషన్‌ను బల్దియా అంటారు. బల్దియా విభాగం నగరనిర్వహణ బాధ్యతలు నిర్వర్తించేది.

# నాలుగు లైన్ల రహదారులు

మదీనాలో రాగానే ప్రవక్త చేపట్టిన మరో చర్య మురికినీటి పారుదలకు తగిన ఏర్పాట్లు చేయించడం. ఆ తర్వాత రోడ్లపై ట్రాఫిక్ కదలికలకు అనుగుణంగా రోడ్లను విస్తరించారు. నేడు నాలుగు లేన్ల రోడ్ల మాదిరిగా అప్పట్లో ఒకేవైపు రెండు ఒంటెలు ఒక దాని పక్కన ఒకటి నడిచే వెడల్పుతో రోడ్లను నిర్మించారు. రోడ్లకిరుపక్కలా మొక్కలు నాటించారు. ఆ విధంగా ప్రయాణీకులకు సదుపాయాలు కల్పించారు.

# ఇళ్ళనిర్మాణం

ప్రవక్త మస్జిదు అంటే మస్జిదె నబవి భవిష్యత్తులో నిర్వర్తించవలసిన పాత్ర గురించి ముందుచూపుతో ప్రవక్త వ్యవహరించారు. మస్జిదు చుట్టు ఇళ్ళనిర్మాణానికి శ్రద్ధ చూపించారు. ప్రతి ఇంటి చుట్టు ప్రహరీ గోడలతో ఇంటి సభ్యులకు పూర్తి ప్రయివసీ లభించేలా ఇండ్లను డిజైన్ చేయించారు.

ఇస్లామ్ ఉమ్మడి కుటుంబవ్యవస్థ కోసం పట్టుపట్టే ధర్మం కాదు. పైగా న్యూక్లియర్ ఫ్యామిలీలనే ప్రోత్సహిస్తుంది. భార్యభర్త పిల్లలు కలిసి ఉండే కుటుంబం ఇది. అందువల్ల కొత్తగా పెళ్ళయిన వారికి ప్రత్యేక వసతి కేటాయించాలని అందరినీ ప్రోత్సహించేవారు. ఆయన ఉమ్మడి కుటుంబాలను ప్రోత్సహించలేదు. పిల్లలు తల్లిదండ్రులు మాత్రమే ఉండే వాతావరణంలో కుటుంబం స్వేచ్ఛగా ఉండాలని భావించారు. అలాంటి ప్రతి కుటుంబానికి తనదైన స్వంత ఇల్లు ఉండాలనుకున్నారు. ప్రతి కుటుంబం బయటివారి చూపులు పడకుండా తనదైన ప్రయివసీ కలిగి ఉండాలని భావించారు. ప్రతి జంట ప్రత్యేక కుటుంబంగా ఉండాలి. ప్రతి కుటుంబానికి స్వంత ఇల్లు ఉండాలి. ప్రయాణించడానికి వాహనం ఉండాలి. ఇవి ప్రతి కుటుంబానికి అవసరంగా భావించేవారు.

# నీటిసరఫరా

అప్పట్లో ప్రజానీటి సరఫరా అన్న భావన లేదు. మదీనాకు వచ్చినప్పుడు అక్కడ ఒకే ఒక్క మంచినీటి బావి ఉండడాన్ని ప్రవక్త చూశారు. దాన్ని రోమా బావి అనేవారు. ప్రవక్త ఒక ప్రకటన చేసి ఎవరైనా ఆ బావిని కొని ప్రజోపయోగానికి విరాళంగా ఇస్తే వారికి స్వర్గంలో అంతకన్నా మంచి బహుమతి లభిస్తుందన్నారు. ఉస్మాన్ ఆ బావిని కొని విరాళంగా ఇచ్చారు.

ప్రవక్త అనుచరుడు సాద్ తన తల్లిని కోల్పోయారు. ఆమె పేరిట ఏదన్నా పుణ్యకార్యం చేయాలనుకున్నారు. ఏం చేస్తే బాగుంటుందని ప్రవక్తను అడిగారు. ప్రవక్త వెంటనే ఒక బావి తవ్వించి ప్రజలకు విరాళంగా ప్రకటించమని చెప్పారు. సాద్ వెంటనే ఆ పని చేశారు.ప్రవక్త ఆయన్ను ఆశీర్వదించారు.

# చారిత్రక సంపద

ప్రవక్త మదీనా పట్టణ ప్రణాళికలో చారిత్రక, ప్రాకృతిక సంపద పరిరక్షణకు కూడా ప్రాముఖ్యం ఇచ్చారు. పాత కోటలను పడగొట్టరాదని చెప్పారు. ఇండ్లు కడుతున్నప్పుడు సాధ్యమైనంత వరకు పాత గోడలను పడగొట్టవద్దనేవారు. అలాగే చెట్లు నరకవద్దనేవారు. పాత కట్టడాలు, చెట్లు మదీనా సౌందర్యాన్ని పెంచేవిగా ఆయన చెప్పేవారని బైహాకీ పేర్కొన్నారు. ఇంటి చుట్టు మొక్కలు పెంచాలని ప్రజలను ప్రోత్సహించేవారు.

# అతిథిగృహాలు

మదీనా అధికారానికి కేంద్రంగా మారింది. మదీనా నగర ప్రాముఖ్యం పెరిగింది. ప్రభుత్వం, పాలనాయంత్రాంగం, న్యాయవ్యవపస్థ, వాణిజ్యం, విద్య అన్నింటికి కేంద్రమయ్యింది. సిరియా పలస్తీనా రహదారిలో ఉత్తరాన ఎమన్, దక్షిణాన మక్కా వరకు ఉన్న రహదారిలో మదీనా ఒక ముఖ్యమైన కేందమ్రయ్యింది. ప్రయాణీకులు అక్కడ ఆగి తమకోసం ఆహారం, పశువులకు మేత సేకరించుకునేవారు. ప్రవక్త ఇలాంటి బాటసారుల కోసం అనేక సరాయిలు కట్టించారు. సరాయి అంటే సత్రాలవంటివి. బాటసారులకు అక్కడ అవసరమైన సదుపాయాలు లభించేవి. కొత్త రాజ్యంతో ఒప్పందాలు చేసుకోడానికి సుదూర ప్రాంతాల నుంచి ప్రతినిధి బృందాలు వచ్చేవి వారి కోసం ప్రారంభంలో ప్రయివేటు ఇండ్లలో లేదా ప్రవక్త మస్జిదు పక్కన ఉన్న నివాసాలలో బస ఏర్పాటు చేసేవారు. కాని తర్వాత ఇస్లామీయ రాజ్యం విస్తరించిన తర్వాత క్రమం తప్పకుండా కొత్తగా ఇస్లామ్ స్వీకరిస్తున్నవారి ప్రాతినిధ్యబృందాల రాక ఎక్కువయ్యింది. చరిత్రకారుడు నూరుద్దీన్ సంహూది ప్రకారం ప్రవక్త అనుచరుడు అబ్దుర్రహ్మాన్ ఔఫ్ ఒక పెద్ద వ్యాపారి కూడాను. ఆయన తన ఇండ్లలో ఒక పెద్ద ఇంటిని అతిథుల కోసం కేటాయించారు. మదీనాలో ఒక్కోసారి అలాంటి ప్రాతినిధ్య బృందాలకు చెందిన 200 మంది వరకు ఉండేవారంట. వారి బస కోసం అనేక పెద్ద పెద్ద ఇండ్లను అద్దెకు తీసుకునేవారు.

# ఆసుపత్రుల ఏర్పాటు

ఇస్లామ్ రాక ముందు అరబ్బులు స్వంత వైద్యమే చేసుకునేవారు. ప్రజావైద్య వ్యవస్థ అనేది లేదు. కాని ప్రవక్త ఆ తర్వాత ప్రజావైద్యవ్యవస్థను స్థాపించారు.

ప్రవక్త అనుచరుల్లో రఫీదా ప్రవక్త మస్జిదుకు పక్కన ఒక శిబిరం వేయించారు. అక్కడ గాయపడిన సైనికులకు వైద్యం చేసేవారు. కందక యుద్ధంలో సాద్ బిన్ మాజ్ గాయపడినప్పుడు రఫీదా శిబిరంలో వైద్యం చేయించాలని ప్రవక్త ఆదేశించారు. అక్కడ ఆయన ఉంటే తాను తరచుగా కలవడం వీలవుతుందని చెప్పారు. ఆ తర్వాత వైద్యశిబిరాలు, శాశ్వత ఆసుపత్రుల నిర్మాణంలో ఇస్లామ్ ప్రధాన భూమిక వహించింది. ఇద్దరు మహిళా అనుచరులు ఉమ్మె సులైమ్, నుసైబాలు గాయపడిన సైనికులకు మంచినీరు, ప్రథమచికిత్స అందించేవారు. ఇస్లామీయ చరిత్రలో మొదటి నర్సులుగా వారిని భావించవచ్చు.

# ప్రత్యేక వైద్యనిపుణులు

ప్రవక్త కాలంలో ఉన్న వైద్యుల గురించి మనవద్ద కొంత సమాచారం ఉంది. ఒక అనుచరుడు జబ్బుపడినప్పుడు ప్రవక్త ఆయన ఆరోగ్యం గురించి పరామర్శించడానికి వెళ్ళారు. అక్కడ ఎవరైనా వైద్యుడు అందుబాటులో ఉన్నారా అని ప్రశ్నించారు. ఇద్దరి పేర్లు ముందుకు వచ్చాయి. వారిద్దరిలో నిపుణుడైన వైద్యుని వద్దకు తీసుకెళ్లమని ప్రవక్త సలహా ఇచ్చారు. ఈ సంఘటన ద్వారా ప్రవక్త చాలా జాగ్రత్తగా ఆలోచించేవారని, నిపుణుడైన వైద్యుడి ద్వారా వైద్యానికి ప్రాధాన్యత ఇచ్చేవారని తెలుస్తోంది.

ప్రవక్త కాలంలో వైద్యం, మందుల ప్రాధాన్యతను గుర్తించడం జరిగింది. ప్రవక్త వద్దకు వచ్చి చిన్న చిన్న అస్వస్థతల గురించి ఎవరైనా చెబితే ఆయన వాటికి పరిష్కారాలు కూడా సూచించేవారు. ఈ విధంగా ప్రవక్త సూచించిన పరిష్కారాల ఒక శాస్త్రమే రూపొందింది.

# మదీనా మార్కెట్టు

ప్రవక్త మదీనాలో ఒక రెగ్యులర్ మార్కెట్‌ను అభివృద్ధి చేశారు. దాన్ని అస్వాక్ అనేవారు. ప్రవక్త మస్జిదుకు కొద్దిదూరంగా ఈ మార్కెట్ ఉండేది. ఈ మార్కెట్టు 500 మీటర్ల పొడుగు, 100 మీటర్ల వెడల్పు కలిగిన ప్రదేశంలో ఉండేది. నిజానికి అక్కడ ఉన్న జనాభాకు, ఆ కాలానికి ఇది అతిపెద్ద మార్కెట్టు. ప్రవక్త ముహమ్మద్ ముందుచూపుకు ఇది కూడా ఒక ఉదాహరణ. అన్నివిధాలుగా మదీనా ప్రగతి చెందుతున్నప్పుడు చుట్టుపక్కల ఉన్న తెగలు, సముదాయాలు మదీనావైపు ఆసక్తిగా చూస్తున్న కాలంలో ఆయన ఈ నిర్ణయాలు తీసుకున్నారు.

# పాపం, చట్టవిరుద్ధం, నిషిద్ధం

ప్రవక్త ముహమ్మద్ యావత్తు మానవాళి సంస్కరణకు ప్రయత్నించారు. ఆయన ఆధ్యాత్మిక, ప్రాపంచిక జీవితాలు రెండింటిని సంస్కరించడానికి కృషి చేశారు. దివ్యఖుర్ఆన్ రూపంలో లభిస్తున్న దైవిక మార్గదర్శనం ప్రకారం ఆయన ఈ సంస్కరణా ప్రయత్నాలు కొనసాగించారు. దివ్యఖుర్ఆన్ బోధనలు, ప్రవక్త ముహమ్మద్ ఆచరణలు కేవలం ఏదో ఒక కాలానికి, జాతికి పరిమితం కావు. అవి యావత్తు మానవాళికి ఉద్దేశించినవి. ఆయన ఒక విశ్వజనీనమైన

సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టారు. దానికి సంబంధించిన చట్టాలు, నియమనిబంధనలు పటిష్టంగా రూపొందించారు. ఈ వ్యవస్థ యావత్తు మానవాళికి ఉమ్మడి సంపద. ఎవరైనా దీని నుంచి ప్రయోజనం పొందవచ్చును. క్రింద ఆయన ప్రతిపాదించిన కొన్ని సూత్రాలు చూస్తే నేటి 21వ శతాబ్దంలోను మనకు ఆశ్చర్యమనిపిస్తుంది.

- తూనికలు కొలతలను ప్రమాణీకరించారు.
- ధరలను నియంత్రించారు.
- వాణిజ్యంలో ఎవరో ఒకరి గుత్తాధిపత్యం లేకుండా చేశారు.
- అక్రమ నిల్వలు చట్టవిరుద్ధంగా ప్రకటించారు. భవిష్యత్తులో వ్యాపారం చేయడానికి దాచిపెట్టడాన్ని నిషేధించారు.
- వడ్డీ వ్యాపారాన్ని చట్టవిరుద్ధంగాను, పాపంగాను ప్రకటించారు.
- మద్యం వ్యాపారాలను, మద్యపానాన్ని నిషేధించారు.
- జూదవ్యాపారాన్ని చట్టవిరుద్ధంగా ప్రకటించి నిషేధించారు.
- వ్యభిచారాన్ని నిషేధించారు.

ప్రవక్త స్వయంగా ఆకస్మిక తనిఖీలు చేసేవారు. ఒకసారి మార్కెట్టులో ఒక వ్యాపారి పొడి ధాన్యాని తడిధాన్యంపై ఉంచి అమ్ముతున్నారు. ఆ ధాన్యం కుప్పలోపల ప్రవక్త చేయిపెట్టి చూశారు. వ్యాపారి చేస్తున్న మోసం అర్థమయ్యింది. "ఎందుకిలా చేస్తున్నావని" ప్రశ్నించారు. వ్యాపారి మాట్లాడుతూ "వర్షం కురవడం వల్ల ధాన్యం తడిసిందని" చెప్పాడు. ప్రవక్త వెంటనే "ఇతరులను మోసం చేసేవాడు మాలోని వాడు కాదు" అన్నారు.

ప్రవక్త పరిశుభ్రత పట్ల చాలా శ్రద్ధ తీసుకునేవారు. ఆయన ఎల్లప్పుడు అనుచరులతో ఇండ్లను, మార్కెట్ ప్రదేశాన్ని శుభ్రంగా ఉంచాలని చెప్పేవారు. రోడ్డుపక్కన కూర్చుని ఉబుసుపోక కబుర్లు చెప్పుకోడాన్ని ఆయన నిషేధించారు.

# పురుష ఇనస్పెక్టర్లు

తనిఖీలు, శిస్తు వసూళ్ళకు ప్రవక్త పురుష, స్త్రీ ఇనస్పెక్టర్లను నియమించారు. చట్టాన్ని అతిక్రమిస్తే కఠినశిక్షలు ఉండేవి. ఇలాంటి ఇనస్పెక్టర్లలో సయీద్ బిన్ ఆస్, అబ్దుల్లా బిన్ సయీద్, ఉమర్ ముఖ్యులు.

# మహిళా ఇనస్పెక్టర్లు

మహిళల్లో మఖ్రాబా కుమార్తె సాబ్రా, అబ్దుల్లా కుమార్తె షిఫా ముఖ్యులు. మదీనా మార్కెట్ ఇనస్పెక్టరుగాను, కస్టమ్ అధికారిగాను షిఫా పనిచేశారు. మహిళా వ్యాపారులు తీసుకొచ్చే వ్యాపారసామగ్రి తనిఖీలకు, పర్యవేక్షణకు ఈ మహిళా ఇనస్పెక్టర్లు పనిచేసేవారు.

# పురుష వ్యాపారులు

ఇస్లామీయ సామ్రాజ్యానికి మొదటి ఖలీఫాగా పనిచేసిన అబూబక్ర్ వస్త్రాల వ్యాపారం చేసేవారు. రెండవ ఖలీఫా, సైన్యాధ్యక్షుడు, పర్షియా, రోమన్ సామ్రాజ్యాలను ఓడించిన ఉమర్ ధాన్యం వ్యాపారం చేసేవారు. ఉస్మాన్, అబ్దుర్రహ్మాన్ ఔఫ్‌లు వస్త్రాల వ్యాపారం చేసేవారు.

ప్రవక్త ఇతర అనుచరులు వివిధ వృత్తుల్లో ఉండేవారు. చేనేత, వడ్రంగం, వ్యవసాయం, తోటపని, కుట్టుపని వంటి పనులు చేసేవారు.

# మహిళా వ్యాపారులు

మహిళా వ్యాపారుల్లో మర్ఖబా కుమార్తె అస్మా, సుఐబ్ కుమార్తె ఖౌలా, మలిక, ఉమ్మె సాయిబ్ ముఖ్యులు.

# వ్యాపారం

దివ్యఖుర్ఆన్ వ్యాపార కార్యకలాపాల ద్వారా ఉపాధిని ప్రోత్సహించింది

"...భూమిపై వ్యాపించండి. అల్లాహ్ అనుగ్రహాన్ని అన్వేషించండి."(దివ్యఖుర్ఆన్ 62:10)

"అల్లాహ్ వ్యాపారాన్ని ధర్మసమ్మతం చేశాడు. వడ్డీని నిషిద్ధం చేశాడు."
(దివ్యఖుర్ఆన్ 2 : 275)

# వ్యాపారి

ప్రవక్త తన వ్యాపార లావాదేవీల్లో ప్రదర్శించిన నిజాయితి, సత్యసంథత, ముక్కుసూటి వైఖరి వ్యాపారులందరికీ ఆదర్శమైంది. ప్రవక్త ముహమ్మద్ చేసిన ఈ క్రింది వ్యాఖ్యలు నిజాయితీగా కష్టపడే వ్యాపారులకు సువర్ణ సూక్తులవంటివి.

"ఇతర తప్పనిసరి విధుల మాదిరిగానే ధర్మబద్ధంగా ఉపాధి సంపాదించడం కూడా ఒక తప్పనిసరి విధి."

"సత్యవాది, విశ్వసనీయుడైన వ్యాపారి స్వర్గంలో ప్రవక్తలు, ధర్మపరాయణులు, అమరుల సాంగత్యంలో ఉంటాడు."

"అమ్మేటప్పుడు, కొనేటప్పుడు, ఏదన్నా చెప్పేటప్పుడు దయతో వ్యవహరించే వ్యక్తిని దేవుడు అనుగ్రహిస్తాడు.

"యుద్ధాల బలప్రయోగం కన్నా వాణిజ్య అభివృద్ధి వల్ల రాజ్యానికి ఎక్కువ సౌభాగ్యం లభిస్తుంది."

"అవినీతిపరులైన వ్యాపారులు తుదకు నష్టపోతారు. నిజాయితీపరులైన వ్యాపారులే లాభాలు గడిస్తారు"

# వ్యాపార ఒప్పందాలు

మదీనాలో ఇస్లామీయ రాజ్యం ఏర్పాటు చేయడానికి ముందు వ్యాపారబృందాల భద్రత పెద్ద సమస్యగా ఉండేది. ప్రవక్త ఈ వాణిజ్య బిడారుల భద్రతకు ఒక వ్యవస్థను రూపొందించారు. వాణిజ్య వ్యాపారాల్లో భద్రత పెంచడానికి తగిన సాక్ష్యాధారాలతో ఒప్పందాలు రాసుకునే పద్ధతిని ప్రోత్సహించారు.

అన్ని ఆర్థికలావాదేవీలను రాతపూర్వకంగా నిర్వహించాలని దివ్యఖుర్ఆన్ నిర్దేశించింది. ఈ విషయాన్ని దివ్యఖుర్ఆన్ ఇలా పేర్కొంది.

"విశ్వసించిన ప్రజలారా! మీరు పరస్పరం ఒక నిర్ణీత కాలం కొరకు అప్పు

తీసుకున్నప్పుడు ఆ వ్యవహారాన్ని వ్రాసి పదిలపరచుకోండి. ఇరుపక్షాల మధ్య న్యాయంగా దస్తావేజును ఒక వ్యక్తి వ్రాయాలి. ... ఇంకా మీరు మీలోని ఇద్దరు పురుషులను దానికి సాక్షులుగా పెట్టుకోవాలి." (దివ్యఖుర్ఆన్ 2 : 282)

ఇస్లామ్‌లో కాంట్రాక్ట్ లేదా ఒప్పందానికి చాలా ప్రాముఖ్యం ఉంది. వివాహ ఒప్పందాలైనా, ఆర్థిక ఒప్పందాలైనా లేదా యుద్ధం, ఘర్షణలను నివారించే ఒప్పందాలైనా దివ్యఖుర్ఆన్ ఒప్పందాలను చాలా ముఖ్యమైనవిగా పేర్కొంటూ, ఒప్పందంలోని నియమాలకు కట్టుబడాలని ప్రోత్సహిస్తుంది.

"నిస్సందేహంగా వాగ్దానం విషయంలో మీరు సమాధానం చెప్పవలసి ఉంటుంది." (దివ్యఖుర్ఆన్ 17:34)

ఈ విషయమై ప్రవక్త ఇలా అన్నారు. "ముస్లిములు తమ ఒప్పందాల షరతులకు కట్టుబడాలి."

## విదేశీ మారక ద్రవ్యం

విదేశీ వాణిజ్య చట్టాలను మొదట ప్రవేశపెట్టింది ప్రవక్త ముహమ్మద్. ఆయన కాలంలో విదేశీమారక ద్రవ్య వ్యవస్థను రూపొందించారు. ఆ తర్వాతి కాలంలో ముస్లిమ్ పాలకులు "సక్కా"ను ప్రవేశపెట్టారు. ఇది విదేశీవాణిజ్యంలో ఒక ప్రామిసరీ నోటు వంటిది. అరబీలోని ఈ 'సక్కా'యే తర్వాత ఇంగ్లీషులో చెక్ అయ్యింది.

## సైనిక యంత్రాంగం

వివిధ జీవితరంగాలకు సంబంధించి ప్రారంభంలో తీసుకున్న అనేక చర్యలలో సైన్యానికి సంబంధించి వ్యవహారాలు చూసే యంత్రాంగాన్ని రూపొందిచడము కూడా ఒకటి. ప్రవక్త అవసరమైన సంఖ్యలో సైనికులను ఎంచుకునేవారు. వారిని వివిధ సైనికవిధులకు పంపేవారు.

## శాశ్వత సైన్యం

తగినంత ఆదాయం లేని ముస్లిమ్ సైనికులకు మదీనాలో ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకునేది. ఆ విధంగా సైన్యంలో ఎలాంటి నిరాశ నిస్పృహలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

# శరీర ధారుఢ్యం, శిక్షణ

సైనికశిక్షణ తప్పనిసరి. శిక్షణకు తగిన వ్యవస్థను ప్రవక్త స్వయంగా రూపొందించారు. ప్రజలు వ్యాయామం ద్వారా శరీరధారుఢ్యాన్ని కాపాడుకోవాలని ఆయన చెప్పేవారు. ఆయన విలువిద్యను ప్రోత్సహించేవారు. ఆయన స్వయంగా విలువిద్య పోటీలకు హాజరయ్యేవారు. అల్‌సిబాక్ మైదానంలో ఈ పోటీలు జరిగేవి. గుర్రపుస్వారి, ఒంటెలస్వారి, పరుగుపందెంలాంటివి ప్రోత్సహించారు. కుస్తీ, ఈత పోటీలను కూడా ఆయన ఇష్టపడేవారు. ఇలాంటి పోటీలు జరిగినప్పుడు ఆయనే స్వయంగా బహుమతులు పంపిణీ చేసేవారు. మదీనా ఉత్తరద్వారం వద్ద ఇప్పటికీ మస్జిదుల్ సిబాక్ ఉంది. అల్ సిబాక్ అంటే అర్థం పోటీలో గెలుపొందడం. ప్రవక్త కొండ వద్ద ఎత్తయిన ప్రదేశంలో నిలబడేవారు. గుర్రాలు రేసులో పరుగెత్తడాన్ని చూస్తూ మొదటి మూడు స్థానాల్లో ఎవరు వస్తున్నారో నిర్ణయించేవారు. అల్ మక్రిజి ప్రకారం మొదటి ఐదుస్థానాల్లో వచ్చిన వారికి బహుమతులుగా ఖర్జూరాలు, ఇతర వస్తువులు ఇచ్చేవారు. ప్రభుత్వ నిర్వహణలో ఆయుధాలు సేకరించే వ్యవస్థ ఉండేది. సైనిక సామాగ్రిని, గుర్రాలను, ఒంటెలను కొనడం, ప్రభుత్వ స్థలాల్లో వాటి మేతకు ఏర్పాట్లు చేయడం ఈ వ్యవస్థ చూసేది.

# నిఘా, గూఢచర్యం

మదీనా ఒక చిన్న ఇస్లామీయ రాజ్యం. ప్రవక్త ముహమ్మద్ ఆ రాజ్యానికి మొదటి పాలకుడు. ఈ రాజ్యం బలం పుంజుకోకముందే దాన్ని నాశనం చేయాలని కాచుకున్న శత్రువుల మధ్యన ఏర్పడిన రాజ్యం. అందువల్ల ప్రవక్త నిఘావ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. శత్రువుల కదలికలపై కన్నేసి తెలిపే గూఢచారులను ఏర్పాటు చేసుకున్నారు. శత్రువుల కదలికలు, వారి పథకాలు, వారి బలాబలాలు, ఆయుధసామగ్రి వగైరా వివరాలను రాబట్టేవారు.

బలమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయడం వల్ల చుట్టుపక్కల తెగల్లో ఎక్కడ ఏం జరుగుతుందో ఆయనకు తెలుస్తూ ఉండేది. ఇవికాకుండా ఆయన నిఘాపోస్టులను కూడా ఏర్పాటు చేశారు. మదీనా రక్షణ కొరకు అవసరమైన చోటుల్లో నిఘా పోస్టులు నిర్మించారు. మదీనా సైన్యంలో ఉన్న ముస్లిమ్ సైనికులకు సైనికశిక్షణ పకడ్బందీగా సాగేది. రహస్యగుర్తులు, పాస్‌వర్డ్‌ల ఉపయోగాలు కూడా ఈ శిక్షణలో భాగంగా ఉండేవి. ప్రవక్త ఒకటికి మించిన మార్గాల నుంచి సమాచారం సేకరించేవారు.

# ఆర్థికశాఖ

# బైతుల్‌మాల్ - జాతీయఖజానా

ఇస్లామీయ రాజ్యం మదీనాలో ముస్లిములు జకాత్ చెల్లించేవారు. ఈ జకాత్ బైతుల్‌మాల్ లో జమచేసేవారు. ఈ మొత్తాలను రాజ్యవ్యవహారాలు నడపడానికి ఉపయోగించేవారు. పేదవారు, బలహీనులకు సహాయపడడానికి ఉపయోగించేవారు.

జకాత్, ఇస్లామీయ రాజ్యంలో ఆదాయానికి ప్రధానమైన వనరు. నిర్ధారిత సంపద ఉన్న ప్రతిఒక్క వ్యక్తి జకాత్ చెల్లించవలసి ఉంది. ఆదాయం స్వభావాన్ని బట్టి జకాత్ చెల్లింపు మొత్తం మారేది. వ్యవసాయ ఉత్పత్తులపై 10 శాతం చెల్లించవలసి ఉంది. వ్యాపారులు 2.5 శాతం చెల్లించవలసి ఉంది. ఇనుము, బంగారం, వెండి గనులు ఉన్న వ్యక్తి కూడా కొంతశాతం రాజ్యానికి చెల్లించలసి ఉండేది. జకాత్ వసూలు చేయడానికి రెవిన్యూ అధికారులు మదీనా బయటకు వెళ్ళి వసూలు చేసుకుని వచ్చేవారు. తర్వాత స్థానికంగా జకాత్ వసూలు చేసే అధికారులను ఏర్పాటు చేశారు.

తబూక్‌యుద్ధంలో భారీ వ్యయం భరించవలసి వచ్చింది. అందువల్ల ప్రవక్త ముహమ్మద్ ప్రత్యేక నిధి కోసం అప్పీలు చేశారు. జకాత్ అడ్వాన్సుగా చెల్లించాలని అనుచరులను ఆదేశించారు. ఆ విధంగా మొదటిసారి అడ్వాన్స్ జకాత్ వసూలు చేయడం జరిగింది. జాతీయ ఖజానా అంటే బైతుల్‌మాల్ లెక్కలు రాయడానికి ప్రవక్త రాతగాళ్ళను ఏర్పాటు చేశారు. రాజ్య ఆదాయాన్ని పర్యవేక్షించడానికి ఒక అధికారిని నియమించారు. ఆయన మరెవరో కాదు, స్వేచ్ఛ పొందిన బానిస బిలాల్. ఆయన ఆర్థికమంత్రిగాను, నమాజుకు అజాన్ ఇచ్చే మౌజన్‌గాను బాధ్యతలు నిర్వర్తించారు. ప్రవక్త మస్జిదులో ఒక గదిని జాతీయఖజానాకు కేటాయించారు. అక్కడ నగదు, ముఖ్యమైన పత్రాలు, ఒప్పంద పత్రాలు అన్నీ భద్రపరిచేవారు.

# పెన్షన్లు, నష్టపరిహారాలు

ప్రవక్త ముహమ్మద్ రాజ్యాంలో పేదవారి కోసం, బలహీనుల కోసం ఒక పెన్షన్ వ్యవస్థను రూపొందించారు. మదీనాలో బనూ అరిద్ పేరుతో ఒక యూద తెగ ఉండేది. వారి వ్యవహారశైలి మెచ్చుకున్న ప్రవక్త వారికి ఏటా కొంత పెన్షన్ నిర్ధారించారు. అసహజ మరణానికి గురైన వారి కుటుంబాలను ఆదుకోడానికి పరిహారం చెల్లించే వ్యవస్థను కూడా ప్రవక్త ప్రవేశపెట్టారు.

# విదేశీ వ్యవహారాలు

హిజ్రీ శకం తొమ్మిదవ సంవత్సరం నాటికి మదీనాలోని ఇస్లామీయ రాజ్యం ప్రాంతీయంగా గొప్ప శక్తిగా ఎదిగింది. యావత్తు అరేబియా ద్వీపకల్పం నుంచి, ఇతర ప్రాంతాల నుంచి ఆ సంవత్సరం 38 మంది రాజులు, తెగల నాయకులు, విదేశీ ప్రభుత్వాల ప్రతినిధులు మదీనా సందర్శించి వివిధ ఒప్పందాలు చేసుకున్నారు. యూద, క్రయిస్తవ తెగల ప్రతినిధులు వచ్చి కలుసుకున్నారు. వారితో ప్రవక్త సహాయసహకారాల ఒప్పందాలు చేసుకున్నారు.

# అందరికీ న్యాయం

మదీనా రాజ్యానికి ప్రవక్త ముహమ్మద్ ప్రధాన న్యాయమూర్తిగా కూడా వ్యవహరించారు. ఆయన న్యాయపరిపాలనలో అత్యంత పేరుప్రతిష్ఠలు పొందిన పాలకుడిగా పేరు సంపాదించారు. జాతి, మత, వంశ పక్షపాతాలు లేకుండా అందరికీ సమాన న్యాయం అందించారు. న్యాయం విషయంలో ఆయన శత్రువులు, మిత్రులు అన్న భేదం పాటించలేదు.

> "విశ్వసించిన ప్రజలారా! న్యాయధ్వజవాహకులుగా నిలబడండి, అల్లాహ్ కొరకు సాక్షులుగా ఉండండి. మీ న్యాయం మీ సాక్ష్యం మీకూ, మీ తల్లిదండ్రులకూ, మీ బంధువులకూ ఎంత హాని కలిగించినా సరే, కక్షిదారులు భాగ్యవంతులయినా, నిరుపేదలయినా అల్లాహ్ వారి శ్రేయస్సును మీకంటే ఎక్కువగా కాంక్షిస్తాడు."
> (దివ్యఖుర్ఆన్ 4:135)

ప్రతి కేసు ప్రవక్త ప్రత్యేకంగానే విచారించేవారు. నిష్పక్షపాతానికి, న్యాయానికి అత్యున్నత ఆదర్శంగా నిలిచారు. ఆయన చెప్పిన తీర్పులు పరిశీలిస్తే న్యాయవ్యవహారాల్లో ఎంత అవగాహనతో ఆయన వ్యవహరించారన్నది తెలుస్తోంది.

● యూదుల నుంచి కప్పం వసూలు చేయడానికి అబ్దుల్లా బిన్ సెహీ ఖైబర్ వెళ్ళారు. అక్కడ ఆయన హత్య జరిగింది. ఆయన మృతదేహాన్ని ఆయన సోదరుడు చూశారు. ఆయన ప్రవక్త వద్దకు వెళ్ళి యూదులపై ప్రతీకారం తీర్చుకోవాలని విజ్ఞప్తి చేశాడు. ప్రవక్త అతడితో "యూదులే మీ సోదరుడిని హత్యచేశారని ప్రమాణం చేయగలరా?" అని ప్రశ్నించారు. అతను జవాబిస్తూ హత్య జరగడాన్ని తాను ప్రత్యక్షంగా చూడలేదని చెప్పాడు. అలా అయితే యూదులను ప్రమాణం చేయమని అడుగుదాం అన్నారు ప్రవక్త. ముహీసా మాట్లాడుతూ "వారి ప్రమాణాన్ని ఎలా నమ్మగలం? వారు అబద్ధపు ప్రమాణాలు వందసార్లయినా చేయగలరు" అన్నాడు. నిజానికి ఖైబర్‌లో యూదులు తప్ప మరెవ్వరూ నివసించడం లేదు. అబ్దుల్లాను చంపింది యూదుల్లో ఎవరో ఒకరు తప్ప మరొకరు కాదన్నది స్పష్టంగా తెలుస్తున్న వాస్తవం. కాని ప్రత్యక్షసాక్షులు లేరు. ప్రవక్త యూదులపై ఆరోపణకు స్పందించలేదు. ప్రభుత్వ ధనాగారం నుంచి ఆ హత్యకు పరిహారం చెల్లించారు.

● మఖ్జూమా తెగకు చెందిన ఒక స్త్రీ దొంగతనం చేస్తూ దొరికిపోయింది. ఆమెకు ఇస్లామీయ కఠిన శిక్ష విధించడం ఖురైషులకు ఇష్టం లేదు. ఆమె పక్షాన ఎవరైనా కలుగజేసుకుని ప్రవక్తకు సిఫారసు చేయాలని వారు భావించారు. ప్రవక్త ముహమ్మద్

ఎంతగానో అభిమానించే ఉసామా అనే యువకుడితో సిఫారసు చేయించాలని భావించారు. ఆ రకంగా ఆ మహిళను శిక్షనుంచి కాపాడాలనుకున్నారు. కాని ఉసమా ఈ విషయాన్ని ప్రవక్త వద్ద ప్రస్తావించినప్పుడు ఆయన చాలా అసంతృప్తిగా "దేవుని చట్టాల్లో మార్పు చేయాలని వారెలా అనుకున్నారు. గతంలో చాలా జాతులు సంపన్నుల నేరాలను వదిలేసి పేదలను మాత్రమే శిక్షించి చివరకు నాశనమయ్యాయి. నా ప్రాణాలు ఎవరి అధీనంలో ఉన్నాయో ఆ దేవుని తోడు, ఒకవేళ నా కుమార్తె ఫాతిమా ఈ నేరం చేసినా, నేను చేతుల ఖండించే శిక్షే వేస్తాను" అన్నారాయన

- తారిక్ ముహార్బి ప్రకారం ఒకసారి ప్రవక్త ముహమ్మద్ ప్రసంగిస్తున్నారు. మస్జిదులో బనీ తలాబా తెగను చూసిన ఒక అన్సారీ (మదీనా ముస్లిమ్) లేచి "ప్రవక్తా! వీళ్ళు బనీతలాబా తెగ వాళ్లు, వాళ్ళ పూర్వికులు నా కుటుంబ సభ్యులను హత్యచేసారు. దానికి ప్రతీకారంగా వారిలో ఒకడికి మరణశిక్ష విధించండి." అన్నాడు. ప్రవక్త జవాబిస్తూ "తండ్రిపై పగను కొడుకుపై తీర్చుకోలేము" అన్నారు. ప్రవక్త న్యాయం విషయంలో దృఢంగా నిలబడి ఒక గొప్ప ఉదాహరణ ఇచ్చారు. తన స్వంత ప్రయోజనాలైనా, తనకు దగ్గరవారి ప్రయోజనాలైనా వేటినీ ఆయన న్యాయం ముందు లెక్కచేయలేదు. తన దగ్గరకు వచ్చిన కేసు మిత్రులు తెచ్చినదైనా, శత్రువులు తెచ్చినదైనా న్యాయబద్ధంగా తీర్పులు చెప్పారు.

- ఒకసారి బనూ ఖురైజా తెగ యూదుడిని బనూ నాదిర్ తెగ యూదుడు హత్యచేసాడు. ఈ కేసు ప్రవక్త వద్దకు వచ్చింది. ప్రవక్త యూద చట్టం తౌరాత్ ప్రకారమే విచారించారు. ప్రాణానికి ప్రాణం అన్నదే తౌరాత్ విధానం. యుద్ధాల్లోను విజయోత్సవాల సందర్భంగాను అమలయ్యే ఈ చట్టం ఇలా చెబుతోంది. "మీ ప్రభువు, దేవుడు మీ చేతుల్లో ఇచ్చినప్పుడు ఆ పురుషులందరినీ కత్తికి ఎరవేయండి. మహిళలు, పిల్లలు, పశువులు, నగరంలో ఉన్న సమస్తం మీరు యుద్ధసొత్తుగా తీసుకోవచ్చును." (డుటిరోనమీ 20:13-14). యూదులకు, ముస్లిములకు, ఇతర తెగలకు మధ్య వివాదాల్లో ప్రవక్త ముహమ్మద్ తుది తీర్పరిగా ఉండేవారు.

ప్రవక్త ఇలా అన్నారు: "న్యాయమూర్తులు మూడువిధాలుగా ఉంటారు. ఒక రకం స్వర్గంలో, మరో రకం నరకంలో ఉంటారు. సత్యాన్ని గుర్తించి ఆ ప్రకారం తీర్పు చెప్పేవారు స్వర్గంలోను, సత్యాన్ని గుర్తించినా అన్యాయంగా తీర్పు ఇచ్చేవారు నరకంలోను, అజ్ఞానంతో ప్రజలపై తీర్పులు జారీచేసేవారు కూడా నరకంలోను ఉంటారు."

ఇంకా ఆయన ఇలా అన్నారు: "ఆగ్రహంలో ఉన్నప్పుడు న్యాయమూర్తి తీర్పు చెప్పరాదు."

# ఇస్లామీయ చట్టం ముందు రాజైనా పేదైనా ఒక్కటే

ఇస్లామీయ చట్టం ప్రకారం రాజ్యాధినేతకు కూడా ఎలాంటి మినహాయింపులు లేవు. ఇస్లామీయ రాజ్యం పాలకుడు, అంటే ఖలీఫా, సాధారణ ప్రజలు అందరూ ఇస్లామీయ చట్టం ముందు సమానులే. ఒకసారి అలీ ఖలీఫాగా ఉన్నప్పుడు ఆయన కవచం పోయింది. కొంతకాలం తర్వాత అది ఒక క్రయిస్తవుని వద్ద ఆయన చూశారు. ఆయన జస్టిస్ షురైహ్ కోర్టులో ఫిర్యాదు చేశారు. ఆయన క్రయిస్తవుడిని పిలిచారు. ఆ కవచం తనదేఅని ఆ క్రయిస్తవుడు వాదించాడు. కవచం మీదే అని చెప్పడానికి మీవద్ద ఏమైనా ఆధారాలు ఉన్నాయా అని న్యాయమూర్తి ఖలీఫాను ప్రశ్నించాడు. ఖలీఫా అలీ వద్ద అలాంటి ఆధారాలు ఏవీ లేవు. న్యాయమూర్తి ఆ క్రయిస్తవుడికి అనుకూలంగా తీర్పు ఇచ్చారు. ఖలీఫా ఫిర్యాదును కొట్టివేశారు. ఈ న్యాయప్రక్రియ చూసి ఆ క్రయిస్తవుడు చలించిపోయాడు (సాక్ష్యాధారాల ప్రకారం ఎలాంటి పక్షపాతానికి అవకాశం లేని తీర్పు). అక్కడికక్కడే తాను ఇస్లామ్ స్వీకరిస్తున్నట్లు ప్రకటించాడు. అంతేకాదు "ఇది ప్రవక్తల న్యాయం. పాలకుడు ఒక స్థానిక న్యాయమూర్తికి ఫిర్యాదు చేసుకోవడం (ఆ న్యాయమూర్తి నిజానికి పాలకుడి అధీనంలో పనిచేస్తున్నవారే), ఆ న్యాయమూర్తి పాలకుడికి వ్యతిరేకంగా తీర్పు చెప్పడం.." అన్నాడు.

ఇస్లామ్‌లో న్యాయవ్యవస్థ స్వతంత్రంగా, పాలనావ్యవస్థకు సంబంధం లేకుండానే వ్యవహరిస్తుంది. న్యాయమూర్తి ఇస్లామీయ చట్టం షరిఅత్‌ను అమలు చేయడానికి మాత్రమే బాధ్యుడు. ఎలాంటి భయం పక్షపాతం లేకుండా ఆ విధిని నిర్వర్తించాలి. ఆయన అధికార పీఠానికి జవాబు చెప్పుకోవలసిన అవసరం లేదు. కేవలం దేవుడికి మాత్రమే జవాబు చెప్పుకోవలసి ఉంటుంది. ఇలా స్వతంత్రమైన న్యాయవ్యవస్థ ఉండడం అన్నది ఇస్లామీయ షరిఅత్ ఖచ్చితంగా అమలు కావడానికి తోడ్పడింది.

- సిరియాకు చెందిన ఒక తెగ రాజు జబలా అల్ గస్సానీ హజ్ యాత్ర చేస్తున్నప్పుడు అతని పతాకం పొరబాటున పడిపోయింది. దానిపై ఒక అరబ్బు పాదం పడింది. కోపంతో గస్సానీ ఆ అరబ్బును కొట్టాడు. ఆ సంచార అరబ్బు తిన్నగా ఖలీఫా ఉమర్ వద్ద ఫిర్యాదు చేశాడు. ఉమర్ వెంటనే రాజు గస్సానీని పిలిపించారు. ఆ సంచార అరబ్బుతో నువ్వు ఇప్పుడు అలాగే కొట్టు అన్నారు. రాజు జబాలా నిర్ఘాంతపోయి “అదెలా సాధ్యం” అన్నాడు. “అతను ఒక మామూలు మనిషి, నేను ఒక రాజును” అని కూడా చెప్పాడు. ఉమర్ జవాబిస్తూ, “ఇస్లామ్ మీ ఇద్దరినీ సమానంగానే చూస్తుంది. దేవునిపై భయభక్తుల రీత్యా తప్ప మరోరకంగా ఎవరికీ ఎవరిపై ఆధిక్యత లేదు.” అన్నారు.

# పుత్రవియోగం

హిజ్రీ శకం పదవ సంవత్సరంలో, అంటే ప్రవక్త తుది రోజుల్లో మొత్తం అరేబియా ద్వీపకల్పం అంతటా ఒకే దేవుని ధర్మం స్థాపించబడింది. ఇస్లామ్ పట్ల వ్యతిరేకత, వైరాలు క్రమేణా తగ్గుముఖం పట్టాయి. ఇస్లామ్ స్వీకరిస్తున్న వారి సంఖ్య పెరగసాగింది.

ప్రవక్తకు ఆయన భార్య మారియా ద్వారా అందమైన బాలుడు జన్మించాడు. ప్రవక్త ఆ బాలుడికి ఇబ్రాహీమ్ అని పేరుపెట్టారు. పిల్లవాడి జననం పట్ల చాలా సంతోషించారు. ఒక విందును కూడా ఏర్పాటు చేసి అందరినీ ఆహ్వానించారు. ఆ బాలుడిని ఒళ్ళో పెట్టుకుని ఆడుకునేవారు.

ఏడాదిన్నర వయసులో ఆ పసి ఇబ్రాహీమ్ తీవ్రంగా జబ్బుపడ్డాడు. ప్రవక్త తన కళ్ళతో ఆ పసిప్రాణం తుదిశ్వాసలు తీసుకోవడాన్ని దు:ఖిస్తూ చూశారు. ప్రతిరోజు ప్రవక్త గంటలతరబడి తన కుమారుడి పక్కన కూర్చునేవారు. చివరకు ఆ అందమైన పసిబాలుడు తుదిశ్వాస విడిచాడు. తన ఒకే ఒక్క కుమారుడి మరణం పట్ల ఆయన ఎంతో దు:ఖించారు. ఒక సాధారణ తండ్రిలా విలపించారు. కుమారుడిని చేతుల్లో తీసుకుని గుండెలకదుముకున్నారు. కన్నీళ్ళు ధారాపాతంగా ప్రవహిస్తున్నాయి. ఈ విషాదం ఆయన ముఖంలో స్పష్టంగా కనబడింది.

ఆయన వెక్కిళ్ళు చూసి ఆయన అనుచరుడు అబ్దుర్రహ్మాన్ ఆశ్చర్యపోయారు. ప్రవక్త ఇలాంటి విషాద వ్యక్తికరణకు వ్యతిరేకమని ఆయన భావించేవారు. అదే విషయాన్ని దాచుకోకుండా అడిగేశారు. మొదట ప్రవక్త మాట్లాడలేకపోయారు. కాస్త కుదుటపడి, విషాద వ్యక్తీకరణలో పరిధులు మించి గుండెలు బాదుకునే విపరీతాలను తాను నివారించానని, కాని సహజంగా వ్యక్తమయ్యే విషాదాన్ని కాదని వివరించారు. ఆ తర్వాత తన కన్నీళ్ళను ఇలా వివరించారు. "కారుణ్యం ప్రేమలకు చిహ్నాలు" అన్నారు.

ప్రవక్త ఈ మాటలు తన స్వంత అనుభవం నేపథ్యంలో చెప్పిన ప్రతి ఒక్కరికి అన్వయిస్తాయి.

"కారుణ్యం లేనివారిపై కారుణ్యం చూపడం జరగదు."

జీవితంలోని కఠినసమయాల్లో దయ, ప్రేమాభిమానాలు, కారుణ్యం, అర్థం చేసుకునా తత్వాలు మనుష్యులను దగ్గర చేస్తాయి. అంతేకాదు, ఒకే ఒక్క దేవుడు, అనంతకరుణామయుడిని కూడా ఇవి దగ్గర చేస్తాయి. ఈ భావాల ద్వారా దేవుడు మనిషికి దగ్గరవుతాడు.

ప్రవక్త ముహమ్మద్ వ్యక్తిగతంగా తీవ్రమైన విషాదానికి గురయ్యారు. ఆయన తన దు:ఖాన్ని వ్యక్తం చేయడానికి వెనుకాడలేదు. అంతేకాదు, "కళ్ళు కన్నీళ్ళు కారుస్తున్నాయి, ఇబ్రాహీం, హృదయం తీవ్రమైన దు:ఖానికి గురయ్యింది. దేవుడు ప్రసన్నుడయ్యే మాటలే చెప్పాలి." అన్నారు.

దేవుడు మరోసారి ప్రవక్తను పరీక్షించాడు. ఆయన అనేకమంది ఆప్తులను పోగొట్టుకున్నారు. భార్య ఖదీజా, ముగ్గురు కుమార్తెలు, ముగ్గురు కుమారులను పోగొట్టుకున్నారు. చాలా దు:ఖాలను చవిచూశారు. కాని హృదయంలో తడి ఆరలేదు. ఉద్యమంలో నిబద్ధత తగ్గలేదు.

## గ్రహణం

ప్రవక్త ముహమ్మద్ స్మశానవాటిక నుంచి వెనక్కి వచ్చిన కొన్ని గంటల్లో సూర్యగ్రహణం సంభవించింది. ఆ సూర్యగ్రహణం ప్రవక్త కుమారుడి మరణం వల్లనే వచ్చిందని, ఇదొక మహత్యమని చూసినవాళ్ళు చెప్పుకోవడం ప్రారంభించారు. దేవుడు తన ప్రవక్తకు దీనిద్వారా ఏదో సందేశం ఇస్తున్నాడని కూడా అనుకున్నారు. ఈ అభిప్రాయాలన్నింటిని ప్రవక్త ఖండించారు. ఆయన గట్టిగా చెబుతూ "సూర్యచంద్రులు రెండు దేవుడి చిహ్నాలు. ఎవరి మరణం వల్లను వాటి కాంతి తగ్గదు" అన్నారు. ఆ విధంగా ప్రవక్త ఆ సమయంలో కూడా అనుచరులను సరయిన మార్గంలో శిక్షణ ఇచ్చారు. మూఢనమ్మకాలకు గురికాకుండా చేశారు. ముస్లిములు, ఆ మాటకొస్తే ఎవరైనా సరే మరణాన్ని అర్థం చేసుకోవాలి. ఎవరైనా మరణిస్తారని తెలుసుకోవాలి. ఆప్తుల ఎడబాటును భరించడం నేర్చుకోవాలి. ఒక వ్యక్తి మరణ సమయంలో ఏదో ఒక సంఘటన జరగడం యాధృచ్ఛికమే కాని మహత్యం కాబోదు. ఆయా సంఘటనలను దేవుని చిహ్నాలుగా, ఒకే ఒక్క దేవుని శక్తిని గుర్తించే సంకేతాలుగా చూడాలి.

# 23

# వీడ్కోలు యాత్ర

ఆ సంవత్సరం రమజాన్ మాసంలో ప్రవక్త దేవుని వద్ద నుంచి మరో సూచన అందుకున్నారు. ప్రవక్త తన కుమార్తె ఫాతిమాకు దీని గురించి చెప్పారు. "ప్రతి సంవత్సరం దైవదూత జిబ్రయిల్ నాకోసం దివ్యఖుర్‌ఆన్ ఒకసారి చదువుతారు. నేను ఒకసారి ఆయనకు చదివి వినిపిస్తాను. ఈ సంవత్సరం ఆయన నాకు రెండుసార్లు చదివి వినిపించారు. ఇది నా సమయం గురించిన ప్రకటన కావచ్చు" అన్నారు.

హజ్ యాత్ర ఇస్లామ్ మూలస్తంభాల్లో ఐదవది. ప్రతి ముస్లిమ్ జీవితకాలంలో ఒకసారయినా హజ్ యాత్ర చేయాలి. జిలహజ్జా మాసంలో హజ్ యాత్ర జరుగుతుంది. ప్రవక్త ఇంకా హజ్ యాత్ర చేయలేదు. యాత్ర కోసం ఏర్పాట్లు చేసుకోవలసిన సమయం వచ్చింది. ప్రవక్త మక్కా యాత్రకు నాయకత్వం వహిస్తారన్న ప్రకటన చేయబడింది. ఆ తర్వాతి వారం ఆయన ముప్పయివేలమంది అనుచరులతో మదీనా నుంచి బయలుదేరారు. తర్వాత అరేబియా ద్వీపకల్పం నుంచి వివిధ తెగలవారు ఇంతకు మూడురెట్ల సంఖ్యలో వచ్చి కలిశారు.

దారిలోనే ప్రవక్తకు కాబాలో ఆచరించవలసిన ముఖ్యమైన ఆచరణల గురించి దైవాదేశాలు వచ్చాయి. ఇవి అధ్యాయం 9 లోని ప్రారంభ వాక్యాలు. ఈ ఒక్క అధ్యాయమే దివ్యఖుర్‌ఆన్‌లో బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్ (అనంతకరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో) అన్నా సాంప్రదాయిక వాక్యంతో ప్రారంభం కాని ఏకైక అధ్యాయం. ఈ దైవాదేశాలు స్పష్టమైన ప్రకటనలు చేశాయి. గతంలో, అంటే అజ్ఞానకాలంలో మాదిరిగా కొందరు నగ్నంగా కాబా ప్రదక్షిణలు చేయడం పూర్తిగా నిషిద్ధమని ప్రకటించాయి. విగ్రహారాధకులను అనుమతించడం జరగదని కూడా ప్రకటించాయి. ఈ దైవాదేశాలు స్పష్టంగా

పవిత్ర మస్జిదు కాబా ఇప్పుడు కేవలం ఒకే ఒక్క దేవుని ఆరాధనకు మాత్రమేనని, కేవలం ముస్లిములు మాత్రమే అక్కడికి ప్రవేశించగలరని స్పష్టం చేశాయి.

దివ్యఖుర్ఆన్ వాక్యాలు ఇలా ప్రకటించాయి

> "దేవుని విశ్వసించేవారు, తీర్పుదినాన్ని విశ్వసించేవారు, క్రమం తప్పక నమాజు స్థాపించేవారు. జకాత్ చెల్లించేవారు, కేవలం దేవునికి తప్ప మరెవ్వరికీ భయపడనివారు మాత్రమే దేవుని మస్జిదులను సందర్శించగలరు. అలాంటి వారు సరయిన మార్గదర్శనం పొందినవారు."

చాలా మంది అనుచరులు, ధర్మవేత్తలు ఈ ఆదేశాలను ఖచ్చితంగా అర్థం చేసుకున్నారు. ఈ ఆదేశాలు కేవలం కాబాకు మాత్రమే వర్తిస్తాయని, ప్రపంచంలోని ఇతర మస్జిదులకు ఇవి వర్తించవని, ఆయా మస్జిదుల్లో ముస్లిమేతరులకు ప్రవేశం ఉందని గ్రహించారు. ఈ దైవాదేశం ఏకదైవారాధనను పటిష్టంగా స్థాపించిన దైవాదేశం.

మక్కా చేరుకున్న తర్వాత ప్రవక్త ముహమ్మద్ యాత్రకు సంబంధించిన వివిధ ఆచరణలను అమలు చేశారు. తనతో ఉన్న అనుచరులకు వాటిని వివరించారు. ఈ విధంగా తమందరికీ పితామహుడు ఇబ్రాహీం బోధించిన స్వచ్ఛమైన ఏకదైవారాధనను పునరుజ్జీవింపచేస్తున్నామని అన్నారు.

ఈ యాత్ర, ప్రవక్త యావత్తు జీవితం మాదరిగానే మూలాలకు మరలి వెళ్ళడానికి సమానమైనది. దేవునివైపు మరలివెళ్ళడం లాంటిది. ప్రవక్త ఇబ్రాహీమ్ అడుగుజాడల్లో ఒకే ఒక్క దేవుని వైపు మరలడం. ఆయనే మొదట కాబాగృహాన్ని నిర్మించారు. ఒకే ఒక్క దేవుని ఆరాధనకు నిర్మించారు.

ప్రవక్త ఆచరణలను అనుచరులు నిశితంగా గమనించారు. ఆయన చాలా ఖచ్చితంగా యాత్రకు సంబంధించిన ఆచరణలను వివరించారు. ఆ తర్వాత ఆయన వారితో " మీ ఆచరణల్లో నన్ను అనుసరించండి." అన్నారు. జిల్‌హజ్జ మాసం 9వ రోజున హిజ్రీ శకం పదవసంవత్సరం ప్రవక్త జబలుర్రహ్మా కొండ వద్ద 1,40,000 మంది యాత్రికులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కొండ అరఫాత్ మైదానంలో ఉంది. మక్కా నగరానికి 20 కి.మీ. దూరంలో ఉంది. ఇదే హజ్‌యాత్రలో ముఖ్యమైన స్థానం. ఆయన తన ప్రసంగాన్ని చిన్న చిన్న విభాగాలుగా చేశారు. అక్కడ ఉన్న ప్రజలు ఆ పదాలను పునరుచ్ఛరించారు. ఆ విధంగా లోయలో ఉన్న ప్రజలందరూ ఆయన ప్రసంగాన్ని వినగలిగారు.

# వీడ్కోలు ప్రసంగం

వీడ్కోలు ప్రసంగం కామన్ ఎరా 632లో అంటే హిజ్రీ శకం పదవసంవత్సరంలో చేశారు. అరఫాత్ వద్ద హజ్ యాత్ర ఆచరణల సందర్భంగా ఈ ప్రసంగం చేశారు. ఆ ప్రసంగం అత్యంత బలంగా, స్పష్టంగా కొన్ని విషయాలను ప్రకటించారు. ఆ సంవత్సరం తర్వాత మళ్ళీ యాత్రికులను అక్కడ కలుసుకోవడం సాధ్యమవుతుందో లేదో తనకు తెలియదని అన్నారు. ఆ ప్రదేశం, ఆ నెల ఎంత పవిత్రమైనవో వారికి తెలియజేశారు. అలాగే మనుష్యుల ప్రాణాలు, మానమర్యాదలు, వారి సంపదలు ఎంత పవిత్రమైనవో కూడా తెలియజేశారు. అజ్ఞానకాలం అంతరించిందని, ఆనాటి ఆచరణలు, అప్పటి పగలు ప్రతీకారాలు, అధికారం కోసం లాభాల కోసం కొనసాగిన ఘర్షణలు అన్నీ కూడా అంతరించాయని అన్నారు. ఇక నుంచి ముస్లిములందరూ విశ్వాసం రీత్యా సోదరులనీ, ప్రేమాభిమానాలు వారిన ఇస్లామ్ సందేశానికి సాక్షులుగా మార్చాలాని చెప్పారు. వారు "అణగారినవారిగా లేదా అణిచివేత శక్తులుగా" మారరాదని అన్నారు. దేవుని సమక్షంలో మానవులందరూ సమానులని గ్రహించాలని, అందువల్ల వినమ్రంగా ఉండాలని అంటూ "మీరందరూ ఆదమ్ నుంచి వచ్చారు. ఆదమ్ మట్టితో చేయబడ్డారు. దేవుని దృష్టిలో ధర్మపరాయణులే ఉత్తములు" అన్నారు.

అంతేకాదు "అరబ్బుకు అరబ్బేతరునిపై ఆధిక్యత లేదు, వారిలో ఉన్న దైవభీతి రీత్యా తప్ప" అని హెచ్చరించారు. ముస్లిములు తమ భార్యలను మృదువైఖరితో చూడాలని చెబుతూ "మహిళల విషయంలో దేవునికి భయపడండి. వారితో మేలైన రీతిలో వ్యవహరించండి" అన్నారు. ఆ తర్వాత ఆయన ఇంకా మాట్లాడుతూ అక్కడ ఉన్న ముస్లిములకు, తర్వాతి తరాల ముస్లిములందరికి మార్గదర్శనం చేస్తూ "నేను మీ మధ్య రెండు విషయాలు వదిలి వెళుతున్నాను. వాటిని గట్టిగా పట్టుకుంటే మీరు మార్గం తప్పకుండా ఉంటారు. దైవగ్రంథం దివ్యఖుర్ఆన్, దైవప్రవక్త ప్రవచనాలు ఆ రెండు విషయాలు" అన్నారు.

ఆ తర్వాత ప్రవక్త తన ప్రసంగాన్ని ముగిస్తూ "ప్రజలారా! నేను విశ్వసనీయంగా సందేశాన్ని మీకు చేరవేశానా" అని ప్రశ్నించారు. జనసమూహం ఒక్కగొంతుతో "అవును"అంటూ జవాబిచ్చింది. లోయలో హాజరైన వేలాదిమంది ఒకేసారి అవునన్నారు. ప్రవక్త తన చూపుడువేలు పైకెత్తి "ప్రభూ, నువ్వే సాక్షి" అన్నారు. ప్రసంగం చివరిలో అక్కడ హాజరైన యాత్రికులందరు ఒకే స్వరంతో "మీరు సందేశాన్ని విశ్వసీయంగా మాకు అందజేశారు. మీ పని మీరుపూర్తి చేశారు. మీరు మీ జాతికి మంచి దారి చూపించారని" పలికారు. ప్రవక్త "ప్రభూ, నీవే సాక్షి, ఇక్కడ హాజరైనవారు, హాజరుకాని వారికి ఈ సందేశం చేరవేయండి" అంటూ ప్రసంగాన్ని ముగించారు.

ప్రవక్త ఆ పవిత్రయాత్ర సందర్భంగా ముస్లిమ్ యాత్రికలకు ఇస్లామ్ సందేశ సారాన్ని మరోసారి వివరంచారు. దేవుడు ఒక్కడే, మనుష్యులందరూ ఒక్కటే, జాతి, రంగు, హోదాల తేడాలు ఏమున్నా కాని అందరూ దేవుని ముందు సమానులే. వారిలో దైవభక్తి కలిగిన వారే దేవుని దృష్టిలో ఉత్తములు. వారు అరబ్బులైనా కాకపోయినా, తెల్లవారైనా నల్లవారైనా, ధనికులైనా, పేదలైనా, పురుషులైనా, స్త్రీలైనా, ఎవరైనా గాని మనుష్యులు తమ ఆధ్యాత్మిక జ్ఞానంతోనే గుర్తింపు పొందుతారు. దైవభీతి కలిగినవారే ఉత్తములవుతారు. వేలాది యాత్రికుల ముందు, స్త్రీలు, పురుషులు, తెగల నాయకులు, బానిసలు అందరి ముందు ప్రవక్త తాను తన కార్యభారాన్ని పూర్తి చేశానని, దైవసందేశం చేరవేశానని ప్రకటించారు. వారు సాక్ష్యమిచ్చారు. తాము సందేశం విన్నామని, అర్థం చేసుకున్నామని చెప్పారు.

కొన్ని గంటల తర్వాత ప్రవక్త ముహమ్మద్‌కు మరో దైవాదేశం అందింది. ఈ దైవాదేశం ప్రవక్త ఉద్యమం ఇక చివరి దశకు చేరుకుందని సూచనాప్రాయంగా తెలిపింది.

> "ఈనాడు నేను మీ ధర్మాన్ని మీ కొరకు పరిపూర్ణం చేశాను. మీపై నా అనుగ్రహాన్ని పూర్తి చేశాను. మీ కొరకు ఇస్లామ్‌ను మీ ధర్మంగా అంగీకరించాను."
> (దివ్యఖుర్ఆన్ 5 : 3)

ప్రవక్తల పరంపరలో చిట్టచివరి ప్రవక్త ఉద్యమం కూడా చివరి దశకు చేరుకుంది. ప్రవక్త తన ఇహలోకాన్ని చాలించి దేవుని సన్నిధికి చేరుకోవలసిన సమయం సమీపిస్తోంది.

# హృదయాల విజేత

ముస్లిమేతరులు చాలా మంది శాంతి కోసం అన్వేషణలో ఉన్నవారు, సత్యాన్ని, నిజాయితీని వెదుకుతున్నవారు, కొందరు ఇంకా ఆయన సందేశం సత్యబద్ధతపై సందేహాల్లో ఉన్నవారు అందరు అంతర్గతంగా ఒక సంఘర్షణ అనుభవిస్తారు. దీనికి ప్రయత్నమూ, సహనమూ రెండు అవసరమే. ప్రవక్త అందుకే దేవుని చిహ్నాలను, సూచనలను పరిశీలించాలని చెప్పారు. దేవుని మార్గదర్శనం కోరుతూ ఉండాలని అప్పుడే సత్యం ఆవిష్కరిస్తుందని చెప్పారు. ఒకే దేవుని గుర్తించిన ముస్లిములకు ప్రవక్త మనోకాంక్షలతో అంతర్గత సంఘర్షణ కొనసాగించాలని, వినమ్రంగా ఉండాలని, దైవస్తోత్రం ద్వారా ఆధ్యాత్మిక వికాసం పొందాలని చెప్పారు. దివ్యఖుర్ఆన్ చెప్పినట్లు వారి హృదయాలు పటిష్టంగా మార్చుకోవాలి. "ప్రభూ, నువ్వు మాకు మార్గదర్శనం ఇచ్చిన తర్వాత మమ్మల్ని దారితప్పనివ్వకు" అని ప్రవక్త చేసిన ప్రార్థనను మరిచిపోరాదు.

"హృదయాల విజేత, నా హృదయాన్ని నీ ధర్మంపై పటిష్టంగా ఉండేలా చేయి."

# 24

# స్వర్గంలో

# గొప్ప కలయిక

హజ్ యాత్ర ముగిసింది. ప్రవక్త హజ్ ఆచరణలన్నీ ముగించి మదీనా వెనక్కి వెళ్ళాలని అనుకుంటున్నారు. ఆయన తనతో వచ్చిన యాత్రికులతో వెనుదిరిగారు. అందరు మదీనా చేరుకున్నారు. మళ్ళీ యధావిధి నిత్యజీవిత వ్యవహారాలు కొనసాగుతున్నాయి.

చాలా మంది ముస్లిములు ఇస్లామ్, దివ్యఖుర్‌ఆన్‌లను బోధించడం లేదా నేర్చుకోవడం కొనసాగుతోంది. ధార్మిక ఆచరణల బోధనప కొనసాగుతోంది. జకాత్ (జకాత్ అంటే మనిషి తన సంపదను దైవప్రసన్నత పొందడం ద్వారా శుద్ధిచేయడం. తద్వారా మంచిపద్ధతిలో మరింత పెంచుకోవడం) వసూలు చేయడం కూడా దైవాదేశాల ప్రకారం, ప్రవక్త సూచనల ప్రకారం కొనసాగుతోంది.

ఇస్లామ్‌కు సంబంధించిన ఐదు మూలస్తంభాల ఆచరణలన్నీ క్రోడీకరించబడ్డాయి. హజ్‌యాత్ర ఆచరణలు ఇటీవల వివరంచబడ్డాయి. ముస్లిములు నిత్యజీవితంలో ఇస్లామ్‌ను ఆచరించడానికి అవసరమైన మౌలిక విషయాలన్ని వారికి తెలిశాయి.

## వ్యాధి

హిజ్రీ శకం 11వ సంవత్సరం, రమజాన్ మాసం తర్వాత కొన్ని వారాలకు ప్రవక్త ముహమ్మద్ ఉహుద్ వెళ్ళారు. అక్కడే ముస్లిములకు, ఖురైషులకు రెండవ పెద్ద యుద్ధం జరిగింది.

అక్కడ అమరులైన వారికోసం వీడ్కోలు ప్రార్థన చేశారు. అక్కడి నుంచి ఆయన మదీనా మస్జిదుకు వచ్చారు. అక్కడ ప్రసంగస్థానం వద్ద కూర్చున్నారు. అనుచరులను ఉద్దేశించి మాట్లాడడం ప్రారంభించారు.

"నేను మీకన్నా ముందే వెళుతున్నాను. మీకు నేను సాక్షిగా ఉంటాను" అన్నారు.

ఆ తర్వాత ఆయన వారికి సలహా ఇస్తూ...

"నా తర్వాత మీరు మళ్ళీ బహుదైవారాధనకు పాల్పడతారన్న భయం నాకు లేదు. కాని మీరు ప్రాపంచిక సంపదల కోసం ఘర్షణ పడతారన్న భయం ఉంది." అన్నారు.

ఈ పదాలను బట్టి ఆయన ఇహలోక జీవితం చాలించడానికి సిద్ధమవుతున్నారన్నది స్పష్టంగా తెలుస్తోంది. తన ఆధ్యాత్మిక సముదాయం భవిష్యత్తు విషయంలోను ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వారిలో ధార్మిక విశ్వాసం పోతుందన్న భయం ఆయనకు లేదు. కాని ప్రాపంచిక ఆకర్షణల్లో కూరుకుపోతారన్న ఆందోళన ఆయనకు ఉంది. నిజానికి ఆయన వ్యక్తం చేసిన ఆందోళన ఒక భవిష్యవాణి వంటిది. వారు ప్రార్థనలు మానరు, కాని హెూదాగౌరవాలు, సంపద, అధికారాల కోసం సోదరభావాన్ని మరిచిపోతారు. సమైక్యతను వదిలేస్తారు.

ఆ రాత్రి ఆయన మదీనా లోని అల్‌బాకీ స్మశానవాటికకు వెళ్ళారు. అక్కడ సమాధయిన వారి కోసం ప్రార్థనలు చేశారు.

"మీరు మొదట వెళ్ళారు. మేము మీ వెనక వస్తున్నాము" అన్నారు.

అక్కడి నుంచి వెనక్కి వస్తున్నప్పుడు ఆయనకు తీవ్రమైన శిరోవేదన కలిగింది. ఆ శిరోవేదన ఆయనను రెండువారాలు బాధించింది. ఆయన తుదిదినాల్లో ఈ శిరోవేదన వల్ల మంచపట్టారు. శిరోవేదన, జ్వరం ఉన్నప్పటికీ కొన్నిరోజులు సాముదాయిక ప్రార్థనలు ఆయనే నాయకత్వం వహించేవారు. కాని రోజులు గడిచిన కొద్ది వ్యాధి మరింత తీవ్రమైంది. ఆయన పడకపై ఉండవలసి వచ్చింది.

ఆయనకు జ్వరం తీవ్రమవతున్నప్పుడు ఆయన ఆయిషా ఇంట ఉన్నారు. ఆయన స్పృహ కోల్పోయేవారు. ఆయన లేచినప్పుడు ఏడు తోళ్ళ నీళ్ళు (అప్పట్లో నీటిని తోలు సంచుల్లో ఉంచేవారు) తన తలపై వేయాలని కోరారు. కొంతసేపటికి కాస్త తేరుకుని మస్జిదుకు వెళ్ళాలని నిర్ణయించుకున్నారు. తలకు ఒక పట్టీ కట్టుకుని వెళ్ళారు. అక్కడ ప్రసంగస్థానంపై కూర్చుని అనుచరులను ఉద్దేశించి ప్రసంగించారు. సమాధుల గురించి మాట్లాడారు. తన

సమాధిని ఆరాధనా ప్రదేశంగా మార్చరాదని నొక్కి చెప్పారు.

ఆయన ఇలా అన్నారు "నా సమాధి వద్ద విగ్రహారాధక చేష్టలకు పాల్పడకండి."

ప్రవక్త దేవుని సందేశహరుడు. కాని ఆయన కూడా మామూలు మనిషి. తనను అనుచరులు ఎంతగా ప్రేమిస్తున్నారో ఆయనకు తెలుసు. గత జాతులు చేసిన పొరబాట్లను చేయవద్దంటూ ఆయన వారిని హెచ్చరించారు. గతజాతులు తమ ప్రవక్తలనే ఆరాధించడం మొదలుపెట్టారు. అందుకే ఇస్లామీయ సంప్రదాయాల్లో విగ్రహాలు, ప్రతిమలు, బొమ్మలు కనబడవు. ఎన్నటికి మనుష్యులను ఆరాధించరాదన్న ఈ కఠినమైన ఆదేశాలే అందుకు కారణం. ప్రవక్త ఆదేశాలను పాటించాలి. అంతేకాని వారిని పూజించడం కాదు చేయవలసింది. వారు మనుష్యులను దేవుని దగ్గరకు చేర్చే దారిని చూపించారు. కేవలం దేవుడు మాత్రమే ఆరాధనకు అర్హుడు.

ఆ తర్వాత ప్రవక్త లేచి తాను ఎవరికైనా ఏమైనా రుణపడి ఉన్నానా అని ప్రశ్నించారు. ఎవరినైనా బాధపెట్టి లేదా గాయపరచి ఉన్నానా అని ప్రశ్నించారు. అలాంటి వారు ఎవరైనా ఉంటే వారు ముందుకు రావాలని ఆ వ్యవహారాన్ని చక్కబెట్టుకుందామని విజ్ఞప్తి చేశారు. ఒక మనిషి లేచి ప్రవక్త తనకు మూడు దిర్హములు ఇవ్వవలసి ఉందని చెప్పాడు. ప్రవక్త వెంటనే ఆ సొమ్ము అతనికి ఇవ్వాలని ఆదేశించారు.

ప్రవక్త ముహమ్మద్ దివ్యఖుర్ఆన్ ఆదేశాల ప్రకారం ఎవరైనా ముస్లిమ్ చనిపోయినప్పుడు అతడి ప్రాపంచిక అప్పులన్నీ తీరిపోయాయని తెకలిసేవరకు ఆ మృతదేహానికి శవప్రార్థనలు చేసేవారు కాదు. ఎవరికి ఎలాంటి బకాయిలు లేకుండా ఈ లోకాన్ని వదిలి వెళ్ళాలి. తనతో పాటు క్షమించబడని నేరం తీసుకుని వెళ్ళరాదు. నయం చేయని గాయాలను తీసుకుని వెళ్ళరాదు.

ప్రవక్త మళ్ళీ తన ప్రసంగస్థానంపై కూర్చుని ఇలా చెప్పారు

"సర్వశక్తిమంతుడైన దేవుడు తన సేవకుడికి ఈ ప్రపంచంలో సర్వసంపదలు లేదా తన సాన్నిహిత్యం ఈ రెండింటిలో ఏదో ఒకటి ఎన్నుకొమ్మన్నాడు. అతను దేవుని సాన్నిహిత్యాన్ని కోరుకున్నాడు." అన్నారు.

ఆ మాటలు విని అబూబక్ర్ కన్నీళ్ళ పర్యంతమయ్యారు. ప్రవక్తకు అత్యంత సన్నిహితుడు, ప్రవక్తను అమితంగా ప్రేమించిన ఆయన ప్రవక్త చెబుతున్న విషయాల్లోని అంతరార్థాన్ని గ్రహించారు. ప్రవక్త ఆయన్ను ఓదార్చి తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ అబూబక్ర్‌కు సాంత్వన కలిగించే మాటలు ప్రసంగంలో ఇలా వినిపించారు.

"నా పట్ల అత్యంత ప్రేమతో ఉన్న అనుచరుడు, తన స్నేహంతో, తన సంపదతో నా వెన్నంటి ఉన్నది అబూబక్ర్. దేవుని తర్వాత నాకు అతి సన్నిహితమైన స్నేహితుడు ఎవరైనా ఉంటే అది అబూబక్ర్. కాని ఇస్లామీయ సోదరభావం, ప్రేమాభిమానాలు ఎంతో ముఖ్యమైనవి" అన్నారు.

## వీడ్కోలు

ప్రవక్త ఆ తర్వాత ఆయిషా ఇంటికి వెళ్ళారు. పడకపై మేను వాల్చారు. విశ్వాసం గురించి, ఆచరణల గురించి, కాబా నిర్వహణ గురించి కొన్ని సూచనలు చేశారు. మళ్ళీ ఆయన మస్జిదుకు వెళ్ళాలనుకున్నారు. కాని విపరీతమైన శిరోవేదనతో లేవడానికి ప్రయత్నిస్తూ స్పృహకోల్పోయారు. ఆయన తెలివిలోకి వచ్చిన తర్వాత ముస్లిములు ప్రార్థన చేశారా అని ప్రశ్నించారు. అయిషా ఆయనతో వాళ్లంతా మీకోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. ఆయన లేవడానికి మళ్ళీ ప్రయత్నించి మరోసారి స్పృహతప్పారు. ఆయన మళ్ళీ తెలివిలోకి వచ్చిన తర్వాత మళ్ళీ అదే ప్రశ్న వేశారు. వాళ్ళంతా ఆయనకోసం ఎదురుచూస్తున్నారని తెలిసింది. అబూబక్ర్ నాయకత్వంలో ముస్లిములు ప్రార్థనలు నిర్వహించాలని ఆయన ఆయిషాకు చెప్పారు.

ఇదే మాట ఆయన ఆమెతో ఆ తర్వాతి రోజుల్లో కూడా చెప్పారు. కాని ఆయన ఈ మాటలు చెప్పిన ప్రతిసారి ఆమె మాత్రం తన తండ్రిపై ఈ సామూహిక ప్రార్థనల బాధ్యత వేయవద్దని చెప్పేవారు. ఆయన చాలా సున్నితమనస్కుడు. దివ్యఖుర్ఆన్ చదువుతున్నప్పుడు కూడా చాలాసార్లు రోదిస్తారు. ఆమె అభ్యంతర పెట్టిన ప్రతిసారి ఆయన మరింత దృఢంగా అబూబక్ర్ ప్రార్థనలకు నాయకత్వం వహించాలని చెప్పారు.

రెండు రోజుల తర్వాత ఆయన వ్యాధికొద్దిగా ఉపశమించింది. ముస్లిములు జుహ్రనమాజు చదువుతున్నప్పుడు ఆయన మస్జిదుకు వెళ్ళగలిగారు. అబూబక్ర్ ప్రార్థనలకు నాయకత్వం వహిస్తున్నారు. ప్రవక్త రాక గమనించి అబూబక్ర్ వెనక్కి జరిగి ప్రవక్తకు నాయకత్వ స్థానం వదలాలని భావించారు. కాని ప్రవక్త ఆయన్ను అడ్డుకుని ఆయనకు ఎడమవైపున కూర్చున్నారు. మిగిలిన ప్రార్థనను ప్రవక్త నాయకత్వం వహించి కొనసాగించారు. అబూబక్ర్ ఆయన ప్రార్థనను బిగ్గరగా పునరుచ్ఛరించారు.

ప్రవక్త మస్జిదులో అదే చివరిసారి కనబడడం. ఆ రోజు ఆయన తన వద్ద ఉన్న సమస్తం పంచేశారు. చివరి దిర్హమ్ వరకు ఆయన వద్ద ఏదీ మిగల్లేదు. చివరకు తన కవచం కూడా. ఆయన కొన్ని సలహాలు, సూచనలు ఇవ్వసాగారు. బానిసలు, పేదలు,

బలహీనులను బాగా చూడాలని పదే పదే చెప్పసాగారు. మర్నాడు సోమవారం, ప్రాత:కాల ప్రార్థనల సమయంలో ఆయిషా ఇంటి కర్టెన్ కాస్త తప్పించి ప్రవక్త మస్జిదువైపు చూశారు. అక్కడ ఉన్న ముస్లిములు ఆనందించారు. ప్రవక్త అక్కడికి వస్తారని భావించారు. కాని కర్టెన్ వెనక్కి వెళ్ళిపోయింది. ప్రవక్త రాలేదు.

ఆ తర్వాత ఆయన కుమార్తె ఫాతిమా తండ్రిని చూడ్డానికి వచ్చారు. తండ్రి పరిస్థితికి బాధపడ్డారు. అప్పుడు ప్రవక్త ఆమెతో “ఈ రోజు తర్వాత నీ తండ్రికి ఇక బాధ ఉండదన్నారు.” ఆ తర్వాత ఆయన తన కుమార్తె చెవిలో నెమ్మదిగా నువ్వు కూడా త్వరలో నా దగ్గరకు వస్తావన్నారు. ఈ మాటలకు ఆమె కన్నీళ్ళతోనే చిరునవ్వు నవ్వారు. బాధ విపరీతం కాసాగింది. ప్రవక్తకు మాట్లాడడం కూడా కష్టమయ్యింది. ఆయిషా వచ్చి ఆయన పక్కన కూర్చున్నారు. ఆయన తలను తన ఒడిలోకి తీసుకున్నారు. తలను నెమ్మదిగా నొక్కుతూ బాధ తగ్గించే ప్రయత్నం చేశారు. ప్రవక్త తన కళ్ళు మూసుకున్నారు. ఆయిషా ఆయన్ను గట్టిగా పొదివి పట్టుకుని ఉన్నారు. ఆయన నెమ్మదిగా చెబుతున్న మాటలు ఆమె చెవికి తాకాయి “స్వర్గంలో ఉత్తమ కలయిక..” ఆ తర్వాత ఆయన దివ్యఖుర్‌ఆన్ వాక్యం చివరి భాగాన్ని పఠించారు.

> “దైవప్రసన్నత పొందిన ప్రవక్తలు, ధర్మపరాయణులు, అమరులు, సన్మార్గంలో నడిచిన వారి సాన్నిహిత్యం. ఎంత అందమైన సాన్నిహిత్యం.”

ఆ తర్వాత ఆయన మూడుసార్లు క్రింది మాటలు పలికారు

“ఉత్తమ సాన్నిహిత్యం…ఉత్తమ సాన్నిహిత్యం..ఉత్తమ సాన్నిహిత్యం”

ఆయన చేయి క్రిందికి పడిపోయింది. ఆయన తల బరువైంది. ఆయన తన తుదిశ్వాస విడిచారని ఆయిషా అర్థం చేసుకున్నారు.

ప్రవక్త ముహమ్మద్ కామన్ ఎరా 632, జూన్ 8వ తేదీన అంటే హిజ్రీ శకం 11వ సంవత్సరం, రబీవుల్ అవ్వల్ 12వ తేదీ సోమవారం, 63 సంవత్సరాల వయసులో ప్రభువు సన్నిధికి చేరుకున్నారు. విశ్వప్రభువు ఆయన్ను తన వద్దకు పిలుచుకున్నాడు. అప్పటి నుంచి ముస్లిమ్ సముదాయం ఈ మానవమహోపకారికి స్మరించుకుంటూనే ఉంది. హృదయపూర్వకంగా క్రింది ప్రార్థన పఠిస్తూనే ఉంది.

> “అల్లాహ్ ఆయన దూతలు దైవప్రవక్తకై ‘దరూద్’ను పంపుతారు. విశ్వాసులారా! మీరు కూడా ఆయనకై దురూద్, సలామ్‌లు పంపండి.” (దివ్యఖుర్‌ఆన్ 33:56)

# విషాదం

ప్రవక్త తనువు చాలించిన వార్త మదీనా నగరమంతా అలుముకుంది. నగరమంతా విషాదం ఆవరించింది. అందరి ముఖాల్లో బాధ, కన్నీళ్ళు. ఆప్తుల మరణంలో బాధా విషాదాలను వ్యక్తం చేయండి కాని మితిమీరి గుండెలుబాదుకోవడం లాంటి దు:ఖప్రకటనలు వద్దంటూ ప్రవక్త నిషేధించి ఉన్నారు. ప్రవక్త ఇంటి వద్ద నిశ్శబ్దం రాజ్యం చేస్తోంది.

ఈ నిశ్శబ్దాన్ని బద్దలు చేస్తూ హఠాత్తుగా ఉమర్ లేచి నిల్చున్నారు. ప్రవక్త మరణించలేదు అని గట్టిగా అన్నారు. ఆయన మళ్ళీ తిరిగివస్తారని ఇంకా గట్టిగా చెప్పారు. ప్రవక్త మరణించారని ఎవరైనా చెబితే వాళ్ళను చంపేస్తానని కూడా హెచ్చరించారు. ప్రవక్త పట్ల ఆయన ప్రేమ అలాంటిది, ప్రవక్త ఇక లేరన్న వార్తను ఆయన నమ్మలేకపోతున్నారు, ఆ విషాదాన్ని తట్టుకోలేకపోతున్నారు. తమకు మార్గం చూపుతూ ముందుకు నడిపిన మనిషి ఇకలేరంటే ఆయనకు ఆగ్రహం, ఆవేశం, విషాదం కట్టలు తెంచుకుంటున్నాయి. స్వయంగా దివ్యఖుర్ఆన్ ప్రవక్త గురించి చెప్పింది.

> "చూడండి! మీ వద్దకు ఒక ప్రవక్త వచ్చాడు. ఆయన స్వయంగా మీలోనివాడే. మీరు నష్టానికి గురికావడం అనేది ఆయనకు కష్టం కలిగిస్తుంది. మీ సాఫల్యాన్ని ఆయన తీవ్రంగా కాంక్షిస్తాడు. విశ్వాసులపై ఆయన వాత్సల్యం కలవాడు. కారుణ్యం కలవాడు" (దివ్యఖుర్ఆన్ 9:128)

ఆయన భావావేశాల్లో కొట్టుకుపోయారు. అప్పుడు అక్కడకు అబూబక్ర్ వచ్చారు. ప్రవక్త పడక పక్కన కూర్చున్నారు. ప్రవక్త శరీరంపై, ముఖంపై కప్పి ఉన్న దుప్పటి తప్పించారు. ఆయనకు కన్నీళ్ళు ఆగడం లేదు. ప్రవక్త ఇక లేరని గ్రహించారు. ఆయన బయటకు వచ్చి ఉమర్‌ను శాంతింపజేయడానికి ప్రయత్నించారు. ఉమర్ ఇంకా భావావేశాలను అదుపు చేసుకునే స్థితిలో లేరు. అబూబక్ర్ ఒక పక్కగా నిలబడి అక్కడ గుమికూడిన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఆయన ఇస్లామీయ విశ్వాసాల సారాన్ని ప్రతిఫలిస్తూ చెప్పిన మాటలు వివేకాన్ని మేల్కొలిపాయి. "ప్రవక్త ముహమ్మద్‌ను ఆరాధించిన వారు ఇక ఇప్పుడు ప్రవక్త ముహమ్మద్ మరణించారని తెలుసుకోవాలి. ఇక ఒకే ఒక్క దేవుడిని ఆరాధించేవారు, దేవుడు సజీవుడని, ఎన్నడూ మరణించేవాడు కాదు." అన్నారు. ఆ తర్వాత ఆయన క్రింది దివ్యఖుర్ఆన్ వాక్యాన్ని పఠించారు.

"ముహమ్మద్ ఒక ప్రవక్త తప్ప మరేమీ కాదు. అతనికి పూర్వం ఇంకా ఎందరో ప్రవక్తలు గతించారు. అలాంటప్పుడు ఒకవేళ అతను మరణిస్తే లేక హత్యచెయ్యబడితే మీరు వెనుకంజవేసి మరలిపోతారా? జ్ఞాపకం ఉంచుకోండి, మరలిపోయేవాడు అల్లాహ్‌కు ఏమాత్రం నష్టం కలిగించలేడు. కాని, అల్లాహ్‌కు కృతజ్ఞత చూపే దాసులుగా జీవించే వారిని ఆయన తగువిధంగా బహూకరిస్తాడు." (దివ్యఖుర్‌ఆన్ 3 : 144)

ఈ ఖుర్‌ఆన్ వాక్యాన్ని విన్న ఉమర్ ఒక్కసారి కుప్పకూలారు. ఆ తర్వాత ఆయన మాట్లాడుతూ ఈ వాక్యం ఎప్పుడో చాలా ముందే అవతరించిన వాక్యమే అయినా ఆ వాక్యాన్ని మొదటిసారి విన్నట్లు అనిపించిందని అన్నారు. ఇతర ముస్లిములతో పాటు ఆయన కూడా ఇక ప్రవక్త లేరన్న వాస్తవాన్ని అర్థం చేసుకున్నారు. ఆయన వారిని విడిచి వెళ్ళిపోయారు. ఆయన వెళ్ళిన తర్వాత ఏర్పడిన ఈ శూన్యాన్ని వారు ఏకదైవారాధక విశ్వాసంతో పూరించుకోవాలి. ఆ ఒకే ఒక్క దేవుడు ఎన్నటికి మరణించడు. ప్రవక్త లేకుండా బతకడానికి కావలసిన శక్తి, సహనం, సంకల్పం ప్రసాదించాలని దేవుడిని వేడుకుంటూ, ప్రవక్త ఆదర్శ జీవితాన్ని అనుసరిస్తూ ముందుకు సాగాలి.

# 25

# దైవప్రవక్త

## ఒక గొప్ప ఆదర్శం

దివ్యఖుర్‌ఆన్ స్పష్టంగా మానవాళికి ఇలా ప్రకటించింది.

> "వాస్తవంగానే అల్లాహ్ ప్రవక్తలో మీకు ఒక మంచి ఆదర్శం ఉండినది. అల్లాహ్‌పై, అంతిమ దినంపై ఆశలు పెట్టుకుని అత్యధికంగా అల్లాహ్‌ను స్మరించే ప్రతి వ్యక్తికి..." (దివ్యఖుర్‌ఆన్ 33:21)

ప్రవక్త ముహమ్మద్ ఒక గొప్ప ఆదర్శం. ఆయన బోధనలు, ఆయన ఆచరణలు, ఆయన మౌనం అన్నింటా ఆదర్శముంది. మొత్తం 23 సంవత్సరాల ఉద్యమంలో ప్రవక్త ఆధ్యాత్మిక స్వేచ్ఛ కోసం ప్రయత్నించారు. ఆయన ఒక క్రమం ప్రకారం దేవుని నుంచి దైవాదేశాలు అందుకుంటూ వచ్చారు. జీవితంలోని వివిధ సందర్భాల్లో దేవుడు స్వయంగా ఆయనకు మార్గదర్శనం ఇచ్చాడు. ప్రవక్త ముహమ్మద్ దేవుని ఆదేశాలకనుగుణంగా జీవించి ఒక ఉత్తమ ఆదర్శాన్ని మన ముందుంచారు. అందరు నిద్రిస్తున్న సమయంలో ఆయన ప్రార్థనల్లో నిమగ్నమయ్యేవారు. తన తోటివారు నిరాశలో మునిగిఉన్నప్పుడు ఆయన దైవంతో మొరపెట్టుకునేవారు. కష్టాలు, వేధింపులు, దౌర్జన్యాలు, అమానుష అణిచివేతల్లో ఆయన సహనంగా, నిబ్బరంగా దేవునిపై భారం వేసి ముందుకు నడిచారు. ఆయనలోని బలమైన వ్యక్తిత్వం, ఆధ్యాత్మిక శక్తి ఆయన్ను అహం నుంచి బయటపడేలా చేసింది. దేవుని చిహ్నాలు, సూచనలను ఆయన గుర్తించేవారు. ఎగిరేపక్షి, నిలిచి ఉన్న చెట్టు, కమ్ముకునే చీకటి, మెరిసే నక్షత్రం అన్నింటా ఆయన దేవుని చిహ్నాలను, సూచనలను గమనించేవారు.

ప్రవక్త తన ప్రేమాభిమానాలు ప్రకటించేవారు, వాటిని పంచేవారు. ఆయన సమక్షంలో ఆయన భార్యలు ఎంతో ప్రసన్నంగా, సంతోషంగా ఉండేవారు. ఆయన ప్రేమాభిమానాలు, శ్రద్ధాసక్తులు వారిలో ఆనందాతిశయం కలిగించేవి. ఆయన అనుచరులు ఆయన్ను అత్యధికంగా ప్రేమించారు, విధేయత చూపారు. ఇలాంటి విధేయత ప్రపంచంలో ఏ చక్రవర్తి తన వారి నుంచి పొందలేదు.

ఆయన తన ప్రజలకు ఎల్లప్పుడు చిరునవ్వుతో అందుబాటులో ఉండేవారు. ఒక బానిస వచ్చి ఆయన్ను మాట్లాడినా వినేవారు, ఒక బానిస వచ్చి పిలిచినా వెళ్ళేవారు. ఆయన దేవునికి చెందినవారు. ఎవరి సొత్తు కాదు. ఆయన తన ప్రేమను అందరికీ పంచారు. ఎవరైనా ఆయనతో చేయిని కలిపితే, వారు చేయి వదిలే వరకు ఆయన చేతిని వెనక్కు తీసుకునేవారు కాదు. ఒక మంచిమాట వల్ల హృదయాల్లో ఎలాంటి మంచి భావాలకు ప్రాణం పోయవచ్చునో ఆయనకు బాగా తెలుసు. ఆయన తన స్వంత అహం నుంచి విముక్తి పొందినవారు. ఎవరినీ నిర్లక్ష్యం చేయలేదు. ఆయన సమక్షమే ఒక శరణు వంటిది. ఆయన దైవ ప్రవక్త.

ఆయన అందరినీ ప్రేమించారు. క్షమించారు. ప్రతిరోజు ఆయన తన పొరబాట్లకు దేవుని క్షమాభిక్ష కోరుకునేవారు. ఎవరైనా ఆయన వద్దకు ఏదైనా పొరబాటు చేశామన్న భావనతో వస్తే, వారి తప్పు ఎంత పెద్దదయినా వారికి ధైర్యం చెప్పేవారు. క్షమాభిక్ష పొందే మార్గం చూపించేవారు. ఆయన ఇతరుల పొరబాట్లను, తప్పులను మన్నించడమే కాదు, వాటిని దాచిపెట్టేవారు. అందరికీ వ్యక్తిగత క్రమశిక్షణ, కఠినసాధన బోధించేవారు. ఆయన అనుచరుల్ల సృజనాత్మక శక్తిసామర్థ్యాలను ప్రోత్సహించారు. మనిషి తన బలహీనతలను గుర్తించి ఎలా ముందుకు సాగాలో నేర్పేవారు. స్వేచ్ఛకు షరతు నైతికప్రమాణాలకు విధేయత చూపడమని వివరించారు.

న్యాయం అనేది శాంతికి తప్పనిసరి. ఇతరుల మర్యాదను గుర్తించలేకపోతే సమానత్వాన్ని ఎవరు అనుభవించలేరని ఆయన తెలియజేశారు. ఆయన బానిసలకు విముక్తి ప్రసాదించేవారు. ముస్లిములందరూ అలా చేసేలా ప్రోత్సహించారు. విశ్వాసుల సముదాయం స్వతంత్రుల సముదాయంగా ఉండాలి.

దివ్యఖుర్ఆన్ ఆదేశాలు ప్రవక్తకు మార్గం చూపించాయి. ఆయన ప్రత్యేకంగా బానిసలు, నిరుపేదలు, బలహీనుల పట్ల ఎక్కువ శ్రద్ధ తీసుకున్నారు. వారు తమ గౌరవమర్యాదలను చాటిచెప్పాలని భావించారు. వారి హక్కులను కోరాలని, న్యూనతాభావాన్ని వదులుకోవాలని చెప్పారు. ఈ సందేశం ధార్మిక, సామాజిక, రాజకీయ స్వేచ్ఛను చాటిచెప్పింది.

ప్రవక్త ఉద్యమం చివరిలో అరఫాత్ మైదానంలో ఆయన ప్రసంగాన్ని వివిధ జాతులు,

వివిధరంగులు, వివిధ తెగల వారు విన్నారు. ధనికులు, పేదలు, బానిసలు, నాయకులు అందరూ విన్నారు. జాతి,రంగు, ధనిక, పేద తేడాలు లేవని అందరూ సమానమనీ, దైవభీతి రీత్యా మాత్రమే మనిషి ఉన్నతుడవుతాడని చాటి చెప్పారు.

ఒకసారి ప్రవక్త ఇలా చెప్పారు. "ప్రజలతో ఉన్నతంగా వ్యవహరించే వ్యక్తి మీలో ఉన్నతుడు"

మానవ సోదరభావం పేరుతో కేవలం ముస్లిములనే కాదు యావత్తు మానవాళిని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ప్రజలందరినీ న్యాయం వైపునకు పిలిచారు. వివక్ష, సామాజిక అన్యాయాలు, జాతితత్వాలను దేవుని సమక్షంలో సమర్ధించుకోవడం ఎవరికీ సాధ్యంకాదు. ముస్లిమ్ సమాజంలో ఒక నల్ల నీగ్రో ముస్లిములను ప్రార్ధనలకు పిలిచేవాడు. ఒక బానిస కుమారుడు సైన్యాధ్యక్షుడిగా సేనలను నడిపాడు. ఇస్లామీయ విశ్వాసం ముస్లిములను కృత్రిమ ఆడంబరాలు, ప్రతిష్ఠలనుంచి విముక్తి చేసింది.

ప్రవక్త తన సమాజంలో మహిళల మాటలను శ్రద్ధగా వినేవారు. చాలా సందర్భాల్లో వారికి హక్కుల నిరాకరణ జరిగేది. వారి పట్ల అనుచిత వ్యవహారశైలి ఉండేది. దివ్యఖుర్ఆన్ ప్రవక్త ప్రజలకు ఎలా అందుబాటులో ఉండేవారో కూడా ప్రస్తావించింది.

> ".. తన భర్త వ్యవహారంలో నీతో వాదిస్తూ ఉన్న, అల్లాహ్‌తో మొరపెట్టుకుంటూ ఉన్న స్త్రీ మాటలను అల్లాహ్ విన్నాడు. అల్లాహ్ మీ ఉభయుల సంభాషణను వింటున్నాడు. ఆయన అన్నీ వినేవాడు. అన్నీ చూసేవాడూను."
> (దివ్యఖుర్ఆన్ 58:1)

అలాగే ప్రవక్త ఒక మహిళ తన భర్తకు విడాకులివ్వాలనుకుంటున్న వాదనను కూడా విన్నారు. ఎందుకంటే ఆమె అతడిని ఇష్టపడడం లేదు. ఆమె మాట విన్నారు. పరిశీలించారు. వారిద్దరినీ వేరు చేశారు.

అనేక మంది మహిళలు ప్రవక్త వద్దకు విడాకులు కోరుతూ వచ్చేవారు. ఉబై కుమార్తె జమీలా, సాహిల్ కుమార్తె హబీబా, బరీరా, తాబిత్ భార్య వంటి అనేకమంది ఆయన వద్దకు తమ సమస్యలతో వచ్చేవారు. తాబిత్ భార్య విషయంలో జరిగిన సంఘటన అబ్బాస్ వివరించారు. తాబిత్ భార్య ప్రవక్త వద్దకు వచ్చి ధార్మిక ఆచరణల విషయంలో తన భర్తపై తనకు ఎలాంటి ఫిర్యాదు లేదని, కాని ఇస్లామ్‌కు సంబంధించి తన లోని దోషభావన, అంటే భర్తగా అతడి హక్కులను గౌరవించే విషయంలో తనలో ఉన్న భావాల కారణంగా విడాకులు కావాలన్నారు. ఆమెకు ఒక తోటను తాబిత్ మహెర్‌గా ఇచ్చి ఉన్నారు. అది వెనక్కి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారా అని ప్రవక్త ప్రశ్నించారు. ఆమె ఒప్పుకున్నారు. ఆ తర్వాత తాబిత్‌ని పిలిచి వేర్పాటుకు ఒప్పుకోమని ప్రవక్త చెప్పారు.

మరో మహిళ ఆయన వద్దకు వచ్చి తన తండ్రి బలవంతంగా తనకు ఇష్టం లేని పెళ్ళి చేశారని ఫిర్యాదు చేసింది. ఆయన వెంటనే ఆ పెళ్ళి రద్దు చేస్తానని అన్నారు. కాని ఆమె తనకు ఇప్పుడు ఆ భర్త నచ్చాడని, కాని తండ్రులు ఇలా బలవంతంగా పెళ్ళి చేయడం ధర్మవిరుద్ధమన్న విషయం అందరికీ తెలియాలనే ఫిర్యాదు చేశానని చెప్పింది.

ప్రవక్త మహిళలకు అవసరమైన ఆధ్యాత్మిక శిక్షణ అందించారు. వారి గౌరవమర్యాదలకు ఉన్నతస్థానం కల్పిస్తూ, వారి సృజనాత్మక శక్తిసామర్థ్యాలను, వివేకం, తెలివితేటలను, నైపుణ్యాలను ప్రదర్శించే, సమాజానికి ఉపయోగపడేలా వినియోగించే పద్ధతులు తెలియజేశారు. సమాజంలో మహిళల ఉనికి, బహిరంగ ప్రదేశాల్లో, సామాజిక, రాజకీయ, ఆర్థిక, సైనిక రంగాల్లో వారి ఉనికి ఒక వాస్తవం, దాన్ని ప్రవక్త ఎన్నడూ నిరాకరించలేదు. పైగా దాన్ని ప్రోత్సహించారు. అయితే నైతిక పరిధులను దాటకుండా అవసరమైన ఏర్పాట్లు చేశారు.

ఆధ్యాత్మిక బోధనల వెలుగులో స్త్రీలు తమ హక్కులను అడిగేలా తీర్చిదిద్దారు. తమ భావాలను ప్రకటించేలా శిక్షణ ఇచ్చారు. దేవునిపై నమ్మకంతో మహిళలు తమకు కావలసింది ఎంచుకునే స్వేచ్ఛను కలిగిఉన్నారన్నది వారికి తెలియజేశారు.

ప్రవక్త ముహమ్మద్ పిల్లలను ఎంతగానో ప్రేమించారు. ఆయన వారిని ముద్దాడేవారు, వారిని తన భుజాలపై ఎక్కించుకుని ఆడించుకునేవారు. వారితో ఆడుకునేవారు. పిల్లలు దైవదూతల్లా దేవునికి చెందినవారు. అందువల్లనే ఆయన ప్రార్థనల్లో పసివాళ్ళ రోదన వింటే వెంటనే తన ప్రార్థనలను క్లుప్తంగా ముగించేవారు. ఒకసారి ఆయన ఇలా అన్నారు. "నేను ప్రార్థన కాస్త సుదీర్ఘంగా చేయాలన్న ఉద్దేశ్యంతో ప్రారంభిస్తాను. కాని మధ్యలో పసివారి రోదన వినిపిస్తుంది. ఆ తల్లికి ఆందోళన ఉంటుందన్న భయంతో వెంటనే ప్రార్థన క్లుప్తంగా ముగిస్తాను" అన్నారు. పిల్లల అమాయకత్వాన్ని ఆయన ఎంతగానో ఇష్టపడేవారు. వారి నుంచి ఆయన ప్రపంచాన్ని వింతగా చూడడం తెలుసుకున్నారు.

## అనేక దీపాలను వెలిగించిన దీపం

ప్రవక్త మానవాళి వద్దకు ఒక దైవసందేశాన్ని తీసుకుని వచ్చారు. దేవుడు ప్రజలందరికీ పంపిన ఈ సందేశం నిజమైన దేవుడిని గుర్తించాలని, తీర్పుదినాన్ని గుర్తించాలని తెలియజేసింది. ప్రవక్త ముహమ్మద్ ఈ సందేశాన్ని తీసుకువచ్చారు. ఆయన జీవితమంతా బానిసలు, మహిళలు, పిల్లలు, బలహీనులు, పేదలు, ధనికుల వాదనలు వింటూ వచ్చారు. వారి మాటలు వినేవారు, వారికి స్వాంతన ఇచ్చేవారు. సానుభూతి చూపేవారు. దయార్ద్ర

హృదయంతో మాట్లాడేవారు. ప్రవక్త ముహమ్మద్ జీవితాన్ని అధ్యయనం చేసినవారు ఈ సందేశ సారాన్ని గ్రహించగలుగుతారు. ఒక మంచి సమాజ నిర్మాణానికి ఈ సందేశం ఎలా ఉపయోగపడుతుందో తెలుసుకోగలుగుతారు.

ప్రవక్త ప్రార్థనల్లో గడిపేవారు, ధ్యానంలో గడిపేవారు. తనలో మార్పు సాధించేవారు, సమాజాన్ని మార్చేవారు. దైవాదేశాల వెలుగులో ఆయన తన జీవితాన్ని మానవాళి కోసం అర్పించారు. అదే జిహాద్‌కు అర్థం. "మంచినిపెంచండి, చెడును తుంచండి" అని దివ్యఖుర్‌ఆన్ ఇచ్చిన ఆదేశానికి భావం ఇదే. ఈ బోధనకు ప్రవక్త ముహమ్మద్ జీవితం గొప్ప ఉదాహరణ. ఆయన జీవితంలో ప్రతిదశలోను ఏకదైవారాధన ప్రస్ఫుటంగా ప్రకాశించింది.

ప్రవక్త ఒకసారి తన అనుచరులతో నిజమైన ప్రేమ గురించి ఇలా చెప్పారు. "దూరంగా ఉండండి (ఈర్ష్యకు) ప్రజలు ప్రేమిస్తున్న దానికి, అప్పుడు ప్రజలు మిమ్మల్ని ప్రేమిస్తారు."

దైవప్రేమ మనిషికి దైవిక సాన్నిహిత్యాన్ని ప్రసాదిస్తుంది. మనిషి అహం నుంచి పైకెదుగుతాడు. దైవప్రేమ ఎవరిపై ఆధారపడవలసింది కాదు. ఇది స్వతంత్రమైనది. మనిషిని స్వతంత్రుడు చేస్తుంది. ప్రవక్త ముహమ్మద్ అనుసరించిన మార్గం వివిధ దశలుగా సాగింది. ఏకదైవారాధక విశ్వాసాన్ని ప్రచారం చేయడం, వలస వెళ్లడం, తిరిగిరావడం, తుదకు దేవుని చేరుకోవడం. ఈ దశలన్నింటిలోను దేవుడు ఆయన్ను వెన్నంటి ఉన్నాడు. ఆయన అనుచరులు ఆయన్ను అనుసరించేలా, విధేయత చూపేలా చేశాడు. ప్రవక్త ముహమ్మద్ ఒక విశ్వజనీన సందేశాన్ని ప్రచారం చేశారు. ఆయన ఒక విశ్వజనీన నైతికతకు కట్టుబడమన్నారు. కుహనా గుర్తింపులు, కృత్రిమ ఆడంబరాలకు అతీతంగా మానవాళిని పైకి లేపారు. న్యాయాన్ని ప్రేమించేవారు జాతి, రంగు, తెగ, వంశ దురభిమానాల ప్రభావానికి గురికాలేరు. ఆయనలోని నైతికతను దైవప్రేమ ప్రకాశింపజేసింది. ఆయనలోని నైతికత ఆయన్ను స్వేచ్ఛగా ముందుకు సాగేలా చేసింది. ప్రవక్త ముహమ్మద్ దేవుని ప్రేమను పొందారు. ఆయన ప్రజలను ప్రేమించారు. దేవుని ప్రార్థించారు. దైవసందేశాన్ని ప్రజల్లో ప్రచారం చేశారు. దైవాదేశాల ప్రకారం దేవుడొక్కడే, మనుష్యులొక్కటే అన్న సందేశం నలుమూలలకు విస్తరించేలా చేశారు. అనేక దీపాలను వెలిగించిన దీపం ఆయన. ఆయన జీవితం నుంచి పాఠాలను గ్రహించడం ద్వారా విశ్వాసులు ఈ వెలుగుల్లో జీవితాలను సంస్కరించుకోగలరు.

ప్రవక్త ముహమ్మద్ ఈ ప్రపంచాన్ని వదిలివెళ్ళి ఉండవచ్చు. కాని ఆయన్ను మనం ఎన్నటికీ మరిచిపోలేం. దేవుడొక్కడే, మనుష్యులొక్కటే అన్న సందేశంతో మానవాళిని అనేక దాస్యశృంఖలాల నుంచి విముక్తి చేసి దైవదాస్య మహాభాగ్యాన్ని ప్రసాదించింది ఆయనే. దైవప్రవక్త ముహమ్మద్‌ను గుర్తించడమంటే ఆయన లేనప్పుడు కూడా ఆయన్ను ప్రేమించడం, ఆయన చూపిన బాటలో నడవడం. దేవుని ప్రేమించడం.

# దైవ ప్రవక్త గురించి ఎవరేమన్నారు ?

ది హండ్రెడ్ అన్న పుస్తకంలో అమెరికన్ రచయిత మానవచరిత్రపై గొప్ప ప్రభావం వేసిన 100 మంది గురించి రాశడు. రచయిత ఒక క్రయిస్తవ కుటుంబంలో జన్మించినవాడు. సైన్సు చదువుకున్నాడు. కాని తన పుస్తకంలో అందరికన్నా పైన క్రీస్తు పేరు రాయలేదు. శాస్త్రవేత్త న్యూటన్ పేరు రాయలేదు. ఒకే ఒక్క వ్యక్తి అందరికన్నా ఎక్కువ ప్రభావం వేశారని భావించాడు. ఆయనే ప్రవక్త ముహమ్మద్. తన పుస్తకంలో ఇలా రాశాడు.

> "ప్రపంచంలోని అత్యంత ప్రతిభావంతులు, ప్రభావవంతులు అయిన వ్యక్తుల జాబితాకు తలమానికంగా నేను ముహమ్మద్‌ను ఎన్నుకోవడంలో కొందరు చదువరులకు ఆశ్చర్యాన్ని కలిగిస్తే మరికొందరు దీన్ని ప్రశ్నించనూ వచ్చు. కాని మానవచరిత్రలో నిత్యమూ ప్రాపంచిక ధార్మిక స్థాయిల్లో అత్యుత్తమంగా విజయం సాధించిన మనిషి ఆయన ఒక్కరే....ఇస్లామ్‌పై ప్రవక్త ముహమ్మద్ ప్రభావం క్రయిస్తవంపై జీసస్, సెయింట్ పాల్ ఇద్దరి ప్రభావం కన్నా ఎక్కువ. ప్రవక్త ముహమ్మద్ వల్ల పడిన లౌకిక, ధార్మిక ప్రభావాల మిశ్రమం సాటిలేనిది. అందువల్లనే మానవచరిత్రలో అత్యధిక ప్రభావం వేసిన ఒకేఒక్క మనిషి ప్రవక్త ముహమ్మద్."

జార్జి బెర్నార్డ్ షా తన పుస్తకం జెన్యూన్ ఇస్లామ్ వాల్యుమ్ 1, నెం. 8లో ఇలా రాశారు.

> "నేను ఎల్లప్పుడు ముహమ్మద్ ధర్మాన్ని దాని అద్భుత సచేతనత చైతన్యం దృష్ట్యా అత్యున్నతంగా గౌరవిస్తాను. మారుతున్న జీవిత స్థితిగతులను తనలో ఇముడ్చుకునే సామర్థ్యం గల ఏకైక ధర్మంగా అది మాత్రమే కనబడింది. ఇస్లాంకున్న ఈ సామర్థ్యం దాని అన్ని కాలాలకు అన్వయించేదిగా తయారు చేసింది. నేను ఆయన గురించి అధ్యయనం చేశాను. ఆయనో అద్భుత వ్యక్తి. నా దృష్టిలో ఆయన క్రీస్తు విరోధి ఎంతమాత్రమూ కాదు. ఆయన్ని మానవాళి రక్షకుడు అని పిలవక తప్పదు."

"రానున్న వందసంవత్సరాల కాలంలో ఇంగ్లాండ్‌ను లేదా యూరప్‌ను పాలించే అవకాశం ఉన్న ధర్మం అంటూ ఏదైనా ఉంటే అది ఇస్లామ్ మాత్రమే."

లామర్టిన్ : ఫ్రాన్సుకు చెందిన ప్రముఖ చరిత్రకారుడు. హిస్టోయిర్ డి లా టర్కీ, పారిస్ 1854, వాల్యుం 2, పేజిలు 276, 277

"తత్తవేత్త, వక్త, ప్రవక్త, శాసనకర్త, సేనానాయకుడు, భావాల విజేత, హేతుబద్ధమైన నమ్మకాల ప్రస్థాపకుడు, విగ్రహాలు లేని భక్తితత్వాన్ని స్థాపించినవాడు, 20 ప్రాపంచిక సామ్రాజ్యాల స్థాపకుడు, ఓ ఆధ్యాత్మిక సామ్రాజ్య వ్యవస్థాపకుడు – ఆయనే ముహమ్మద్. మానవ గొప్పదనాన్ని కొలిచే సకల కొలబద్దల రీత్యా ఇతని కంటే గొప్పవాడనదగిన మనిషి మరొకడెవడయినా ఉన్నాడా? అని గట్టిగా అడగవచ్చు."

ఎం.కే.గాంధీ, యంగ్ ఇండియా 16సెప్టెంబర్ 1924

"నేడు లక్షలాది మానవుల హృదయాలను నిర్ద్వంద్వంగా వశపరచుకున్న ఆ ఉత్తమ వ్యక్తిని గురించి తెలుసుకోదలిచాను. ఆ కాలపు జీవన పంథాలో ఇస్లామ్‌కు ఒక స్థానాన్ని సాధించగలిగింది కత్తి కాదని నాకు గట్టి నమ్మకం కుదిరింది. కేవలం ప్రవక్త చూపిన నిరాడంబరత, త్యాగనిరతి, వాగ్దానపాలన పట్ల శ్రద్ధ, మిత్రులు సహచరుల పట్ల అమితమయిన అంకితభావం, స్థిరచిత్తం, ఆయనలోని నిర్భీతి, దైవం పట్ల తన ధ్యేయం పట్లనూ అచంచల విశ్వాసం, కేవలం ఇవే కాని కత్తికాదు సకల అవరోధాలను అధిగమించగలిగిందది."

అన్నిబిసెంట్, ప్రముఖ మహిళా హక్కుల కార్యకర్త, రచయిత్రి, థియోసోఫిస్ట్ తన పుస్తకం "ది లైఫ్ అండ్ టీచింగ్స్ ఆఫ్ ముహమ్మద్", మద్రాస్ 1932, పేజి 4

"అరేబియాకు చెందిన ఈ గొప్ప ప్రవక్త జీవితాన్ని చదివిన వారెవరైనా గాని, ఆయన ఎలా బోధించారు, ఎలా జీవించారన్నది తెలుసుకున్నవారెవరైనా గాని, ఈ గొప్ప ప్రవక్త పట్ల గౌరవాదరాలు తప్పక చూపిస్తారు. ఆయన గొప్ప ప్రవక్తలలో గొప్పవాడు. నేను చెప్పే విషయాలు చాలా మందికి తెలిసినవే కావచ్చు, కాని నేను చదివిన ప్రతిసారి నన్ను ఆ గొప్ప అరేబియా నాయకుడి పట్ల గౌరవం పెరుగుతూనే ఉంటుంది"

దివాన్ చంద్ శర్మ తన పుస్తకం “ది ప్రాఫెట్ ఆఫ్ ది ఈస్ట్”లో ఇలా రాశారు

> “ముహమ్మద్ కారుణ్యానికి ఆత్మ వంటి వారు. ఆయన చుట్టు ఉన్నవారిపై ఆయన ప్రభావం ఎన్నటికి మరువలేని ప్రభావం.”

నెపోలియన్ బోనాపార్టీ, పారిస్ (ఫ్రాన్స్ చక్రవర్తి), బోనాపార్టె ఎట ల ఇస్లామ్‌లో ఇలా రాశాడు

> “మూసా ప్రవక్త తన జాతికి దేవుడి ఉనికిని గురించి తెలియజేశాడు. జీసస్ క్రీస్తు రోమన్ ప్రపంచానకి తెలియజేశాడు. ముహమ్మద్ పాత ఖండానికి. జీసస్ తర్వాత ఆరు శతాబ్ధాలకు అరేబియా విగ్రహారాధనలో ఉండేది. ముహమ్మద్ అక్కడ ఇబ్రాహీమ్, ఇస్మాయీల్, మూసా, జీసస్ ప్రవక్తలు బోధించిన దేవుని ఆరాధానను ప్రవేశపెట్టారు. ఒకేఒక్క దేవుడు తప్ప మరో దేవుడు లేడని ప్రకటించాడు. ఆ దేవుడికి తండ్రి, కుమారుడు ఎవరు లేరని చెప్పారు. త్రిత్వం విగ్రహారాధనను దిగుమతి చేసింది. నేను అన్ని దేశాలలోని మేధావులను, పండితులను ఒకే వేదికపైకి తీసుకొొచ్చి దివ్యఖుర్ఆన్ సూత్రాలపై ఆధారపడిన ఒక ఉమ్మడి వ్యవస్థను స్థాపించే రోజు దగ్గరలో ఉందని ఆశిస్తున్నాను. అదొొక్కటే సత్యం. అదొొక్కటే ప్రజలకు సంతోషాన్ని ప్రసాదిస్తుంది.”

## Bibliographic References


| | |
|---|---|
| 1. Seerath by ibn Ishaaq | Mohd bin Ishaaq. |
| 2. Seerathby Ibn Khatir | Ibn Khatir. |
| 3. Seerath-un-Nabi | Maulana Shibli Noumani. |
| 4. Seerath-un-Nabi | Syed Sulaiman Nadvi. |
| 5.Muhammad Encyclopaedia of Seerah | Afzalur Rahman |
| 6. The Emergence of Islam | Dr. Mohd Hameedullah |
| 7. The Life of Muhammad | Haykal. |
| 8. The Sealed Nectar (Ar-Raheequl-Makhtum) | Safiur-Rehman Al- Mubarakpuri. |
| 9. Muhammad | Martine Lings. |
| 10. The Perfect Guide for Mankind | Mohd. Rabey Hasani Nadwi. |
| 11. Social Service in Islam | Syed Jalaluddin Umri |
| 12. The Messenger | Tariq Ramdan |
| 13. Muhammad & The Quran | Rafiq Zakaria |
| 14. Reading the Quran | Ziauddin Sardar |
| 15. The Holy Quran | Abdullah Yusuf Ali |
| 16. The Quran | Prof. Dr. Syed Vickar Ahmed, USA |
| 17. The Quran | Dr. Nazeer Ahmed |